# వేదాలకి ముందే విలసిల్లిన మహోన్నత నాగరకత !

**(భారతదేశం 'వేదభూమి' అని ఘనంగా కీర్తిస్తుంటారు. వేదాలు మనుషులు రాసినవి కావని, సాక్షాత్తు బ్రహ్మముఖాల నుండి పుట్టాయని, అందుకే పవిత్రమైనవని చాటుతుంటారు. దేన్నైనా 'పవిత్రం'గా మార్చి పూజించినంతకాలం, దానిలోని వాస్తవాలు వెల్లడికావు. 'వేదాల్లో ఏముందో తెలుసుకొని, చాలామంది దేశవిదేశీయ మేధావులు గతంలో చాలా పరిశోధనాత్మక రచనలు చేసారు. బాలగంగాధర తిలక్ లాంటి పండితులు సైతం తమ వేదపరిజ్ఞానాన్ని నిజాయితీగా వెల్లడించారు. అలాంటి రచనల వల్ల వేదకాలపు జనజీవనం, నాటి మేధస్సు వెల్లడయ్యాయి. వేదాల్ని సర్వజ్ఞానభాండాగారాలుగా భావించి అన్నీ వాటిల్లోనే వున్నాయనటం ఎంత తప్పో, వేదాల్లో ఏమీలేదని, వున్నదంతా చెత్త అనే అభిప్రాయానికి రావటమూ అంతే తప్పు. వాస్తవ దృష్టితో, వేదాల్లోని విషయాలను నేటి తరానికి అందించాలన్న లక్ష్యంతోనే ప్రముఖ బౌద్ధ, సైన్సు రచయిత బొర్రా గోవర్ధన్ నిష్పక్షికంగా ఈ రచనను 'స్వేచ్ఛాలోచన'కు అందిస్తున్నారు. దీంతో, ఎవర్నీ నొప్పించే ఉద్దేశం రచయితకుగానీ, స్వేచ్ఛాలోచనకు గానీ లేవని తెలియజేస్తున్నాం. – ఎడిటర్)**

## మేషనాదం

ఆ మధ్య ఆంధ్రజ్యోతి దినపత్రికలో "ధమ్మపదానికి వక్రభాష్యం" అనే నా వ్యాసం వచ్చింది. అసలైన "బ్రాహ్మణుడు అంటే ఎవడు?" అనే విషయాన్ని చర్చించిన వ్యాసం అది. దానిమీద ఎన్నో ఫోన్లు వచ్చాయి. వాటిలో ఒకటి ఒక హిందూపీఠం నుండి వచ్చింది–



బొర్రా గోవర్ధన్
9390600157

ఆ ఫోన్ చేసిన వ్యక్తి నాతో చాలాసేపు మాట్లాడాడు. నేను బౌద్ధం గురించి కొన్ని విషయాలు చెప్పాను. ఇక, ఆయన వాక్ప్రవాహం కొనసాగింది. "అసలు ఇవన్నీ వేదాల్లోనే ఉన్నాయి. వేదవాక్కు కానిది ఏదీలేదు. ఎవరు చెప్పినా, ఏం చెప్పినా వేదాల్లో విషయాల్నే అటూ ఇటూ మార్చి చెప్పాల్సిందే... అంటూ వేదాల్లో ఏయే విషయాలున్నాయో.. ఆయనకి తెలిసినవన్నీ ఓ పావుగంట చెప్పాడు.

నేను ఆయన ప్రవాహానికి అడ్డుతగిలి, **"మీరు వేదాలు చదివారా? "** అని ప్రశ్నించాను.

గంగానది లాంటి ఆయన మాటల పరుగు.. సరస్వతీ నదిలా ఇంకిపోయింది. కొంతసేపు ఆగి..

"ఈ ప్రశ్న ఎందుకు వేశారు?" అని అడిగాడు. "వేదాల్ని గురుముఖతా చదివాను గనుక" అన్నాను.

ఆయన వెంటనే.. ''నేను చదవలేదు'' అని ఒప్పుకున్నాడు. ఆయన పీఠాధిపతి కాదు. ఆ పీఠంలో పనిచేసే ఒక ముఖ్యబాధ్యుడు. ఆధ్యాత్మిక పాఠాలునేర్పే లెక్చరర్.

ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకున్నా ఒకటి మాత్రం నిజం– 'ఇది వేదభూమి', 'ఇది వేద సంస్కృతి', మనది పవిత్రమైన వేదసంస్కారం.. అంటూ మాటిమాటికీ 'వేదం...వేదం' అని మేషనాదం చేసేవారిలో ఏ ఒక్కరూ వేదాల్ని చదవలేదనేది నూటికి నూటపదిపాళ్ళు నిజం.

ఎందుకంటే.. నేను ఆ ఫోన్ చేసిన వ్యక్తికి చెప్పిన సమాధానమే–

"నిజంగా చదివి ఉంటే మీరు వేదాల గురించి ఇంత గొప్పగా చెప్పరు. చెప్పలేరు."

## వేద గిరీశం

నమ్మడం వేరు. నిజం వేరు. 'నమ్మకం' హద్దులు లేనిది. కర్మేంద్రియాలు తప్ప జ్ఞానేంద్రియాలు లేనిది. జ్ఞానంలేని కర్మలకి అది ఆవాసం. అందుకే అదొక మత్తు. మూర్ఖత్వం. కానీ, నిజం దానికి భిన్నమైంది. దానికి జ్ఞానం ప్రధానం.

వైదికులు గుడగుడమని వల్లించే మంత్రాల్ని వింటుంటే..

గురజాడ కన్యాశుల్కంలో గిరీశం, వెంకటేశంల ఆంగ్ల సంభాషణ గుర్తుకు వస్తుంది.

"మీ వెంకటేశానికి ఇంగ్లీషు బాగా నేర్పాను" అని చెప్పిన గిరీశంతో "ఏదీ మీరిద్దరూ ఇంగ్లీషులో మాట్లాడుకోండి. చూసి ఆనందిస్తాం" అంటారు వెంకటేశం తల్లిదండ్రులు– అప్పుడు గిరీశం..

"ఓ! మైడియర్ వెంకటేశం.. ట్వింకిల్ ట్వింకిల్ లిటిలిస్టార్" అంటాడు.

"హౌ ఐ వండర్ వాటు ఆర్" అంటాడు వెంకటేశం.

"అప్ ఎబౌది వరల్డ్ సో హై.."

"లైక్ ఎ డైమండ్ ఇన్ ది స్కై"– అంటూ ఇద్దరూ ఎల్కేజీ రైమ్‌ని గొప్ప సంభాషణగా మాట్లాడుకుంటారు–

ప్రస్తుతం.. దీనికి భిన్నమైంది కాదు వేదపఠనాలు. పాండిత్యాలు. అయితే....

"అన్నీ వేదాల్లోనే ఉన్నాయష" అని అనుకోవడం

ఎంత తప్పో– "వేదం ఎందుకూ పనికిరాదు" అనుకోవడం కూడా అంతే తప్పు.

## వేదం నిజాయితీ

వేదం ఒక గ్రంథం. అది ఒక మతగ్రంథం. వైదికమతం పురుడు పోసుకుంటున్నప్పుడు పుట్టిన మతగ్రంథం. మతం ఇంకా 'మారని మూఢ అభిమతంగా' కరుడు కట్టుకోనప్పుడు పుట్టిన గ్రంథం. మతం అనే మత్తుమందుని ప్రజలమీద చల్లి తమ పబ్బం గడుపుకొనే పాలకవర్గాలు పటిష్టం కాకముందు పుట్టినగ్రంథం.

కాబట్టి, ఆ గ్రంథంలో ఆనాటి ప్రజల, ముఖ్యంగా 'ఆర్యజాతుల' జీవన విధానం మసకమసగ్గా కాదు, చాలా సుస్పష్టంగానే కన్పిస్తుంది. ఎలాంటి దాపరికాలు లేకుండా, మార్మికంగా కాకుండా ఆనాటి ఆర్యుల జీవన విధానాన్ని తెరచిన పుస్తకంలా చూపించింది. 'చనిపోయిన ఆవుచర్మాన్ని ఒలవడం కూడా పాపం, నేరం. వేదనిందితం' అంటూ రెచ్చిపోయి చచ్చిన పశువుని సాకుగా చూపి, మనిషి నిండు ప్రాణాలు తీసే గుంటనక్కలు, గోముఖతోడేళ్ళు ఈ భారతదేశంలో పుట్టుకొస్తారని వేదానికి తెలియదు. తెలిస్తే..

"యజ్ఞబలిలో ఆవుని ఎలా వధించాలో, దాని రక్తాన్ని ఎలా చిందించాలో, బ్రతికున్న ఆవుకి చర్మం ఎలా ఒలవాలో.. విపులంగా, విడమరచి చెప్పేది కాదేమో–

కానీ, ఈ దాపరికం వేదంలో లేదు. అది, ఆనాటి, ఆర్యుల జీవనవిధానాన్ని కళ్ళకు కట్టినట్లు చెప్పింది. అది మతగ్రంథమే అయినా 'మరుగు'లేకుండానే ఉంది.

మానవజాతి చరిత్రలో ఒక జాతికి చెందిన వేలాది సంవత్సరాల చరిత్రను మనకళ్ళముందుంచింది వేదం.

ఒక చారిత్రక సాక్ష్యంగా నిలబడింది. వేదం ఈ దేశచరిత్రకి ఒక చారిత్రక ఆధారం.

## వేదాన్ని ఆచరించని వారు వేదాంతులు

"వేదం వేదం" అంటూ బావురు కప్పల్లా అరచే వారెవరూ వేదం చెప్పింది ఈనాడు ఏ ఒక్కరూ ఆచరించరు. ఆచరించలేరు.

(వేదమంత్రాల పఠనాన్ని బుద్ధుడు తొలకరిలో అరచే కప్పల అరుపులతో పోల్చాడు. ఒక కప్ప అరవగానే మిగిలిన కప్పలు అరుస్తాయి.. 'కోరస్'గా)

నిరంతరం యజ్ఞాలు చేయాలి. ఆ యజ్ఞాల్లో జంతుబలులు చేయాలి. ఆవుల్ని, ఎద్దుల్ని నరకాలి. సురాపానం చేయాలి. దేవతల్ని పూజించాలి. ముఖ్యంగా ఇంద్రుణ్ణి ఆరాధించాలి–

ఇవేవీ, వేదాల గురించి తెగసోదివాగుడు వాగే వారెవరూ ఆచరించలేరు. జంతుబలుల్ని సభ్యసమాజం అంగీకరించదు. చట్టం కూడా ఒప్పుకోదు. శిక్షార్హమైన నేరమే అవుతుంది.

పోనీ... ఇంద్రుణ్ణి పూజించేవారు ఈదేశంలో ఈనాడు ఒక్కడైనా ఉన్నారా? ఇంద్రునికి ఒక్క దేవాలయం అయినా ఉందా? మూడువేల సంవత్సరాలు 'మహాదేవుడిగా' కీర్తించబడ్డ ఇంద్రుని గతి ఏమిటి? ఒక భ్రష్టుడైన విలన్‌గా మిగిలిపోయాడు.

ఈ విషయం వేదం గురించి తెగకూసే వేదాంతులకు తెలియదా? ఎందుకు తెలియదు.

వారు తమ పబ్బం గడుపుకోడానికి 'వేదాన్ని ఒక పనిముట్టుగా' వాడుకొంటున్నారు కాబట్టి తెలిసినా చెప్పరు. ఒప్పరు.

కాబట్టి, వేదం– ఒకనాటి చారిత్రక ఆధారం. ఈనాటికి అది "ఒక లివింగ్ ఫాజిల్". అంటే.. చారిత్రక ఆధారమైన ఒక "జీవించి ఉన్న శిలాజం". ఆ విధంగా వేదం ఎప్పటికీ గౌరవనీయమే!

## కాకిలెక్కలు–కార్బన్ పరీక్షలు

వేదాలు తొలిగ్రంథాలంటారు. ఇవి దైవప్రబోధాలంటారు. అపౌరుషేయాలంటారు. అంటే పురుషులు చెప్పనివి అని. ఇక్కడ 'పురుషులు' అంటే మగవారు అనికాదు. మనుషులందరూ వైదిక తాత్త్విక భాషలో పురుషులే! ఈ సృష్టి ప్రకృతి, పురుషుల కలయిక అంటుంది. ప్రకృతి అంటే పరమాత్మ. పురుషుడు అంటే జీవాత్మ. కాబట్టి 'పురుషుడు' అంటే మానవుడు. జీవుడు.

మనకు తేలిగ్గా అర్థం కాడానికి 'వేదాల్ని' 'అపౌరుషేయాలు' అనడం కంటే 'అమానవేయాలు' అనడం తేలిగ్గా ఉంటుంది. అర్థవంతంగానూ ఉంటుంది.

'వేదం దేవతల వాక్కు ' అనేది దానర్థం.

వైదిక సంప్రదాయవాదులు చెప్పేప్రకారం– వేదకాలం మన ఊహకు అందదు. కలియుగం, ద్వాపరయుగం, త్రేతాయుగం, కృతయుగాలు దాటిపోవాలి. మహాయుగాలు దాటిపోవాలి. అప్పుడెప్పుడో.. క్షీరసాగర మథనం సమయంలో పుట్టాయి వేదాలు–

ఈ లెక్కలు చూస్తే.. ఈ భూమ్మీద అప్పటికి మానవజాతి కాదు.. అసలు భూమీ, సూర్యకుటుంబం, అసలు ఈ విశ్వమే ఇంకా పుట్టి ఉండదు. అప్పటివట ఈ వేదాలు–వీరు చెప్పే ఈ కాకిలెక్కలు 'నమ్మడానికే'గాని, ఒప్పుకోడానికి కాదు. ఇవి పౌరాణికుల లెక్కలు.



మరి చరిత్ర కారుల లెక్కలు వేరు. వీరు అనేక రకాల పరీక్షలు చేసి కాలనిర్ణయం చేస్తారు.

భూమిని, భూమిలో పొరల్ని, అక్కడ దొరికిన పదార్థాల్లోఉన్న కార్బన్-14ని పరీక్షిస్తారు. గ్రంథాలైతే.. వాటి భాషని, భాషాపదాల పుట్టు పుర్వోత్తరాల్ని పరిశీలిస్తారు. 'లిపి' అయితే దాని పరిణామాల్ని పరిశోధిస్తారు- ఇలా ఎన్నోరకాలుగా పరిశీలించి, పరిశోధించి, పరీక్షించి - 'నిజాన్ని' నిగ్గు తేలుస్తారు.

ఇలా నిగ్గు తేల్చడం వల్ల వెలుగులోకి వచ్చిందే సింధూ నాగరకత.

## వేదాలకి ముందు

వేదకాలం కంటే ముందే, వేదనాగరకత కంటే ముందే.. ఈ దేశంలో పరిఢవిల్లిన మహోన్నత మానవజీవన విధానపు వెలుగే సింధూ నాగరకత.

మనం వేదాలు, వేదాల్లోని విజ్ఞానం, వేద జీవనవిధానాలు తెలుసుకోడానికి ముందు సింధూప్రజల జీవనవిధానం, వారి వైజ్ఞానిక ప్రగతిని గురించి తెలుసుకోవాలి. లేకపోతే మన చరిత్ర అవగాహన అసమగ్రమే అవుతుంది. తలలేని మొండాన్ని గురించి చర్చించినట్లే ఉంటుంది.

అందుకే భారతదేశ చరిత్రకే తలమానికమైన సింధూ నాగరకతలోని వైజ్ఞానిక విషయాల్ని కొద్దిగానైనా చూడాల్సిందే!

సింధూనది, దాని ఉపనదులు ప్రవహించే ప్రాంతంలో క్రీ.పూ. 3200 సం॥ నుండి క్రీ.పూ. 1700 వరకూ పరిఢవిల్లిన నాగరకతే సింధూనాగరకత. పాకిస్థాన్‌లో సింధూమైదానప్రాంతం, బెలూచిస్థాన్‌లో కొంతభాగం, మనదేశంలో పంజాబ్, హర్యానా, గుజరాత్ ప్రాంతాలు, ఉత్తరప్రదేశ్‌లో వాయువ్యప్రాంతం, రాజస్థాన్‌లో ఉత్తరప్రాంతం- ఈ మొత్తం ప్రాంతంలో ఈ నాగరకత ఆనవాళ్ళు వందలచోట్ల బైటపడ్డాయి.

వేదకాలం నాటి ఆర్యుల జీవనం కంటే ఎంతో మెరుగైన నాగరక జీవనం సింధూ ప్రజలది. కాబట్టి ఈదేశ సంస్కృతికీ, నాగరకతకి వేదకాలం నాటి ఆర్యులే మూలంకాదు.

ఒక్కొక్క విషయం చూద్దాం!

## యజ్ఞవాటికలు - అగ్నిపేటికలు

ఆర్యులు సంచార తెగలవారు. గ్రామస్థాయి నివాసాలు వారివి. కానీ సింధూ ప్రజలది పట్టణ నాగరకత. దాదాపు 50వేల పైచిలుకు జనాభా నివసించే పట్టణాల్లో జీవించారు. కాల్చిన ఇటుకరాళ్ళతో రోడ్లు, భవనాలు, కాల్వలకు కల్వర్టులు నిర్మించుకున్నారు. రాతితో ఇళ్ళు కట్టుకోవడమే చాలా గొప్ప విజ్ఞానం. కొండరాళ్ళను పగులగొట్టి, భవన నిర్మాణాలు కట్టుకోవడం ఒక ఎత్తు, అయితే, ఇటుకల్ని తయారు చేసుకొని, వాటిని కాల్చి వాటితో నిర్మాణాలు సాగించడం మరోఎత్తు. 'బండరాయి' ప్రకృతిలో దొరుకుతుంది. కాల్చిన ఇటుకరాయి ప్రకృతిలో దొరకదు. అది మానవసృష్టి. దానికి భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రాలు తెలిసి ఉండాలి. అగ్నిని అనేక రకాలుగా ఉపయోగించుకోవడం తెలిసివుండాలి.

ఆర్యులు యజ్ఞవాటికల్లోని అగ్నితో మాంసం కాల్చుకు తినేదశలో ఉంటే.. సింధూ ప్రజలు ఆ దశను దాటిపోయి అగ్నిలో 'ఇటుకల్ని' కాల్చి పట్టణ నాగరకతకు పునాదులెత్తారు.

## పశువుల మందలు - పంటచేలు

ఆర్యులకి వ్యవసాయం అంతగా తెలియదు. వారు కేవలం పశుపాలకులు మాత్రమే. కానీ సింధూ ప్రజలు వ్యవసాయంలో దిట్టలు. ఇక్కడ పండే గోధుమలు, బార్లీ, ఇతర అపరాలతో పాటు చైనా ప్రాంతం నుండి అప్పటి ఈశాన్య భారతదేశానికి వచ్చిన 'వరిని' కూడా మొదటిగా సింధూ వ్యవసాయక్షేత్రాల్లో పండించారు. అంతేకాదు, ఆఫ్రికా దేశాన్నుండి మొక్కజొన్నల్ని, జొన్నల్ని తెచ్చి ప్రధాన పంటలుగా మలచారు. మధ్య ఆసియా హెల్మండ్ నదీ పరీవాహక ప్రాంతం నుండి ఖర్జూరా, ద్రాక్షలు, ఖర్బూజా పండ్లు తెచ్చి పండించారు.

వ్యవసాయంలో అదనపు ఉత్పత్తులు, అపారనిల్వలు ఉన్న సమాజాలే పట్టణీకరణ వైపుకు పోగలవు.

సింధూప్రజలు వ్యావసాయకరంగంలో సాధించిన ప్రగతే వారిని నగరవాసుల్ని చేసింది. పెద్దపెద్ద ఆహారధాన్యాల గిడ్డంగులు తవ్వకాల్లో ఎన్నో బయల్పడ్డాయి.

ఇది చాలా గొప్ప విషయం. విస్మరించరాని విషయం. **వ్యావసాయక ఉత్పత్తులు క్షీణిస్తే, నగరవాసాలు నాశనమైపోతాయి. నగరాలు నూతన వస్తువుల్ని ఉత్పత్తి చేసి నాగరకతను వేగంగా ముందుకు నడిపించగలవుగాని, నాగరకతను బ్రతికించలేవు. నిర్మించలేవు. పైగా**

**నిర్మూలించగలవు. ఈ విషయాన్ని ఈనాటి పాలకులు ఎందుకు విస్మరిస్తున్నారో విస్మయాన్ని కలిగిస్తోంది. పంటపొలాల్ని ధ్వంసం చేసి, వాటిపై నగరనిర్మాణాలూ, రైతులపట్ల చిన్నచూపు ఇవన్నీ రాబోయే కాలంలో నగరాల వినాశనానికే మార్గాలు–**

## పరిశ్రమల పురోగమనం

రుగ్వేద ఆర్యులు ఏలాంటి పరిశ్రమల్ని నిర్వహించారో వాటి వివరణలు లేవు. కానీ, సింధూ ప్రజలు నిర్వహించిన పరిశ్రమల ఆనవాళ్ళు దొరికాయి. వారిముఖ్య పరిశ్రమ కుండల పరిశ్రమ. చేతులతో కాకుండా 'సారె'మీద అందమైన కుండలు తయారు చేశారు. వాటిమీద రకరకాల చిత్రాలు, అక్షరాలు ముద్రించారు. పింగాణి వస్తువులు కూడా తయారు చేశారు. వీరి రెండో ప్రధాన పరిశ్రమ నూలు. జంతువుల చర్మాలతో, జంతువుల వెంట్రుకలతోనే కాకుండా ప్రత్తిని వడికి, దారాలు తీసి, వస్త్రాలు నేసేవారు. మొహంజదారో లో నూలుకండెలు, వస్త్రాలు దొరికాయి. ఇక చెప్పుకోవాల్సిన మరోపరిశ్రమ రాగి పరిశ్రమ. గనులనుండి రాగిని సేకరించి దానికి తగరాన్ని కలిపి నాణ్యమైన కంచు తయారు చేశారు. సహజంగా ప్రకృతిలో దొరికే రాగిలో 1% తగరం ఉంటుంది. కానీ, వారు మలచిన కంచులో 8% నుండి 18% వరకూ తగరం ఉంది. 'చాన్హుదారో'లో కంచురథాలు, కంచుబండి నమూనాలు దొరికాయి. అంటే వీరు రసాయనశాస్త్రం అనుపానాలు బాగా ఎరిగినవారన్నమాట.



## నివ్వెరపరచే నీటిపారుదల

ప్రపంచ నాగరకతల్లో సింధూనాగరకతకున్న ప్రత్యేకతే నీటిపారుదల విధానం. కాల్వలు, చెరువుల ద్వారా నీటి వసతి కల్పించడమే కాకుండా రాళ్ళతో నిర్మించిన బావుల నుండి (పెద్ద పెద్ద మోటబావులు) నీటిని ఉపయోగించుకోవడం సింధూ ప్రజల విశిష్టత. భూగర్భజలాల్ని బావుల ద్వారా వెలికితీసి ఉపయోగించుకొన్న నాగరకులు నాడు ప్రపంచంలో మరెక్కడా లేరు. అలా ఉపయోగించుకొన్న మొదటివారు సింధూ ప్రజలే! ఇక ఎత్తైన వాటర్ ట్యాంకులు, స్నానఘట్టాలు, ఇళ్ళ నుండి మురికినీరు పోడానికి రాతితో నిర్మించిన కాలువలు– ఇలా వారి నిర్మాణనైపుణ్యం ఆర్యుల్లో మచ్చుకు కూడా కన్పించదు. పట్టణంలో గానీ మరో ప్రాంతాల్లోగానీ సింధూ ప్రజలు ఏర్పాటు చేసుకున్న విశాలమైన తిన్ననిరోడ్లు– వారి నగరాభివృద్ధికి చిహ్నాలు– ఇప్పటికీ మనదేశంలో తిన్నని రోడ్లులేని నగరాలు ఎన్నో వున్నాయి.



## గణితశాస్త్ర పురోగతి

మనం ఇంతకు ముందు చెప్పుకున్న నగర నిర్మాణం, రోడ్లు, కాలువల నిర్మాణం జరగాలంటే వారికి రేఖాగణితం మీద మంచిపట్టు ఉండాలి. దూరమానాలు తెలిసే ఉండాలి. దూరాల్ని ఖచ్చితంగా లెక్కించే 'స్కేళ్ళు' కొన్ని దొరికాయి. వీటి విభాగాలు 'దశాంశ'విధానంలో భాగించి ఉన్నాయి.

వీరివిదేశీ వ్యాపారవైభవాన్ని వీరి తూనికరాళ్ళు తెలియజేస్తాయి. ఇప్పటి మన తూనిక ప్రమాణం 'గ్రాము'. ఆనాటి వారి తూనిక ప్రమాణం 13.63 గ్రాముల బరువైన రాయి. ఈ ప్రమాణంలో 1, 2, 4, 10, 20, 40, 100, 200, 400, 500, 800 రెట్లుతో రాళ్ళు దొరికాయి. అతిపెద్దరాయి కొలత 11.9 కిలోలు. అంతేకాదు, తక్కువ ప్రమాణాలు కూడా ఉన్నాయి. 1/2, 1/4, 1/8, 1/16 భాగాల కొలతరాళ్ళు కూడా వాడారు. 1/16 వ భాగం అంటే దాదాపు ముప్పావు గ్రాము. అంత చిన్న వస్తువుల కొలతకూడా ఉండేది. ఈ చిన్న కొలత గోధుమలు కొలవడానికో, చింతపండు కొలవడానికో కాదుగదా! బంగారం, రంగురాళ్ళు కొలవడానికే! 'చాన్హుదారో'లో తూనికరాళ్ళను తయారు చేసే కర్మాగారం కూడా ఉంది.

## రోగాలు – చికిత్సలు

జీవన పరిస్థితులు, వారి శరీరం తీరు మీద ప్రభావం చూపుతాయి. **వేటాడే సమాజాలు ప్రధానంగా మాంసంమీదే బ్రతుకుతాయి కాబట్టి వారికి శరీరం ధృఢంగా ఉంటుంది. వారికి మంచి ప్రోటీన్లు అందుతాయి. నిరంతరం శ్రమించడం వల్ల శరీరం సాగుతుంది. ఎముకపుష్టి కలుగుతుంది. వ్యవసాయ సమాజాల్లోని వారికి అలాంటి శరీరధృఢత్వం ఉండదు.** వ్యవసాయ పంటలు శక్తిని ఇస్తాయి. చురుకుదనాన్నిస్తాయి. క్రీ.పూ. 8000 సంll నాటి

మధ్యయుగంలోని ఆటవిక మానవుల్లో పురుషుల సరాసరి ఎత్తు 180 సెం.మీ. స్త్రీల ఎత్తు 170 సెం.మీ. అదేప్రాంతంలో ఐదువేల సంవత్సరాల తర్వాత జీవిస్తున్న సింధూ వ్యవసాయక ప్రజల్లో పురుషుల సగటు ఎత్తు 167 సెం.మీ., స్త్రీల ఎత్తు 155 సెం.మీ. వీటికి తోడు కాయధాన్యాలపై, వండిన ఆహారం మీద ఆధారపడడం వల్ల దంతబలం క్షీణించింది. సింధూప్రజల్లో 'మలేరియా' చాలా ప్రబలంగా ఉండేది. దీనితో 50 ఏళ్ళు దాటిన వారు కేవలం 15% మాత్రమే ఉండేవారు. వీరి సగటు ఆయుఃప్రమాణం 30 ఏళ్ళే. మలేరియాకి చికిత్సలు చేసేవారు. అవి ఏమిటనేది వారిలిపి చదివితే తేలవచ్చు. అయితే, తలకి శస్త్రచికిత్సలు చేసిన రెండు పుర్రెలు లోథాల్, కాలిబంగన్‌లలో దొరికాయి.

## సింధూ లిపి - నాగరకతకు రూప శిల్పి

సింధూనాగరకత వైభవ పతాకం దాని 'లిపి'. మానవసమాజాల పరిణామ చరిత్రలో కూతల్ని మాటలుగా మలచడం ఒక ఎత్తు. ఆ మాటలకి అర్థాల్ని పొదగడం ఇంకో ఎత్తు. ఆ మాటల్ని వాక్యాలుగా మలచడం మరో ఎత్తు. ఇవ్వన్నీ భాషకు సంబంధించిన విషయాలు. భావాన్ని భాషగా కాకుండా సంజ్ఞలుగా కూడా చెప్పొచ్చు. ఈ రెండు దశలూ మానవ సమాజాల్లో సహజంగా రూపొందాయి. అటు స్వరం- ఇటు సంజ్ఞ.







ఈ రెండూ భావానికి రెండు వేర్వేరు రూపాలు. స్వరం ద్వారా తెలియ జెప్పాలన్నా, సంజ్ఞద్వారా తెలియ జెప్పాలన్నా చెప్పేవాడు, తెలుసుకొనేవాడు ఇద్దరూ ఒకరి ఎదుట మరొకరు ఉండాలి. ఒకరి ప్రత్యక్షంలో మరొకరు ఉంటేనే ఇది సాధ్యం. ఈ ఇద్దరిలో ఎవరు లేకపోయినా ఆ భావం ఒకరి నుండి మరొకరికి చేరదు.

మరి, ఇద్దరు ఒకేచోట లేకపోయినా ఆ భావం మరొకరికి అందజేసేది ఏది? అదే 'లిపి'.

ఇటు 'స్వర' భావాన్ని, అటు సంజ్ఞాభావాన్ని కలిపి ఏకం చేసి మనకు తెలియజెప్పేదే 'లిపి'. సింధూ ప్రజలకు 'లిపి' ఉంది. ఆ లిపిని ఇంకా చదవలేకపోతున్నారు. చదివితే.. 'చరిత్ర వజ్రాలగనులకు' దారిచూపినట్టే! ఆనాటి ఇరాన్‌లోని సంకేతలిపి అయిన ప్రోటో-ఎలమైట్ లిపి నుండి సింధూ లిపి పుట్టిందని తేల్చారు. ఇప్పటికి 4000 పదాలు దొరికాయి. లిపి ఇరాన్‌దైతే, భాష ద్రవిడ భాషాకుటుంబాలదని అంటారు.

ఏదైనా సరే- 'లిపి' ఉండటం అనేది ఆ సమాజాల ఉన్నతికి నిదర్శనం. ఇంకా లిపి పుట్టని భాషలు ఈ ప్రపంచంలో కొన్ని వేలు ఉన్నాయి-

**సింధూనాగరకత అనంతరం వచ్చిన ఋగ్వేదానికి ఆ తర్వాత వెయ్యేళ్ల వరకూ లిపి లేదు. పాళీభాషక్కూడా బుద్ధుని తర్వాత 500 సంవత్సరాల వరకూ లిపి రాలేదు. బౌద్ధుల్ని చూశాకే, వైదికులు పాళీ లిపిని తమ సంస్కృతానికి లిపిగా ఎంచుకొన్నారు. వేదాల్ని లిపి బద్ధం చేశారు.** సింధూనాగరకత లిపి క్రీ.పూ. 1700 లో సింధూనాగరకత తోపాటే కాలగర్భంలో కలిసిపోయింది.

ఆ తర్వాత ఈ దేశంలో లిపి పుట్టడానికి 1500 సంవత్సరాలు ఆగాల్సి వచ్చింది!

## జంతువులు

సింధూప్రజల ముద్రల్లో ఒంటికొమ్ము గల మూపురంలేని ఎద్దు (Unicorn) ప్రధానమైంది. ఇంకా మూపురం గల ఎద్దు, పులి, ఏనుగు, దున్నపోతు, బర్రె, చేపలవేట ముద్రలు దొరికాయి. గుర్రం, కుక్క ముద్రలు కనిపించలేదు. ఆవు ప్రతిమ కూడా లేదు. అయితే, ఋగ్వేదంలో గుర్రం, ఆవులకు విశిష్టస్థానం (గౌరవస్థానం, పూజనీయస్థానం కాదు) ఉంది. 'సరమ' అనే కుక్క దేవత ప్రస్థావన ఉంది. సింధూ నాగరకత అంతరించే కాలానికే ఇరాన్ ప్రాంతంలో క్రీ.పూ. 1700లో గుర్రాన్ని మొట్టమొదటగా మచ్చిక చేశారు. యుద్ధాలకి ఉపయోగించారు.

## మతాచారాలు

ఇంత నాగరకత, ఇన్నిన్ని కట్టడాలు ఉన్న ఈ నాగరకతలో ఎక్కడా 'గుడి' ఆనవాళ్ళు బైటపడలేదు. అత్తిచెట్టును పూజించే దృశ్యం ముద్రగా దొరికింది. సింహం శరీరం, మనిషి తల ఉన్న దేవతా ముద్రలున్నాయి. ఇది గ్రీకుసంప్రదాయం.

వైదిక పురాణకథల్లో కొందరు దేవుళ్ళకు, దేవతలకు శరీరం మనిషిది ఉండి, తల జంతువులదో, పక్షులదో ఉంటుంది. వినాయకుడు, (ఏనుగు), తుంబురుడు (గాడిద), శుకుడు (చిలుక), దక్షుడు (మేక) మొదలైనవారు. కానీ సింధూ మత సంప్రదాయంలో శరీరం జంతువుది, తల మనిషిది. ఈ పద్ధతి ఆ తర్వాత వచ్చిన గ్రీకు పురాణాల్లో కన్పిస్తోంది-

అంటే-

**ఆర్యులు బుద్ధికంటే శరీరానికి ప్రాధాన్యతనిచ్చారు. సింధూ ప్రజలు శరీరానికంటే బుద్ధికి ప్రాధాన్యత నిచ్చారు.**

**అందుకే.. ఆర్యదేవుళ్ళ తలలు జంతువులవైతే, సింధూ దేవతల తలలు మనిషివే!**

## విచిత్రం 'పికాసో చిత్రం'



సింధూప్రజల అలంకరణలు, వారి సౌందర్యోపాసన కూడా వెలుగుచూసింది. రకరకాల ఆభరణాలు, రంగురాళ్ళు, పూసలతో ఆభరణాలు తయారు చేసుకునేవారు. ఇన్ని అలంకరణలు రుగ్వేద ఆర్యులకు తెలియదు. ఇక సింధూ నాగరకతలో బయల్పడిన చిత్రాల్లో అద్భుతమైన ముద్రాచిత్రం నిండుగర్భిణిది. నిండుగర్భిణి గర్భంనుండి మొక్క మొలుచుకొచ్చిన చిత్రం. ఈ చిత్రం భావగంభీరతను కొలవాలంటే పికాసో చిత్రంతోనే కొలవగలం. ఆ ఒక్క చిత్రం వారి ఆలోచనలకి, భావజాలానికి అద్దం పడుతోంది. వ్యవసాయానికి, వ్యవసాయాధారమైన నేలతల్లికి నిలువెత్తు నిదర్శనం అనుకోవచ్చు. ఈ ప్రపంచంలో ఉత్పత్తికి మూలం స్త్రీ అని చెప్పుకోవచ్చు. **క్షేత్రబీజ ప్రాధాన్యతల్లో సింధూప్రజలది క్షేత్ర (స్త్రీ) ప్రాధాన్యత అని అనుకోవచ్చు. నిజానికి వ్యవసాయ సమాజాల్లో క్షేత్రానిదే ప్రాధాన్యత. సింధూ ప్రజల స్త్రీ దేవతారాధనలు అందులో భాగమే. కానీ ఆర్యులది బీజప్రాధాన్యత గల సంస్కృతి. పురుషాధికార భావజాలానికి ఆర్యజీవన విధానం ఒక ప్రతీక. అందుకే ఆర్యుల్లో పురుష దేవతారాధన ప్రధానం.** ఇక వరదల్ని ఎదుర్కోవడం, వాటినుండి రక్షించడానికి ఆనకట్టలు కట్టడం వారి సాంకేతిక పరిజ్ఞానానికి మచ్చుతునక. విశాలమైన వీధులు, వీధిదీపాలు, నీటిసరఫరా వ్యవస్థలు వాని నాగరికతా వికాసానికి నిలువుటద్దాలు. వారి సాంకేతిక పరిజ్ఞానంలో శతాంశాన్ని కూడా వేదకాలం ఆర్యుల్లో ఎంత వెదికినా చూడలేం.

## పాతిన కుండలు – పిండాకూళ్ళు

ఇక చెప్పుకోదగ్గ మరోవిషయం చనిపోయిన వారికి జరిగే సంస్కారాలు. సింధూ ప్రజలు శవాల్ని పాతిపెట్టేవారు. తలని ఉత్తరదిక్కుకి పెట్టి, పాదాల్ని దక్షిణ దిక్కుకు పెట్టి పాతిపెట్టేవారు. వాటి ప్రక్కన ధనాన్ని, ఆహారపదార్థాల్ని కుండల్లో నింపి, వాటిపై సమాధులు నిర్మించేవారు. అయితే చాలా చిన్న చిన్న సమాధులే నిర్మించేవారు. ఈజిప్టు పిరమిడ్లులా పెద్దపెద్ద కట్టడాలు కట్టలేదు. (సమాధుల్ని ఇలా భారీ ఎత్తున నిర్మించడం బౌద్ధంతోనే మన దేశంలో మొదలైంది) కానీ ఆర్యులు శవాల్ని దహనం చేసేవారు. దీనికి కారణం లేకపోలేదు– వీరు సంచారవాసులు. మార్గమధ్యంలో చనిపోయిన వ్యక్తిని సమాధిచేస్తే– ఇక అక్కడికి వారు రావొచ్చు, రాకపోవచ్చు. కాబట్టి కాల్చడమే వారికి ఉత్తమమార్గం. అయితే– ఈ శవాన్ని కాల్చే పద్ధతి సింధూపద్ధతికి భిన్నమైంది. కాష్ఠం మీద తల దక్షిణానికి, కాళ్ళు ఉత్తరానికి వచ్చేలా శవాన్ని పెట్టి, దహనం చేస్తారు. ఈ శవ అంతిమపడక సింధూప్రజల అంతిమపడకకి పూర్తి విరుద్ధం. (బౌద్ధులు శవాల్ని కాల్చుతారు. ఆ అవశేషాలపైన సమాధులు నిర్మిస్తారు). కానీ, కాల్చి బూడిద చేశాక పితృదేవతలకు ఆహారం పెట్టేదెలా? పాతిపెట్టినవారి సమాధుల్లో కుండలకొద్దీ ఆహారాన్ని, అలంకార వస్తువుల్ని, ఆభరణాల్ని, చనిపోయిన వ్యక్తితోపాటు పాతిపెట్టేవారు. మరి కాల్చిబూడిద చేసిన వారికి కుండల్లో ఆహారం పెట్టడం ఎలా? అందుకే కాల్చిన వారికోసం క్రతువులు, మాసికాలు, తద్దినాలు పుట్టుకొచ్చాయి. యజ్ఞయాగాల్లో, నదుల్లో పిండప్రదానాల కర్మకాండలు వచ్చాయి.

## ఖగోళ పరిజ్ఞానం

ఆఖరిగా మరొక్క విషయం చెప్పుకొందాం– "ఏడుగీతల ప్రక్క ఒక చేప" ముద్ర సింధూప్రాంతంలో దొరికింది. ఇది ఆకాశంలో సప్తర్షిమండలానికి గుర్తుగా భావించారు. నగర నిర్మాణం, విదేశీ నౌకావ్యాపారం సాగించిన సమాజానికి ఖగోళశాస్త్రంలో సాధికారమైన పట్టే ఉంటుంది. ఈ పట్టు ఆర్యులకీ ఉంది.

ఆ రోజుల్లో మెసపుటోమియాను పాలించిన సర్గాన్ అనే రాజు (క్రీ.పూ. 2334–2279) టైగ్రిస్ నదీతీరంలో వేయించిన ఒక శాసనంలో సింధూప్రాంతాన్ని 'మెలూహా (Meluhha) దేశం' అని తెలిపాడు. అది అప్పటి సింధూభాషలో ఏమై ఉంటుందో? దాన్ని ఎలా ఉచ్ఛరించాలో? మనకు సింధూలిపి తెలిస్తే తెలుస్తుంది.

భారతదేశానికి ఉన్న మొట్టమొదటి పేరు అది. సింధూ కాలం నాటి 'మెలూహా' ఆర్యులనాటికి 'భరతవర్షం'గా మారింది.

ఇదంతా ఎందుకంటే... సింధూనాగరకతా వికాసం.. మనముందు ఉంటే.. వేదాల్ని, వేదకాలంనాటి వారి జీవనాన్ని, వారి వైజ్ఞానిక దృక్పథాన్ని అర్థం చేసుకోవడంలో సరైన అంచనాలు వేసుకోగలం–

లేదంటే, లేనిపోని భ్రమల్లో (అనుకూలంగానో, ప్రతికూలంగానో) కొట్టుకుపోగలం–

*(ఇంకావుంది)*

# తొలి వ్యావసాయిక విప్లవం

**(వేదాల్ని సర్వజ్ఞానభాండాగారాలుగా భావించి అన్నీ వాటిల్లోనే వున్నాయనటం ఎంత తప్పో, వేదాల్లో ఏమీలేదని, వున్నదంతా చెత్త అనే అభిప్రాయానికి రావటమూ అంతే తప్పు. వాస్తవ దృష్టితో, వేదాల్లోని విషయాలను నేటి తరానికి అందించాలన్న లక్ష్యంతోనే ప్రముఖ బౌద్ధ, సైన్సు రచయిత బొర్రా గోవర్ధన్ నిష్పాక్షికంగా ఈ రచనను 'స్వేచ్ఛాలోచన'కు అందిస్తున్నారు. దీంతో, ఎవర్నీ నొప్పించే ఉద్దేశం రచయితకుగానీ, స్వేచ్ఛాలోచనకు గానీ లేవని తెలియజేస్తున్నాం. – ఎడిటర్)**

## గుడ్డిలో మెల్ల

దొరికిన శిలాజాల ద్వారాగానీ, శిథిలాల ద్వారాగానీ, పురాతన సాహిత్యం ద్వారాగానీ.. తెలుసుకునే చరిత్రలో భౌతిక అంశాల్లో ఎక్కువశాతం నిజం ఉండొచ్చునేమోగానీ, సంస్కృతీ, జీవన విధానాల్ని అంచనా వేయడంలో పరిపూర్ణత మాత్రం ఉండదు. చాలా విషయాలు మన ఊహల మీదే ఆధార పడతాయి. వీటికితోడు మన ఊహలకి ఏదొక భావజాలం ఊతంగా ఉంటుంది కాబట్టి ప్రేమతోనో, ద్వేషం తోనో చూడ్డంవల్ల సరైన ఊహల్ని కూడా చేయలేం.



బొర్రా గోవర్ధన్
9390600157

చరిత్ర అధ్యయనంలో తప్పని ఇబ్బంది ఇది. అయినా కొన్నివిషయాల్ని మాత్రం సరిగ్గా అంచనా వేయగలం.

ఆర్యులు మధ్య ఆసియా నుండి వచ్చారనేది ఒక అభిప్రాయం. కాదు ఇక్కడి వారే అనేది మరో అభిప్రాయం. ఉత్తరధృవం నుండి వచ్చారనేది ఇంకో అభిప్రాయం.

వేరు వేరు భావజాలాల వల్ల, దృక్పథాల వల్ల వేర్వేరు ఆలోచనలు చేస్తాం. అంచనాలు వేస్తాం. కళ్ళముందు జరిగే విషయాల్లోనే వేరు వేరు అంచనా లుంటాయి. ఇక, గతకాలం గురించి వేసే అంచనాల్లో ఎంత వ్యత్యాసం ఉంటుంది ?

బుద్ధుడు చెప్పినట్లు 'అతిప్రేమ వల్ల, అతిద్వేషం వల్ల' సరైన జ్ఞానాన్ని పొందలేం అన్నది నిజం.

ఆ మధ్య ఒక పత్రికలో, ఒక సంస్థ రాష్ట్ర నాయకుడు, ఎడిటోరియల్ రాస్తూ వేదంలోని ఒక వైజ్ఞానిక అంశాన్ని ఎత్తి చూపి 'అదిచాలా హింసాపూరితమైనది' అని రాశాడు. ఒక వైజ్ఞానిక అంశం యజ్ఞంలో చేసే హింసగా భ్రమపడి అలా రాశాడు. అలా భ్రమపడడానికి కారణం వేదం నిండా హింసే ఉంటుందనుకునే అతని దృక్పథం... హంతకుడు చేసే కత్తిగాటుకి, డాక్టర్ చేసే కత్తిగాటుకీ నెత్తురే కారుతుంది. అయినా డాక్టర్‌ని హింసావాదిగా భావించలేం గదా!

ఇలాంటి ప్రమత్తత వల్ల చరిత్రని, సంస్కృతిని తప్పుడు అంచనాలు వేసేస్తాం.

అప్రమత్తతతో ఉంటే నూటికి నూరుశాతం ఖచ్చితమైన అంచనాలు వేయకపోయినా, దాదాపు సరైన అంచనాలకు రాగలం.

గుడ్డికంటే.. మెల్ల మేలు కదా!

ఆర్యులు ఎక్కడి వారు అనే విషయంలో ఉన్నంతలో మేలైనది వారు మధ్యఆసియా నుండి వచ్చారనేదే!

## ఇంకా తేలని ప్రశ్న

సింధూనాగరకత పతనానికి కారణాలు ఎన్నో.

అదేదో 'ఒక ఇంటిని కట్టి కూల్చేసినట్టుగా' నాగరకత అంతా నేలపాలైపోయింది అనుకుంటున్నాం

మనం అనుకుంటున్నట్లు ఆర్యులు సింధూ నాగరకతను నాశనం చేశారని భావించడం సరైనదేనా? అని ప్రశ్నించుకుని, 'సరైనదే' అని అంగీకరిస్తే ముందుగా మనం ఒక విషయాన్ని ఒప్పుకోవాలి.

అది "సింధూ ప్రజలకంటే ఆర్యులే నాగరకులు' అని. ఎందుకంటే.. **ఉన్నతమైన సంస్కృతి, నాగరకతలే తమకంటే తక్కువైన సంస్కృతీ, నాగరకతల్ని జయించగలవు.**

'1857 ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటం' అనే పుస్తకంలో కార్ల్‌మార్క్స్ ఇదే అంటాడు–

"భారతదేశాన్ని జయించిన ముస్లిం పాలకులు విజేతలైన పరాజితులు. భారతీయులు పరాజిత విజేతలు. అంటాడు. ఎందుకంటే భుజబలంతో భారతదేశాన్ని జయించిన హూణులు, శకులు, మొగలులు అందరూ చివరికి భారతీయ సంస్కృతిలో తామూ ఒక భాగమైపోయారు. ఎందుకంటే భారతీయుల కంటే వారు నాగరకతలో తక్కువవారు. కానీ, బ్రిటీషువారు అలా కాదు. వారు భారతదేశాన్ని భౌతికంగానే కాదు, భావజాలపరంగా కూడా గెలుస్తారు. కారణం... భారతీయుల కంటే వారు ఉన్నత నాగరకులు" అంటాడు.

కాబట్టి, స్థిరనివాసాలు కూడా లేని ఆర్యులు, సింధూప్రజల నగర నాగరకతను సమూలంగా ధ్వంసం చేయగలరా?

అసలు భౌతికంగా ఒకజాతి మరోజాతిని ఓడించ

గలదు గాని సమూలంగా మట్టుబెట్టగలదా?

ఓడించడం వేరు. నిర్మూలించడం వేరు.

'చరిత్రలో సింధూనాగరకత ఓడించబడలేదు, నిర్మూలించ బడింది. ఈ నిర్మూలనకి పరాయిశక్తులా? ప్రకృతి శక్తులా? అంటురోగాలా? అంతర్గత కలహాలా? ఏవి కారణం? ఏది సరైన కారణం?' అని మనం రకరకాలుగా కారణాలు వెతుకుతున్నాం'. ప్రశ్నలేసుకుంటున్నాం.

ఇవి ఇంకా తేలని ప్రశ్నలే . ఇప్పట్లో తేలే ప్రశ్నే లేని ప్రశ్నలు.

అయితే మనం తెలుసుకోవాల్సింది ఏమంటే, సింధూ నాగరకత ఓడించబడిందే కానీ, నిర్మూలించ బడలేదు.

## ఓటమికి కారణాలు

ఈ ఓటమికి కారణం ఆనాటి భయంకర బానిసత్వం.

ఒకటి మాత్రం వాస్తవం. ఒకనాటి ఈజిప్ట్, గ్రీకు ప్రాంతాల్లో మాదిరిగా సింధూప్రజల్లో భయంకర బానిసత్వం ఉంది. ప్రజలు పేద, ధనిక వర్గాలుగా విడిపోయిన మాట వాస్తవం. ధనిక వర్గాల భారీగృహనిర్మాణాలకి, చిన్నపాటి కోటల్లాంటి మేడలు కట్టడానికి అశేష బానిస జనం శ్రమించారనేది చారిత్రక సత్యం.

ఎందుకంటే... సింధూ ప్రాంతంలో బైటపడ్డ నగరాల్లో ఈ విషయం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తోంది. ధనవంతుల భవనాలు, ఆ భవనాల్లో ఎత్తైన స్నానఘట్టాలు, మురికినీటి, మంచినీటి సరఫరా ఏర్పాట్లు, విశాలమైన వీధులు ఉంటే... నగరం శివార్లలో చిన్నచిన్న ఇళ్ళు, ఇరుకు వాడలు ఉన్నాయి. నగర నిర్మాణంలో ఉన్న కనీస వసతులేవీ ఈ వాడల్లో కనిపించవు.

అలాగే.. బైటపడ్డ సమాధుల్లో కూడా ఈ వ్యత్యాసం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ధనిక వర్గాలకి పెద్ద పెద్ద సమాధులు ఒకచోట ఉంటే... శివారు వాడల సమీపంలో అతి చిన్న చిన్న సమాధులు లెక్కలేనన్ని బైటపడ్డాయి. ధనవంతులకంటే పేదలే ఎక్కువ అని ఈ విషయం తెలియజేస్తుంది. అంతేకాదు, ధనవంతుల సమాధుల్లో వందలకొద్దీ ఆహార పదార్థాలు, ఆభరణాలు(బంగారం) నిల్వచేసిన కుండలు పేర్చి ఉంటే... పేదవారి సమాధిలో కేవలం ఆహార పదార్ధాలున్న ఒకటి, రెండు కుండలే ఉన్నాయి.

మరోకారణం కూడా చూద్దాం– మనం గత సంచికలోని వ్యాసంలో మెసపుటోమియా రాజు సర్గాన్, టైగ్రిస్ నదీతీరంలో వేయించిన ఒక శాసనం గురించి చూశాం. ఆ శాసనంలో 'మెలూహా' నుండి దిగుమతి చేసుకునే వస్తువుల పట్టికలో 'బానిసల' విషయం కూడా ఉంది.

అంటే, సింధూ ప్రదేశం నుండి బానిసల్ని వారు దిగుమతి చేసుకునేవారన్నమాట. బానిసల్ని ఇలా 'వస్తువులుగా' దిగుమతి చేసుకోవడం అంటే వారికి ఏలాంటి హక్కులు లేవనే అర్థం–

పై విషయాల్ని బట్టి సింధూ సమాజం 'బానిసవర్గ సమాజం' అనేది చాలావరకు సత్యం.

ఇలా భారీనిర్మాణాల్లో బానిసలతో ఊడిగం చేయించు కోవడం అన్నది బానిస వర్గసమాజ సహజ దుర్మార్గం.

"తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవరు?" అని శ్రీశ్రీ ప్రశ్నించింది ఈ బానిస వ్యవస్థ గురించే. ఈజిప్టులో పిరమిడ్ల నిర్మాణానికి, అతిపెద్ద రాచరిక నివాసాలకి లక్షలాది బానిసలు తమ ప్రాణాలు ధారపోశారు– అందుకే...

"నైలునదీ నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది?" అని కూడా శ్రీశ్రీ ప్రశ్నించాడు.

అలాగే–

సింధూనగర నిర్మాణంలో కూడా ఎందరో బానిసలు ఇలా బలైపోయి ఉంటారు.

ఇప్పుడు మనం ఆ శ్రీశ్రీ గీతానికి మరో వాక్యం చేర్చాలి...

**"సింధు నగర నిర్మాణానికి బలైపోయిన బానిసలెందరు?"–** అని

ఈ బానిస వ్యవస్థ ఐరోపా తీరులో వర్గాలు గానే ఉండేదా? కులాలుగా, అంటరానితనంతో అలరారేదా? అనే విషయం తెలియదు. కానీ, వర్గస్వభావానికి వర్ణస్వభావం ఉండదు.

ఎందుకంటే..

**వర్గస్వభావంలో 'హింస' ప్రధానంగా ఉంటుంది.**

**వర్ణస్వభావంలో 'వంచన' ప్రధానంగా ఉంటుంది.**

అవసరమైతే హింసకూడా వచ్చిపడుతుంది.

కులం అనేది పెద్ద సామాజిక వంచన. కాబట్టి సింధూప్రజల్లో 'కులం' లేకపోవచ్చు. కులం తాలూకు (వర్ణం తాలూకు) ఛాయలు ఋగ్వేద ఆర్యుల్లోనే కనిపిస్తాయి.

కాబట్టి వర్ణం, కులం అనేది ఆర్యుల సొత్తే! ఆర్యుల సృష్టే.

## విజేతలు – పరాజితులు

సింధూ సంస్కృతిని ఆర్యులు సర్వనాశనం చేశారు అనేది అంతగా ఒప్పుకోవాల్సిన విషయంకాదు.

ఆనాటి ప్రధాన ఆర్థికవనర్లు పశువులు, పంటలు. ఆర్యులది ప్రధానంగా పశుపాలక సంస్కృతి. సింధూ ప్రజలది వ్యావసాయిక నాగరకత. మనం గుర్తుపెట్టుకోవాల్సిన విషయం ఏమంటే..'సింధూ పొలిమేరల్లోకి రాకముందు పశుపోషకులైన ఆర్యులు, సింధూతీరంలో స్థిరపడిపోయాక వ్యవసాయ దారులయ్యారు' అనేది.

అంటే... ఆర్యులు కూడా విజేతలైన పరాజితులే అన్నమాట! భుజబలంతో సింధుని గెలిచిన ఆర్యులు, సంస్కృతీ, నాగరకతల పరంగా ఓడిపోయారు. సింధూ ప్రజల వ్యవసాయ నాగరకతను ఆహ్వానించారు. అందిపుచ్చుకున్నారు. పశు పాలన కంటే వ్యవసాయం ఉన్నతమైన నాగరకత. అత్యున్నతమైన సంస్కృతి. ఇలా సింధు ప్రజల సంస్కృతి ఆర్యుల్ని జయించింది. అంటే... సింధూప్రజలు పరాజిత విజేతలే అన్న మాట. అంటే సింధు ప్రజలు ఓడిపోయారు.కానీ సింధూ సంస్కృతి గెలిచింది.

ఋగ్వేదంలో బానిసల ప్రస్తావనలు ఉన్నా చాలా కొద్దిగానే ఉన్నాయి. ఈ బానిసలు ఆర్యులు మాత్రం కాదు. ఆర్యేతర దస్యులే! బానిసలకి 'దాసులు' అనే కొత్తపిలుపు 'దస్యులు' వల్ల వచ్చిందే!

ఆర్యుల చేతిలో సింధూప్రజలు ఓడిపోవడం వెనుక చాలా కారణాలుండొచ్చు.

**ఒకటి:** సింధూ ప్రజలు నాగరకులు. ఆర్యులు అనాగరకులు, మొరటువారు.

**రెండు:** ఆర్యుల వాహనం గుర్రం. గుర్రాలు పూన్చిన ఇనుపరథాలున్నాయి వారికి. అంటే వారి సైన్యంలో కాల్బలం, అశ్వబలం, రథబలం అనే త్రివిధ దళాలున్నాయి. కానీ, సింధూ ప్రజల వాహనం ఎద్దు. వాహకం బండి. వారిసైన్యం ప్రధానంగా కాల్బలమే.

**మూడు:** సింధూ సైనికుల్లో ఎక్కువమంది బానిసలే! వారు తమకోసం కాదు, తమ యజమానులకోసం మాత్రమే యుద్ధం చేయాలి. అంటే తెగింపులేని సైన్యం. కానీ, ఆర్యులది గణసమాజం. గణసభ్యులందరూ సైనికులే. కిరాయి సైన్యంకాదు.

**నాలుగు:** సింధూ ప్రజల ఆయుధాలు 'రాగి'ఆయుధాలు. మెతక ఆయుధాలు. కత్తి, ఈటెలాంటి ముతక ఆయుధాలు. ఆర్యుల ఆయుధాలు ఇనుప ఆయుధాలు. కత్తులు ఈటెలతోపాటు యాంత్రికశక్తికి ప్రతిరూపమైన విల్లువారికి పరమాయుధం.

**ఐదు:** ఆర్యులు భారీకాయులు. ఆరోగ్యదాయకమైన ఆవు, ఎద్దుమాంసాలూ, మధువు, సురల్లాంటి మత్తుపానీయాలు సుష్టుగా సేవించిన బలమైన శరీరాలు వారివి. ఆరడుగుల సగటు ఎత్తువారిది. వారితో పోల్చుకుంటే సింధూ ప్రజలు బలహీనులు. వీరి సగటు ఎత్తు ఐదడుగులు. వీరు సంపూర్ణ మాంసాహారులు కాదు.

**ఆరు:** వీటన్నింటికి తోడు.. సింధూప్రజల్లో ఎక్కువ మంది దిగువ వర్గాలవారు. వారు ఈ యుద్ధాల్లో తటస్థంగా ఉండి ఉంటారు. లేదా, ఆర్యులకి సహాయ సహకారాలందించి ఉంటారు. తమకి బానిసత్వంతో 'భూలోక నరకం' చూపించే నాగరకుల కంటే, అంతగా చంపుకుతినని ఆటవిక ఆర్యులే వారికి నయంగా కన్పించవచ్చు.

ఇందుకు తగిన సాక్ష్యాలు రుగ్వేదంలో ఉన్నాయి కూడా.

## రుతం - సమసమాజం

సింధూ ప్రాంతానికి రాకముందు ఆర్యుల్లో 'రుతం' అనే ఒక జీవన విధానం ఉంది. రుతం అంటే సమష్టి,సంవృద్ధి కలిగిన ఒక జీవన విధానం. ఒకరికొకరు కీడు కలిగించు కోకుండా, కలిసి పని చేసుకుంటూ, సమైక్యంగా ఉండే ఒక జీవనశైలి. రుతం నాటి ఆర్యుల ప్రధాన దేవత ఇంద్రుడు కాదు. వరుణుడు. వరుణుడు రుతానికి అధిపతి. ఆర్యులు సింధూ ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డాక , వారిలో హెచ్చుతగ్గులు ఏర్పడ్డాయి. సింధూ వర్గసమాజ ప్రభావం పడింది. దానితో రుతం పోయింది. రుగ్వేద కాలం వచ్చింది. దానికి ఇంద్రుడు అధిపతి అయ్యాడు. వరుణారాధన తగ్గిపోయింది. ఐతరేయ బ్రాహ్మణంలో ఉన్న శునస్సేపుని కథలో వరుణుని గతవైభవ ప్రస్థావన ఉంది. అలాగే కుత్సుడు అనే రుషి " రుతం ఎక్కడికి పోయింది? వరుణుడు ఏంచేస్తున్నాడు? రుతం తిరిగి పుట్టాలి!" అని వేడుకుంటాడు. మనం 'మళ్ళీ బుద్దుడు పుట్టాలి, మళ్ళీ గాంధీ పుట్టాలి, మళ్ళీ భగత్‌సింగ్ పుట్టాలి' అని కోరుకున్నట్లు.

సింధూ ప్రాంతానికివచ్చిన కొత్తలో రుతం పోయినా ఆ భావాలు వారిలో ఎంతో కొంతమేర ఉండే ఉంటాయి.

అవి చూసి బానిసలు వారివైపు మొగ్గి ఉంటారు. ఈ బానిసలు (సింధూ పీడిత వర్గ ప్రజలు) కాలాంతరంలో ఆర్యులసమాజంలో శూద్రవర్ణంలో చేరిపోయి ఉండొచ్చు. వారే తదనంతరం అంటరానివారిగానూ అవతరించి ఉండొచ్చు!

## ఆర్యులు - వ్యవసాయం

ఆటవికులు, తిరుగుబోతులు, సంచారులు, దిమ్మరులు, పశుపాలకులైన ఆర్యులు సింధూ ప్రాంతం వచ్చేసరికి.. ఇక్కడ అశేష జలరాశుల్ని, నదుల్ని చూశాక, ఈ సస్యశ్యామల ప్రాంతం వారిని అటూ ఇటూ పోకుండా కట్టిపడేసింది. ప్రధానంగా వారి పశువులకు కావలసినంత పచ్చిక. సింధూ ప్రాంతంలోని నదుల వలలో చిక్కుకు పోయాక వారిక తమ దిమ్మరితనాన్ని దించేసుకున్నారు. గుడారాల్ని, గుడిసెల్ని గ్రామాలుగా తీర్చిదిద్దుకున్నారు. సింధూ జీవనదీ జలాలు వారి జీవితాల్నే మార్చేశాయి.

తాము జయించిన సింధూ ప్రజల్నుండి వ్యవసాయాన్ని స్వీకరించడం వారికి అనివార్యమైంది. కొత్తగా నేర్చుకున్న ఈ వృత్తి వారికి కొత్త ఉత్సాహాన్ని తెచ్చింది.

దశాబ్దకాలంగా నిరంతరాయంగా వస్తున్న 'స్వేచ్ఛాలోచన' మాలో జిజ్ఞాసను
పెంపొందిస్తున్నందుకు అభినందనలు. శతాబ్ది సంచికదిశగా పయనించాలని ఆకాంక్షిస్తూ...



**యం.యస్.యన్.మూర్తి, యం.రమామణి**

**విశాఖపట్నం**

వ్యవసాయానికి మరింత మెరుగులు దిద్దారు. నూతన వ్యవసాయ విధానాల్ని అమలు చేశారు.


## ఇనుప కర్రు – బావి గిలక

ఇనుము ఒక ఆయుధంగా మారి యుద్ధ విజయాల్ని ఎలా సాధించిపెట్టిందో, నాగలికి 'కర్రుగా' మారి అంతకంటే ఎక్కువ సస్యవిజయాన్ని సాధించింది. ఇనుపకర్రు నాగలి నేలను బలంగా దున్నేది. నేలలో లోతుగా దిగేది. దీనితో మనుషులో, లేక ఒక ఎద్దో నాగలిని లాగలేకపోయేవి. దానితో ఒక నాగలికి జోడెద్దులు కట్టి దున్నే విధానం వచ్చింది. అయితే, ఇప్పటిలాగా 'కాడి' మాత్రం లేదు. రెండెద్దుల తలలకీ, కొమ్ములకీ కలిపి తాళ్ళతో కట్టిన నాగలి ఉండేది. ఎద్దులతో కాకుండా గుర్రాలతో కూడా నాగలి లాగించేవారు. ఈ వివరాలు ఋగ్వేదంలో ఉన్నాయి. ఋగ్వేదకాలం సుమారుగా క్రీ.పూ. 1800 నుండి క్రీ.పూ. 700 వరకు. సింధూనాగరకత పతనం క్రీ.పూ. 1700. సింధూ ప్రజలు ఆనాటికి బావుల ద్వారా భూగర్భజలాన్ని బైటకి తీసి వ్యవసాయం చేశారని చెప్పుకున్నాం. నీరుతోడడానికి చెక్క బకెట్లు వాడారనీ చెప్పుకున్నాం. ఈ బావులు, భూగర్భజలాల వినియోగం సింధూ ప్రజల అపూర్వ వైజ్ఞానిక ప్రగతిగానూ చెప్పుకున్నాం.

అయితే, ఆర్యులు సింధూప్రజల్నుండి ఈ బావులు, భూగర్భజల వినియోగాన్ని తీసుకుని వ్యవసాయాభివృద్ధికి ఉపయోగించుకున్నారు. ఆ విధానాన్ని మరింత మెరుగుపరిచారు. సింధూ ప్రజలకు బావులు తెలుసు. బక్కెట్ల ద్వారా నీరు తోడడం తెలుసు. కానీ.. 'గిలక' బావి తెలియదు. బావిపైన గిలక అమర్చి తక్కువశక్తితో ఎక్కువ ఫలితాన్ని పొందే 'యంత్రలాభం' గురించి వారికి తెలియదు. కానీ.. ఆర్యులు ఆ లాభాన్ని పొందారు. వారు బావులపైన రాతితో తయారు చేసిన 'గిలకల్ని' (కప్పీలను) ఉపయోగించి, గుర్రాలతో లాగించి పెద్ద పెద్ద తోలు బక్కెట్లతో నీరు తోడి వ్యవసాయం చేశారు. పెద్ద పెద్ద మోటబావులు, నీరు పారడానికి కాల్వలు తీసి సాగుచేశారు. బావిపైన కొయ్యతో దూలాలు బిగించి వాటికి రాతికప్పీలు తగిలించి, బొక్కనకు జనపనార, భంగునార (సాగనార)లతో చేసిన మోకులు కట్టి గుర్రాలతో లాగించేవారు. ఈ విషయం ఋగ్వేదం పదోమండలం, 101వ సూక్తంలోని ఏడవ ఋక్కు(10-101-7)లో ఇలా ఉంది.

**"ప్రీణీతాశ్వాన్ హితం జయాథ స్వస్తివాహం రథమిత్ కృణుధ్వం
ద్రోహావమవతమశ్మచక్రమాంసత్రకోశం సించలూ నృపాణం"**

ఈ సూక్తకర్త బుధసౌమ్యుడు. ఇందులో ద్రోణ, అశ్మక చక్ర (రాతిచక్రం), హలం వివరాలున్నాయి. ఈ ఋక్కు అర్థం


పాకిస్తాన్‌లో బయల్పడ్డ ఆర్యుల వ్యవసాయక్షేత్రం

ఇది–

“ఓ ఋత్విక్కుల్లారా! మీరు అశ్వాలకు ఆహారం, నీరు అందించి తృప్తిపరచండి! ఆ తర్వాత విత్తనాలు చల్లడంకోసం దుక్కి పనులు చేయించండి. తేలిగ్గా దున్నేట్లు, సుఖంగా సాగేట్లు నాగలిని సిద్ధపరచండి. నీరుతోడే పాత్ర (అవటం)ను క్రిందికి (బావిలోకి) దించండి. రాతిచక్రంతిప్పి సరైన స్థానానికి, ఉప యోగపడేట్టు నీటితో నిండిన పాత్రను తీసుకురండి”

## పంట భూములు – పచ్చిక బయళ్ళు

ఆర్యగ్రామాల దాపులోనే వ్యవసాయభూమి ఉండేది. వాటికి దూరంగా పశువుల మేతకోసం సాగుచేయని విశాలమైన పచ్చిక బయళ్ళు ఉండేవి. ఇప్పుడు లేవుగాని నలభై ఏళ్ళక్రితం మా గ్రామంలో కూడా ఇలాంటి భూములుండేవి. విశాలమైన పంటభూములకు కాస్త దూరంగా, కొద్దిపాటి పచ్చికబయళ్ళు ఉండేవి. ఈ పచ్చిక బయళ్ళని కట్టవ అని, బాడవ అనీ పిలిచేవారు. మేము ఆ బాడవలో గొడ్లను తోలి సాయంత్రం దాకా ఆటలాడుకొంటూ ఉండేవారం. ఇవి చాలా చిన్న బాడవలు. కానీ, ఆనాడు ఆర్యులకు పంటభూములకంటే పచ్చిక బయళ్ళే విశాలంగా ఉండేవి.

ఋగ్వేదంలో సాగుభూమిని ‘ఉర్వర’ అన్నారు. సాగుభూమి యజమానిని ‘ఉర్వరపతి’ అన్నారు. ఈ సాగుభూముల్ని బలవంతంగా మరొకరి నుండి ఆక్రమించు కొన్నవారిని ‘ఉర్వరజిత్’ అని అభివర్ణించారు.

అంటే... భూ ‘దందా’లకి ఆర్యులే ఆద్యులన్నమాట!– ఈ భూముల్ని బహుశా సింధూ ప్రజల్నుండి లాక్కొని ఉండొచ్చు.

ఆర్యులు నేలని ‘క్షేత్రం’ అన్నారు. నాగలితో దున్నడాన్ని ‘కృషి’ అనీ, నాగలిని ‘లాంగల’ లేదా ‘సీర’ అని, నాగలి కర్రుని ‘ఫాల’ అనీ, ముల్లుకర్రను ‘అస్త్ర’ అనీ, బావిమీది రాతిగిలకని ‘అశ్మచక్ర’ అనీ, బావినుండి పంట చేనుకు తీసిన కాలువను ‘సూర్మీ, సుషీర’ అనీ, నాగటిచాలును ‘సీత’ అని, పచ్చికబీడును ‘గోష్ఠ’ అనీ అన్నారు. ఈ పదాలు ఋగ్వేదంలో అనేకచోట్ల వస్తాయి.

ఋగ్వేద ఆర్యులది అటు పశుపాలన, ఇటు వ్యవసాయ నాగరకతల సంధికాలంగా చెప్పుకోవచ్చు. వీరి ప్రధానపంట యవలు (బార్లీ). గోధుమ పేరు ఋగ్వేదంలో లేదు. ‘వరి’ ప్రస్థావన ఉంది, కానీ చాలా తక్కువగానే ఉంది. ‘ధాన్య’, ‘బీజ’ అని రెండు పేర్లతో వరిని పిలిచారు (5–53–13)

సింధూ ప్రజలకు తెలిసిన ప్రత్తిపంట వీరికి తెలియదు. ఋగ్వేదంలో ఎక్కడా ప్రత్తి ప్రస్థావన లేదు. వీరు నారదుస్తులు, ఉన్ని (బొచ్చు) దుస్తులే ధరించేవారు.

ధాన్యానికీ, ఎద్దులకీ మారకం జరిగిన సందర్భాలు కూడా కొన్నిచోట్ల ఉన్నాయి.

ఆర్యులు అనతికాలంలోనే... వ్యవసాయాన్ని అలవాటు చేసుకున్నారు.

**“యునక్త సీరా వి యుగా తనుధ్వంకృతే యోనౌ వపతేహ బీజం గిరా చ శ్రుష్టిః సభరా అసన్నో నేదీయ ఇత్ సృర్యాః పక్వ మేయాత్”** – *(10–101–3)*

“సఖులారా! మీరు అశ్వాలతో నాగళ్ళను కట్టండి. క్షేత్రాల్ని విస్తరింపచేయండి. నాగటి చాలులో గ్రామాలకు చెందిన బీజాల్ని (తిలలు, మాషలు, యవలు మొదలైన ఏడురకాల ధాన్యాలు), అరణ్యాలకి చెందిన బీజాల్ని (వెదరు, శ్యామాకం మొదలైన ఏడురకాల బీజాల్ని) నాటండి. మిమ్మల్ని స్తుతించడంవల్ల మాకు అన్నం దొరుకుతుంది?)

అలాగే–

**“మహాన్తం కోశముదచా నిషిఞ్చ స్యన్దన్తాం కుల్యా విషితాః...”**

– *(5–83–8)*

ఇది పర్జన్యుని గురించి కీర్తిస్తూ భౌమో అత్రిఋషి చెప్పిన సూక్తంలోని ఋక్కు. ఇందులో కుల్యా... అంటే కాలువ ప్రస్తావన ఉంది.

అలాగే మరోచోట కృష్ణ అంగీరసుడు కూడా ఇలా చెప్పాడు–

**“జలం సింధువైపు పారుతున్నట్లు**
**కుల్య లోతైన జలాశయం వైపుకు పారుతున్నట్లు**
**సోమం ఇంద్రుని వైపుకు పారుతుంది”–**

ఆర్యులకాలం నాటి (క్రీ.పూ. 1200) నాగటి చాళ్ళక్షేత్రం పాకిస్థాన్‌లోని స్వాత్‌ప్రాంతంలో అలిగ్రామ దగ్గర బైటపడింది.

ఒకటి మాత్రం వాస్తవం–

ఆర్యులు ఆవిష్కరించిన రాతికప్పి తొలి వ్యవసాయక విప్లవానికి నాంది పలికింది.


సింధూ నాగరకత ఆవిష్కరించిన వ్యవసాయం, ఆ తర్వాత ఆర్యసమాజాల్ని బలసంపన్నం చేసింది.

# ఋగ్వేద రథచక్రాలు

> అర్భకో న కుమారకో౽ధి తిష్ఠన్ నవం రథం
> స పక్షన్మహిషం మృగం పిత్రే మాత్రే విభుక్రతుం
> **"చంటిబిడ్డ తండ్రి ఒడిలో కూర్చొన్నట్లు - ఇంద్రుడు కొత్త రథంలో కూర్చొన్నాడు" - (8-58-15)**

కవితాత్మకమైన ఈ రుక్కుని చూస్తే కొత్తరథాల పరుగులు, మానవ నాగరకతను కొత్తపుంతలు తొక్కించిన గొప్ప ఆవిష్కరణ 'చక్రం' చంక్రమణలూ మన మనసుల్లో మెదులాడతాయి.

మానవ సమాజాన్నెప్పుడూ వైజ్ఞానిక శాస్త్రమే నడిపిస్తూ ఉంటుంది. మనిషికి తన నైపుణ్యమే తనని బ్రతికిస్తుందని తెలిసినా, ఏదో తెలియని శక్తివైపు అశక్తునిగా చూడ్డం మానవప్రకృతిలో సహజగా కనిపించే బలహీనత. ఈ బలహీనతే మనషిని మరింత బలవంతునిగా ముందుకు నడిపిస్తున్నా, బానిసత్వం నుండి బైటపడేయలేకపోతోంది!



బొర్రా గోవర్ధన్
9390600157

దైవం, అతీతశక్తులు అనే పరిధి నుండి సమాజం బైటపడలేక యుగయుగాలుగా గింజుకుంటోంది.

ఒక్క ఉదాహరణ చూద్దాం !

లంకలో సీత దగ్గరకు వెళ్ళిన హనుమంతుడు తాను రాముని దూతనని నమ్మించ దానికి 'ఉంగరం' చూపించాడు. రాముడు చెప్పమన్న ఒక రహస్య ఉదంతం చెప్పి, తాను రాముని దూతనని నమ్మించాడు.

మరి అదే ఇప్పుడైతే... హనుమంతుడు ఏం చేసేవాడు...?

తన స్మార్ట్‌ఫోన్‌తో రామునితో చాటింగ్ చేయించేవాడు. సీతారాములిద్దరూ ఒకరినొకరు చూసుకుంటూ మాట్లాడుకునేవారు. అది ఇప్పుడు సాధ్యం. కానీ అప్పుడు అసాధ్యం.'దేవుడైన' రామునికైనా, 'దేవతైన' సీతకైనా, 'రామదూత' హనుమకైనా.

ఇలాంటి విషయాలు ఊహలకి కూడా అందని రోజులవి. అందుకే అప్పటికి వారికి 'ఉంగరమే' శరణ్యం అయ్యింది.

కానీ, అప్పుడు దైవానికి కూడా అసాధ్యమైన పనిని ఈ రోజున అతిసాధారణ మనిషి కూడా చేయగలడు.

ఈ విషయం అందరికీ తెలుసు..కానీ, మనిషి ఆ పారలౌకిక బానిసత్వం నుండి బైటపడలేక పోతున్నాడు.

దీనికి కారణం? ఇది మనిషి సహజ బలహీనతా? లేక వర్గ సమాజం రూపొందించిన బలమైన భావజాలం సంకెళ్ళా?

ఏదైతేనేం... ఒకటి మాత్రం సత్యం.

దైవాన్నినమ్మి బతికే వారు కూడా విజ్ఞానశాస్త్రాన్ని అంది పుచ్చుకోవడంలో 'అలసత్వం' చూపుతారేమోగానీ, ఆమోదించకుండా, అనుసరించకుండా బ్రతకడం అసంభవం. అసాధ్యం. వారు ఈజిప్టువారైనా, మెసపటోమియన్లయినా, అస్సీరియన్లు అయినా, గ్రీకులైనా, అరబ్బులైనా, సింధూ ప్రజలైనా చివరికి ఆర్యులైనా..! ఎవరైనాసరే! ఇంద్రుడైనా గుర్రాల రథాన్ని ఎక్కాల్సిందే! రామచంద్రుడైనా అద్దంలో చందమామను చూడాల్సిందే!

మానవ నాగరకతా వికాసంలో 'రథం' అనే వాహనం లేనప్పుడు , ఇంద్రుడు రథం ఎక్కడు. ఎక్కలేడు. ఎక్కేడని రాసేవాడూ ఉండడు.

సిలికాన్‌తో అద్దాల్ని తయారుచేయడం తెలియని సమాజంలో పుట్టిఉంటే రాముడైనా అద్దంలో చూడలేడు. సోముడైనా అద్దంలో అగపడడు. అలాంటివే ఋగ్వేదంలోని రథాలు కూడా.


## శయన చక్రం - పయన చక్రం

క్రీ.పూ. 4000 - 2000 సంవత్సరాల మధ్యకాలాన్ని తట్టిలేపి, నాగరకతను వేగవంతం చేసిన పరమ ఆవిష్కరణ ఒకటుంది. అదే 'చక్రం'. 'చక్రం'లా మానవ జీవితాల్ని ప్రభావితం చేసిన గొప్ప ఆవిష్కరణ ఏదీ.. కంప్యూటర్ వచ్చేవరకూ రాలేదు అనడం అతిశయోక్తి కాదు-

క్రీ.పూ. 4000 సంవత్సరాల నాడు చక్రం కుమ్మరిసారెలానే ఉండేది. కుమ్మరి సారె పడకపాటున ఉండి తిరిగే చక్రం. అది భూచక్రంలా తిరుగుతూ అందమైన కుండలకి రూపాన్నిచ్చేది. ఈజిప్టు, మెసపుటోమియా, చైనా, సింధూ ప్రాంతాల్లో మట్టిని కుండలుగా మలచడంలో ప్రధానపాత్ర తీసుకుంది. అంతేకాదు, మనిషి చేతుల్లో 'పనితనాన్ని' పెంచి, మెదడులో 'సృజనాత్మకత'కి చక్రం తిప్పింది. దీనివల్ల ఏకాగ్రత,

వ్రేళ్ళకు నైపుణ్యం పెరగడం ఒక అంశం కాగా, మరో అంశం అది సామాజిక అవసరాలకి ఆసరాగా నిలవడం. చక్రంవచ్చి ధాన్యం నిల్వలు పెంచింది. నీటి అవసరాలు తీర్చింది. ఆహారపదార్థాన్ని కాల్చుకుతినే సంప్రదాయం నుండి వండుకు తినే విధానానికి మార్చింది. నూతన ఆహారా పదార్థాల సృష్టికి కారణం అయ్యింది. నీటితో పాటు పాల నిల్వల్ని పెంచుకోవడం వల్ల జంతువుల మచ్చికకి మరింత కారణం కూడా అయ్యింది.

ఆనాటి ప్రపంచంలో ఒక వెయ్యేళ్ళలో అంతటా చక్రం వ్యాపించింది. ప్రభావాన్ని చూపింది. అది ఎంతగా ప్రభావం చూపిందంటే...




**ఆ తర్వాత... ఇప్పటి వరకూ వచ్చిన తత్త్వవేత్తలందరూ తమ తత్త్వసారాన్ని 'కుండల్ని, కుమ్మరిని చెప్పకుండా' చెప్పలేనంతగా ప్రభావం పడేసింది.**

**ఈ సృష్టిని కుండల తయారీతో, సృష్టించే దేవుణ్ణి కుమ్మరితో పోల్చుతూ చెప్పడం ఒక వైపున ఉంటే... "కుండ, కుమ్మరి, సారె, మట్టి" వీటిని చెప్పకుండా కార్యకారణ సంబంధాన్ని వివరించలేనంతగా మరోవైపున ఉంది.**

అంటే.. **చక్రం ఈ సృష్టిలో 'ప్రతిసృష్టి ' చేసిన మొదటి ఆవిష్కరణ అన్నమాట. అంటే... సృష్టిలో ఉన్న 'మట్టిని', సృష్టిలో లేని 'కుండ'గా కొత్తసృష్టి చేసిందన్నమాట–**

అందుకే సామాజిక భావజాల పరంగా అంతటి ప్రభావాన్ని వేసింది ఈ 'శయన చక్రం'.

అయితే– ఈ పడుకున్న చక్రం (శయన చక్రం)– క్రీ.పూ. మూడో సహస్రాబ్దం చివరిలో తన భంగిమను మార్చుకుంది. పడకసీను నుండి లేచి నిలబడింది. అలా లేచి నిలబడిన చక్రం నిలబడే ఉంటుందా. నడవదూ!




లేదు లేదు. అది నడవనేలేదు. నిలబడ్డ చక్రం ఏకంగా జింకపిల్లలా పుట్టగానే పరుగులు తీసింది. మనిషికి ఎక్కడాలేని వేగాన్ని తెచ్చింది. నాగరకతను పరుగులు తీయించింది, మనిషి ప్రపంచాన్ని విశాలంగా మార్చింది. కొత్త కొత్త ప్రదేశాల అన్వేషణకి దారి చూపింది. కొత్త కొత్త వాహనాల ఆవిష్కరణకి తలుపులు తెరచింది. జంతుబలాన్ని ఉత్పాదక శక్తిగా మలచింది. నాగరకత వికాసానికి నాందిగా నిలచింది.

అంటే శయన చక్రం పయన (ప్రయాణ) చక్రంగా మారిందన్న మాట.

మనిషి కాలాన్ని జయించడం ఈ నిలబడి పరుగులు తీసే చక్రం వల్లే సాధ్యం అయ్యింది. ఆటవిక, అనాగరిక సమాజాలు బానిస సమాజంగా మారడం కూడా ఆ పరుగులో భాగమే!

ఆటవిక సమాజంలో దాడిచేసి, ఓడించిన సమాజాన్నంతా సమూలంగా నాశనం చేసేవారు. అందర్నీ చంపేసేవారు. కానీ, చక్రం ప్రగతిరథచక్రంగా మారాక, రాగి, ఇనుములాంటి లోహాలు వచ్చాక, ఓటమిపాలైన పరాజితులు విస్తరించిన వ్యవసాయక్షేత్రాల్లో కూలీలుగా మారారు. నూతన భవన నిర్మాణాలకి రాళ్ళెత్తారు. చెమటను సంపదగా మార్చారు. అలా బతికిపోయిన వారు పశువుల్లా మారి, 'బ్రతికిన శవాలుగా' బతికిపోయారు. ఈ 'జీవచ్ఛవాలే' నాగరకతా వికాసానికి కారణం అయ్యారు–

వారిని శవాల పోగులుగా మార్చకుండా, కనీసం జీవచ్ఛవాలుగా మార్చి ప్రపంచ ఆర్థిక పురోభివృద్ధికి, నాగరకతా వికాసానికి కారణమయ్యేలా మలచింది చక్రం మాత్రమే!

రాతి చక్రం బావి మీద గిలకగా మారి, తక్కువశక్తితో ఎక్కువ భూగర్భజలాల్ని పంటచేతలకు అందించిందని, ఇది ఆర్యుల వ్యావసాయిక ప్రగతి అని గత సంచికలో చెప్పుకొన్నాం.

ఇప్పుడు ఆ చక్రం రథచక్రంగా మారి ఏమిచేసిందో తెలుసుకుందాం...

## పలకల చక్రం– ఆకుల(Spokes) చక్రం

క్రీ.పూ. మూడువేల సంవత్సరాల నాడు బండిచక్రం పెద్ద 'బండచక్రం'గా ఉండేది. పెద్ద పెద్ద వస్తువుల్ని దొర్లించడానికి మాత్రమే రాతిచక్రాలు ఉపయోగపడేవి. ఇవి 'పలకగా' కాకుండా దాదాపుగా 'గుండ్రంగా' ఉండేవి. బలమైన వస్తువుల్ని, తక్కువ బలంతో ఒకచోటు నుండి మరోచోటుకి చేర్చడానికి ఉపయోగ పడేవి. రాగి, ఇనుము లాంటి లోహాల్ని వెలికితీసి, వాటిని కత్తి, గొడ్డలి, రంపం లాంటి పరికరాలుగా మలచి, వాటితో పెద్దపెద్ద చెట్ల దుంగల్ని పలకలుగా కత్తిరించి, చక్రంగా ఆవిష్కరించాక, బండిచక్రాలు పుట్టుకొచ్చాయి.

రెండు, మూడు చెక్క పలకల్ని ప్రక్క ప్రక్కన ఉంచి, వాటిని కదలకుండా మరో చెక్కతో బిగించి, ఆ మూడు పలకల్ని వృత్తాకారంగా కోసి చక్రం తయారు చేసేవారు. వాటిలో మధ్యపలక మధ్యభాగంలో రంధ్రం చేసేవారు. అలాంటి రెండు



పలకల్ని ఒక 'ఇరుసు' సహాయంతో కలిపేవారు. ఆ ఇరుసుపై కదలని చెక్కబద్దల్ని బిగించి 'బండిగా' రూపొందించారు. ఈ బండికి కాడి, పోలు క్రమంగా అమరాయి. దాన్ని లాగడానికి మనుషుల స్థానంలో క్రమంలో జంతువులూ వచ్చాయి.

బండిని లాగిన తొలి జంతువులు చాలా ఉన్నాయి. మేకలు, కుక్కలు, జింకలు, గాడిదలు, దున్నలు, ఎద్దులు, ఒంటెలు, ఏనుగులు– ఇలా ఎన్నో జంతువులున్నాయి.ఎన్ని ఉన్నా మనిషికి అన్ని రకాలుగా బండ్లు లాగడంలో ఉపయోగపడింది ఎద్దులు, దున్నలు మాత్రమే.


ఆడ పశువుల్ని పాలకోసం వినియోగించుకోవడం నేర్చిన మనిషి, పెద్ద శరీరాలు గల మగజంతువుల్ని మాంసం కోసం ఉపయోగించుకునేవాడు. యాంత్రికశక్తి వినియోగం తెలుసుకున్నాక, ఆ మగజంతువుల బలాన్ని బండి లాగించ డానికో, నాగలి లాగించడానికో వినియోగించాడు. కొద్ది కొద్ది దూరాల వరకూ లాగే బండ్లకు చెక్క చక్రాలే ఉండేవి. వ్యవసాయ క్షేత్రాలు విస్తరించాక, నివాసాలకీ, పంట పొలాలకీ దూరం పెరిగాక, అడవులకీ, గ్రామాలకీ దూరం పెరిగాక ఈ చెక్క చక్రాల బళ్ళు అంతగా ఉపయోగపడేవి కావు. వాటి అంచులు చిట్లి, పెక్కులు లేచి, విరిగి ఇబ్బందులు పెట్టేవి.

ఆ ఇబ్బంది అధిగమించడానికి ఆ చెక్క చక్రం అంచులకి లోహపు మేకులు కొట్టే నైపుణ్యం వచ్చింది. ఇలా లోహం (రాగి) మేకులు కొట్టడం వల్ల వేగం పెరిగింది. చక్రానికి మరింత బలం వచ్చింది. మన్నేకాలం కూడా హెచ్చింది. ఆ తర్వాత మధ్యలో ఇరుసుకు చేసిన బెజ్జం చుట్టూ రాగిరేకులు బిగించడంతో చక్రం మన్నిక మరింత పెరిగింది. చక్రానికి ఇరుసుకీ ఘర్షణ తగ్గి వేగం పెరిగింది.

అయితే... ఈ తొలినాటి చెక్క పలకల చక్రం కూడా , మనిషికి 'గుర్రం' మచ్చిక కావడంతో పనికిరాకుండా పోయింది.

గుర్రం వేగానికి, బలానికీ 'చెక్క పలకల చక్రం' నిలువలేక పోయింది.

ఈజిప్టులో క్రీ.పూ. 2500 సంవత్సరాలనాడే నూతన చక్రం ఆవిష్కరణ జరిగింది. అదే ఆకుల చక్రం. మధ్యలో 'కుండ (గుండ్రని చెక్క) చుట్టూ అర్ధవృత్తాకార



పలకలు, వాటినీ, కుండనీ పట్టిబిగించే పలకలు (ఆకులు). దీనివల్ల చక్రం ఘనపరిమాణం తగ్గింది. బరువు తగ్గింది. త్వరణం పెరిగింది. వేగం పెరిగింది. తొలిరోజుల్లో నాలుగు ఆకులతో నిర్మించిన చక్రాల బళ్ళు, రథాలు ఈజిప్టులో దొరికాయి.

దాదాపు అదేకాలంలో సింధూ ప్రజలు కూడా ఆకులచక్రాల బళ్ళను ఉపయోగించిన ఆధారాలు, నమూనాలు కూడా బైటపడ్డాయి. క్రీ.పూ. 1750 నాటిదిగా చెప్పుకునే ఆకులుగల చక్రం నమూనా ఆఫ్ఘన్ ప్రక్కన ఉన్న తుర్కుమెనిస్థాన్ దగ్గర 'టెర్రకోట' నమూనా దొరికింది. అలాగే 'బన్వాలి' దగ్గరకూడా మరో ఆకులచక్ర నమూనా చిత్రం కనిపించింది.

క్రీ.పూ. 1500 నుండి 1000 మధ్యదిగా చెప్పుకునే ఋగ్వేదకాలంలో కూడా ఆకులుగల చక్రాల గురించి, ముఖ్యంగా రథచక్రాల గురించిన వివరాలు కనిపిస్తాయి.

**"పూషా! నీ ఆయుధం చక్రాయుధం. నీ రథానిది తొడుగు ఉన్న ఆకుల చక్రం"** (6–54–3)

చక్రం ఆవిష్కరణ ఫలితాల్ని సింధూప్రాంతానికి వచ్చాక, వారి నుండి అంది పుచ్చుకొని, వాటికి మరింత మెరుగుపరిచారు ఆర్యులు. ఆకులుగల చక్రం – సింధూ ప్రజలకీ, ఆర్యులకీ ఇద్దరికీ తెలుసు. కానీ, సింధూ ప్రజలకి గుర్రం తెలియదు. ఎద్దులు మాత్రమే తెలుసు. కాబట్టి 'రథం' అనేది ఆర్యులు అభివృద్ధి చేసిన వాహనమే!

ఋగ్వేద ఆర్యులు ఒకటీ, రెండూ, ఐదూ, ఏడూ.. పదులకొద్దీ గుర్రాలతో రథాల్ని లాగించేవారు. ఆ వేగానికి తట్టుకొని నిలవగల చక్రాలు, ఇరుసుల నిర్మాణం బలమైన కొయ్య, లేదా ఇనుము, రాగి లాంటి లోహాల వల్లే సాధ్యం అవుతుంది. ఆర్యులు అది చేయగలిగారు.

వారు ఎడ్లతో లాగించే 'బండ్లని' వ్యవసాయానికి, గుర్రాలతో లాగించే 'రథాల్ని' యుద్ధాలకీ వినియోగించారు. దీనివల్ల చాలా వేగంగా విజేతలు కాగలిగారు. తమ విజయాల్ని, వీరగాథలుగా కీర్తిస్తూ, దానికి కారణమైన రథాల్ని కీర్తిస్తూ సాగిన అనేక ఋగ్వేద ఋక్కుల్లో ఈ విషయం మనకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది.

**ఇంద్రుడు వేగవంతుడు. విజేత. రథశ్రేష్ఠుడు – (8–99–7)**

ఋగ్వేదంలో ఉండే శ్లోకాల్ని, లేదా గీతాల్ని 'ఋక్కులు' అంటారు. ఋక్ అంటే స్తుతించడం. ఇంద్రుడు, అగ్ని లాంటి శక్తుల్ని స్తుతిస్తూ, కీర్తిస్తూ చేసే గానాలాపనే 'ఋక్కులు'.

ఆ ఋక్కుల గుట్టల్లో పడి, చరిత్రనీ, వైజ్ఞానిక అంశాల్ని, సామాజిక నియమాల్ని, నాటి జీవన విధానాల్ని వెతుక్కోవాలి. 'వేదం' అతి పురాతన సాహిత్యం. అంటే ఈ ఉపఖండంలో దానికి ముందున్న సాహిత్యం ఏదీ మనకు ఇంతవరకు తెలియలేదు. కాబట్టి అదే ఇప్పటికి తొట్టతొలి సాహిత్య చారిత్రక ఆధారం.



ఆ గౌరవం ఎప్పటికీ వేదానికి ఉంటుంది. అందునా ఋగ్వేదం తొలివేదం కాబట్టి దానికి మరింత ప్రాముఖ్యత ఉంటుంది–

మనం ఇప్పుడు ఋగ్వేదం గురించి మాట్లాడు కుంటున్నాం అంటే ఇప్పుడు మనం క్రీ.పూ. 1500 నుండి 1000 సంవత్సరాల మధ్య ఉన్నామన్నమాట.

క్రీ.పూ. 1700లలో సింధూనాగరకత పతనానంతరం మనం చెప్పుకునే ఆర్యుల జీవన చరిత్ర ఇది. అందులో చక్రం వినియోగం (రథం) గురించి చర్చించే అంశం మనది.

## రథాలు – రథచక్రాలు

ఒకేఒక చక్రంగల రథం, రెండుచక్రాల రథాలు, మూడు చక్రాల రథాలు, ఏడు చక్రాల రథాల గురించి ఋగ్వేదంలో ఉంది. చక్రాలు లేని రథం గురించి కూడా (4–26–4) ఉంది. బహుశా ఇవి, హిమాలయ ప్రాంతాల్లో లాగే స్లెడ్జి బళ్ళు కావొచ్చు. ఋగ్వేదంలో కనిపించే సాంకేతిక నిపుణులు (ఇంజనీర్లు) ఋభువులు. వీరు రహదార్ల నిర్మాణంలో, భవనాల నిర్మాణాల్లో, నీటి చెరువుల నిర్మాణంలో, ముఖ్యంగా రథనిర్మాణాల్లో ఆరితేరినవారు.

"ఋగ్వేదం 1వ మండలం 111వ సూక్తంలో మొదటి రెండు ఋక్కుల్లో కుత్స అంగీరసుడు ఋభువుల గురించి ఇలా చెప్పాడు.

**"తక్షన్ రథం సువృతం విద్మనాపసస్తక్షన్ హరీ ఇన్ద్రవహా వృషణ్వసూ"–**



''బలమైన చక్రాలుగల సుందరమైన రథాన్ని నిర్మించి, దానికి బలమైన గుర్రాల్ని పూన్చి ఇంద్రునికి సమర్పించారు" అని దీనర్థం.

ఇంకా రథాలను గురించిన వివరాలు ఋగ్వేదంలో ఇలా ఉన్నాయి.

''సూర్యుని రథం మూడు నాభికేంద్రాలున్న ఏకచక్ర రథం" (1-164-2)

"కలపతో రథాన్ని నిర్మించి, దానిమీద గోచర్మంతో కప్పారు (6-47, 26)

"......... రథానికి ఉండే సీలలు, చెక్కతో, సీసంతో చేసినవి... (2–53–19)

"చక్రంలోని ఇరుసులాగా సకల కర్మలూ వరుణున్ని అనుసరించి ఇంటాయి (8–41–6)

"మూడు మూలలు, మూడు చక్రాలుగల రథంపై అశ్వనులారా! సోమాన్ని సేవించడానికి రండి!'' (8–74–8)

''వేగంగా పరుగులు తీసే గుర్రాలు, రథం ఇరుసును వణికించును. సోమం కక్షీవంతుని వణికించును"

– (10–61–16)

అలాగే...

రథాన్ని " పలాశ, శాల్మక కలపతో నిర్మించినట్లు" (10–85–20)గా ఉంది.

స్తోత్రాన్ని, రథాన్ని పోలుస్తూ రథనిర్మాణాన్ని వివరించిన అందమైన వర్ణన ఋగ్వేదంలో ఉంది.

సూర్యుని పుత్రిక సూర్య. ఈమెకు సోముణ్ణి ఇచ్చి వివాహం చేయాలనుకొంటారు. కానీ అశ్వనుల్ని పెళ్ళాడింది. అశ్వినులు వైద్యులు. ఇప్పటి వైద్యుల్లా అప్పుడు కూడా వారు బాగానే సంపాదించినట్లు ఉన్నారు. వీరి రథం మూడుచక్రాలది. రథంమీద గోచర్మానికి బదులు బంగారం, వెండి, రాగి మిశ్రమాలతో చేసిన రేకుల్ని పొదిగారు (1–183–1). అలాంటి వీరి రథాన్ని వర్ణిస్తూ 10–85 లో 6 నుండి 14 వరకూ గల ఋక్కుల్లో ఇలా ఉంది.

"ఈ స్తోత్రం రథానికి **దండం** (పోలు). దీని ఛందస్సు రథానికి **లోపలి భాగాలు**. సూర్యచంద్రులు **రథ వాహకులు**, చెవులు **రథచక్రాలు**, మార్గం ఆకాశం, వాయువు **ఇరుసు**" ఇలా ఉంది ఈ వర్ణన.

రథాన్ని, గుర్రాల్ని పూన్చడానికి కావలసిన త్రాళ్ళు, పట్టెళ్ళు, కొరడా, కళ్ళేలు (6–75–6) గురించిన సమాచారం అక్కడక్కడా ఉంది. రథానికి గుర్రాల్ని తాళ్ళతోనే కట్టడం ఉత్తమం. కానీ 'కాడి' ఉన్న రథం గురించి కూడా 1–134–3 లో ఉంది. ఇది తొలినాటి రథం కావొచ్చు.

అలాగే....

ఒక్కరు మాత్రమే కూర్చొనే రథాలు, ఇద్దరు కూర్చొనే రథాలు,



ఇద్దరు కూర్చోగా ఒక సారధితోలే రథాల వివరాలూ ఉన్నాయి.

## రథాలు – వాహకాలు

రథాన్ని రకరకాల జంతువులు లాగే విధానం అనేకచోట్ల అనేక రకాలుగా కన్పిస్తుంది. ఋగ్వేదంలో కూడా ఆ వివరాలున్నాయి–

మరుత్తుల రథం ఆడలేళ్ళు లాగే రథం (1–85–45)

పూషరథం మేకలు లాగే రథం (6–55, 4)

ఇంద్రుని రథాన్ని వెయ్యి గుర్రాలు లాగుతాయి (6–47–78)

ఇక ఆవులాగే రథం కూడా ఉంది.



**"గౌర్ధయతి మరుతాం శ్రవస్యుర్మాతా మఘోనామ్ యుక్తా వహ్నీ రథానామ్"**

(8–94–1 లేదా 8–83–1)

"ధనవంతులైన మరుత్తులకు గోవు తల్లివంటిది. అది సోమపానం చేస్తుంది. అన్నం అంటే దానికి ఇష్టం. అది వారి రథాన్ని లాగుతుంది"–

(పై ఋక్కుని ఎనిమిదో మండలంలో 94వ సూక్తంగానూ, 83వ సూక్తంగాను చెప్పడం జరిగింది. గమనించగలరు. ఋగ్వేదంలో 8వ మండలంలో 49వ సూక్తం నుండి 59వ సూక్తం వరకు ఉన్న 11 సూక్తాల్ని వాలఖిల్య సూక్తాలంటారు. కొందరు వీటిని లెక్కిస్తారు. కొందరు వీటిని తీసేసి లెక్కిస్తారు. దానివల్ల రెండు రకాలుగా సూక్తాల సంఖ్యల్ని ఇవ్వడం జరిగింది.)

ఇలా– చక్రం దాని అనువర్తనాల్ని ఆర్యులు ఉపయోగించుకున్నారు.

సింధూ ప్రజల్నుండి బావుల ద్వారా భూగర్భ జలాల్ని వెలికి తీయడం నేర్చుకున్న ఆర్యులు, వాటికి రాతి కప్పీలు తగిలించి మరింత మెరుగు పరచినట్లే–

ఎద్దులు లాగే చెక్క చక్రాల బండిని మరింత మెరుగు పరచి , బలమైన ఆకుల చక్రాలతో వేగంగా కదిలే రథాలు నిర్మించారు. ఈ రథచక్రాల సాంకేతికతను వారు ఈజిప్టు వారి నుండో, గ్రీకుల నుండో, మరెవరినుండో దిగుమతి చేసుకోలేదు. వారు స్వయంగా అభివృద్ధి పరచుకున్నారు.

దీనికి కారణం వారికి ఇనుము తెలియడం. రాగి, సీసం, లాంటి లోహాలు తెలియడం, కంచులాంటి మిశ్రమ లోహాల్ని తయారు చేసుకోగల సాంకేతిక నైపుణ్యం, ఈ లోహాల సీలలు, రేకులతో బలమైన చక్రాల్ని నిర్మించకోగలగడం. ఇది ఒక కారణం. కాగా గుర్రాలతో రథాలు నడిపించడం మరోకారణం.

**ఇలా వేదాల్లో ఉన్న విజ్ఞానాన్ని చెప్పకుండా– అన్నీ వేదాల్లో ఉన్నాయని బుకాయిస్తూ, విమానాలు, రాకెట్లు, ఉప గ్రహాలు, టి.వి.లు, కంప్యూటర్ల గురించి , అణుశక్తి గురించి సర్వం వేదాల్లో ఉన్నాయంటూ ప్రచారం చేయడమంటే వేదాలకి తప్పుడు వ్యాఖ్యానాలు ఇవ్వడమే. వేదాల్ని అవహేళన చేయడమే! ఇలాంటి వారి వల్లే వేదాలు నిజంగా భ్రష్టుపట్టి ప్రజలకు దూరమవుతున్నాయి. చారిత్రక ప్రాధాన్యత కోల్పోయాయి.**

అయితే....

ఋగ్వేదంలో సాంకేతిక నైపుణ్యానికి ప్రతీకగా చెప్పుకునే "ఋభువులు" (ఇంజనీర్లు) నిజంగా అభినందనీయులే! ఋగ్వేదంలోని మనకు కనిపించే ఈ సాంకేతిక ప్రగతి, ఆర్యులు ఇక్కడి కొచ్చి స్థిరపడ్డాక సాధించిన ప్రగతే! సింధూ ప్రజల్నుండి నేర్చుకున్నదే!

**సింధూకాలం నాటి ఎద్దులబండి ఋగ్వేదకాలంలో గుర్రాల రథంగా పరిణామం చెందిందే! వ్యావసాయిక రంగాన్ని సింధూ ప్రజల నుంచి సేకరించి, ఆర్యులు ఎలా అభివృద్ధి చేశారో రవాణారంగంలో కూడా అలాగే చేశారు. ఈ విషయంలో కూడా ఆర్యులు విజేతలైన పరాజితులే. సింధూ ప్రజలు పరాజిత విజేతలే కాబట్టి భారతీయ విజ్ఞానానికి ఆర్యులు కూడా వారసులే కాని, నిర్మాతలు కాదు!**

**ఎందుకంటే...ఇక్కడ విజ్ఞానం వారితోనే మొదలు కాలేదు !!**

*(ఇంకా వుంది)*

**ఒకసారి కనిపెట్టిన తర్వాత, అన్ని సత్యాలను అవగాహన చేసుకోవటం చాలా తేలిక. కష్టమైనదేమిటంటే, వాటిని కనిపెట్టటం. – గెలీలియో గెలీలి**

# విల్లు తెచ్చిన విజయం

**"తే ఆచరంతీ సమనేవ యోషా మాతేవ పుత్రం బిభృతాముపస్థే"**

"ఈ బాణాలు అన్యమనస్సుతో ఉన్న యువతిలాగ శత్రువును ఆక్రమిస్తాయి.
ఈ అంబులపొది తల్లి బిడ్డను రక్షించినట్లు తన రాజుని రక్షిస్తుంది" – (ఋగ్వేదం: 6-75-4)

## రక్షణాయుధాలు – మారణాయుధాలు

మానవ నాగరకతా వికాసం ఒక సజీవప్రవాహం. ఆ వికాసానికి తనవంతు తోడ్పాటు అందించిన వస్తువుల్లో ఆయుధాలు కూడా ఉన్నాయి. ఆయుధం హింసకు మాత్రమే సంకేతం కాదు. ఎదుటివారి బ్రతుకుని అకారణంగా హరిస్తే హింస అవుతుంది. కానీ, హింసనుండి రక్షణ పొందడానికి ఉపయోగపడ్డప్పుడు అది మారణాయుధం అవ్వదు. రక్షణకవచం అవుతుంది. రక్షణాయుధం అవుతుంది.



బొర్రా గోవర్ధన్
9390600157

జీవుల మనుగడకోసం సాగించే పోరాటంలో ప్రతిజీవి ప్రకృతితో పోరాటం జరపడం ఒక్కటే కాదు, తన చుట్టూ ఉన్న జీవుల్తో కూడా పోరాడాలి. ఈ పోరాటంలో విజేతే ఎంపిక కాబడుతుంది. ఐతే, ఈ ఎంపికలో శారీరక బలాబలాలకి, జీవుల పరిణామానికీ సంబంధం లేదు. ప్రకృతిని జయించగల బలహీనమైన ప్రాణులు కూడా 'మహాబలులే'. ఎంతటి జంతువునైనా చంపి తినగల రాకాసిబల్లులంత బలహీనమైన ప్రాణులు మరేవీ లేవు. బలహీనమైనవి కాకపోతే... ఎందుకు అంతరించిపోతాయి..?!

నిజం చెప్పుకోవాలంటే... ఏ జంతువు ప్రాకృతికంగా బలహీనమైందో ఆ జంతువు ఎక్కువ హింసకు పూనుకుంటుంది. అలాంటి జంతువుకే ఆయుధాలూ అవసరం అవుతాయి. పశువులకు కొమ్ములు, క్రూరజంతువుకి కోరలు, గోళ్ళు అమరింది ఇందుకే...

వీటన్నింటికంటే బలహీనమైంది కోతి. దీనికి కోరలులేవు, కొమ్ములు లేవు, పంజా లేదు. ఉన్నది తోకే. తోకను ఎలా ఆయుధంగా మలచుకోగలదు? అందుకే అది ముందరికాళ్ళను చేతులుగా మార్చుకొంది. మహా ఆయుధంగా మలచుకొంది.

రాళ్ళు విసరడం, కొమ్మలు, కర్రలు విసిరి కొట్టడం... ఈ పనులన్నీ చేతుల వల్లే చేయగలిగింది– ప్రకృతిలో దొరికిన 'వస్తువుల్నే' ఆయుధంగా వాడుకొంది. ఈ రక్షణ ఆయుధాలన్నీ ప్రకృతి నుండి రక్షణకు కావు. పరిసరజీవుల నుండి రక్షణకే!

ఒక రాకాసిబల్లి మరో రాకాసిబల్లిని చంపితిన్నట్లు, ఒక పాము మరోపామును మింగినట్లు ఒక మనిషి మరోమనిషిని 'చంపుకు తినడం' మొదలుపెట్టాక రక్షణకోసం రూపొందిన ఈ ఆయుధాలు మారణాయుధాలుగా మారాయి.

ఈ చంపుకు తినే క్రమంలోనే– మానవ సమాజంలో రకరకాల సామాజిక దశలు మారాయి.

ఈటె, రాయి, గద, విల్లు, తుపాకి, అణుశక్తి – ఇలా ప్రతిదీ ఇటు రక్షణ ఆయుధంగానూ, అటు మారణాయుధంగానూ ఉపయోగపడ్డవే!

బ్రతికించే ఆయుధాన్ని, బ్రతుకుల్ని తుంచే ఆయుధంగా మార్చడమే 'హింస'. లేకుంటే 'ప్రగతే'.

రాతియుగం మానవుడు తన రక్షణకోసం రూపొందించుకున్న రాతి ఆయుధాలు– బానిస యుగంలో బానిసల్ని హింసించడానికి, రాజరిక యుగంలో రాజ్యాలకు రాజ్యాలు నెత్తుటేరుల్లో పడి మునగడానికి కారణమయ్యాయి, మారణాయుధాలుగా మారాయి.

## స్థితిశక్తి – గతిశక్తి

మానవజాతి వైజ్ఞానిక చరిత్రలో చక్రం ఎంతటి గొప్ప ఆవిష్కరణో... అంతటిది కాకపోయినా తుపాకి వచ్చేవరకూ విల్లుకూడా అలాంటి ఆవిష్కరణే.

యాంత్రికశక్తిని ఉపయోగించడం చక్రంతో ఎలా మొదలయ్యిందో, అలాగే స్థితిశక్తిని గతిశక్తిగా మార్చి, తక్కువశక్తితో ఎక్కువ ఫలితాన్ని పొందే ప్రక్రియ లేదా యంత్రలాభం విల్లుతో ప్రారంభమయ్యింది. క్రీ.పూ. 8000 సంవత్సరం నాడే విల్లు వాడకం మొదలైంది. అప్పుడు విల్లు ఇప్పటి విల్లులా ఉండేది కాదు.

ఒక రెండు మూరలు పొడవైన వెదురు బద్దను ఒకవైపున నేలలో పాతేవారు. పై అంచును వెనక్కి వంచి ఆ చివర ఒకరాతిని ఉంచి, ఒక్కసారిగా వదిలిపెట్టేవారు. వంగిన బద్ద స్థితిస్థాపకత చెంది తిరిగి చాలా వేగంగా యధాస్థితికి వెళ్లిపోతుంది. అలా వెళ్ళినప్పుడు దానిలోని స్థితిశక్తి గతిశక్తిగా మారి మరింత 'శక్తిని' ముందుకు నెట్టేస్తుంది. ఆ శక్తి బద్ద చివరనున్న రాయిద్వారా వేగంగా ప్రసరిస్తుంది. ఆ రాయి బలంగా తగిలి అవతలి జంతువు ఒక్కదెబ్బకే పడిపోతుంది.

ఇది 'అర్థవిల్లు'. ఈ విల్లు కాలక్రమలో పూర్తివిల్లుగా మారింది. విల్లుపొడవు, వింటికి కట్టిన నారి(తాడు) పటుత్వం, విల్లుగా మలచిన బద్దలోని స్థితిస్థాపకత, బాణం తీరుతెన్నులు – వీటన్నింటి ఫలితం వింటినుండి వెలువడిన శక్తిగా ఫలితాన్ని చూపిస్తుంది.

కత్తి, ఈటెల్లాంటి ఆయుధాలశక్తి కండరశక్తిని బట్టి పనిచేస్తాయి. భుజబలం ప్రధానం. పైగా మనం కొట్టాల్సిన వస్తువు దగ్గరగా ఉండాలి. హోరాహోరీ పోరాటం అది. ఒక జంతువు మరో జంతువుతో కొమ్ములతోనో, పంజాతోనో పైనపడి జరిపే కుమ్ములాట లాంటిది. కత్తి, గద, ఈటె పోరాటాలు ఇలాంటివే.

కానీ, విల్లు అలాకాదు. మన కండరబలానికి, విల్లుగా వంగిన బద్దలోని స్థితిస్థాపకశక్తి తోడవుతుంది. పైగా ఆ బలం ఒకే ఒకబాణం ములుకుచివర కేంద్రీకరించబడి వుంటుంది. ఆ బాణం చాలాదూరంగా ఉన్న వస్తువుని ఛేదిస్తుంది. అంటే పోరాడే వస్తువుకు దూరంగా ఉండి, తగినంత రక్షణ వలయం లో ఉంటామన్నమాట. దూరం అంటే కాలమే. మన దగ్గరకు రాకముందే వస్తువుని పడగొడతాం. అంటే తక్కువకాలంలో ఎక్కువఫలితం ఉంటుంది. అంటే పనివేగం పెరుగుతుంది.


ఇలా– విల్లు వల్ల అనేక లాభాలు వచ్చిపడ్డాయి. ఎవరైతే... ఇలాంటి ఆధునిక పరికరాల్ని, ఆధునిక విజ్ఞానాన్ని అంది పుచ్చుకుంటారో వారు విజేతలవుతారు.

ఆర్యుల అలాగే విజేతలయ్యారు.

## తొలినాటి విల్లు

విజ్ఞానం ఎక్కడి నుండో ఊడిపడదు. మానవుల నైపుణ్యమే విజ్ఞానంగా రూపొందుతుంది. అలా విజ్ఞానంగా రూపొందిన వాటిలో విల్లుది అగ్రతాంబూలం. విల్లు ఆవిష్కరణతో కొత్తరాతియుగం కాలగర్భంలో కలసిపోవడం మొదలుపెట్టింది. లోహయుగానికి ద్వారాలు తీసింది. పాతరాతియుగంలోని కర్రముక్కులు, కొత్తరాతియుగంలోని రాతిముక్కుల స్థానంలో లోహపు ముక్కులు వచ్చి 'విల్లు'ని మహాయుధంగా మలచాయి. విల్లుని విశేషరీతిలో మలచిన వారిలో భారతీయులు అగ్రగణ్యులే! మనకు లభించిన ఆధారాల్ని బట్టి క్రీ.పూ. 6000 సంవత్సరాలనాటి భీంబేటక్‌లోని గుహచిత్రాల్లో విల్లు ఒక చేత్తో, విల్లంబుల్ని మరోచేత్తో పట్టుకొన్న బొమ్మలు ఉన్నాయి. అక్కడ వేసిన కొన్ని చిత్రాల్ని బట్టి అడవిదున్నల్ని, ముళ్ళపందుల్ని వీటితో వేటాడేవారని తెలుస్తుంది.

అడవి పందుల్ని వేటాడ్డం మహా ప్రమాదం. చాలాకష్టం. అందుకే 'కందం చెప్పిన వాడే కవి. పందిని కొట్టినవాడే బంటు' అనే సామెత కూడా వచ్చింది. భీంబేటక్ మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ దగ్గర్లో ఉంది.


సింధూనాగరకత కాలం నాటి చిత్రం

సింధూనాగరకత కాలం నాటి ఉత్తర భారతదేశంలోని బుర్జహోంలో ఒక సమాధిపై గీసినచిత్రంలో (క్రీ.పూ. 2800–1500) ఒక జింకను శూలంతో, బాణంతో చంపుతున్న చిత్రం ఉంది.

దాదాపు అదేకాలం (క్రీ.పూ. 2600) నాటి ఒక రాగిముద్రలో చిన్నవిల్లు, బాణంతో ఉన్న ఒక మనిషిబొమ్మ ఉంది. పైన పేర్కొన్న బొమ్మలన్నీ మగవారివి కావడం విశేషం.

అంటే సింధూ ప్రజలకు విల్లువాడకం తెలుసు. కానీ సింధూప్రాంతంలో దొరికిన ఆయుధాల్లో కత్తులు, గొడ్డల్లు, ఈటెలే ప్రధానంగా ఉన్నాయి. ఇక ఈజిప్టులోకూడా క్రీ.పూ. 2600 నాటి ఒక యుద్ధవీరుడు రథం మీద విల్లు సంధిస్తున్న బొమ్మ దొరికింది. అలాంటి బొమ్మలే మెసపుటోమియాలో కూడా దొరికాయి. కోటకు కాపలాగా ఉన్న సైనికులు సంధిస్తున్న విల్లు బొమ్మలవి–

అంటే... క్రీ.పూ. 3000 నుండి 2000 మధ్య విల్లు ప్రపంచంలో అన్ని జాతుల్లో ఆయుధంగా మారింది.

విల్లు ప్రయోగం అనేకరకాలు...

విల్లు ఒక కొనను నేలకు ఆనించి, దాన్ని కాళ్ళతో తన్నిపట్టి బాణం విడవడం ఒక పద్ధతి.

విల్లును ఎత్తిపట్టి వింటెతాటిని గుండెలదాకా లాగి బాణం విడవడం మరోపద్ధతి.

విల్లుని ఎత్తిపట్టి, వింటితాటిని భుజాల వరకూలాగి వదలడం ఇంకోపద్ధతి.

అలాగే... విల్లుని ఎత్తిపట్టి, వింటినారిని చెవులదాకా లాగి... చూపుని బాణం ముక్కు మీద కేంద్రీకరించి, బాణాన్ని



సంధించడం వేరొకపద్ధతి.

ఈ ఆఖరిపద్ధతిని 'ఆకర్ణాంతం నారిని సంధించి శరసంధానం చేయడం' అంటారు. ఇది ఆర్యుల పద్ధతి.

**"తస్య సాధ్వీరిషవో యాభిరస్యతి నృచక్షసోదృషయే కర్ణయోనః"**

– (ఋగ్వేదం 2-24-8)

'అతను విడిచిన బాణం కార్యం సాధించి తీరుతుంది. కర్ణమే బాణముల జన్మస్థానం'

ఋగ్వేదంలో విల్లుగురించి, బాణాల గురించిన విశేషాంశాలు చాలా ఉన్నాయి.

రుద్రుడు గొప్ప ధనుర్ధారి అని ఉంది.

''ఓ రుద్రా! నీవు గొప్ప ధనుర్ధారివి! ధనవంతుడగు యజమానికోసం నీవు ధనుస్సు నారిని సంధించకు! మా పిల్లలకి, వారి పిల్లలకి సుఖాన్ని కలిగించు"

(ఋ: 2-4-10, 14)

*(ఈ సూక్తంలో 10 నుండి 15 వరకు ఉన్న ఋక్కులు ఖిలమంత్రాలు. కొన్నింటిలో ఉండవు)*




## రెక్కలబాణం

విల్లు నిర్మాణంలో ప్రధాన భాగాలు మూడు. 1. వింటి బద్ద. 2. వింటినారి. 3. విడిచే బాణం. మరలా విడిచేబాణంలో మూడు ప్రధానభాగాలు. ఒకటి: ముక్కు, రెండు: బాణంపుల్ల, మూడు: పుల్ల మొదట ఉండే ఈకలు . ఈ బాణం నిర్మాణంలో 'ఈకలు' ఉంచడం అనేది గొప్ప వైజ్ఞానిక అంశం. ఆధునికం. బాణానికి దిశానిర్దేశాన్ని, స్థిరత్వాన్ని కలిగించేవి ఈ ఈకలే.

మనం క్రీ.పూ. 6000 సంII నాటి భీంబేటక్ బాణాల నుండి క్రీ.పూ. 1500 నాటి సింధూనాగరకత నాటి బాణాలలో గానీ, ఈజిప్టు మెసపటోనియా చిత్రాలలోగానీ బాణాలకి ఈకలు ఉన్న తీరు కన్పించదు. ఈ ఈకల వివరణ ఋగ్వేదంలోవుంది.

**"యుదన్తరిక్షే పతయంతి పర్ణినో దివ్యవస్తిగ్మ మూర్ధనః"**

-(6-46-11)

బృహస్పతి పుత్రుడు శంయుదు చెప్పిన ఈ ఋక్కులో- 'ఓ ఇంద్రా! రెక్కలు కలిగిన బాణాలు ఆకాశం నుండి అగ్నిధారల్లా రాలిపడుతున్నప్పుడు ఎవరు మమ్మల్ని రక్షిస్తారో వారిని సంరక్షించు"- అని ఉంది

ఇక ఋగ్వేదం ఆరో మండలంలోని 75వ సూక్తం మొత్తం బాణాలు, విల్లుల గురించి చెప్పినదే!

ఇది యుద్ధవర్గ సూక్తం. దీని కర్త భరద్వాజపాయుడు. ఆయన ఇలా చెప్పాడు-

**ధన్వనా ధన్వనాజం జయేమ ధన్వనా తీవ్రః నమదో జయేవ ధనుః శత్రోరపకామం కృణోతి ధన్వనా సర్వాః ప్రదిశో జయేసు**

– (ఋ: 6-75-2)

"ధనుస్సుతో గోవులని జయించి తెస్తాను
ధనుస్సుతో యుద్ధాలు జయిస్తాను
ధనుస్సుతో శత్రువులను తుంచివేస్తాను
ధనుస్సుతో శత్రువుల్ని నష్టపరుస్తాను
ధనుస్సుతో సర్వదిక్కులు జయిస్తాను-" అని దీనర్థం.

ఋగ్వేదంలో గద, గొడ్డలి, ఈటెల్లాంటి రాతి ఆయుధాల ప్రస్తావనలు ఉన్నా, ఋగ్వేద ప్రజల ప్రధాన ఆయుధం 'ధనుస్సే' అనేది తేటతెల్లం చేస్తోంది ఈ ఋక్కు.

**"పరశుం చిద్ వితపతి శిమ్బలం చిద్ వి వృశ్చతి"**

– (ఋ:3-53-22)

(గొడ్డలి దెబ్బకు బూరుగచెట్టు కూలినట్లు మా శత్రువు కూలిపోవాలి)

**"ద్వితా హెూతారం మనుషశ్చ వాఘతో ధియారథం న కులిశః సమృణ్వతి** -(ఋ: 3-2-1)

ఇక్కడ కులిశం అంటే గండ్రగొడ్డలి లేదా గద.

ఇలా పరుశువు (గొడ్డలి), గదలాంటి ఇతర రాతి ఆయుధాల గురించి చెప్పినప్పటికీ.. ధనుస్సు, బాణాలగురించే గొప్పగా కీర్తించటం అంటే ఋగ్వేద ఆర్యుల ప్రధాన ఆయుధం ధనుస్సే అన్నమాట.

## హస్త కవచం - అంబుల పొది

ధనస్సు నిర్మాణం గురించి ఇలా ఉంది.

**"జరతీభిరోషధీభిః పర్ణేభిః శకునానాం**
**కార్మారో అశ్మభిర్ద్యుభిర్హిరణ్యవన్త మిచ్ఛతీన్ద్రాయేన్దో పరిశ్రమ"**

– (ఋ: 9-112-2)

("చేవదేరిన ముదురుకర్ర, పక్షిఈకలు, పదును పెట్టిన రాతి ముక్కులతో బాణాలు తయారు చేస్తారు. వడ్రంగి బాణాలు కొనేవాణ్ణి, బంగారం ఉన్నవాడు ధనికుణ్ణి వెదుకుతారు")

ముదురు కర్రను బాణంపుల్లగా మార్చడం కూడా నైపుణ్యమే! బాణంకర్ర కణుపులు, వంపులు, గరుకుతలం లేకుండా ఉండాలి. కర్రను ఇలా మలచడంకోసం ఒక రాతిపరికరాన్ని ఉపయోగిస్తారు. గట్టిరాతిలో ఒక బెజ్జంచేసి, ఆ బెజ్జంగుండా ఈ కర్రను కవ్వంలా తిప్పుతూ ఈవైపు నుండి ఆవైపుకు వచ్చేలా చేస్తారు. ఆ రాపిడికి అది నున్నగా, కావలసినంత సన్నగా తయారవుతుంది. ఆలా తరుణి పట్టిన కర్రల్ని బాణం కర్రలుగా వాడడం ఆర్యులకు తెలుసు.

అలాగే... అంబులపొది గురించి...

అంబులపొదిని వీపుకు కట్టుకొనే విధానం ఆర్యుల్లోనే కన్పిస్తుంది. దీనివల్ల ఎక్కువ బాణాలు దగ్గర ఉంచుకొనే వీలు, బాణం వెంట బాణం వేసే జోరు పెరుగుతుంది. ఇక మరో


ముఖ్య విషయం: బాణం సంధించే వ్యక్తి బాణం దూసుకుపోయే దిశకు వ్యతిరేక దిశలో అంటే వెనక్కు కొద్దిగా చాపంలాగా వంగుతాడు. ఇలా వంగినపుడు అతని శరీరానికి బలమైన తన్నుణ్ణి వెనక్కు వేసిన కాలు ఇస్తుంది. అప్పుడు శరీర గరిమనాభికేంద్రం వెన్నుపూస పైభాగంలో ఉంటుంది. ఆ స్థితిలో శరీరానికి మరింత స్థిరత్వాన్ని వీపు వెనుక మోసే అంబులపొది కల్పిస్తుంది. ఈ బరువు వల్ల వెనక్కు వేసిన కాలు మరింత బలంగా నేలను తాకుతుంది. అప్పుడు కాలికి, నేలకి ఘర్షణబలం పెరుగడంవల్ల సంధించే బాణం మరింత వేగంగా, బలంగా ముందుకు పోతుంది. కాబట్టి వీపుకు బాణాలపొది ఉండటం మేలైన విధానం– ఈ ఋక్కు చూడండి.

**"బహ్వీనాం పితా బహురస్య పుత్రశ్చిశ్చా కృణోతి సమనావగ్య ఇషుధిః సంకాః పృతనాశ్చ సర్వాః పృష్ఠేనినద్ధో జయతి ప్రసూతః"** (ఋ: 6–75–5)

('ఈ అంబులపొది బాణాలకు తండ్రి. ఎన్నో బాణాలు దీనికి పుత్రులు. బాణాలు పైనుండి లాగేప్పుడు ఈ పొది శబ్దం చేస్తుంది. యోధుని వీపుమీద నిబద్ధంగా ఉంటుంది. యుద్ధసమయంలో ఇది బాణాల్ని క్రక్కుతోంది') అనిచెప్పి, ఆ తర్వాత ఋక్కులో బాణాల వేగాన్ని

**"రథే తిష్ఠన్ నయతి వాజినః పురోయత్రయత్ర కామయతే సుషారథి"**

అని చెప్పారు. సుశిక్షితులైన రథసారథి తోలే రథ అశ్వాల్లాగా బాణాలు దూసుకుపోతున్నాయి' అని దీనర్థం.



భీంబెటక్ గుహలలో రచయిత

**"సువర్ణం వస్తే మృగో అస్యాదన్తో గోభిః సంనద్ధా పతతి ప్రసూతా యత్రా నరః సంచవిచద్రవన్తి, తత్రాస్మభ్యమిషవః శర్మయసన్** (6–75–11)

అంటే... (బాణాలకి ఈకలుంటాయి. జింక కొమ్మకొసలు దీని దంతాలు. ఇది గోచర్మ నిబద్ధం...)

దీన్నిబట్టి జింక కొమ్ముల మొనదేలిన కొసల్ని కూడా బాణాలముక్కులుగా ఉపయోగించేవారని తెలుస్తుంది. బాణాల్ని భద్రపరిచే అమ్ములపొది గోచర్మ నిర్మితం అని తెలుస్తుంది–

మరోవిషయం– ఒక చేతిలో ధనస్సు బద్దను పట్టుకుంటారు. ఆ పట్టుకున్న బొటనవ్రేలుమీద బాణం నిలబడి ఉంటుంది. పైగా అది ముందుకు వెళ్ళేముందు వ్రేలిమీదగా రాసుకుంటూ పోతుంది. అప్పుడు చర్మం ఊడిపోతుంది. దీన్ని నివారించడానికి ఆ చేతికి, వ్రేలికి చర్మపు తొడుగు ఉంటుంది– ఈ తొడుగు గురించిన వివరం ఇలా ఉంది–

**"అహిరివ భోగైః పర్యేతి బాహుం జ్యాయా హేతిం పరిబాధమానః హస్తఘ్నో...."** (6–75–14)

('హస్తఘ్నము (చేతిబాధను నివారించేది) వింటినారి బాధను నివారించును. సర్పంలాగా చేతికి చుట్టుకొనును...')

ఇక బాణాల ధాటి గురించి ......

**'ఆలాక్తాయా రురుశీర్ష్ణ్యథో యస్యా అయోముఖం**
**ఇదం పర్జన్యరేతస ఇష్వైదేవ్యై బృహన్నమః** (6–75–15)

(విషంతో కూడియున్న, హింసాత్మకమైన, లోహముఖం కల్గిన, పర్జన్యని నుండి ప్రభవించిన బాణదేవతా! నీకు నమస్కారం)

లోహం (ఇనుము, రాగి, కంచు)తో నిర్మించిన బాణంముక్కులు గురించిన ప్రస్తావన ఇది. రాతి ముక్కులు, కొమ్ము ముక్కులు, లోహంముక్కులు– ఇలా రకరకాల ముక్కులున్న బాణాలు వాడిన విధానం తెలుస్తుంది. పైగా ఈ ముక్కులకి విషంపూతలు.

ఋగ్వేదకాలం ఆర్యులు అటు రథాల్ని, ఇటు బాణాల్ని బాగా ఉపయోగించటం వల్ల విజేతలు కాగలిగారు–

## కర్ణుడు – అర్జునుడు

ఈ విజయాలు వైదిక సాహిత్యంలో కూడా కన్పిస్తాయి. రామాయణంలో దైత్యుల ఆయుధాలు కత్తులు, బల్లేలు, గదలు. వనచరులైన వానరుల ఆయుధాలు ప్రధానంగా రాతిగదలు. కానీ ఆర్య క్షత్రియుడైన రాముని ఆయుధం ధనుస్సు. రాముని విజయానికి కారణాలు అనేక మోసాలతోపాటు ఈ ధనుర్బాణాలే !. అలాగే భారతంలో కూడా భీమ, సుయోధనుల ఆయుధాలు గదలు! కానీ కౌరవసేనలో కర్ణుడు, పాండవసేనలో అర్జునుడే గెలుపు ఓటముల్ని నిర్ణయించే నిర్ణేతలు. కారణం వారిద్దరూ విలువిద్య పారంగతులు కావడమే! ఈ రెండు ప్రధాన ఇతిహాసకథల్లో రామాయణంలో విశ్వామిత్రుడు, భారతంలో ద్రోణుడు ప్రధాన విలువిద్యాచార్యులు.

పదిహేనో శతాబ్దంలో తుపాకి రావడంతో తూణీరం తల వాల్చింది. అప్పటి వరకూ విల్లూ విల్లంబుల్నే విజయం వరించింది!

ఆర్యులు, సింధూ ప్రజల నుండి విలువిద్యను నేర్చుకొని అభివృద్ధి చేశారా లేదా తాము వలసగా వచ్చిన మధ్య ఆసియా ప్రాంతం నుండే ఈ విద్యను తీసుకు వచ్చారా? అనేది పరిశోధించాల్సిన విషయమే. ఎందుకంటే...

సింధూనాగరకతలో 'విల్లు'ను ఉపయోగించిన ఆధారాలు ఉన్నాయి. క్రీ.పూ. 500 సంవత్సరంలో ఇరాన్ సైన్యంలో ఉన్న భారతీయ సైనికులు (భారతీయ రెజిమెంట్) ఇనుపబాణాల్ని ఉపయోగించేవారని గ్రీకు చరిత్రకారుడు హెరొడోటస్ తన రచనలో రాశాడు.

## భారతీయం- అభారతీయం

అయితే.. ఇక్కడ ఒక పెద్దప్రశ్న ఉదయిస్తుంది.

ఈ దేశంలో ఎప్పుడో విలువిద్య ఎరిగినప్పటికీ, తమకూ విలువిద్య తెలిసినప్పటికీ సింధూ ప్రజలు ధనుర్విద్యాప్రావీణులు ఎందుకు కాలేక పోయారు? అనేదే ఆ ప్రశ్న.

దీనికి ఇది కారణం ఇక్కడి జీవన విధానం కావొచ్చు. భారతీయ సమాజంలో విల్లుని ఒక రక్షణ ఆయుధంగానో, లేదా ఒక వేట ఆయుధంగానో ఉపయోగించారు తప్ప, ఒక మారణాయుధంగా మలచలేదు అనేది వివాదం లేని సమాధానమే అవుతుంది. సింధు ప్రజల వ్యావసాయిక సమాజాల చరిత్రలో దురాక్రమణలకీ, నరహంతక యుద్ధాలకీ స్థానం లేదు. అసలు భారతీయ వ్యావసాయిక సమాజాల సహజనైజం శాంతి, అహింసలే. అందుకే ఇక్కడి విల్లు వేటవరకే పరిమితమైంది. అభారతీయ, అనాగరిక, ఆటవిక, ఆర్య సమాజంలో మాత్రం మారణాయుధంగా మారింది. ఆర్య ప్రభువుల అధికారాన్ని అప్రతిహతంగా కాపాడ్డానికి ఆగ్నేయాస్త్రంగా, వాయవ్యాస్త్రంగా, నాగాస్త్రంగా, బ్రహ్మాస్త్రంగా అనేకరూపాలు సంతరించుకుంది. బ్రహ్మాస్త్రాన్ని అణ్వాయుధంగా, వాయవ్యాస్త్రాన్ని జీవరసాయనాయుధంగా తప్పుడు వ్యాఖ్యానాలివ్వడం ప్రజల్ని పక్కదారి పట్టించడమే. తుపాకులు, యుద్ధవిమానాలు, క్షిపణులు, రాకెట్లు, అణ్వాయుధాలు, జీవరసాయన ఆయుధాలు వంటివేవీ వేదాల్లో లేవు.

మొత్తంమీద ఆర్యులు విలువిద్యలో ఆరినతేరినవారు అన్నది నిర్వివాదాంశం. ఆ ఘనతను వారికివ్వవలసిందే. అంతేకాని ప్రపంచంలో ఏ ఆవిష్కరణ వెలుగుచూసినా 'అది మా వేదాల్లో ఎప్పుడో పేర్కొన్నార'నడం మూర్ఖపు భజనపరులు మాత్రమే చేసేపని. నిజంగా వేదాలు చదివిన వారెవ్వరూ అలా మాట్లాడరు, మాట్లాడలేరు.

తమ అధికారాన్ని కాచి కాపాడే ఈ విలువిద్యను అసలైన భారతీయులకు అందకుండా కులంపేరుతో కట్టుదిట్టం చేసింది. ఆ దుర్మార్గం ఏకలవ్యుని కథద్వారా మనకు తెలియ జేస్తుంది.

"విజ్ఞాన శాస్త్రానికి కూడా వర్గదృక్పదం ఉంటుంది. అది వర్గదోపిడికి ఊడిగం చేస్తుంది'' అనే కార్ల్‌మార్క్స్ అభిప్రాయానికి ఋగ్వేద ఆర్యులకి విల్లు అందించిన విజయమే తిరుగులేని నిదర్శనం.


# దేవరపల్లి వెంకటసుబ్బమ్మ మస్తాన్‌రావు చారిటబుల్ ట్రస్ట్

## రెసిడెన్షియల్ మేనేజర్ కావలెను

**గుంటూరు జిల్లా నిడుబ్రోలు గ్రామం, మహాత్మాపూలే కాలనీలో ప్రారంభం కానున్న దేవరపల్లి విజ్ఞాన సాంస్కృతిక మందిరం నిర్వహించుటకు రెసిడెన్షియల్ మేనేజర్ కావలెను.**

**అర్హతలు:** 1. హేతువాద దృక్పథం కలిగి, గౌతమబుద్ధ, మహాత్మాపూలే, అంబేద్కర్ ఆదర్శాలపై గౌరవం కలిగినవారై వుండాలి. **2.** సామాజిక సేవాతత్పరులై ఉండాలి, **3.** కంప్యూటర్ ఆపరేట్ చేయగలిగి, అకౌంటింగ్ తెలిసినవారై ఉండాలి., **4.** సామాజిక శాస్త్ర పట్టభద్రులకు ప్రాధాన్యత ఇవ్వబడును

**బాధ్యతలు:** **1.** సిటిజెన్ హెల్ప్‌డెస్క్ - గవర్నమెంటు సంక్షేమ కార్యక్రమములకు అప్లికేషన్లు, **2.** డిజిటల్ రీడింగ్ రూమ్, **3.** 12వ తరగతిలోపు విద్యార్థులకు సైనిక్‌స్కూల్, నవోదయ, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రవేశ పరీక్షలకు శిక్షణా తరగతులు. **4.** విద్యా ఉపకార వేతనముల అప్లికేషన్స్ మొదలగు కార్యక్రమములు నిర్వహింపగల కార్యదక్షత కలిగివుండవలెను.

**ప్రతిఫలం:** **1.** మేనేజర్ కుటుంబం (ఇద్దరు వ్యక్తులు) ఉండుటకు ఉచిత వసతి కల్పించబడును. **2.** గౌరవ వేతనం ఇవ్వబడును., **3.** కనీసం రెండు సంవత్సరములు వ్యవధి

**అర్హతలు కలిగి, సామాజిక సేవ చేయు ఉత్సాహం కలిగినవారు ఈ క్రింది ఇ-మెయిల్‌కు రెస్యూమ్ పంపి, ఫోన్‌చేసి సంప్రదించగలరు. ఫోన్: 9490437035. ఇ-మెయిల్: hdevarapalli@gmail.com**

- మీ శ్రేయోభిలాషి, హరిప్రసాద్ దేవరపల్లి

వేదాలు-విజ్ఞానం: 5

# ఋగ్వేద కూనిరాగం

"ద్వాదశారం నహి తజ్జరాయ వర్వర్తి చక్రం పరిద్యామృతస్య
ఆ పుత్రా అగ్నే మిథునాసో అత్రసప్తశతానివింశతిశ్చ తస్థు" –
**12 ఆకులు (రాశులు) గల సూర్యుని చక్రం ఆకాశంలో తిరుగుతోంది. అది ఎప్పటికీ పాతబడిపోదు.**
**అగ్ని ఆ చక్రంలో 360 పగళ్ళు, 360 రాత్రులుగా 720 రూపాల్లో తిరుగుతూ ఉంటాడు"**
– (ఋ. 1–164–11)

మనిషికి 'భయం, విజ్ఞానం' రెండూ కవల పిల్లలే. ప్రకృతి పట్ల భయం కలిగి ఎలా ప్రకృతిశక్తులు పుట్టుకొచ్చాయో, ప్రకృతి పట్ల అవగాహన కలిగి అలాగే విజ్ఞానం కూడా పుట్టుకొచ్చింది. ఏది ముందు? ఏది వెనుక? అనేది తేల్చుకోవాల్సిన అంశం కాదు. ఎందుకంటే... మానవ సమూహం ఏదో ఒకే ఒక ప్రాంతంలో దడికట్టుకొని బ్రతకలేదు. ఆ దడి దాటి బైటకు రాకుండా గడపనూలేదు. ఈ విశాల ప్రపంచంలో అది ఆఫ్రికా నుండి అన్ని దిక్కులకూ వ్యాపించింది.

ఆ సమూహాలు వెళ్ళిన ప్రతిచోటా ఒకే రకమైన వాతావరణం లేదు. ఒకేజాతి చెట్లూ లేవు. ఒకేరకం జంతువులూ లేవు. అందుకే రకరకాల జీవన పద్ధతులు ఏర్పడ్డాయి. వివిధ రకాల నాగరకతలూ, సంస్కృతులూ పుట్టుకొచ్చాయి.



బొర్రా గోవర్ధన్
9390600157

ప్రతి సమూహానికీ ఏదో ఒక కొత్త జీవనం అనేది అనివార్యం అయ్యింది.

అయినా...మనిషి ఆఫ్రికాలో ఉన్నా... ఐరోపాకి వెళ్ళినా, భారత్, చైనాలకు వచ్చినా, అమెరికా చేరినా... మనుషులందరూ ప్రతిరోజూ దర్శించే మారని అంశాలూ కొన్ని ఉన్నాయి.
అవే, ఆకాశంలోని సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు.

ఎక్కడున్నా సూర్యోదయం, సూర్యాస్తమయాలు తప్పవు. చంద్రునికి పెరుగుతూ తగ్గుతూ ఉండే 'కళలూ' తప్పవు. మనం ఎక్కడున్నా అవే నక్షత్రాలు మన వెన్నంటే వస్తున్నట్లుంటాయి.

కాబట్టి ఇతర శాస్త్రాల విషయంలో వివిధ మానవ సమాజాలు వేర్వేరుగా ఆలోచించినా అందరి ఆలోచనల్లో భిన్నత్వంలో ఏకత్వంగా కన్పించే అంశం మాత్రం ఖగోళశాస్త్రం ఒక్కటే. చైనా, భారత్, గ్రీకు, రోమన్, మెసపుటోమియా, ఇంగ్లాండ్, అక్కడెక్కడో ఉన్న అమెరికా ఖండం... అన్నిచోట్లా కొద్ది తేడాలున్నప్పటికీ ఖగోళ విజ్ఞానదర్శనం ఒకేలా దర్శనమిస్తూ ఉంటుంది.

అందరి 'ఆలోచనలూ ఒకేలా ఉన్నాయే' అనే ఆశ్చర్యాన్నీ కల్గిస్తుంది.

ఒక పున్నమి నుండి మరో పున్నమికి, ఒక నెలపొడుపు నుండి మరో నెలపొడుపుకి, ఒక అమావాస్య నుండి మరో అమావాస్యకి.... ఎక్కడైనా ఒకే కాల అవధి.

చంద్రుడు నడిచే నక్షత్రాల దారి కూడా అదే. అదే సప్తర్షి మండలం. అదే కాలపురుష మండలం. అదే రోహిణీ నక్షత్రం. అదే సిరియస్ చుక్క. అవే కృత్తికల నక్షత్రాల గుత్తి. వాటి ఆకారాలు ఎప్పుడు, ఎక్కడైనా అదే రీతి. అవే ఋతువులు. అవే కాలాలు. అవే నెలలు... అవే సంవత్సరాలు.... వాటికి పెట్టుకున్న పేర్లలోనే మార్పు.

అందుకే.. ప్రపంచంలో ఆ దరిన ఉన్న 'ఇంకా' జాతివారుగానీ, ఈ దరినున్న చైనావారు గానీ, ఈ ప్రక్కనున్న భారతీయులు గానీ, ఆ ప్రక్కనున్న మెసపటోమియన్లు గానీ, నడిమధ్యలో ఉన్న ఈజిప్టు వారు గానీ...ఖగోళ పరిశీలనలో దాదాపుగా (చాలా కొద్ది తేడాలతో) ఒకేరకమైన ఆలోచనలు చేశారు.

మనిషి మెదడు చూపించే పనితీరు ఒకే రీతిగా ఉంటుందనడానికి ఖగోళ పరిశీలనలే మంచి ఉదాహరణ.

ఇదేదో... ఒకే 'జాతి' శోధించి, సాధించిన ఏకైక ఆవిష్కరణ కాదు. ఇతర శాస్త్ర సాంకేతిక అంశాలు మానవుని జ్ఞానవిజ్ఞాన అనుభవ నైపుణ్యాల నుండి పుట్టుకొస్తాయి. వాటిలో డిస్కవరీలు, ఇన్వెన్షన్లు ఉంటాయి– ఆ వ్యక్తికో... ఆ జాతికో.. కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెడతాయి. గౌరవ మర్యాదలు కలిగిస్తాయి–కానీ, తొలినాళ్ళలో ఖగోళ దర్శనం అనేది కనుగొనడం (డిస్కవరీ) కాదు. కనిపెట్టడం (ఇన్వెన్షనూ) కాదు. కేవలం "గమనించడం, పరిశీలించడం' మాత్రమే.

తన చుట్టూ ప్రకృతిలో జరిగే మార్పులు, చెట్లు పూయడం, ఫలించడం, ఆకులు రాల్చడం, ఎండతీవ్రత,

చలితీవ్రత, వర్షపాతం... లాంటి మార్పుల్ని గమనించడం ఒక అంశం కాగా, ఈ మార్పులకి గుర్తులుగా ఆకాశంలో కన్పించే సూర్యచంద్రులు, చుక్కలతో ముడిపెట్టుకొని ఆలోచించడం మరో అంశం. ఈ రెండో అంశమే... మనిషి జీవితంలో కాలాన్ని కొలవడానికి సాధనమైంది. కాలంలో రాబోయే మార్పుల్ని ముందుగానే గమనించడానికి 'దారి' చూపింది. భవిష్యత్తును ముందుగానే దర్శించే శక్తిని ప్రసాదించింది.

ఈ మార్పులకి ఆకాశంలో సూర్యచంద్రులు, చుక్కలే కారణం అని భావించడం అనేది మానవజాతి శాస్త్రీయ దృక్పథం. ఇది అనివార్యమైన అంశం.

పగలూ-రాత్రి ఏర్పడడానికి 'భూభ్రమణం' కారణం అని తెలియకపోయినా, నెలకి చంద్రుడు భూమిచుట్టూ తిరగడమే కారణం అని గ్రహించకపోయినా, సంవత్సరానికి భూమి సూర్యుని చుట్టూ చేసే పరిభ్రమణమే మూలం అని గుర్తించలేకపోయినా, భూమి వంగి వుండడమే ఋతువులకు కారణం అని ఎరగకపోయినా... కళ్ళ ఎదుట కన్పించే మార్పులకి... సూర్యచంద్రులతో సంధానం చేసుకుని గమనించడం అనేది గొప్ప అంశం. అందుకే.. స్థానికదేవుళ్ళు, దయ్యాలు, దేవతలు ఎందరెందరున్నా... సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలూ... ఋతుదేవతలూ ప్రపంచం అంతా ఒకేతీరుగా కన్పించే దైవాలుగా ఉన్నారు.

ప్రపంచ వ్యాపితంగా అతిపురాతన సమాజాల నుండే కాలగణనకి 'సూర్యచంద్రులు చుక్కలే' ఆధారాలయ్యాయి. వాటి నడకల ఆధారంగా ......

'ఈ చెట్లు త్వరలో పూలు పూస్తాయి', 'ఈ చెట్లు త్వరలో కాయలు అందిస్తాయి', 'ఈ చెట్లు ఆకులు రాలుస్తాయి..' 'ఈ నదిలోకి త్వరలో నీరు వస్తుంది', 'ఈ నది ఫలానా అప్పుడు పొంగి, మనల్ని ముంచేస్తుంది'....ఇలాంటి భవిష్యత్తులోకి చూడగలిగిన మానవుడి మేధ మరింత వికాసాన్ని పొందింది. మరింత ఉరకలు వేసింది. ఈ ఉరకలు వేసిన ఉత్సాహం... చివరకి

ప్రకృతి మార్పుల పుట్టుపూర్వోత్తరాల నుండి... వ్యక్తుల పుట్టుపూర్వోత్తరాల వరకూ వెళ్ళిపోయింది.

ఆ చుక్క దగ్గర చంద్రుడుంటే పూలు పూస్తాయి కాబట్టి... ఆ చుక్క దగ్గర చంద్రుడున్నప్పుడు పుట్టినవాడు 'మంచివాడు' అనీ.. గొప్పవాడు అనీ.. ఈ చుక్క దగ్గర సూర్యుడుంటే వరదలు వచ్చి ముంచేస్తాయి కాబట్టి అప్పుడు పుట్టినవాడు ఉపద్రవాలు కల్గిస్తాడు అనే దాకా వెళ్ళిపోయింది.

ఇలా-

ఖగోళ పరిజ్ఞానం మానవసమాజాల్లో అటు విజ్ఞానానికీ, ఇటు జ్యోతిష్యానికీ ఒకేసారి తలుపులు తెరచింది.

సూర్యచంద్రుల్ని,చుక్కల్ని ప్రాకృతిక మార్పులకి కారణంగా భావించడం శాస్త్రీయమైతే... వారే మన వ్యక్తిగత ప్రవర్తనలకీ కారణం అని భావించడం అశాస్త్రీయం.

ఈ అంశాలు కూడా ప్రపంచవ్యాపితంగా ఒకే తీరులో కన్పిస్తూ ఉంటాయి- అయితే....

ఈ 'జ్యోతిష్యం' అనే అశాస్త్రీయమైన అంశాన్ని మాత్రం... ఒకరి నుండి ఒకరు అందిపుచ్చుకొన్నట్లుగా కన్పిస్తుంది.

గ్రీకుల నుండి మనం (భారతీయులం) జ్యోతిషాన్ని ఇలానే అందిపుచ్చుకున్నాం. ఈ జ్యోతిషాన్ని 'ఫలిత జ్యోతిషం' అంటున్నాం.

## చారిత్రక ఆధారంగా చూస్తే...

క్రీ.పూ. ఆరో శతాబ్దంలో బుద్ధుని జన్మవిషయంలో ఈ ఫలిత జ్యోతిషం కన్పిస్తుంది. ఇది బుద్ధుని తదనంతరం మూడొందల సంవత్సరాలకి వచ్చిన 'లలిత విస్తరం' అనే బౌద్ధపురాణంలోనే కన్పిస్తుంది. త్రిపిటకాల్లో కన్పించదు. అంటే క్రీ.పూ. నాటికే ఫలిత జ్యోతిష ప్రభావం మనమీద బలంగానే ఉందన్నమాట. అయితే, ఇంకా వెనక్కిపోతే... క్రీ.పూ. 800 సంవత్సరాలనాటిదైన 'వేదాంగ జ్యోతిషం' గ్రంథం ఉంది. దీన్లో 'వ్యక్తిగత' ఫలిత జ్యోతిషం లేదు. ప్రాకృతిక, ఖగోళ అంశాలే ప్రధానంగా ఉన్నాయి.

ఇంకా అంతకంటే వెనక్కిపోతే... క్రీ.పూ. 1500 నుండి క్రీ.పూ. 1000 సంవత్సరాల మధ్యకాలం. అదే వేదకాలం.

ముఖ్యంగా వేదకాలం మొదటిపాదంలోది ఋగ్వేదకాలం. అందులో ఏముంది? అనేదే మనం ఇక్కడ చర్చించే అసలు విషయం.

ఇక అంతకంటే ముందరిది సింధూనాగరకత కాలం. క్రీ.పూ. 800 నాటి వేదాంగ జ్యోతిషంలోనే ఫలితజ్యోతిషం (వ్యక్తుల జనన మరణాలకి చెందిన) లేదు కాబట్టి, ఈ వెర్రి వేదంలోనూ, సింధూ ప్రజల్లోనూ కన్పించే అవకాశం లేదు.

అసలు ఋగ్వేదంలో ఈ ఖగోళశాస్త్ర అంశాలు ఏమి ఉన్నాయో! ఎంత వరకు ఉన్నాయో! వేదకాలం ఆర్యజాతుల ఖగోళ పరిజ్ఞానం ఏమిటో చాలా కొద్దిగా చూద్దాం!

## ఋగ్వేదం - ఋతువులు

ఋగ్వేదంలో గణనీయంగానే ఖగోళ అంశాలు ఉన్నాయి. సంవత్సరం, నెలలు, తిథులు (తేదీలు), ఋతువులు, కాలాలు, ఉత్తరాయణం, దక్షిణాయనం (ఆయనాంశాలు), అతిదీర్ఘమయిన పగలు, అతి దీర్ఘమైన రాత్రి (ఆయనాంతాలు),

ఈ భూమ్మీద పగలు రాత్రి సమానంగా ఉండే రెండు రోజులు (విషవత్తులు)– ఋతువుల వర్ణనలు, రాశిచక్ర గతులు– ఇవన్నీ ఉన్నాయి. అంటే ఋగ్వేద ఆర్యుల ఖగోళ పరిశీలన ఎన్నతగిందే!

ఋగ్వేదంలో 'దీర్ఘతముడు' అనే రుషి ప్రధానంగా ఖగోళ విషయాల్ని చర్చించిన వాడు. రుగ్వేదం ప్రథమ మండలంలోని 164వ సూక్తం దాదాపుగా ఖగోళ విషయాల్ని తెలియజేసిన సూక్తమే. 52 ఋక్కులున్న ఈ సూక్తంలో దాదాపు పది ఋక్కులు ఈ విషయం మీదే ఉన్నాయి–

**"ద్వాదశ ప్రథయశ్చక్రమేకం త్రీణినభ్యానిక ఉ తచ్చికేత**
**తస్మిన్ త్సాకం త్రిశతా న శంకవోర్పిత్తా షష్టిర్న చలాచలాస్వ"**
– (1-164-48)

"12 పరిధులు (రాశులు), ఒక చంద్రుడు, ఒక సంవత్సరం, మూడు పలకలు(కాలాలు), ఐదు ఋతువులు గల చక్రం ఇది. దీన్ని ఎవరు ఎరుగును? ఈ చంద్రునికి 360 రోజులున్నాయి"

**"ద్వాదశారం నహి తజ్జరాయ వర్వర్తి చక్రం పరిద్యామృతస్య**
**ఆ పుత్రా అగ్నే మిథునాసో అత్రసప్తశతానివింశతిశ్చ తస్థు"**
– (1-164-11)

"12 ఆకులు (రాశులు) గల సూర్యుని చక్రం ఆకాశంలో తిరుగుతోంది. అది ఎప్పటికీ పాతబడిపోదు. అగ్ని ఆ చక్రంలో 360 పగళ్ళు, 360 రాత్రులుగా 720 (సప్తశతాని వింశతిశ్చ) రూపాల్లో తిరుగుతూ ఉంటాడు"

వీటిని బట్టి సంవత్సరానికి 12 రాశులని, 360 రోజులని అర్థమవుతుంది.

క్రీ.పూ. 1000 సంవత్సరాల వరకూ సంవత్సరం నిడవిని ప్రపంచంలో అనేక చోట్ల 360 రోజులుగానే గుర్తించారు.

అలాగే... ఋతువుల విషయంలో ఒక విచిత్రం ఋగ్వేదంలో కన్పిస్తుంది. ఐదురుతువులని కొన్ని చోట్ల, ఆరు రుతువులని కొన్ని చోట్ల ఉంది. ఇది తప్పు అనుకోకూడదు. ఆర్యులు మధ్య ఆసియా ప్రాంతం నుండి వలస వచ్చారనే దాన్ని ఈ విషయం బలపరుస్తుంది.

## భూమి పడక – ఋతువుల నడక

భూమి నిటారుగా నిలబడిలేదు. దాని అక్షం సూర్యుని అక్షానికి సమాంతరంగా ఉండదు. ఈజీ చైర్‌లో కాస్త వెనక్కి వాలి పడక పాటున నడుంవాల్చినట్లు $23^1/_2{}^0$ లు వంగి ఉంది. కాబట్టి కర్కటరేఖ ఉత్తరాన $23^1/_2{}^0$ ల దగ్గర, మకరరేఖ దక్షిణాన $23^1/_2{}^0$ ల దగ్గర ఉంటాయి. ఈ రెండు రేఖల మధ్య ఉన్నది ఉష్ణమండలం. ఇక్కడ ఎండలు ఎక్కువ. అలాగే ధృవాల దగ్గరి $90^0$ నుండి $23^1/_2{}^0$ లు తీసివేస్తే $66^1/_2{}^0$ లు వస్తాయి. ఉత్తర దక్షిణాలుగా ఉన్న $66^1/_2{}^0$ ల వలయ రేఖలకూ $23^1/_2{}^0$ ల కర్కట మకర రేఖలకు మధ్యన ఇరువైపులా ఉన్న ప్రాంతం సమశీతోష్ణ ప్రాంతం. $66^1/_2{}^0$ ల నుండి ధృవాల వరరకూ ఉన్న ప్రాంతాన్ని అతిశీతల మండలం అంటాం.

మొత్తం భూమిని ఇలా మూడు భాగాలు చేసి చూస్తాం. వీటిలో భూమధ్యరేఖ దగ్గర అటూ ఇటూ ( $0^0$నుండి $5^0$వరకు )ఋతువుల వ్యత్యాసం ఉండదు. ఋతువులు ఏర్పడవు. మనం (తెలుగువాళ్ళం) సుమారు $16^0$ ల ఉత్తర అక్షాంశం దగ్గర ఉంటాం. మనకు నాలుగు ఋతువులే స్పష్టంగా కన్పిస్తాయి. అలాగే $35^0$ ల మీద ఉండే మధ్యధరాతీరం పైన ఉన్నవారికి వారికి కూడా నాలుగు ఋతువులే కన్పిస్తాయి.

ఇక– $66^1/_2{}^0$ లు వెలుపల ఉన్న ధృవప్రాంతంలో కూడా – ఋతువుల వ్యత్యాసం కన్పించదు. భూమధ్యరేఖా ప్రాంతంలో ఎలా ఎల్లప్పుడూ వేసవి ఋతువు వుంటుందో, ధృవప్రాంతాల దగ్గర ఎప్పుడు శీతల ఋతువే ఉంటుంది.

**ఋగ్వేద ఆర్యుల నివాసం $30^0$–$35^0$ ల మధ్య ఉంది. వీరు మధ్య ఆసియాలో టర్కీ సమీపప్రాంతం నుండి వచ్చారు అనేది అందరి అభిప్రాయం.** టర్కీ $40^0$ ల దగ్గర ఉంది. అక్కడ ఐదు ఋతువులే కన్పిస్తాయి. ఇంగ్లాండ్, జర్మనీ ఆ ప్రాంతాల్లో నాలుగు ఋతువులే ఉంటాయి. అందుకే ఆంగ్ల సాహిత్యంలో నాలుగు ఋతువుల ప్రస్థావనే ఉంటుంది. వీరికి వర్షరుతువు తెలియదు.

ఐదు ఋతువుల ప్రాంతం నుండి, ఆరు ఋతువుల ప్రాంతానికి ఆర్యులు వలస వచ్చారు అనడానికి ఇది తిరుగులేని నిదర్శనం.

అంతేకాదు... ఆర్యులు ఇక్కడివారు కాదనడానికి కూడా ఇదే నిదర్శనం. ఇక, మరో అంశం ఏమంటే... తిలక్‌లాంటి వారు 'ఆర్యులు ఉత్తరధృవం ప్రాంతం వారు' అంటారు. అది శుద్ధ తప్పు. ధృవప్రాంతాల్లో ఋతువులే కనిపించవు.

ఋగ్వేదంలో ఐదు ఋతువుల ప్రస్థావన చాలా చోట్ల ఉంది.

**"యత్వాతురీయంఋతుభ్ణి"** – (1-15-10)

"ఓ అగ్నీ! నీవు ఋతువుల్లో నాల్గోవాడివి–"

అంటే... హేమంత, శిశిర, వసంత, గ్రీష్మ (అగ్ని), వర్ష ఋతువులు ఈ ఐదింటిలో నాల్గవది గ్రీష్మం. వీటిలో శరత్ ఋతువు లేదు. మనం ఇప్పుడు వసంతంతో కాలాన్ని లెక్కిస్తున్నాం. ఋగ్వేద రుషులు హేమంతంతో ఋతుచక్ర గమనాన్ని గణించారు. వీరి ఉగాది హేమంతంతో ప్రారంభం అవుతుంది. హేమంతాన్ని మొదటిదిగా చెప్పే రుక్కులు చాలా ఉన్నాయి.

**మనం గతంలో చెప్పుకున్న భూచలనాలు భ్రమణం, పరిభ్రమణం మాత్రమే కాకుండా భూమికి మూడోచలనం**

**ఉంది. అది అక్షచలనం. పడిపోబోయే ముందు బొంగరం చేసే పల్టీచలనం అది. దీనివల్ల విషవత్తుల్లో ఋతువుల్లో మార్పులు వచ్చి, ఋతువులు వెనక్కి జరుగుతూ ఉంటాయి.**

ఎక్కువ చెప్పకుండా ఒక విషయం చెప్తాను. ఒకప్పుడు ఉత్తరాయణం జనవరి 14న జరిగేది. ఇప్పుడు డిసెంబర్ 21న మొదలవుతుంది. అంటే 24 రోజులు ఋతుధర్మం వెనక్కి నడిచింది. ఇలా నడవడాన్ని 'విషవత్తు (వెనక్కి నడవడం) అంటారు. ఇలా వెనక్కినడచీ నడచీ తిరిగి మొదటికి రాడానికి 26వేల సంవత్సరాలు పడుతుంది. పగలూ రాత్రి సమానంగా ఉండే రోజుల్ని (ప్రస్తుతం అది శరద్ విషవత్తు-సెప్టెంబర్ 23, వసంత విషవత్తు -మార్చి 21) గమనిస్తూ వస్తే ఈ మార్పుని తెలుసుకోవచ్చు- ఈ మార్పు వేల సంవత్సరాలకి గానీ తెలియదు. ఈ మార్పుని బట్టి లెక్కిస్తే హేమంతం తొలి ఉగాదిగా ఉందంటే... ఋగ్వేదకాలం క్రీ.పూ. 1800-800 మధ్యదై ఉండాలి.



ఈజిప్టు రాశి చక్రం

అమరకోశం కూడా... **"మార్గాదీనాం మాసానాం ..."** అంటే మార్గశిరం నెల మొదలుకొని ప్రతి రెండు నెలలకు హేమంతాది ఋతువులు ఆరు వచ్చును'' అని చెప్పింది. అంటే... మార్గశిరం మొదటి నెల. హేమంతం మొదటి ఋతువు అని.

అంతేగాని, **వేదాల్ని అపౌరుషేయాలనీ, కృత త్రేతాది యుగాల పిచ్చిలెక్కలు కట్టి ఈ కాలాన్ని లక్షల సంవత్సరాలు వెనక్కి తీసుకుపోతే అది వెర్రితనమే అవుతుంది!**

ఇక- మరో రుక్కు చూడండి...

మేధాతిథి చెప్పిన ఈ సూక్తంలో

**"... గోభిర్యనం న చర్కృషత్"** - (1-23-15) అని ఉంది. షట్ ఋతువులు అంటే ఋతువులు ఆరు' అని ఉంది.

"మేము ప్రతి సంవత్సరం ధాన్యం పండించడానికి ఎద్దులతో ఎలా పొలం దున్నుతామో అలాగే పూష(సూర్యుడు) ఆరు ఋతువులందూ మాకు సోమం తెస్తాడు"- అని పై రుక్కు అర్థం.

ఈ రుక్కులో రెండు విషయాలు చాలాప్రధానం. ఒకటి ''వ్యవసాయం'', రెండు ''ఆరు ఋతువులు''. వ్యావసాయిక సమాజాలకే ఋతువుల పరిజ్ఞానం అవసరం అవుతుంది. తిరుగుబోతు జాతులకి అంతగా అవసరం లేదు. అత్యావశ్యకం కాదు. ఋగ్వేద ఆర్యులు ఆరు ఋతువుల ప్రస్థావన చేశారంటే వారు సింధూ భూమిలో స్థిరపడి పోయారు అనేది సుస్పష్టం. అలాగే... సింధూ ప్రజల నుండి నేర్చుకున్న వ్యవసాయాన్ని వంటపట్టించుకున్నారు అనేది కూడా సుస్పష్టమే! అంటే మలిరుగ్వేదకాలం నాటికి వీరు ఆరు ఋతువుల్ని గుర్తించగలిగారు, వ్యవసాయదారులయ్యారు అనే విషయానికి నిదర్శనమే ఈ రుక్కు. ఈ ఆరో రుతువే శరత్తు. దీనివివరాలు చూడండి..

**"శతమిన్న శరదో అంతి"** (1-89-9)

"నూరు శరత్తులు నిండుగా జీవించు" అని ఉంది. అలాగే... ఋగ్వేదం 6-24-7లో "ఇంద్రుణ్ణి శరత్తులు కానీ, మాసాలు గానీ ముసలివాణ్ణి చేయలేవు. 'రోజులు' కూడా ఇంద్రుణ్ణి కృశింపచేయలేవు" అని ఉంది. ఇంకా 10-161-4 లో కూడా శరత్తు ప్రస్థావన ఉంది- "వంద శరత్తులు, వంద హేమంతాలు, వంద వసంతాలు జీవించు" అని ఉంది.

## తిథులు - నెలలు

నెల అనే కాల విభజన చంద్రుని వల్లే కలిగింది. నిజానికి చంద్రుడు భూమి చుట్టూ 27 రోజులకే తిరిగి వస్తాడు. దీనికి తగినట్లే మనకు 27 నక్షత్రాలు (అశ్వని, భరణి... మొదలగు) ఉన్నాయి. కానీ అమావాస్యకి అటు ఒకటి, ఇటు ఒకటి ఈ రెండు రోజులు, అమావాస్యతో కలిపి మూడు రోజులు చంద్రుడు కనిపించడు. ఈ మూడూ కలిపి నెలపొడుపు నుండి నెలపొడుపుకు 30 రోజులు పడుతుంది. ఇలా 'నెలవంకనుబట్టి కాలాన్ని గుర్తిస్తాం కాబట్టి ఆ విభాగానికి 'నెల' అనే పేరు వచ్చింది. చంద్రుడు నెలరాజు అయ్యాడు.

**ఋగ్వేద ఆర్యులది ప్రధానంగా సౌరమానం. వేదాల్లో క్రతువులన్నీ అమావాస్యనాడే మొదలుపెట్టాలి. ఇది మధ్య ఆసియా సంప్రదాయం. గ్రీకు, మెసపటోమియన్ల విధానం. కానీ అరబ్‌లు, సింధూ ప్రజలది చాంద్రమాన సంప్రదాయం. మూలభారతీయులది, ఆ తర్వాత బౌద్ధులదీ చంద్రమాన సంప్రదాయమే. సూర్యుణ్ణి బట్టి పగలు రాత్రి, ఋతువులు, ఆయనాలు, సంవత్సరాల్ని లెక్కించవచ్చుగానీ, తిథుల్ని, నెలల్ని, పక్షాల్ని, వారాల్ని, రోజుల్లో భాగాల్ని గుర్తించటం కష్టం. అసాధ్యం.** కాబట్టి చాంద్రమాన కాలగణనం కాస్త కష్టతరమే అయినా ఖచ్చితం. కాలాన్ని కొలవడంలో ఆనాటికి నూతన విధానం. ఆర్యులకి మాసం, తిథులు, పక్షాలు అనే కాలజ్ఞానం సింధూ ప్రాంతంలో స్థిరనివాసాల అనంతరమే సాధ్యం


అయ్యింది.

పన్నెండు నెలల పేర్లు, 30 తిథుల పేర్లు పూర్తిగా ఋగ్వేదంలో కనిపించవు. కొన్నిపేర్లు మాత్రం ఉన్నాయి. అవి కనిపించనంత మాత్రాన వారికి తెలియవు అని అనుకోవడం సరికాదు–

మనం పాడ్యమి తరువాత విదియ, తదియ... అంటూ తిథుల్ని లెక్కిస్తాం. అంటే రెండవ, మూడవ అని వీటి అర్థం. చతుర్దశి (పద్నాల్గవ)తిథి తరువాత పదిహేనో రోజున వచ్చే తిథిని పూర్ణిమ లేదా అమావాస్య అని పిలుస్తాం. కానీ... ప్రతి తిథికి పూర్ణిమ, అమావాస్యల్లాగ ఒక్కొక పేరు ఉంది. వాటిలో గుంగ. కుహువు, రాకా, సినీవాలి, సామవతి, సారస్వతి... ఇలా ఉంటాయి. పౌర్ణానికి ముందు వచ్చే చతుర్దశిని సామవతి అంటారు. అమావాస్యకి ముందురోజైన చతుర్దశిని 'సినీవాలి' అంటారు. పైన చెప్పిన పేర్లు కొన్ని రుగ్వేదం రెండో మండలంలో ఉన్నాయి.

**"యాగుంగూర్యా సినీవాలీయా రాకా యా సరస్వతీ..."**

(2–32–8)



సింధూనాగరకత తవ్వకాల్లో లభించిన ముద్ర

గృత్సమదుడు ఈ సూక్తంలో సినీవాలి విశేషణాన్ని నొక్కి చెప్పాడు. దేవతలకు ఇష్టమైనది సినీవాలి (అమావాస్య ముందురోజు) అని ప్రశంసించాడు.

రోజుల తర్వాతి విభజన 'వారం'. ఇది ఋగ్వేదంలో లేదు. 'వారం' అనే కాలవిభజన బౌద్ధులకాలం నాటికీ లేదు. ఇది క్రీ.శ. తర్వాత గ్రీకుల నుండి తెచ్చుకున్నదే!

ఇక, పక్షం (పదిహేనురోజులు) విభజన ఋగ్వేదంలో ఉంది.

"వర మిథునంబుగా వెలుగు బంధుర రాత్రి దిన ద్వయంబు..." అన్నారు నేమానివారు–

**"నానాచక్రాతే యమ్యా అవపూంషి...** (2–55–11) రాత్రి, పగలు జంటలు. ఎన్నోరూపాలు ధరిస్తాయి. అవి నల్లని, తెల్లని రంగుగలవి. ఒకటి కృష్ణవర్ణం, రెండవది అర్జునవర్ణం..." ఇలాంటి పదిహేనురాత్రులు, పదిహేను పగళ్ళు ఒకపక్షం అని.

ఋగ్వేదం 3–27–1లో "ఋతువులారా! మాసాలూ, పక్షాలు (అర్ధమాసాలు) మా యజమాని సుఖాన్ని కోరుకొంటున్నాయి అని ఉంది.

## ఇక... అధికమాస విషయం

**ఇది చాంద్ర సంవత్సరాన్ని, సౌర సంవత్సరంతో సమన్వయంచేసే ప్రక్రియ. చాంద్ర సంవత్సరానికి 354 రోజులు. సౌర సంవత్సరానికి 365 రోజులు కాబట్టి ప్రతి మూడేళ్లకు ఒక అధికమాసం వస్తుంది.** ఇలా అధికమాసాల్ని చేర్చి రెండు విధానాల్ని సమన్వయం చేసే ప్రక్రియ ఆర్యులకి తెలుసు–

**"వేద మాసోధృవవ్రతో ద్వాదశ ప్రజాపత్ణ వేదాయ ఉపజాయత్"** (–25–8)

"వరుణుడు పన్నెండు నెలల్ని, ఉపజాతమైన (అధికమాసాన్ని) మాసాన్ని కూడా ఎరుగును"

అలాగే, 1–164–15లో కూడా ఆరు ఋతువులు రెండేసి నెలలతో ఉంటాయి. అని చెప్పి సూర్యుని వల్ల ఏర్పడ్డ ఋతువుల్లో ఏడోది 'అధికరుతువు' అని ఉంది.

మరో ముఖ్యవిషయం:

**"చతుర్భి సాకం నవతించ నామభిశ్చక్రం నవృత్తం వ్యతీగమ్ రవీవివత్**

**బృహచ్ఛరీరో విమియాన ఋక్వభిర్యువా కుమార్ణ పత్యేత్యాహవం** – (1–155–6)

"హంసరూపుడైన విష్ణువు సంవత్సరాన్ని 94 గమనాలుగా తిప్పుతున్నాడు. అట్టికాలం అనే ఆత్మగల విష్ణువు గొప్పదేహం కలవాడు..."–

ఈ 94 గతులు ఇవి– సంవత్సరం1, ఆయనాలు 2, నాభులు(కాలాలు)3, ఋతువులు 6, నెలలు 12, పక్షాలు 24, అహోరాత్రులు 30, సంధ్యలు 4, రాశులు 12. ఇవి మొత్తం 94. సంవత్సరంలోని కాలచక్రాలు.

అలాగే 27నక్షత్రాల్లో మఖ, పుబ్బ, ఉత్తర నక్షత్రాల పేర్లు ఋగ్వేదం 10–85–13 వ రుక్కులో ఉన్నాయి.

ఇప్పటి వరకూ మనం ఋగ్వేద ప్రజల ఖగోళ కాలపట్టికల్ని చూశాం. ఇప్పుడు మరో ముఖ్యమైన రుక్కుని చూద్దాం–

## ఋతుపవనాలు – ఋగ్వేద ఋతువులు

ఋగ్వేదంలో ఇంద్ర, అగ్ని, వరుణుల స్తోత్రాలు ఎక్కువగా ఉంటాయి. ఇంద్రుణ్ణి తీసి పక్కన పెడితే, అగ్ని, వరుణులు ప్రకృతి శక్తులు. వరుణుడంటే వానదేవత. వ్యవసాయదారులకే కాదు, పశుపాలకులకి కూడా వర్షం చాలా అవసరం. ప్రపంచంలో వర్షాలు, నదులూ పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లోనే మానవనాగరకతలు పరిఢవిల్లాయి. కాబట్టి మానవ జీవనానికి వర్షాలు ఒక మూలాధారం.

వర్షాలు ప్రధానంగా రెండురకాలు. ఒకటి: ఋతుపవన వర్షాలు. సైక్లోన్లు, సైఫూన్లు, టైఫూన్లు లాంటి తుఫానులు. విశాల జల రాశిపై ఏర్పడే అల్పపీడనాల వల్ల కలిగే వర్షాలు. ఇవ్వన్నీ సముద్రతీరప్రాంతాల్లో సంభవిస్తాయి. సముద్రతీరం ఒక్కటే కాదు, అక్షాంశాలు, సూర్యునిదిశ కూడా వీటికి కారణం.

ఇక రెండోరకం వర్షాలు సంవహన వర్షాలు. ఇవి వర్షరుతువుల్లోనే సంభవించినా తుఫానులాంటి వానలు కావు. ఇవి భూమధ్య రేఖాప్రాంతంలో, కర్కట, మకర రేఖాప్రాంతాల్లోని విశాల భూతలంపై స్థానికంగా ఏర్పడ్డ అల్పపీడనాలవల్ల సంభవిస్తాయి. ఋగ్వేదంలో ఎప్పుడు, ఎక్కడ వర్షాన్ని వర్ణించినా పెద్ద పెద్ద మేఘాలు, భయంకరమైన ఉరుములు, పిడుగులతో కుంభవర్షం కురిసినట్టుగానే ఉంటాయి. వరుణుని ప్రతాపాన్ని ఉరుములతో, మెరుపులతో వర్ణిస్తారు. ఇలాంటి పెద్ద పెద్ద మేఘాల్ని క్యుములోనింబస్ మేఘాలంటాం. వీటి ద్వారా కలిగే వర్షపాతం అధికంగా ఉంటుంది. కుండపోతగా ఉంటుంది. ఉరుములు, మెరుపులు లేకుండా వర్షం పడుతుంది. ఈ వర్షాన్ని సంవహన వర్షాలంటాం.

భూమధ్యరేఖాప్రాంతంలో సంభవించే వర్షపాతం అంతా ఇదే. అలాగే ఋగ్వేదంలో వర్ణించిన వర్షపాతం కూడా ఇదే!

ఋతుపవన వర్షాల రాకడ నాలుగైదు రోజుల ముందే తెలుసుకోవచ్చు. కానీ, ఈ వర్షాల రాకడ తెలుసుకోలేం. అప్పటికప్పుడు మబ్బులు పట్టి వాన కుమ్మరిస్తాయి. భూమధ్యరేఖా ప్రాంతంలో పగలంతా ఎండ తీవ్రంగా ఉంటుంది. రాత్రికి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడుతుంది. ఇలాంటి వర్షాలే కర్కట, మకరరేఖ ప్రాంతాల్లో కూడా పడతాయి.

ఆర్యులకి భారత దేశానికి జీవధారలైన ఋతుపవన వర్షాలు తెలియవు. అంటే ఋగ్వేద కాలానికి వారు సింధూప్రాంతం దాటి రాలేదన్నమాట. పాకిస్తాన్, మధ్య ఆసియా ప్రాంతంలో సంభవించే వర్షాలు కూడా సంవహన వర్షాలే!- అందుకే ఋగ్వేద వర్ణనల్లో సంవహన వర్షపాతాల వర్ణనే కనిపిస్తుంది.

**“ఋజునీతీ నో వరుణో మిత్రో నయతు విద్వాన్...”**

(1-90-1)

“పగటికి దేవతైన సూర్యుడు, రేయికి దేవతైన వరుణులు మమ్ము నడిపించు గాక...”

అంటే వరుణుడు రాత్రికి అధిదేవత. అంటే రాత్రిపూట ఎక్కువ వర్షాలు వస్తాయని దీనర్థం. రాత్రిపూట పడే వర్షాలు సంవహన వర్షాలే. కాబట్టి ఆర్యులు మధ్య ఆసియా నుండి వచ్చారనీ, ఋగ్వేద కాలానికి సింధూప్రాంతం దాటి రాలేదని తెలుస్తుంది.

## వెనకబడిన వేదకాలం

ఋగ్వేదంలో నక్షత్రమండలాల గురించిన వివరాలు అంతగా లేవు. కానీ, బాలగంగాధర తిలక్ చాలా ‘రుక్కుల్ని ఉదహరించి అవ్వన్నీ ఖగోళ విషయాలేనని రాశారు. ఇక గొబ్బూరి వెంకటానంద రాఘవరావు గారు తన ‘జ్యోతిర్వేదం’ అనే పుస్తకంలో వందల రుక్కుల్ని ఉదహరించి ‘అసలు ఋగ్వేదం అంటేనే అదేదో గొప్ప ఖగోళశాస్త్ర గ్రంథం’ అన్నంతగా విశదీకరించారు. ఈ కోవలో కొంతదూరం మహీధర నళినీమోహన్‌గారు కూడా నడిచారు.

వీరంతా చెప్పినంత గొప్ప ఖగోళ ఆవిష్కరణలు, ఋగ్వేదంలో లేకపోయినా ఖగోళ కాలగమన సమాచారం ఋగ్వేదంలో ఉంది-

ఋగ్వేద కాలం నాటికి ఉన్న ఖగోళ పరిజ్ఞానం సింధూ ప్రజలకి ఉందా? లేదా? అనేది తేలాల్సివుంది. సింధూ ప్రజల గ్రంథాలేవీ దొరకలేదు. అసలు వారికి గ్రంథాలున్నాయో లేవో కూడా తెలియదు. కానీ... ఒక ముద్రపై ఏడు చుక్కలు. వాటి ప్రక్కన ఒక చేపబొమ్మ ఉంది. అది సప్తర్షిమండలానికి సంకేతంగా చెప్తున్నారు. కదలని ఆ చేప బహుశా ధృవనక్షత్రానికి సంకేతం కావొచ్చు. దాని చుట్టూ సప్తర్షి మండలంలోని ఏడు చుక్కలు తిరుగుతున్నట్లు ఆ ముద్ర మనికి తెల్పుతూ ఉండొచ్చు...

ఇంతకు మించిన ఖగోళ ఆధారాలేవీ మనకి దొరకలేదు-


అయినా-

ఖగోళ జ్యోతిషం తెలియని ఏ జాతీ వ్యావసాయ నాగరకతకు మళ్లలేదు. కాబట్టి సింధూ ప్రజలు గొప్ప వ్యవసాయదారులు కాబట్టి, వారికీ నెలలు, మాసాలు, తిథులు,

స్వీడన్ దేశస్థుల కేలెండర్

**సౌరమానం**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | | Zone 1 |
| 44 | 44 | 44 | 44 | 44 | 44 | 44 | 44 | 44 | Zone 2 |
| 42 | 42 | 42 | 42 | 42 | 42 | 42 | 42 | 42 | Zone 3 |
| 75 | 75 | 75 | 75 | 75 | 75 | 75 | 75 | 75 | Zone 4 |
| 38 | 38 | 38 | 38 | 38 | 38 | 38 | 38 | 38 | Zone 5 |
| 90 | 90 | 90 | 90 | 90 | 90 | 90 | 90 | 90 | Zone 6 |
| 57 | 57 | 57 | 57 | 57 | 57 | 57 | 57 | 57 | Zone 7 |
| 105 | 105 | 105 | 105 | 105 | 105 | 105 | 105 | 105 | Zone 8 |
| 57 | 57 | 57 | 57 | 57 | 57 | 57 | 57 | 57 | Zone 9 |
| 95 | 95 | 95 | 95 | 95 | 95 | 95 | 95 | 95 | Zone 10 |
| 60 | 60 | 60 | 60 | 60 | 60 | 60 | 60 | 60 | Zone 11 |
| 100 | 100 | 100 | 100 | 100 | 100 | 100 | 100 | 100 | Zone 12 |
| 60 | 60 | 60 | 60 | 60 | 60 | 60 | 60 | 60 | Zone 13 |
| 105 | 105 | 105 | 105 | 105 | 105 | 105 | 105 | 105 | Zone 14 |
| 90 | 90 | 90 | 90 | 90 | 90 | 90 | 90 | 90 | Zone 15 |
| 38 | 38 | 38 | 38 | 38 | 38 | 38 | 38 | 38 | Zone 16 |
| 66 | 66 | 66 | 66 | 66 | 66 | 66 | 66 | 66 | Zone 17 |
| 126 | 126 | 126 | 126 | 126 | 126 | 126 | 126 | 126 | Zone 18 |
| 138 | 138 | 138 | 138 | 138 | 138 | 138 | 138 | 138 | Zone 19 |
| 162 | 162 | 162 | 162 | 162 | 162 | 162 | 162 | 162 | Zone 20 |
| 235 | 235 | 235 | 235 | 235 | 235 | 235 | 235 | 235 | Zone 21 |
| 365 | 548 | 729 | 1100 | 1097 | 1461 | 1462 | 1644 | 1739 | Summe |
| 11.99 | 18.00 | 23.95 | 36.14 | 36.04 | 48.00 | 48.03 | 54.01 | 57.13 | solare Monate |
| 12 | 18 | 24 | 36 | 36 | 48 | 48 | 54 | 57 | Sollwert |
| 0.07 | 0.02 | 0.20 | 0.39 | 0.12 | 0.00 | 0.07 | 0.02 | 0.24 | Fehler[%] |



**చాంద్రమానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| Zone 1 | | | | | | | | |
| Zone 2 | 44 | 44 | 44 | 44 | 44 | 44 | 44 | 44 |
| Zone 3 | 42 | 42 | 42 | 42 | 42 | 42 | 42 | 42 |
| Zone 4 | 75 | 75 | 75 | 75 | 75 | 75 | 75 | 75 |
| Zone 5 | 38 | 38 | 38 | 38 | 38 | 38 | 38 | 38 |
| Zone 6 | 90 | 90 | 90 | 90 | 90 | 90 | 90 | 90 |
| Zone 7 | 57 | 57 | 57 | 57 | 57 | 57 | 57 | 57 |
| Zone 8 | 105 | 105 | 105 | 105 | 105 | 105 | 105 | 105 |
| Zone 9 | 57 | 57 | 57 | 57 | 57 | 57 | 57 | 57 |
| Zone 10 | 95 | 95 | 95 | 95 | 95 | 95 | 95 | 95 |
| Zone 11 | 60 | 60 | 60 | 60 | 60 | 60 | 60 | 60 |
| Zone 12 | 100 | 100 | 100 | 100 | 100 | 100 | 100 | 100 |
| Zone 13 | 60 | 60 | 60 | 60 | 60 | 60 | 60 | 60 |
| Zone 14 | 105 | 105 | 105 | 105 | 105 | 105 | 105 | 105 |
| Zone 15 | 90 | 90 | 90 | 90 | 90 | 90 | 90 | 90 |
| Zone 16 | 38 | 38 | 38 | 38 | 38 | 38 | 38 | 38 |
| Zone 17 | 66 | 66 | 66 | 66 | 66 | 66 | 66 | 66 |
| Zone 18 | 126 | 126 | 126 | 126 | 126 | 126 | 126 | 126 |
| Zone 19 | 138 | 138 | 138 | 138 | 138 | 138 | 138 | 138 |
| Zone 20 | 162 | 162 | 162 | 162 | 162 | 162 | 162 | 162 |
| Zone 21 | 235 | 235 | 235 | 235 | 235 | 235 | 235 | 235 |
| Summe | 1682 | 1597 | 1423 | 1424 | 1059 | 1062 | 710 | 355 |
| synod. Monate | 56.96 | 54.08 | 48.19 | 48.22 | 35.86 | 35.96 | 24.04 | 12.02 |
| Sollwert | 57 | 54 | 48 | 48 | 36 | 36 | 24 | 12 |
| Fehler[%] | 0.07 | 0.15 | 0.39 | 0.46 | 0.39 | 0.10 | 0.18 | 0.18 |

ఋతువులు– వీటన్నింటి జ్ఞానం తెలిసే ఉండాలి. అనుమానమే లేదు–

**నిజానికి మనం బావిలోని కప్పల్లా మారి, వేదమే పరమప్రమాణంగా భావించి, మోహంలో పడిపోతే... ఋగ్వేదం గొప్ప ఖగోళజ్యోతిష గ్రంథంగానే కన్పిస్తుంది. కానీ... ఋగ్వేదంలో చెప్పిన వాటికంటే గొప్ప ఖగోళ అంశాలు ప్రపంచంలో ఎన్నో చోట్ల ఉన్నాయని తెలిస్తే... ఋగ్వేదం కూడా తన కాలానికి వెనుకబడే ఉంది అని తేటతెల్లమవుతుంది.**

## ఈ రుతు రాగం ఒక కూనిరాగం

క్రీ.పూ. 35000 సంవత్సరాలనాడే ఆఫ్రికాలో ఆదిమజాతి మానవులకి చంద్రకళల్ని గుర్తించటం తెలుసు. వారు జంతువుల ఎముకల మీద 'చంద్రకళల్ని' గీచిన ఆనవాళ్ళు దొరికాయి.

అలాగే...

స్కాట్లాండ్ (ఇంగ్లాండ్) లో నివసించిన వారికి క్రీ.పూ. 5000 సంవత్సరాలనాడే చంద్రకళల్ని బట్టి రోజుల్ని లెక్కించడం తెలుసు. దాదాపు అదేకాలంలో ఆస్ట్రియా, జర్మనీ, చెక్ రిపబ్లిక్ ప్రాంతాల్లోని ప్రజలకి కూడా ఈ విషయం తెలుసు. దాన్ని వారు తమ కుండల మీద చిత్రించారు.



**జర్మనీలోని నెబ్రా అనే ప్రాంతంలో లభించిన క్రీ.పూ. 2000 సం॥ల నాటి రాగిరేకు**

ఇక... క్రీ.పూ. 4000 సంవత్సరాల ప్రాంతం నుండే మెసపుటోమియా ప్రాంతంలో జీవించిన సుమేరియన్లు, అస్సీరియన్లు, బాబిలోనియన్‌లు, చాడ్‌లకు నక్షత్రాల పేర్లు కూడా తెలుసు. సంవత్సరానికి 360 రోజులని తొలిగా గుర్తించింది వీరే. వీరి గణితం దశాంశమానం కాదు. షష్ట్యాంశమానం. అంటే 60 రెట్లుగల మానం. 60 నిమిషాలు, 60 సెకన్లు, 60 సంవత్సరాలు, వృత్తానికి $360^0$– వీటన్నింటికీ వీరే వారసులు.

అలాగే... క్రీ.పూ. 3000 సంవత్సరాలనాడే సింధూప్రజలు కేలండర్ వాడారు. కానీ లభ్యం కాలేదు.

ఇక క్రీ.పూ. 2000 సం॥ల నాటి, జర్మనీలోని నెబ్రా అనే ప్రాంతంలో దొరికిన ఒక రాగిరేకుమీద నక్షత్రాలు, సూర్య, చంద్రుల బొమ్మలు ఉన్నాయి. ఆ నక్షత్రాల్లో కృత్తిక నక్షత్రాలు ప్రత్యేకంగా ఉన్నాయి. ఇప్పుడు కృత్తికలు ఆరు. అప్పుడు ఏడు. వాటిలో ఒకటి అంతరించి ఉంటుంది. కృత్తికలు ఏడు అని ఈజిప్టు చిత్రాల ద్వారా కూడా తెలుస్తుంది. ఇప్పుడు మనం దీన్ని "పిల్లలకోడి" అంటాం. తల్లికోడి 'రోహిణి' నక్షత్రం అయితే, పిల్లలు 'ఆరు' కృత్తికలు. దీన్నే 'కత్తెర' అని కూడా అంటాం. సూర్యుడు ఈ నక్షత్రాల సమీపంలోకి రావడమే కత్తెర. రోహిణీ కార్తె . దీని వాడకం క్రీ.పూ. 1600 తర్వాత లేదు.

అలాగే... క్రీ.పూ. 4000–3000 సంవత్సరాల మధ్య అటువైపున ఎక్కడో ఉన్న దక్షిణ అమెరికా ఖండంలోని పెరూదేశంలో 'మచు, పిచు, చుకో' ప్రాంతంలో జీవించిన 'ఇంకా' జాతి ప్రజల ఖగోళ విజ్ఞానం అబ్బురపరుస్తుంది. వీరికి ఉత్తరాయనాంతం (అతిదీర్ఘరాత్రి) దక్షిణాయనంతం (అతిదీర్ఘపగలు) అనే రెండు ఆయనాలు, పగలూ రాత్రి సమానమైన రెండు రోజులూ (విషవత్తులు), గ్రహణాలు తెలుసు.

ఆక్కడ మనం ఒక విషయం గమనించాలి. **మనకి ఉత్తరాయనాంతం(జూన్ 21) అతి దీర్ఘపగలు. కానీ పెరూ వారికి అది అతిదీర్ఘరాత్రి అవుతుంది. అలాగే దక్షిణాయనాంతం (డిసెంబర్ 21) మనకి అతి దీర్ఘరాత్రి.** కానీ వారికది అతి దీర్ఘ పగలు అవుతుంది. కారణం? మనం చెప్పుకున్న గ్రీకు, ఈజిప్టు, మెసపుటోమియా, భారత్, చైనా, ఇంగ్లండ్ ప్రాంతాలన్నీ భూమిపై ఉత్తరార్ధ గోళంలో ఉన్నాయి. కానీ పెరూ ఒక్కటే దక్షిణార్ధ గోళంలో ఉంది. అది $0^0$లనుండి $20^0$ల దక్షిణ అక్షాంశాల మధ్య ఉంది.

**దక్షిణార్ధగోళంలో వుండి ఖగోళవిజ్ఞానాన్ని అందించిన ఒకే ఒక్క దేశం పెరూ. ప్రపంచంలో తొలిసారి సూర్యునికి దేవాలయం నిర్మించింది వీరే! వీరు సూర్యుణ్ణి 'కొరిచంచ' అంటారు.** దాదాపుగా ఇదే కాలంలో (క్రీ.పూ. 4000–3000) స్కాట్లాండ్ ప్రాంతంలో జీవించిన వారు నిలువుపాటి రాతిస్థంభాలు వలయాలుగా పాతి, వాటి నీడల్ని బట్టి ఋతువుల్ని, ఆయనాల్ని, నెలల్ని గుర్తించారు. అవి ఇప్పటికీ ఉన్నాయి.


ఇక– గ్రీకుప్రాంతం మాసిడోనియాలో రాగియుగం నాటి వెయ్యిమీటర్ల వ్యాసం గల ప్రాంతంలోని కాలగణన అవశేషాలు బైటపడ్డాయి. వీరికీ ఆయనాలు, విషవత్తులు తెలుసు. 19 సౌర సంవత్సరాలకి 235 చాంద్రమాసాలుగా వీరు లెక్కించారు. అధికమాస అవగాహన లేదు.

అలాగే... క్రీ.పూ. 1400 సంవత్సరాల నాటికి అంటే దాదాపు మన ఋగ్వేదకాలం నాటికి కేలండర్ ఒకటి జర్మనీ, ఫ్రాన్స్ దేశాల్లో వాడుకలో ఉండేది. ఈ కేలండర్‌లో ఒకవైపున చాంద్రమానం, మరోవైపున సౌరమానం తేదీలు ఉండేవి.

### ఆ విధంగానే

క్రీ.పూ. 1300 సంవత్సరంలో చైనావారు కూడా భవిష్యత్తులో రాబోయే 1500 గ్రహణాల్ని లెక్కించి చెప్పారు.

## పాతభావాలపై చెరిగిన నిప్పుకణికలు – "జ్ఞానగుళికలు"





'కాలం మారిపోయింది. మా రోజుల్లో ఈ సెల్‌ఫోన్లు, ఈ కంప్యూటర్లు, టీవీలు ఎక్కడివి? నలుగురూ కూర్చుని మాట్లాడుకునే తీరికాలేదు, కోరికాలేదు. 'సొంతమనిషి'లో పరాయితనమే కన్పిస్తున్నది' అని వాపోతున్న తరం మనమధ్య వుందిప్పుడు. శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాలు అరచేతిలో ఇమిడిపోయి, మానవ విలువల మార్పిడికి దోహదపడుతున్న రోజుల్లో కూడా, పాత రోత భావాలను విడనాడలేని మౌఢ్యం, ఆ మౌఢ్యంతో దోపిడీలకు పాల్పడుతున్న దగాకోరుల జాడ్యం మన సమాజాన్ని బలంగా అంటిపెట్టుకొని వుండటమే ఆశ్చర్యకరం, అసహ్యకరం. అందుకే అలాంటి పాతకాలపు రోతభావాలపై నిప్పులు చెరుగుతూ వచ్చింది అశోక్‌కుమార్ గారి రచన 'జ్ఞానగుళికలు'. చిట్టిచిట్టి పదాలతో, నాలుగే పాదాలతో పఠితల నాలుకపై నడయాడే శైలిలో వున్న 60 మంజుగుళికల మంజూ ఈ పుస్తకం. సాంస్కృతిక విప్లవమహాకవి సి.వి.గారికి అంకితంగా, 'స్వేచ్ఛాలోచన' సంపాదకులు సాంబశివరావు రాసిన ముందుమాటతో సొబగులీనుతున్న 'జ్ఞానగుళికలు' హేతువాద చైతన్యపు దీపకళికలుగా పాఠకులను అలరిస్తాయి. "అజ్ఞానం, భయం/ కలిస్తే ఈ ద్వయం / మనుషుల మనసంతా / పలుదేవుళ్ల మయం" అంటూ దేవుని పుట్టుకను వివరించారు కవి. 'కులంలేని పెళ్ళిళ్లు / మతంలేని పెళ్ళిళ్లు / నవసమాజానికి / తెరచిన వాకిళ్ళు" అన్న కవిత నేటి తరానికి కర్తవ్యబోధ చేస్తోంది. 'పెళ్లిళ్లు' అనేపదాన్ని పెళ్ళి+ఇళ్లు' గా విడదీసి అర్థం చెప్పుకుంటే మరింతగా భావసౌందర్యం పొటమరిస్తుంది. ఇలా ప్రతి కవితలోనూ నవభావనలను నింపుతూ, దోపిడీ మూఢత్వంలేని సమాజ నిర్మాణానికి చైతన్యపు రాళ్లెత్తే కూలీపాత్ర నిర్వహిస్తోంది జ్ఞానగుళికలు.

**రచయిత: సింగంపల్లి అశోక్‌కుమార్, పేజీలు: 80 వెల: రూ. 60/–**

**ప్రతులకు: ఆలోచన, 305, ప్రగతి టవర్స్, వీరయ్యవీధి, మారుతీనగర్, విజయవాడ–520004.**

**ఫోన్: 9246277375. ఇ–మెయిల్: srisri_sahityanidhi@yahoo.com**




## నా అనుభవాలు – ఆలోచనలు

**రచన: కన్నెబోయిన అంజయ్య పేజీలు: 180 వెల: రూ. 100/–**

**ప్రతులకు: కన్నెబోయిన అంజయ్య, రామకృష్ణాపురం (గ్రామం), చింతకాని (మం), ఖమ్మం జిల్లా–507208. ఫోన్: 9490370563**

రచయిత దశాబ్దాల తరబడీ, బాల్యం నుంచీ, ప్రజా ఉద్యమాల్లో నిజాయితీగా పనిచేస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీ నుంచి, హేతువాద ఉద్యమంలోకి ప్రవేశించి వక్తగా, కళాకారునిగా, ప్రచారకునిగా సహచరుల ప్రశంసలందుకున్నారు. ఎన్నో ఒడిదుడుకులతో, దూషణ భూషణలతో సాగిన వారి 70 ఏళ్ల అనుభవాల సారం ఈ పుస్తకం. పల్లెటూరి రైతు కుటుంబంలో పుట్టి, సరైన విద్యావకాశాల్లేకుండా పెరిగి, ప్రజాక్షేత్రంలో అభ్యుదయ ఆలోచనాసిరులు పండించగలిగిన అంజయ్యగారి స్వీయచరిత్ర, కాలుష్యం లేని పల్లెటూరి పైరుగాలిలా, అనుభవాల కొలిమిలో పుటంబెట్టిన పసిడితీగలా ఆహ్లాదపరుస్తుంది.



**(క్రీ.పూ. 4000–3000) స్కాట్లాండ్ వారి కాలగణన అవశేషాలు**

వీటిలో 900 సూర్యగ్రహణాలు, 600 చంద్రగ్రహణాలు. ఈ గ్రహణాలు రాబోయే 2600 సంవత్సరాల కాలంలో సంభవిస్తాయని తెలిపారు.

ఈ వివరణల్ని, ఆధారాల్ని బట్టి చూస్తే ఋగ్వేదకాలం నాటి ఖగోళ విషయాలు అంత గొప్ప ఆవిష్కరణలుగా కనిపించవు. కంటికి ఆనవు.

**వేదం ప్రతిదానికీ మూలం కాదు– ప్రపంచగతిలో అదీ ఒకానొక నూలుపోగు మాత్రమే!**

కాలం గానం చేసిన 'ఋతురాగాలు' ఋగ్వేదం తోనే మొదలు కాదు. దానికంటే ముందే పల్లవిని అందుకున్న సమాజాలు ఎన్నో ఉన్నాయి– కనీసం ఋగ్వేద ఆర్యులది అనుపల్లవీ కాదు... కూనిరాగం మాత్రమే! *(ఇంకావుంది)*

# వేలెడంత లేని 'వేదగణితం'

"ఆ వింశత్యా త్రింశతా యాహ్యర్వాఙా చత్వారింశతా హిభిర్యు జానః
ఆ పంచాశతా సురదేభిరింద్రా 22 షష్ట్యా సప్తత్యా సోమపేయం"
ఓ ఇంద్రా! ఇరవై, ముప్పై, నలభై, యాభై, అరవై, డెబ్బై గుర్రాలు పూన్చిన రథంపై రా. సోమం స్వీకరించు.
– ఋగ్వేదం 2-18-5

## ఏకం – అనేకం

శ్రావస్తి నగరానికి ఒక విర్రవీగే పండితుడు వచ్చాడు. 'వాదంలో నన్నెవ్వరూ ఓడించలేరు' అన్నాడు. కొందరు బుద్ధుని దగ్గరకి వెళ్ళమని చెప్పారు. ఆ పండితుడు బుద్ధుని దగ్గరకు వెళ్ళి ప్రశ్నలు వేశాడు. ఆయన చిరునవ్వుతో సమాధానం ఇచ్చి "నేనూ ప్రశ్నించవచ్చా?" అని అడిగాడు.

"ఓ.. నాకు సమాధానం తెలియని ప్రశ్నేలేదు" అన్నాడు. "ఈ సమస్త ప్రపంచంలో 'ఒకే ఒక్కటి'గా ఉండేది ఏది?" అని అడిగాడు.

పండితుని బుర్ర గిర్రున తిరిగింది.

మెల్లగా లేచి పలాయనం చిత్తగించాడు.

**'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'** అనేమాట మనం వింటూ ఉంటాం. ఉన్నది ఒక్కటే. పండితులే అనేకాలుగా చెప్తూ ఉంటారు అని దీనర్థం.


బొర్రా గోవర్ధన్
9390600157

కానీ, బుద్ధుని ప్రశ్న చూడండి. ఉన్నది ఏకం కాదు, అనేకమే. ఏకైకంగా, ఒకే ఒక్కటిగా ఉండేది ఏది అని? అంటే అలాంటిది ఏదీ ఈ విశ్వంలో లేదు అని దానర్థం.

గాలి ఒకటి కాదు, నీరు ఒకటి కాదు, నేల ఒకటి కాదు, నిప్పు ఒకటి కాదు, చెట్టు ఒకటి కాదు, పుట్ట ఒకటి కాదు, మనిషీ ఒకటి కాదు. ప్రతిదీ అనేక భూతాల సమ్మేళనం. ఈ ప్రపంచంలో మనకి కనిపించే ప్రతిదీ సమూహమే. బహుళమే.

ఒకే ఒక్క మనిషి, ఒకే ఒక్క మామిడి చెట్టు, ఒకే ఒక్క పర్వతం, ఒకే ఒక్క నది... ఒకే ఒక్క ప్రదేశం.. ఇలా మనం దేన్ని చూసినా ఒకే ఒకటిగా ఉన్నది ఏదీ లేదు. జంతులోకం ఈ బహుళరూపాల్ని కేవలం గమనిస్తాయి. కానీ, ఈ రూపాల్ని లెక్కించేది మానవజాతి ఒక్కటే. ఈ లెక్కించడాన్ని, గుర్తించడాన్నే మనం గణితం అంటున్నాం. ఈ గణితమే మానవ మేధోవికాసానికి సోపానం అయ్యింది. ఒకటి.. రెండు.. పది.. వంద.. ఇలా గుర్తించి లెక్కించే వాటిసంఖ్య క్రమేపీ పెరిగేకొద్దీ బుద్ధి పరిధి వికసిస్తూ పోయింది.

ఇతర జంతు ప్రపంచానికి లాక్కుతినడం, పీక్కుతినడమే తెలుసు. కానీ ఈ లెక్కించే ప్రక్రియవల్లే మానవజాతికి 'పంచుకు తినడం' తెలిసింది.

ఈ 'పంపకమే' సమూహాన్ని సమాజంగా రూపొందించింది. శ్రమను సంపదగా మార్చింది. వ్యక్తిని వ్యవస్థగా రూపొందించింది. వైజ్ఞానిక ప్రగతికి తాళం తీసింది. సమానంగా పంచుకోవడం, శ్రమకు తగినట్టుగా పంచుకోవడం అనే సామ్యవాద భావాలకి దారిచూపింది.'లెక్కలు' తెలియని జీవజాతుల్లో ఈ పంపకాలు ఉండవు. మనిషికి పూర్వీకులైన చింపాంజీలు నాలుగైదు వస్తువుల్నే లెక్కించగలవు. మనం ఇక్కడ గుర్తించు కోవాల్సిన ప్రధానవిషయం వస్తుభేదాల్ని గమనించడం వేరు. గుర్తించడం వేరు. బుద్ధుడన్నట్టు ఈ ప్రపంచం బహుళమైంది. కాబట్టే గణితం పుట్టింది.

ఒకే చెట్టు, ఒకే గట్టు, ఒకే మనిషి, ఒకే పులి, ఒకే పండు... ఇలా ప్రతిదీ ఒకే ఒకటిగా ఉంటే... మనం ఇంకా 'ఒక్కటి' దగ్గరే ఉండిపోయేవాళ్ళం. బహుళమైన ఈ ప్రపంచాన్ని మన అనుభవంలోకి తెచ్చుకోవడమే గణితం. అందుకే మిగిలిన శాస్త్రాలన్నింటికంటే గణితపరిజ్ఞానం మనోవికాసానికి మరింత దోహదం చేస్తుంది. ఇతర శాస్త్రాలకంటే బుర్రకు కాస్త కష్టంగానూ ఉంటుంది.

గణితం ప్రాకృతిక అంశంకాదు. ప్రకృతిలో దొరకదు. అది కేవలం మానవ మనోజనితమే! మనిషి సొంతమే!. పంపకాలు చేసుకోడానికైనా, పని సామర్థ్యాన్ని పెంచుకోడానికైనా కావలసింది గణిత పరిజ్ఞానమే. ఆ పరిజ్ఞానం ఉన్న సమాజాల నాగరకతా నిర్మాణాలు ఉన్నతంగా ఉంటాయి. అందుకే..

ఒక సమాజ పరిజ్ఞానాన్ని కొలిచే ప్రధాన సాధనం గణితం అయ్యింది.

ఈ సాధనంతో ఋగ్వేద ఆర్యుల శక్తియుక్తుల్ని కొలుద్దాం! వారి గణిత విజ్ఞాన లోతులు చూద్దాం!

## మూడు సమాజాలు – మూడు లెక్కలు

వేదకాలం క్రీ.పూ. 1700 నుండి 800 వరకు అనేది మనం ఒకసారి గుర్తుకు తెచ్చుకోవాలి. క్రీ.పూ. 1700తో

సింధూ నాగరకత కథ ముగిసిపోయింది. సింధూప్రజలది వ్యావసాయిక నాగరకత అనీ, ఆర్యులది సంచార జీవనం అనేది నిజమా? ఇది తేల్చుకోవాలంటే మనం ఋగ్వేద ఆర్యుల గణిత సామర్థ్యాన్ని లెక్కించాల్సిందే!

అసలు గణితం ప్రధానంగా 3 భాగాలు.

1. శుద్ధ గణితం (Arithmetic)
2. ప్రయుక్తగణితం (Applied Mathematics)
3. సాంఖ్యాకగణితం (Statistics)

శుద్ధగణితంలో అంకెలు, సంఖ్యలు, కూడికలు, తీసివేతలు, హెచ్చవేతలు, భాగహారాలు, భిన్నాంకాలు, బీజగణితం, ఘనాలు, వర్గాలు, వర్గమూలాలు ఉంటాయి. అంటే.. సంఖ్యల గురించే ఉంటుంది.

ప్రయుక్తగణితంలో ప్రధానంగా రేఖాగణితం, భూమి వైశాల్యాలు ఉంటాయి. ఇది సాంకేతిక గణితం. ఇంజనీరింగ్ అన్నమాట.

ఇక మూడోది సాంఖ్యాక గణితం. జనాభా లెక్కలు, ఆర్థిక పంపిణీ, వడ్డీలు, శ్రమకి ఉత్పత్తికి సంబంధించిన అంశాలు ఉంటాయి.

ఈ మూడు విభాగాల్లో ఆయాజాతుల పరిజ్ఞానాన్ని బట్టి వాటి వైజ్ఞానిక వికాసాన్ని లెక్కించగలం-

ఇక ఇప్పుడు చూద్దాం....

## వేదంలో ఏముంది?

వేదకాలం నాటి ఆర్యులు గుర్రాల్ని, పశువుల్ని లెక్కించడానికి, శత్రువుల్ని ఎన్నిసార్లు జయించింది, ఇంద్రుడు ఎన్నిసార్లు ఎంతమందిని చంపింది- ఇలాంటి విషయాలు చాలాచోట్ల ప్రస్తావించారు.

**"నహిష్మాత్ శతంచిన రాదో వరవ్త అసురః"**

(ఋ:4-31-9)

(ఇంద్రా! అసురులు నీ 100 రకాల ధనాన్ని నివారింప లేరు)

**"అస్మాగ్ం అవస్తుతే శతమస్మాన్త్సహస్రమూతయః"**

(ఋ: 4-31-10)

(ఇంద్రా! నీవు 100 రకాలుగా, 1000 రకాలుగా మమ్ము రక్షించాలి)

**"సహస్ను త్వా మనోయజో యుక్తాసో నవతిర్నవ వాయోశతం.... సహస్రిణో రథ..."** (ఋ: 4-48-4,5)

(వాయువా! నీవు 99 గుర్రాలు పూన్చిన రథంగలవాడవు... వాయువా! నీవు బాగా బలిసిన 100 గుర్రాల్ని, 1000 గుర్రాల్ని నీ రథానికి కట్టు)

**"యోమే శతాచ వింశతిం చ గోనాం హరీ చయుక్తా సుధురా దదాతి"** (ఋ: 5-27-2)

(అగ్నీ! త్రయాణుడు నాకు 100 సువర్ణాలు, 20 గోవులు దానం చేశాడు)

అలాగే 5-27-1 లో 10,000 సువర్ణాలు దానం చేశాడు అని ఉంది.

ఇక దస్యరాజైన శంబరుని 99 పట్టణాల్ని ఇంద్రుడు నాశనం చేసిన విషయం-

**"నవయదస్య నవతించ భోగాన్ త్సాకం వజ్రేణ మఘవా వివృశ్చత్-"** (5-29-6)

(ఇంద్రా! వజ్రాయుధాన్ని చేబూని, అసురుని 99 పట్టణాల్ని నాశనం చేశావు)

**'ఇంద్రో దధీచో అస్థబిర్వృత్రార్యేప్రతిష్కుతాః జఘాన నవతిర్నదః"** (1-84-13)

(ఇంద్రా! దధీచి ఎముకలు బట్టి 99 సంఖ్యతో వెలుగొందే వృత్రుని సంహరించావు.)

అలాగే...

**"విసద్యో విశ్వా దృంహితాన్యేషామింద్రః పురః సహసా సప్తవర్షః"** (7-18-13)

(ఇంద్రుడు తన బలంతో 7 ప్రాకారాలు గల అసురుల పట్టణాల్ని ధ్వంసం చేశాడు)

అలాగే 3, 5, 6 సంఖ్యలు ఋతువుల సందర్భంగా వచ్చాయి-

**"ఏకం చయో వింశతిం చశ్రవస్యా వైకర్ణయోర్జనాన్..."**

(7-18-13)

(సుదాసుడు అనురాజు 2 జనపదాలలో 21 మందిని వధించాడు)...

**"త్వమేతాఞ్జన రాజ్ఞో ద్విర్దశీ2బంధునా... షష్టింసహస్ర నవతించనవ శ్రుతో..."** (1-53-9)

(ఇంద్రా! 20మంది రాజుల్ని వారి 60,099 మందిని (భటుల్ని) చక్రాయుధంతో సంహరించావు)

**"విగవ్యోనవో దృహ్యవశ్చ షష్టిం శతాసుషువుః షట్ సహస్రా షష్టిర్వి రాసో అధి షద్ దువోయి విశ్వేదింద్ర వీర్యా కృతని !"**

(7-18-14)

(ఇంద్రుడు సుదాసు కొరకు అను, ద్రహ్యుల ఆవుల్ని కోరిన 66,066 మందిని హతమార్చాడు)

(అనులు, ద్రహ్యులు అనేవారు రెండు ఆర్యగణాల వారు)

ఇలా ఆర్యుల లెక్కలన్నీ శత్రువుల్ని చంపిన జాబితానే చూడండి. అన్నీ చంపిన లెక్కలే. దస్యుల్ని ఎంతగా నాశనం చేశారో, సింధూ నగరాల్ని ఎలా నేలమట్టం చేశారో. ఈ లెక్కల్ని చూస్తుంటే అర్థమవుతుంది. ఆర్యుల ప్రవర్తన ఎంత హింసాపూరితమో తేటతెల్లమవుతుంది.

ఏక అంకె సంఖ్యలు (1 నుండి 9 వరకు), రెండంకెల సంఖ్యలు (10 నుండి 99 వరకూ), మూడంకెల సంఖ్యలు (100 నుండి 999 వరకూ), అలా... పదివేల వరకూ అంటే ఐదంకెల సంఖ్యల వరకూ ఋగ్వేదంలో కన్పిస్తాయి. లక్ష విలువ గల సంఖ్య అంటే ఆరంకెల సంఖ్యలు (నాకైతే) కన్పించలేదు.

అలాగే రుగ్వేదం 1-139-11లో దేవతల జాబితా ఉంది. ద్యులోక దేవతలు 11, భూలోక దేవతలు 11, ఆకాశ దేవతలు 11 మొత్తం 33 అని ఉంది. ఋగ్వేదంలో ఉన్న 33మంది దేవతలజాబితాని పురాణకాలానికి 33 కోట్లమందిగా పెంచేశారు. అందుకే జాషువాగారు తన 'గబ్బిలం'లో

**"ముప్పది మూడుకోట్ల దేవతలెగబడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తులారునే?"**- అని ప్రశ్నించాడు.

అలాగే ఋగ్వేదంలోని...

2-18-4లో 2, 4, 6, 8, 10 సంఖ్యల ప్రస్థావన

2-18-5 లో 20,30, 40, 50, 60, 70 సంఖ్యలప్రస్తావన

2-18-6లో 80, 90, 100 సంఖ్యల ప్రస్థావన ఉంది.

## మూఢనమ్మకంగా 'మూడు'

ఋగ్వేదంలో 'మూడు' సంఖ్య ప్రాధాన్యత ప్రత్యేకంగా కన్పిస్తుంది. 'మూడు' గురించి విశేషంగా ఒకసూక్తమే ఉంది. హిరణ్యస్తూపుడు రచించిన 34వ సూక్తం మొత్తం '3' గురించే..

'మూడుసార్లు చెప్పడం..." అనే మన అలవాటుకి ఇక్కడే బీజంపడి ఉండొచ్చు-

ఒక్కొక్క సంఖ్యకు ఒక్కొక్క కాలంలో ప్రాధాన్యత నిచ్చినట్లు, ఒక్కోదేశంలో ఒక్కోసంఖ్యకు ప్రాధాన్యతనిచ్చినట్లు మనకు చరిత్రలో కన్పిస్తుంది. ఇలాంటి నమ్మకమే ఋగ్వేదంలో '3' విషయంలో కన్పిస్తుంది.

అశ్వనీ దేవతల్ని కీర్తించే సూక్తం ఇది-

**త్రిర్నోరయిం... త్రిర్థేవతాః... త్రిరుతావతం...**

**త్రి సౌభాగత్వం... త్రిరుత... త్రిష్టం వా...** (1-34-5)

**త్రిర్నో అశ్వినా యజతా దివేదివే పరిత్రిధాతు పృథివీమశాయతం తిస్రో నాసత్యా రథ్యా పరావత ఆత్మేవ వాతః స్వసరాణి గచ్ఛతం** (1-34-7)

'మీ రథానికి 3 చక్రాలున్నాయి, రథం మీద ఊతంగా పట్టుకోడానికి 3 స్థంభాలున్నాయి. మీరు పగలు 3 సార్లు, రాత్రి 3 సార్లు రావాలి. మా యింటికి 3 సార్లు రండి. మా మిత్రుని ఇంటికి 3 సార్లు రండి. 3 విధాల కర్మల్ని బోధించండి. 3 రకాల కర్మఫలాలు అందించండి. 3 సార్లు అన్నం అందించండి. 3 సార్లు ధనాన్ని ఇవ్వండి. 3 సార్లు రక్షించండి. 3 సార్లు భాగ్యాన్ని ఇవ్వండి. ఓషధులు భూలోకంలో 3 సార్లు పుట్టాయి. 3 సార్లు ఆకాశంలో పుట్టాయి.

మీరు మాకు 3 సార్లు ఓషధులు ఇవ్వండి. 3 రోగాలు (వాత, పిత్త, కఫ) నుండి కాపాడండి. యజ్ఞవేదికమీద 3 వరసల్లో దర్భలు పరచండి. 3 వేదులు వస్తారు. సప్తసింధూ నదీజలాలు 3సార్లు, 3పాత్రల్లో తెచ్చాము. 3 హవిస్సులున్నాయి. అశ్వనులారా మీరు 3 లోకాల్లో తిరుగుతారు. మా యజ్ఞానికి 33 దేవతలు వస్తారు- ఇది మొత్తం 34వ సూక్తంలో 2 నుండి 12 వరకు ఉన్న ఋక్కుల్లో ముచ్చటించిన '3'విషయాలు.

**సఖాసఖ్యే అపచయత్ తూయమగ్నిరస్య క్రత్వా మహిషా త్రీ శతాని త్రీ సాకమిన్ద్రో మనుషః సరాంసి సుతం పిబత్ వృత్రహత్యాయ సోమం** (5-29-7)

**త్రీయచ్ఛతా మహిషాణామగో మాస్త్రీసరాంసి మఘవా సోమ్యాపాః** (5-29-8)

(వృత్రుని 99 పురాల్ని ధ్వంసం చేసినందుకు ఓ ఇంద్రా! నీకు అగ్ని 300 దున్నలమాంసాన్ని వేగంగా వండాడు. నీవు 3 పాత్రల్లో ఉన్న సోమాన్నితాగు. 300 బర్రెలమాంసాన్ని తిను)

ఆర్యులు ఆవుల మాంసాన్నే కాదు, బర్రెలమాంసం కూడా తినేవారు. భౌగోళికంగా సింధూప్రాంతం మినహా మిగిలిన భారతదేశం ఉష్ణమండల గడ్డిభూమి. ఇక్కడ జింక, ఏనుగు, బర్రె, పులుల జాతులు సంవృద్ధిగా పెరుగుతాయి. **ఆర్యుల్లా, ఆవుకూడా స్థానిక జంతువు కాదు.** సింధూమైదానానికి వెలుపలి వాతావరణంలో పెరిగే జంతువు అది.

## అంకెలు - ఆస్తులు - అంతస్తులు

ఒకజాతి గణిత సామర్థ్యం ఆ జాతి ప్రజలది స్థిరనివాసమా? అస్థిరనివాసమా? వారు నాగరకులా? అనాగరకులా? అనే విషయాల్ని ఋజువుచేస్తుంది. ఋగ్వేద ఆర్యుల గణితసామర్థ్యం కూడా ఋగ్వేద ఆర్యుల జీవితాన్ని చూపించే అద్దమే! .

ఋగ్వేద ఆర్యులు సంచారులు. లేదా అప్పుడప్పుడే స్థిరపడుతున్నవారు. సంచార జాతులకి సంఖ్యాజ్ఞానం చాలు. ఎన్ని పశువులున్నాయి? ఎందరున్నారు? ఎందర్ని చంపారు? ఎన్నిసార్లు యజ్ఞాలు చేశారు. ఎన్నిసార్లు తాగారు? ఎన్ని పశువుల్ని యజ్ఞంలో బలిగా సమర్పించారు?- ఇలాంటి విషయాలు. ఋగ్వేదంలో కూడా ఇంతవరకే గణితజ్ఞానం ఉంది. కూడికలు, తీసివేతలు, హెచ్చవేతలు, భాగాహారాల జ్ఞానం కూడా ఉండి ఉండొచ్చు. అవి సూక్తాల్లో రాకపోవచ్చు. ఐదంకెల సంఖ్యలజ్ఞానం ఉదంటే గణితంలోని సాధారణ ప్రక్రియలు తెలిసే ఉంటాయి- ఎన్ని తెలిసినా- ఇవ్వన్నీ గణితంలో మొదటి భాగమైన శుద్ధగణితంలో మొదటి అంశాలే. అంకెలే.

కానీ... స్థిరనివాస ప్రజలకి స్థిరాస్తులు ఉంటాయి. స్థిరాస్తి ఉందంటే వ్యవసాయం ఉన్నట్టే. అంటే ఆ సమాజాల్లో ఆస్తి పంపకాలు ఉన్నట్లే. ఆస్తిపంపకాలు ఉంటే... శుద్ధగణిత

జ్ఞానం (అంకెలు, సంఖ్యలజ్ఞానం) చాలదు. తప్పనిసరిగా భూమిని కొలిచే పరికరాలు, భూమికి హద్దులు నిర్ణయించే కొలబద్దలు, మూలమట్టాలు ఉండాల్సిందే. కాబట్టి స్థిరనివాస వ్యవసాయిక సమాజాలకి శుద్ధగణితంతోపాటు, ప్రాయోక్త గణితంకూడా అంటే జామెట్రీ అవసరం. రేఖాగణితం, క్షేత్రమితి తెలిసి ఉంటేనే ఆస్తులపంపకాలు సాధ్యం. కాబట్టి కొలతలు, కోణాలు తెలిసి ఉండాలి. ఋగ్వేద ఆర్యుల్లో ఆస్తిపంపకాలు లేవు. కాబట్టి రేఖాగణితం వారికి తెలియదు. పశువుల పంపకాలుంటాయి కాబట్టి వారికి సంఖ్యల జ్ఞానం చాలు.

నిజానికి ఋగ్వేద ఆర్యులకి ఎంతో ముందరిదైన సింధూనాగరకతలో ప్రజలు వ్యవసాయదారులు. వారివి విశాల వ్యవసాయక్షేత్రాలు. కాలువలు, ఆనకట్టలు విశాలమైన (30 అడుగుల) రహదార్లు. క్రమపద్ధతిలో పెద్ద పెద్ద నగర నిర్మాణాలు. ఎత్తైన భవనాలు. అపార్ట్‌మెంట్లు, పెద్దపెద్ద స్నాన వాటికలు. విదేశీ వ్యాపారాలు– ఇన్ని తెలిసిన ప్రజలకి మనం ఇంతకుముందు చెప్పుకున్న 3 రకాల గణిత విధానాలూ తెలిసి ఉండాలి. సంఖ్యలతోపాటు క్షేత్రగణితం (చతురస్రాలు, వైశాల్యాలు, ఘనపరిమాణాలూ), వ్యాపారగణితం (లాభనష్టాలు, వడ్డీలెక్కలు, ఆర్థిక గణితం) ఇలా అన్ని గణిత ప్రక్రియలు తెలిసి వుంటేనే అలాంటి జీవనం సాధ్యం. గణితం తాలూకు 'ఆనవాళ్ళు' ఏవీ సింధూశిధిలాలు మనకు అందివ్వక పోయినా– మూడురకాల గణితజ్ఞానం ఉండేది అనేది నిర్వివాదాంశం.

సింధూ ప్రజలకేకాదు– ప్రపంచంలో చైనా, గ్రీకు, ఈజిప్టు, మెసపుటోమియా ప్రజలందరూ స్థిరనివాసులే కాబట్టి వారికీ గణితజ్ఞానం బాగానే ఉంది.



క్రీ.పూ. 4000–3000 సం॥ల మధ్య ఈజిప్టు వారికి విశేషమైన గణితశాస్త్రజ్ఞానం ఉంది. బానిసల్ని లెక్కిస్తూ తన దస్త్రంలో రాసుకొంటున్న యజమాని బొమ్మ దొరికింది. క్రీ.పూ. 3000 నాటి ఒకపాత్రపై ఆరుజొన్న కంకులపై నిలబడ్డ హోరస్ పక్షిదేవత చిత్రం ఉంది. ఒక్కొక్క కంకి 1000 మంది ఖైదీలకి (బానిసలకి) సమానం. ఇవన్నీ శుద్ధ గణిత విషయాలు.

ఈజిప్టు పిరమిడ్ల నిర్మాణం అద్భుతమైన జామెట్రీ ప్రక్రియ. రేఖాగణితాన్ని ఖచ్చితంగా కొలవగల సామర్థ్యం, త్రిభుజాలు, చతురస్రాలు, శంఖులు, ఘనాలు, వాటి వైశాల్య, ఘనపరిమాణాలు అతిఖచ్చితంగా లెక్కగట్టకుండా పిరమిడ్ల




ఈజిప్టులో బానిసల్ని లెక్కిస్తున్న చిత్రం

నిర్మాణం అసాధ్యం. వారి రేఖాగణిత సామర్థ్యానికి మచ్చుతునక పిరమిడ్ లోపలి నుండి 'తూబా' నక్షత్రాన్ని (అది అప్పటి ధృవనక్షత్రం). చూడగల కోణంలో సుదీర్ఘ రంధ్రాల నిర్మాణం మామూలు విషయంకాదు. ఇది ఈజిప్టు వారి ప్రాయోక్త గణిత విజ్ఞానం.

ఇక, బానిసలు, రైతులు, రైతుల దగ్గరనుండి బానిస యజమానులు సుంకంగా ధాన్యాన్ని రాబట్టుకోవడం, వడ్డీలు చెల్లించలేని వారిని బానిసలుగా మార్చడం. ప్రజల శ్రమశక్తిని దోపిడీ చేసి రాజ్యం బ్రతకడం– ఇవ్వన్నీ సాంఖ్యాకగణిత (స్టాటిస్టిక్స్) శాస్త్ర పరిజ్ఞానాన్ని సూచిస్తుంది.

ఈజిప్టు పిరమిడ్ గోడమీద నాలుగు భుజాలు సమానంగా లేని, సమంగా లేని, నాలుగు కోణాలు సమానం కాని 'విషమబాహు చతురస్రం' బొమ్మ ఉంది. దాని కోణాలు, భుజాలు, వైశాల్యాలకి సంబంధించిన వివరాలు ఉన్నాయి. అంటే..వారు చతర్భుజాల వైశాల్యాల్లో 'పండిపోయార'న్న మాట. ఇంత జ్ఞానం కావాలంటే, రావాలంటే ప్రత్యేక శిక్షణ ద్వారానే సాధ్యం. కాబట్టి వీటికోసం పాఠశాలలు ఉండేవి.

మెసపుటోమియాలో కూడా క్రీ.పూ. 3000 నాటికి అద్భుతమైన గణితం ఆవిష్కరించబడింది. ఒక బాకీని వసూలు చేసుకున్న ఐదుగురు సోదరులు దాన్ని ఇలా పంచుకున్నారు. పెద్దవాడి కంటే ఐదోవంతు ఎక్కువ నాల్గోవాడు. వాడికంటో ఐదోవంతు ఎక్కువ మూడోవాడు... ఇలా ప్రతివాడు తన అన్న కంటే ఐదోవంతు ఎక్కువ పంచుకుంటాడు. మొత్తం ఎంత? వారివాటాలు ఎంత?– ఈ లెక్క మెసపుటోమియాలో దొరికింది. గంటల్ని, పనిదినాల్ని లెక్కించడం, వేర్వేరు విస్తీర్ణాలు గల వ్యవసాయక్షేత్రాల్లో ఎంతెంత పండుతోంది? వారు ఎంత పన్నుగా చెల్లించాలి, వడ్డీ లెక్కలు– ఇవ్వన్నీ నేర్పే పాఠశాలలు క్రీ.పూ. 3000 నాడే మెసపుటోమియాలో ఉన్నాయి–



పిరమిడ్‌పై గీచిన విషమబాహు చతుర్భుజం

దాదాపు ఇదే పరిజ్ఞానం సింధూ ప్రజల్లో కూడా ఉంది.

## సింధూ సంఖ్యలు - సంజ్ఞలు

సంఖ్యల్ని ఒకటి, రెండు, మూడు అని పేర్లతో పిలుస్తాం. ఈ పద్ధతి ఋగ్వేదంలో ఉంది. ఏక, దశ, శత ఇలా... కానీ, సంఖ్యలకి 1, 2, 3, 4, .... 10, 100 అని ఇలా గుర్తులు (సంజ్ఞలు) ఏర్పాటు చేయడం గణితంలో మరింత పైమెట్టు. ఈ సంజ్ఞల ప్రక్రియ మనకి తొలిసారి సింధూ ప్రజల్లోనే కన్పిస్తుంది. సంఖ్యల్ని సూచించడానికి నిలువుగీతల్ని వాడారు. ఒకటి నుండి 9 వరకూ వారు అలానే 1, 11, 111, 1111,... ఇలా నిలువు గీతల్ని వాడారు. పదిని మాత్రం 'ᑎ' ఇలా అరసున్నాతో సూచించారు. ᑎ111 ఇది పదమూడు. ᑎ11111 ఇది పదిహేను. ఇలా...

అలాగే సింధూప్రజలు వాడిన ఇటుకల పొడవు, వెడల్పు, ఎత్తులు 4:2:1 నిష్పత్తిలో ఉన్నాయి. వాటికి సంబంధించిన మూసలు దొరికాయి.

సింధూప్రజలు సంఖ్యల్ని....

బైనరీ విధానం చిన్న సంఖ్యలకి, (ద్విసంఖ్యామానం- 2, 4, 8, 16, 32... ఇలా స్థానాలు పెంచుకొంటూ పోయే విధానం), దశాంశ విధానం పెద్ద సంఖ్యలకీ (10, 100, 1000 ఇలా స్థానవిలువలున్న విధానం) ఉపయోగించారు.

ఋగ్వేద ఆర్యులకంటే గణితశాస్త్ర పరిజ్ఞానంలో సింధూ ప్రజలు ఆకాశమంత ఎత్తులో ఉన్నారు.

## ఆర్యుల అతి గొప్ప కట్టడం....!

మరి ఆర్యులకి రేఖాగణితం తెలియదా? తెలుసు? ఇతర సాంఖ్యాక గణితం తెలియదా? తెలుసు. అదీ వారికి సింధూప్రజల సంపర్కం తర్వాత, సింధూమైదానంలో స్థిరపడ్డాక తెలిసిందే! అదీ లేశమంతే!

క్రీ.పూ. 3000 కుముందే, ఈజిప్టువారు పిరమిడ్లు నిర్మిస్తే, మెసపుటోమియన్లు నగరాలు, నదులపై ఆనకట్టలు నిర్మిస్తే, సింధూప్రజలు ఇటుకలతో అపార్టుమెంట్లు, నదులకు ఆనకట్టలు నిర్మిస్తే ఆర్యులు రాళ్ళతో నిర్మించిన అతి గొప్ప కట్టడం ''యజ్ఞవేదిక'' మాత్రమే. యజ్ఞవేదిక నిర్మాణం ఋగ్వేదంలో లేదు. యజుర్వేదంలో కూడా స్పష్టంగా కానరాదు. మలివేదకాలం క్రీ.పూ. 800 తర్వాత వచ్చిన వేదాంగాల్లో ఒకటైన కల్పంలోని శుల్బసూత్రాల్లోనే యజ్ఞవేదిక నిర్మాణపద్ధతి ఉంది. ఆపస్తంభుని కల్పసూత్రాల్లో 13వప్రశ్న, చివరి ప్రశ్నలకు సమాధానాలే ఈ శుల్బసూత్రాలు. ప్రాచీన వైదిక గణితంలో మొదటిగా రేఖాగణితం గురించి చర్చించిన సూత్రాలివి.

సింధూనాగరికత పతనానంతరం వెయ్యేళ్ళకు ఆర్యులకి రేఖాగణితజ్ఞానం అంటింది. ఐతే, రథనిర్మాణానికీ, ఆకులుగల రథచక్రనిర్మాణానికీ రేఖాగణిత జ్ఞానం అవసరమే. అయితే వాటికి కొద్దిపాటి పరిశీలన చాలు. ఋగ్వేద ఆర్యులకి రేఖాగణితం స్పర్శ మాత్రంగానే తెలుసు అనేది ఒప్పుకోవాలి. ఆర్యులకి వృత్తంలో ఒక అంచునుండి మరో అంచుకు తాకే 'జ్యా' ల గురించిన అవగాహన ఉంది. వింటి నారినివారు 'జ్యా'తో పోల్చడం అందమైన అర్థవంతమైన విషయం.

**'...... వితతాథి ధన్వంజ్యా ఇయంసమనే పారయంతీ**

(6-75-3).

అయితే 'ఇల్లు' నిర్మాణానికి కావలసిన రేఖాగణిత పరిజ్ఞానం, 'విల్లు' నిర్మాణానికి అవసరం లేదు. ఈ ఇంటి నిర్మాణ విషయంలో కూడా సింధూప్రాంతంలో స్థిరపడ్డాక ఆర్యులు సింధూప్రజల్లా విశాల, విలాస భవనాలు నిర్మించుకోలేదు. సాదాసీదా గృహాల్లోనే తొలిలో నివసించారు.

6-46-9లో ''ఓ ఇంద్రా! మాకు ఒక ఇంటిని ప్రసాదించు. అది కలప, ఇటుకరాతితో కట్టబడి ఉండాలి. చలి, వేడి బాధించకుండా ఉండాలి''- అని ఉంది.

ఇలాంటి ఇళ్ళని మిద్దెలంటారు. రాతిగోడలు, గోడలపైన కలప ఒత్తుగా ఉంచి, దానిమీద మట్టితో, సున్నంతో శ్లాబ్‌లాగా వేస్తారు. ఇది వేసవిలో చల్లగా, శీతాకాలంలో వెచ్చగా ఉంటాయి- అంటే... సింధూ ప్రజల మేడల్లాంటి మేడలు కావు. మిద్దెలే!

1000 స్థంభాల భవనం గురించిన ప్రస్థావన.... ఒక చోట ఉంది. ఏదైనా వీరి ప్రాయోక్తగణిత జ్ఞానం మిడిమిడి జ్ఞానమే.

అలాగే... సాంఖ్యాక గణితం.

అప్పుల గురించి, వడ్డీల గురించిన విషయం ఋగ్వేదంలో ఒకచోట ఉంది.

ఋణభారాన్ని గురించి గృత్సమధుడు అనే ఋషి వరుణునితో ఇలా అంటాడు-

**''పర ఋణాసావీరథ మత్కృతావి మహం రాజన్న వ్యకృతేజ భోజం...''** (2-28-9)

(వరుణుడా! మా పూర్వులు చేసిన ఋణాన్ని తీర్చు. మేము ఇప్పుడు చేసిన ఋణాల్నితీర్చు. ఋణగ్రస్థునికి ఉషస్సులు ఉదయించవు. మాకు ఉషోదయాలు కలిగించు)

అప్పులవాళ్ళు రాత్రి నిద్రలేకుండా చేస్తున్నారు, ఉషోదయాల్ని చూడనంతగా కలవరపెడుతున్నారని అప్పుల బాధగురించి గృత్సమదుని ఆవేదన ఇది. అప్పుల్ని, వడ్డీల్ని లెక్కగట్టడం, అవి తీర్చలేనంతగా పెరిగిపోవడం- అంటే సాంఖ్యాకశాస్త్రం కూడా ఆర్యులకి లేశమాత్రంగా తెలుసు అన్నది ఈ విషయం తెలియజేస్తుంది. (రైతుల కరువుని కూడా తెలియజేస్తుంది)

## దోసెడంత ద్రవం - కోసెడంత దూరం

బరువుల్ని తూచడం ద్రవ్యమానం. ద్రవాల్ని కొలవడం ద్రవమానం, లేదా కొలపాత్రమానం.

మొదట్లో ఈ రెండూ ఒకే కొలతలతో ఉండేవి. మనం ఇప్పటికీ మానికలు, సోలలు, గిద్దలతో ఇటు బియ్యాన్నీ, అటు నూనెల్నీ కొలుస్తాం. ఇలా కొలవడం కొలతల్లో ప్రాథమిక విధానం. సింధూప్రజల్లో ఈ కొలతలు వేరువేరుగా ఉన్నాయి. సింధూప్రజలకు తూకంరాళ్ళు తెలుసు. ద్రవాల్ని కొలిచే పరికరాలు తెలుసు. సమానమైన కొలతతో గీతలున్న మట్టస్కేళ్లు కన్పించాయి. కానీ, ఆర్యులు పాటించిన విధానం ఈ విషయంలో ప్రాథమికమైనదే! ద్రవాల్ని, ధాన్యాన్ని కొలవడానికి ఖారి, ద్రోణం అనే రెండు పరికరాలున్నట్లు ఋగ్వేదంలో ఉంది. 4-32-17లో ఖారి గురించి, 10-101-7లో ద్రోణి గురించిన ప్రస్తావనలు ఉన్నాయి.

ఇక పొడవుని కొలిచే స్కేళ్ళు సింధూ శిధిలాల్లో దొరికాయి. ఋగ్వేదంలో 10-90-1లో అంగుళం, 1-123-8లో యోజనాల ప్రస్తావన ఉంది. సంచారజాతులకు దూరాల్ని గుర్తించడం, కొలవడం చాలా అవసరం. దూరాల్ని కూడా తొలిరోజుల్లో మానవసమాజాలు రోజుల్లో కొలిచేవి. 2 రోజులదూరం, ఒక పూట దూరం అని. దాన్ని ప్రమాణాల్లోకి మార్చుకుని కొలవడం విశేషమే. ఈ దూరమాన సామర్థ్యం ఆర్యులకి జీవితం అనివార్యంగా నేర్పిన జ్ఞానమే. ఋగ్వేదంలో అతిగొప్ప ఋక్కుల్లో ఒకటైన ఋక్కు ఇది-

**"సదృశీరద్య, సదృశీరిదుశ్వోదీర్ఘం సచంతే వరుణస్వధామ**
**అనవద్యాత్రింశతం యోజనాన్యేకైకా క్రతుం పరియంతి సద్యః"**

(1-123-8)

(పగలూరాత్రీ ఇప్పుడు సమానం, రేపు కూడా సమానమే (విషవత్తులు). ఈ ఉషస్సులు వరుణస్థలాన్ని వీడడం లేదు. ఇవి సూర్యునికి 30 యోజనాల ముందుగా పుడుతున్నాయి-) ఇదీ ఋగ్వేదంలో కనిపించే గణిత విజ్ఞానం.

## 'వేదగణితం' అనేరోగం ఇలా పుట్టింది..

ఈనాడు "వేదగణితం" అని చెప్పుకునేదేదీ వేదంలో లేదు. భారతదేశంలో సింధూప్రజల గణితపరిజ్ఞానం కాలగర్భంలో కలిసిపోయింది. వేదకాలంలో కూడా గణితశాస్త్రం అంతగా అభివృద్ధి కాలేదు. **గణితాన్ని అభివృద్ధి చేసినవారు, గణితంలో సున్న (0) కనుగొన్నవారు బౌద్ధులే.** బౌద్ధగణిత పరిజ్ఞానమే అరబ్బులకి అందింది. అతిపెద్ద సంఖ్యల వివరాలు, గణిత పరికర్మలు క్రీ.పూ. 3వ శతాబ్దకాలం నాటి బౌద్ధగ్రంథం లలిత విస్తరంలో విశేషంగా ఉన్నాయి. ఆ తర్వాత ఆర్యభట్ట (క్రీ.శ. 478), బ్రహ్మగుప్త (క్రీ.శ. 598), ఆ తర్వాత భాస్కరుడు (క్రీ.శ. 1114) ఈ కోవలోనివారే. భాస్కరుడు "సిద్ధాంత శిరోమణి"(1150లో) కరణకుతూహలం(క్రీ.శ. 1177) అనే గణితగ్రంథాలు రచించాడు. సిద్ధాంత శిరోమణిలోని తొలిభాగం 'శుద్ధగణితం'. అదే అంకగణితం. ఆ భాగమే లీలావతి గణితంగా ప్రసిద్ధి.

అయితే, అంతకు ముందే క్రీ.శ. 814లో కర్నాటకకు చెందిన వీరాచార్యుడు 'గణితసారసంగ్రహం' అనే గ్రంథం రచించాడు. తిక్కన మిత్రుడు పావులూరి మల్లన ఈ గ్రంథాన్ని చక్కటి తెలుగు పద్యాల కావ్యంగా అనువదించాడు. ఇలా బౌద్ధుల అనంతరమే భారతదేశంలో గణితశాస్త్రం వర్ధిల్లింది!

**1965లో భారతీతీర్థ అనే శంకరాచార్య "వేదిక్ మేథమేటిక్స్" అనే గణితగ్రంథాన్ని వెలువరించాడు. ఆనాటి నుండి పలువురు కుహనా గణితశాస్త్రవేత్తలు వేదగణితం పేరుతో ఉన్నవి, లేనివి కలిపి వ్యాపారం చేస్తున్నారు.** క్రీ.శ. 1000 తర్వాత బౌద్ధం పూర్తిగా బలహీనపడడంతో బౌద్ధం ఒక ధర్మంగా కనుమరుగైనా బౌద్ధుల గణిత, ఖగోళ, వైద్య పరిజ్ఞానాలు మాత్రం భారతీయ వైజ్ఞానిక శాస్త్రాలుగా మారాయి. కాలక్రమంలో 'మన పూర్వ వైజ్ఞానికులు', 'ప్రాచీన భారతీయ శాస్త్రవేత్తలు' అంటే వైదిక రుషులే అనే భావాలు బలపడ్డాయి. వైదిక రుషులంటే వేదకాలంనాటి రుషులే అనే అబద్ధాన్ని మరింత పొడిగించారు. ఈ పొడిగింపులో భాగమే భారతీతీర్థ 'వేదగణితం' అనే పేరు ప్రచారానికి తేవడం.

**ఇక ఇప్పుడు ప్రతివారికీ - నమ్మే వారికీ, నమ్మని వారికీ- 'వేదగణితం' అంటే 'వేదాల్లో' ఉన్న గణిత పరిజ్ఞానమనే మూఢనమ్మకం బలిసిపోయింది. ఇలా వేదం పేరు చెప్పి ప్రతిదానికీ వేదమనే మసిపూసి మారేడు చేయాలనే ఆలోచనలే వేదాల్ని వెక్కిరించే ఆలోచనలు.**

**నిజం చెప్పాలంటే వేదంలోనున్న గణితం ఇప్పుడు మూడో తరగతికి కూడా సరిపోదు. వేదగణితం- నిర్వేదగణితం అయ్యిందనే దిగులువద్దు. ఒప్పక తప్పదు. ఇది చరిత్ర అంతే..**

**లెక్కలెక్కే..**

# ఋగ్వేదంలో వైద్యం-1

**యస్యౌషధీః ప్రసర్పథాంగమంగం పరుష్టరుః**
**తతోయక్ష్మం వి బాధధ్వ ఉగ్రో మధ్యమశీర్వి**
**ఓ! ఓషధులారా! వీరుడు యుద్ధరంగంలో శత్రువుల్ని బాధించునట్లుగా, మీరు ఈ రోగి శరీరంలోని అణువణువునందూ వ్యాపించి రోగాల్ని బాధించండి.** - ఋగ్వేదం: 10-97-12

మానవజాతికి 'వైద్యం' అనుభవం నేర్పిన విద్య. శారీరక శక్తి హరించుకుపోయి, ఒక్కసారిగా సాగిలపడేలా చేసేది, మానసికశక్తిని నిర్వీర్యం చేసేదే అనారోగ్యం.

అసలు జీవులకు శరీరమే ఒక వైద్యుడు. తనరోగాల్ని చాలావరకు తానే సరిజేసుకోగలదు.

మనకు ముఖ్యంగా మూడురకాల రోగాలు వస్తాయి.
1. ఆహారపాళ్ళు సరిగా లేకపోవడంవల్ల (ఆహారపు అలవాట్లు)
2. ఇతర జంతువులవల్ల (బాక్టీరియా,వైరస్‌లవల్ల)
3. శారీరక విక్షోభాలవల్ల (శరీరం తెగడం, కాలడం,ఎముకలువిరగడం)



బొర్రా గోవర్ధన్
9390600157

శరీరం ఆహారపదార్థాల లోటుని నెమ్మదిగా సరిదిద్దుకుంటుంది. సూక్ష్మజీవుల వల్ల కలిగే హానినుండి రక్షణకోసం యాంటీబాడీస్ ఉత్పత్తి చేసుకుంటుంది. గాయాల్ని,విరిగిన ఎముకల్ని తనకు తానే నయం చేసుకుంటుంది. నూటికి 90 రోగాల్ని మన శరీరమే తగ్గించు కోగలదు. దీనికి మనం తినే ఆహార, విహారాల్లో కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే చాలు.

ప్రజావైద్యులు డా॥ బ్రహ్మారెడ్డి గారు చెప్పేది ఇదే- 'నూటికి 90 రోగాలకి మందులు అవసరం లేదు. మిగిలిన ఆ పది రోగాల విషయంలో జాగ్రత్తగా ఉంటే చాలు. అలాగే ఇప్పుడు మార్కెట్లో వరదలా పారుతున్న వేలాది మందులు కూడా ఇన్ని అవసరం లేదు. పది మందులు చాలు." అంటారు.

అంటే- జీవుల శరీరం ఏదైనా తనకు తానే అవరోధాల్ని అధిగమించగల అద్భుత నిర్మాణమన్నమాట. మానవ శరీరం 29 మూలకాలముద్ద. వీటిల్లో ఎక్కువగా వుండే మూలకాలు, తక్కువగా ఉండే మూలకాలు, అతి తక్కువగా ఉండే మూలకాలు అని మూడు రకాలు.

**1. స్థూల మూలకాలు:** 1మిల్లీ గ్రాము పరిమాణం కన్నా ఎక్కువ ఉండేవి.కార్బన్,హైడ్రోజన్, ఆక్సిజన్, నైట్రోజన్, సోడియం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, భాస్వరం, గంధకం ఈ 12 ద్వాదశమూలకాలు.

**2. సూక్ష్మమూలకాలు:** కాపర్,జింక్,కోబాల్టు,మేంగనీస్, మోలబ్డినం, అయోడిన్, ఫ్లోరిన్. ఇవి ఏడు.

**3. అతిసూక్ష్మమూలకాలు:** బ్రోమీన్, బోరాన్, సిలికాన్, ఆర్సెనిక్, నికెల్, అల్యూమినియం, లెడ్, టిన్, వెనేడియం, టైటానియం.. ఈ పది అతి సూక్ష్మమూలకాలు

పైవాటిలో, మొదటి 12 మూలకాలు మనలో 99.2% వుంటే మిగిలిన మూలకాలు కేవలం 0.8% మాత్రమే వుంటాయి.

ఇన్నీ అవసరమే అయినా మొదటి 12+7 మూలకాల సమతుల్యం తప్పితే అనారోగ్యం వెంటనే వస్తుంది. ఈ సమతుల్యతను సరిజేయడమే వైద్యంలో ఒక భాగం. మానవజాతులకు మొదట తెలిసిన వైద్యం ఇదే.

ఒక్కొక్క ప్రాంతంలో అక్కడి ఆహారమేకాదు, వాతావరణాల్ని బట్టి ఒక్కోరకం జబ్బులు అధికంగా ఉంటాయి. ఉష్ణమండల ప్రాంతంలో జీవించే ప్రజల జబ్బులు వేరు. అతిశీతల ప్రాంతంలో జీవించే వారికి వచ్చే జబ్బులు వేరు. సమశీతోష్ణమండలంలో బ్రతికేవారికి వచ్చే జబ్బులు వేరు. అలాగే పర్వతాలపైన, సముద్రతీరాల్లో జీవించే వారికి వచ్చే రోగాలు వేరు. అంటే..వారిలో విశేషంగా కన్పించే రోగాలని బట్టి వారు జీవించే ప్రాంతాల్ని చెప్పొచ్చు.

చాలా రోగాలు అందరికీ ఉమ్మడిగా ఉన్నా, ఆయాప్రాంతాల తీరుతెన్నుల్ని బట్టి, అక్కడ దొరికే ఆహారాన్ని బట్టి, అక్కడి శీతోష్ణస్థితుల్లో పెరిగే బాక్టీరియాలు, వైరస్‌లను బట్టి వచ్చే ప్రత్యేకరోగాలు వేరు వేరు. సముద్రతీరం ప్రాంతం వారికి ఈసినోఫీలియా, భూమిలో సున్నపు పొరలున్న ప్రాంతం వారికి ఫ్లోరిన్ వ్యాధి, హాస్టల్లో ఉండే విద్యార్థులకు అమీబియాసిస్...ఇలా.

## జముకుల కథ - జాతక కథ

ఉప్పు కూడా మానవ ఆరోగ్య సంపదకి మూలమైందే!-
నలుడూ, భీముడూ వండినప్పటికీ.. అందు..
"ఇంపొదివెడు ఉప్పులేక రుచిపుట్టుగ నేర్చునటయ్య భాస్కరా!"

అన్నాడు భాస్కర శతకకర్త మారద వెంకయ్య.

ఉప్పుని 'రుచి' అని చాలాచోట్ల పిలుస్తారు. ఉప్పు గురించిన ప్రస్థావన బౌద్ధజాతక కథల్లో చాలా కథల్లో వస్తుంది. దాదాపుగా ప్రతికథలో ఒక వ్యక్తి సన్యసించడం, హిమాలయాలకు పోవడం, అక్కడ నివసిస్తూ సంవత్సరంలో రెండుసార్లు 'ఉప్పు'కోసం గ్రామాలకు రావడం ఉంటుంది.

కోరికలు వదులుకున్న పరిత్యాగులు ఉప్పుకోసం ఇలా రావడం ఏంటి? అనిపిస్తుంది. ఈ విషయం అలా ఉంచి మరోవిషయం చూద్దాం.

శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతానికి చెందిన కథ ఇది. అక్కడ జరిగిన గిరిజన రైతాంగ పోరాటాన్ని జముకుల కథగా మలచాడు పాణిగ్రాహి సుబ్బారావు గారు. ఆ కథలో విషయం ఇది: మైదాన ప్రాంత వ్యాపారులు బస్తా ఉప్పు తీసుకుపోయి, అక్కడ గిరిజనులకు ఇచ్చి, దానికి ప్రతిగా బస్తా చింతపండో, బస్తా మసాలా దినుసులో తెచ్చుకునేవారట! అంతగా దోపిడీ చేసేవారు.

అందుకే.. "ఉప్పు అమ్మితే ఊళ్ళు కొనొచ్చు" అనే సామెత వచ్చింది–

పనిచేసిన వారికి కూలిగా 'ఉప్పు'ను ఇచ్చే పద్ధతి ప్రపంచంలో చాలాచోట్ల ఉంది. అందుకే 'నీ ఉప్పుతిని బ్రతికాను' అంటుంటారు.

తన తల్లి వచ్చి, తన జన్మరహస్యం చెప్పి 'నాయనా నీవూ పాండవునివే. నీ సోదరుల పక్షం వహించు' అని కుంతి, కర్ణుణ్ణి కోరినప్పుడు–

"అమ్మా! నేను సుయోధనుని ఉప్పుతిని బ్రతికాను" అంటాడు కర్ణుడు. ఈ ఉప్పోపాఖ్యానం ఎందుకంటే...

మన శరీరంలో సత్తువనిచ్చే పదార్థాల్లో సోడియం ఒకటి. సోడియం లేకపోతే నిస్సత్తువ వచ్చేస్తుంది. మనిషి పాలిపోతాడు. నీరసించి పడిపోతాడు. నీరసించిన వారికి సెలైన్ పెడతాం గదా! అందులో ఉండేది గ్లూకోజ్‌తో పాటు ప్రధానంగా సోడియం. సోడియం శక్తిని ఇనుమడింప చేస్తుంది. సోడియం ఉప్పులో అత్యధికంగా ఉంటుంది. అందుకే ఉప్పుని సోడియం క్లోరైడ్ అంటాం. మనం తాగే గ్లూకోజ్‌లో, ఎలక్ట్రాల్‌లో, లేతకొబ్బరి నీళ్ళలో కూడా ఉంటుంది. రీహైడ్రేషన్ డ్రింక్ అంటే పంచదార+ఉప్పే. కాబట్టి ఉప్పు పొడ తగలని వారు ఉసూరుమంటూ బతకాల్సి వస్తుంది. అందుకే జాతకకథల్లో తాపసులుగానీ, అడవుల్లోని వారుగానీ ఉప్పుకు ఎక్కువ విలువనిచ్చేవారు.

పోయిన ఉత్సాహాన్ని, ఉప్పును తీసుకున్నప్పుడు వచ్చినట్లు గుర్తించడమే 'వైద్యం'.

సముద్రాలకి దూరంగా ఉన్నవారికి 'ఉప్పు' లేక రోగాలొస్తే, సముద్రతీరంలోని వారికి ఉప్పు ఎక్కువై రోగాలొస్తాయి.

ఈ వ్యత్యాసాన్ని గమనించినవాడే వైద్యుడు. ఈ గమనించడం అనేది జీవితానుభవంలో అందరికీ కాస్తో కూస్తో ఉంటుంది. ప్రతివాడూ 'బాత్‌రూం భాగవతారే' అయినట్లు, ప్రతివాడూ అంతో ఇంతో వైద్యుడే!–

ఈ అనుభవాల్ని బేరీజు వేసుకొని, దానిమీదే మనస్సు నిలిపి, కృషిచేసి ఆ ఇబ్బందుల్ని సరిదిద్దడమే 'వైద్యం'. అలా సరిదిద్దేవాడే వైద్యుడు. ఆ సరిదిద్దే ప్రక్రియే 'చికిత్స'.

అంటే మనం తినే ఆహారంలో ఏయే పదార్థాలు తక్కువ కావడం వల్ల ఆ అనారోగ్యం వచ్చిందో, ఏయే పదార్థాలు ఎక్కువగా తినడం వల్ల ఆ అనారోగ్యం పోతుందో తెలిసినవాడే వైద్యుడు.

రుగ్వేదంలో ఇలాంటి వైద్యులు అశ్వనీ దేవతలు.

మానవజాతుల పరిణామక్రమంలో పాతికవేల సంవత్సరాలనాటి నియాండర్తల్ మానవుల నుండే ఈ చికిత్సా విధానాలు తెలుసు–

అయితే, చారిత్రక కాలం నాటి నుండి లెక్కిస్తే చైనా, భారత్, ఈజిప్టు– ఈ మూడు దేశాల్లోనే అతి పురాతన కాలం నుండి వైద్యవిధానాలున్నట్లు రుజువయ్యింది.

## ఆర్యులు – ఆహారం – అనారోగ్యం

ఏ జాతి ఆరోగ్యమైనా మనం ఇంతకు ముందు చెప్పుకొన్నట్లు వారు జీవించిన ప్రదేశం, ఆహారపు అలవాట్ల మీద ఆధారపడి ఉంటుంది. ఆర్యుల ఆహారంలో మాంసం , మద్యం తప్పని సరి. వారు 'సోమరసం' బాగా సేవిస్తారు. సోమరసం అంటే మత్తుపదార్థమే.

ఆర్యులు మధ్య ఆసియా ప్రాంతం వారు. సమశీతోష్ణ మండలంలో వీరి జీవితం సాగింది. ఈ ప్రాంతంలో పెరిగే మొక్కలు బాగా పుష్పిస్తాయి. చాలా రకాల తీగమొక్కలుంటాయి. ముఖ్యంగా ద్రాక్ష ఆ ప్రాంతంలో దొరికే ఒక తీగ మొక్క. సోమరసాన్ని తయారుచేసే సోమలత కూడా అలాంటిదే అయ్యిండొచ్చు. వివిధ తీగజాతి పండ్లు ఈ ప్రాంతంలో దొరికే పంట. ఖర్జూర బాగా దొరికే ఆహారం. యవలు, గోధుమలు అక్కడ బాగా పండే ధాన్యం.

ఈ ప్రాంతంలో నివసించిన క్రోమాగ్నన్ మానవులకు పూర్వీకులైన నియాండర్తల్ మానవులకే ద్రాక్షాసారాయి తెలుసు. నిలువబెట్టిన తోలుసంచుల్లోని మాగిన ద్రాక్షాపళ్ళరసాన్ని (వైన్‌ని) ఇష్టంగా తాగేవారు.

ఈనాటికీ ప్రపంచంలో అత్యధికంగా మేలైన మద్యాన్ని ఉత్పత్తి చేసే ప్రాంతం ఇదే. కాబట్టి ఆర్యుల

'సోమపానం' కూడా ఈ వాతావరణంలో భాగమే!

గంగా తీరంలో, గోదావరీ తీరాల్లోని ఉష్ణమండల గడ్డిభూముల్లో ఇలాంటి లతలు ఉండవు. అందుకే ఇక్కడి వారికి 'కల్లు' ప్రధానమైన మత్తుపదార్థం. ఆ తర్వాత వచ్చింది 'సురా లేదా వారుణీ . నాటురకాలైన కల్లు, సారాయిల కంటే 'సోమం' సున్నితమైన మత్తుపదార్థం.

ఎంతసున్నితమైనా సోమం కూడా మత్తుపదార్థమే కాబట్టి, ఒక స్థాయి వరకు ఉత్సాహాన్నిచ్చినా స్థాయిని మించితే అతి మత్తును కలిగిస్తుంది. శృతిమించితే కాలేయాన్ని కాటేస్తుంది. ఆర్యులు సోమాన్ని అతిగా తీసుకునేవారు .దానివల్ల వారికి ఉత్సాహం వచ్చినా దీర్ఘకాలసేవనం వల్ల 'కాలేయాలు' క్రమక్రమంగా బలహీన పడేవి.

ఆర్యుల్లో చాలా ఎక్కువమందిలో గుండెజబ్బులు, కాలేయ జబ్బులున్నట్లు ఋగ్వేదాన్ని బట్టి తెలుస్తుంది. కాలేయ జబ్బులంటే పసికర్లు, కామెర్లు.

ఈ కాలేయ రోగం ఎలా వస్తుందో, ఎందుకు వస్తుందో తెలియక పోయినా, ఏమిచేస్తే తగ్గుతుందో వారికి అనుభవం నేర్పింది. అదే ఈ రుక్కులో కనిపిస్తుంది.

**ఉద్యన్నద్య మిత్రమహ ఆరోహన్నుత్తారాం దివం**
**హృద్రోగం మమ సూర్య హరిమాణం చ నాశనం**
**(ఋ: 1-50-11)**

"సూర్యుడా! ఉదయించు. త్వరగా ఆకాశంలో పైపైకిరా. నా శరీరానికి కల్గిన పసుపుపచ్చదనాన్ని, పాలిపోయిన శరీరాన్ని, హృదయరోగాన్ని నాశనం చేయి"

తగినంత ఎండ శరీరం మీద పడకపోతే- పాండురోగం (ఎనీమియా), కామెర్లరోగం, గుండెరోగాలు వస్తాయని, సూర్యుని ఎండతీవ్రత ఆ రోగాల్ని నయం చేస్తాయనీ ఆర్యులు నమ్మారు.

ఇప్పుడు కూడా అప్పుడే పుట్టిన పిల్లలకి కామెర్లు వ్యాధి సహజంగా వస్తుంది. అంతే సహజంగా పోతుంది. ఈ వ్యాధి సోకిన పసిబిడ్డలకి ఎండ తగిలేలా చేయమంటారు డాక్టర్లు. ఈ రుక్కు చూడండి-

**శుకేషు మే హరిమాణం రోపణాకాసుదధ్మసి**
**అథో హరిద్రవేషు మే హరిమాణం ని దధ్మసి !**
**(ఋ: 1-50-12)**

"నా దేహంలోని ఆకుపచ్చదనం (పసికర్లు) చిలుకలకు, పసుపు పచ్చదనం (కామెర్లు) గోరింకలకు, లేతపచ్చదనం పచ్చని చెట్లకు ఇస్తాను. అవి అక్కడ సుఖంగా ఉంటాయి" - ఇదీ ఈ రుక్కు అర్థం. ఎండ బాగా తగిలితే మానవదేహంలో పచ్చదనం పోతుందనీ, చెట్లకు పచ్చదనం పెరుగుతుంది అనేది వారి అనుభవం. వారు ఆలపించే ఈ రుక్కుని చూస్తున్నప్పుడు ఒక అనుభవం మెదులాడకుండా వుండదు.

మనలో చాలామందికి ఈ అనుభవం ఉండే ఉంటుంది. కాలిలో ముల్లు దిగబడినప్పుడు, దాన్ని పిన్నీసుతో తీస్తూ అమ్మ మనల్ని పచ్చని చెట్టువంక చూస్తూ ఉండమనటం, చెట్టుమీద చిలకని చూపించి-

"పచ్చని చిలుక పారిపో - నా కాలి ముల్లూ కాలిపో" అని పాటపాడుతూ ఉండమంటుంది. మనం పాటలో పాడిపోయి, లీనమైపోయి ఉంటే.. అమ్మకూడా..

"తుమ్మముల్లు తుమ్మల్లోకి - ఈత ముల్లు ఈదుల్లోకి
గొబ్బిముల్లు గొబ్బిల్లోకి - చేరిపోవాలి
మా అబ్బాయికాలికి నొప్పి పోవాలి " అంటూ పాడుతూ.. పాడుతూ.. చటుక్కున ముల్లు తీసేస్తుంది. మనకు నొప్పి నుండి మరపు కోసం అలా అమ్మ చేసిన పని గ్రామీణులందరికి సర్వసాధారణమైన చిన్ననాటి అనుభవం .-

పై రుక్కు చదివినపుడు ఆ అనుభూతి వ్యక్తం కాకుండా ఉండగలదా!

ఇంకా, 1-122-5 లో, 1-50-13లో కూడా ఈ కామెర్ల ప్రస్తావన ఉంది. దానికి చేయాల్సిన సూర్యరశ్మి చికిత్స గురించీ ఉంది.

## ఆవుకన్నా మేక మిన్న

పాండురోగాన్ని రక్తహీనత(ఎనీమియా) అంటాం. రక్తంలో ఇనుపధాతువులు తక్కువ కావడమే దీనికి కారణం. అంటే ఇదీ ఆహారపు అలవాట్లు వల్ల వచ్చిన రోగమే అన్నమాట.

ఋగ్వేద ఆర్యులు మాంసాహారులు. సంచార జాతులు. ఆహారధాన్యాల కంటే ఆబోతుల మాంసమే వారికి ప్రతిరోజూ. కోడెదూడలు, లేగదూడలు, చూడి ఆవులు, చూడి ఆవుల గర్భాల్లోని దూడల పిండాలు- ఇలా అన్ని రకాల గోమాంసాన్ని కడుపారా తినేవారు. (ఈ గోమాంస వివరాలు యజుర్వేదం గురించి వచ్చే వ్యాసాల్లో తరువాత చూద్దాం)

మాంసాహారంలో మంచి ప్రోటీన్లుంటాయి. మాంసాహారంలో ఉండే కొన్ని ప్రోటీన్లు డి$_2$, డి$_4$ శరీర ఆకృతికి తోడ్పడితే, డి$_1$, డి$_3$ లు నాడీ నిర్మాణానికి ఉపయోగపడతాయి. కాబట్టి ఆర్యులు శారీరకంగానే కాకుండా, బౌద్ధికంగా కూడా దిట్టలే!

**ఆవుమాంసం, ఆవుపాలు వారికి ప్రధాన ఆహారం. వీటికి తోడు 'సోమం' ఉండనే ఉంది. ఈ శారీరక ధారుఢ్యం, బుద్ధికుశలత, ఉత్సాహాలే వారిని విజేతలుగా నిలిపాయి.**

అయితే, మాంసాహారంలో ప్రోటీన్లు అధికశాతంలో ఉన్నప్పటికీ ఐరన్ ధాతువు అంతంత మాత్రమే. ఆర్యులు

శాకాహారం ప్రత్యేకంగా తినే సందర్భాలూ, ఆకుకూరల్ని తినే సందర్భాలు ఋగ్వేదంలో ఎక్కడా లేవు.

100 గ్రాముల ఆవుమాంసంలో కొవ్వు 15 గ్రాములు ఉంటుంది. కానీ, ఇనుము 2.5 మిల్లీగ్రాములే ఉంటుంది.

ఇక, 100 గ్రాముల ఆవు పాలలో కొవ్వు 3 గ్రాములే ఉంటుంది. ఇనుము అస్సలు ఉండదు. (గేదె పాలలో ఇనుము 0.3 మి.గ్రా ఉంటుంది.)

ఇలా ఆర్యులు అతిగా తిన్న ఆవుమాంసం, ఆవు పాల పదార్థాల వల్ల వారికి కండరశక్తి ,శరీరాకృతి పెరిగినా...రక్తహీనత రావడం అతిసహజం.

కక్షేవంతుడు చెప్పిన ఈ రుక్కు చూడండి.

**ఆ వో రువణ్యుమౌశిజో హువధ్యై ఘోషేవ శంసమర్జునస్య...**

**(ఋ: 1-122-5)**

"అశ్వినీ దేవతలారా! ఉశిజ కుమారుణ్ణి అయిన కక్షేవంతుణ్ణి! తన పాండురోగాన్ని పోగొట్టుకోటానికి 'ఘోష' మిమ్మల్ని ఎలా పిలిచిందో అలా పిలుస్తున్నాను."- ఈ రుక్కులో పాండు రోగి 'ఘోష'.




ఆర్యుల్లో పాండురోగం జబ్బు అక్కడక్కడా తగులు తూనే ఉంది. భారతంలో పాండురాజే వున్నాడు.

ఆవుల్ని మేపిన ఆర్యులకంటే, గొర్రెల్ని మేపిన గోపాలురు ఆరోగ్యవంతులు. మేకలు, గొర్రెల పాలల్లో ఇనుము చాలా ఎక్కువగా ఉంటుంది. పాండురోగం వచ్చిన వారికి 'మేకపాలను' మందుగా వాడతారు. ('ఆవు' కంటే అతి పవిత్ర జంతువు 'మేక' అన్నమాట. దొడ్లో మేక ఉండే దవాఖానకు దూరంగా ఉండొచ్చు అంటారు. గాంధీగారికి ఈ విషయం బాగాతెలుసు. (బహుశా అందుకేనా, ఆవుమీద అతిప్రేమ నటించే వర్గానికి చెందినవాడు ఆయన్ని కాల్చేశాడు?) ఆర్యులు మేకపాలు వాడేరో లేదో తెలియదు.

అయితే- 'రోగం తగ్గించారు అశ్వనిలు' అనే ఉందిగాని, 'ఫలానా మందు ఇచ్చి' అనేది ఎక్కడా లేదు.

ఇప్పటి వరకూ మనం చెప్పుకున్న రోగాలు సమతుల్య ఆహారలేమివల్ల, వాతావరణ ప్రభావాల వల్ల వచ్చిన వ్యాధులు.

ఈ వ్యాధులు కూడా ఆర్యులు మధ్య ఆసియా నుండి వచ్చారనీ, ఆవుమాంసం, ఆవు పాలమీదే ఆధారపడ్డారని ఋజువు చేస్తున్నాయి.

ఋగ్వేదంలో ఇతర వైజ్ఞానిక అంశాలన్నింటి కంటే కాస్త ఎక్కువగా ఉన్నది వైద్య విజ్ఞానమే. 'ఈ వ్యాధులు వున్నాయి, అవి తగ్గాయి' అని మాత్రమే ఉంది కాని- "ఈ మందువల్ల ఈ రోగం, ఈ మందు ఇలా వాడడం వల్ల ఈ రోగం తగ్గుతా'యనే చికిత్సా విధానాలు ఋగ్వేదంలో ఎక్కడా లేవు.

భారతదేశంలో చికిత్సా విధానాన్ని శాస్త్రీయంగా వివరించింది బౌద్ధభిక్షువులే. బౌద్ధమే శాస్త్రీయ చికిత్సా విధానానికి నాంది పలికింది.

ఈ విషయం తర్వాత చూద్దాం. ఇప్పుడు వేదాల్లో ఉన్న ఇతర రోగాల గురించి చూద్దాం.

## అశ్వినీ దేవతలు - ఆరోగ్యప్రదాతలు

ఋగ్వేద కాలంలోని వైద్యులు అశ్వినీ దేవతలే. వీరు సూర్యుడు, వరుణుడు, రుద్రుని దగ్గర నుండి ఈ వైద్యాన్ని గ్రహించినట్లు ఉంది. **ఈనాడు వైద్యులు చాలా గొప్పగా చెప్పుకునే ధన్వంతరి ప్రస్తావన ఎక్కడా రుగ్వేదంలో లేదు.** (నిజానికి ధన్వంతరి అధర్వణవేదకాలం తర్వాతి వాడు. అతని కాలం ఇదమిద్ధంగా తేలలేదు. అయితే ఆర్యుడు మాత్రం కాదు. కేరళకు చెందిన ద్రవిడ వైద్యుడు.)

దీర్ఘతమ పుత్రుడు కక్షీవంతుడు, అధర్వణుడు, కాణ్వపుత్ర హరింబిరి, కుత్సుడు,సోభరి, యక్ష్మనాశకుడు రుగ్వేదంలో కనిపించే వీరంతా వైద్య రుక్కుల కర్తలు.

రుగ్వేదంలో ప్రథమ మండలంలో 112వ సూక్తకర్త అంగీరస పుత్రుడు కుత్సుడు. అతను ఈ సూక్తంలో అశ్వినులు చేసిన వైద్యం గురించి ఇలా చెప్పాడు.

**"యాభిర్ధేను మస్వం పిన్వథో నరా తాభిరు షు..." (3)**

(ఓ అశ్వినులారా! ఈనలేని ఆవుని ఈనేట్లు చేశారు)

**"యాభిః పరిజ్మాతనయస్య మజ్మనా ద్విమాతా తరణిర్విభూషతి" (4)**

(శయనుని గొడ్డుమోతు ఆవును పాలు ఇచ్చేట్లు చేశారు.)

**"యాభీ రేభం వివృథం సిత మద్భ్య ఉద్... యాభిః కణ్వం..."(5)**

("అశ్వినులారా! బావిలో పడ్డ రేభుణ్ణి రక్షించారు. నదిలో పడ్డ వందనుడనే రుషిని కాపాడారు..."

"సముద్రంలో పడిపోయిన భుజ్యుని రక్షించారు...") **(6)**

**"యాభిః శచీభిర్వృషణా పరావృజం ప్రాన్ధంశ్రోణం చక్షస పతవే కృథః...." (8)**

(కుంటివాడైన పరావృత రుషిని రక్షించారు. గుడ్డివాడైన రుషికి చూపు ప్రసాదించారు. మోకాళ్ళ వరకూ లేని శ్రోణుణ్ణి నడిచేలా చేశారు")

**"యాభిర్మనుం శూరమిషా సమావతం తాభీరూ షు ఊతిభిరశ్వనా గతం" (18)**

("శూరుడైన మనువుకు విత్తనాలు అందించి గొప్పగా వ్యవసాయం చేయించారు.")

**"యాభిః పత్నీర్విమదాయ న్యూహథురా ఘ వా యాభిరరుణీ**

**రశిక్షితం (19)**

(విమదుడు అనే ప్రభువుకి అతని భార్యతో సఖ్యత చేకూర్చారు–)

ఇవీ– ఈ 112 వ సూక్తంలో కుత్సుడు కీర్తించిన అశ్వనులు చేసిన చికిత్సలు.

వీటిలో పశువైద్యం ఉంది. నీటిలో పడిన వారిని కాపాడే వైద్యం ఉంది. వ్యవసాయానికి కావలసిన మంచి విత్తనాల ఎంపిక ఉంది. కాళ్ళలేని వారికి నడిచేందుకు కావలసిన పరికరాల అమరిక ఉంది. చివరికి– భార్యాభర్తల మధ్య సంసారిక సఖ్యతను కూర్చే వైద్యవిధానం (డా॥ సమరం లా) కూడా ఉంది.

అంటే ఈ అశ్వినీ దేవతలు జనరల్ ఫిజీషియన్లే కాకుండా, స్పెషలిస్టులు కూడా. ఇంకా, పశుపక్ష్యాదులకు, వరి వంగడాలకి కూడా వైద్యులేనని అర్థమవుతుంది.

అలాగే...

ప్రథమమండలం 116వ సూక్తంలో కక్షీవంతుడు కూడా అశ్వినులను ఇలా కీర్తించాడు.

**"జుజురుషో నాసత్యోతవవ్రిం ప్రామఞ్చతం**
**ద్రాపిమివచ్చవానాత్'**
**ప్రాతిరతం జహితస్యాయుర్ధస్రాదిత్**
**పతిమకృణుతం కనీనాం (10)**



('' అశ్వనులారా! చ్యవనుని ముసలితనాన్ని శరీరం పైనుండి కవచాన్ని తొలగించినట్లు తొలగించారు. ఆయువును ప్రసాదించారు. కన్యలకు భర్తను చేశారు")–

ఇలా వృద్ధాప్యపు లక్షణాల్ని పోగొట్టి కుర్రతనం వచ్చేలా చేశారు. ఋగ్వేదకాలం నాటికి వృద్ధాప్యం అంటే 40 ఏళ్ళు. మానవుల సగటు జీవితం అప్పుడు అంతే. గ్రుడ్డితనాన్ని తెలిపే 'చత్వారం' అనేది కూడా 40 ఏళ్ళ వృద్ధాప్యాన్ని తెలియజేసే పదమే. నలభై ఏళ్ళకు చూపు మందగించేది. గుడ్డితనం, శుక్లాలు ప్రారంభమయ్యేవి.

ఇలా వృద్ధాప్యపు లక్షణాలు వచ్చి మీదపడకుండా దేహశక్తిని అశ్వినులు ఔషధాలు ఇచ్చి ఉంటారు.

ఇప్పుడు బలంకోసం వాడే ఆయుర్వేద లేహ్యం పేరు 'చ్యవనప్రాస' ఈ చ్యవనుని పేరుతో వచ్చిందే. చ్యవనప్రాస తింటే చ్యవనునిలా శక్తి తిరిగి వస్తుందని చెప్పడానికి (వచ్చినా రాకపోయినా) ఈ పేరు పెట్టారు.

ఇంకా– ఈ సూక్తంలో మరికొన్ని రుక్కుల్ని చూద్దాం.

**"అజోహవీన్నాసత్య కరావం మహే యామన్ పురుభుజా పురంధిః శ్రుతం తచ్ఛాసురిత వధ్రిమత్యా హిరణ్య సహ్త మశ్వినావ దత్తం(13)**

సంతాన శక్తిలేని వాని భార్య వధ్రమతి. ఆమెకు హిరణ్య హస్తుడనే పుత్రుడు కలిగేలా చేశారు అశ్వినులు !–

ఇక్కడ సంతానం ఎలా కలిగించారనే వివరణ లేదు. 'గురువు చదువును అందించినట్లుగా... అందించారు' అని ఉంది.

"ఖేలుడు అనే రాజుభార్య విశ్పల. యుద్ధంలో ఆమె కాలు తెగిపోయింది. ఆమెకు ఇనుపపాదాన్ని అమర్చారు– (15)

రుషాంగిరుడు అనేవాడు తన కొడుకు ఋజ్రాశ్వునికి కళ్ళు పోగొట్టాడు. అశ్వినులు తిరిగి అతనికి చూపు తెప్పించారు. (16)

అలాగే అశ్వినులు రేభుణ్ణి నీటిలోంచి రక్షించిన విషయం కూడా 24వ రుక్కులో చెప్పారు.

ఇలా వృద్ధాప్యం నుండి, వంధ్యత్వం నుండి, అంధత్వంనుండి రక్షించడం, ఇనుప పాదాల్ని అమర్చడం అశ్వినులు చేశారని ఈ సూక్తంలో కక్షీవంతుడు కీర్తించాడు.

అలాగే 117వ సూక్తంలో కూడా కుష్టురోగం నుండి కాపాడడం (7), వినికిడి జ్ఞానాన్ని ప్రసాదించడం (8), కుష్ఠురోగం నుండి, అంధత్వం నుండి కాపాడ్డం (17), తెగిన కాళ్ళకి పాదాలు అమర్చడం (11), కంటికి పొరలు(శుక్లాలు)తొలగించి చూపు తెప్పించడం వీటితోపాటు పక్షికి (తిత్తిరిపిట్ట) వైద్యం చేసి దాని ప్రాణాలు కాపాడారు (16) అని కూడా కక్షీవంతుడు కీర్తించాడు. ఇవే విషయాల్ని 118, 119 సూక్తాల్లో కూడా చెప్పాడు.

**"యువం వందనం నిరృతం జరణ్యయా**
**రథం నదస్రా కరణా సమిన్వథః**
**క్షేత్రాదా విప్రం జనథో విపన్యయా ప్రవామత్ర విధతే**
**దంసనా భువత్" (1-119-7)**

("ఓ అశ్వినులారా! జీర్ణమైన రథాన్ని తిరిగి బాగుచేసినట్లు నందుడు అనే రుషిని బాగుచేశారు. తల్లిగర్భంలో నుండి బైటకు రాలేక వామదేవుడు మిమ్మల్ని స్తుతించాడు. మీరు ఆతణ్ణి తల్లిగర్భం నుండి సురక్షితంగా బైటకు రప్పించారు")

అశ్వినులు అత్యవసర వైద్యం చేయడానికి పగలు మూడుసార్లు, రాత్రి మూడుసార్లు రోగుల దగ్గరకు వచ్చేవారని (1-34-2) లో ఉంది.

అలాగే... అశ్వినిలు నీటికి, వనస్పతులకి, లతలకు వైద్యం చేసేవారని 8-9-5 లో ఉంది.

మనుషులకి, పశువులకి, పక్షులకి, పంటలకి, నీటికి, ఇలా అన్ని విభాగాల్లో వారే చికిత్సలు చేసేవారని ఋగ్వేదం చెప్తుంది. ఇలా అన్ని విషయాల్లో 50 ఏళ్ళక్రితం వరకూ గ్రామాల్లోని వైద్యులు సూచనలిచ్చేవారు. వారు పశువులకీ, మనుషులకీ వైద్యం చేసేవారు. ఇప్పుడిప్పుడు వైద్యపరిధి విస్తరించి స్పెషలిస్టులు వచ్చారు.

కణ్వపుత్రుడైన సోభరి అశ్వినుల గురించి ఇలా కీర్తిస్తున్నాడు...

**యాభిః పక్థమపదో యాభిరధ్రిగుం యాభిర్బభ్రుం విజోషసం తాభిర్నో మక్షూ తూయమశ్వినా గతం భిషజ్యతం యాదాతురం (1-8-10)**

( ఓ! అశ్వినులారా! మీరు మీదగ్గరున్న ఓషధులతో పక్థుడు అనేవాణ్ణి కాపాడారు. అధ్రిగుణ్ణి రక్షించారు. బభ్రు కుటుంబాన్ని కాచారు. ఏ ఔషధాలచేత వారిని రక్షించారో ఆ ఔషధాలతో రండి. ఈ రోగికి చికిత్స చేయండి)

## రోగాలు - ఔషధాలు

ఆర్యుల ఆరోగ్యానికి ఒక కారణం వారి జీవితం. వారు సంచారులు. గుర్రపుస్వారీ బాగా తెలిసినవారు. వినోద ప్రియులు. పుష్టికరమైన మాంసాహారం. బలమైన దేహాలు. వీటన్నింటితోపాటు తాగి ఆటపాటలతో నృత్యాలు చేయడం రోజువారీ కృత్యం. ఆడామగా, పిల్లాజల్లా అందరూ అలసి సొలసి మత్తిల్లేదాకా నృత్యాలు చేసేవారు. నృత్యం వారి శరీరానికి మంచివ్యాయామం. గుర్రపుస్వారీ కూడా వ్యాయామమే.

అయితే గ్రీకు, రోమన్ రాజ్యాల్లో ప్రధానంగా ఉండే కుస్తీ పోటీలు, మల్లయుద్ధాలు పెద్దగా ఉన్నట్లు ఋగ్వేదంలో ఎలాంటి ఆధారాలు లేవు.

ఋగ్వేదంలో ఇరవై వరకూ రోగాలు కన్పిస్తాయి. వీటి లక్షణాలేమిటో తెలియదు. వాటికి ఏయే మందులు వాడేవారో తెలియదు. వీటిలో కొన్నింటి వివరాలు అధర్వణ వేదంలో ఉన్నాయి. క్రీ.పూ. 2వ శతాబ్దం వరకూ వేదాలు మూడే. వేదత్రయం అనే ఉంటుంది. అంటే అధర్వణవేదం అనేదాన్ని ఆ తర్వాతే వేదాల జాబితాలో చేర్చారు.

కాబట్టి క్రీ.పూ. 1000 కు ముందున్న వేదాలు మూడే. ఈ వ్యాసాల్లో ఆ విషయాన్నే చర్చిస్తున్నాం.

ఋగ్వేదంలో పలుచోట్ల ఈ రోగాల ప్రస్తావన ఉంది. అది, అగద, అజక (ధనుర్వాతం), అజ్ఞాత, యక్ష్మ, అనమీయ, అనూక్య, అపాన, అను, అశీపద, అశీమిద, జీవగృధ, మూలశంఖ, నవజ్వార, వృషణ్య, పృష్ఠ్యామయీ, యక్ష్మ, రాజయక్ష్మ (క్షయ), వందనబద్రి, వినభృ, విషూచి, సురామ, శ్రీమ, హరిమ, హృద్రోగ, పాండురోగం...

శరీరానికి 'అశక్తిని' కలిగించే దాన్ని 'యక్ష్మ' అని ఋగ్వేద ఆర్యులు అన్నారు. మామూలుగా యక్ష్మ అంటే క్షయరోగం. క్షీణింపచేస్తుంది. అయితే, మామూలు రోగం కూడా శక్తిని క్షీణింపచేస్తుంది కాబట్టి చాలా చోట్ల 'యక్ష్మ' అనే అన్నారు. అతిగా క్షీణింపజేసే క్షయవ్యాధిని 'రాజయక్ష్మ' అన్నారు.

ఆర్యుల్లో రక్తహీనత, కామెర్లు వ్యాధుల్లానే కుష్టువ్యాధి, క్షయవ్యాధి (రాజయక్ష్మ) కూడా ఎక్కువగానే ఉండేది.

మానవ సమాజాల్లో క్షయవ్యాధి ఇప్పటిది కాదు. 5లక్షల సంవత్సరాలనాటి హోమోఎర్గాస్టర్ మానవజాతి నుండే నిమోనియా, క్షయ వ్యాధులున్నట్లు ఆనాటి మానవశిలాజాల్ని బట్టి తెలుస్తుంది. ఇప్పటికీ ..నేటి అత్యాధునిక సమాజాన్ని పట్టిపీడిస్తున్న జబ్బుల్లో క్షయ ఒకటి.

ఇక, గుండెజబ్బు. ఇది కూడా ఋగ్వేదంలో ఎక్కువగా ప్రస్తావించిన రోగమే. ముఖ్యంగా దక్షణాయన కాలంలో అంటే సూర్యుడు ఉత్తరం నుండి దక్షిణార్ధగోళం వైపు వచ్చేకాలంలో ముఖ్యంగా సెప్టెంబర్-జనవరి నెలల మధ్య (శరత్, హేమంత, శిశిర రుతువుల కాలంలో) ఆర్య నివాస ప్రాంతాల్లో ఎండ చాలా తక్కువగా ఉంటుంది. ఋగ్వేద ఆర్యుల పూర్వ నివాసాలు $30^0$-$40^0$ ల ఉత్తర అక్షాంశాల దగ్గర కాబట్టి సూర్యుడు దక్షిణాయన అంతం నాటికి వారికి దాదాపు $60^0$ దూరానికి పోతాడు. చాలారోజులు అక్కడ ఎండ పొడ ఉండదు. ఇలాంటి ప్రాంతాల్లో వారికి కాలేయవ్యాధులు విజృంభిస్తాయి. తినేది అచ్చంగా ఆబోతుల మాంసమే కాబట్టి, గోమాంసంలో ప్రతి 100 గ్రాములకి ప్రోటీన్లు 26 గ్రాములు, కొవ్వులు 15 గ్రాములు ఉంటాయి కాబట్టి హృద్రోగాలు సహజం. దక్షణాయన కాలం అంటే ఆర్యులకు నరకమే. అందుకే వారు ఉత్తరాయన కాలాన్ని పుణ్యకాలంగా భావించేవారు.

కణ్వపుత్ర ప్రస్కణ్వుడు ఇలా అంటాడు-

"ఓ! సూర్యుడా! ఈ ఉత్తరాయన కాలంలో... నీవు వచ్చి నా హృదయరోగాన్ని, పాండురోగాన్ని పారద్రోలు"- అని

అయితే, గుండెజబ్బుని వారు పీడగా భావించేవారు కాదు. సుఖమైన చావుగా(అనాయాస మరణంగా) తలచేవారు. హృద్రోగాన్ని శ్లాఘనీయ మృత్యువు (మెచ్చుకోవాల్సిన చావు)గా భావించేవారు. **(ఇంకావుంది)**


### చందాదారులారా!

ప్రతినెలా 25వ తేదీన స్వేచ్ఛాలోచన పోస్టవుతున్నది. నెల చివరికల్లా పాఠకులకు అందాలన్నదే లక్ష్యం. పదిరోజుల్లోగా పత్రిక అందకపోతే 9490419044 నెంబర్‌కి మెసేజ్ పంపండి. పత్రికను తెస్తున్న కవర్‌మీద, మీ చిరునామాకు పైన, మీ చందా గడువు కూడా వుంటుంది. దయచేసి గమనించండి. గడువు పూర్తికాగానే చందాసొమ్మును పంపి సహకరించండి. పత్రికపై మీ అభిప్రాయాలను ఇ-మెయిల్/ సంక్షిప్త సందేశ పద్ధతుల ద్వారా ప్రతినెలా 5వ తేదీలోగా చేరేటట్లు పంపండి. **- మేనేజర్, స్వేచ్ఛాలోచన**

**వేదాలు-విజ్ఞానం: 8**

# ఋగ్వేదంలో వైద్యం-2

అన్నిరకాల రోగాల్ని పారద్రోలేవాడు వైద్యుడు. రుగ్వేదంలో వైద్యునికి చెప్పిన నిర్వచనం చాలాగొప్పగా ఉంది.

**యత్రౌషధః సమగ్మత రోజానః సమితా వివ**

**విప్రః స ఉచ్యతే భిషగ్ రక్షోహామీవ చతనః (రు: 10-97-6)**

**ఆర్యుల రాజకీయ వ్యవస్థ గణతంత్ర వ్యవస్థ. అన్ని గణాల రాజులూ కలిసి ఉండే దాన్ని 'సమితి' అంటారు. ఐక్యరాజ్యసమితి అన్నమాట. అలా రాజులందరూ ఒకేచోట చేరినదాన్ని సమితి అన్నట్లు, ఔషధాలన్నీ ఎవ్వని దగ్గర చేరి ఉంటాయో అతనే వైద్యుడు . వైద్యుణ్ని భిషక్ అన్నారు. అంటే రోగపీడ రక్షకుడు అన్నమాట.**

## అధర్వణుడు – ఔషధాలు




బొర్రా గోవర్ధన్
9390600157


ఆధునిక కాలంలో వైద్యుని నిర్వచనంగా చెప్పే శ్లోకం ఒకటుంది..అది..

**'ఏకానాం విద్యా నవిద్యా శాస్త్రనిశ్చయం**

**తస్మాత్! బహుశ్రుంతః శాస్త్ర వైద్యావిచికిత్సః'**

అంటే.. ఏదైనా ఒకేఒక్క వైద్యవిధానం తెలిసినవాడుకాదు. అనేక రోగాలకు చికిత్సలు తెలిసినవాడే వైద్యుడు అని దీనర్ధం. మనం ఇంతకు ముందే చెప్పుకున్నట్లు ఔషధాల పేర్లు, తయారీ ఋగ్వేదంలో ఎక్కడా లేదుగానీ, ఈ ఇరవై, పాతిక రోగాలకి వాడే ఔషధాలు మాత్రం 4 రకాలే అని ఉంది.

**"అశ్వావతీం సోమావతీ మూర్జయన్తీ ముదోజసం....**

**(రు: 10-97-7)**

రుగ్వేదం పదోమండలంలో 97వ సూక్తకర్త అధర్వణుడు. అధర్వణుడు ఔషధాల గురించి ఈ సూక్తంలో ప్రస్తావించాడు.

'అశ్వినీ దేవతలు 'ఇలా చేశారు– అలా రోగాలు తగ్గించారు' అని' రుగ్వేదం మొదటి సూక్తాల్లో ఆయా సూక్తకర్తలు అశ్వినులను కీర్తించారు. అంటే అశ్వినీ దేవతలు రుగ్వేదకాలానికి ముందువారు లేదా తొలితరం వారు అనేది అర్ధమవుతుంది. కానీ అధర్వణుడు రుగ్వేదరుషి. ఆయన కూడా ఏయే రోగానికి ఏయే ఔషధం పనికి వస్తుందో వివరాలు చెప్పకపోయినా ఔషధాల గురించిన ప్రాథమిక ప్రస్తావనలు చేసింది ఆయనే. మిగిలిన సూక్తకర్తల్లా ఆయన ఎక్కడా అశ్వినీ దేవతల్ని కీర్తించలేదు. ఔషధాలనే కీర్తించాడు.

అధర్వుణుడి సూక్తాలు రుగ్వేదం పదోమండలంలో ఉన్నాయి. అంటే రుగ్వేద చివరికాలం వాడై ఉండాలి.

రుగ్వేదంలో మొదటి 7 మండలాల కాలం క్రీ.పూ. 1500 – క్రీ.పూ.1300 మధ్యకాలం. 8వ మండల కాలం క్రీ.పూ. 1300 – క్రీ.పూ. 1200 మధ్యకాలం. అచ్చంగా సోమరసాన్ని గురించి చెప్పే 9వ మండలం ఆ తర్వాత 100 సంవత్సరాలది. ఇక పదోమండలం ఆ తర్వాతి 100 సంవత్సరాలది. అంటే అశ్వినీ దేవతలను గురించి ఇతర రుషులు చెప్పిన సూక్తాలకీ, అధర్వణుడు ఓషధులు గురించి చెప్పిన సూక్తాలకీ 500 సంవత్సరాల కాలావధి ఉందన్నమాట. అంటే...పదోమండలం తర్వాత 200 సంవత్సరాలకి (క్రీ.పూ 800) అధర్వణవేదం వచ్చింది.

**రుగ్వేదంలో అధర్వణుడు చెప్పిన ఔషధాల ప్రక్రియను మరింత మెరుగు పరిచినదే అధర్వణవేదం. అయితే, అది ఆ తర్వాత ఎప్పటికో నాలుగోవేదంగా గుర్తించబడలేదు. దానిలో వైద్య ప్రక్రియలు, చికిత్సా విధానాలు ఉన్నాయి.**

పదోమండలంలో అధర్వణుడు చెప్పిన ఈ 97వ సూక్తంలో 5వ రుక్కులో ఇలా ఉంది:

"ఔషధులారా! మీ నివాసం అశ్వత్థం, పలాశలు" అని. అశ్వద్ధం అంటే రావిచెట్టు, బోధివృక్షం. పలాశం అంటే మోదుగచెట్టు. దీన్ని బ్రహ్మవృక్షం అని కూడా అంటారు. అలాగే మరోచోట సాలవృక్షం గురించి కూడా ఉంది. సాలమంటే శివలింగాల చెట్టు. (బుద్ధుడు పుట్టింది, మరణించింది ఈ సాలవృక్షం క్రిందే)–

అలాగే ఈ ఓషధుల్ని సూర్యునికి చెందినవి, చంద్రునికి చెందినవిగా విభాగించి చెప్పడం 17, 18, 19 రుక్కుల్లో కన్పిస్తుంది. ఇంకా– అధర్వణుడు ఇలా అంటాడు–

**"అతి విశ్వాః వరిష్ఠాఃస్తేన ఇవ వ్రజమక్రముః**

**ఔషదీః ప్రాచుచ్యవ్రర్యత్ కిం చ తన్వోజరపః**

**(ఋ: 10–97–10)**

(దొంగ, కొట్టాన్ని తెరచి ఆవుల్ని దొంగిలించుకుపోతున్నట్లు, ఔషధులు శరీరంలోని వ్యాధుల్ని తీసుకుపోతున్నాయి–")

ఈ సూక్తంలో–చెప్పుకోవాల్సిన, చర్చించాల్సిన రుక్కు

ఈ కింది రుక్కు.

**"ఔషధయః సం వదన్తే సోమేన సహరాజ్ఞా**
**యస్మైకృణోతి బ్రాహ్మణస్తం రాజన్ పారయామసి"**
**(ఋ: 10-97-22)**

("ఏ రోగి కొరకు బ్రాహ్మణుడు (వైద్యుడు) చికిత్స చేయునో ఆ రోగిని మేము రక్షిస్తాము'' అని ఔషధులు సోమునితో (చంద్రునితో) వాదానికి దిగాయి-)

ఈ రుక్కుతో వైద్యునికి 'బ్రాహ్మణ' అనేపదం మొదటిసారి ఋగ్వేదంలో ఇక్కడే కన్పిస్తుంది. వైద్యునికి 'భిషగ్' అనే పదాన్ని చాలాచోట్ల వాడారు. బిషగ్ అంటే 'మందు'. ఔషధం. ఔషధాలు ఇచ్చేవాడు అనే అర్థం. కానీ, వైద్యుణ్ణి 'బ్రాహ్మణ' శబ్దంలో పిలవడం ఇక్కడే కన్పిస్తుంది.

అంటే... ఈ సూక్తాన్ని బ్రాహ్మణాల కాలం అంటే క్రీ.పూ. 800 తర్వాత దాదాపు అధర్వణవేదకాలం నాడు ఋగ్వేదంలోకి దూర్చారనడానికి ఆధారంగా కన్పిస్తుంది.

నిజానికి ఎటునుండి ఎటు చూసినా, తిరగేసినా... బోర్లేసినా ...'బ్రాహ్మణ' అనే పదానికి 'వైద్యుడు' అనే వ్యుత్పత్తి అర్థం లేదు- అమరకోశంలో ఈ పదానికి రెండు వ్యుత్పత్తి అర్థాలున్నాయి-

ఒకటి: బ్రహ్మాణి పరబ్రహ్మాణి నిష్టావత్వాత్ బ్రాహ్మణః (పరబ్రహ్మయందు నిష్ఠగలవాడు బ్రాహ్మణుడు)

రెండు: బ్రహ్మణః కులే భావత్వాద్యా బ్రాహ్మణః (బ్రహ్మకులంలో పుట్టినవాడు బ్రాహ్మణుడు)

ఈ అర్థాలే ఉన్నాయి గానీ, రోగాలు నయం చేసేవాడు అనే అర్థం ఎక్కడా లేదు- కాబట్టి ఇది మధ్యలో చేర్చిందే!

## శతమానం భవతి

**"శతం జీవ శరదో వర్ధమానః శతం హేమంతాంఛ్చితము వసంతాన్ శతం ఇంద్రాగ్నీ సవితా బృహస్పతి శతాయుషా హవిషేమం పునర్థుః**
**(రు: 10-165-4)**

ఇది ప్రజాపతి పుత్రుడైన యక్ష్మనాశకుడు అనే రుషి చెప్పిన సూక్తం. ఈయన క్షయనివారణా నిపుణుడు. ఈ సూక్తం మొత్తం రాజయక్ష్మం (క్షయవ్యాధి) గురించినదే. పై రుక్కుకి అర్థం-

"ఓ యక్షరోగ విముక్తుడా! వంద శరత్తులు జీవించు. వంద హేమంతాలు జీవించు. వంద వసంతాలు జీవించు. ఇంద్రుడు, సవిత, అగ్ని, బృహస్పతులు నీకు వందేళ్ళు ఆయుస్సు ఇచ్చారు. నీ రోగం నయం చేశాను" ఇంకా ఆ రుషి ఇలా అంటాడు.

(10-165-2)

సంపూర్ణరోగికి వ్యాధి కుదర్చగలను, భూలోకం నుండి వెళ్ళిపోడానికి (చావుకి) సిద్ధమైన వాణ్ణీ బ్రతికించగలను, క్షీణించిపోయిన వాణ్ణీ బ్రతికించగలను, యమునికి దగ్గరగాపోయిన వాణ్ణికూడా బ్రతికించగలను- మృత్యుదేవత ఒడిలో ఉన్నవాణ్ణి తెచ్చి బ్రతికించగలను-" అంటాడు.

ఈ రుషిదే 167వ సూక్తం కూడా- ఈ సూక్తం శరీరంలో వివిధ అవయువాలకు సోకే రోగాలకి సంబంధించింది. వాని నివారణ గురించి ఈ యక్ష్మనాశకుడు ఇలా అంటున్నాడు-

**అక్షీభ్యాం తే నాసికాభ్యాం ఛుబుకాదధి- యక్ష్మం శీర్షణ్యం మస్తిష్కాజ్జిహ్వాయా వి వృహామితే (1-167-1)**

**గ్రీవాభ్యస్త ఉష్టిహాభ్యాః కీకసాభ్యో ఆనూక్యాత్ - యక్ష్మం దోషణ్యం మంసాభ్యాం బాహుభ్యాం వి వృహామితే (1-167-2)**

**ఆంత్రేభ్యస్తే గుదాభ్యో వనిష్ఠోర్హృదయాదధి - యక్ష్మం మతస్నాభ్యాం యక్నః ప్లాసిభ్యో వి వృహామితే (1-167-3)**

**ఊరుభ్యాంతే అష్టీవద్భ్యాం పార్ష్ణిభ్యాం ప్రవదాభ్యాం - యక్ష్మం శ్రోణిభ్యాం భాసదార్భంససో వి వృహామితే (1-167-4)**

**మేహనాద్వనంకరణాల్లోమభ్యస్తే నఖేభ్యః - యక్ష్మం సర్వస్మాదాత్మనస్తమిదం వి వృహాబితే (1-167-5)**

**అంగాదంగాల్లోమ్నోల్లోమ్నో జాతం పర్వణి పర్వణి - యక్ష్మం సర్వస్మాదాత్మనస్తమిదం వి వృహాబితే (1-167-6)**

కంటిలో ఉన్న రోగాన్ని, ముక్కులందు ఉండే రోగాల్ని, చెవులకు సోకే రోగాల్ని, గడ్డానికి, పెదాలకి, శిరస్సుపైన, తలలోపల, నాలుకమీద, జీర్ణావస్థ, ఎముకలు, కీళ్ళు, కాలేయం, వృకం (మూత్రపిండాలు) క్లోమం, ప్లీహం, పాదాలు, పాయువు, భుజాలు, చంకలు, వెంట్రుకలు, గోళ్ళు- సర్వాంగాల్లో యక్ష్మ (రోగం) ఎక్కడున్నా దాన్ని నశింపచేస్తాను- అంటాడు.

ఋగ్వేదంలో మనకు కన్పించే రోగాలూ, వాటిని నయం చేసే కొద్దిపాటి విధానాలూ అన్నీ ఆయుర్వేదానికి సంబంధించినవే.

సూర్యునివల్ల మొక్కలకి ఔషధగుణాలు వస్తాయని వీరి అభిప్రాయం

అలాగే.. సోమపానాన్ని కూడా మందుగా ఉపయోగించేవారు.

ప్రగాధ పుత్రుడైన హర్యతుడు ఇలా అంటున్నాడు: " మిత్రా వరుణులారా ! సూర్యోదయం కాగానే సోమాన్ని పుచ్చుకుంటున్నాం. అది రోగికి మందు".


సారాయి లేదా సుర ఈనాటికీ ఔషధాల్లో ఒక భాగంగా ఉంటూనే ఉన్నాయి. ముఖ్యంగా బలానికి ఇచ్చే టానిక్కుల్లో ఉండేది ఆల్కాహాలే. అంతేకాదు 1830 లో జర్మన్ ఫార్మాసిస్టు మోల్డెన్‌హావర్ క్లోరోఫాం కనిపెట్టే వరకూ ఆపరేషన్లకు మత్తుమందుగా సారాయినే వాడేవారు. శస్త్రచికిత్స చేయాల్సిన వ్యక్తితో సారా బాగాతాగించి, ఆ మత్తులో ఉండగా శస్త్రచికిత్స చేసేవారు.

అయితే..

**శస్త్రచికిత్సలకు సంబంధించిన సమాచారం ఋగ్వేదంలో ఎక్కడా లేదు.**

## ఆత్మవాదం - అనాత్మవాదం

ఋగ్వేదకాలానికి జీవుడు, ఆత్మ అనే అభిప్రాయాలు ఉన్నాయి. మనిషి చనిపోయాక ఆత్మ దేవలోకానికి చేరుతుందని, అక్కడే ఉండిపోతుందనేది ఋగ్వేద రుషుల నమ్మకం. ఆత్మ ఇక తిరిగి పుట్టదు అంటారు వారు.



చైనాలో వైద్యవిధానం

ఉపనిషత్తుల కాలానికి ఆత్మ తిరిగి పుడుతుందని, మనం గతజన్మలో చేసిన పాపపుణ్యాల ఫలితమే ఈ జన్మ కల్గుతుందనే నమ్మకం వచ్చింది. కాబట్టి మనకు సంభవించే రోగాలూ, బాధలూ, అన్నీ గతజన్మ ఫలాలే! దీన్ని ఎవ్వరూ మార్చలేరు! అనే భావాన్ని ఉపనిషత్తులు స్థిరపరిచాయి-

దీనివల్ల వైద్యశాస్త్రానికి పెద్ద గండి పడింది. ఋగ్వేదానంతరం వచ్చిన అధర్వణ వేదంలో కూడా అంతగొప్పగా ఆశించే విధానాలేవీ లేవు. త్రిధాతు సిద్ధాంతం, మూలికావైద్యం, ఆహారనియమాలు వీటి గురించే ఉంది.

**ఇక ఆ తర్వాత ఆర్యజాతులు 'ఆత్మ-పరమాత్మ', 'జన్మ-పునర్జన్మ'ల్లో పడిపోయి వైద్యానికి చెల్లుచీటీ ఇచ్చి, మంత్రాలతో చింతకాయలు కొట్టడం మొదలు పెట్టారు. అబద్దాలతో గారడీమాటలతో బ్రతకడం నేర్చారు.**

**ఈ శరీరం కొన్ని ధాతువులతో కూడింది. వాటి సంయోగ, నియోగాలే జీవులు, ఆత్మలేదు, పరమాత్మ లేదు. శరీరం, జీవం, భౌతికపదార్థాలే - అనే అనాత్మవాదాన్ని బలంగా లేవనెత్తిన బౌద్ధం తర్వాతే ఈ దేశంలో తిరిగి వైద్యం మారాకు తొడిగింది.**

రుగ్వేదంలో మొలిచిన వైద్యమనే మొక్క, అధర్వణవేదంలో నాలుగు పూలు పూచింది. ఉపనిషత్తులు, అరణ్యకాలు, పురాణాలు అనే హేమంత, శిశిర ఋతువులు రాగానే ఆకులు రాల్చి మోడుగా మారింది- ఆ తర్వాత వచ్చిన బౌద్ధం అనే వసంతంలోనే ఆ మోడు చిగురులు తొడిగింది-

భారతదేశ వైద్యచరిత్రలో మూలికావైద్యంతో పాటు, ఆయుర్వేదానికి, శస్త్రచికిత్సలకీ శ్రీకారం చుట్టినవారు బౌద్ధ వైద్యులే. వీరు మూలికలు, కషాయం, ఆకులు, పండ్లు, లవణాలు, పచ్చిమాంసం, రక్తం, నస్యం, సామ్రాణి, మద్యం, ఆవిరిస్నానం, శరీరమర్దనం, శస్త్రచికిత్స, మలాంపట్టీలు, విషాలు, విరుగుళ్ళు, లేపనపూతలు, గ్రహచికిత్స(హిప్నాటిజం) వంటి 18రకాల చికిత్సా పద్ధతుల్ని పాటించారు. వారిలో అగ్రస్థానంలో నిలబడ్డవాడు జీవకుడు. ఈయన వైద్యవిధానం, శస్త్రచికిత్సా విధానాలన్నీ వినయపిటకంలో ఉన్నాయి. 'చీవరవస్తు' అనే వైద్యగ్రంథం జీవకునిదే నంటారు. ఈ జీవకుడే బుద్ధునికి వ్యక్తిగత వైద్యుడు. మెదడుకి, కళ్ళకి, ఎముకలకి శస్త్రచికిత్స చేసిన దృష్టాంతాలున్నాయి. ఆ తర్వాత వచ్చిన చరకుని 'చరక సంహిత' (శరీరనిర్మాణశాస్త్రం, రోగలక్షణాలు, దేహధర్మం, వీటికి చికిత్సల్ని వివరించిన తొలిగ్రంథం), 1వ వాగ్భటుని అష్టాంగమార్గం, 2వ వాగ్భటుని 'అష్టాంగహృదయం', శుశ్రుతుని 'శుశ్రుత సంహిత'- ఈ దేశ వైద్యశాస్త్రంలో మణిమకుటాలు. వీరందరూ బౌద్ధభిక్షువులే-

శరీరాన్ని స్వస్థత పరచుకోవడంతోపాటు, మానసిక రుగ్మతల్ని కూడా రూపుమాపడంలో బౌద్ధం కృషి ఎనలేనిది.

అందుకే బుద్ధుణ్ణి 'భైషజ్య గురువు' అంటే వైద్యాలకు గురువు అంటారు.

బౌద్ధ నియమాల ప్రకారం బౌద్ధభిక్షువులకి ఎంతోకొంత వైద్యం తప్పక తెలిసి ఉండాలి. ఇది బౌద్ధసంఘ నియమం. వైద్యంలో పంచకర్మల్ని (నేయి, తేనె, వెన్న, నూనె, కలకండలతో కలిపి మందులు తయారుచేయడం.) ప్రవేశపెట్టింది బౌద్ధం.18 రకాల చికిత్సావిధానాలు ,వాటి వివరాలు వినయపిటకంలో ఉన్నాయి.

నిజంగా- ఆత్మవాదులు అనేవారికి శరీరక్లేశాల్ని నయం చేసుకోవడం తీవ్రమైన నేరం. దైవాన్ని నమ్మేవారైనా అంతే, **శరీరరోగాల్ని నయం చేసుకోవడం అంటే దైవాన్ని, పరమాత్మను ధిక్కరించినట్లే- బ్రహ్మరాసిన నుదుటిరాతని కాదని కొట్టేసినట్లే.. అంటే ఆత్మవాదులు, దైవవాదులు వైద్యం చేయించుకోవడం అంటే... అది, దైవధిక్కారం. 'ఆత్మ'ద్రోహం.**

ఇక అనాత్మవాదులకు, భౌతికవాదులకూ భౌతిక

ప్రపంచమే మూలం. కాబట్టి వీరు వ్యాధుల నుండి విముక్తి చెందడం తప్పుకాదు–

ఈ దేశం అతిపురాతన కాలంనుండి వైద్యకేంద్రంగా విరాజిల్లుతుంది అనాత్మవాదుల వైద్యవిధానాలవల్లే.

## మూడు దేశాలు – మూడు వైద్యాలు

ఇతర రంగాల లాగా రుగ్వేద ఆర్యుల కంటే బాగా అభివృద్ధి చెందిన దేశాలు వైద్యరంగంలో పెద్దగా లేవు.

సింధూ ప్రజలకి తప్పక వైద్యవిధానాలు తెలిసే ఉండాలి. రససిద్ధ పద్ధతులు వారికి తెలుసనేది కొందరి అభిప్రాయం మాత్రమే. ఆధారాలేవీ దొరకలేదు. సింధూ ప్రజల వైద్యవిధానానికి సంబంధించి క్రీ.పూ. 3000 నాటి ఒకే ఒక్క ఆనవాలు దొరికింది. మెహర్‌గర్ (పాకిస్తాన్) ప్రాంతంలో వంకర పళ్ళకు క్లిప్పులు వేసిన విధానం ఒకటి దొరికింది. అదేకాలంలో ఈజిప్టులోనూ ఇలాంటి విధానం ఉండేది.


అయితే, వైద్యంలో ఆర్యులకంటే కాస్త మెరుగైనవారు చైనీయులు. క్రీ.పూ. 2500 సంవత్సరాలనాడే అంటే ఇక్కడ సింధూనాగరకత పరిఢవిల్లే కాలంలో చైనాలో ఒకస్థాయి వైద్యవిధానం ఉంది. ఐదురకాల విధానాలు అక్కడి వైద్యులు పాటించేవారు.

1. మూలికావైద్యం. 2. ఆక్యుపంక్చర్ 3. వ్యాయామం 4. మసాజ్ 5. ఆహార విధానం

ఈ ఐదింటిలో నాలుగు ఆహారాలకి, ఒకటి వ్యాయామానికి సంబంధించినవి. కాగా, ఆక్యుపంక్చర్ ఒకటే అందుకు భిన్నమైన నూతన విధానం. అయితే అప్పటికి చైనాలో కూడా శస్త్రచికిత్సలు లేవు.

శస్త్రచికిత్సల్లో తొలినాటి సిద్ధహస్తులు ఈజిప్టు వారే.

క్రీ.పూ. 1500 నాటికి ఆర్యులకు లిపి లేదు. కానీ ప్రపంచ లిపి ఆవిష్కరణల్లో మొదటిస్థానంలో ఉంది ఈజిప్టు వారే. వారి వైద్యగ్రంథాల్లో అతి ప్రాచీనమైనది నేహుల్ గైనకాలాజికల్ పాపిరస్. ఇది క్రీ.పూ. 1800 కాలం నాటిది. ఇది పూర్తిగా స్త్రీలకు సంబంధించిన వ్యాధులు, కాన్పులు, గర్భాశయాల వైద్యగ్రంథం. అలాగే క్రీ.పూ. 1600 నాటి మరోగ్రంథం ఎడ్విన్ స్మిత్ పాపిరస్. చాలా శాస్త్రీయంగా వైద్యవిధానాల్ని వివరించిన గ్రంథం ఇది. ఇందులో రక్తప్రసరణ, వెంట్రుకలు, రకరకాలు గాయాలు, వాటికి కట్లు, మూత్రవ్యవస్థలు గురించిన సమాచారం ఉంది. సిస్టోసోమియాసిస్, మలేరియా, క్షయవ్యాధి లక్షణాలు, వాటి నివారణా విధానాలు ఉన్నాయి. ఇక క్రీ.పూ. 1500 కాలం నాటి మరోగ్రంథం ఎబెర్స్ పాపిరస్. ఇది 110 పేజీల గ్రంథం.



ప్రాచీన ఈజిప్టువారి కంచు వైద్యపరికరాలు

శస్త్రచికిత్సా విధానాలు చర్చించిన గ్రంథం ఇది.


(పాపిరస్ అంటే పాపిరస్ అనే చెట్టుతోలు. తాటి ఆకులమీద రాసిన వాటిని తాళపత్రగ్రంథాలు అన్నట్లు, భూర్జపత్రాల మీద రాసిన భూర్జపత్రాలు అన్నట్లు పాపిరస్ చెట్లతోళ్ళమీద రాసినవి 'పాపిరస్'లు. ఈ పదం నుంచే 'పేపర్' అనేపదం వచ్చింది.)

అసలు ఈజిప్టులో క్రీ.పూ. 3000 నాటికే శస్త్రచికిత్సలు ఉన్న ఆధారాలు దొరికాయి. అద్భుతమైన శస్త్రచికిత్స పరికరాలూ ఉన్నాయి. మహిళా వైద్యులు కూడా ఉండేవారు. శస్త్రచికిత్సలు ఎందుకు అక్కడే పుట్టాయి? అంటే... ఈజిప్టు వారికి చనిపోయిన వారి శరీరాల్ని మమ్మీలుగా మార్చే సంప్రదాయం ఉంది. పొట్టకోసి, పేగులు తీసి చేపల్ని ఎండబెట్టే విధంగా... చనిపోయిన వారి శరీరాల్ని కోసి, పేగులు, గుండె, కాలేయం లాంటివాటిని తొలగించి మిగిలినశరీరభాగాల్ని ఎండకట్టేవారు. దీన్ని 'మమ్మీ' అంటారు. ఈ తాంత్రిక సంప్రదాయం వల్ల వారికి శరీరం లోపల భాగాలు ఎక్కడెక్కడ ఎలా ఉన్నాయి? అనే అవగాహన ఏర్పడింది. మానవ శరీరాన్ని కోయడం సర్వ సాధారణ విషయంగా భావించేవారు. ఆ సంప్రదాయమే వారిని తొలి శస్త్రచికిత్సకారులుగా రూపొందించింది.

శవాల్ని దహనం చేసే విధానం పాటించే ఆర్యులకు మానవశరీరశాస్త్రం మీద అవగాహన ఎలా ఏర్పడుతుంది?. అందుకే బాహ్యరోగ లక్షణాలు– వాటికి తగిన ఆహారం, మందులు వరకే పరిమితం కావల్సి వచ్చింది. అందుకే ఇక్కడ మూలికావైద్యం, ఆయుర్వేదాలే తొలినాటి వైద్య విధానాలయ్యాయి. ఆ భావజాలంవల్లే శస్త్రచికిత్సల్ని తప్పుగా భావించేవారు, అల్లోపతి విధానం సరైందికాదని సొణిగేవాళ్ళు ఇప్పటికీ చాలామంది ఉన్నారు.

## జీవకునికి జేజేలు

తక్షశిలలో విద్యాభ్యాసం చేసిన జీవకుడు అక్కడకు వచ్చే ఈజిప్టు, గ్రీకుల నుండి ఈ విధానం తెలుసుకున్నాడు. శస్త్రచికిత్సల్ని అక్కడే నేర్చుకున్నాడు. తలలో కణితలకు,



ప్రాచీన ఈజిప్టులో మహిళావైద్యురాలు

శరీరంలోని కణితులకు, పొట్టకు శస్త్రచికిత్సలు చేశాడు. కొండరాయి పడి నుజ్జుగా విరిగిన బుద్ధుని విరిగిన కాలికి వైద్యంచేసి, కట్లుకట్టి సరిజేశాడు జీవకుడు. ఈ విషయం క్రీ.పూ. ఐదో శతాబ్దం నాటి త్రిపిటాకాల్లోని వినయపిటకంలో ఉంది.

మనం చెప్పుకొంటున్నట్లు తొలి భారతీయ శస్త్రచికిత్స కారుడు సుశ్రుతుడు కాదు. జీవకుడు. జీవకుని తర్వాతి వాడైన శుస్రుతుడు (క్రీ.పూ. 500–400) కూడా బౌద్ధుడే.

ప్రపంచంలో ఇటు చైనా, అటు ఈజిప్టు వారు తప్ప ఆర్యుల సమకాలీనులు మరెవరూ లేరు. మెసపుటోమియన్‌ల, గ్రీకుల, ఇటాలియన్ల వైద్యవిధానం అంతా ఈజిప్టు వారిదే!–

ఋగ్వేద ఆర్యుల వైద్యవిధానం ఏమిటో ఋగ్వేదాన్ని బట్టి తెలియకపోయినా ఆకాలం నాటి రోగాలూ, వారికి నాసత్యుడు, దస్రుడు అనే ఇద్దరు అశ్వినీ దేవతలు వైద్యం చేసేవారనీ, అలాగే...కక్షీవంతుడు, కుత్సుడు అధర్వణుడు లాంటి వైద్యులు కూడా ఉన్నారని తెలుస్తుంది.

భారతీయ వైద్యమూలాలు వేదంలో ఉన్నాయి.

## చివరిగా...

ఒక విషయం ఇక్కడ చెప్పుకోవాలి–

**“దశమాసంభ శయానః కుమారో అధిమాతరి**
**నిరైతు జీవో అక్షతో జీవో జీవన్త్యు అధి”**
**(రు: 5–78–9)**

(‘పది నెలల తల్లిగర్భంలో ఉన్న బిడ్డడు సజీవంగా ఏలాంటి క్షతం లేకుండా పుట్టాలి”)

ఈ 78వ సూక్తంలో 5 నుండి 9 వరకు మంత్రాలు తల్లి గర్భావస్థని వివరిస్తాయి. ఆత్రేయ సప్తవధి చెప్పిన రుషిసూక్తం ఇది. ఇందులో ప్రసవించే కాలంలో స్త్రీ మర్మాంగం విచ్చికొన్నట్లు వనస్పతులున్న పేటిక విచ్చుకొంది (5). వాయువు సరసులో నీటిని ఒడ్డుకు నెట్టినట్లు గర్భాన్ని నెడుతుంది (7) గాలి తాకిడికి అడవులు, సముద్రాలు కదిలినట్లు మాయతోపాటు కదిలి పది నెలలకు శిశువు బైటకు వస్తాడు (8) ఆ పదినెలల శిశువు సజీవంగా వుండాలి (9)–

ఈ ప్రసవాన్ని అశ్వినులు పర్యవేక్షించి, పరిరక్షించారు. ఇదే కాదు– క్షయ విషయంలోగా, కుష్ఠునివారణలోగానీ ఇతర వ్యాధుల నివారణలో గానీ అశ్వినీ దేవతలు వైద్యం చేసే నయం చేశారు గానీ, ‘మంత్రాలు పెట్టో, తంత్రాలు కట్టో’ నయం చేయలేదు–

బతకాలంటే భౌతిక వాస్తవికతనే పాటించాలి. అంటే రోగాలకి వాటి నివారణా ఔషధాలే తీసుకోవాలి’ అని ఋగ్వేద ఆర్యులు నమ్మారు. వేదాల పేరు చెప్పుకొని, వేదమంత్రాల్లో మహిమలు ఉన్నాయని గుడ్డిగా నమ్మేవారి గుడ్డితనాన్ని ఏమనాలి? మూర్ఖత్వమనాలా? మోసమనాలా? ప్రజల్ని వేదాల ముసుగులో మభ్యపెట్టి దొరికిన కాడికి దోచుకు తినడం అనాలా?

**మంత్రాల్లో కాదు,**
**ఔషధాల్లో మహిమలున్నాయని నమ్మారు**
**వేదకాలం వైద్యులు**
**కాదు, వేదమంత్రాలకే**
**మహిమలున్నాయని నమ్ముతున్నారు..**
**ఇప్పటికీ ఎందరో మూర్ఖులు...!**

ఈ మూర్ఖులు చేసే మరోమోసం ఏమిటో తెలుసా? ప్రతిదీ వేదంలో ఉందని ఊకదంపుడుకు దిగడం. ప్లాస్టిక్ సర్జరీ, గుండె ఆపరేషన్లు, క్యాన్సర్ చికిత్సలు, శరీర అవయాల మార్పిడి... నూతనంగా ఏదైనా రానీ అవన్నీ వేదాల్లో ఉన్నాయని చెప్పడం. ఉన్నవి ఒప్పుకపోవడం ఎంతతప్పో, లేనివి చెప్పుకోవడం కూడా అంతకు మించినతప్పు. లేనిగొప్పలు చెప్పుకు బతికే జాతికంటే.. నూతన ఆవిష్కరణలు సాధించి గొప్పగా నిలబడడం జాతికి గౌరవం.

## జ్ఞానదీప్తి

**సమాజంలోని అజ్ఞానాన్ని తొలగించడానికి మేము సైతం అంటూ... ఎందరో దాతలు గ్రంథాలయాలకు, విద్యాలయాలకు సంవత్సర చందాలు చెల్లించి పత్రికను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. వారందరికీ స్వేచ్ఛాలోచన సెల్యూట్ చేస్తోంది. మీరుకూడా మీకు దగ్గరలోని వివిధ సంస్థలకు స్వేచ్ఛాలోచన మాసపత్రికను, మీ పేరుతో పంపవచ్చు. వివరాలకు సంప్రదించండి.**


**- మేనేజర్, స్వేచ్ఛాలోచన**

**వేదాలు-విజ్ఞానం: 9**

# నూలుపోగులెరుగని ఋగ్వేద ఆర్యులు

> **ఏషాదివో దుహితా ప్రత్యదర్శి వ్యుచ్ఛన్తీ యువతిః శుక్రవాసాః**
> **విశ్వస్యేశాన పార్థివస్య ఉషో అద్యేహ సుభగే వ్యుచ్ఛ**
> "ఆకాశపుత్రిక, తెల్లని వస్త్రాలు ధరించిన ఉషస్సు అనే యువతి అంధకారాన్ని తొలగిస్తూ వస్తుంది అదిగో!
> ఓ భూలోకజనుల సౌభాగ్యానికి కారణమైన ఓ ఉషా! రా! వచ్చి ఇక్కడున్న చీకట్లను తొలగించు"
> -(ఋగ్వేదం: 1-113-7)

ఈ ఋక్కులో ఎంతో కవితాత్మక సౌందర్యం ఉంది. దాన్ని కాస్త పక్కనబెడితే, సౌకర్యంగా ప్రారంభమై సౌందర్యానికి చిరునామాగా నిలిచిన 'వస్త్రాల' ప్రస్తావన గురించీఉంది. వస్త్రాల విషయంలో ఋగ్వేద ఆర్యుల పరిజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని కొద్దిగా చూద్దాం!



బొర్రా గోవర్ధన్
9390600157


**"పుట్టినప్పుడు బట్టకట్టలేదు**
**పోయేటప్పుడు అది వెంటరాదు**
**నడుమ బట్టకడితే నగుబాటు**
**నాగరీకం ముదిరితే గ్రహపాటు**
**వేదాంతసారం ఇంతేనయా-"**

అన్నాడు ఆరుద్ర.

మనుషులు తప్ప ఈ ప్రపంచంలో శరీరాన్ని ఆకులతోనో, చర్మాలతోనో, వస్త్రాలతోనో కప్పుకునే జీవులు ఏవీలేవు. వస్త్రాలు లేకపోతే సిగ్గుపడే జీవులూ లేవు. కోటానుకోట్ల జీవరాశిలో బట్టల్లేకపోతే సిగ్గుపడే ఏకైక జీవి మనిషి ఒక్కడే !

ఎండా, వానా, చలి- ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల నుండి బట్టలు మనల్ని రక్షిస్తాయి. నిజమే! ఈ వైపరీత్యాలు ఒక్క మానవజాతికేనా? ఇతర జీవులకు లేవా? అనేది ప్రశ్న. అన్ని జీవులకూ ఉంటాయి. ఆ వైపరీత్యాల సమయంలో వాటి నుండి కాపాడుకోడానికే ఒక ప్రాంతం నుండి మరోప్రాంతానికి వలసలు పోతాయి. పక్షుల వలసలు ఇందుకే!

జంతువులూ....పక్షులంత దూరాలకి పోకపోయినా.. అదే అన్వేషణలో గడుపుతూ ఉంటాయి-

అంటే- ప్రకృతి వాటిని ఒకచోట స్థిరంగా, నిలకడగా నిలబడనీయదన్నమాట! నిరంతరం ఆహార అన్వేషణ ఎలాగో.. సుఖజీవన అన్వేషణా అలాగే...

వాటి జీవితమంతా ఎడతెరపి లేని ఈ ప్రయాణంతోనే ముగిసిపోతుంది. వెతుకులాటకే సరిపోతుంది.

ఇక, తీరిగ్గా నిలబడేదెప్పుడు? ఆలోచించే దెప్పుడు?

అందుకే.. అవి జ్ఞానాన్నీ పెంపొందించుకో లేకపోయాయి. నాగరికతనీ నిర్మించుకోలేక పోయాయి.

తన శరీరాన్ని ఆకులతోనో, ఉన్నితోనో, నూలుతోనో, జంతుచర్మాలతోనో కప్పుకొంటూ ప్రతికూలతల్ని తట్టుకొంటూ, సుదీర్ఘ దూరాలకు వలసలు పోకుండా జీవిత అనుభవాల్ని పంచుకొనే అవకాశం మానవులకే దక్కింది-

కాబట్టి-

**దుస్తులు అనేవి నాగరకత అందించిన ఫలాలు మాత్రమే కావు, నాగరకతను నిర్మించిన పునాదులు కూడా!**

పశువులు.. ముఖ్యంగా గేదెలు, పందులు, ఏనుగులు లాంటి జంతువులు వేసవితాపాన్ని తాళలేక బురదను ఒళ్ళంతా పులుముకుంటాయి. ఆ బురదపొర కృత్రిమ వస్త్రంగా దాని శరీరానికి తాత్కాలిక హాయినిస్తుంది-

వస్త్రాలు చేసేపనికూడా ఇదే! వాతావరణ ఇబ్బందుల నుండి కాపాడ్డం.

## సంస్కృతి - సిగ్గు

ఇక- అందం, సిగ్గు అనేవి, మానవసమాజం ఏర్పాటు చేసుకున్న భావజాలం! సంస్కృతి! ఈ భావజాలాలు, సంస్కృతులు ఒక్కోచోట ఒక్కోవిధంగా ఉంటాయి.

1970ల వరకూ ఇంటర్మీడియట్ స్థాయి అబ్బాయిలు కూడా నిక్కర్లే వేసుకుని కాలేజీలకు వచ్చేవారు. ఎవరైనా ప్యాంటు వేసుకుని వస్తే- "ఏంరో! పెద్ద లెక్చరర్‌లా వచ్చావ్" అని అధ్యాపకులు మందలించేవారు. అప్పుడు టీనేజ్ కుర్రాళ్ళు కూడా ప్యాంటువేసుకోడానికి సిగ్గుపడేవారు.

కానీ ఈ రోజు.. చిన్నపిల్లల దగ్గర్నుండి ప్యాంటులే!

మా 'నగరం'గ్రామంలో ఒక కళాశాల ఉంది. క్రమశిక్షణకి మారుపేరు. 1980ల్లో జరిగిన ఒక ఉదంతం ఇది-

ఆడపిల్లలు అందరూ లంగా-వోణీలతోనే కాలేజీకి వచ్చేవారు. ఒక అమ్మాయి పంజాబీ డ్రస్ (చుడీదార్) వేసుకుని వచ్చేది. ప్రిన్సిపాల్ ఆ అమ్మాయిని మందలించాడు. లంగా-వోణీలతోనే రావాలని చెప్పాడు. ఆ అమ్మాయి నాన్నగారు ఒక జడ్జి. పంజాబీడ్రస్‌తో వస్తే కాలేజీకి అనుమతినియ్యకపోతే- కాలేజీపై కేసు వేస్తానన్నాడు-

ఇంతకీ విషయం ఏంటంటే- ఈ రోజున అదే కాలేజీలో లంగా-వోణీలు వేసుకొని వచ్చేవారు ఎవరూ లేరు. అందరూ పంజాబీ డ్రస్‌లోనే వస్తున్నారు-

ఇదంతా సంస్కృతి (అలవాటు) వల్ల వచ్చే మార్పులు-

కానీ, నూలుబట్ట చల్లదనాన్ని, ఊలుబట్ట వెచ్చదనాన్ని ఎక్కడైనా, ఎప్పుడైనా ఒకేవిధంగా ఇస్తుంది. ఇది ప్రాకృతిక అంశం. పుట్టినప్పుడు బట్టలేకపోయినా, పుట్టాక బట్టకట్టింది ప్రకృతి నుండి తనను తాను కాపాడుకోడానికే!

ఉష్ణమండల ప్రాంతం వారు నూలుబట్టలు, తెల్లబట్టలు కట్టుకొనేదీ, సమశీతలప్రాంతం వారు నల్లనికోట్లు, సూట్లు ధరించేదీ, అతిశీతల ప్రాంతం వారు ఉన్నిగొంగళ్ళు , జంతు చర్మాలు ధరించేదీ ఇందుకే!

అంటే.. ప్రజలు ధరించే బట్టలు వారి నాగరికతని, నివాసప్రాంతాన్ని తెలియజేసే 'ఋజువులు' అన్నమాట.

"నడుమ బట్టకట్టి నగుబాటు కాదకో.." అని వేమన చెప్పినా, నగ్నంగా తిరిగే తాపసులు చెప్పినా, ఆరుద్ర చెప్పినా-

అదంతా వాదం కోసం చేసే వేదాంతమే అవుతుంది. తప్ప వైజ్ఞానికం కాదు.

ఇప్పుడు ఆర్యుల నాగరకతా వికాసాన్ని, వారి దుస్తుల్ని బట్టి చూద్దాం!

## అందానికీ - ఆనందానికీ

మధ్యరాతియుగం కాలం నుండే ఆదిమ మానవుల అవసరాల్ని బట్టి దుస్తులు ధరించేవారు. దుస్తులంటే నేసినవి కాదు. జంతుచర్మాల్ని కోసినవి. **జంతుచర్మాల్ని కప్పుకోవడమే మొట్టమొదటి వస్త్రధారణ.** విశాలమైన, మెత్తని ఆకుల్ని మొలల కు చుట్టుకోవడంకూడా దాదాపుగా అప్పటినుండే వుంది.

మంచుకాలంలో వీటిని చుట్టుకోవడం, మిగిలిన కాలంలో ఎలాంటి చర్మాల్ని ధరించకుండా తిరగడం చేసేవారు. ఇప్పటికీ మనం గొడుగును ఇలాగే వాడుతున్నాం. వర్షాకాలం ఉపయోగిస్తాం. తర్వాత తీసి మూలన పెడతాం.

తొలినాటి కాలంలో జంతుచర్మాల దుస్తులూ అలాగే...అవసరం అయినప్పుడే వాడేవారు..

రాను రాను వస్త్రాల్లో నాజూకుతనం పెరిగి.. జంతుచర్మాలకి బదులు వాటి వెంట్రుకలతో దుస్తులు తయారు చేసుకోవడం నేర్చాక, ఎక్కువకాలం శరీరంపై దుస్తుల్ని ధరించడం తేలికైంది. జంతుచర్మాల గుండా గాలి చొరబడదు కాబట్టి మంచులేని కాలంలో దాన్ని ధరిస్తే శరీరం భరించలేదు. కానీ, అల్లికల దారాలతో తయారు చేసుకున్న వస్త్రం గుండా గాలి సోకుతుంది. కాబట్టి మంచు కురవని సమయాల్లో కూడా దాన్ని భరించగలం-

అలా అలా... క్రమేపీ శరీరానికి వస్త్రం ఒక అలవాటుగా మారింది.

**మనిషి కంటిదృష్టి, సౌష్టవదృష్టి. సౌష్టవ దృశ్యాల్ని మనకన్ను 'హాయిగా' స్వీకరిస్తుంది. వత్తిడికి గురికాదు. అసౌష్టవ దృశ్యాల్ని మన మెదడు ఉల్లాసంగా స్వీకరించదు.**

రక్షణకోసం ధరించిన ఈ వస్త్రాలు.. మనషి శరీరంలో హెచ్చుతగ్గుల్ని (బానపొట్టలు, బక్కచిక్కిన డొక్కలు, అంగవైకల్యాలు..) సరిచేసి ఒక సౌష్టవరూపంలో కన్పించేట్టు చేస్తాయి కాబట్టి... రాను రాను వస్త్రాలు శరీరానికి అందానికి ఓ కారణంగా మారాయి. మనలో లేని అందాల్ని పెంచే సాధనాలయ్యాయి.

ఆర్యులు అందాలకి దాసులు. శారీరక సౌష్టవానికి అధిక ప్రాధాన్యత నిచ్చేవారు. వారి మాంసాహారం, తిరుగుబోతు జీవితం వారికి మంచి శరీరాకృతిని కల్పించింది. ఆ ఆకృతికి మరింత అందాల్ని ఇనుమడింపచేసే వస్త్రాలపై వారు మక్కువ ఎక్కువగా చూపేవారు.

**"యువా సువాసాః పరివీత ఆగాత్ స ఉ శ్రేయాన్ భవతి జాయ మానః" (ఋ:3-8-4)**

అంటే..." *ఈ యూపము అందమైన వస్త్రాలు ధరించిన యువకునిలా ఉంది"*- అని.

యూపం అంటే యూపస్థంభం. యజ్ఞంలో బలిపశు వుని బంధించి కట్టే స్థంభం.

అది అందంగా, సౌష్టవంగా, యువకునిలా అంత బలంగా ఉందనేది ఇక్కడి వర్ణన. వస్త్రాన్ని "సువాస" అన్నారు. మంచివస్త్రం అని.

ఋగ్వేదంలో వస్త్రాల్ని సువాస (మంచి వస్త్రం), అర్జునవాస (తెల్లని వస్త్రం), శుక్రవాస(తెల్లని ప్రకాశవంతమైన వస్త్రం), శుక్లవాస (తెల్లని నిగగల వస్త్రం), అవివాస(గొర్రె ఉన్ని వస్త్రం) దుర్వాస (చినిగిపోయిన వస్త్రం)- ఇలా రకరకాల ప్రస్తావనలు ఉన్నాయి.

## గొర్రె ఊలు - ప్రత్తి నూలు

ఒకటిమాత్రం వాస్తవం. నూలువస్త్రాలు, పట్టువస్త్రాలు వారికి తెలియవు. వారి పూర్వనివాసాలైన భూభాగాల్లో ప్రత్తి ఉండదు. అది ఉష్ణమండల పంట. కాబట్టి వారు గొర్రెబొచ్చుతో నేసిన వస్త్రాలపైనే ఆధారపడ్డారు.

అన్ని జంతువుల చర్మాలు వస్త్రాలుగా అమరవు. పులి, పిల్లి, ఉడత, గొర్రెల, జింకలు లాంటి కొన్ని జంతు చర్మాల్నే వస్త్రాలుగా మలచగలం. వాటి శరీరం మీది పై చర్మం ఒక ప్రత్యేకపొరగా ఏర్పడి ఉంటుంది. వాటి చర్మాలు

వొలవగలం. ఆవులు, గుర్రాలు మొదలగువాటి చర్మం ఒలవగలం. కానీ, అవి వస్త్రాలుగా మనలేవు. ఇక గేదె, పంది, ఏనుగు చర్మాల్లో పొర ఉండదు. అవి మందంగా ఉంటాయి. వాటిని శుద్ధిచేసి తాళ్ళుగా, వారులుగా, మందపాటి చెప్పులుగా మాత్రమే ఉపయోగించుకోగలం.

యజ్ఞయాగాల్లో ఆవుల, ఎద్దుల చర్మాల్ని ఒలిచినట్టు ఉందిగానీ, వాటిని దుస్తులుగా మలచినట్టు ఋగ్వేదంలో లేదు. వాటిని వారులుగా కోసి, రథాలకి నాగళ్ళకి తాళ్ళగా, గుర్రాలపై జీనులుగా మలచిన ఆధారాలు ఉన్నాయి-

ఋగ్వేద ఆర్యులకి ఉన్ని దుస్తులే తెలుసు.

జంతుచర్మాల్ని వస్త్రాలుగా కాకుండా, ఉన్నిని (బొచ్చుని) దారాలుగా తీసి, వాటిని వస్త్రాలుగా నేసి (వడికి) ధరించే పరిణతి వారిలో ఉంది.

ఇక్కడ ఒక విషయాన్ని గట్టిగా చెప్పుకోవాలి.

ఎల్లకాలం మంచుకురిసే ప్రాంతాల్లో జీవించేవారు మాత్రమే జంతుచర్మాల్ని దుస్తులుగా వాడుకుంటారు.

అప్పుడప్పుడు మంచుకురుస్తూ, కాస్తచలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని ప్రజలు జంతువుల వెంట్రుకల్ని దారాలుగా మలచి, వాటితో తయారు చేసిన ఊలు దుస్తుల్నే (కంబళ్ళను) ధరిస్తారు.

ఇలా చూస్తే-

ఆర్యులు తిలక్ చెప్పినట్లు ధృవప్రాంతం వారు కాదు. ధృవప్రాంతంలోనివారు జంతుచర్మాల్నే దుస్తులుగా వాడాలి. అలాంటి ఒక్క ఆధారం కూడా ఋగ్వేదంలో లేదు. సమశీతల ప్రాంతం వారు రగ్గులు (గొంగళ్ళు) వాడతారు. ఋగ్వేదం నిండా ఇలాంటి వస్త్రాల వివరాలే ఉన్నాయి.

ఈ దేశం వారే అయితే- భారతీయులైన సింధూ ప్రజలు నూలు బట్టలే ధరించారు. ప్రత్తిని పండించారు. **ఋగ్వేద ఆర్యులకి నూలుబట్టల సంగతే తెలియదు. కాబట్టి వారు మూలభారతీయులు కాదు. అభారతీయులే-**

వారి వస్త్రధారణ కూడా వారు మధ్య ఆసియా, ఓల్గా తీరప్రాంతాల నుండి ఇక్కడికి వలస వచ్చారనే విషయాన్నే రుజువు చేస్తుంది.

వారు గొర్రెబొచ్చు ఊలుతోనే దుస్తులు ధరించేవారని పదోమండలంలో ఉంది.

## సాలునేత - మూలనేత

**అధీష మణాయాః పతిః శుచామిశ్చ శుచస్యచ**
**వాసోవాయ అవీనామా వాసాంసి మత్మృజత్ !**
**(ఋగ్వేదం: 10-26-6)**

"ఎంతో ఇష్టంగా.. ఆడగొర్రె, మగగొర్రెల లేదా ఆడమేక, మగమేకల యజమాని వాటి ఉన్నితో వస్త్రాలు నేస్తూ ఉన్నాడు"

నేయడం అనేది ఒక నైపుణ్యం. ఉన్నిని దారాలుగా తీయడం, వాటిని పురిపెట్టి వడకడం (తిప్పటం) ఒక విజ్ఞానం. వాటిని నిలువుగా, అడ్డంగా (పడుగు, పేకలుగా) అల్లడం మరోవిజ్ఞానం. ఇలాంటి అల్లిక వస్త్రానికి మరింత మన్నికను కల్గిస్తుంది. ఆ దారసందుల్లోంచి గాలీ వెలుతుర్లను లోనికి పంపిస్తుంది. శరీరంలో విడుదలైన ఉష్ణాన్ని బైటకి పంపిస్తుంది. ఇలా శరీరానికి తగినంత సుఖాన్నిస్తుంది.

గాలీ వెలుతురూ ప్రసరించడం ఈ ప్రక్రియలోని అద్భుతమైన అంశం.

ఈ నైపుణ్యం మనిషికంటేముందు పక్షులకు ఉంది. పక్షులు తమగూళ్ళను ఇదే నియమంతో రూపొందించు కుంటాయి. ముఖ్యంగా పిచ్చుకలు.. గిజిగాళ్ళు అందుకే..

***"తేలిక గడ్డిపోచలను తెచ్చి , రచించెద వీవు తూగుటు***
***య్యేల గృహంబు, మానవులకేరికి సాధ్యముగాదు....."***

అన్నాడు జాషువా!

గిజగాని గూడులో పడుగుపేక (నిలువు- అడ్డం) అల్లికే కాకుండా, మూలనేత (సాలునేత- మూలనేత) కూడా ఉంటుంది. **మనకు నూలు వస్త్రాల్లోనే ఈ నేత కన్పిస్తుంది. ఆర్యుల వస్త్రాల్లో మూలనేత లేదు-**

**నాహం తన్తుం న వి జానామ్యోతుం నయం వయన్తి సమరే అతమానాః**
**కస్యస్విత్ పుత్ర ఇహ వక్త్వాని పరోవదాత్యవరేణ పిత్ర**
**(ఋగ్వేదం: 6-9-2)**

పై ఋక్కులో వస్త్రాన్ని యజ్ఞంతోనూ యజ్ఞంలో చేసే పనుల్ని పడుగు (తంతువు), పేక 'ఓతువు)లతో పోల్చాడు బృహస్పతి పుత్రుడైన భరధ్వాజుడు- పై ఋక్కు అర్థం ఏమంటే.. "పడుగు, పేకలతో (తంతువు, ఓతులతో) వస్త్రాన్ని నేయడం నాకెలా తెలియదో ఈ యజ్ఞం చేయడంకూడా అలాగే తెలియదు" అని.

పడుగు పేకల అల్లిక ఆయనకు తెలియకపోవచ్చు గానీ, తెలిసినవారు ఉండారనేది దీనివల్ల తెలుస్తుంది. మరలా ఆయనే అంటాడు-

"ఇలాంటి అల్లికను (యజ్ఞాన్ని) వైశ్వానర అగ్నికి మాత్రమే తెలుసు" అని (ఋ:6-9-3)

అలాగే.. జనన మరణాల్ని సర్వనియంత అయిన యముడు అప్సరగణాలతో అల్లిస్తున్న మహావస్త్రంగా పోలుస్తూ ఇలా ఉంది-

**త ఇన్నిర్యేనం హృదయస్య ప్రకేతైః సహస్రవల్శమభి సం చరన్తి**
**యమేన తతం పరిధిం వయన్తో అప్సరస ఉప సేదుర్వసిస్ఠా**

(ఋ: 7-33-9)

ఇక, ఈ ఋక్కు చూడండి...


**అభ్రాతేవ పుంస ఏతి ప్రతీచీ గర్తారుగివ సనయే ధనానాం**
**జాయేవ పత్య ఉశతీ సువాసా ఉషా హాస్రేవ ని రిణీతే అప్సః**
**(ఋగ్వేదం: 1-124-7)**

*"సరైన వస్త్రాలు లేని స్త్రీ అందమైన వస్త్రాల కోసం పుట్టింటికి వచ్చినట్లుగా, భర్తను పోగొట్టుకున్న స్త్రీ భర్త ధనాన్ని పొందడం కోసం రాజు దగ్గరకు వచ్చినట్లుగా, తన భర్త సూర్యుణ్ణి చేరడానికి ఉషస్సు అలాగే వచ్చింది"*–

మరోచోట గాంధారదేశం (నేటి ఆఫ్ఘనిస్థాన్) గొర్రె ఉన్ని గురించి ప్రత్యేక ప్రస్తావన ఉంది. ఇది ఆర్యులు సింధూ పొలిమేరల్లోకి వచ్చిన తర్వాత చెప్పిన ఋక్కే. అంతేకాదు, ప్రపంచంలో గాంధార దేశపు గొర్రెల ఉన్ని శ్రేష్ఠమైంది కూడా. గాంధారదేశపు గొర్రెలు, గుర్రాలు ప్రపంచ ప్రసిద్ధి పొందినవి.

ఈ విషయాన్ని ఉటంకించడం ఇక్కడ తప్పక గమనించాల్సిన విషయమే–

శరీరానికి రోమాలు ఎక్కువగా కొందరిలో ఉంటాయి. అలాంటి ఒక స్త్రీ తన శరీరం మీది రోమాల్ని గురించి ఇలా చెప్తుంది–



మతాచార్య చక్రవర్తి రాతి విగ్రహం, మొహంజొదారో

**ఉపోప మే పరా మృశ మామే దభ్రాణి మన్యథాః**
**సర్వాహ మస్మి రోమశా గంధారీణా మిహవికా–**
**(ఋ: 1-126-7)**

నా భార్య రోమశ! సంభోగానికి అర్హురాలే. బిడ్డల్ని కూడా కన్నది. రోమశ అయినా నాకు సుఖాన్ని ఇస్తుంది– అని చెప్పిన భర్తతో రోమశ పై ఋక్కు చెప్పింది. దానర్థం ఇది– "ఓ పతీ! నన్ను అల్పురాలనుకోకు. గాంధార దేశపు గొర్రెవలే రోమాలు కలిగి వున్నాను. అందుకే నన్ను అందరూ 'రోమశ' అని పిలుస్తారు. నా శరీరాన్ని తాకి చూడు. నా దగ్గరకు రా"–

స్త్రీ శరీరంలో ఈస్ట్రోజన్ అనే ఎంజైము సరిగా స్రవించకపోవడం వల్ల, టెస్టోస్టిరాన్ ఉద్రేకం పొందడం వల్ల ఆడవారిలో ఇలాంటి రోమశ లక్షణాలు వస్తాయి. ఈమె అలాంటిది. ఇక్కడ ఆమె తన వెంట్రుకల్ని గాంధారదేశపు గొర్రె వెంట్రుకలతో పోల్చింది–

## లుంగీలు - పంచెలు

ఋగ్వేద ఆర్యులు ప్రధానంగా మూడురకాల వస్త్రాల్ని ధరించేవారు. దాదాపు ఆకాలంలో అనేకచోట్ల అలాంటి వేషధారణే ఉండేది. వాటిల్లో ఒకటి–

**1. ఉత్తరీయం:** దీన్ని ద్రాపి అన్నారు. ఉత్తరీయమే కాలక్రమంలో లుంగీగా, పంచెగా, ఆడవారికి చీరగా మారింది. ఆర్యులు కుచ్చీళ్ళతో పంచెల్ని, చీరల్ని ధరించేవారు.

ఈ సంస్కృతి మన తెలుగునేల వరకూ సోకింది. కేరళ, తమిళనాడు ప్రాంతాలకి సోకలేదు. అందుకే ఇప్పటికీ అక్కడ 'లుంగీల' ధారణే గౌరవంగా ఉంది. అక్కడి ఆడవారి చీరకట్టుకూడా కుచ్చీళ్ళతో ఉండదు. కానీ, మన తెలుగువారు లుంగీల సంస్కృతిని (అసలు మన మూలవాసుల సంస్కృతిని) చిన్నతనంగా చూసి అరువు తెచ్చుకున్న ఆర్యసంస్కృతి (పంచెల) సంస్కృతిని ఘనంగా, గౌరవంగా భావిస్తారు.

ద్రాపి గురించిన మరో ప్రస్తావన చూడండి:

**"ఓ అశ్వినీ దేవతలారా! మీరు చినిగి జీర్ణమైపోయిన ద్రాపిలా ఉన్న చ్యవనుని ముసలితనాన్ని పోగొట్టారు"** (ఋ: 1-116-10)

అలాగే....

గొర్రెల్లో తెల్లనివి, బంగారు రంగు (గోధుమరంగు) గల గొర్రెలుంటాయి. వీటి ఉన్నిలో నేసిన వస్త్రాల ప్రస్థావన కూడా ఉంది.

**"భిభ్రాద్ ద్రాపిం హిరణ్యయం**
**మరుణోవస్త నిర్ణిజం పరిస్పవో వి షేదిరే (ఋ: 1-25-13)**

"వరుణుడు బంగారురంగు ద్రాపిని ధరించాడు. ప్రకాశమానంగా వెలుగుతున్నాడు"–

ఇక రెండోది–

**2. అత్క:** అంటే...పై పంచె. శాలువా. గొంగళి. ఇప్పటికీ గొర్రెలు మేపేవారు, ఆవులమందల్ని మేపేవారు, సంచార జాతులు మండువేసవిలో కూడా గొంగళిని భుజంపై వేసుకుని తిరుగుతూ వుంటారు.

**"వసానో అత్కం సురభిందృశేకం స్వర్ణ నృతవిషరో బభూథ"**
**(ఋ: 6-29-3)**

*"ఓ వజ్రధారి ఇంద్రా! నీవు అందమైన అత్కను ధరించి సూర్యునిలా తిరుగుచున్నావు"* అని భరద్వాజుడు చెప్తే–

వేనభార్గవుడు అదే విషయాన్ని వేనదేవత విషయంలో ఇలా చెప్పాడు–

**"వసానో అత్కం సురభిం దృశీకం స్వర్గనామ జనతప్రియాణి"**
**(ఋ: 10-123-7)**

*" ఓ! వేనదేవతా! మంచి అందమైన అత్కను పైన వేసుకుని చూడచక్కని వాడవై ఇంపుగా ఉన్నావు"* అని.

**3. తలపాగా:** దీన్ని ఋగ్వేదంలో శిప్ర అన్నారు. అంటే శిరస్త్రాణం. ఉష్ణీషం. ఆర్యుల్లో ఆడమగ ఇద్దరూ తలపాగాలు ధరించేవారు.

**"పీవో అశ్వాః శుచద్రథా హి భూతా అయః శిప్రా వాజినః సునిష్కాః (4-37-4)**

"మెరిసే రథాలకు బలిసిన గుర్రాలు పూన్చారు. రాగిరంగు (తామ్ర) తలపాగాలు ధరించారు"-

చరిత్రలో ఋగ్వేద ఆర్యులు ధరించిన వస్త్రాలు వారి ఆవాసాల మూలాల్ని, వారి నాగరకతా వికాసాన్ని తెలియజేస్తున్నాయి.

## నూలు వస్త్రాల ప్రపంచం

ఉన్ని వస్త్రాలకంటే నూలు వస్త్రాలు వినియోగించినవారు మరింత నాగరకులు. విచిత్రం ఏమంటే ఆర్యులకంటే రెండువేల సంవత్సరాలకు పూర్వమే ప్రపంచంలో రెండుచోట్ల నూలువస్త్రాలు ధరించిన జాతులు ఉన్నాయి. వారిలో మొదటివారు భారతీయ సింధూప్రజలు. రెండోవారు మెక్సికో ప్రజలు. సింధూనాగరకత పరిఢవిల్లిన ప్రాంతాల్లో మెహర్‌గర్ (బెలూచిస్థాన్. నేటి పాకిస్థాన్‌లో ఉంది), రాకీఘర్ (హర్యానాలోని హిసార్ జిల్లాలో ఉంది), ప్రాంతాల్లో నూలునేత ఆధారాలు, ప్రత్తి పంట అవశేషాలు లభించాయి.

తలపాగాల సంస్కృతిని ఆర్యులు సింధూప్రాంతంలో స్థిరపడ్డాకే నేర్చుకొని ఉంటారు. పంచెలు, పైపంచెలు, చీరల్లాంటి కట్టుతో ఉన్న సింధూ బొమ్మలు దొరికాయి.

అలాగే మెక్సికోలోని టెహూయకన్ ప్రాంతంలో క్రీ.పూ. 5800-3400 సంవత్సరాల మధ్య ప్రత్తివస్త్రాలు వినియోగించిన ఆధారాలు లభించాయి. పెరూ దేశంలో కూడా క్రీ.పూ. 4వేల సంవత్సరాలనాడే నూలు ఉత్పత్తులు జరిగాయి-

ఇక, అరేబియా, ఈజిప్టు, ఐరోపా ప్రాంతాల్లో నూలువాడకం దాదాపు ఇటీవల కాలంనాటిదే!

ఋగ్వేద ప్రజలు వస్త్రాలు వాడకంలో సింధూ ప్రజల్ని దాటిపోలేదు.

ఋగ్వేదానంతరకాలంలో కూడా అనేక పురాణాల్లో కన్పించే విషయాల్ని పరిశీలిస్తే ఆర్యులు ఉన్నివస్త్రాల తర్వాత 'నార' వస్త్రాలే వాడారు. నూలువస్త్రాలు వాడలేదు. ఉన్ని, నారవస్త్రాలు రెండూ ముతకబట్టలే గానీ, నూలుబట్టల్లా నాజూకైనవి కాదు. ముతక బట్టలంటే.. మందపాటి దారపు పోగులతో నేసిన బట్టలు.

నాజూకు వస్త్రాలు నేయాలంటే సన్నని దారాన్ని తయారుచేసే కండెలు కావాలి. వాటిని నిలువు, అడ్డం, మూలనేతలు నేయగల మగ్గాల నైపుణ్యం కావాలి. అలాంటి సాంకేతిక నైపుణ్యం లేదు కాబట్టే- ఆర్యులు ఉన్ని బట్టల తర్వాత 'నార' బట్టలు ధరించాల్సి వచ్చింది.

వైదికయుగంలో వైదిక ఋషులు, వైదికస్త్రీలు, వైదికరాజులు... అందరూ ధరించింది నారవస్త్రాలే!

వస్త్రాల నైపుణ్యంలో కూడా ఆర్యులు మూలభారతీయుల్ని మించి ముందుకు పోలేకపోయారు.

సింధూప్రజలకన్నా వెనకబడే ఉన్నారు.

*(ఇంకావుంది)*

## ఓ కొడుకా !

మేము
మా అవసానదశకోసం నాలుగురాళ్ళు వెనకేసుకున్న
అమ్మానాన్నలం
అవకాశవాదులై వాటిని దోచుకున్నారు మీరు
ఇంకా దాచుకునే వయస్సు ముందుందిలే అని...
వాత్సల్యపు నిశ్వాస నాకు నచ్చచెప్పింది
ఇప్పుడు మేము వృద్ధాప్యపు పాదాలక్రింద
నలిగిన పూలమాలలం
మేము ఒట్టిపోయిన గేదెలం
ఇంకా పితుక్కోవాలనుకుంటే...
మా పొదుగుల్లో నుండి వచ్చేది
రంగుమారిన రక్తమే కానీ
డబ్బుముర్రు కాదు.
ఇది శాపంకాదు
నిస్సహాయ నిట్టూర్పు.
ఆరుపదుల జీవితంలో
ఎంతోమందిని మిగుల్చుకున్నాము మేము
స్నేహాన్ని దోసిళ్ళతో తాగించారు వాళ్ళు మాకు
కానీ
మా ప్రేమ నీ వైపుగానే ఎందుకు ప్రవహిస్తున్నట్టు !
నీ నిర్లక్ష్యాన్ని ఎందుకు మర్చిపోతున్నట్టు మేము?!
నాయనా!
మాకు ఓ వరం ఇవ్వు
నీ ప్రేమపాశం నుండి మమ్ము విముక్తుల్ని చేయ్
మమ్మల్ని మేము పునర్నిర్మించుకోనీ...



**- డా॥ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి**

సెల్: 9440279594

# ఋగ్వేదంలో నౌకలు, విమానాలు !?

**తం గుర్తయో నేమన్నిషః పరీణసః సముద్రం న సంచరణే సనిష్యవః**
**పతిం దక్షస్య విదథస్య నూ సహోగిరిం న వేనా అధిరోహ తేజసా**

*"స్తోత్రం చేసే యాజకులు ఇంద్రుణ్ణి ఆశ్రయిస్తారు. స్త్రీలు పూలకోసం, పండ్లకోసం పర్వతాల్ని ఆశ్రయిస్తారు. ధనం కావాలనుకొనే వ్యాపారులు సముద్రయానాన్ని ఆశ్రయిస్తారు"* (ఋ: 1-56-2)

డబ్బు బాగా సంపాదించాలనుకునే వ్యాపారులు సముద్రయానాన్ని ఆశ్రయిస్తారనేది పై ఋక్కులోని భావం. అంటే.. విదేశీ వ్యాపారం మంచి లాభదాయకం అని దీని ఉద్దేశ్యం. అయితే మనం ఇక్కడ చూసేది ఇందులో ఎంతలాభం వచ్చింది అనేదికాదు- సముద్రయానం ఎలా చేస్తారు? అనేదే.

కాల్వల్లో, చిన్న చిన్న సరస్సుల్లో, నదుల్లో ప్రయాణం చేయడానికి డింగిరీలు, పడవలు, తెరచాప పడవలు చాలు. - ఇవ్వన్నీ కొద్దిపాటి నీటి ప్రయాణాలకే.. కానీ, అనంత సముద్రజలరాశిలో ప్రయాణం చేయాలంటే "నౌకలు" కావాల్సిందే! ఎక్కువ సరుకుల్ని తీసుకుపోవాలంటే, ఎక్కువ లాభాలు పొందాలంటే నౌకాయానాలే కావాలి. కాబట్టి పై ఋక్కుని బట్టిచూస్తే ఋగ్వేద ఆర్యులు కూడా సముద్రయానాలు చేసినట్టూ లేదా నౌకల నిర్మాణాలెరిగినట్టూ తెలుస్తూనే ఉంది.



బొర్రా గోవర్ధన్
9390600157

## నౌకాయానం - ఒక అవసరం

ఇది మనం ఆలోచించాల్సిన విషయమే. మధ్య ఆసియా నుండి వచ్చిన ఆర్యులకి దారిలో నౌకాయానాలతో అంతగా పనేలేదు. వారు భారతదేశానికి వచ్చిన దారిలో సముద్రమూ అడ్డులేదు. అంతగొప్ప సరస్సులూ లేవు, మహానదులూ లేవు. బహుశా వారికి తెలిసిన అతిపెద్ద జలరాసి కాస్పియన్ సముద్రం అయ్యుంటుంది. అదీ వారి తొలి స్థావరాల్లోనే.

ఇక-వారు సింధూ పరివాహక ప్రాంతానికి వచ్చాకే వారికి నదుల గురించి బాగా తెలిసింది. కానీ, సముద్రం అంతగా తెలియదు. వారికి సముద్రం గురించి తెలియాలంటే , అంతవరకూ స్థానికంగా ఉండి సముద్రయానాల్లో ఆరితేరిన సింధూప్రజలద్వారానే తెలియాలి. అంటే సింధూ ఆక్రమణల్లో భాగంగానే వారికి సముద్రం గురించి, నౌకల గురించిన అవగాహన కలగాలి. నిజంకూడా ఇదే.. సింధూ ప్రజల నుండే ఆర్యులు సముద్రయానాన్ని, నౌకా నిర్మాణాల్ని నేర్చుకున్నారు.

ఎందుకంటే.. సింధూ ప్రజలు గొప్ప విదేశీ వ్యాపారులు. నౌకల ద్వారా ఎన్నో ప్రాంతాలతో వ్యాపార సంబంధాలు కలిగున్నవారు.

అసలు నౌకావ్యాపారం చేయడం అనేది గొప్ప నాగరకతలో ఒకభాగం. నేలమీద ప్రయాణం వల్ల కొన్ని ఇబ్బందులున్నాయి. ముఖ్యంగా వ్యాపారులకు దొంగలూ, దోపిడీల గొడవ ఎక్కువగా ఉంటుంది.

అలాగే.. సరుకులెత్తడానికి ఎక్కువ వాహనాలు కావాలి. ఎక్కువ పశువులు కావాలి. ఎక్కువమంది పనివాళ్ళు కావాలి. ఖర్చు అధికం.కానీ, నీటిమీద ప్రయాణం నేలమీద కంటే సురక్షితం కాకపోయినా, సులువు. ఎంతపెద్ద ఓడనైనా నిర్మించుకోవచ్చు. ఓడ ఎంత పెద్దదైతే నీటి ప్రయాణం అంత మేలు. ఎక్కువ సరుకులు తీసుకుపోవచ్చు, ఎక్కువ దూరాలకు వెళ్ళొచ్చు. సురక్షితంగా ప్రయాణించవచ్చు. ఖర్చు తక్కువ, లాభాలు ఎక్కువ. తక్కువ శ్రమ ఎక్కువ రాబడి- ఇలా ఎలా చూసుకున్నా వ్యాపారానికి నౌకాయానం ఎంతోమేలు.

సింధూ ప్రజలు పెద్ద పెద్ద నౌకల్ని నిర్మించుకున్నారు. రెండు మూడు డెక్‌లున్న (అంతస్తులున్న) నౌకలు కూడా నిర్మించారు.

వీరు క్రీ.పూ. 3000 సం॥ నాడే విదేశాలతో నౌకావ్యాపారం సాగించారు. లోథాల్ వారి ముఖ్యరేవు పట్టణం. అలాగే ద్వారక, ప్రభాస తీరాలు కూడా వీరి నౌకావ్యాపార కేంద్రాలే. వీరు భారతదేశంలోని ఇతర తీరాలతో (బొంబాయి, కొంకణ తీరాలతో)పాటు అరేబియాసముద్రం మీదుగా ఎర్రసముద్రం మీదుగా ఈజిప్టు, ఇరాక్‌ల వరకూ వ్యాపారాలు సాగించారు. ఇటు సౌదీ అరేబియా తీరప్రాంతాల్లోనూ తమ వ్యాపారకేంద్రాల్ని స్థాపించుకున్నారు.

మొత్తంమీద ఆనాటికి సింధూప్రజలు గొప్ప విదేశీ నౌకా వ్యాపారంలో ఆరితేరినవారనేది చారిత్రక సత్యం.

ఆర్యులు సింధూ తీరాలకి వచ్చాక, ఆర్య-సింధూ యుద్ధాల్లో సింధూ ప్రజలు ఓడిపోయాక.. నెమ్మదిగా సింధూప్రజల విదేశీ వ్యాపారం తగ్గిపోయింది.

నిన్న మొన్నటి ఇంగ్లాండ్ ను చూద్దాం. అది

అతిచిన్నదేశం అయినప్పటికీ 16వ శతాబ్దం నుండి 19వ శతాబ్దం వరకూ ప్రపంచంలో దాని శక్తికి తిరుగులేకుండా పోయిందంటే కారణం ఆంగ్లేయుల నౌకాబలమే! వారి నావలే వారిని ప్రపంచ విజేతల్ని చేశాయి–

నౌకాబలం కంటే వైమానికబలం మరింత బలమైంది కాబట్టి ఈ రోజున ఆ బలం ఉన్న దేశాలే అగ్రరాజ్యాలుగా మనగలుగుతున్నాయి.

గుర్రం, రథాలు ఆర్యుల బలాలు. నౌకలు, పడవలు సింధూ ప్రజల బలాలు. సింధూ ప్రజల నదీవలయ జీవనం, అరేబియా సముద్రతీరం– వారి నైపుణ్యాల్ని సముద్రం మీదికి మళ్ళించాయి.

అయితే, ఒకవిషయం. సింధూ ప్రజలు వ్యాపార శ్రేష్టులే గాని, యుద్ధ పిపాసులు కారు. ఆక్రమణదారులు అంతకంటే కారు.

కానీ, ఆర్యుల పశుపాలకులు. వారికి సముద్రంతో అంతగా పనిలేదు. అంత అవసరమూ లేదు.

నేలమీద వాహన నైపుణ్యం లేని (గుర్రాలు, రథాలు లేని) సింధూ ప్రజలు ఆర్యుల చేతుల్లో ఓడిపోగలిగారు.

## గెలుపు, ఓటమి – లాభం, నష్టం

అయితే–

గెలుపూ, ఓటములు నాగరకతకు చెందని అంశాలు. సముద్ర వ్యాపారం "లాభదాయకం అనేది సూత్రం" ఆర్యులకా? సింధూ ప్రజలకా? అని గిరిగీసుకుని ఉండదు. ఎవ్వరికైనా లాభదాయకమే. కాబట్టి ఆర్యవ్యాపార వర్గాలకు కూడా కాలక్రమంలో నౌకావ్యాపారం తప్పనిసరే అవుతుంది. అయ్యింది కూడా. సింధూ తీరంలో స్థిరపడ్డాక ఆర్యులు పశు వ్యాపారనుండి, వస్తువుల వ్యాపారినికి మారక తప్పలేదు. వ్యవసాయం, ఇతర వృత్తులు అవృద్ధి చెందాక వ్యాపారదృక్పదం గిరిగీసుకుని కూర్చోలేదు. సింధూప్రజలు చూపిన విదేశీ నౌకా వ్యాపారం కనిపిస్తూనే ఉంది. నెమ్మదిగా అటుకేసి మళ్ళాక, లాభాల రుచి మరిగాక మడికట్టుకు కూర్చోగలరా!

నౌకా వ్యాపారంపై, నౌకా నిర్మాణాలపై మనసు పెట్టకుండా ఉంటారా? సింధూ వ్యాపారులతో పోటీపడకుండా ఉంటారా?

ఈ పోటీలో భాగంగా ఇరుపక్షాలూ సముద్రంలో తలపడక మానతారా?

ఈ వ్యాసంలో మనం మొదటిచూసిన ఋగ్వేద రుక్కులోని ఆంతర్యం ఇదే–

"మంచిమంచి లాభాలు, అధికధనం కావాలనుకుంటే వ్యాపారులు సముద్రయానాన్నే ఆశ్రయిస్తారు" అనేది–

ఇదే విషయం మరోచోట కూడా ఉంది.

**ఉవాసోషా ఉచ్ఛాచ్చ ను దేవీ జీరా రథానాం**
**యే అస్యా ఆచరణేషు దధ్రిరే సముద్రే న శ్రవస్యవః**

(ఋ: 1–48–3)

"ధనంకోసం వ్యాపారులు సముద్రంలో నావలు నడుపు తున్నట్లు, ఉదయాకాశాన ఉషోదేవి రథము నడుపుతూ వచ్చింది" అని దీనర్థం. ఇక్కడ– నావల్ని 'సముద్ర రథాలు'గా చెప్పారు.

## దురాక్రమణ – దుర్బుద్ధి

ఆర్థిక వనరుల్ని ఆక్రమించడమే యుద్ధం. ఆదిమ మానవునికైనా, ఆధునిక మానవునికైనా యుద్ధం అనేది కేవలం దురాశవల్ల కలిగే పరిణామమే. ఒక ఆదిమగణం మరో ఆదిమగణం మీదపడి గణం మొత్తాన్ని చంపి పారేసేది. కారణం ఆ గణప్రాంతంలోని ఆహారాన్ని పొందడం కోసమే.

ఆర్యులు, సింధూ ప్రజలపై యుద్ధం చేసిందీ పచ్చికబయళ్ళకోసమే.

ఇప్పుడు అమెరికా లాంటి దేశాలు యుద్ధాలు చేస్తుంది ఇప్పటి ఆర్థిక వనరైనా అయిల్ నిక్షేపాల కోసమే.

ఆహారం లేకుండా మనిషి గాలిని భోంచేసినా, ఆర్యుల ఆవులమందలకు పచ్చికతో పనిలేకపోయినా, నేటి యంత్రాలూ, ప్రయాణ సాధనాలు, ఇతర పరిశ్రమలు ఆయిల్‌తో కాకుండా ఉప్పునీటితో నడిచినా–

యుద్ధాలతో పనేలేదు.

స్థానికంగా ఎప్పటినుండో అక్కడే జీవిస్తున్నా వారిని, ఆ వనరులు కొల్లగొట్టడం కోసం అక్కడి నుండి వారిని తొలగించే పనిలో భాగమే యుద్ధం.

ఇది దేశాల మధ్య అయినా, జాతుల మధ్య అయినా, వంశాల మధ్య అయినా, కుటుంబ సభ్యుల మధ్య అయినా–

'దురాక్రమణ అనే దుర్బుద్ధి లేకుంటే' యుద్ధం పుట్టదు.

## బరుకచ్ఛం– బానిసత్వం

తొలిగా, సింధూ ప్రజల పచ్చికబయళ్ళు ఆక్రమణకి ఆర్యులకు గుర్రాలు, రథాలూ, విల్లులూ ఉపయోగపడ్డాయి. కాలక్రమంలో వారూ వ్యాపారాల్ని నేర్చాక– మెల్లగా వారికీ నౌకా కౌశలం అవసరం అయ్యింది. ఈ బలంతో అటు వ్యాపారాన్నే కాకుండా, కొన్ని సింధూ నగరాల్ని, లంక ప్రాంతాల్ని ఆక్రమించుకున్నారు.ఆ విషయం 1వ మండలం 116వ సూక్తంలో ఉంది–


**"తుగ్రో హ భుజ్యుమశ్వినోదమే ఘీ రయిం న**
**కశ్చిన్మమృవాగేం అవాహాః**

**తమూ హథు ర్నౌభిరాత్మన్వతీభిరన్తరిక్ష ప్రుద్భిర పోదకాభిః"**
(ఋ: 1-116-3)

దీనర్థం ఇది-

తుగ్రుడు అనేవాని కొడుకు భుజ్యుడు. సముద్ర మధ్యలో జరిగిన యుద్ధంలో భుజ్యుడు దెబ్బతిన్నాడు. అశ్వనులు తమనావలతో వెళ్ళి, భుజ్యుణ్ణి నీటిలో మునిగిపోకుండా కాపాడారు. తిరిగి అతని తండ్రి దగ్గరకు చేర్చారు".

ఇక్కడ "వేరొక దీవికి పంపగా" అని ఉంది. బహుశా ఇది సింధూ నౌకాతీరాలై ఉండొచ్చు. ఇప్పటి గుజరాత్‌లోని అరేబియా, పాకిస్థాన్‌లోని సింధూతీరాలలో సముద్రపునీటిలో మునిగిపోయిన భూభాగం ఉంది. దీన్ని "రాణ్ ఆఫ్ కచ్' అంటారు. ఇక్కడి నేల దీవులు దీవులుగా ఉంటుంది. దీన్ని పూర్వం 'బరుకచ్చం' అనేవారు. బరు రాజ్యంలోనిది ఈ ప్రాంతం. పై ఋక్కుకి నేమాని వేంకట నరసింహశాస్త్రిగారు చక్కటి పద్యం రాశారు-



**"వేరొక దీవియందుగల వీరుల**
**వైరుల చంప "దగ్రు" దను**
**వీరనృపుండు "భుజ్యు"డను వీరకుమారుని బంపుచుండ నా**
**వీరుని నౌక సంద్రమున వేగిరపాటున మన్గుచుండగా**
**మీ రది చూచి మీ పడవ మీదకు వానిని జేర్పలేదటే!"**

*(తి.తి.దే.వారి శ్రీమదాంధ్ర ఋగ్వేదసంహిత-331 పేజి)*

ఈ యుద్ధం వ్యాపారం కోసమా? రాజ్యం కోసమా? అనేది సందిగ్ధమే అయినా, నౌకాయుద్ధం జరగడం, ఆర్యుడైన భుజ్యుడు ఓడిపోవడం, అశ్వినులు అతణ్ణి కాపాడ్డం అనే విషయంలో సందేహం లేదు.

ఇక్కడే మరో విషయం ఉంది-

భుజ్యుడు వెళ్ళడానికీ, ఓడిపోవడానికీ, తిరిగి అశ్వనులు అతణ్ణి తండ్రి దగ్గరకు చేర్చడానికి మూడురోజులు పట్టింది-

**"తిస్రః క్షపస్త్రిరహాతివ్రజద్భిర్నా సత్యా భుజ్యుమూహథుః పతంగైః**
**సముద్రస్య ధన్వన్నార్ద్రస్య పారే త్రిభీ రథైః శతపద్భిః షళశ్వైః**
(ఋగ్వేదం: 1-116-4)

"ఓ! అశ్వనులారా! ఆరు గుర్రాలు పూన్చిన నూరుచక్రాల రథంపై, భుజ్యుని మూడురోజుల్లో సముద్రం నుండి, సముద్రతీరం నుండి, ఎడారి నుండి రక్షించారు"- అని దీనర్థం.

ఇక్కడ 'ఎడారి నుండి' అనేది చాలా కీలకమైన విషయం . మనం పైన చెప్పుకున్న బరుకచ్చం ఎడారి ప్రాంతమే. థార్ ఎడారిలో ఒక భాగం. థార్ ఎడారిలో ప్రవహించే నది సింధూనది. సింధూనది వల్ల ఆ ఎడారిలో కొంతభాగం సస్యశ్యామలమైంది. ఇలాంటి భూభాగాలు చాలా అరుదు. ఆఫ్రికాలో నైలునది, ఇరాక్‌లోని యూఫ్రటీస్, టైగ్రిస్ నదులు, భారత్‌లో (నేటి పాకిస్తాన్)లో సింధూనది - ఇవి ఎడారి నదులు. వీటిని ఎక్సోటిక్ రివర్స్ అంటారు. ప్రపంచ అద్భుత నాగరకతలన్నీ ఇలాంటి నదీతీరాలలోనే వెలిశాయి.

పై ఋక్కు సింధూరేవు తీరాల భౌగోళిక స్వరూపాల్ని చక్కగా వివరించి చెప్పింది-

ఇక ఈ ఋక్కు చూడండి.

**"అనారమ్భణే తరవీరయేమనాథాస్థానే**
**అగ్రభణే సముద్రే**
**యదశ్వినా ఊహాథుర్భుజ్యుమస్తం**
**శతారిత్రాం నవామాతస్థి వాంసం"**
*(ఋ:1-116-5)*

అంటే...

"ఎలాంటి నేల లేని, నేలపట్టు దొరకని, ఏలాంటి ఆధారమూలేని సముద్రంలో నూరు తెడ్లనావమీద పడివున్న భుజ్యుని రక్షించి, ఇంటికి చేర్చారు" అని అశ్వనుల్ని కీర్తించాడు కక్షీవంతుడు. దీనికి నేమాని వారి పద్యం చూడండి-

**"నూరు తెడ్డులతో నొప్పి వారి లోన**
**మునుగ కుండెడు నోడపై మునిగియున్న**
**భుజ్యరాజును ఎక్కించి పూజ్యుడైన**
**తండ్రి గృహమున జేర్చిరి ధర్మపరులు"**

*(శ్రీమదాంధ్ర ఋగ్వేద సంహిత: 331 పేజీ)*

ఈ పద్యంలో "నూరు తెడ్ల నావ" అని ఉంది అంటే పెద్ద నౌకే. వందమంది కూర్చొని తెడ్లు వేయడానికి తగినంత పెద్ద నావ.

ఇంత నావను నడపాలంటే భుజబలం కలిగిన పనివాళ్ళు కావాలి. ఈజిప్టు, మెసపుటోమియా ప్రాంతంలో ఇలాంటి నావల్ని నడపడానికి బానిసలు ఉండేవారు. సింధూ నాగరకతలోకూడా బానిసవిధానం ఉంది. వారి నావల్ని బానిస కూలీలే నడిపేవారు.

ఆర్యులు సింధూప్రాంతంలో స్థిరపడ్డాక, వారూ బానిసవ్యవస్థని పాటించారు. ఆర్యులు స్వభావ సిద్ధంగా ఆటవికులు. హింసావాదులు. క్రూరులు. బానిసలపట్ల కూడా అతిక్రూరంగా వ్యవహరించేవారు. ముఖ్యంగా దశ్యుల్ని (సింధూప్రజల్ని, మూలభారతీయుల్ని) బానిసలుగా చేసుకుని, వారితో చాకిరీ చేయించుకునేవారు.


**"న మా గరన్ నద్యో మాతృతమా దాసా యదీం సుసముబ్ధమవాధుః**
**శిరో యదస్య త్రైతనో వితక్షత్ స్వయం దాస ఉరో అంసావపిగ్ధ'** (ఋ: 1-158-5)

ఈ ఋక్కులో దీర్ఘతముడు ఇలా అంటున్నాడు-

"తల్లిలా అందర్నీ పోషించే నదీజలాలు నన్ను ముంచకుండా ఉండుగాక! నా దాసులు (నా సేవకులు) నన్ను బంధించారు. తన్ని బోర్లాపడేశారు. త్రైతుడు అనే దాసుడు నా తలకి గాట్లు పెట్టాడు. నా రొమ్ము భాగాలకీ, భుజాలకీ గాయాలు చేశాడు"-

దాసులు యజమానిని అలా చేశారంటే.. వారిని ఎంత క్రూరంగా హింసించి ఉంటాడో అర్థంచేసుకోవచ్చు.

ఋగ్వేదం చారిత్రక గ్రంథం కాదు. కావ్యలక్షణాలు, అద్భుత వర్ణనలు గల గ్రంథం. వర్ణనల్లో ఉత్ప్రేక్షలు ఉంటాయి. అతిగా చెప్పడం ఉంటుంది. వందచక్రాల రథాల, వెయ్యిగుర్రాల రథాల వర్ణనలు అలాంటివే. ఈ నూరు తెడ్ల పడవకూడా అలాంటాదే కావొచ్చు. కాకపోనూ పోవచ్చు. ఎందుకంటే.. అప్పటికే సింధూ ప్రజలు రెండంతస్తుల నావల్ని వాడారు. ఏమైనా.. దాసుల వల్లే పెద్దపెద్ద నౌకలు నడవడం సాధ్యపడుతుంది.



## రెక్కల నౌక - విమానం తోక

ఇక ఈ ఋక్కు కూడా చూద్దాం-

**"యుక్తో హ యద్ వాం తౌగ్ర్యాతు పేరుర్వి మధ్యే అర్ణసో ధాయిప్రజః"**

'సముద్రం మధ్యలో మునిగిపోయిన తుగ్రుని పుత్రుడు 'తౌగ్రుని' రక్షించి ఒడ్డుకు చేర్చారు' అని ఉంది.

దీన్నే నేమానివారు-

**'యానము మీద నెక్కి చని యబ్ధిని మున్గిన 'తుగ్ర' సూనునిం బూనిక గట్టు చేర్చితిరి పూజ్యులు మీరలు దస్యులారా!..."** అంటారు.

అలాగే.. రుగ్వేద రుషి అగస్త్యుడు కూడా.. ఇదే విషయాన్ని ఇంకొక విధంగా చెప్పాడు-

**"యువమేతం చక్రథుః సింధుషు ప్లవమాత్మన్వన్తం పక్షిణం తౌగ్రాయకం**
**యేన దేవత్రా మనసా నిరూహథు సుపప్తనీ పేతథుః క్షదసో మహః** (ఋ:1-182-5)

'అశ్వనులారా! మీరు తుగ్రుని పుత్రుని కోసం, బలమైన, వేగమైన, పక్షిలా రెక్కలుగల నౌకను పంపి, దేవతల దయవల్ల అతణ్ణి ఒడ్డుకు చేర్చారు"-

ఇందులో "పక్షిలా రెక్కలుగల నౌక" అని ఉంది. అంటే 'తెరచాప నౌక' అయి ఉంటుంది-

దీన్ని నేమానివారు ఇలా చెప్పారు

**"మీరలు తుగ్రపుత్రుని నిమిత్తము వారధియందు బక్షిసంచారముబోలు వేగమున సాగెడు నావను గల్గజేసి యే తీరునొ వాని జేర్చితిరి తీరపు భూమికి నశ్వులారా! మీ బీరము నెన్నగా వశమె! పెద్దలు గారటె? మీర లెంతయున్"**

మరి ఈ ఋక్కు చూడండి...

**"అవవిద్ధం తౌగ్రమప్సు అక్తనరామ్భణే తమసి ప్రవిద్ధం చతస్రో నావో జఠలస్య జుష్టా ఉదశ్విభ్యామిషితాః పారయతి"** (ఋ: 1-182-6)

తుగ్రపుత్రుడు సముద్రంలో ఏలాంటి ఆధారం లేకుండా, బోర్లాపడిపోయాడు. అశ్వినులు నాలుగు నావల్ని అతనికి అందించారు"

అలాగే...

**'స్విద్ వృక్షో నిష్ఠితో మధ్యే అర్ణసో యం తౌగ్ర్యో నాధితః పర్యషస్వజత్ పర్ణా మృగస్య పతరోరి వాంభా ఉదశ్వినా ఊహథుః శ్రోమతాయకం"** (1-182-7)

'ఓ! అశ్వినులారా! మీరు తుగ్రపుత్రుని రక్షించడానికి నీటి మధ్యన చెట్టులాగా నావను నిలిపారు..."

దీన్ని నేమానివారు ఎలా చెప్పారో చూడండి..

**'మిమ్ముల గ్రోలు తుగ్రసుతు మేలునకై నడిసంద్రమందు వృక్షమ్ము జనించునా యనెడు చందము యానము నిల్పినారు.."**

ఇవే కాక 6-63-9 లో కూడా వేగంగా వెళ్ళే రెండు పడవల ప్రస్థావన ఉంది.

మొత్తంమీద ఋగ్వేద ఆర్యులు కూడా నౌకల్ని, తెరచేప ఓడల్ని, పడవల్ని, ఉపయోగించారు. ఈ విషయంలో ఈజిప్టు వారికంటే, మెసపుటోమియన్ల కంటే, సింధూప్రజలకంటే వెనుకబడే వున్నారు. అయినా- ఆర్యుల నౌకా ప్రయాణాలు, పరిజ్ఞానం కాస్త మెరుగైనదే!

**గుర్రాలున్నాయి, రథాలున్నాయి, నావలున్నాయి గానీ, వ్యోమనౌకల గురించి, వ్యోమయానాల గురించి, విమానాల గురించి ఋగ్వేదంలో ఎక్కడా లేదు.**

## రామాయణ-భారతాల్లో నౌకలు

వైదిక ఇతిహాసాలైన రామాయణ, భారతాల్లో కూడా 'నౌక'ల ప్రస్తావనల్ని చూద్దాం. భారతంలో నౌకల ప్రస్తావనలుగానీ, మహాభారతయుద్ధంలో జలాశయాలపై జరిపిన యుద్ధసన్నివేశాలుగానీ లేవు. అది కురుపాంచాలలో భూమిమీద జరిగిన యుద్ధమే. పైగా యుద్ధాలకోసం "గోగ్రహణాలు" ఉన్నాయి కాబట్టి ఆనాటి సంపదకూడా పశువులే. పశుసంపద విషయంలో విదేశీ వ్యాపారాలకీ, నౌకా వ్యాపారాలకీ అంత అవకాశం ఉండదు.

మరి, రామాయణంలో నౌకాయుద్ధాలకి బోలెడు అవకాశం ఉంది. రాముడు, అతని కిష్కిందసైన్య (వానరసైన్యం) సముద్రం దాటి లంక మీద మెరుపుదాడి చేయాలి. లంకకు చేరాలంటే సముద్రం దాటాలి. సముద్రం దాటాలంటే నౌకాబలం కావల్సిందే!



నిజానికి, రామాయణకావ్యం ఇలియడ్ అనే గ్రీకు పురాణానికి అనుసరణ అంటారు. అందులో ట్రాయ్ నగరం ముట్టడి ఉంది. సముద్రం మీద అర్థరాత్రి ఎన్నో నౌకలు, పడవల మీదవచ్చి, ట్రాయ్ నగరాన్ని చుట్టుముట్టి, నగరాన్ని తగులబెట్టి, నాయకుడిని చంపి, తన రాణిని తిరిగి తీసుకుపోతాడు.

ఈ కథలో కూడా నౌకాయుద్ధాలున్నాయి. మరి, రామాయణంలో సముద్రం దాటడానికి రాముని సైన్యం నౌకలు ఉపయోగించలేదు. సముద్రం మీద వంతెనగా తేలే నాళ (కొబ్బరి), తాళ (తాటి), తమాళ (మోదుగ) చెట్లను వాడారు. అవి నీటిమీద తేలతాయి కాబట్టి 'తారుడు' అనే వానర ఇంజనీర్ వాటితో బ్రిడ్జి నిర్మించాడు. దానిమీదే వానరసైన్యం లంకకు చేరుకుంటుంది.

అంటే... వేదకాలం నుండి రామాయణకాలం వరకూ వైదిక సంస్కృతిలో నౌకలకు పెద్ద ప్రాధాన్యత లేదనీ, వారికి నౌకానిర్మాణకుశలతలు లేవని చెప్పడానికి, వైదికుల ప్రసిద్ధ ఇతిహాసాలు రెండూ తేటతెల్లం చేస్తున్నాయి.

## ఎలా పుట్టాయి? ఎప్పుడు పుట్టాయి?

'ఋగ్వేదంలో విమానాల గురించి ఉంది' అనే మాటలు ఎలా పుట్టాయో, ఎప్పుడు పుట్టాయో కాస్త చూడాల్సిందే!

వేదంలోని భాష పురాతన భాష. ప్రాథమిక సమాజాలు ఉపయోగించే భాష. ఈ భాషల్లో ఒకేపదానికి ఎక్కువ అర్థాలుంటాయి. అందుకే వేదాన్ని ఏ ఇద్దరూ ఒకేరకంగా వ్యాఖ్యానించరు, వ్యాఖ్యానించలేరు.

'**వందే పార్వతీపరమేశ్వరౌ**' అంటే ఒకర్థం, '**వందే పార్వతీప రమేశ్వరౌ**' అంటే వేరే అర్థం వచ్చినట్లు- సంస్కృతంలో ఒక్కొక్క అక్షరానికి ఒక్కొక్క అర్థంతీసి రకరకాల భాష్యాలు రాసుకోవచ్చు.

## నిరుక్తం- దయానందం

సంస్కృతం అంటే సంస్కరించిన భాషకాదు- సంస్కరించాల్సిన భాష అనుకోవాలి.

అసలు భాషతోనే ఇలాంటి తంటా ఉంటే- కొందరు భాష్యకారులు ఆధ్యాత్మిక అర్థాలు అంటూ లేనిపోని విశ్లేషణలు సాగదీసి మరెంతో గందరగోళం చేస్తారు-

వేదకాలం క్రీ.పూ.2000 నుండి క్రీ.పూ. 800 వరకు అని చరిత్రకారులు నిర్ధారించారు.

ఈ కాలంలోనే వేదంలోని పదాలకి అర్థాల్ని చెప్తూ యాస్కుడు 'నిరుక్తం' రచించారు. ఇప్పటి వరకూ ఈ నిరుక్తమే వేదాలకి ప్రామాణికం. ఇది క్రీ.పూ. 600 సంవత్సరాల నాడు జరిగింది.

ఆ తర్వాత క్రీ.శకాల్లో తెలుగువాడైన స్కంధస్వామి, ఉద్గీతుడు, వేంకటమాధవుడు తమ తమ వేదభాష్యాలు రచించారు.

మరో ప్రామాణిక భాష్యం సాయనుడి భాష్యం. ఈయనకాలం క్రీ.శ. 1315. ఈయన విజయనగర సామ్రాజ్య స్థాపకులైన హరిహరరాయలు, బుక్కరాయల ఆస్థానంలో మహామంత్రి, తెలుగువాడు.

వీరందరి భాష్యాల్లో ఎక్కడా మనం ఈ వ్యాసంలో చదువుకున్న ఋక్కుల్లోకానీ, మరీ ముఖ్యంగా చివరిగా చెప్పుకున్న అగస్త్యుడు చెప్పిన 182వ సూక్తంలోని 5,6,7 ఋక్కుల్లోగానీ 'విమాన' ప్రస్థావనలు లేవు. కానీ మొదటిసారిగా స్వామి దయానంద సరస్వతి వ్యాఖ్యానంలోనే 'విమాన' ప్రస్థావనలు వచ్చాయి.

రెక్కలున్న పడవలు (తెరచాప పడవలు) అని ఉంటే, రెక్కలున్నారు కాబట్టి అది 'విమానమే', 'వేగంగా వెళ్తుంది' కాబట్టి 'విమానమే' అనే అర్థాన్ని తీసి దయానందులు తన **వేదతత్వ ప్రకాశం** అనే **ఋగ్వేదాది భాష్యభూమికలో** రాశారు. ఇదే కాదు చాలా విషయలు అలాగే రాశారు. గతంలో ఎవ్వరూ చూడని కొత్త వేదార్థాల్ని కుప్పించి పారేశారు.

వేదాల చారిత్రక ప్రాధాన్యతని పాతిపెట్టారు. దయానందులవారే 'విమానాలు' అని ఎందుకు అనుకున్నారు?

మిగిలిన వారంతా ఎందుకు అనుకోలేదు?

ఎందుకంటే.... వారి కాలాల్లో విమానాలు లేవు. అందుకే వారు నావల్ని నావలుగానే అనుకున్నారు.

దయానందుని కాలానికి (1824-83) విమానాలు వినియోగం లోకి వచ్చాయి. గొప్ప ప్రయాణ సాధనాలుగా పేరుపొందాయి. కాబట్టి 'ఇవి వేదాల్లో లేకపోతే ఎలా?', 'అన్ని వేదాల్లో ఉండాలి గదా?' అని విచిత్ర వ్యాఖ్యానం చేశారు.

ఆయన తన 'ఋగ్వేదాది భాష్యభూమిక'లో-

**'అథ నౌవిమానాది విద్యావిషయ స్సంఏపతః'** అనే ఒక అధ్యాయం రాశారు-

అది అట్లా ఉంచండి.

ఇక ఈ విపరీతార్థం చూడండి.

మనం ఈ క్రింది రెండు రుక్కుల్ని ఇదే వ్యాసపరంపరలోని 'ఋగ్వేద ఋతురాగం' అనే విభాగంలో చూశాం కూడా..

**''కృష్ణం నియానం హరయః....''** (ఋ:1-164-47)

దీనర్థం ఇది: 'సూర్యకిరణాలు జలాల్ని గ్రహిస్తాయి. నల్లని మేఘాలు ఏర్పడతాయి. ఈ జలం నిండిన నల్లని మేఘాలు ద్యులోకం (ఆకాశం) చేరతాయి. తిరిగి భూమిమీద వర్షిస్తాయి. భూమిని తడుపుతాయి. ఈ విషయం ఎవరికి తెలుసు? తెలిసిన వాడే ప్రాజ్ఞుడు''



దీనికి నేమానివారి అనువాదం చూద్దాం-

**రవిఘృష్ణలుదకమునుగొని**
**వివిధములగు ఘనములందు వెలయించుచునా**
**రవి నుండి మరల వచ్చును**
**భువనంబును దడుపుచుండు, బొలుపారంగన్!**

ఇక ఇప్పుడు దీనికి దయానందుల వారి వ్యాఖ్యానం చూడండి-

''**(కృష్ణం)** కాష్ఠలోహాది పార్థివ పదార్థాలతో నిర్మించబడి ఆకర్షణయుక్తమగు, **(నియానం)** విమానమును, **(హరయః)** వేగాది గుణయుక్తములగు, **(సువర్ణా)** బాగుగా గమనం చేయించగల పూర్వోక్తములైన అగ్నిజలాదృశ్యములు **(అపోవసానః)** జలసేచనయుక్త బాష్పమును పొంది యాంత్రికగతితో, **(దివముత్పతంతి)** ప్రకాశయుక్తమగు ఆకాశమునందు పైకెగసి పోవునట్లు చేయును....'' ఇలా వుంది ఆయన వ్యాఖ్యానం.

వింతైన విషయం ఏమంటే- దయానందునికి విమానాలు తెలుకనుగానీ, అవి ఎట్లా ఎగురుతాయో తెలియదు. ఆ రోజుల్లో రైళ్ళు, నౌకలు ఆవిరిశక్తితో నడుస్తూ ఉండేవి. అదేవిధంగా విమానం కూడా ఆవిరిశక్తితో నడుస్తుంది అనుకొని పై వ్యాఖ్యానం రాశాడు. విమానం ఆకాశంలో ఎగరడానికి 'పీడన వ్యత్యాసాలు' కారణం అనే విషయం ఆయనకు తెలియదు-

నేను ఈ వ్యాసంలో చాలాచోట్ల నేమాని వారి పద్యాలు ఉటంకించాను. ఎందుకంటే.. వారు యాస్కుని వ్యాఖ్యానానికి అనుకూలంగా వ్యాఖ్యానించారు కాబట్టి- యాస్కుడు 'విమానం' అని వ్యాఖ్యానిస్తే నేమాని వారు 'విమానం' అనే రాసేవారు గదా!

అందుకే కాస్త నిడివి పెరుగుతుందని తెలిసినా ఈ వ్యాసంలో చాలాచోట్ల నేమాని వారి పద్యాలు ఉటంకించడం జరిగింది-

## రాశిచక్రం - పళ్ళ చక్రం

ఇక ఇప్పుడు మరోచిత్రవిచిత్రాన్ని చూద్దాం-

**'ద్వాదశ ప్రధయశ్చక్రమేకం త్రీణినభ్యానిక ఉతచ్చికేత**
**తస్మిన్త్సాహం త్రిశతానశంకవోఅర్పితాః షష్టిర్ చలాచలాసః'** (ఋ: 1-164-48)

దీన్నీ 'ఋగ్వేద ఋతురాగం' అనే విభాగంలో చదివాం-

దీనర్థం ఇది-

*''ఆకాశంలో పన్నెండు ఆకుల రాశిచక్ర పరిధిలున్నాయి. ఒక చంద్రుడు (ఒక సంవత్సరం), మూడుపలకలుగల ఋతుచక్రం ఇది. ఈ చంద్రునికి మూడువందల అరవై రోజులు-''*


ఇది ఒక సంవత్సరం కాలచక్రాన్ని తెలిపే విషయం. పన్నెండు రాశులు, మూడుకాలాలు, ఆరు ఋతువులు, 360 రోజులు. దీన్ని ఇలా గీయవచ్చు.

ఇప్పుడు దీనికి దయానందుని వ్యాఖ్యానం చూడండి. ''**(ద్వాదశ ప్రధయః)** ఆ యానములో పన్నెండు ప్రథలుండును. **(చక్రమేకం)** వాని మధ్య సర్వయంత్రాల్ని తిప్పడానికి ఒక చక్రం ఉంటుంది. **(తాణినభ్యాని)** మధ్యలో ఉన్న అవయవాల్ని పట్టి ఉంచడానికి 3 చక్రాలుంటాయి **(సాకంత్రిశతా)** వాటితో మూడువందలు **(శంకవోఅర్పితా)** యంత్రపు మరలకూర్పు ఉంటుంది. అవి, **(చలాచలాసః)** యానాన్ని నడపడానికీ, ఆపడానికీ వీలుగా ఉంటాయి. **(షష్టిః)** 60 యంత్రపు మరల్ని దానిలో ఏర్పాటు చేయాలి. ఈ కార్యమంతటినీ ఎవరు ఎరుగును? **(న)** అందరూ ఎరుగురు. ఈ విద్యలో నైపుణ్యం

ఉన్నవారే ఎరుగుతారు–

ఈ వ్యాఖ్యానం చూసి నవ్వుకోనవసరం లేదు. దయానందుల వారికి గేర్‌బాక్సుల పరిజ్ఞానం బాగానే ఉ ఒదనుకోవాలి. విమానానికి ఈ భూమ్మీద తిరిగే యంత్రాల గేర్‌బాక్స్‌లు పనిచేయవు. 60 పళ్ళచక్రాలు, 300 మరలు విమానాన్ని పైకెత్తవు. ప్రొపెల్లర్స్ ద్వారా విమానం బాడీకింద గాలిని వేగంగా ప్రక్కకి తోసెయ్యాలి. అప్పుడు అక్కడ అల్పపీడనం ఏర్పడుతుంది. క్రింద ఉన్నగాలి వేగంగా ఆ అల్పపడీనంలోకి వచ్చిపడి, విమానాన్ని పైకి ఎత్తుతుంది. ప్రొపెల్లర్స్ ఆగిపోతే విమానం పడిపోతుంది.

చాలామంది పక్షిని చూసి విమానాన్ని నిర్మించారనుకుంటారు. నిజానికి అలా చేసిన ప్రయోగాలన్నీ విఫలం అయ్యాయి. చివరికి గాలిపటం ఎగిరే విధానంలోని పీడన వ్యత్యాసాలు ఏర్పరచి విమానాన్ని ఎగిరించారు. విమానానికి 'గాలిపటం' ఆధారం. పక్షులు కాదు.



అందుకే **తనకు తెలిసిన ఆవిరయంత్రాల్ని, గేరుబాక్సుల్ని కలిపి– విపరీతార్థం తీసి విమానాలు వాటి నిర్మాణాలు ఋగ్వేద ఆర్యులకి తెలుసు– అని దయానందుడు రాశారు.**

**ఇక, అక్కడ నుండి 'వేదాల్లో విమానాలు' అనే రోగం పట్టుకుంది.**

విమానానికి బదులు "పళ్ళ చక్రాలతోతిరిగే గోడగడియారం ఆర్యులకు తెలుసు" అని వ్యాఖ్యానం చేసినా కొంతలో కొంత బాగుండేది.

## విలువ పెరిగిందా? తగ్గిందా?

అయితే– మనం ముందే చెప్పుకున్నట్లు యాస్కుల వారి నుండి సాయనుని వరకు ఎవరికీ ఈ దుగ్ధలేదు. వేదాలకి లేనిపోని విజ్ఞానాన్ని అంటించాలనే దురదాలేదు. వారు వేదాల్ని వేదాలుగానే చూశారు, గౌరవించారు. విపరీత వ్యాఖ్యానాలు చేయడం దోషంగానూ భావించారు. మారిపోతున్న నాగరకతలకి అనుకూలంగా వాటితో 'దొంగసాక్ష్యం' చెప్పించే పని చేయలేదు.

రేపు మరొక భాష్యకారుడు వచ్చి కంప్యూటర్లు, టీవీలు, రాకెట్‌లు అన్నీ వేదాల్లో ఉన్నాయని వ్యాఖ్యానాలు రాయొచ్చు.

అలా రాసేవారు ఒకచిన్న లాజిక్ మరచేపోతున్నారు. వేదంకంటే విజ్ఞాన ఆవిష్కరణలే గొప్పవని ఒప్పకనే ఒప్పేసుకుంటున్నారు. అలాంటి ఘనాపాటీలకు ఒకటే విన్నపం–

కనీసం తాళపత్రాలకు కూడా చేరని వేదంలో, కనీసం లిపికి కూడా నోచుకోని వేదంలో– విమానాలు, రాకెట్లూ ఉ ంటాయని చెప్పుకోడం సబబేనా?

ఎవరైనా వేదాల్ని చదివితే– (పూర్వం చదివే అవకాశం లేదు. కానీ ఇప్పుడు చదవకుండా ఆపే అవకాశం లేదుగదా!) నిజాలు తెలిస్తే అది 'వేదాలకే చిన్నతనం' అనే ఆలోచన ఉండదా?

ఆ తప్పు చేస్తున్నాం అనే ఆలోచన కలగదా?

ఈ వ్యాసావళి ముగిస్తూ మరోసారి చెప్పేది ఒకటే.. బుద్ధుడు చెప్పినట్లు

"అతిలౌల్యం వల్ల, అతిద్వేషం వల్ల ఉన్నదాన్ని ఉ న్నట్టు చూడలేం"– ఆ రాగద్వేషాల్ని వీడండి– అప్పుడే సమ్యక్ దృష్టి కలుగుతుంది. సంస్కారమూ కలుగుతుంది!

పశుపాలకులైన ఆర్యులు, సింధూ ప్రజల్ని భుజబలంతో ఓడించారు.

వైజ్ఞానిక నాగరకతను ఆర్యులనుండే నేర్చుకున్నారు. నౌకా పరిజ్ఞానంకూడా వారికి అలా కలిగిందే!

అందుకే....

నాగరకత విషయంలో ఆర్యులు విజేతలైన పరాజితులు.

***(ఋగ్వేదం పరిశీలన ఇంతటితో సమాప్తం. రెండునెలల విరామం తర్వాత మిగిలిన వేదాలు చూద్దాం)***

## ఉత్తమ బహుమతి

ఎన్నో వందల ఏళ్ళ నుండి జనం ఆలోచనలను జడత్వంలో వుంచిన కుల, మత, మౌఢ్యాల నుంచి స్వేచ్ఛ కల్పించటానికి అంకితమై పనిచేస్తున్న పత్రిక 'స్వేచ్ఛాలోచన'. దీనిని తెలుగునేల నాలుగు చెరగులా వ్యాప్తి చేయటానికి మీవంతు సహకరించమని విజ్ఞప్తి. స్నేహితులకీ, బంధువులకీ దీనిని పరిచయం చేయండి. విద్యార్థులకు, మేధావులకు, గ్రంథాలయాలకు చేరువ చేయండి. ఉత్సవాల్లో కానుకగా పత్రిక చందాలను యివ్వండి. బుద్ధిలో జడత్వాన్ని తుంచి, హేతుత్వాన్ని పెంచటమే మీ సన్నిహితులకు మీరిచ్చే ఉత్తమ బహుమతి.

**– మేనేజర్**

## 'ఋగ్వేదం నుంచి యజుర్వేదానికి'... అంటే

# సమష్టి నుండి వ్యష్టికి...

(వేదాలను అధ్యయనం చేసి చారిత్రక, సామాజిక పరిణామ దృష్టితో విశ్లేషిస్తూ ఆ కాలపు అజ్ఞానాన్ని, విజ్ఞానాన్ని స్పష్టంగా చెప్పడం కత్తిమీద సాములాంటిది. అటువంటి మేధోమథనానికి కొంత ఎక్కువ సమయమే పడుతుంది. వేదాలలోని వివరాలను వాస్తవాలను నేటి తరానికి అందించాలన్నా లక్ష్యంతో "స్వేచ్ఛాలోచన, **2016**, సెప్టెంబర్ సంచికలో "వేదాలు - విజ్ఞానం" అనే శీర్షికను ప్రారంభించాలనుకుంది. ఆ లక్ష్యాన్ని ఒక ఛాలెంజ్ గా తీసుకుని ప్రముఖ బౌద్ధ, సైన్సు రచయిత బొర్రా గోవర్ధన్ గారు తమ పరిశోధనా దృష్టికి పదును పెట్టారు. **2017**, జూన్ సంచిక వరకు తొలి వేదమైన ఋగ్వేదాన్ని పలు కోణాలనుంచి విశ్లేషించి **10** నెలలు ధారావాహికగా పాఠకులకు అందించారు. ఆ తర్వాత యజుర్వేద పరిశీలనకు రెండు నెలల రచనా విరామాన్ని ప్రకటించారు. లోతైన పరిశీలన లేకుండా, ఏదో ఉచ్చిపచ్చిగా రాయటం గోవర్ధన్ గారికి అలవాటు లేని విద్య. అందుకే ఆరు నెలలు శ్రమించి ఈ నెలనుంచి తన యజుర్వేద పరిశీలనా విశేషాలను వరుసగా అందిస్తున్నారు. వాస్తవిక దృష్టితో నీరక్షీరన్యాయాన్ని అనుసరిస్తూ మన ముందుకు వస్తున్న ఈవ్యాస పరంపరను అవలోకిద్దాం.. పదండి. - ఎడిటర్)

"వాజశ్చమే ప్రసవశ్చమే ప్రయతిశ్చమే ప్రసితిశ్చమే
ధీతిశ్చమే క్రతుశ్చమే స్వరశ్చమే శ్లోకశ్చమే
శ్రుతిశ్చమే జ్యోతిశ్చమే స్వశ్చమే యజ్ఞేన కల్పంతాం"

*నాకు అన్నం, విజ్ఞానం, ఐశ్వర్యం, సాధన, రక్షణ, ధారణ, ఏకాగ్రత, ఉత్సాహం, స్వతంత్రత, తేజం, వాణి, అన్ని విద్యలూ, సుఖం, ఇవన్నీ యజ్ఞం వల్ల కలుగుగాక!* (యజుర్వేదం: 18-1)

### అసలు - నకిలీ

ఋగ్వేదకాలం క్రీ.పూ. 1700 నుండి క్రీ.పూ.1000 సంవత్సరాలు. ఆ తర్వాతికాలం యజుర్వేద కాలం. ఇది క్రీ.పూ. 1100 నుండి క్రీ.పూ. 800 సంవత్సరాలు. అంటే దాదాపుగా రెండు లేదా మూడు వందల సంవత్సరాల కాలమే.

ఋగ్వేదకాలం దాదాపు 20 నుండి 25 తరాల ఆర్యుల జీవనవిధానాన్ని మన ముందుంచుతుంది. కాని, యజుర్వేద కాలం పది తరాలలోపు ఆర్యుల జీవనవిధానాన్ని మనకు తెల్పుతుంది. అందుకే వారి జీవన వైవిధ్యం ఋగ్వేదంలో కనిపించినంతగా యజుర్వేదంలో కన్పించదు.



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

నిజానికి ఋగ్వేదం చివరి దశకే ఆర్యులు సింధూ మైదానంలో స్థిరపడ్డారు.

సింధూ ప్రజలతో ఘర్షణలు పడటం, వారి స్థావరాల్ని ఆక్రమించడమే కాదు, వారిలో వారిమధ్య కూడా అంతర్గత యుద్ధాలు జరిగాయి. దాన్ని దాశరాజ్ఞయుద్ధం అంటారు. ఆ యుద్ధంలో పురుగణానికి చెందిన ఒక శాఖవారైన "భరతులు" విజయం సాధించారు. మిగిలిన పురులు, యూదులు, తుర్వశులు, ద్రహ్యులు, అనులు, ఫక్తులు, భలానులు, నిషాణులు, అలకులు, శివులు- ఈ పది ఆర్యగణాలపై భరతగణం విజయం సాధించింది. భరతులకు వశిష్ఠుడు యుద్ధరచన చేశాడు. మన దేశానికి భరతఖండం, భరతవర్షం అనేపేర్లు ఈ భరతగణం వల్ల వచ్చినవే అనేది రాహుల్జీ, మరికొందరి చరిత్రకారుల అభిప్రాయం. ఈనాటికీ, ఫక్తుగణం పేరుతో ఫక్తూనిస్థాన్, భలాను గణం పేరుతో బోలాను కనుమల పేర్లు చారిత్రక సాక్ష్యంగా నిలిచే ఉన్నాయి.

అలా.. ఋగ్వేద అనంతరకాలం నాటికి ఆర్యులు సింధూతీరాన్ని దాటి పంచనదుల (పంజాబ్) ప్రదేశానికి వచ్చి స్థిరపడ్డారు. కడపటికి యమునాతీరాలకి చేరారు.

ఆర్యులకు యజ్ఞయాగాది క్రతువులు నిత్యకృత్యాలు. తాము తినే మాంసాన్ని 'దేవతలకు' అర్పణ చేయకుండా తినరు. ఇది ఋగ్వేదకాలం నాటి నుండి వారు మధ్య ఆసియా ప్రాంతంలో ఉన్నప్పటి నుండీ పాటించే ఆచారమే.

మధ్య ఆశియా ప్రాంతం నుండి ఆర్యులు మొత్తంగా సింధూ మైదానం వైపుకు కదలిరాలేదు. వారిలో కొందరు మాత్రమే ఇటుకేసి వచ్చారు. కొందరు అక్కడే ఉండిపోయారు.

మనం ఇప్పుడు "ఆర్యీకరించబడ్డాం" అని ఎంత చెప్పుకున్నా– ఈ 'దైవసమర్పణ' విధానాన్ని పాటించం. ఉత్తర, దక్షిణ భారతదేశాల్లోని ఆర్యుల్లోగానీ, ఆర్యులుగా చెప్పుకునే హిందూ తెగల్లోగానీ ఈ 'దైవసమర్పణ' ఆచారం అంతగా లేదు. కేవలం పండుగలు, పబ్బాల సమయంలోనే ఈ సమర్పణ కనిపిస్తుంది.

కానీ, ఆహారాన్ని ముఖ్యంగా మాంసాహారాన్ని 'దైవసమర్పణ' చేయకుండా ముక్క ముట్టని ఆర్య అనువంశీకులు ఇంకా ఇప్పటికీ ఎందరో ఉన్నారు. వారే ముస్లింలు. ముస్లిం ప్రజలు ఈనాటికీ దైవసంతర్పణ చేయని మాంసాన్ని తినరు. దీన్ని 'బిస్మిల్లా' అంటారు. నిజానికి ఈనాటి ఇరాన్ , 'ఆర్యన్' అనే పదానికి మారు రూపమే. ఋగ్వేదకాలం నాటి లేదా యజుర్వేద కాలం నాటి గోమాంస భక్షణ, దైవసంతర్పణలు వారిలో అలా ఈనాటికీ మిగిలే ఉన్నాయి.

ఆర్యులు ఆనాడు ఆవు, ఎద్దు మొదలైన పశువుల మాంసాన్ని యజ్ఞంలో సమర్పణల అనంతరమే తినేవారు.

కానీ.. **సింధూతీరానికి వచ్చాక, సింధూప్రజల, స్థానిక భారతీయ మూలనివాసుల సంస్కృతిలో కలసిపోయిన ఆర్యులు ఆ తర్వాత ఇక్కడ వచ్చిన జైన, బౌద్ధ, చార్వాక తాత్విక దృక్పథాలతో ప్రభావితులై తమ సంతర్పణల్ని, గోమాంస భక్షణాల్ని క్రమేపీ మానుకున్నారు.**

వేదకాలం నాటి ఆచారాలు కొన్ని ఇంకా ముస్లింతెగల్లో (ఇరాన్–పారశీక) నిలచి ఉన్నాయి. ఆర్యరక్తం, ఆర్య ఆచారాలు నిలచివున్న 'పవిత్ర' తెగలు ఇప్పటికీ అవే!

ఇక్కడ...వింత,విచిత్రం, తెలివిహీనం, తెంపరితనం, తలతిక్కవాదం ఏమిటంటే...

ఆర్య సంప్రదాయాన్నీ, వైదిక నివేదననీ పాటించే వారిని, తామే ఆర్యులకు వారసులం అని భ్రమించే వారు నిలదీయడం. గోమాంసభక్షకులను నిందించడం.

'అసలుకంటే...నకిలీకి నాజూకు మెండు' అంటే ఇదేమరి!!!

## అందరం - అహం

ఋగ్వేదంలో 'నేను', 'నాకు' అనే పదాలు కన్పించవు. 'మేము', 'మాకు' అనే పదాలే ఉంటాయి.

"ఓ! అగ్నిదేవా! మేము సమర్పించే ఈ తెల్లని ఆవుని స్వీకరించు. మాకు శుభం కలిగించు. మాకు, మా పిల్లలకూ ఆరోగ్యాన్ని ప్రసాదించు...ఇలాంటి 'మేము', 'మాకు' అనే సంబోధనలే ఋగ్వేదంలో కనిపిస్తాయి.

**మా తే రాధాంసి మా త ఊతయో వసో అస్మాన్ కదాచన దభన్ విశ్వా చ న ఉపమిమీహి మానుష చర్షణిభ్య ఆ**

**(ఋగ్వేదం 1–24–20)**

*(ఓ ఇంద్రా! మా జీవనానికి కారణం నీవే! నీవు మాకు ఇచ్చిన అన్నం, రక్షణలే మమ్మల్ని బాధలనుండి కాపాడుతున్నాయి. మేము మంత్ర ద్రష్టలం. మాకు అఖండ ధనాన్ని ఇమ్ము)*

'ఉమ్మడిగా' ఒక పనిని చేయడం, ఆ పని ఫలితాన్ని ఉమ్మడిగా అనుభవించడం అనేది సంచార జాతుల సహజ జీవనవిధానం. గణతంత్ర జాతుల జీవన విధానం కూడా ఇలాంటిదే.

సమాజ నిర్మాణానికి కుటుంబమే ఒక యూనిట్ అయినా, సంచార తెగల్లోగానీ, గణతంత్ర తెగల్లోగానీ సమూహ ప్రయోజనమే ప్రధానంగా ఉంటుంది.

గణతంత్ర సమాజాలు సంచార సమాజాలు కావు. స్థిరనివాస సమాజాలే. అయినా ఆ వ్యవస్థలకు కూడా సమాజమే ప్రమాణమైన కొలబద్ద. ఉమ్మడి కుటుంబాలతో నిర్మించబడ్డ వ్యవస్థ అది–

అలాంటి సమాజాల్లో 'కర్మలు' గానీ, 'కర్మ ఫలాలు' గానీ వ్యక్తిగతంగా ఉండవు. ఉమ్మడిగానే ఉంటాయి. ఈ ఉమ్మడి తత్వం మనకు ఋగ్వేదంలో కనిపిస్తుంది.

కానీ, ఈ ఉమ్మడి తత్వంపోయి 'వ్యక్తిగత' వ్యవహారం, వ్యక్తిగత లాభం, కర్మఫలం వ్యక్తికి చెందాలనే సంకుచిత సామాజిక ధోరణి యజుర్వేదకాలం నాటి ఆర్యుల్లో కన్పిస్తుంది.

దానికి రుజువే.. యజుర్వేదంలోని పద్దెనిమిదో అధ్యాయం. ఈ అధ్యాయంలో యజ్ఞఫలం 'నాకు దక్కాలి' అనే నివేదనల్ని చూస్తాం.

**"ఊర్క్చ మే సూనృతాచ మే పశ్చమే రసశ్చమే**
**ఘృతం చ మే మధుచమే సగ్ధిశ్చమే**
**కృషిశ్చమే వృష్టిశ్చమే జైత్రం చ మే ఔద్భిద్యంచమే**
**యజ్ఞేన కల్పంతాం !"**

**(యజుర్వేదం: 18–9)**

అంటే.. *"యజ్ఞం వల్ల.. నాకు అన్నము కలుగు గాక. నాకు సత్యవాణి కలుగుగాక. నాకు పాలు లభించుగాక. నాకు దధి కలుగుగాక. నాకు మధువు కలుగుగాక. నాకు సహభోజనం, సహపానం కలుగుగాక. నాకు పరిపూర్ణత కలుగుగాక. నాకు ధాన్యవృద్ధి కలుగుగాక. నాకు అక్షయత కలుగుగాక. అన్నం లేని బాధ కలుగకుండును గాక!"*

ఇలాంటి 'వ్యక్తిగత' వ్యవహారాలు ముదిరాయంటే.. గణస్వభావం పోయి 'నియంతృత్వ స్వభావానికి ఆ సమాజం మరలి ఉండాలి. అంటే గణతంత్ర వ్యవస్థల స్థానంలో కేంద్రీకృత (ఏకకేంద్ర)రాజ్యాలుగా ఆర్యగణాలు మారుతూ ఉండాలి.

నిజానికి ఈ 'ఏకీకృతం' వైపు ఆర్యగణవ్యవస్థ ఋగ్వేదకాలం నాటి దాశరాజ్ఞయుద్ధం తోనే మొదలైంది. సర్వగణాధిపత్యం వహించడమే ఏకీకృతం. రాచరికం. గణసమాజాల్లోని వికేంద్రీకరణశక్తి, క్రమేపి ఏకకేంద్రక శక్తిగా రూపుమార్చుకుంది. అది ఋగ్వేదం చివరిదశలోనే మొదలై, యజుర్వేద కాలానికి ముదిరిపోయింది.

ఈ మార్పులు యజ్ఞనిర్వహణలో కూడా కనిపిస్తాయి. గణం మొత్తం యజ్ఞాధిపత్యాన్నివహించే స్థితి మారి, ధనవంతులు, రాజులు, వ్యాపారులు కూడా వ్యక్తిగతంగా యజ్ఞయాగాల్ని చేయించే విధానం యజుర్వేదంలో కనిపిస్తుంది. (ఇది ఇప్పటికీ ఉంది. గ్రామదేవతల కొలుపులు రెండు రకాలుగా జరుగుతాయి. ఊరుమ్మడిగానూ, వ్యక్తులుగానూ ఈ జాతర్లు చేస్తారు. అలాగే యజ్ఞాలు కూడా. సామూహిక యజ్ఞాలు, గృహయజ్ఞాలు.)

అంటే.. ఒకప్పుడు సింధూ ప్రజల్లో ఉన్న ధనిక పేద వ్యత్యాసాలు యజుర్వేదకాలానికి ఆర్యుల్లో కూడా కనిపిస్తాయి. ఋగ్వేద ఆర్యుల్లో ధనిక పేద వ్యత్యాసాలు కనిపించవు. వీరిలో ఈ సామాజిక మార్పుకూ స్థిరజీవనమే ప్రధానకారణం.

## భావజాల విజయం

ఆర్యులు భారతదేశాన్నంతా ఒకేసారి జయించలేదు. వారు సింధూప్రాంతాన్ని ఆక్రమించడానికే వెయ్యేళ్ళు పట్టింది. ఏదో హాలివుడ్ సినిమాలో కంప్యూటర్ గ్రాఫిక్ యుద్ధంలా ఒకేసారి దండెత్తి వచ్చి సింధూనగరాల్ని ధ్వంసం చేయలేదు. వారూ ఇక్కడికి వచ్చి వ్యవసాయంలోకి మళ్ళాకే ఈ ఆక్రమణలు జరిగాయి. కేవలం పశువుల మందల 'మేత' కోసం సింధూ పంటభూముల్ని, నగరాల్ని ధ్వంసం చేసారనుకోవడం అంత నిజం కాదు. వ్యవసాయం, వ్యాపారం, స్థిరనివాసాల వల్ల పోగుపడుతున్న సంపదల రుచి చూసాకే వారు దురాక్రమణలు పెంచారు. ఇలా వ్యవసాయ ఉత్పత్తిని పెంచుకోవటం కోసం, వ్యవసాయక్షేత్రాల్ని ఆక్రమించేందుకే సింధూప్రాంతాన్ని ఆక్రమించారు. అందుకోసమే యమునాతీరంవైపు కదిలారు– గంగాతీరాన్ని హస్తగతం చేసుకున్నారు.

వారు ఉత్తరభారతదేశాన్ని వదిలి దక్షిణాపథం వైపుకు రాలేదు. వేదకాలం అనంతరం పురాణకాలం నాటికి అడపాదడపా ఇటుకేసి తొంగిచూశారు. అంతే! వారు దక్షిణాపథాన్ని జయించింది వారి భావజాలంతోనే!

**రాజకీయంగా ఏకకేంద్ర రాచరికంతో, కర్మకాండలుగా వైదిక కర్మకాండలతో, తాత్త్వికంగా ఉపనిషత్తుల తత్త్వంతో, సాంఘికంగా మనువాదంతో ఇలా... భావజాలపరంగా మొత్తం భారతదేశాన్ని జయించారు. వారి భావజాలమే మొత్తం దేశాన్ని బందీ చేసింది తప్ప కత్తిపట్టి జయించింది కాదు.**

ఆ తర్వాత ఆర్యుల భావజాలానికి భిన్నమైన భావజాలంగా దానికి ప్రత్యామ్నాయ భావజాలంగా, మూలవాసుల భావజాలంగా వచ్చింది బౌద్ధం మాత్రమే!–

ఆర్యుల భావజాలంలో అతిప్రధానమైన బలహీనత– 'నైతికత'. వేదాల్లో 'నైతిక' నిబంధనలు, నియమావళి కనిపించవు. **ఋగ్వేద, యజుర్వేదాలలో మానవీయత, నైతికత అనేవి మైక్రోస్కోప్ వేసి వెదికినా కన్పించవు. అందుకే ఆర్య సంస్కృతిని 'ఆటవిక సంస్కృతిగా' చెప్పుకునేది.**

అయితే మారిన ఆర్యజీవన విధానంతో ఏకకేంద్ర రాజ్యాలు, రాజులూ, చక్రవర్తుల ప్రాధాన్యత పెరిగింది. అందుకే ఆ తర్వాతి ఆర్య సాహిత్యం పురాణాల రూపు తీసుకుంది. వీటికి ఆరణ్యకాలు దారి చూపించాయి. ఆ సాహిత్యం నుండి పురాణ పురుషులు పుట్టుకొచ్చారు. ఏకకేంద్ర నియంత్రత్వరాజ్యాల్ని పటిష్టం చేయడంకోసమే ఆర్యసాహిత్యం నిలబడింది. అది స్మృతులుగా రూపమెత్తి, మనుధర్మశాస్త్రంగా శాసనం అయ్యింది.

ఇదంతా చారిత్రక పరిణామం. వేదాలు చారిత్రక పరిణామంలో ఎలా మారాయి, వైదిక సంస్కృతి ఎలా మారింది అనేది ఇక్కడ చర్చనీయాంశం కాదు. కానీ, పాఠకునికి ఒక చారిత్రక భూమిక అవసరం అనుకొని ఈ కొద్దిపాటి చర్చ కొనసాగింది.

ఇక అసలు విషయానికొస్తే...

ఋగ్వేదంలో దేవతల ఆరాధన ఉంటుంది. యజుర్వేదంలో యజ్ఞనిర్వహణ, దాని విధివిధానాలు ఉంటాయి. పశువధ చాలా భారీ ఎత్తున కన్పిస్తుంది.

యజుర్వేదం రెండుశాఖలుగా ఉంది.

ఒకటి: కృష్ణ యజుర్వేదం,

రెండు: శుక్ల యజుర్వేదం

ఋగ్వేదంలోని శ్లోకాల్ని 'రుక్కులు' అన్నట్లే యజుర్వేదంలోని మంత్రాల్ని 'యజుస్సులు' అంటారు. 'యజ్'

అంటే 'దైవపూజ' అని అర్థం. దేవతలకి 'హవిస్సులు' సమర్పించేప్పుడు చెప్పే మాటలే మంత్రాలు. హెూత, ఉద్గాత, ఆధ్వర్యుడు... ఇలాంటి యజ్ఞకర్తల్లో ఒకరైన ఆధ్వర్యుడు పలికేవి మంత్రాలు కాబట్టి యజుర్వేదాన్ని 'ఆధ్వర్యం' అని కూడా అంటారు. వేదభాష్యకారులైన యాస్కుడు (క్రీ.పూ 800), సాయనుడు(క్రీ.శ.1500)కూడా యజుర్వేదాన్ని ఆధ్వర్యం అనే అన్నారు.

శుక్ల యజుర్వేదం ఉత్తరాది వారు పాటిస్తారు. వారు తెల్లగా ఉంటారు కాబట్టి అలా పిలిచి ఉంటారు. కృష్ణయజుర్వేదాన్ని దక్షిణాది వారు పాటిస్తారు. దక్షిణాది వారు నల్లనివారు కాబట్టి అలా పిలిచి ఉండొచ్చు.

ఆర్య 'వర్ణ వివక్షతకి' యజుర్వేదవిభజన ఒక చారిత్రక ఆధారం.

ఋగ్వేదం ఒక స్తుతి గ్రంథం. యజుర్వేదం యజ్ఞనిర్వహణ విధివిధానం. అంటే ఒక కార్యాచరణ. కార్యరూపందాల్చే ఏ విధానమైనా ప్రాంతాలు,ప్రజలస్థితిగతుల్ని బట్టి ఉంటుంది. మారుతుంది. అందుకే యజ్ఞం నిర్వహించే విధివిధానాల్లో మార్పులు పొడచూపాయి. ఆ మార్పుల ఫలితమే యజుర్వేదం రెండుగా చీలడం.

నిజానికి శుక్లయజుర్వేదం లోని 700 మంత్రాలు ఋగ్వేదంలోనివే. దానిలోని విషయం కృష్ణ యజుర్వేదంలోనిదే! అయితే, శుక్లయజుర్వేదం విద్య సాంస్కృతిక వికాసానికి ప్రాధాన్యత నిచ్చింది. ఈ ప్రాధాన్యత ఆ తర్వాతి ఉపనిషత్తుల మార్గానికి దారి చూపించింది.

మనం చారిత్రకంగా చెప్పుకోవాలంటే.. **ఆర్యుల సాంస్కృతిక భావజాలదాడి దక్షిణాదిమీద కృష్ణయజుర్వేదంతో మొదలైంది. ఆర్యుల 'ఎంగిలిని దక్షిణాది వారు ఇలా స్వీకరించారు' అని చెప్పడానికి ఆధారం వేదసంప్రదాయంలోనే ఉంది.**

2012, ఏప్రిల్ లో భద్రాచలం దగ్గరి ఎటపాకలో నిర్వహించిన అతిరాత్రయాగం కృష్ణయజుర్వేదీయ శాఖకు చెందింది. అసలు ఈ రోజుల్లో యాగాలనిర్వహణ సరైనదికాదని నాస్తిక, హేతువాదులు నిరసిస్తే, నిలదీస్తే....అసలు ఇది సరైనయాగం కాదని ఉత్తరాది శుక్లయజుర్వేదీయులు నిందించారు.

బ్రహ్మ నాలుగు వేదాల్ని వేదవ్యాసుడికి చెప్పాడట! ఋగ్వేదాన్ని పైలునికి, యజుర్వేదాన్ని వైశంపాయునికి, సామవేదాన్ని జైమినికి, అథర్వణ వేదాన్ని సుమంతునికి చెప్పాడు!

వైశంపాయనుడు తనకు తెలిసిన యజుర్వేదాన్ని తన దగ్గరున్న శిష్యులందరికీ కాకుండా యాజ్ఞవల్క్యుడు ఒక్కనికే చెప్పాడు. ఆ తర్వాత గురు, శిష్యులకు 'ఎవరు గొప్ప?' అనే విషయంలో స్పర్థరేగింది. నా దగ్గర నేర్చింది 'కక్కేయి' అన్నాడు. అంటే 'నాది నాకు కక్కు' అన్నాడు. యాజ్ఞవల్క్యుడు కక్కేశాడు. అప్పుడు వైశంపాయనుడు మిగిలిన శిష్యులతో– తిత్తిరి (టిట్టిభ) పక్షులుగా మారి ఆ కక్కింది తినమన్నాడు. వారు తిన్నారు. మకిలిని (నల్లని దాన్ని) తిన్నారు కాబట్టి అవి కృష్ణయజుస్సులు (నల్లని మంత్రాలు) అయ్యాయి. దాన్నే కృష్ణయజుర్వేదం అంటారు. తిత్తిరి పక్షులు తిన్నాయి కాబట్టి ఈ మంత్రాలని 'కృష్ణయజుర్వేద తైత్తిరీయ సంహిత' అని అంటారు.

మరలా యాజ్ఞవల్క్యుడు విష్ణువు నుండి బ్రహ్మకు, బ్రహ్మ నుండి ఆదిత్యునికి పరంపరగా అందిన యజుస్సులను (మంత్రాలను) ఆదిత్యుని నుండి గ్రహించాడు. అదే శుక్లయజుర్వేదం. తెల్లని, శుద్ధి అయిన యజుస్సులున్న వేదం. యాజ్ఞవల్క్యుడు వాజసనుడు అనేవాని కొడుకు, కాబట్టి శుక్లయజుర్వేదాన్ని 'వాజసనేయం' అంటారు. ఆ తర్వాత ఇది మాధ్యందిన అనే రుషికి అందింది. కాబట్టి దీన్ని 'వాజసనేయ మాధ్యందిన శుక్లయజుర్వేద సంహిత' అంటారు.

శుక్లయజుర్వేదం గద్య, పద్యాల సంకలనం. ఎందుకంటే... ఇది ఋగ్వేదం, కృష్ణయజుర్వేదం నుండి గ్రహించబడినది కాబట్టి.

**కృష్ణ యజుర్వేదం గద్య సంకలనం. తొలి గద్యరచన.**

వేదవ్యాసుని వంశావళి వశిష్ఠునితో మొదలవుతుంది. వశిష్ఠుని కొడుకు శక్తి, శక్తి కొడుకు పరాశరుడు, పరాశరుని కొడుకు వ్యాసుడు–ఈ వరుసక్రమాన్ని బట్టి చూస్తే వశిష్ఠుడు మూలపురుషుడు. ఆనాడు ఋగ్వేదకాలంలో దాశరాజ్ఞ యుద్ధాన్ని గెలిపించిన వ్యూహకర్త, ఆనాటి మంత్రవేత్త వశిష్ఠుడే. భరతగణ రాజ పురోహితుడు, గురువు. అందుకే వశిష్ఠునికి ఈ గౌరవం ఆర్య సాహిత్యం అంతటా కనిపిస్తుంది.

యజ్ఞాల నిర్వహణలో పశువధతో పాటు ఎంతో కలప నాశనం అయ్యేది. ముఖ్యంగా యజ్ఞంలో వాడాల్సిన కలప 'రావి' కలప. ఆ తర్వాత మోదుగు. యజ్ఞాల కోసం భారీఎత్తున రావిచెట్ల విధ్వంసం జరిగింది. అందుకే బుద్ధుడు వైదిక క్రతువులకు ప్రత్యామ్నాయంగా రావిచెట్టును బోధివృక్షంగా ప్రకటించి, రావి చెట్లను యజ్ఞాలకు ఆహుతి కాకుండా కాపాడాడు.

అటు జంతుకోటి మెడలు, ఇటు వృక్షజాతి మొదళ్ళు నరికి, నేలరాల్చి,నేలకూల్చి పర్యావరణానికి పెనుముప్పు కలిగించే యాగాల విధివిధానాలకు ఆలవాలమైన యజుర్వేదంలో వైజ్ఞానిక అంశాలు ఏమైనా ఉంటాయా? ఉన్నాయా?... చూద్దాం!

**(ఇంకావుంది)**

వేదాలు - విజ్ఞానం : 12

# ఋతువులకు రక్తతర్పణ

**ధూమ్రాన్ వసంతాయాలభతే శ్వేతాన్ గ్రీష్మాయ కృష్ణాన్ వర్షాభ్యో**
**అరుణాంచరదే పృషతో హేమంతాయ పిశంగాంచి శిరాయ**

ధూమ్ర వర్ణంగల 3 మేకల్ని వసంత రుతువుకి, 3 తెల్లని మేకల్ని గ్రీష్మరుతువుకి, నలుపు మేకలు మూడింటిని వర్షరుతువుకి, ఎరుపు మేకలు మూడింటిని శరదృతువుకి, మచ్చలున్న మూడు మేకల్ని హేమంతానికి, 3 పసుపు రంగు మేకల్ని శిశిరానికీబలిస్తాను' -(శుక్ల యజుర్వేదం: 24-11)

**యజుర్వేదకాల ప్రజలు ఋగ్వేదం కన్నా కాలగణనలో పురోగతి సాధించారు. ఆ కాలగణను నిశితంగా పరిశీలిస్తే వారు ఏ ప్రాంతం నుండి ఏ ప్రాంతానికి వలస వెళ్ళారో, ఎక్కడ స్థిరపడ్డారో తేల్చవచ్చు. అలాగే సంచారజీవనం నుండి స్థిరజీవనానికి ఎలా మారారో అంచనా వేయవచ్చు. కానీ వారి జ్ఞానాన్నంతా యజ్ఞయాగాలకి ముడివేయడం వలన విపరీత వ్యాఖ్యానాలకు గురికాబడ్డారు.**

పశుపాలకులైన సంచార జాతులకు కాలగణనంలో ఖచ్చితత్వం అంతగా అవసరం ఉండదు. వారి ఉత్పత్తులు ప్రధానంగా పశువులే. పశువుల వృద్ధికి మేత, నీటి వసతి అతిముఖ్యం. ఇక వాటి పునరుత్పత్తికి ఆయా జంతువులు 'ఎదకొచ్చే' కాలాలు ఆయా జంతువులవే! బాహ్యప్రకృతి, వాతావరణంలో అంతగా పనిలేదు.




బొర్రా గోవర్ధన్
సెల్:9390600157


కానీ వ్యవసాయం వేరు. వ్యవసాయానికి వాతావరణ పరిజ్ఞానం చాలా అవసరం. కాబట్టి కాలాలూ, రుతువులు, మాసాల లెక్కలు తెలియాలి. అంతేకాదు స్థిర నివాసులైన వ్యవసాయదారుల నాగరకతా వేగం కూడా ఎక్కువే. దానితో వృత్తులు, ఉత్పత్తులు వేగంగా పెరగాలి. మనిషి జీవితంలో చేయాల్సిన పనులూ పెరగాలి. వీటన్నింటినీ సమన్వయం చేసుకోవాలంటే.. కాలగణన (కేలండర్) చాలా ముఖ్యం.

తిథి (తేది), నక్షత్రం, మాసం, రుతువులు, సంవత్సరాల పరిజ్ఞానం పెంపొందితేనే నాగరకతా వికాసం సాధ్యం. యజుర్వేదకాలం నాటికి కేలండర్ పరిజ్ఞానం ఆర్యులకి బాగా అబ్బింది. దానికి కారణం.. వారు ఋగ్వేదానంతరకాలంలో స్థానిక ప్రజలతో బాగానే సంకరం చెందారు. సింధూప్రజల 'కాల'పరిజ్ఞానాన్ని వారూ తెలుసుకుని, నేర్చుకున్నారు. అవును ఎందుకంటే... ఆర్యులకంటే ముందే ఇక్కడ మూలవాసులు వ్యవసాయజీవనం సాగిస్తున్నారు. కాబట్టి ఆర్యులకు కేలండర్ పరిజ్ఞానం స్థానిక ప్రజల్నుండి లభించిందే! అయితే, తమ వ్యవసాయక అభివృద్ధితోపాటు వారు కేలండర్‌నూ అభివృద్ధి పరిచారు. అది యజుర్వేదంలో స్పష్టంగా కనిపిస్తుంది.

మన జీవనానికీ ప్రకృతికీ విడదీయలేని బంధం ఉంది. అసలు "పగలు రాత్రి" తోనే మన మనుగడ నడుస్తూ ఉంటుంది. చీకటి పడగానే విశ్రమించడం అనేది కేవలం మానవుల ప్రత్యేకతేం కాదు. ఎన్నో జీవరాశులు రాత్రికాగానే దైనందిన జీవనయానానికి విశ్రాంతినిచ్చి, నిద్రలోకి జారి, సేద తీర్చుకుంటాయి. అలాగే... చీకటి పడగానే నిద్రలేచి జీవనక్రియల్ని ప్రారంభించే జీవులూ కొన్ని ఉన్నాయి. అవి రాత్రంతా ఆహారసంపాదన కోసం శ్రమించి, సూర్యోదయం కాగానే విశ్రాంతిలోకి వెళ్ళిపోతాయి. అలాగే.. పగలూ, రాత్రీ వ్యత్యాసం లేకుండా అవిశ్రాంతంగా ఆహారాన్వేషణ జరిపే జీవులూ వున్నాయి-

అయితే, మనం పగలు శ్రమించి, రాత్రికి విశ్రమించే జీవజాతికి చెందిన జీవులం. దివాచరులం.

నిజానికి ఈ పగలు, రాత్రి భాగాల్ని విభాగించుకొని జీవించడం కూడా అభివృద్ధికర జీవపరిణామంలో భాగమే!- పరిణామక్రమంలో నిశాచరుల తర్వాతే దివాచరులు ఉద్భవించాయి. ఈ దివాచర జీవులకి వెలుగునిచ్చే సూర్యుడే మొదటిదిక్కు. దిక్కు అంటే ఆధారం.

కాబట్టి మానవజాతి తొలి పరిశోధన, పరిశీలన ఈ సూర్యుణ్ణి గురించి తెలుసుకోవడంతోనే మొదలైంది. వారు సూర్యునిమీద దృష్టి మళ్ళించాక సూర్యుడి వెలుగులో కూడా కనిపించీ కనిపించనంతగా మార్పులు ఉన్నాయని గమనించారు. ఉదయ, సాయంకాలాలు చల్లదనం, మధ్యాహ్నం మండే ఎండ ఇది రోజూ చూసేదే. కానీ.. ఏడాదిలో కొన్నిరోజులు ఎండవేడి అధికం. కొన్నిరోజులు అధిక శీతలం. కొంతకాలం పగటికాలం ఎక్కువ, కొంతకాలం పగటికాలం తక్కువ. పగటికాలం ఎక్కువగా ఉన్నప్పుడు సూర్యుడు భూమికి ఉత్తరభాగంలో ఉదయిస్తున్నాడు. రాత్రిభాగం

ఎక్కువైనప్పుడు దక్షిణభాగంలో ఉదయిస్తున్నాడు. ఇవే ఉత్తరాయణం, దక్షిణాయనం. ఈ మధ్యరోజుల్లో రెండురోజులు పగలూ రాత్రిళ్ళు సమానంగా ఉంటున్నాయి. ఇవి విషవత్తులు–ఇలా మారేప్పుడు సూర్యునితోపాటు చెట్లూ మారిపోతాయి. కొన్ని పూలు పూస్తాయి. కొన్ని ఆకులు రాలుస్తాయి. కొన్ని పండ్లతో నిండుగా ఉంటాయి. కొన్ని చిగురులు తొడుగుతాయి. కొంతకాలం వానలు, కొంతకాలం గాడ్పులు, కొంతకాలం మంచుదుప్పటి... ఈ మార్పులన్నీ సూర్యున్ని గమనిస్తూ భూమిమీద వారు గమనించిన మార్పులు.

ఈ మార్పులకి దేవుళ్ళు, దయ్యాలు కారణమని కొందరు ఎంచినా, 'సూర్యుడే' కారణమని ఎంచినవారు ప్రపంచంలో అన్నిచోట్లా ఉన్నారు. మనకూ ఉన్నారు. వారిలో చరిత్రకు అందినంత వరకూ, మొదటివారు సింధూప్రజలు. తర్వాత ఋగ్వేద ఆర్యులు. ఆ తర్వాత యజుర్వేదకాలం నాటి ప్రజలు.

ఋగ్వేద ఆర్యులు తిథుల్ని, నెలల్ని, ఋతువుల్ని, కాలాల్ని, ఆయనాల్ని, సంవత్సరాన్ని గుర్తించినట్లు గతంలో తెలుసుకున్నాం. అయితే వారి కాలంలో నివసించిన ఈజిప్ట, జర్మనీ, పెరూ దేశప్రజలు వారికంటే కాలగణనంలో మరింత మెరుగైన స్థితిలో ఉన్నారని కూడా తెలుసుకున్నాం.

అయితే, ఋగ్వేదంలో 12 నెలల పేర్లు, 30 తిథుల పేర్లు లేవు. ఋగ్వేదం (10–85–13)లో మఖ, పుబ్బ, ఉత్తర అనే మూడు నక్షత్రాల పేర్లే ఉన్నాయి.

అయితే, కాలగణన యజుర్వేద కాలం నాటికి బాగా మెరుగుపడింది. వాటి వివరాలు చూద్దాం!

## తిథులు – నక్షత్రాలు

తిథి అంటే తేదీ. ప్రతిరోజునూ ఏదో ఒక పేరుతో గుర్తించడం. ప్రతిరోజునూ సూర్యునిలో వచ్చే మార్పుని బట్టి గుర్తించడం చాలాకష్టం. ఈ మార్పుని రాత్రిరాజైన చంద్రునితో గుర్తించడం తేలిక. ఎందుకంటే చంద్రుడు రోజూ ఒకే ఆకారంలో ఉండడు. ఒకే ప్రాంతంలో కనిపించడు. తన ఆకారాన్ని మార్చుకుంటూ, తను రోజూ కనిపించే ప్రదేశాన్ని మార్చుకుంటూ ఉంటాడు. కాబట్టి చంద్రుని స్థితిగతుల్ని బట్టి కాలాన్ని కొలవడం తేలిక అయ్యింది.

చంద్రుని పెరిగే తరిగే ఆకారాన్ని తీసుకుని గమనిస్తే 30 రోజుల క్రమం తెలుస్తుంది. ఈ మార్పుల్నే చంద్రకళలు అంటారు.

చంద్రునిలోని ఈ మార్పులు ఇలా తిరిగితిరిగి జరుగుతూనే ఉంటాయి. కాబట్టి ఈ 30 రోజుల్ని పెరిగి తరిగే విషయాన్ని తీసుకుని రెండుభాగాలు(పక్షాలు)గా చేసి పెరిగే దశకు శుక్లపక్షం అనీ, తరిగేదశకు కృష్ణపక్షం అని పేరుపెట్టారు.

శుక్ల అంటే తెలుపు, కృష్ణ అంటే నలుపు. ఆ మార్పుల్ని గమనిస్తున్నప్పుడు చంద్రునితో కలసి ఆకాశంలో కన్పించే వివిధ నక్షత్రాల్ని గమనిస్తే... ఈ మార్పులు ఎప్పుడూ.. 27 నక్షత్రాల సమీపంలోనే జరుగుతూ ఉంటాయి. ఎప్పుడు చూసినా చంద్రుడు ఈ 27 నక్షత్రాల సమీపంలోనే ఉంటాడు. ఇంకా ఇంకా పరిశీలిస్తే ఈ 27లో కూడా పున్నమిరోజుల్లో కేవలం 12 నక్షత్రాల సమీపంలోనే ఉంటాడు. మరలా 12 పున్నముల తర్వాత తిరిగి ఈ క్రమం అలాగే నడుస్తుంది.

కాబట్టి... ఈ చంద్రకళలకీ, నక్షత్రాలకీ కలిపి అసలు చంద్రుని ఈ కళలకు కారణం ఏమిటో చెప్పిన రెండు కథలు యజుర్వేదంలో ఉన్నాయి.

## తిథుల కథలు

**ప్రజాపతే స్త్రయస్త్రిగ్ంశర్దుహితర ఆసన్నా సోమాయ రాజ్ఞే2దదాత్తసాగ్ం రోహిణి ముపైత్తా ఈర్ష్యన్తీ**

**... (కృ.యజు: 2–3–5)**

"ప్రజాపతికి ముప్పైముగ్గురు కూతుళ్ళు. ఆయన వారందరినీ రాజు అయిన సోమునికి ఇచ్చాడు. సోముడు రోహిణి దగ్గరే ఉంటున్నాడు. మిగిలినవారు ప్రజాపతి దగ్గరకు తిరిగి వెళ్ళారు. అతను సోముని దగ్గరకు వెళ్ళి 'అందర్నీ సమానంగా చూస్తాను' అని శపథం చేయమన్నాడు. సోముడు అలాగే చేశాడు. కానీ తన శపథం తప్పి, మరలా రోహిణితోనే గడప సాగాడు. శపథం తప్పాడు కాబట్టి సోమునికి 'యక్ష్మ'రోగం పట్టుకుంది."

యక్ష్మ అంటే క్షయరోగం. ఆ తర్వాత వారిని పిలిచి 'సమానంగా చూస్తాను' అని చెప్పాడు. అప్పుడు వారు సోముని కోసం ఆదిత్య దేవతాకమగు 'చరు'ని నిర్వపం చేశారు. అతని రోగం తగ్గింది.

ప్రజాపతి పుత్రికలే నక్షత్రాలు. ఈ కథలో 33 నక్షత్రాలని ఉంది. వేదకాలానికి 11, 33 అనే సంఖ్యలకు ఒక ప్రాధాన్యత ఉంది. ఆ అలవాటుగా ప్రజాపతికి 33 మంది కుమార్తెలు అని చెప్పారు. ఆ తర్వాత ఈ సంఖ్య 27కు సవరించబడింది.

పురాణకాలానికి ప్రజాపతి 'దక్షుడు'గా మారాడు. ఆయనకు 28మంది కుమార్తెలు. పెద్దామె శివుణ్ణి పెండ్లాడి పుట్టింటి నుండి వెళ్లిపోయింది. మిగిలిన 27 గురిని దక్షుడు చంద్రునికిచ్చి పెళ్ళి చేస్తాడు. చంద్రుడు రోహిణితోనే కాలం గడుపుతూ మిగిలినవారిని నిర్లక్ష్యం చేస్తాడు. కూతుళ్ళు పోయి తండ్రితో మొరపెట్టుకుంటే దక్షుడు వచ్చి చంద్రుణ్ణి 'క్షయగ్రస్తునివి' కమ్మని శపిస్తాడు. భర్త క్షీణత చూసి, భరించలేని కూతుళ్ళు మరలా తండ్రికి శాపవిమోచన కలిగించమని

వేడుకుంటారు. తన శాపతీక్షణతని సగానికి తగ్గిస్తాడు. అలా 15 రోజులు క్షీణిస్తూ, 15 రోజులు వృద్ధి అగుతూ కాలం వెళ్ళదీస్తాడు చంద్రుడు. ఈ కథ వేదంలోని కథకు మార్పులతో కూర్చిందే! ఐతే–

కృష్ణయజుర్వేదంలోనే 2–5–6 లో వేరేవిధంగా ఉంది.

"చంద్రుడు రాజు. కృష్ణపక్షంలోని, శుక్లపక్షంలోని రాత్రులన్నీ భార్యలు. చంద్రుడు పూర్ణిమ, అమావాస్య అనే భార్యల్ని కూడలేదు. వారు తమని కూడమని వత్తిడి చేయగా తన శపథాన్ని మరచి వారితో కూడాడు. దానితో శపథం విస్మరించడం వల్ల క్షయరోగం కలిగింది"

చంద్రుడు అమావాస్య, పూర్ణిమల దగ్గరకు వెళ్ళి వాళ్ళకు నమస్కరించగా, వారు–

"మేము ఇద్దరం మాత్రమే దేవతల హవిస్సులు వహిస్తాం. మమ్మల్ని ఆశ్రయించే దేవతాయాగాలు జరగాలి. అలా జరుగునని మాకు వరం ఇమ్ము" అని అడిగాయి. చంద్రుడు వరం ఇచ్చాడు. రోగం వదలించుకున్నాడు. అప్పటి నుండి యాగాలు అమావాస్య, పూర్ణిమ రోజుల్లోనే జరిగే ఆచారం వచ్చింది.




ఇదీ ఆ కథ. ఈ కథలో పుత్రికలైన నక్షత్రాలు లేవు. రెండూ తిథులే ఉన్నాయి–

అమావాస్య, పున్నమి రోజులనేవి చంద్రకళల్లో విశేషమైనవి. ఎందుకంటే మిగిలిన తిథులైన పాడ్యమి, విదియ, తదియ, చతుర్దశి, పంచమి, షష్ఠి, సప్తమి, అష్టమి, నవమి, దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి– ఈ 14 తిథులు ఉభయపక్షాల్లో ఉంటాయి. శుక్ల పాఢ్యమినాటి నెలవంక సైజులోనే కృష్ణచతుర్ధశి నాటి నెలవంక ఉంటుంది. పరిమాణం ఒకటే.. ప్రదేశం, సమయాలే వేరువేరు. అలాగే మిగిలినవీ. కానీ... అమావాస్య, పున్నములు రెండూ, రెండు వేర్వేరు రూపాలు. అందుకే ఆ రెండూ వేర్వేరు ప్రత్యేక తిథులుగా గుర్తింపు పొందాయి.

ఇక్కడ మరో విషయం ఉంది. దీనిమీద విశేష వివరణ లేదుగానీ–

**నవోనవోభవతి జాయమానో2హ్నాం కేతురుష సామేత్యగ్రే భాగం దేవేభ్యో విదధాత్యాయన్న్ చన్ద్రమాస్థిరతి దీర్ఘమాయ్ణు యం ఆదిత్యా ఆగేంశు మాప్యాయన్తి యమక్షిత మక్షితయ్ణు పిచన్తి!**

**(కృ.యజు: 2–4–14)**

(ఆదిత్యుడు చంద్రుని వృద్ధిక్షయలకు (పక్షాలకు) కారకుడు" . "ఆదిత్యుడు చంద్రునికి రోజుకు ఒక కళను వృద్ధి చేస్తున్నాడు. రోజుకు ఒక కళను క్షీణింప చేస్తున్నాడు)

చంద్రుని కాంతికి ఆదిత్యుడు (సూర్యుడు) కారణం అని చెప్పడం లేదు గానీ, యాగంవల్ల వృద్ధిక్షయలకు ఆదిత్యుడు కారకుడు అని చెప్పడం కూడా తీసేయాల్సిందికాదు. తోసేయాల్సింది కూడా కాదు.

ఇక, ఈ కళలలో కొన్నిటికి ప్రత్యేక పేర్లు ఉన్నాయి–

**ద్రుక్కామశ్ఛందాగ్ంసి ............ సినీవాల్యనుష్టుప్కుహూర్ధాతా వషట్కార్ణ పూర్వపక్షో రాకా అపరపక్ష కుహూరమావాస్యా సినీవాలీ పౌర్ణమాస్యను మతిశ్చంద్రమా ధాత్మాష్టా!**

**(కృ.యజు: 3–4–9)**

పున్నమినాటి చంద్రుని పేరు– రాకాదేవి.

అమావాస్య నాటి చంద్రునిపేరు – కుహూదేవి

కృష్ణచతుర్దశి పేరు సినీవాలీ అంటే కృష్ణచతుర్దశి, అమావాస్య రెండు తిథులూ కలిసి వచ్చేరోజు.

శుక్ల చతుర్దశిని – అనుమతి దేవి అంటారు. అంటే శుక్ల చతుర్దశి, పున్నమి కలిపి ఒకేరోజున వచ్చే తిథులు.

అలాగే.. మాఘమాసంలో వచ్చే కృష్ణ అష్టమిని 'ఏకాష్టకా' అంటారు – **(కృ.యజుర్వేదం: 4–3–11–6)**

ఈ కళలు లేదా తిథుల గుర్తింపులో ఖచ్చితమైన ఎంపిక యజుర్వేదకాలంలో ఉంది.

## ఉభయ మానాల ఒప్పులకుప్ప

కానీ... తిథుల్నే నమ్ముకుంటే వచ్చే ఒక తిప్ప వుంది. ఈ తిథుల కాలపరిమాణం ఖచ్చితం కాదు. ఎందుకంటే ఆకాశంలో ఈ 27 నక్షత్రాలూ ఖచ్చితమైన సమాన దూరాలలో లేవు. కాబట్టి కొన్ని పొడవుతిథులు, కొన్ని పొట్టితిథులు వుంటాయి.

కానీ, సూర్యోదయం నుండి తిరిగి సూర్యోదయం వరకూ సమయంలో పెద్ద వ్యత్యాసం ఉండదు.

వచ్చిన చిక్కు ఎక్కడంటే...

సూర్యుణ్ణి బట్టి రోజు కొలత దాదాపు నిక్కచ్చిగా ఉంటుంది. కానీ, సూర్యునిలోని మార్పుల్ని బట్టి రోజుల్ని లెక్కించడం చాలా చాలా కష్టం. చంద్రునిలో కళల సమయాలు అంత ఖచ్చితత్వంగా ఉండవు. కానీ, చంద్రకళల్ని బట్టి రోజుని గుర్తించడం చాలా చాలా తేలిక.

అందుకే... ఈ రెండు కాలగణనల్ని (సౌర, చాంద్ర మానాల్ని) కలిపి లెక్కించుకోవాల్సి వచ్చింది. అంటే..తేలికగా లెక్కించ గలిగే నిర్ధిష్టత లేని చాంద్రమానంతో, తేలికగా గమనించలేని నిర్దిష్టత గల సౌరమానంతో కలిపి యజుర్వేద ఆర్యులు ఒప్పులకుప్ప ఆడించవలసి వచ్చింది. దానివల్ల చంద్రమానాల్లో సవరణలు వచ్చాయి.

ఈ సవరణలు యజుర్వేదంలో చాలా స్పష్టంగానే ఉన్నాయి. ఇది చూడండి-

**మధుశ్చ మాధవశ్చ శుక్రశ్చ నభశ్చ నభస్యశ్చేషశ్చోరజశ్చ సహశ్చ సహస్యశ్చ తపశ్చ తపస్యశ్చో పయామగృహీతో2సి సగ్ం సర్పో2స్యగ్ం హస్పత్యాలకు త్వా -(కృష్ణయజుర్వేదం: 1-4-14)**

"సోమమా! నీవు చైత్రానివి, వైశాఖానివి, జ్యేష్ఠానివి, ఆషాఢానివి, శ్రావణానివి, భాద్రపదానివి, ఆశ్వయిజానివి, కార్తీకానివి, మార్గశీర్షానివి, పుష్యానివి, మాఘానివి, ఫాల్గుణానివి, అధిక మాసానివి, లుప్తమాసానివి"

ఇందులో 12 నెలలపేర్లు ఉన్నాయి. అది ఒక విశేషం. అది అటుంచితే, ఇందులో ఉన్న అధిక, లుప్తమాసాల విషయమే ఇక్కడ ప్రధానం. అంటే యజుర్వేద కాలానికి సౌర, చాంద్రమానాల సమ్మేళనం కేలండర్ అమలులోకి వచ్చిందన్న మాట.

ఉభయ కాలగణనల్ని సరిచేయడానికి గట్టి ప్రయత్నం చేశారనేది వాస్తవం. లేకుంటే 'అధిక', 'లుప్త' మాసాల విషయం ఇక్కడ ప్రత్యేకంగా రాదు.

## అధిక మాసాలు - లుప్తమాసాలు

నిజానికి:

భూమి సూర్యుని చుట్టూ తిరిగే ఒక పరిభ్రమణానికి 365 రోజుల 6 గంటలు సమయం పడుతుంది. చంద్రుడు భూమిచుట్టూ తిరిగి రాడానికి 27.3 రోజులు పడుతుంది. కానీ పున్నమి నుండి పున్నమి 29.5 రోజులు పడుతుంది. 12 పున్నములకు (12 నెలలకు: 12×29.5=) 354 రోజులుఅంటే సౌరమానానికీ, చంద్రమానానికీ సంవత్సరానికి 365-354=11 రోజులు తేడా. (10.8 రోజులు) ఇలా మూడేళ్ళకి 3×11=33 (32.6 రోజులు) రోజుల్లో 30 రోజులు కలిపి ఒక నెలను పెంచుతారు. దాన్నే 'అధికమాసం' అంటారు. అంటే ప్రతి మూడో సంవత్సరంలో ఒకనెల అధికంగా వస్తుంది. ఇలా పెంచుకుంటూ తగ్గించుకుంటూపోతే కొన్ని సంవత్సరాలలో ఒక నెల తగ్గించాల్సి వస్తుంది. తగ్గించే నెలను లుప్తమాసం అంటారు. ఈ లుప్తమాసాలు ప్రతి 19 ఏళ్ళకి, ఆ తర్వాత 120 ఏళ్ళకి, ఆ తర్వాత 141 ఏళ్ళకి ఒకసారి వస్తుంటాయి.

యజుర్వేదంలో ఈ అధిక, లుప్త మాసాల్ని 'మలమాసాలు' అంటే అపరిశుద్ధ మాసాలు అన్నారు.

ఈ మలమాసాల గుర్తింపు కాలగణనలో వారి ఖచ్చితత్వాన్ని తెలుపుతుంది.

2015లో అధిక అషాఢం వచ్చింది. 2018లో అధిక జ్యేష్ఠ, 2020లో అధిక ఆశ్వయుజం, 2023లో అధిక శ్రావణం, 2026లో అధిక జ్యేష్టాలు వస్తాయి. కానీ బౌద్ధులు ఎప్పుడు అధికమాసం వచ్చినా దాన్ని నిజ ఆషాఢం తర్వాతే లెక్కిస్తారు. అంటే వారి కేలండర్‌లో ఎప్పుడూ మూడేళ్ళకోసారి అధిక ఆషాఢం ఉంటుంది. దీనికి బౌద్ధుల 'వర్షావాసం' కారణం.

ఇది మాసాల విషయం. అంతే ఖచ్చితత్వం తిథులలో కూడా ఉంది.

## తప్పు లెక్కిస్తే తప్పదు శిక్ష

మనం ఈనాటికి ఫలానా పండుగ ఈ రోజా, రేపా అని తర్జనభర్జనలు పడతాం. ఒక కేలండర్‌లో ఒకరోజు వుంటే, ఇంకో కేలండర్‌లో మరుసటిరోజు అని ఉంటుంది. ఈ తలనొప్పి తిథుల ఎంపికలో ఖచ్చితత్వం లేకే! ఇలా ఖచ్చితత్వం తెలుసుకోలేకపోవడం పెద్దనేరంగా యజుర్వేదం ప్రకటించింది.

**నా2 సోమయాజీ సం............... సాన్నాయం పయసైవ పయ ఆత్మన్దత్త్ వి వా ఏతం**

**ప్రజయా పశుభిరర్ధయతి వర్ధయత్యగ్య భ్రోతృవ్యం యస్య హవిర్నిరుప్తం పురస్తా చంద్రమా ! (కృ.యజు: 2-5-5)**

ఇది దర్శపూర్ణమాసయాగం ప్రారంభం గురించి చెప్పిన మంత్రం. దీనర్థం..

''ఈ యాగం అమావాస్య నాడే చేయాలి. అమావాస్యగా భావించి కృష్ణచతుర్దశి రోజున చేస్తే ఆ రాత్రి తెల్లవారు ఝామున తూర్పు ఆకాశంలో చంద్రుడు (నెలపొడుపు లాంటి ఆకారం) కనిపిస్తే ఆ యాగం చేసిన వానికి పశునష్టం సంభవిస్తుంది-''అని. దీనికి విరుగుడు కూడా ఉంది అనుకోండి. అది వేరే విషయం. దానికి తిరిగి చాలా ఖర్చు అవుతుంది.

ఇక్కడ చూడాల్సింది తిథుల ఎంపికలో ఖచ్చితత్వం.

దర్శపూర్ణమాసయాగం చేయించే వానిని 'సోమయాజి' అంటారు. అంటే కాలగణన ఖచ్చితత్వం తెలిసినవాడన్నమాట. శాస్త్రం తెలియనివాళ్ళు 'శాస్త్రి' అని ఎలా పేర్లు పెట్టుకుంటున్నారో, చివరికి సోమయాజి అనేపేరు కూడా ఆతర్వాత అలాగే- కులనామంగా మారిపోయింది. అందుకే వేమన: "తొలుత సోమయాజి, తుద కామయాజిరా-" అన్నాడు.


ఇక్కడ మనం ఒకవిషయాన్ని తెలుసుకోవాలి. మనం వ్యవహారంలో చెప్పుకునే చైత్ర, వైశాఖ మాసాల పేర్లు వేదంలో ఇలా ఉంటాయి-

దేవశ్రవా ఋషి చెప్పిన ఈ మంత్రం చూడండి-

**"ఉపయామ గృహీతో2సి మధవే త్వోపయము గృహలో2సి మాధవాయ**

**త్వోపయామగృహీతో2సి శుక్రాయ త్వోపయా గృహీతో2సి శచయే" -(శుక్ల.యజు: 7-30)**

ఇందులో మాసాల పేర్లు మధు (చైత్రం), మాధవాయ (వైశాఖం), శుక్ర(జ్యేష్ఠ), శుచ (ఆషాఢం), నభాస (శ్రావణం), నభాస్యాయ (భాద్రపదం), అశ్విన (ఆశ్వయిజం), ఊర్జ (కార్తీకం), సహస (మార్గశిరం), సహస్యాయ (పుష్యం), తపస (మాఘం), తమస్యాంకు (ఫాల్గుణం)– అని ఉంది. అంతేకాదు. **"త్యోపయామ గృహీతో2స్య అంహసస్పత యేత్వా"** అని కూడా ఉంది. అంటే 13వ నెల 'అంహసస్పత' అంటే అది అధికమాసం అన్నమాట.




## నక్షత్రాలు–ఋతువులు

మనం ముందే చెప్పుకొన్నట్లు చంద్రుడు భూమిచుట్టూ తిరగడానికి 27 రోజులు పడుతుంది కాబట్టి రోజుకు ఒక నక్షత్ర సమీపంలో కనిపిస్తాడు. అందుకే ఆ 27 నక్షత్రాలకి 27 పేర్లు పెట్టారు. ఆ పేర్లు మొత్తం కృష్ణ యజుర్వేదం: 4–4–10లోని మంత్రాల్లో ఉన్నాయి. వాటిపేర్లు, వాటికి చెందిన దేవతల లిస్టుకూడా ఉంది. ఈ దేవతల పేర్లు చూస్తే అవి రాశిచక్రానికి సంబంధించినవి. రాశిచక్రాల విభజన ఋగ్వేద కాలానికే ఉంది. ఐతే, ఆ రాశులపేర్లుగానీ, నక్షత్రాల వివరాలుగానీ అక్కడ లేవు. ఇక్కడ ఉన్నాయి. అవిచూద్దాం.. నక్షత్రాల లెక్కింపు కృత్తికతో ప్రారంభించడం గమనించాలి.

**కృత్తికా నక్షత్రమగ్నిర్దేవతా.... రోహిణీ నక్షత్రం ప్రజాపతిర్దేవతా మృగశీర్షం నక్షత్రగ్ం సోమో దేవతా... ఆర్ద్రా నక్షత్రగ్ం రుద్రో దేవతా ........................ భరణీ నక్షత్రం యమో దేవతా పూర్ణా పశ్చార్యత్తే దేవా అదదుః (కృ.యజు: 4–4–10)**

1.కృత్తిక (దేవత: అగ్ని), 2. రోహిణి (దేవత: ప్రజాపతి), 3.మృగశీర్ష(సోముడు) 4. ఆర్ద్రా (రుద్రుడు: కాలపురుషమండలం), 5. పునర్వసు (అదితి), 6. పుష్యమి (బృహస్పతి), 7. ఆశ్రేషా (సర్ప వాసుకీ మండలం), 8. మఘ (పితృ), 9.ఫల్గురే (ఆర్యమా), 10.ఉత్తర ఫల్గుణీ (భగ), 11. హస్త (సవితా), 12. చిత్ర (ఇంద్ర) 13. స్వాతి (వాయు), 14. విశాఖ (ఇంద్రాగ్ని), 15. అనురాధ (మిత్ర), 16. రోహిణి 9ఇంద్ర), 17. విచృత లేక మూల (పితృ), 18. ఆషాఢ (ఆపో), 19. ఉత్తరాషాఢ (విశ్వేదేవతా), 20. శ్రోణ లేక శ్రవణం (విష్ణు), 21. శ్రవిష్టా లేక ధనిష్టా (వసవ), 22. శతభిషం (ఇంద్ర), 23. పోష్ఠపదా లేక పూర్వాభాద్ర (అజ), 24. పోష్ఠపదా లేక ఉత్తరభాద్ర (అహిర్బుద్నియో), 25. రేవతీ (పూషా), 26. ఆశ్వయుజౌ లేక అశ్విని (అశ్వినీ దేవత), 27. భరణీ (యమ)

ఇక ఋతువుల వివరాలు చూస్తే అన్నిచోట్లా ఆరు రుతువుల ప్రస్తావనే ఉంది. రెండేసి నెలలు ఒక్కో రుతువు చొప్పున చేసిన విభజన అనేక చోట్ల ఉంది.

ఋగ్వేదంలో రుతువులు ఐదు అని కొన్ని చోట్ల 'ఆరు' అని కొన్నిచోట్ల ఉంది. అలా ఎందుకు ఉందో 'ఋగ్వేద కూనిరాగం' *(స్వేచ్ఛాలోచన జనవరి 2017 సంచికలో గతంలో చర్చించాం).* కానీ– యజుర్వేదంలో ఋతువులు 'ఆరు' అనే అన్నిచోట్లా ఉంది.

కృ.యజు: 4–4–11లోని మంత్రాల్లో–

చైత్ర, వైశాఖాలు (వసంత రుతువు), జ్యేష్ఠ ఆషాఢాలు (గ్రీష్మ ఋతువు), శ్రవణ, బాద్రపదాలు (వర్ష రుతువు). మార్గశిర, పుష్యాలు (హేమంత రుతువు), మాఘ, ఫాల్గుణాలు (శిశిర రుతువు)– అని ఉంది.

ఋగ్వేదంలో హేమంతంతో రుతువుల ఆరంభం ఉంటే.... యజుర్వేదంలో వసంతంలో రుతుగమన ప్రారంభం ఉంది. అంటే.. హిమాలయ దిగువభాగాన గల యమునా, గంగా మైదానంలో ఆర్యులు స్థిరపడ్డారని ఈ రుతువిభజన తెల్పుతుంది.

**"ఋతూనాం వసంతం ప్రేణామి– సమాప్రీత్నా ప్రీణాతు**
**వర్షా జీతోణాం ప్రీణామి – తామాప్రీత్నా ప్రీణస్తు**
**శరదం ఋతూణాం ప్రీణామి – సామాప్రీతా ప్రీణాత**
**హేమంత, శిశిరా ఋతూనాం ప్రీణామి – తామా ప్రీతౌప్రీణాత**

**( కృ.యజు: 1–6–2)**

ఇక– ఆరు రుతువుల లక్షణాల్ని ఏమని చెప్పారో చూద్దాం–

పితృదేవతల్ని అగ్ని రుతువుల్లో నమస్కరిస్తాను అని చెప్తూ–

**"నమో వ పితరో రసాయ, నమోవః పితరః శోషాయ**
**నమో వః పితరో జీవాయ, నమో నః పితరః స్వధాయై**
**నమో వః పితరో ఘోరాయ, నమోవః పితరో మన్యవే...**

**(శుక్ల యజుర్వేదం: 2–32)**

(అంటే– రసభూతమైన వసంత రుతువున, శోషింపజేసే గ్రీష్మాన, జీవమే తానైన వర్షరుతువున, అన్నాన్ని ఇచ్చే శరత్ రుతువున, కఠినమైన హేమంతాన, క్రోధాల్ని ఉత్పత్తి చేసే దాహకారక శిశిరమున పితృదేవా! నీకు నమస్కరించెదను)

ఇంకా–

యాగకర్త అయిన యజమానిని "అన్ని దిక్కులకు సంచరించు" అని చెప్తూ– ఆయా దిక్కులలో ఉన్న ఒక్కో రుతువు నిన్ను రక్షించును' అని చెప్పే సందర్భం ఇది. ఈ మంత్రంలో శుక్లయజుర్వేదం 10వ అధ్యాయంలో 10 నుండి 14 వరకూ ఉన్న మంత్రాల్లో–

'తూర్పుదిక్కున ఉన్న వసంతరుతువు, దక్షిణ దిక్కున ఉన్న గ్రీష్మం, పశ్చిమాన ఉండే వర్షరుతువు, ఉత్తరాన ఉండే శరత్ రుతువు, పై దిక్కున ఉండే హేమంత, శిశిరాలు నిన్ను

రక్షించు గాక!' అని ఉంది.

## ఋతువు'లే'దిక్కు !

ఇది చాలా సాధారణంగా అనిపించ వచ్చు. కానీ, ఇది యజుర్వేద ప్రజల నివాస ప్రదేశాన్ని, ఉనికిని తెలియజేస్తుంది.

భూగోళం మీద పశ్చిమ దేశాలకంటే ముందుగా తూర్పుదేశాల వారికే 'వసంతం' వస్తుంది. అంటే వసంత ఆగమనం తూర్పు నుండి వస్తుందన్నమాట. చైనావారు మనకంటే తూర్పున ఉంటారు. వారికి వసంతం జనవరి-ఫిబ్రవరి నెలల్లో వస్తుంది. మనకి మార్చి-ఏప్రిల్ నెలల్లో వస్తుంది. చైనాకూ మనకూ 35-40 డిగ్రీల రేఖాంశాల దూరం ఉంది. ఈ దూరాన్ని సూర్యుడు రెండున్నర గంటల్లో దాటగలడు. అలాగే రుతువులు రెండున్నర నెలల్లో దాటగలవు. అలాగే మనకంటే ఈశాన్య రాష్ట్రాల్లో ముందుగా వసంతం వస్తుంది. అందుకే తూర్పుదిక్కున ఉన్న 'వసంతం' అన్నారు.

ఇక ఆర్యుల స్థావరాలు కర్కటరేఖకు ఎగువప్రాంతం. సమశీతోష్ణమండలం. దానికి దక్షిణంగా ఉండేది ఉష్ణమండలం. అంటే.. గ్రీష్మరుతువు దక్షిణాన్నుండి ఉత్తరానికి వస్తూ ఉంటుంది. మనకు ఉభయ తెలుగురాష్ట్రాలకి ఏప్రిల్-మే నెలల్లో స్కూళ్ళకి వేసవి సెలవులుంటే... ఢిల్లీ, పంజాబ్, ఉత్తరప్రదేశ్, బీహార్ వాళ్ళకి మే, జూన్ నెలలు వేసవి సెలవులు-

అందుకే వారు 'దక్షిణ దిక్కున ఉన్న గ్రీష్మం' అన్నారు.

ఇక వర్షరుతువు. నైరుతి రుతుపవనాలు వల్ల వచ్చే వర్షాలు ఆ రుతుపవనాలు వింధ్యపర్వతాలు దాటాక యమున-గంగాప్రాంతానికి పశ్చిమం నుండే ప్రయాణిస్తాయి- అందుకే ఆ దిశను- వర్షదిశగా గణించారు.

తెల్లని వెన్నెలకూ, స్వచ్ఛ వాతావరణానికీ ప్రతీక అయిన ఉత్తరాన ఉన్న హిమగిరి భూమి శరత్‌కాలానికి దిక్కుగా భావించారు-

పర్వత దిగువ భాగం కంటే ఎగువభాగంలో శీతలం ఎక్కువ. మంచుపేరుకుపోయి ఉంటుంది. కాబట్టి శిశిర, హేమంతాలు ఊర్ధ్వదిశగా నమ్మారు-

ఈ నాల్గు దిక్కులూ వారి ఉనికిని తెలియజేస్తూ యజుర్వేద కాలానికి గంగా-యమునా మైదానంలో స్థిరపడ్డారని ఋజువు చేస్తాయి.

## రక్త తర్పణలు

ఈ విషయాలే కాదు- అసలు యజుర్వేదంలో ఉన్నవే యజ్ఞయాగాలూ, పశుబలులూ- ఏయే రోగానికి ఏఏ ఆవుల్ని, ఏయే జంతువుల్ని బలివ్వాలో ఏయే కార్యాలకి దేనికి బలులు ఇవ్వాలో ఈ వేదాల్లో కోకొల్లలు-

అలాగే రుతువులకి కూడా... నెత్తురు తర్పణలే... **ధూమ్రాన్ వసంతాయా....**అనే ప్రజాపతి రుషి విరచిత మంత్రాన్ని ఈ వ్యాసం మొదట్లోనే చూశాం.


అలాంటిదే ఇది:

**వసంతాయ కపింజలానా లభతే గ్రీష్మాయ కలవింకాన్ వర్షాభ్యస్తిత్తిరీంచరదే వర్తికా హేమంతాయ కకరాంచి శిరాయ వికకరాన్ - (శుక్ల యజు: 24-20)**

అంటే... వసంతానికి కౌజు పిట్టను, గ్రీష్మానికి ఊరపిచ్చుకను, వర్షరుతువుకి తిత్తిరిపిట్టను, శరత్తుకు వర్తక పక్షిని, హేమంతానికి కకరమును, శిశిరానికి వికికిరము అనే పక్షిని బలిస్తాను"-అని.

ఇలా రుతువులకు రక్తతర్పణలు చేసి 'కాలాని'కి నెత్తుటి గీతం పాడింది యజుర్వేదం. *(ఇంకావుంది)*

## మృత్యువ్యాపారం నుండి మానవత్వం వైపు



ఆల్ఫ్రెడ్ బి. నోబెల్ 1833, అక్టోబర్ 21న స్వీడన్ లోని స్టాక్‌హోంలో జన్మించారు. పేలుడు పదార్థమైన 'నైట్రోగ్లిజరిన్'ను భద్రపరిచి తరలించే విధానాన్ని కనుగొని తద్వారా 'డైనమైట్'ను ఆవిష్కరించాడు. అలాగే శక్తివంతమైన 'డిటోనేటర్'లను కనుగొన్నాడు. అనేక ఫ్యాక్టరీలు నెలకొల్పి బాగా డబ్బు సంపాదించాడు.

ఆ పేలుళ్ళు ప్రజల మరణానికి కారణమవుతుండడంతో విమర్శకులు ఆయనను 'మృత్యు వ్యాపారి' అని పిలిచారు. దాదాపు 350 వస్తువులపై పేటెంట్లు పొందాడు. జీవిత చరమాంకంలో తన పరిశోధనల వలన జరిగిన విధ్వంసానికి చలించిపోయి పశ్చాత్తాపం చెందాడు. తన యావదాస్తిని ప్రపంచంలో గొప్ప పరిశోధనలు చేసినవారికి అవార్డులు ఇవ్వడం కోసం వీలునామా రాశాడు. అలా నోబెల్ బహుమతులకు రూపకల్పన జరిగింది. డిసెంబర్ 10, 1896 ఇటలీలోని శాన్‌రెమోలో ఆయన తుదిశ్వాస విడిచారు. ప్రతియేటా ఆయన చనిపోయిన తేదీ డిసెంబర్ 10న నోబెల్ బహుమతుల ప్రదానం జరుగుతుంది. ఎన్ని అవార్డులున్నా నోబెల్ అన్నిటి కన్నా మిన్నగా నిలిచింది. ప్రతి శాస్త్రవేత్తకు నోబెల్ బహుమతి అందుకోవడమనేది అత్యున్నత స్వప్నం.

# చతికిలపడ్డ సాంకేతిక ప్రగతి

"ఇతియోऽ పగురాతై శత్యే యాతయాద్యో నిహనత్సహస్రేణ
యాత యాద్యో లోహితం కరవద్యావత్త ప్రస్కద్య పాగ్ం
సూన్థంగృహ్ణాత్తావత్త సంవత్సరాన్పితృలోకం న ప్రజ్యాదితి
తస్మాద్ బ్రాహ్మణాయ నాऽ ప గురేత న నిహన్యాన్న..."

**బ్రాహ్మణుణ్ణి కొట్టడానికి సిద్ధమైన వానికి వందనాణేలు, కొట్టిన వానికి వెయ్యి నాణేల దండం విధించాలి. రక్తం వచ్చేట్టు కొట్టిన వాడి జీవుడు ఈ భూమ్మీద ఎన్ని పరమాణువులున్నాయో అన్ని ఏళ్ళు ఇక్కడే ఉంటాడు. వాడు ఎన్నటికీ పితృలోకానికి చేరలేడు.కాబట్టి బ్రాహ్మణుణ్ణి ఎదిరించకూడదు. తిట్టకూడదు. కొట్టకూడదు. బ్రాహ్మణరక్తం కళ్ళ చూడకూడదు.**

**(కృష్ణ యజుర్వేదం 2-6-10)**

## క్షత్రియాధీనం

ఋగ్వేదంలో వర్ణవ్యవస్థ ఛాయలు దశమ మండలంలో కనిపించాయి. అసలు ఆ మండలమే తర్వాత చొప్పించింది అని చాలామంది అభిప్రాయం. ఋగ్వేదంలో ఆర్యజాతుల మధ్య, ప్రజల మధ్య వర్ణ, వర్గ భేదాలు స్పష్టంగా కనిపించవు. దస్యులపట్ల హేయభావం, ద్వేషం మాత్రం ఉంది. ఇది ఆర్య, అనార్య జాతులమధ్య కనిపించే జాతిభేదం. కానీ, యజుర్వేదకాలానికి, ఆర్యసామాజిక చిత్రపటంలో చాతుర్వర్ణవ్యవస్థ స్పష్టంగా కనిపిస్తుంది.

ఈనాడు మనం చెప్పుకునే 'కులం' పునాదులు ఆనాటి వర్ణసమాజంలో దాపరికం లేకుండానే కనిపిస్తాయి. తొండముదిరి ఊసరవెల్లి అయినట్లు వర్ణం ముదిరి కులంగా మారిందనే చారిత్రక సత్యం కూడా సుస్పష్టమే!

**ఈ వేదకాల వర్ణ వ్యవస్థలో బానిసత్వం ఉంది. బ్రాహ్మణాధిపత్యం ఉంది. కానీ, అంటరానితనం లేదు. అది కులవ్యవస్థ సృష్టించిన జాఢ్యమే. అమానుషమే.**

ఈ 'కుల' అమానుషం ఉపనిషత్తుల కాలంలో వేళ్ళూనుకొంది. తొలిదశలోనే బౌద్ధం ఈ అమానుషాన్ని అడ్డుకుంది. కానీ.. వైదిక ఉపనిషత్తులు, దర్శనాలు, ఇతిహాసాలూ కుమ్మరించిన ఈ కులభావజాలాన్నుండి ఈ దేశాన్ని కాపాడ్డానికి బౌద్ధం బలం చాలలేదు. అందుకే ఆ కులవ్యవస్థ ఇన్నేళ్ళుగా పాతుకుపోయింది.

అయినా, ఇన్నేళ్ళలో కులాన్ని కూల్చే కొత్తభావజాలం ఏదీ పుట్టలేదు. అందుకే ఆధునిక కాలానికి కూడా అంబేద్కర్‌కి బౌద్ధమే ప్రత్యామ్నాయమార్గంగా కనిపించింది. అయితే, కులవ్యవస్థ పునాదులు వేదాల్లోని వర్ణవ్యవస్థలో చూడగలం. యజుర్వేదంలో క్షత్రియాధిపత్యం ఉంది. గణరాజ్యవ్యవస్థ ధ్వంసమవుతూ, ఏకకేంద్ర రాజ్యాలు నిర్మించిన రాజులు, వారి ఆధిపత్యం కనిపిస్తుంది. రాజే రక్షకుడు, రాజే సర్వశక్తివంతుడు అని యజుర్వేదంలో చాలాచోట్ల ఉంది.

**"....... మధుమతీ ర్మధుమతీభిః పృచ్యంతామ్మహి
క్షత్రం క్షత్రియాయ వన్వానాऽ అనాదృష్టాః సీదత
సహౌజసో మహి క్షత్రం క్షత్రియాయ దధతీః" (శు.యజు:10-4)**

(నదుల జలాల్ని పాత్రల్లో కలుపుతూ..)

*"ఈ మధురజలం, ఈ మధురజలంతో కలిసిపోయింది. ఈ మహారాజ్యం (ఈ నదులు ప్రవహించే ప్రాంతమంతా) ఈ క్షత్రియుని వరించాలి. ఓ! జలములారా! ఈ రాజుకి శత్రువులెవరూ గెలవలేని బలాన్ని కలిగించండి. అతనికి ఈ రాజ్యాన్ని అప్పగించండి. మీరు స్థిరపడండి"*-

అంటే గణరాజ్యాలు మహారాజ్యాలుగా రూపొందుతున్నాయన్నమాట. రాజ్యాల పరిధితోపాటు పాలకుని అధికార పరిధులు కూడా పెరిగిపోతున్నాయని అర్థం. ధనం, విశేష అధికారాలు క్షత్రియుల ముంగిళ్లలో ప్రోగుపడుతున్నాయనేది ఈ యజస్సుల అంతరార్థం.

అందుకే ఋగ్వేదంలో దేవాధిపతి, యజ్ఞాధిపతి, దిక్పాలకులకు అధిపతి అయిన ఇంద్రుణ్ణి-

**ఇంద్రం వో విశ్వతస్పరి .....
క్షత్రమను సహో జయతేన్ద్ర దేవేభిరనుతే సృషషే .....**

**-(కృ.యజు:1-6-12)**

*'ఓ ఇంద్రా! నీవు క్షత్రియజాత్యాభిమానం కలవాడవు"* అంటూ కీర్తించారు.

రాజులకూ, పురోహితులకూ మధ్య అధికారపోరు ప్రపంచంలో అన్ని చోట్లా కన్పిస్తుంది. పురోహితుడే, రాజ్యాధికారం నెరపే విధానం తొలినాట చాలా సమాజాల్లో

ఉంది. అది ఋగ్వేద సమాజంలోనూ ఉంది. పురోహితులు తమ మతవ్యవస్థను సంరక్షించుకోడానికి, దాని ద్వారా తాము లబ్ధిపొందడానికి క్షత్రియుల్ని రక్షకులుగా ఉపయోగించుకున్నారా? లేక, క్షత్రియవర్గం తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకు మతభావజాలాన్ని ప్రచారం చేయడానికి పురోహితుల్ని ఉపయోగించుకున్నదా?

## జోడు దొంగలు

ఇది అంతుతేలని ప్రశ్నే. చెట్టుముందా? విత్తుముందా? లాంటిదే! అయితే- అశేష ప్రజానీకంపై పెత్తనాన్ని సాగించడానికి రెండువర్గాలూ తోడుదొంగల్లా కలివిడిగా నడిచాయనేది చారిత్రక సత్యం. అక్కడకూడా, అప్పుడప్పుడూ 'ఎవరుగొప్ప' అనే విషయంపై వాగ్వివాదాలు జరిగినా, కొద్దిపాటి తిరుగుబాట్లు కలిగినా, మొత్తంమీద ఈ దొంగల జోడీ జోరుగా కొనసాగిందనేది చరిత్ర మనముందుంచిన కటిక నిజం. ఈ నిజాన్ని మనకు తుడిచిన అద్దంలా చూపిస్తుంది యజుర్వేదం.

**"సింహ్యాసి స్వాహ సింహ్యాస్యాదిత్యమవనిః స్వాహా సింహ్యాసి బ్రహ్మవనిః క్షత్రవనిః" (శు.యజు:5-12)**

*"ఓ యజ్ఞవేదికా! నీవు సింహినివి! నీకు స్వాహ! నీవు బ్రాహ్మణులను, క్షత్రియులను ప్రసన్నులను చేయుము"*

**"బ్రహ్మవనిత్వా క్షత్రవని రాయస్పోషవని పర్యూహామి బ్రహ్మోదృంహ క్షత్రం దృంహా యుర్ధ్రంహ ప్రజాన్దృంహ !**

**(శు.యజు:5-27)**

*"ఓ! ఔదుంబర వృక్ష కొమ్మా! నీవు బ్రాహ్మణుని సంతోషపెట్టు. క్షత్రియుని సంతోషపెట్టు. ఓ కొమ్మా! బ్రాహ్మణ, క్షత్రియులను దృఢపరచు. వారి ఆయుష్షునూ, సంతతిని దృఢపరచు."*-

అలాగే.. శుక్ల, కృష్ణ యజుర్వేదాలలో అనేక చోట్ల వీరిద్దరి విషయం కలిసే ఉంది. శుక్ల యజుర్వేదం 18వ అధ్యాయంలో 38 నుండి 44 యజస్సులలో-

*'అగ్ని బ్రాహ్మణ, క్షత్రియుల్ని పాలించును గాక'*

*'సూర్యుడు, బ్రాహ్మణ, క్షత్రియుల్ని పాలించును గాక'*

*అలాగే.. చంద్రుడు, వాయువు, యజ్ఞం, మనస్సు, ప్రజాపాలకుడు.. బ్రాహ్మణక్షత్రియుల్ని పాలించునుగాక!'* అని ఉంది.

**బ్రహ్మక్షత్రం పవతే తేజ ఇంద్రియం సురయా సోమః**

**(శు.యజు:19-5)**

*'ఓ! సోమమా! బ్రాహ్మణుల యందు, క్షత్రియుల యందు, ఇంద్రియములయందు తేజస్సును కలిగించు'* అంటూ...

**'కువదింగ యవమన్తోయవం చిద్యథా దాన్త్యనుపూర్వం...'**

**(శు.యజు.19-6)**

యవలు మొదలైన ధాన్యాన్ని గడ్డి, పొల్లుల నుండి రైతు ఎలా వేరుచేయునో, ఓ మిత్రమా అగ్నీ! అలాగే నిన్ను సేవించు వారిని (బ్రాహ్మణ, క్షత్రియుల్ని) గడ్డి, పొల్లుల నుండి (వైశ్య, శూద్రుల నుండి) వేరు పరుచుము. వారికి అన్నపానాలు వృద్ధిపరచుము' అని తేల్చి చెప్పేశారు.

**'ఇషేసిన్వస్వోర్జే పిన్వస్వ బ్రాహ్మణే పిన్వస్వ క్షత్రాయ...**
**... బ్రహ్మధారయ క్షత్రం ధారయ విశం ధారయ**

**(శు.యజు: 38-14)**

'ఓ! ధర్మమా! బ్రాహ్మణ, క్షత్రియులకోసం వృద్ధిపొందువారికి ధనం మొదలైన సంపదలు ధారపోయుము' ఇంకా వారిద్దరి ఐక్యత గురించి-

**'యత్ర బ్రహ్మ చ క్షత్రించ సమ్యుంచౌ చరతః సహ'**

**(శు.యజు:20-25)**

ఓ అగ్నీ! ఎక్కడ బ్రాహ్మణులు, క్షత్రియులు చక్కగా కలిసి వ్యవహరిస్తారో అలాంటి పుణ్యలోకాలు తెలియుగాక!' ఇక ఇది చూడండి.

**'ఇదం మే బ్రహ్మచ క్షత్రం చోభే శ్రియ మశ్నుతాం'**

**(శు.యజు:32-16)**

*'ఈ సంపదలు బ్రాహ్మణులు, క్షత్రియులు అనుభవించుటకే'*-

యజుర్వేదం ప్రకారం బ్రాహ్మణ, క్షత్రియత్వాలు ఎంతటి ఉన్నతమైనవో, ఉత్తమమైనవో చూడండి. యజ్ఞంలో మేడికొమ్మను అర్థిస్తూ-

**''బ్రహ్మవనిం త్వా క్షత్రవనింగ్ సుప్రజావనింగ్ రాయస్పోషవనిం**
**పర్యూహామి బ్రహ్మదృగ్ంహ, క్షత్రం దృగ్ంహ రాయస్పోషం దృగ్ంహ.." (కృ.యజు:1-3-1)**

*''ఓ మేడికొమ్మా! బ్రాహ్మణత్వాన్ని ఇవ్వు. క్షత్రియత్వాన్ని ఇవ్వు. ధనాన్ని ఇవ్వు. మంచి సంతతిని ఇవ్వు. బ్రహ్మణత్వాన్ని, క్షత్రియత్వాన్ని, ధనాన్ని, సంతానాన్ని దృఢపరచు"*

ఇలా బ్రాహ్మణ, క్షత్రియుల సంక్షేమం కోసం , వృద్ధి కోసమే యజ్ఞం అని యజుర్వేదం తేటతెల్లపరచింది.

మతం యజ్ఞయాగాది క్రతువులతోనే ఆగిపోతే, పూజాపునస్కారాల దగ్గరే నిలచిపోతే దైవ విషయంలో తప్ప సామాజిక అంశాల్లో పెద్దగా అది వేసేముద్ర అంతగా ఉండదు.

కానీ, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మతం ఇక్కడ మానవజాతిని అనేక సామాజిక విభాగాలుగా చీల్చి వేసింది.

## రుబ్బుడు వృత్తులు

సమాజంలోని ప్రజలు చీలికలతో ఉండడం రాజ్యానికి, రాజుకీ మేలు. సమాజంలోని ఆ చీలికలు ఎప్పుడూ కలవకుండా చేయడం రాచరికానికి చాలా అవసరం. ఆ అవసరాన్ని పాలకవర్గాలకి ప్రపంచంలో అన్నిచోట్లా 'పూజార్లు' తీర్చారు. మతం, పరలోకం అనే మత్తులో జనాన్ని ముంచారు. కానీ, భారతదేశంలో ఆ మత్తుతోపాటు 'ఎప్పుడూ కలవలేని' ఒక అంతరాన్ని స్థిరీకరించారు.

వర్గం, వర్ణాల్లోని తేడా ఇదే! వర్గసమాజంలో తాను ఏ వర్గంలోకి మారాలన్నా మనిషి మారొచ్చు. ఆర్థిక అంతరాలు తప్పితే, అక్కడ సామాజిక అంతరాలు లేవు. అక్కడ విద్యావిజ్ఞానాలకి సామాజిక ఎంపిక కొలబద్దకాదు.

చెక్కపని వాడైనా, చర్మకారుడైనా శాస్త్రవేత్త కావొచ్చు. అక్కడి సమాజ విజ్ఞానపరిధి విశాలమైంది. బహుముఖీయం.

కానీ, ఆర్య సామాజిక రచనలో ఆ అర్హత మొదట్లో ఇద్దరికే ఉంది. జ్ఞానం, శౌర్యం కలిసి నడిచాయి. మిగిలిన సమాజాన్ని అజ్ఞానులుగా, పిరికివాళ్లుగా మలచాయి. అంతేకాదు, ఆ ఇతర సమాజంలోని వారిలో ఎవరైనా జ్ఞానంవైపుకు చూసి, శౌర్యంవైపుకు నడచి తమకు పోటీ రాకుండా కట్టుదిట్టం చేశాయి. ఈ కట్టుదిట్టం చేయడంలో బ్రాహ్మణులు తమకు తామే కాకుండా క్షత్రియులకే లాభం చేకూర్చారు.

ఆ కట్టుదిట్టం చేసిన సాధనమే 'కులం'. జ్ఞానాన్ని, శౌర్యాన్ని, వ్యాపారాన్ని, గొడ్డుచాకిరినీ వంశపారంపర్యం హక్కుగా చట్రం బిగించారు. ఎవరి వృత్తి వారిదే! వృత్తి మారకుండా తరతరాలుగా అదేవృత్తిలో పడి కొట్టుమిట్టాడడమే కులం.

కులం వల్ల వృత్తుల్లో నైపుణ్యత పెరగలేదు. పాడిందే పాటరా.. అన్నట్టు చేసిందే చేయడం.. ఒక అలవాటుగా మారిందే తప్ప మానసిక వికాసానికి కులం దోహదం చేయలేదు. ఎందుకంటే.. నైపుణ్యం అనేది చేసే వ్యక్తి ఇష్టతను బట్టి ఉంటుంది. ఒక చెప్పులు కుట్టేవ్యక్తికి బట్టలు నేయడం మీద ఆసక్తి ఉన్నప్పటికీ ఆ వృత్తి చేయడానికి కులం ఒప్పుకోదు కాబట్టి–

పిల్లలకు ఇష్టమైనది కాకుండా తమకి ఇష్టమైన కోర్సును తల్లిదండ్రులు ఇప్పుడు ఎలా బలవంతంగా చదివిస్తూ రుబ్బుడికి అలవాటు చేశారో... ఈ దేశంలో కులం కూడా వృత్తి రుబ్బుడుల్ని అలాగే అలవాటు చేసింది. ఇష్టమైన వృత్తిని ఎంచుకొనే హక్కులేక, బ్రతకడం కోసం బలవంతంగా అదే పనిని చేస్తూ వేలాది సంవత్సరాలు ఈ దేశం కాలం వెళ్ళదీసింది. కోట్లాది మంది నైపుణ్యం, విజ్ఞానం వికసించకుండా, వెలుగులు ప్రసరించకుండా మతం మబ్బులు కప్పేసింది. అందుకే ప్రపంచం గర్వించతగ్గ సాంకేతిక నైపుణ్యానికి నూతన వైజ్ఞానిక దృక్పథాన్ని ప్రపంచంలో సంబంధంలేని ఎదుగూబొదుగూలేని 'దీవిలా' భారత ద్వీపకల్పం మారింది.

## జ్ఞానానికి గ్రహణం

అందుకే... **ఈ సమాజం గ్రీకుల స్పర్శ సోకనంత వరకూ శిల్పనైపుణ్యం వైపు చూడలేక పోయింది. పారశీకుల స్పర్శ తాకనంతవరకూ అందమైన భవన నిర్మాణ నైపుణ్యం, సంగీతగాన కళావిభవాల్ని అందుకోలేక పోయింది. ఆంగ్లేయుల స్పర్శసోకనంత వరకూ వైజ్ఞానిక వికాసం చెందలేకపోయింది.** ఎందుకంటే... ఈ మూడు స్పర్శలూ ఈ దేశంలో పాతుకుపోయిన కులపునాదుల్ని కుదిపాయి. ఆ కుదుపుల్లోంచే ఇక్కడ వైజ్ఞానిక, సాంకేతిక, శిల్పకళారంగాలు ప్రాణం పోసుకున్నాయి. ఈ మూడింటితో పాటు క్రీ.పూర్వం నుండే బౌద్ధుల వైజ్ఞానిక దృక్పథం కూడా తోడయ్యింది.

వింత.. విచిత్రం ఏమిటంటే.. ఈనాడు దేశభక్తిపూని 'ప్రాచీన భారతీయుల వైజ్ఞానిక విభవం' అంటూ వెర్రికేకలు వేస్తున్నవారంతా గొప్పగా చెప్పుకునేది బౌద్ధుల విజ్ఞానం గురించే. ఏమాత్రం సిగ్గూశరం లేకుండా " వీరంతా భారతీయ రుషులే. హైందవులే" అని చెప్పుకుంటూ, వారికి ఒక గోష్పాద పిలకలు తగిలించి, నుదుటిమీద నామాలు దిద్ది , వళ్ళంతా విభూతిరేఖలు పులిమి చూపిస్తారు. ఆత్మానంద పడతారు.

నిజానికి బౌద్ధులు తప్ప మిగిలిన భారతీయ వైదిక వైజ్ఞానికులంతా విజ్ఞానశాస్త్రానికి కొన్ని మూఢనమ్మకాల్ని జోడించి, దానిమీద వ్యాపారం చేసుకుని బ్రతికినవారే. వారిలో వరాహమిహిరుడు ఒకడు. బౌద్ధగురువు, నలందా విశ్వవిద్యాలయ కులపతి అయిన ఆర్యభట్ట ఖగోళ విజ్ఞానాన్ని ఆవిష్కరిస్తే... ఆ తర్వాత వచ్చిన వరాహమిహురుడు భారతీయఖగోళ విజ్ఞానాన్ని 'జ్యోతిషం'గా మార్చి, గ్రహణం పట్టించాడు–

అంటే... కులచట్రంలో ఉన్నవారంతా ఈ దేశాన్ని వైజ్ఞానికంగా కునారిల్లేలా చేశారు అనేది చారిత్రక వాస్తవం–

భవిష్యత్తులో కునారిల్లే భారత సామాజిక వ్యవస్థ ఆనవాళ్లు యజుర్వేదంలో కనిపిస్తాయి. అంటే.. యజుర్వేద

ఆర్యుల చాతుర్వర్ణవ్యవస్థ లో అంటరానితనం లేకపోయినా...అది ఇతర ప్రపంచంలోని వర్గవ్యవస్థ లాంటిది మాత్రం కాదు. అంటరానితనం దాని గర్భంలోని మాయలో ప్రాణం పోసుకునే ఉంది.

అందుకే... వర్ణవ్యవస్థలోని శూద్రుల్ని కట్టుబానిసలుగానే చూసింది. వారివి సేవక వృత్తులుగానే, వారిని శ్రామికజనంగానే పరిగణించింది. భౌతికశ్రమ మొత్తం వారి భుజాలమీదికెత్తి నడ్డివిరిచింది. బౌద్ధిక (వైజ్ఞానిక) పరిశ్రమకు వారిని దూరం చేసింది. ఈ క్రమంలో 'బౌద్ధికం' కేవలం బ్రాహ్మణులసొత్తుగా, హక్కుగా ప్రకటించింది. చివరికి ఈ పరిధిలోకి క్షత్రియులు కూడా జొరబడనంతగా కట్టుదిట్టం చేసింది.

## బ్రాహ్మణాధిపత్యం

భావజాలబలంతో ఈ సమాజాన్ని ఎక్కడికక్కడ బంధించి పడేసింది. శుక్లయజుర్వేదంలో 'జోడుగా సాగిన' బ్రాహ్మణక్షత్రియల చెలిమిలో తేడా కృష్ణయజుర్వేదంలో కనిపిస్తుంది. బ్రాహ్మణుడే గొప్ప అనేది ఈ కృష్ణ యజుర్వేదంలో చూస్తాం-

**బ్రహ్మాస్త్వంగ్ రాజన్ బ్రహ్మాஉసి సమితాసి సత్యసవో**
**బ్రహ్మాస్త్వంగ్ రాజన్ బ్రహ్మాஉసీన్ద్రోஉసి సత్యౌజా..'**

**- (కృ.యజు:1-8-16)**

*'ఓ రాజా! నీవు బ్రాహ్మణ ధర్మాల్నే పాలిస్తున్నావు"* అని ఉంది.

అలాగే..

**'... యద్ బ్రాహ్మణశ్చా అబ్రాహ్మణశ్చ ప్రశ్నమే యాతాం బ్రాహ్మణాయஉధి**
**బ్రూయాద్యద్బ్రాహ్మణాయాஉధ్యాహాஉత్మనేஉ ధ్యాహ యద్ బ్రాహ్మణం**
**పరాహాஉత్మానం పరాஉహ తస్మాద్ బ్రాహ్మణో న పరోచ్యః**

**- (కృ.యజుం2-5-11)**

*( బ్రాహ్మణుడు, బ్రాహ్మణేతరుడు అనే చర్చ జరిగితే విజ్ఞుడు బ్రాహ్మణుడే అధికుడు అని చెప్పాలి. అలా చెప్పటం వల్ల తన ఆధిక్యతను తను పెంచుకొనును. బ్రాహ్మణుడు తక్కువ అని చెప్పుకుంటే తన ఆధిక్యతను తాను తగ్గించుకొనును. కాబట్టి బ్రాహ్మణుణ్ణి పరాభవించ రాదు')* -

మనం ఈ వ్యాసం మొదట్లో చూపిన కృష్ణయజుర్వేదం 2-6-10 లోని యజస్సులు ఒక్కసారి చూడండి. బ్రాహ్మణ్ణి తిట్టడం, కొట్టడం మహాపాపంగా, నేరంగా ప్రకటించిన సందర్భం అది. ఇక, ఈ బ్రాహ్మణాధిపత్యం ఎంతవరకూ వెళ్ళిందంటే... ఈ యజస్సు చూడండి.

**"యదగ్నేయాని కాని... సగ్ంశితం మే బ్రహ్మ సగ్ంశితం వీర్యం బలం!**
**సగ్ం శితం క్షత్రం జిష్ణయస్యాஉహమస్మి పురోహితం !"**

**- (కృ.యజు:14-1-10)**

అంటే...

*"ఓ అగ్నీ! నా బ్రాహ్మణ్యం సన్మార్గం అగునుకాక! నా మేధాశక్తి, సర్వకార్యాల్ని నడిపించును గాక! నేను ఏ క్షత్రియునికైతే పురోహితునిగా ఉంటానో, ఆ క్షత్రియుడే జయంపొందుగాక"*

అందరూ చెప్పుకునేట్టు వేదాల్లో వర్ణవ్యవస్తే ఉన్నప్పటికీ.. రాబోయేకాలంలో ఆ వ్యవస్థ నిచ్చెనమెట్ల కులవ్యవస్థగా మారడానికి కావలసిన బీజం యజుర్వేదంలోని వర్ణవ్యవస్థలోనే ఉంది. ఆ బీజం ఈ బ్రాహ్మణ అహంకారంలోంచి, ఈ బ్రాహ్మణ ఆధిపత్యధోరణిలోంచి పుట్టుకొచ్చిందే!

ఈ అధికారాన్ని సుస్థిరంగా నిలబెట్టుకోవాలంటే భౌతిక ప్రపంచంతో కుదరదు. కాబట్టి సమాజాన్ని అలా కట్టిపడేయాలంటే మనిషికి బలమైన సాధనం మెదడు, బుద్ధి, ఆలోచన. కాబట్టి ఆ బుద్ధిమీదే, ఆ ఆలోచన మీదే దెబ్బకొట్టాలి. అంటే భావజాల జాలాన్ని పన్నాలి. బ్రాహ్మణవర్గం అదే చేసింది-

'ఈ వర్ణవ్యవస్థను ఇలా సృష్టించిందే భగవంతుడు. ఇది ఆ దేవుని నిర్ణయం. దైవ నిర్ణయాన్ని కాదనే శక్తీ, హక్కూ ఎవరికీ లేదు. దైవనిర్ణయాన్ని ధిక్కరించడం మహానేరం. పాపం.' అంటూ మనసుల్ని కట్టడిచేసింది. అందులో భాగమే ఇది.....

**'బ్రాహ్మణోஉస్యముఖమాసీత్ బాహూ రాజన్యః కృతః**
**ఊరూతదస్య యద్వైశ్యః, పద్భ్యాం శూద్రో అజాయత'**

**- (శు.యజు:31-11)**

వేలతలలు, వేలకన్నులు, వేలపాదాలున్న విరాట్ పురుషుడు ఈ సృష్టికి మూలం అని చెప్పి-

*(అతని ముఖం నుండి (మేధస్సు) బ్రాహ్మణులు, భుజాల నుండి క్షత్రియులు, తొడల నుండి (వైశ్యులు), పాదాల నుండి శూద్రులు పుట్టారు')*- అని తీర్మానించింది యజుర్వేదం.

కాబట్టి ఎవరి స్థానం వారిదే! ఎవరి గౌరవం వారిదే! ఎవరి వృత్తి వారిదే! ఒకరి అర్హతలు ఒకరికి రావు. - ఇదే రాబోయేకాలంలో కులంగా మారబోయే భారత సామాజికచిత్రానికి పడిన తొలిబీజం. కాబట్టి ఇక్కడి

వర్ణవ్యవస్థలోనే కులం అంతర్లీనంగా కలిసిపోయి ఉంది.

అందుకే...క్రమంగా క్షత్రియుల్ని సైతం బ్రాహ్మణ భావజాలం తమకంటే దిగువకు నెట్టేసింది-

భుజబలం మీద బ్రతికే ఏనుగులాంటి క్షత్రియత్వాన్ని భావజాల బలం అనే ఇనుపగొలుసుతో కట్టిపడేసింది.

**'.. ఏషవో౽ మీ రాజా సోమో౽స్మాకం బ్రాహ్మణానాం రాజా'** **- (శు.యజు:9-40)**

*(ఏ మహారాజ్యానికి ఎవరు రాజైనప్పటికీ.... ఎవరికి ఎవరు రాజైనప్పటికీ... బ్రాహ్మణులకు కాదు. బ్రాహ్మణులకు సోముడు మాత్రమే రాజు!')*-

అంటే.. మా మీద రాజు అధికారం కూడా చెల్లదు అనే దీనర్థం.

ఈ భావజాలంలోని విశేషం ఏమిటంటే ఒకరు మరొకరికంటే శ్రేష్ఠులు, పవిత్రులు. ఈ ఆధిపత్యాన్ని విరాట్ పురుషునిరూపంలో చెప్పడం ఒక అంశం అయితే, ఈ హెచ్చుతగ్గుల్ని అన్నివిషయాల్లో ఇరికించి ఒకటి శ్రేష్ఠం, ఒకటి అధమం అని చెప్పడం మరో అంశం.

అందుకే.. శిల్పం, గృహనిర్మాణం, నగరనిర్మాణం, ఛందస్సు, కవిత్వం, ఆహారపదార్థాలు, వేషధారణలు... ఇలా అన్ని విషయాల్లో కులం తాలూకు కట్టుదిట్టం కనిపిస్తుంది. ఒక ఆహారం సాత్వికం (బ్రాహ్మణం) అని, మరో ఆహారం తామసం(చండాలం) అనే భావజాలం ఇందులో భాగమే. అన్ని వ్యవస్థల్నీ ఈ నిచ్చెనమెట్ల వ్యవస్థతో ముడిపెట్టడమే వైదిక భావజాలం. అందులో భాగంగానే-

రుగ్వేద రుక్కులు గాయత్రి, త్రిష్టుప్, అనుష్టుప్, జగతి ఛందస్సుల్లో ఉంటాయి. వీటిల్లో గాయత్రి ఛందస్సు గొప్పదట! అందుకే..

**'గాయత్రీ పురో౽ను వాక్యా భవతి త్రిష్టుగ్యాజ్యా బ్రహ్మాన్నేవ క్షత్రమన్వారం భయతి తస్మాద్ బ్రాహ్మణో ముఖ్యోముఖ్యో భవతి..''** **-(కృ.యజు: 2-6-2)**

*( 'గాయత్రి బ్రాహ్మణులతో పుట్టింది. త్రిష్టుప్ ఛందస్సు క్షత్రియులతో పుట్టింది')* అన్నారు.

వర్ణాల్లో బ్రాహ్మణ్యం ఎంత పవిత్రమో, ఉన్నతమో ఛందస్సుల్లో గాయత్రి అంత పవిత్రం, ఉన్నతం- అని.

ఈ జబ్బు ఆ తర్వాత అన్నింటికీ పాకింది.

ఉదా॥ జ్యోతిష్యంలోని గ్రహాల్లో కొన్ని బ్రాహ్మణ గ్రహాలు. కొన్ని క్షత్రియ గ్రహాలు. కొన్ని వైశ్యగ్రహాలు.కొన్ని శూద్ర గ్రహాలు.

ఇలా.. అన్నిరకాలుగా దైహిక, సాంస్కృతిక, సామాజిక రంగాల్ని విభజించి పారేసి..ఆ భావజాలాన్ని నింపేశారు.

దీనితో.. మేధస్సును కొందరికే హక్కు భుక్తం చేశారు. ఇలా మేధో పరిధి కుంచించుకు పోవడం వల్ల వైదిక సమాజ విజ్ఞానం వికసించలేక పోయింది.

ఇలా.. భారతీయ విజ్ఞానానికి యజుర్వేదంతో ఆదిలోనే హంసపాదు పడింది.

## నాలుగు వర్ణాలూ సమానమా?

యజుర్వేద కాలానికి సమాజంలో చాలా వృత్తులు వచ్చేశాయి. అవ్వన్నీ దాదాపుగా ఆ తదనంతరం కులాలుగా సంతరించుకున్నాయి.

వేదాల్లో కుమ్మరి (మట్టిపాత్రలు), కమ్మరి (లోహపాత్రలు), వడ్రంగి (చెక్క సామాన్లు)- ఈ ముగ్గురి ప్రస్తావనలు ప్రధానంగా కనిపిస్తాయి. ముఖ్యంగా శుక్లయజుర్వేదంలో 30వ అధ్యాయం పురుషమేధం. ఈ అధ్యాయంలో యజ్ఞశాలలో 11 వరుసలలో పాతిన యూపాలకు (బలిస్థంభాలకు) కట్టిన మనుషుల వివరాలున్నాయి. ఈ యాగంలో మొదటి వరుసకు 48 మందిని, మిగిలిన పది వరసలకు ఒక్కొక్క వరుసకు 11 మంది చొప్పున 10 మందిని, మొత్తం 48+110=158 మందిని కట్టాలి. వీరందరూ ఒక్కొక్క వృత్తికి చెందినవారు. వీరిలో వృత్తులవారున్నారు. ఉద్యోగులూ ఉన్నారు. నపుంసకులు, వ్యభిచారులు ఉన్నారు.

ఒకటి రెండు తప్ప దాదాపు 100కి పైగా వృత్తుల ప్రస్తావన ఉంది.

ఇందులోని (10-15)లో 7వ యూపానికి ఒక దాసుని, ఒక మత్స్యకారుని, ఒక శ్వేతకుష్ఠుని కట్టి , వారి సరసన ఒక చర్మకారుని, మరో చెప్పులు కుట్టేవానినీ కట్టినట్లుంది. అలాగే.. 10-18లో వాయువు అనే స్థంభానికి ఛండాలుని కట్టినట్లుంది. వీరు అంటరాని వారు అనే ప్రస్థావన లేదు.

ఇక్కడ...ఈ విషయం- అనంతరకాలంలో అంటరానివారిగా మార్చబడ్డ చర్మకారులు, ఛండాలుర ప్రస్తావన రావడం ... శూద్రజాతిలోని వారైన వీరిని ఆ తదనంతరం ఛండాలురుగా, అంటరానివారిగా (పంచమునిగా) విభాగించి ఉంటారనడానికి సాక్ష్యంగా కనిపిస్తుంది.

ఇన్ని వృత్తులతో బహు సంక్లిష్టంగా ఉన్న ఆనాటి సమాజంలో ఈ అశేష వృత్తులన్నీ శూద్రులుగా ముద్రవేయడంతోనే భారతీయ విజ్ఞానం తనకు తాను ఉరితీసుకుంది.

ఇక, వైశ్యులకి బ్రాహ్మణ, క్షత్రియులతో సమాన హోదా ఇవ్వలేదు. వేదంలో కొన్నిచోట్ల 'ఆర్య' అనే పదాన్ని వైశ్యులకు ఉపయోగించారు. వీరిని మొదట్లో శూద్రుల సరసనే చేర్చినా, నెమ్మదిగా బ్రాహ్మణ, క్షత్రియుల సరసకు తీసుకు వచ్చారు–

*'మరుత్తులు వైశ్యరూపులు. అన్నం మారుతం. పలావృక్షం బ్రహ్మ. (ఈ యజ్ఞక్రియవల్ల) వైశ్యులను బ్రాహ్మణులందు చేర్చినట్లగును.."–*

ఇలా.. మరికొన్నిచోట్ల యజ్ఞవిధుల్లో వైశ్యులకూ అవకాశం కల్పించారు.

అయితే.. యజ్ఞఫలం అందరికీ (నాలుగు వర్ణాలవారికి) దక్కాలనే విషయం కూడా రెండుచోట్ల ఉంది. అందులో శుక్లయజుర్వేదంలో 18వ అధ్యాయం 40వ యజస్సులో...

**'రుచం నో ధేహి బ్రాహ్మణేషు రుచం రాజసు నస్కృధి**
**రుచం విశ్యేషు శూద్రషు మయి ధేహి రుచా రుచం"**

**–(శు.యజు: 18–40)**

అలాగే..

**యథేమాం వాచం కల్యాణీమావదాని జనేభ్యః**
**బ్రహ్మ రాజ్యాభ్యాం, శూద్రాయచ, ఆర్యాయచ...'**

**(శు.యజు: 26–2)**

పై రెండు యజస్సుల అర్థం ఏమంటే..

*'ఓ అగ్నిదేవా! నేను శుభవాక్కులు పలుకుతున్నాను. అవి బ్రాహ్మణులకు, క్షత్రియులకు, శూద్రులకు, వైశ్యులకు శుభం కూర్చునుగాక"–*

ఇలా...రాజ్యంలోని నాలుగు వర్ణాలవారి శుభం కోరడం ఉంది కాబట్టి శూద్రులకు యజ్ఞార్హత ఉంది. వేదకాల సమాజంలో వర్ణభేదం లేదని చెప్పాలని కొందరి ఉబలాటం. అవును నిజమే! కాదనలేం...

అందరూ క్షేమంగా ఉండాల్సిందే! అశేష శ్రామికవృత్తులవారు (శూద్రులు) క్షేమంగా ఉండాల్సిందే! వారు అలా ఉంటేనే గదా పై వర్గాల ఆధిపత్యం, వినోద విలాసాలు సాగేది!

ఇక్కడ 'శుభం అందరికీ' అనేది ముఖ్యంకాదు. శూద్రులకు యజ్ఞాధికారం గానీ, యజ్ఞనిర్వహణలో ప్రత్యక్షపాత్రగానీ ఉందా! ఉంటుందా? అలాంటి ఆధారం ఎక్కడైనా ఉందా? అనేదే ప్రధానం.

బానిస బ్రతికుంటేనే బానిస యజమానికి లాభం. గొర్రెల్ని, పందుల్ని, పశువుల్ని మేపేది – కోసుకు తినడానికే! యజుర్వేదంలో శూద్రులకు కలగాలని చెప్పిన 'మేలు' కూడా అలాంటిదే!

## వైశ్యులకు వెసులుబాటు

అయితే, వ్యాపారవర్గం పట్ల యజుర్వేదం ఒకచోట చాలా కటువుగానే చెప్పింది–

**'యస్మాయం విశ్వఉ ఆర్యో దాసః శేధిపాఉ అరిః**
**తిరశ్చిత్ ఆర్యే రుశమే పవీరది తభ్యేత్సోఉ అజ్యతే రయిః**

**–(శు.యజు: 33–82)**

*('ఆదిత్యా! నీవు ఆర్యజగత్తుచే సేవించబడే వాడివి! వైశ్యుడు హింసకుడు. శత్రువు. వజ్రం కన్నా కఠిన హృదయుడు. ధనం దాస్తాడు. ఓ ! ఆదిత్యా! అతను దాచిన ధనాన్ని అతనికి చెందకుండా చేయుము. నీవే గ్రహించుము!")*

ఈ వ్యాపారవర్గం ఆర్యజాతి నుండే అవతరించిందా, సింధూనాగరిక వ్యాపార సమాజం నుండి వచ్చిపడిందా! అనేది చర్చనీయాంశమే!

వైశ్యునికి యజుర్వేద కాలం తొలినాళ్ళలో లేని యజ్ఞక్రతువులో అభిషేకం చేసే అర్హత యజుర్వేద తుదికాలానికి వచ్చింది. బహుశ అతనికి వ్యాపారం ద్వారా వచ్చిపడిన విశేష ధనరాశుల వల్ల ఆ అర్హత వచ్చి ఉండొచ్చు.

శుక్లయజుర్వేదం పదో అధ్యాయంలో 17వ యజస్సులో ఇలా ఉంది.

*'రాజుని బంగారుపాత్రలోని జలంతో అభిషేకించాలి. రాజు సోదరుని ఔదంబర పాత్రజలంతో, రాజుమిత్రుని న్యగ్రోధపాత్ర జలంతో, వైశ్యుని రాగిపాత్రజలంతో అభిషేకించాలి*–అని. అంటే చివరికి అశేష శూద్రప్రజలైన సమస్త శ్రామిక వృత్తులవారు కేవలం భౌతికశ్రమకూ, గొడ్డుచాకిరికే మిగిలిపోయారన్నమాట.

దీనితో సమాజంలోని తొంభైశాతం మంది జనం బౌద్ధిక (విజ్ఞాన) పరిధి నుండి వేరుచేయబడ్డారు. ఆర్యభారతానికి ఖగోళపరిజ్ఞానం అబ్బినా, గణిత పరిజ్ఞానం నత్తనడకన సాగినా, సాంకేతిక పరిజ్ఞానం మాత్రం చతికిలపడింది. కనీసం కుంటినడకతో కూడా సాగలేక దేకవలసి వచ్చింది. వర్ణ,కుల వ్యవస్థవల్ల ఇక్కడ.. మానవమేధ అంతా..

యజ్ఞంలో పోసే నూనెలకూ.....
ఆ నూనెలు పోసే గరిటెలకూ....
యజ్ఞవేదిక పేర్చే రాళ్ళకూ....

యజ్ఞంలో బలిచ్చిన పశువుల మాంసాల వంటావార్పు కార్యక్రమాలకే పరిమితమైపోయింది. ఋగ్వేదకాలం తర్వాత యజుర్వేదకాలానికి సాంకేతికశాస్త్రంలో వైదికభారత సమాజం సాధించిన ప్రగతి చాలా చాలా చాలా తక్కువే !

ప్రపంచంలో మనతోపాటు వైజ్ఞానికమార్గంలోకి మళ్ళిన గ్రీకు, చైనా, ఈజిప్టు దేశాల్లో మనకంటే ఖగోళ, గణితశాస్త్రం బాగా అభివృద్ధి చెందింది. కొద్దోగొప్పో సాంకేతిక పురోగతి కనిపిస్తుంది. మనకంటే బాగా వెనుకే వైజ్ఞానిక వర్గంలోకి మళ్ళిన ఐరోపాదేశాల్లో సాంకేతిక వైజ్ఞానిక ప్రగతి పరుగులు తీసింది–

నిజానికి మనం బాధపడవలసిన విషయం ఏమంటే–

ఈ దేశంలోని అశేషజనం కులచట్రంలో పడి కునారిల్లకుండా ఉండి ఉంటే...

ఐరోపాదేశాలకంటే ముందే ఇక్కడ యాంత్రిక (సాంకేతిక) నాగరికత పుట్టి ఉండేది. వైజ్ఞానికశాస్త్ర జన్మభూమిగా నిలిచేది.

ఈనాడు పాశ్చాత్య శాస్త్రవేత్తలు కనిపెట్టిన ప్రతి విషయాన్ని 'మా వేదాల్లో ఉన్నాయి' అని చెప్పుకునే దీనస్థితి పట్టేది కాదు. ఋగ్వేదకాలంలో కనిపించిన వైజ్ఞానిక ప్రగతికి, యజుర్వేదకాలానికే 'వర్ణం' అనే వైరస్ సోకింది. బ్రిటీషువారు వచ్చి ఆధునిక విద్యావిధానాన్ని అందించకపోతే– ఇక్కడ అంబేద్కర్, అబ్దుల్‌కలాంలు పుట్టేవారే కాదు.

**(ఇంకావుంది)**

---

**భావతరంగాలు-2**

# రాహుకాలం, యమగండం – ఎంతనిజం?




జె.ఎన్. దామోదరన్
8008045231


నేను తమిళనాట నివసిస్తున్నంతకాలం, మా తాతయ్య అమ్మమ్మలు, రాహుకాలం, యమగండం వున్న సమయాల్లో ఎక్కడికి వెళ్లటానికైనా నన్ను అనుమతించలేదు. అది చెడుకాలమని వారనుకుంటారు. ఆ వేళల్లో ఏ పనిచేసినా, అది ఫలప్రదం కాదట!

నా పనికోసం, 1972లో నేను హైదరాబాద్ వచ్చాను. అప్పటికే, చాలారోజులక్రితం, మా తాతయ్య చనిపోయాడు. మా అమ్మ 2013 వరకు జీవించే వుంది. ఆమె దగ్గరున్నంత కాలం, ఆమె మనసును గాయపర్చగూడదని, రాహుకాలం యమగండాలను పాటించేవాణ్ణి. కానీ, ఈ రెండు చెడు సమయాలవల్ల నేను ఏ యిబ్బందీ పడలేదు. సోమవారం నుండి ఆదివారం వరకు రాహుకాలం గంటన్నర సేపు ఉంటుంది. అలాగే యమగండం కూడా. ఉదయం 6 గం॥ వరకు ఉండే పగటివేళలో ఈ మూడుగంటల సమయంలో మనం ఏమీ చేయకూడదట! ఒక రోజులో ఇంత సమయాన్ని వదిలేయటం ఎంతవరకు సాధ్యం?

ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవించిన కాలంలో అది సాధ్యమై ఉండవచ్చు. కానీ ఇప్పుడలా కాదు. మనం ఇపుడు వివిధ వృత్తులు, కార్యకలాపాల్లో వుంటున్నాం. ఎన్నో ప్రయాణాలు చేస్తున్నాం. రాహుకాలం, యమగండం అని చెప్పబడే సమయాల్లో కూడా తమతమ వాహనాలను నిలువరించనందకు విమాన చోదకులను, రైల్వేవారిని, బస్సు, టాక్సీ, ఆటో, రిక్షాలాంటి వాహనదారుల్ని అభినందించాలి.

పాతరోజుల్లో మనవాళ్లు ఎడ్లబండ్లమీదనే ప్రయాణించారు. ఇపుడు, మనం కార్లను, ద్విచక్రవాహనాలను కూడా వాడుతున్నాం. సాంప్రదాయిక ఎద్దుల బండి నుంచి మనం ప్రక్కకు తొలగలేదా? సమయానికి గమ్యం చేరుకోలేం గనుక, ఎద్దులబండి ప్రయాణాలను ఆపేశాం. అలాగే, మగవాళ్లు, తమ కార్యస్థలాల్లోని ప్రయాణాల్లోనూ ప్యాంట్, షర్ట్‌లు ధరిస్తున్నారు. పూర్వపు రోజుల్లో వ్యవసాయమే ప్రధానం గనుక, పంచెకట్టు మాత్రమే వుండేది. అలాగే, ప్రతిరోజు గడ్డం గీచుకోవటం లాంటివి లేవు. ఎప్పుడో పండక్కో పున్నానికో అలా జరిగేది. ఇప్పుడు పైన చెప్పినవన్నీ చేస్తున్నాం. సొగసుగా, శుభ్రంగా కనిపించేందుకు ఇష్టపడుతున్నాం. ఇది, మన సంప్రదాయం నుంచి ప్రక్కకు మళ్లటం కాదా?

అదే మాదిరిగా, నేటి జీవనశైలి ప్రకారం, రాహుకాలం యమగండాలను పాటించటం అసాధ్యం. 1972 నుండి వీటిని అనుసరించటం నేను మానివేసాను.

శబ్దం కంటే వేగంగా ప్రయాణించగల వాయు వాహనాలను పాశ్చాత్యులు అభివృద్ధి చేస్తున్నారు. మన ఆలోచనరీతిని మార్చుకోవాల్సిన సమయమిది. ఇండియా కంటే చిన్నదేశాలు కూడా ఎంతో అభివృద్ధిని సాధిస్తున్నాయి. నేపాల్‌లో ఒక చిన్న గుడిసె కూడా కన్పించదు. వాళ్లకు మన మాదిరిగా పరిశ్రమల్లేవు. కానీ, ఇండియాలోని అత్యధిక ప్రజల జీవనప్రమాణాలు చాలా పేదగా వున్నాయి. ప్రపంచంతోపాటు మనమూ కదలాలి.

వేదాలు - విజ్ఞానం : 14

# మందు వెనక్కి – మంత్రం ముందుకి

**యదిమా వాజయన్న హ మోషధీర్వస్త ఽ ఆదేధ్**
**ఆత్మా యక్ష్మస్య నశ్యతి పురా జీవగృభో యధా**

*(శుక్ల యజుర్వేదం: 12–85)*

మంత్రంతో ఔషధాల్ని మంత్రించి అరచేతిలో పెట్టుకుంటే చాలు. మరణశిక్ష పడ్డవాడు చంపకముందే (భయంతో) చచ్చిన విధంగా రోగాలన్నీ నశిస్తాయి.




బొర్రా గోవర్ధన్
సెల్:9390600157


ఋగ్వేదానికీ యజుర్వేదానికీ గట్టిగా మూడు నాలుగువందల సంవత్సరాల కాలాంతరం ఉంది. సాధారణంగా ప్రపంచంలో మానవ నాగరకతా వికాసం వేగంగానో, నెమ్మదిగానో, అతి నెమ్మదిగానో.. చివరికి దేకుకుంటూ అయినా ముందుకే నడిచింది. అంటే పురోగమించింది. కొంతకాలం పురోగమించి, ఆ తర్వాత తిరోగమించిన నాగరకతలూ ఉన్నాయి. అవి నెమ్మదిగా కాలగర్భంలో కలిసిపోయాయి. కానీ, ఆర్యవైదిక నాగరకత మాత్రం వెనకడుగులేసుకుంటూనే ఉన్నా ఇప్పటిదాకా మనగలిగింది! ఇదే వింత! విచిత్రం!

సింధూ ప్రజల వైద్యవిధానం, ఋగ్వేద ఆర్యుల వైద్యవిధానం అదే సమయంలో ప్రపంచంలో వివిధ జాతుల వైద్యవైజ్ఞానిక ప్రగతి గురించి మనం గతంలో 'ఋగ్వేదంలో వైద్యం' అనే వ్యాసంలో చర్చించుకున్నాం.

ఋగ్వేదంలో ఉటంకించిన రోగాలూ, ఔషధాల గురించి చెప్పుకున్నాం.

ఋగ్వేదంలో మందులతోనే రోగాలు నయమవుతాయని ఉంది. ఔషధాల్ని ఉపయోగించిన వైద్యుల వివరాలూ వారిని కీర్తించడాలూ ఉన్నాయి–

కానీ, యజుర్వేదకాలంలో మందులతోపాటు రోగాల్ని నిర్మూలించే శక్తి "మంత్రాలకూ" ఉందని ఆర్యులు నమ్మారు. మంత్రాలతో తీసుకునే మందులు మరింత మరింత మేలు చేస్తాయనే ప్రస్తావనలు అనేక చోట్ల ఉన్నాయి. అంతేకాదు మందులకు బదులు యజ్ఞంలో జంతువుల్ని బలి ఇస్తే రోగాలు నశిస్తాయనే వివరణలు చాలానే ఉన్నాయి.

ఇప్పుడు శుక్ల, కృష్ణయజుర్వేదాల్లోని వైద్యం గురించి చూద్దాం!

## పాలూ – నీరూ

**''శ్వాత్రాః పీతా భవత యూయమాపా ఽ అస్మాకమన్తరుదరే సుశేవాః**
**తా ఽ అక్మభ్య మయాక్ష్మా ఽ అనమీవా ఽ అనాగసః**
**స్వదస్తు దేవీరమృతా ఽ ఋతావృధః**

***(శు. యజు: 4–12)***

*"ఓ! జలమా! మీరు త్వరగా జీర్ణం కాగలరు. మా ఉదరానికి చేరి సుఖాలనిస్తారు. మమ్మల్ని రోగాల నుండి, పాపాల్నుండి కాపాడతారు. మీరు అమృత స్వరూపులు. అలాంటి జలము మాకు దక్కుగాక!"*

ఇది ఆ మంత్రం అర్థం.

శీతల ప్రాంతాల్లోని వారికి, ఆవుపాలు అతిగా తాగేవారికి, అతి మాంసాహారులకి మలబద్ధకం సహజం. మధ్య ఆసియా ప్రాంతాల నుండి వచ్చిన వారిలో ఈ దోషం బాగా ఉంటుంది. బార్లీ, యవలు, వరి,జొన్నల్లాంటివి ఆహారంగా ఎక్కువగా తీసుకోకపోయినా, పీచుపదార్థాలు తక్కువ తీసుకున్నా, నీరు తక్కువ తీసుకున్నా, కూరగాయల వాడకం తక్కువగా ఉన్నా, చేపలు తినకపోయినా మలబద్ధకం వస్తుంది. (వేదాల్లో చేపల ప్రస్తావనలు కనిపించవు)

చాలా రోగాలకి ఆవాసం పొట్టే. మలబద్ధకం కూడా అనేక రోగాలకి కారకం. ఇక్కడ నీటిని 'జీర్ణం'తో పోల్చడం, 'ఉదరానికి సుఖానివ్వడం అనేది' మలబద్ధకాన్ని వదిలించుకోవడమే! ఆర్యులకు ఆహారంతోపాటు అతిగా తాగే సారాయి (సుర) కూడా ఈ రోగానికి మరో కారణం! కాబట్టి 'జలాన్ని' ఔషధంగా భావించి, సేవించడం అనేది ఇక్కడ ప్రత్యేకంగా గమనించాల్సిన విషయం.

ఇక, పాలసేవనం చూద్దాం. ఆర్యులు త్రాగేపాలు ఎక్కువగా ఆవుపాలే! ఆవుపాలలో కొవ్వు తక్కువగా ఉన్నా అవి అతివేడి చేస్తాయి.

గేదెపాలు, మాంసాలు చల్లదనాన్ని, ఆవుపాలు, మాంసాలు వేడిని కలిగిస్తాయని వాగ్భటీయం లాంటి వైద్యగ్రంథాల్లో ఉంది.

అయితే, పాలు అన్నిరకాల పోషకవిలువలుండే

సంపూర్ణ ఆహారం. ముఖ్యంగా పాలలో ఉండే డి1, డి3 అనే ప్రోటీన్లు నాడీకణాల్ని బలపరుస్తాయి. కాబట్టి 'బుద్ధి వికాసానికి' పాలు ఉపకరిస్తాయి.

పాలు మాంసాహారం, శాకాహారం కాదు. ప్రపంచంలోని అతిశాకాహారులు (వేగన్స్) పాలను, పాల ఉత్పత్తులైన వెన్న, నెయ్యి, పెరుగు, మజ్జిగలాంటి ఉత్పత్తులేవీ ముట్టుకోరు.

నిజానికి మాంసాహారంలో ప్రత్యేకంగా ఉండే డి1, డి3 విటమిన్‌లు తినకపోతే నాడీకణాలు బలహీనపడతాయి. బుద్ధి మందగిస్తుంది.

కానీ ఆర్యులు అన్ని మాంసాలతోపాటు, పాలూ, వెన్నా, నెయ్యీ పుష్కలంగా తీసుకున్నారు. ఆ విషయం చెపుతూ– కృష్ణయజుర్వేదంలో...

**ఇమౌ దేవౌ జాయమానౌ జుషన్తమౌ**
**తమాగ్ంసి గుహతా మజుష్టా !**
**అభ్యామింద్రః పక్వమామాస్వన్తః**
**సోమాపుషభ్యాం జనదు ప్రియాసుః!**

**(కృ.యజు: 1–8–22)**

అని ఉంది. అంటే...

"సోమ, పూష దేవతలిద్దర్నీ సమస్త దేవతలూ సేవిస్తారు. వారు బుద్ధిమాంద్యాన్ని తగ్గిస్తారు. ఇంద్రుడు వాళ్ళిద్దరిచేతే ఆవుల్లో పాలను పెంపొందిస్తున్నాడు"–

## కంటిచూపు – క్రతుజిత్తు

అలాగే...మంచి 'చూపుకోసం' కూడా నెయ్యి అవసరం అని కృష్ణయజుర్వేదంలో ఉంది.

**" పనమేదగ్నిః సర్వాదేవతా విష్ణుర్యజ్ఞోఽ గ్నిం...**
**.... మదునాదేకా అస్మై చక్షుః ప్రజనయతి**
**ఘృతే భవతి తేజో వైఘృతం........"**

**(కృ.యజు:2–2–9)**

*"మంచి చూపు కావాలనుకునేవారు అగ్ని, విష్ణు దేవతాకమగు చరుని, నేతితో నిర్వాపం చేయాలి. నెయ్యి ఆవు బీజం. చరులోని ధాన్యం (బియ్యం) ఎద్దు బీజం. ఈ రెండింటి కలయికే దృష్టివృద్ధికి కారణం. నెయ్యి తేజస్సు అవుతుంది. నేత్రం కూడా తేజస్సే అవుతుంది. తేజోరూపమైన నెయ్యి, తేజోరూపమైన నేత్రాన్ని ఇస్తుంది"* ఇదీ పై మంత్రం అర్థం.

ఇందులో 'చరు' అంటే యజ్ఞంలో సమర్పించే పాల అన్నం. నైవేద్యం లేదా సాంబువ్వ. బియ్యాన్ని సన్నగా విసరి, పాలతో ఉడికించి చేసే పాలతాలికల లాంటిది ఇది. ఈ పాలపాయసంలో నెయ్యి గుత్తంగా వేసుకుతినే అలవాటు ఇప్పటికీ ఉంది. ఈ రెండూ తినడం వల్ల దృష్టివృద్ధి కలుగుతుందని ఉంది యజుర్వేదంలో. నిజానికి నేత్రపాటవానికి ఒమేగా–3 లాంటి ఫ్యాటీ ఆసిడ్లు (చేపల్లో ఉంటాయి), జింకు ధాతువు, విటమిన్‌లు, ఆకుపచ్చ కూరగాయలు, ఆకుకూరల్లోని లూటిన్‌లు అవసరం.

ఇక్కడ చెప్పిన చరులోగానీ, నెయ్యిలోగానీ ఈ ధాతుపోషకాలు చాలా తక్కువ. నేతిలో అయితే అసలు లేనే లేవుకూడా. ముఖ్యంగా ఆవుపాలలో విటమిన్–సి, విటమిన్–ఎ, విటమిన్–డి లు అస్సలు ఉండవు. ఆవుపాలలో కంటే గొర్రెపాలలో ఎ, సి విటమిన్లు ఉంటాయి. ఆర్యులు ఆవులతోపాటు గుర్రాల్ని, గొర్రెల్ని కూడా బాగా మేపేవారు. అయితే, యజ్ఞసంభారాలుగా ఆవుపాలకి మాత్రమే పవిత్ర అర్హత కలిగించారు.

మంచిచూపుకి నెయ్యి అనే ప్రక్రియ బహుశా ఇలా పుట్టి ఉండొచ్చు. కాంతివల్లే వస్తువుల్ని చూస్తాం. కాబట్టి నేత్రం అగ్ని నుండి పుట్టింది అనేది వేదరుషుల అభిప్రాయం. ఈ విషయం ఋగ్వేదంలో, యజుర్వేదంలో ఉంది. యజ్ఞగుండంలో అగ్నిని పుట్టించేది నేయి కాబట్టి నేతివల్ల కంటిచూపు తేజోవంతం అవుతుందని ఆర్యులు నమ్మి ఉంటారు.

ఈ నమ్మకం యజ్ఞ సంబంధమే గాని, ధాతు సంబంధం కాదు. అయితే, కృష్ణయజుర్వేదం రెండవకాండలోని ఎనిమిదో అనువాకం మొత్తం నేత్రవైద్యం గురించే. దాన్లో క్రతుజిత్తు అనే నేత్రవైద్యుని (ఐ స్పెషలిస్ట్) ప్రస్తావన ఉంది. మణి కొడుకైన రజనుడు తన దృష్టిదోషాన్ని నివారించుకోడానికి క్రతుజిత్తు దగ్గరికి వస్తాడు. క్రతుజిత్తు మూడురకాల చరుల్ని ముగ్గురు దేవతలకు అర్పిస్తాడు. ఈ అనువాకంలో దేవతల దృష్టికి సూర్యుడు కారణం, మానవుల 'దృష్టి'కి అగ్ని కారణం అని ఉంది. కనురెప్పలు వాల్చడం, తెరవడం అనేది 'దృష్టి' అనిత్యం అని తెల్పుతుంది అంటారు. ఈ మనుషులకు ఈ అనిత్యదృష్టి అగ్ని స్వభావమే. ఎందుకంటే అగ్ని కూడా శిఖలుగా ప్రతిక్షణం రేగి, ఆ శిఖలు అదృశ్యమవుతాయి. మరలా కొత్తశిఖలు పుడతాయి. కాబట్టి అగ్నిశిఖలు అనిత్యాలు. కాబట్టి మానవులదృష్టి కూడా అనిత్యమే అంటుంది ఈ అనువాకం.

**నిజానికి రెప్పలార్పడం అనేది క్షణకాలంపాటు మెదడు తీసుకునే విశ్రాంతి. మెదడులోని జ్ఞానశక్తిపుంజాలు ఆగి ఆగి ప్రసరిస్తాయి. కంప్యూటర్‌లో కూడా ఇలాంటి తరంగాల ప్రయాణమే ఉంటుంది. కంప్యూటర్‌లో లైట్ బ్లింక్ అవుతూ ఉంటుంది మన రెప్పల్లా!**

అయితే, అగ్నిశిఖతో పోల్చడం వాస్తవం కాకపోయినా

అద్భుత వర్ణనే!

ఈ నేత్రవైద్య విషయంలో తీసుకునే 'చరు' ముక్కుకు బలాన్ని ఇస్తుంది. రెండు నేత్రాల్ని నిలబెట్టేది ముక్కు కాబట్టి నేత్రబలం వృద్ధి అవుతుంది! అనేది ఈ అనువాకంలోని అంశం.

## ఔషధాల వర్గీకరణ

ఔషధాల వర్గీకరణ చాలా ప్రాథమికంగా కృష్ణయజుర్వేదంలో కనిపిస్తుంది. ఇలాంటి వివరణ ఇంతకుముందు ఋగ్వేదంలో లేదు.

కృష్ణయజుర్వేదం 4-2-6లో..

"ఓ! ఔషధులారా! మీరు మాకు తల్లులు. నేలతీరుని బట్టి మీరు వంద రకాలు. వేరు తీరుని బట్టి వేయిరకాలు. కాబట్టి మీరు వందక్రతువులతో సమానులు" అంటూ వాటిని ఇలా విభాగించారు-

**"........... శతంవో అంబధామాని సహస్రముత వో రుహః**

**అథా శతక్రత్వో యూయమియం మే అగదం కృత**

**పుష్పావతీః ప్రసూవతీః ఫలినారఫలా ఉత!...."**

***(కృ.యజు:4-2-6)***

*"ఔషధుల్లో కొన్ని పూలు, కొన్ని పండ్లు. కొన్ని పూమొగ్గలు. కొన్ని ఫలపుష్పాలు కానివి (వేర్లు). కొన్ని తీగలు. కొన్ని ఏళ్ళపాటు పూతపూయని, కాయని మొక్కలు"* అని దీనర్థం

ఇందులో ఆరు రకాల విభజన ఉంది:

1. పూలు (ఫ్లవర్ మెడిసిన్స్): ఈ విధానం ఇప్పుడు హిమాలయప్రాంతాల్లో, టిబెట్, చైనా దేశాల్లో ఉంది. ముఖ్యంగా కలువ, తామరపూలను పూర్వకాలంలో మంచి ఔషధాలుగా వాడేవారు. ఇప్పటికీ వారు పూలను ఎండబెట్టుకుని, తేనెలాంటి వాటిలో నానబెట్టుకుని ఔషధాలుగా ఉపయోగిస్తారు)
2. పండ్లు: కరక్కాయ, జాజికాయ, త్రిఫలచూర్ణంలో వాడే తానికాయ, ఉసిరికాయ. వాటిని వైద్యంలో ఫలాలు అంటారు.
3. పూమొగ్గలు: (లవంగం, మిరియం వంటివి)
4. వేర్లు (పసుపు, సొంఠి, ఇతరవేర్లు)
5. తీగలు (తిప్పతీగె, నల్లేరు లాంటి తీగలు)
6. ఫలించని మొక్కలు: (క్రోటన్‌లు, దీర్ఘకాలానికి పుష్పించే ముళ్ళజాతులు, సాగనార, కలబంద లాంటివి)

*(ఇక్కడ బ్రాకెట్లలోని వివరాలు నేను రాసినివి. వేదంలోనివి కావు)*

**అశ్వావతీంగ్ సోమవతీ మూర్జయన్తీ ముదోజసం**

**ఆ విత్సి సర్వా ఓషధీరస్మా అరిష్టతాతయే**

**యాః ఫలినీర్యా అఫలా అపుష్పా యాశ్చ పుష్పిణీః**

**(కృ.యజు:4-2-6)**

*'అశ్వ ఔషధి, సోమ ఔషధి, బల ఔషధి, ఓజో ఔషధి, ఇలా ఔషధుల్ని తెచ్చిపెట్టుకున్నాము. ఈ ఓషధులు రోగాల్నుండి యజమానిని రక్షించును"*

ఇలా ఔషధాల వర్గీకరణ చాలా ప్రాథమికంగా కన్పిస్తుంది. అలాగే... శుక్లయజుర్వేదంలో 12వ అధ్యాయంలో 76 నుండి 101వ మంత్రాలన్నీ ఔషధాలకు సంబంధించిన మంత్రాలే. వీటిలో ఋగ్వేదంలో చెప్పిన విషయాలు చాలా ఎక్కువగానే ఉన్నాయి.

'ఔషధులారా! నా శరీరాన్ని రోగ రహితం చేయండి"

*(శు. యజు: 2-76)*

**'యత్రౌషధీః సమగ్మత రాజానః సమితావివ**

**విప్రఃస ఉ ఉచ్యతే భిషగ్రక్షహామీవ చాతనః"**

***(శు.యజు:2-80)***

అంటే..

"రాజులు విజయం పొందడానికి యుద్ధం చేస్తారు. విప్రులు రోగాల్ని జయించడానికి ఔషధాలు ప్రయోగిస్తారు. అందుకే వారిని "భిషక్కులు" (వైద్యులు) అంటారు".

అలాగే.. శుక్ల యజుర్వేదం 2-83లో

**"ఇష్కృతిర్నామ వో మాతాథో యూయంస్థ నిష్కృతి.."**అని ఉంది. అంటే.. "ఔషధులారా! నిష్కృతి మీకు తల్లి కాబట్టి మీరు 'నిష్కృతులు' అవుతారు. అంటే తీసిపారేసేవారు" అని అర్థం.

**"బృహస్పతి ప్రసూతాస్తా నో ముంచివ్వం హసః**

***(శు.యజు:12-89)***

"ఔషధులారా! మీరు బృహస్పతి వల్ల సృష్టించబడ్డారు".

ఇంకా- ఇలా ఉంది.

**"ముచ్నిన్తు మా శపథ్యాదథో వరుణ్యాదుత**

**అథో యమస్య పడ్విశాత్సర్వస్మాద్ దేవకిల్బిషాత్**

***(శు.యజు:12-90)***

"ఆడినమాట తప్పడం వల్ల కలిగిన పాపఫలం వల్ల వచ్చే వ్యాధుల్నుండి, వరుణుని వల్ల కలిగే వ్యాధులనుండి, యముని సంబంధమైన క్షయరోగం నుండి, ఓ! ఔషధులారా! నన్ను రక్షించండి!"

ఇక, ఇది చూడండి- ఆకాశం నుండి జలం ద్వారా భూలోకానికి వచ్చిన ఔషధులు ఇలా అనుకుంటున్నాయి-

**"అవపతన్తీరవదనేదిన ఉ ఓషధయస్పరి**

**యం జీవమశ్నవామహై న స రిష్యాతి పురుషః**

***(శు.యజు:12-91)***

"ఏ జీవి వంట్లో మనం ఉంటామో, ఆ జీవికి చావులేదు"-

రోగం గురించి ఒక మంచి వివరణ ఇదే అనువాకంలో ఉంది. "ఆకలి ఒక రోగం. దానికి మందు ఆహారం. అలాగే రోగానికి

ఆహారం ఔషధం". అని ఉంది.

## మందు - మంత్రం

ఇక, మొత్తం ఋగ్వేద వైద్యవిజ్ఞానానికి ముందడుగు పడకుండా మోకాళ్ళ వరకు నరికిన విధానం, 'మంత్ర' తంత్రాల మాయాజాలంలోకి వైద్యాన్ని వదనెట్టేసిన విధానం యజుర్వేదంలో ఎలా మొదలైందో చూద్దాం!

శుక్లయజుర్వేదంలోని ఇలాంటి ఒక మంత్రంతోనే ఈ వ్యాసం ప్రారంభించాం. ఇక కృష్ణయజుర్వేదంలోని మంత్రాలు కొన్ని చూద్దాం!

**"న్వాచం దధాతి ప్రవదితా వాచో భవత్యపన్నదతీ భవతి తస్మాన్మనుష్యాః సార్వాం వాచం వదంత్యాగ్నేయం కృష్ణగ్రీవమా లభేత సౌమ్యంబభ్రుం జ్యోగామయావ్యగ్నిం....."** **(కృ.యజు:2-1-2)**

*"దీర్ఘరోగం కలవాడు అగ్ని సంబంధి అయిన నల్లని మెడగల మేకను, సోమసంబంధి అయిన గోధుమరంగు ఉన్న మేకను యజ్ఞంలో వధించాలి. అలాచేస్తే ఆ రోగి దేహం అగ్ని నుండి తేజాన్ని, సోముని నుండి రసాన్ని పొందుతుంది. ప్రాణాలు పోయేదశలో ఉన్నవాడు కూడా బ్రతికి లేస్తాడు"*

అలాగే...

సంతానంకోసం కూడా పైవిధంగా అలాంటి పశువుల్నే బలి ఇవ్వాలి. అలా చేస్తే సోముడు యజ్ఞయజమానికి రేతస్సు (వీర్యం)ను నిలుపుతాడు. అగ్ని సంతానాన్ని కలిగిస్తాడు-

యజ్ఞప్రక్రియల వల్ల ఫలం దక్కుతుందో, లేదో గానీ, మేకమాంసం, మేకపాలు మాత్రం అన్నింటికంటే మేలు.

ఇక్కడ యజ్ఞ బలిగా వధించబడిన జంతువుల మాంసాల్ని వారే తింటారు. కాబట్టి ఏమైనా మేలు జరిగితే మాంసంవల్లే మేలు జరుగుతుందిగానీ, యజ్ఞంవల్లా కాదు. మంత్రం వల్లా కాదు. ఐతే **మందుతో పాటు మంత్రాన్ని జతచేయడం వల్ల ఇక్కడ విశాలంగా విస్తరించాల్సిన వైద్య విజ్ఞానం మతం పరిధిలోకి వెళ్ళిపోయింది. మరుగుజ్జుగానే మిగిలి పోయింది.**

పై మంత్రం విషయాన్నే చూద్దాం!

"మేకమాంసమంత మేలు-కోడిమాంసమంత కీడు" లేదంటారు. నిజమే....!

ఒక ఆయుర్వేద డాక్టర్ నాతో ఇలా చెప్పాడు...

నా శరీరం మీద అక్కడక్కడ నాలుగైదు చోట్ల బఠానీ గింజంత తెల్లమచ్చలు వచ్చాయి. అవి బొల్లి (శ్వేతకుష్ఠు) మచ్చలు. డా॥ శ్రీనివాస్ అనే బాపట్ల ఆయుర్వేద డాక్టర్ హేతువాది, నాస్తికుడు, మానవవాది. ఆయన నాతో రెండు నెలలపాటు మేకమాంసం (గొర్రెమాంసం కాదు) తినమన్నాడు. నిమ్మరసం ఎప్పుడూ వాడొద్దన్నాడు. నేను నానాతంటాలు పడి తిన్నాను. పదేళ్ళుగా ఉన్న మచ్చలు పోయాయి. ఇప్పటికి పదిహేనేళ్ళయ్యింది. ఇంతవరకు కన్పించలేదు.

జీవితకాలంలో జిల్లేడు ఆకు తినకుండా పెంచగలిగిన మేకపాలు ఒక యంబిబియస్ డాక్టర్‌తో సమానం అని చెప్తాడు-డా.శ్రీనివాస్ గారు.

## దీర్ఘ వ్యాధులు

యక్ష్మ (క్షయ), రాజయక్ష, కుష్ఠు, శ్వేతకుష్ఠులు ఆర్యుల్లో సర్వసాధారణంగా కనిపించే వ్యాధులు. ఇవన్నీ దీర్ఘరోగాలు-

అలాగే.. ఇదే కాండలో ఇదే ప్రపాఠకంలో కుష్ఠువ్యాధికి సంబంధించిన విషయం ఉంది. 'నల్లని పశువు (మేక లేక పంది) ను బలివ్వడం వల్ల చర్మరోగం తగ్గింది' అని ఉంది.

బౌద్ధంలోని వినయపిటకంలో కూడా ఒక సంఘటన ఉంది. ఒక భిక్షువుకి చర్మం చెడిపోయే (కుష్ఠు)రోగం వస్తే అతను పంది పచ్చిమాంసం, పచ్చిరక్తం త్రాగుతాడు. రోగం నయమవుతుంది.

అంటే... కుష్ఠువ్యాధికి మేక, పందిమాంసాలు ఆర్యులు ఔషధాలుగా ఉపయోగించి ఉంటారు.

అలాగే.. మరో ఉదంతం..

'కొందరికి రోగలక్షణాలు పైకి కన్పించవు. కానీ రోగపీడితుల్లా క్షీణించిపోతుంటారు. ఇలాంటి లక్షణాలు వైద్యునికి తెలియకపోయినా 'ప్రజాపతికి' తెలుసు. కాబట్టి యజ్ఞంలో "కొమ్ములు లేని కోడెదూడను" బలివ్వాలి' అంటుంది కృష్ణయజుర్వేదం.

అలాగే యజ్ఞంలో చరును (నేతి పాయసాన్నం) నిర్వాపం చేస్తే చర్మరోగాలూ పోతాయి, సంతానమూ కలుగుతుంది అని కృష్ణయజుర్వేదం 2-2-10లో ఉంది.

**"భేషజమే వా ఉ స్మి కరోతి యది బిభీయాద్దుశ్చర్మా భవిష్యామీతి**

**సోమాపౌష్టం చరుం నిర్వపేథ్సౌమ్యో ..... వై దేవతయా పురుషః**

**పౌష్ణః....పశుభిస్త్వంచం కరోతి న దుశ్చర్మా భవతి"**

***(కృ.యజు:2-2-10)***

## చలిజ్వరం

జ్వర లక్షణం వేడి. కానీ, జ్వరం ఉన్నప్పటికీ శరీరం చలితో గజగజవణికి పోతుంది. దీన్ని చలిజ్వరం అంటాం. మలేరియా జ్వరం. ఇది ఉష్ణమండలప్రాంతంలో వచ్చే జ్వరం. యజుర్వేదకాలానికి ఆర్యులు గంగామైదానంలో స్థిరపడ్డారు.

కాబట్టి ఋగ్వేదంలో కనిపించని కొత్తజ్వరం (చలిజ్వరం) యజుర్వేదంలో కనిపిస్తుంది. అది వృత్రుని కథలో కనిపిస్తుంది.

వృత్రుని కథ ఋగ్వేదంలో ఉంది. అదే కథ ఇక్కడా ఉంది.

**"............... స ఇంద్ర ఆత్మనః శీతరూరావజనయత్త ఛ్చీతరూరయోర్జన్మ య యేవంగ్ శీతరూరయోర్జన్మ వేద......"** (కృ.యజు:2-5-2)

*"ఓ ఇంద్రా! మేము వృత్రుని నోటిలో ఉన్నాం.అతని దంతాల క్రింద నలుగుతున్నాం" అంటూ పిలుస్తారు ఇంద్రుణ్ణి అగ్నీ, సోములు.*

*అప్పుడు ఇంద్రుడు ముందు చలిని, తర్వాత వేడిని పుట్టించాడు. ఈ రెంటినీ కలిపి వృత్రుని పైకి సంధించాడు. వృత్రునిలో శీతతాపం (చలిజ్వరం) పుట్టింది. వృత్రుడు వణికాడు. ఆ వణుకువల్ల వృత్రుని దవడలు వణికాయి. అప్పుడు అగ్నిసోములు బైటపడ్డారు. తర్వాత వృత్రుడు మరణించాడు-"* అని ఈ మంత్రార్థం.

చలిజ్వరం ఉష్ణ మండల వ్యాధి. ముఖ్యంగా భారత దేశ వ్యాధి. అందునా దక్షిణ భారత దేశ వ్యాధి. ఈ వ్యాధిని ఆర్యులు ముందుగా దస్యుల్లో చూశారు. అందుకే వృత్రునికి ఈ వ్యాధిని సోకించారు. ఈ వ్యాధికి తమ ఇంద్రుడే కారణమని చెప్పుకున్నారు. యజుర్వేదాన్ని బట్టి వృత్ర హంతకి మలేరియా జ్వరమే. ప్రపంచాన్ని జయించిన అలెగ్జాండర్ చివరికి భారతదేశానికి వచ్చాక ఇక్కడ మలేరియాసోకి, మార్గమధ్యంలోనే మరణించాడంటారు.

"ఆవువ్యాసం లాగా... తిరిగి తిరిగి ఏది చెప్పినా ఆవు" దగ్గరకే వచ్చినట్లు-

యజుర్వేద ఆర్యులు ఏలక్షణాన్నైనా యజ్ఞక్రతువుల్లోంచే చూశారు. వారికి మందులు కంటే మంత్రాలే ప్రధానం అయ్యాయి.

అంటే... వైద్యం కూడా యజుర్వేద కాలానికి మంత్రోచ్చారణ చేస్తూ యజ్ఞవేదిక చుట్టూ తిరిగింది. యాగమంత్రాలనే యూపానికి కట్టి వేయబడింది. బలికాబడింది.

**ఋగ్వేదవైద్యానికి మంత్రాల ముసుగు తగిలించింది యజుర్వేదం.**

అనంతర కాలంలో వచ్చిన చేతబడులు, మంత్రించిన తాయెత్తులు, మంత్ర జల ఔషధాలూ.. మరీముఖ్యంగా మానసిక రోగులకి చేసే భూతవైద్యానికి పునాదులు యజుర్వేదంలోనే పడ్డాయని అర్థమవుతోంది !

## బౌద్ధం - వైద్యం

అయితే- వైదిక సంప్రదాయం కేవలం మంత్రాలకే పరిమితం కాక, ఔషధాలతోపాటు మంత్రం కలగలిపి అటు తిరోగమన, పురోగమన మార్గాల్ని ఏకకాలంలో సాగించింది. అందుకే వైదికయుగం అనంతరం స్తబ్దంగా ఉండిపోయిన వైద్యవిధానం తిరిగి బౌద్ధులతోనే పురోగమనదిశ పట్టింది.

తొలిసారి వైద్యాన్ని, వైద్యవిధానాన్ని, ఔషధాల తయారీని వ్యవస్థాగతం చేసింది బౌద్ధమే. బౌద్ధంలోని **వినయపిటకంలోని ఏడోదైన భైషజ్యస్కంధం, ఎనిమిదోదైన చీవరస్కంధాలు రెండూ వైద్యశాస్త్ర తొలిగ్రంథాలు. జబ్బులూ, వాటి విభజనలూ, వాటికి వాడవలసిన 18 రకాల చికిత్సా విధానాలూ ఆ స్కంధాలలో ఉన్నాయి.**

ఈ 18 రకాల పద్ధతుల్లో 'మంత్రం' మాత్రం లేదు. మంత్రాల కుతంత్రాల్ని ఛేదించింది బౌద్ధం.

బుద్ధుని తర్వాత 400 సంవత్సరాలకి అథర్వణవేదం వచ్చింది. అథర్వణవేదంలో గానీ, ఆ తర్వాత వచ్చిన చరకుని చరకసంహితలోగానీ, సుశ్రుతుని సుశ్రుతసంహితలోగానీ ఉన్న చికిత్సా విధాలన్నింటికీ మూలం బౌద్ధుల భైషజ్య స్కంధమే. బుద్ధునికి తాత్త్వికదృక్పథంతోపాటు మంచి వైద్యపరిజ్ఞానం ఉంది. అందుకే ఆయన్ని "భైషజ్య గురువు" అంటారు.

ఇక, ఆయుర్వేదంగా మారిన వైదిక వైద్యం గుప్తులకాలంలో కులపరిజ్ఞానంగా మారింది. భైషజ్యులు అంటే (వైద్యులు) పురోహితులు, బ్రాహ్మణులు మాత్రమే అనే కులీకరణ జరిగింది. బౌద్ధుల్లో అగ్రగణ్య వైద్యుడైన జీవకుడు ప్రవేశపెట్టిన శస్త్రచికిత్సలు.. బ్రాహ్మణులు అందిపుచ్చుకోలేదు. అవిమాత్రం మంగలి, మాల, మాదిగ కులాల వారికే పరిమితమైపోయాయి- అంటరానితనం ముదిరిపోయాక వారి దగ్గర కూడా అవి పురోగతి చెందలేక పోయాయి.

బౌద్ధ సంప్రదాయి అయిన సుశ్రుతుడు మాత్రమే తిరిగి జీవకుని శస్త్రచికిత్స విధానాల్ని అంది పుచ్చుకున్నా, ఆ తర్వాత వాటిని అభివృద్ధి పరచినవారు లేకపోయారు. చివరికి భారతీయ వైద్యుడు అంటే వైదిక పురోహితుడే అయ్యాడు. యజుర్వేదం ప్రసాదించిన 'మంత్రానికీ, మందులకూ... రెండింటికీ వారసుడయ్యాడు.

ఆధునిక కాలం వరకూ 'ఎక్కడ వేసిన గొంగలి అక్కడే' ఉండిపోయింది.

తాతల మూతులు వాసనలు చూస్తూ, గప్పాలుకొట్టుకుంటూ బతికే మానసికరోగం కొందరిలో ఇంకా నయంకాని రోగంగానే మిగిలిపోయింది. ***(ఇంకావుంది)***

# ఆదిలోనే హంసపాదు

**కోదదర్శ ప్రథమం జాయమానమస్థన్వన్తం యదనస్థా బిభర్తి**
**భూమ్యా అసురసృగాత్మా క్వ స్విన్ కో విద్వాంసముపగాత్ ప్రష్టుమేతత్ !**

"మొట్టమొదటిగా జన్మించినవానిని ఎవడు చూశారు? ఎముకలు లేనివి, ఎముకలు కలిగినవి ఎప్పుడు పుట్టాయి? ఎప్పుడు భూమి నుండి రక్తం, ప్రాణం పుట్టాయి? ఆత్మలు ఎక్కడి నుండి ఉద్భవిస్తున్నాయి?'

**(ఋ: 1-164-4)**

## అతిపెద్ద ప్రశ్న

తాను పుట్టడం, తన చుట్టూ ఉన్న జీవజాతులన్నింటికీ సంతానం కలగడం, మొక్కల విత్తనాల నుండి మొలకలు రావడం- మానవుడు నిత్యం చూసే సంఘటనలే!



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

సంతానం కలగనివారినీ, ప్రసవిస్తూ ప్రాణం వదిలే వాటినీ చూస్తూనే ఉంటాడు.

1. తల్లిగర్భంలో ఊపిరందని మాయసంచిలో పిండం ఎలా బ్రతుకుతుంది? ఆ పిండాన్ని అలా బ్రతికించేది ఎవరు?-
2. విత్తనంలో మొక్క ఎక్కడ దాగి ఉంది? ఆ మొక్కను కన్పించకుండా అక్కడ దాచిందెవరు?

ఈ రెండు ప్రశ్నలూ ఈనాడు చాలామందికి చాలా చాలా తేలిక ప్రశ్నలుగా కన్పించవచ్చు. కానీ, ఆదిమానవుని పరిజ్ఞానానికి అంతుచిక్కని ప్రశ్నలే? అవి ఎంత కఠినమైన ప్రశ్నలంటే.. ఈనాటికీ ప్రపంచ మానవాళిలో మూడొంతుల మందికి ఇంకా 'అంతు దొరకని' ప్రశ్నలుగానే మిగిలి ఉన్నాయి-

ఈ రెండింటి సమాధానం కోసం మానవ మస్తిష్కం వెదికే క్రమంలో వీటికి సరైన సమాధానం దొరక్కపోగా, వీటికి మించిన ప్రశ్న మరొకటి ఎదురైంది. అదేమిటంటే..

మనం పుడతాం, బ్రతుకుతాం, పెరుగుతాం, ముసలివాళ్ళమవుతాం, చనిపోతాం గదా. ఈ దశలన్నీ భౌతిక ప్రపంచానికి చెందినవే. ప్రత్యక్షంగా చూడగలిగినవే! మరి... చనిపోయాక ఏమవుతాం? అనేదే ఎదురైన అతిపెద్ద ప్రశ్న.

ఈ ప్రశ్నే కనుక మనిషిలో ఉదయించకపోతే... ఇప్పటి వరకూ వచ్చిన సమస్త విజ్ఞానం, సర్వ తాత్త్విక దృక్పథాల్లో ఏ ఒక్కటీ మొలకెత్తేదే కాదు.

"లేచామా? తిన్నామా? తొంగున్నామా?"- ఈ పరిధిలోనే మానవసమాజం పడి తిరుగుతూ ఉండేది?

'చనిపోయాక ఏమవుతాం?' అనే ప్రశ్నలోనే 'మనం ఎక్కడి నుండి తల్లిగర్భంలోకి వస్తున్నాం?' అనే ప్రశ్నకూడా అంతర్లీనంగా ఉంది.

ఆదిమ సమాజాల్లో స్త్రీపురుషుల కలయిక సర్వసాధారణం. నిత్యకృత్యం. అదేదో ఒక ప్రత్యేక నైతిక విషయం కాదు. ఆహారం,నిద్రల్లాగా అతి సాధారణ అంశంగానే ఉండేది. స్త్రీ పురుషుల కలయిక వల్లే సంతానం కలుగుతుంది అనే విషయాన్ని వారు గుర్తించేలోపే....ఆదిమ మానవుల ఆలోచనలు ఎక్కడెక్కడికో వెళ్ళిపోయాయి. ప్రకృతి నుండి, ప్రకృతిశక్తులలోకి, అక్కడి నుండి అతీత లోకాలను చుట్టి వచ్చేశాయి. ఇప్పటికీ ఈ లోకాల చుట్టూ తిరుగు తున్న వారు ఎందరెందరో?

మనిషికి నాగరకత పెరిగినకొద్దీ... వస్తు ఉత్పత్తులూ పెరిగిపోయాయి. మనిషి ముడిసరుకులనుండి కొత్తకొత్త వస్తువులు తయారు చేవయడం నేర్చాక ..... కుర్చీని తయారు చేసినవాడు ఒకడు ఉన్నట్టే.. 'ఈ సృష్టిని తయారు చేసేవాడు' ఒకడు ఉండాలి గదా!' అనే ఆలోచన బయలుదేరింది. బలపడింది.

కార్యం జరగాలంటే 'కర్త' ఉండాలి అనే భావనే ఈ సృష్టికార్యానికి ఒక 'సృష్టికర్త ఉన్నాడు' అనే భావాన్ని పెంపొందించింది. 'సృష్టికర్త' అనే వాడు కూడా నాగరిక సమాజ ఆవిష్కరణల్లో ఒక ఆవిష్కరణే. అయితే అది భౌతిక ఆవిష్కరణ కాదు. 'భావ' ఆవిష్కరణ.

అందుకే ఈ వ్యాసం మొదట్లో ఉన్న ఋగ్వేద ఋక్కులో ఋగ్వేద ఆర్యుల ప్రశ్నల పరంపర...

'ఎవరు చూశారు మొదట పుట్టినవానిని?' అని.

ఈ ప్రశ్నకు సమాధానం నిన్న మొన్నటి పోతనకూ చిక్కలేదు...అందుకే..

"ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపల నుండు ...... ఆదిమధ్యలయుడెవ్వడు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

ఋగ్వేద ఋక్కులోని ఈ ప్రశ్న సృష్టికర్త గురించే అయినా, అతను 'మానవేతరుడు కాదు' అనే విషయం కూడా అందులో ఉంది. అలాగే, ఎముకలు, రక్తం, ప్రాణం అనేవి భూమినుండి జనించిన భూసారాలే అనే భావన కూడా ఆ ఋక్కులో ధ్వనిస్తోంది. అంతేకాదు... శరీరాన్ని నడిపించే 'ఆత్మ' ఎక్కడి నుండి పుట్టుకొస్తుందనే ప్రశ్నకూడా ప్రస్ఫుటంగా కన్పిస్తోంది.

మనం, గుర్తుపెట్టుకోవాల్సిన విషయం ఏమంటే... ఋగ్వేద ఆర్యులకి ఆత్మభావన ఉంది. మరణానంతరం అది స్వర్గానికి పోతుంది. కానీ, తిరిగిరాదు.అంటే..తిరిగి పుట్టదు. మరి ఈ ఆత్మ ఎలా పుడుతుంది? అనేదానికి వారికి తట్టిన కారణం ఇది: వర్షం నుండి, వనస్పతుల్నుండి, పంటధాన్యాన్నుండి, ఔషధాల నుండి ఆహారంగా శరీరంలోకి ప్రవేశిస్తుంది' అనేది ఋగ్వేద ఆర్యుల ఆత్మభావన?

మొత్తంమీద ఋగ్వేదంలో కనిపించిన సృష్టికి సంబంధించిన మొట్టమొదటి అంశం ఇది.

## కొత్త సినిమా

అనేక కారణాల వల్ల కార్యం జరుగుతుందనే విషయాన్ని కాకుండా కార్యానికి మూలం 'కర్తే' అనే నిర్ణయానికి ఋగ్వేద ఆర్యులు వచ్చారు. ఈ భావనే ఆ తర్వాత 'సృష్టికర్త', 'భగవంతుడు', 'దేవుడు' అనే అభౌతికశక్తి పుట్టుకకు కారణమైంది.

ఆదిలో మానవులు వేసుకున్న ప్రశ్న మంచిదే, సమాధానం కోసం జరిపిన ప్రయత్నమూ మంచిదే, కానీ 'కర్త సృష్టికి కారణం' అనే తప్పుడు సమాధానమే దారి తప్పించింది.

ఋగ్వేదం నిండా కనిపించే ఇంద్రుడు, అగ్ని, వరుణుడు, అశ్వినీ దేవతలు మొదలైన ప్రకృతిశక్తుల స్థానాన్ని ఈ 'సృష్టికర్త' నెమ్మదిగా తొలగించి, ఆ స్థానాంలో తన చోటు పదిలం చేసుకున్నాడు. ఈ స్థానంలో కూడా మొదటిలో విశ్వకర్మ, ప్రజాపతి, ఈశ్వరుడు లాంటివాళ్ళు ఉన్నప్పటికీ, తర్వాత...తర్వాత ఆ స్థానాన్ని విష్ణువు స్వాధీనం చేసుకున్నాడు.

'విష్ణువు' అంటే విశ్వమంతా వ్యాపించి ఉన్నవాడు అని. ఋగ్వేదంలో ఇంద్రుని ఆధీనంలో ఉండే విష్ణువు యజుర్వేదకాలానికి కాస్త స్వతంత్రించాడు. వేదకాలానంతరం ఇంద్రునికే ప్రభువయ్యాడు. విష్ణువుని గొప్పగా చిత్రించడం కోసం ఇంద్రుణ్ణి వెధవను చేశారు. అలా 'విష్ణువే సర్వం', 'విష్ణువే నారాయణుడు', 'విష్ణువే సృష్టికర్త'– అతనే విరాట్ పురుషుడు, అతని నుండే సర్వం పుట్టుకొచ్చింది అనే భావన బలపడి పోయింది.

ఇలా...

ఋగ్వేద ఆర్యుల తెలిసీతెలియక చేసిన 'తప్పుని', తెలిసి తెలిసి ఒప్పుగా ఒప్పించడానికి గట్టి ప్రయత్నం చేశారు యజుర్వేద ఆర్యులు. సృష్టికర్తను విరాట్‌రూపంగా తొలుత భావించినవారు యజుర్వేద ఆర్యులే. కానీ ఈ విరాట్ రూపం విష్ణువే అని యజుర్వేదంలో లేదు. విష్ణువుకి ఈ హోదా కల్పించడానికి ఆ తర్వాత వెయ్యేళ్ళు పట్టింది. ఈ పనిని భగవద్గీత చేసింది. " విష్ణువే విరాట్" అనే సినిమా ఇటీవలదే.

## పేదల లోకం – పెద్దల లోకం

నిజానికి ఋగ్వేద దశమ మండలంలో ఉన్న పురుషసూక్తం, ప్రక్షిప్తం అనేది చాలామంది అభిప్రాయం. ఆ తర్వాత చేర్చారనేది నిర్వివాదాంశం. ఆ సూక్తంలోని భావాలు యజుర్వేద ఆర్యుల భావాలకు చక్కగా సరిపోతాయి–

యజుర్వేదంలో కూడా 'ఈ సృష్టికి ప్రారంభం ఏది?' అనే విషయం మీద ఖచ్చితమైన అభిప్రాయం లేదు. రెండుమూడు రకాలుగా ఉంది. సృష్టిలో 'భూలోకం' ఒక్కటే కాదని, భూమితోపాటు ద్యులోకం, అంతరిక్షం అనే మరో రెండులోకాలు ఉన్నాయనేది వేదరుషుల భావన.

లోకాల పరిమాణాల గురించి కృష్ణ యజుర్వేదంలో ఇలా ఉంది:

> **"........ త్రయః పురోడాశా భవన్తి త్రయ ఇమేలోకా ఏషాం లోకానామాప్త్యా ఉత్తర ఉత్తరో జ్యాయాన్**
>
> **భవత్యేవమివ హీమే లోకాః సమృద్ధ్యై...."**

(కృ.యజు: 2–3–6)

"భూలోకం కంటే అంతరిక్షం పెద్దది. అంతరిక్షం కంటే ద్యులోకం పెద్దది' అని. ఇది అంత గొప్ప ఆవిష్కరణేం కాదు. మనం నేలమీద నుండి చూస్తుంటే ఆకాశం విశాలంగా కన్పిస్తుంది. దీన్ని కోణీయదూరం అంటాం. దూరం పెరిగిన కొద్దీ రెండుకోణాల మధ్యదూరం పెరిగిపోతూ ఉంటుంది. ఇది ఒక ప్రత్యక్ష అనుభవం. ఈ అనుభవంలోంచే

భూలోకం కంటే స్వర్గం (ద్యులోకం) పెద్దదని వేదం చెప్పింది. నిజమే! ఎందుకు నిజమో! ఈ పిట్ట కథ కూడా చూద్దాం...!

అక్బర్ ఒకరోజు బీర్బల్‌ని అడిగాడు– "బీర్బల్! నరకం పెద్దదా? స్వర్గం పెద్దదా?" అని

"స్వర్గమే పెద్దది" అన్నాడు బీర్బల్.
"ఎలా చెప్పగలవు?" అడిగాడు అక్బర్.

"ఈ ప్రపంచంలో ధనికుల కంటే పేదలే ఎక్కువ కాబట్టి" అన్నాడు బీర్బల్. అక్బర్ అవాక్కయి నోరు తెరిచాడు. శ్రమదోపిడి చేసిన మోసగాళ్ళే ధనవంతులవుతారని.వారే పాపులని చెప్పడం ఇక్కడ బీర్బల్ ఉద్దేశం.

పిట్టకథ నుండి అసలు కథకొద్దాం!

బ్రాహ్మణ క్షత్రియుల కంటే శూద్రులే ఎక్కువ కాబట్టి స్వర్గం పెద్దది అనే ఉద్దేశ్యంతో యజుర్వేదం ఈ విషయాన్ని చెప్పలేదు.. అది దేవలోకం కాబట్టి విశాలమైంది అని చెప్పింది. యజుర్వేద ఆర్యులు ఈ సృష్టికర్త భూమితోపాటు, భూమ్మీద జీవరాశితోపాటు, ఈ లోకాల్ని, గ్రహ, నక్షత్రాల్ని, సూర్యచంద్రుల్ని సృష్టించాడని నమ్మారు.

## కలప తో విశ్వకర్మ

మరి, ఒక కర్త ఈ మూడులోకాల్ని సృష్టిస్తే ఆ సృష్టికర్త ఈ మూడులోకాలకి 'వేరు'గా ఉండాలి గదా! అంటే వేరేచోట ఉండి వీటిని సృష్టించాలి గదా! ఈ అనుమానమే యజుర్వేదంలో కన్పిస్తుంది– అంతేకాదు, ఆనాటి నాగరకతలో– రాతి పరికరాల స్థానంలో 'చెక్క' పరికరాలు ఆక్రమించాయి. నైపుణ్యం గల వస్తువుల్ని చెక్కద్వారానే తయారు చేసుకోవచ్చు. గృహాలు, గృహోపకరణాలు, విల్లు లాంటి ఆయుధాలు, రథాలు, రథచక్రాలు అన్నీ చెక్కను ఉపయోగించడం వల్లే వేగవంతం అయ్యాయి. వస్తు ఉత్పత్తికి 'కలప' ప్రధాన వనరుగా నిలిచింది. నాగరికతా వికాసానికి కలప మలి గడపగా నిలిచింది.

కలప లభించే స్థానం అరణ్యం. కాబట్టి ఈ లోకాల్ని ఏ కలపతో నిర్మించాడు అంటూ–

**క్వింస్విద్వనంఽ ఉ స వృక్ష ఽ ఆస యతో ద్యావా ప్రథివీ నిష్టతక్షుః**

**మనీషిణో మనసాపృచ్ఛతేదు తద్యదధ్యతిష్ఠద్ భువనాని ధారయన్ (యజు:17–20)**

అంటే...

*"విశ్వకర్మ భూమినీ, ద్యులోకాన్ని నిర్మించడానికి ఉపయోగపడ్డ అడవి ఏది? ఉపయోగించిన వృక్షం ఏది? ఈ లోకాల్ని సృష్టించిన వాడు (విశ్వకర్మ) ఎక్కడ నిలబడి ఈ కార్యం చేశాడు?"–*

ఈ మంత్రం ఈ విశ్వనిర్మాత 'విశ్వకర్మ' అని చెప్తుంది? అతను ఈ సృష్టిచేసే సమయంలో ఎక్కడ నిలబడ్డాడు? అని కూడా ప్రశ్నిస్తుంది.

విశ్వకర్మను గురించి మరలా ఇలా చెప్తుంది–

**"విశ్వకర్మా హ్యజనిష్ట దేవఽ అదిద్ గంధర్వోఽ అభవద్ ద్వితీయః**

**తృతీయః పితా జనితౌషధీనామపాం గర్భం వ్యదధాత్పురుత్రా"**

**– (శుక్ల యజు:17–32)**

అంటే...

'ఈ విశ్వంలో మొట్టమొదటిగా విశ్వకర్మ ఆవిర్భవించాడు. ఆ తర్వాత రెండవవారుగా గంధర్వులు మూడోవారిగా ఔషధాల పోషకుడైన పర్జన్యుడు పుట్టాడు. అనేక జలాల్ని ఆ పర్జన్యుడు తన గర్భంలో దాచుకున్నాడు" అని.

దాన్ని బట్టి సృష్టిక్రమం ఇది:

మొదటిగా పుట్టింది: విశ్వకర్మ
ఆ తర్వాత పుట్టింది: గంధర్వులు
ఆ తర్వాత పుట్టింది: పర్జన్యుడు (వరుణుడు)

తొలుత విశ్వకర్మ పుట్టినా, 'జలం' ముఖ్యం అని చెప్తుంది ఈ మంత్రం.

## ఆదిత్యుడే ఆదికర్త

ఇదే విషయాన్ని మరో మంత్రం కూడా చెప్తుంది.

**"ఆపో హ యద్బృహతీర్విశ్వమాయన్ గర్భం దధానా జనయంతీరగ్నిం**

**తతోదేవానం సమవర్తతా సురేకః కస్మై దేవాయ హవిషా విధేమ"**

**–(యజు:27–25)**

"జలమే లోకాలన్నింటినీ తన గర్భంలో దాల్చింది. ఆ గర్భం దాల్చిన జలంలో నుండి ఉష్ణం ఉద్భవించింది. అప్పుడు దేవతలకు (గంధర్వులకు) ఒకే ఒక్క ప్రాణుడైన సూర్యుడు (హిరణ్యరేతుడు) పుట్టాడు. అలాంటి సూర్యునికి హవిస్సులు అర్పించుతాం" అని దీనర్థం.

అంటే..

జలం నుండే అగ్ని పుట్టింది. ఆ అగ్నివల్లే సూర్యుడు ప్రభవించాడు అనేది ఇక్కడి సృష్టి క్రమం.

మరోచోట మరోలా ఉంది-

**"బ్రహ్మజంజ్ఞానం ప్రథమం పురిస్తాద్వి..."**

**(శు.యజు:13-3)**

**"హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతిరేకఽ ఆసీత్**

**స దాధార పృథవీం ద్యాముతేమాం కస్మై దేవాయ హవిషా విధేమ (శు.యజు:13-4)**

పై మంత్రాల్లో బ్రహ్మజంజ్ఞానుడు, హిరణ్యగర్భుడు అంటే ఆదిత్యుడు. సూర్యుడు అని. ఈ మంత్రాలు ఆదిత్యుడు అనే దేవత గురించి చెప్పినవి.

వీటి అర్థం ఇది:

"సూర్యుడే అందరి కంటే ముందు అవతరించాడు. సృష్టిలో అందరికంటే ముందే పుట్టాడు. ఈ సృష్టి జరిగాక జీవజాతులన్నింటికీ అధిపతి అయ్యాడు. భూలోకాన్ని, ద్యులోకాన్ని అతడే ధరించాడు. అలాంటి ఆదిత్యునికి హవిస్సులు అర్పిస్తున్నాము"-

అంటే.. ఇక్కడ సృష్టిలో ప్రథముడు సూర్యుడు అని ఉంది. అలాగే...

**హిరణ్యగర్భః సమవర్తతాఽగ్రే భుతస్య జాతః**

**పతిరేక ఆసీత్ ....** (కృ.యజు: 4-1-8)

**"హిరణ్యగర్భుడైన (ఆదిత్యుడు) ప్రాణిజాలం ఏదీ దేహాన్ని ధరించకముందే, అన్నింటికంటే ముందే- దేహం ధరించాడు. అతను ఒక్కటే తొలుత పుట్టాడు."**

యజుర్వేదం పదమూడో అధ్యాయంలోని 55, 56 మంత్రాలు చూస్తే.. సృష్టిక్రమం ఇలా ఉంది.

**55లో:** తొలుత పుట్టింది విశ్వకర్మ. విశ్వకర్మ నుండి మనస్సు, మనస్సు నుండి గ్రీష్మరుతువు. గ్రీష్మరుతువు నుండి త్రిష్టుప్ ఛందస్సు... ఇలా....పుట్టాయి అని ఉంది.

**56లో:** ఉదయించినప్పటి నుండి ఈ జగత్‌లోని వస్తువులన్నింటినీ కనిపించేట్టు చేసే సూర్యుడే మొదట పుట్టాడు. సూర్యుని నుండి నేత్రం పుట్టింది. నేత్రం నుండి వర్షం, వర్షం నుండి జగతీ చందస్సు.. ఇలా...పుట్టాయి అని ఉంది.

## ప్రధముడు ప్రజాపతే...!

సృష్టిలో భూమ్మీద జీవులన్నీ ఒకేసారి సృష్టించబడలేదని, మనుషులకంటే ముందే కొన్ని జీవుల సృష్టి జరిగిందనే విషయం కృష్ణయజుర్వేదంలో కనిపిస్తుంది. ఇక్కడ సృష్టి ప్రారంభకుడు ప్రజాపతి అని ఉంది.

**"ప్రజాపతిరకామయత ప్రజాః సృజేయేతి స తపోఽతప్యత**
**స సర్పాన సృజత.. సోఽకామయత ప్రజాః సృజేయేతి స**
**ద్వితీయమ తప్యత స వయాగ్ స్య సృజత...**
**సోఽకామయత ప్రజాః సృజయేతి స**
**తృతీయమతప్యత స ఏతం..... స ప్రజా**
**ఏవ తద్యజమానః"** (కృ.యజుం 3-1-1)

అంటే...

"ప్రజాపతి మనుషుల్ని సృష్టించాలని అనుకున్నాడు. తపస్సు చేశాడు. సృష్టికార్యం చేశాడు. సర్పాల్ని సృష్టించాడు. మరలా మనుషుల్ని సృష్టించాలనుకున్నాడు. మరలా తపస్సు చేశాడు. ఈ సారి పక్షుల్ని సృష్టించాడు. మరలా మనుషుల్ని సృష్టించాలను కున్నాడు. మరలా తపస్సు చేశాడు. ఈసారి మనుషుల్ని సృష్టించాడు!'-

ఈ మంత్రంలో పాములు (సరీసృపాలు), పక్షులు, మనుషుల సృష్టి క్రమం పరిణామక్రమాన్ని ఏదో ఒకమూల మిణుకు మిణుకు మంటూ కన్పించేలా చేస్తుంది.

## పురిట్లోనే సంధి

ఈ మిణుకు మిణుకు మనే ఆశకు పురిట్లోనే సంధి కొట్టింది పురుషసూక్తం. ఈ సూక్తంతో గతితప్పిన విజ్ఞానం తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది.

ఋగ్వేదంలో కన్పించే ప్రకృతిశక్తులకూ, దిక్పాలకులకూ, చరమగీతం పాడింది. సృష్టికార్యానికి 'కారణాల్ని' కాకుండా 'కర్త' నే మూలం చేస్తూ ఖాయపరచింది.

ఈ సూక్తం శుక్లయజుర్వేదంలో 31వ అధ్యాయం. దీనికర్త నారాయణ రుషి .అందులోని మొత్తం 22 మంత్రాలూ ఈ కోవకి చెందినవే .

**"సహస్ర శీర్షాః పురుషః సహస్రాక్షః సహస్రపాత్**

**సభూమిం సర్వతః స్పృత్వాత్యతిష్ఠద్దశాంగులం"**

-(శు.యజు:31-1)

''వేల తలలున్నవాడు, వేల కన్నులున్నవాడు, వేలపాదాలవాడు, అతడే ఈ భూమంతా ఆవరించి ఉన్నాడు. అతడు దేనికన్నా అయినా పది అంగుళాలు పెద్దవాడు"-

ఇలాంటి మహాపురుషుని-

**"పాదోஉస్య విశ్వా భూతాని త్రిపాదస్యామృతం దివి"**

(శు.యజు:31-3)

"నాల్గు అంశాలలో (భాగాలలో) ఒక భాగం ఈ సమస్త విశ్వం. మూడు భాగాలూ అమృతమయమైన ద్యులోకం"-

**"పాదోஉస్యేహా భవత్ పునః"** (31-4)

అంటే.. ఆ పాతికభాగవే ఈ విశ్వంలో బీజరూపం. (జీవరూపం).

ఆ మహాపురుషుని నుండి 'విరాట్' పుట్టింది. దాన్నుండి పురుషుడు ఉద్భవించాడు. (ఇలాంటి గ్రంథాల్లో పురుషుడు అంటే పురుషుడు స్త్రీ అనే అర్థంలో చూడకూడదు. ప్రకృతి, పురుషుడు అనే అర్థంలో చూడాలి. కాబట్టి పురుషుడంటే జీవుడు అని)

ఆ జీవులకోసం ఆ మహాపురుషుడు భూమినీ, ఇతర లోకాల్ని సృష్టించాడు. వాటిలో అడవుల్నీ, అడవుల్లో, గ్రామాల్లో బ్రతికే పశువుల్నీ సృష్టించాడు.

**"తస్మాదశ్వా-అజాయంత యేకే చో భాయాదతః**

**గావో హ జంజ్ఞిరే తస్మాత్తస్మాజ్జాతా-అజీవయః** (31-8)

"ఆ మహాపురుషుని నుండే.. అశ్వాలు పుట్టాయి. రెండువైపులా దంతాలుండే పశువులు పుట్టాయి. ఆవులు పుట్టాయి. మేకలు ఉద్భవించాయి".

"…. పురుషం జాగమగ్రతః''- అందుకే ఆ పురుషుడే అందరికంటే ముందు పుట్టినవాడు' అంటుంది ఈ సూక్తం-

అంటే.. మనం ఇంతకు ముందు చెప్పుకున్నట్లు విశ్వకర్మ, సూర్యుడు, జలం మొదట్లో పుట్టలేదు. మొదట పుట్టింది ఈ 'మహాపురుషుడే..' అనేది ఇక్కడ ఖరాఖండిగా చెప్పిన అంశం-

సూర్యుడు, జలం- ఇవేవీ వ్యక్తిరూప అంశాలు కావు. విశ్వకర్మ కూడా ఇలాంటి విరాట్ రూపం తీసుకున్నవాడు కాదు. అయితే, ఈ విశ్వకర్మ భావనే ముదిరి...ముదిరి విరాట్ పురుషుని రూపం తీసుకుంది అనేది సత్యం.

ఇంకా ఈ సూక్తం ఇలా చెప్తుంది.....

సృష్టికి మూలమని చెప్పుకున్న సూర్యుడు కూడా ఈ విరాట్ పురుషునికి నేత్రాల నుండి పుట్టాడు. చెవుల నుండి వాయువు, ప్రాణం పుట్టాయి. ముఖం నుండి అగ్ని, మనస్సు నుండి చంద్రుడు ఉద్భవించాడు. నాభి నుండి అంతరిక్షం, శిరస్సు నుండి ద్యులోకం, పాదాల నుండి భూమి, చెవుల నుండి దిశలు, సమస్తలోకాలూ పుట్టాయి-

ఇదీ ...సృష్టికి సంబంధించిన 'సృష్టికర్త ' వాదం.

విశ్వకర్మా? సూర్యుడా? జలమా? విరాట్ పురుషుడా?- ఎవరు వీరిలో మొదటివారు?- అని తర్జనభర్జనలు, తలపట్టుకోవాల్సిన పని ఈనాడు లేదు-

కానీ, 'ఎవరితోనో ఒకరితో, ఎక్కడో ఒకచోట, ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒకటి కేంద్రంగా సృష్టికార్యం జరిగింది అనే ఆలోచనే ఆర్యులది' అని సరిపెట్టుకోడానికీ లేదు. ఇక్కడ గమనించాల్సిన అతిముఖ్యవిషయం ఒకటుంది.

క్రీ.పూ. 1000-700 సంవత్సరాల మధ్య నాటి యజుర్వేదకాలానికి ఆర్యసామాజిక చిత్రపటం నాలుగు విభాగాలుగా చీలిపోయి, బలపడిపోయింది. ఆ విభాగాలే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు. ఈ చీలికను సామాజిక, శ్రమైక విషయంగా కాకుండా, దీన్ని కూడా విరాట్ పురుషుని సృష్టికార్యంలో భాగంగా చేయడం ఇక్కడ ప్రత్యేకంగా గమనించాల్సిన విషయం.

మనం గతంలో చెప్పుకున్న విశ్వకర్మ, సూర్యుడు లేదా ప్రజాపతులు చేసిన సృష్టికార్యాల్లో మనుషుల్ని కూడా ఇతర లోకాతో పాటు సృష్టించిన కార్యమే ఉంది. మనుషుల్ని సృష్టించాలనుకొని వేరే జీవుల్ని సృష్టించినట్లు కూడా ఉంది. (గ్రాహంబెల్ తన భార్యకు చెవిటి మిషన్ కనిపెట్టాలని ప్రయత్నించి, టెలిఫోన్ కనిపెట్టినట్లు) అవన్నీ ప్రయత్నాలు.

అయితే, ఈ విరాట్ పురుషుని సృష్టి కార్యంలో మనుషుల్ని 'వేరు వేరు వర్ణాలుగా' పుట్టించే కార్యం ఉంది.

ఇక్కడే.. వేదం మతంగా మారింది. మానవీయ వ్యతిరేకమైంది.

**"బ్రాహ్మణోఽస్య ముఖమాసీద్బాహూ రాజన్యః కృతః**

**ఊరూ తదస్యయద్వైశ్యః పద్భ్యాం శూద్రో అజాయత**

- (శు.యజు:31-11)

దీనర్థం ఇది:

"ఆ విరాట్ పురుషుని ముఖం నుండి బ్రాహ్మణులు, భుజాలనుండి క్షత్రియులు, తొడలనుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు ఉద్భవించారు"

వేదం శాసించడం వల్ల సమాజం ఇలా నాల్గు వర్ణాలుగా వేరుపడిపోదు. అంతరాలతో అస్తవ్యస్తంగా ఉన్న సామాజిక విభజనను వేదం దైవకృతంగా మార్చి, వ్యవస్థీకృతం చేసింది. ఈ అమానవీయ పాపభారం వేదం ఎప్పటికైనా మోయాల్సిందే!

ఇలా.. బుడిబుడి నడకల సమయంలోనే సృష్టివాదం యజుర్వేదంలో పూర్తిగా దారితప్పింది. ఎంతగా తప్పిందంటే...అందుకు శుక్లయజుర్వేదంలో 32వ అధ్యాయంలోని 16వ మంత్రమే సాక్ష్యం-

**"ఇదం మే బ్రహ్మ చ క్షత్రం చ ఉభే శ్రియ మశ్నుతాం"**

అంటే.. '(సమాజంలోని) ఈ సంపదనంతా బ్రాహ్మణులు, క్షత్రియులే అనుభవింతురు గాక!'- అని శాసించేదాకా పోయింది.

వేదాలనంతరం 'కర్త' కాస్త వెనక్కిపోయి- 'కారణాలు' ముందుకొచ్చాయి.

పంచభూతాలతో సృష్టి ఏర్పడిందని చెప్పాయి ఉపనిషత్తులు, చార్వాకాది దర్శనాలు. ఐతే, ఉపనిషత్తులు పదార్థవాదం ముసుగులో ఆత్మవాదాన్ని బలంగా బతికించాయి. తమ వాదంతో వేదాలు చెప్పిన వర్ణవ్యవస్థను కులవ్యవస్థగా మార్చాయి.(ఈ విషయాన్ని మనం గత సంచికల్లో చూశాం). ఆత్మవాదంలో వ్యక్తి( దేవుడు) ఉండడు. పరమాత్మ ఉంటుంది.(పరమాత్ముడు కాదు) .

## అరంగుళం ముందుకి ఆరడుగులు వెనక్కి

ఇదే చారిత్రక క్రమంలో చార్వాక దర్శనం దేవుణ్ణి వ్యతిరేకించింది. బౌద్ధం మరింత ముందుకెళ్ళి పరిణామవాదాన్ని , పదార్థవాదాల్ని లేవనెత్తింది. వేదాలు చెప్పిన దేవుణ్ణి, ఉపనిషత్తులు చెప్పిన ఆత్మనీ వ్యతిరేకించింది.ఇలా పదార్థవాదం నిటారుగా నిలబడే సమయానికి.... ఉపనిషత్తుల పదార్థవాదాన్ని (ఆత్మవాదాన్ని) , వేదాల 'వ్యక్తిసృష్టి'వాదాన్ని (విరాట్‌పురుషుణ్ణి)...ఈ రెంటినీ కలగలిపి పరమాత్ముణ్ణి (పరమాత్మ + దేవుడు) సృష్టించింది భగవద్గీత. భారతీయ సృష్టివాదానికి గొడ్డలిపెట్టుగా మారింది. ఈ తెంపరితనం ఎందాక వెళ్ళిందంటే 'ఆ విరాట్ పురుషుణ్ణి నేనే' అని విష్ణువు అవతారంగా చెప్పబడిన కృష్ణుడు అనేదాకా వెళ్లింది.

ఇలా...యజుర్వేద విరాట్ పురుష సృష్టివాదాన్ని తిరిగి భగవద్గీత బ్రతికించి, భారతీయ వైజ్ఞానిక దృక్పథాన్ని పీకల్లోతు బురదలో తొక్కేసింది.తన అజ్ఞాన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. భగవద్గీత కొట్టిన ఒక్క దెబ్బతో వేదాల్లో మినుకు మినుకు మంటూ అరంగుళం ముందుకు పాకిన భౌతికవాదం, ఆరడుగులు వెనక్కు దూకింది.ఇక అక్కడినుండి, అప్పటినుండి కనీసం వీసమంతకూడా ముందుకు దేకలేక పోయింది.


## ఈ పుస్తకాలు చదివారా?

**'స్వేచ్ఛాలోచన' ప్రచురణలు అందిస్తున్న ఈ క్రింది పుస్తకాలు అతికొద్ది కాపీలే వున్నాయి.**

| | | | |
|---|---|---|---|
| **1. మతం లేని మాన్యులు** | - | **బి. సాంబశివరావు** | **వెల : రూ. 80/-** |
| **2. సైన్సు - దేవుడు** | - | **డా. పి.యం.భార్గవ** | **వెల : రూ. 70/-** |

పై పుస్తకాలను స్వేచ్ఛాలోచన కార్యాలయానికి మనియార్డరు పంపి తెప్పించుకునే వారికి పోస్టేజ్ ఉచితం. 'హ్యూమనిస్ట్ బుక్‌క్లబ్'లో సభ్యులయినవారికి 50% తగ్గింపు లభిస్తాయి.

| | | | |
|---|---|---|---|
| **1. మతకౌగిలి** | - | **నెమలి చంద్రశేఖర్** | **వెల : రూ. 60/-** |
| **2. చెర్నాకోల** | - | **ఇసనాక మురళీధర్** | **వెల : రూ. 100/-** |

పై రెండింటిని స్వేచ్ఛాలోచన కార్యాలయానికి "మనియార్డర్"పంపి తెప్పించుకోవచ్చు. 40% తగ్గింపు ధర వుంటుంది. రెండింటిని ఒకేసారి తెప్పించుకునే వారికి (రూ. 100/- పంపిన వారికి) హేతువాద రచయిత **తుమ్మాభాస్కర్ రచన "మానవవాది మల్లాది రామమూర్తి"** ఉచితంగా పంపబడుతుంది. **వివరాలకు : మేనేజర్, స్వేచ్ఛాలోచన, ఫోన్ : 9490419044**

# ఋగ్వేదంలో నౌకలు, విమానాలు !?

**తం గుర్తయో నేమన్నిషః పరీణసః సముద్రం న సంచరణే సనిష్యవః**
**పతిం దక్షస్య విదథస్య నూ సహోగిరిం న వేనా అధిరోహ తేజసా**
*“స్తోత్రం చేసే యాజకులు ఇంద్రుణ్ణి ఆశ్రయిస్తారు. స్త్రీలు పూలకోసం, పండ్లకోసం పర్వతాల్ని ఆశ్రయిస్తారు. ధనం కావాలనుకొనే వ్యాపారులు సముద్రయానాన్ని ఆశ్రయిస్తారు”* (ఋ: 1-56-2)

డబ్బు బాగా సంపాదించాలనుకునే వ్యాపారులు సముద్రయానాన్ని ఆశ్రయిస్తారనేది పై ఋక్కులోని భావం. అంటే.. విదేశీ వ్యాపారం మంచి లాభదాయకం అని దీని ఉద్దేశ్యం. అయితే మనం ఇక్కడ చూసేది ఇందులో ఎంతలాభం వచ్చింది అనేదికాదు- సముద్రయానం ఎలా చేస్తారు? అనేదే.

కాల్వల్లో, చిన్న చిన్న సరస్సుల్లో, నదుల్లో ప్రయాణం చేయడానికి డింగిరీలు, పడవలు, తెరచాప పడవలు చాలు. - ఇవ్వన్నీ కొద్దిపాటి నీటి ప్రయాణాలకే.. కానీ, అనంత సముద్రజలరాశిలో ప్రయాణం చేయాలంటే “నౌకలు” కావాల్సిందే! ఎక్కువ సరుకుల్ని తీసుకుపోవాలంటే, ఎక్కువ లాభాలు పొందాలంటే నౌకాయానాలే కావాలి. కాబట్టి పై ఋక్కుని బట్టిచూస్తే ఋగ్వేద ఆర్యులు కూడా సముద్రయానాలు చేసినట్టూ లేదా నౌకల నిర్మాణాలెరిగినట్టూ తెలుస్తూనే ఉంది.


బొర్రా గోవర్ధన్
9390600157

## నౌకాయానం - ఒక అవసరం

ఇది మనం ఆలోచించాల్సిన విషయమే. మధ్య ఆసియా నుండి వచ్చిన ఆర్యులకి దారిలో నౌకాయానాలతో అంతగా పనేలేదు. వారు భారతదేశానికి వచ్చిన దారిలో సముద్రమూ అడ్డులేదు. అంతగొప్ప సరస్సులూ లేవు, మహానదులూ లేవు. బహుశా వారికి తెలిసిన అతిపెద్ద జలరాసి కాస్పియన్ సముద్రం అయ్యుంటుంది. అదీ వారి తొలి స్థావరాల్లోనే.

ఇక-వారు సింధూ పరివాహక ప్రాంతానికి వచ్చాకే వారికి నదుల గురించి బాగా తెలిసింది. కానీ, సముద్రం అంతగా తెలియదు. వారికి సముద్రం గురించి తెలియాలంటే, అంతవరకూ స్థానికంగా ఉండి సముద్రయానాల్లో ఆరితేరిన సింధూప్రజలద్వారానే తెలియాలి. అంటే సింధూ ఆక్రమణల్లో భాగంగానే వారికి సముద్రం గురించి, నౌకల గురించిన అవగాహన కలగాలి. నిజంకూడా ఇదే.. సింధూ ప్రజల నుండే ఆర్యులు సముద్రయానాన్ని, నౌకా నిర్మాణాల్ని నేర్చుకున్నారు.

ఎందుకంటే.. సింధూ ప్రజలు గొప్ప విదేశీ వ్యాపారులు. నౌకల ద్వారా ఎన్నో ప్రాంతాలతో వ్యాపార సంబంధాలు కలిగున్నవారు.

అసలు నౌకావ్యాపారం చేయడం అనేది గొప్ప నాగరకతలో ఒకభాగం. నేలమీద ప్రయాణం వల్ల కొన్ని ఇబ్బందులున్నాయి. ముఖ్యంగా వ్యాపారులకు దొంగలూ, దోపిడీల గొడవ ఎక్కువగా ఉంటుంది.

అలాగే.. సరుకులెత్తడానికి ఎక్కువ వాహనాలు కావాలి. ఎక్కువ పశువులు కావాలి. ఎక్కువమంది పనివాళ్ళు కావాలి. ఖర్చు అధికం.కానీ, నీటిమీద ప్రయాణం నేలమీద కంటే సురక్షితం కాకపోయినా, సులువు. ఎంతపెద్ద ఓడనైనా నిర్మించుకోవచ్చు. ఓడ ఎంత పెద్దదైతే నీటి ప్రయాణం అంత మేలు. ఎక్కువ సరుకులు తీసుకుపోవచ్చు, ఎక్కువ దూరాలకు వెళ్ళొచ్చు. సురక్షితంగా ప్రయాణించవచ్చు. ఖర్చు తక్కువ, లాభాలు ఎక్కువ. తక్కువ శ్రమ ఎక్కువ రాబడి- ఇలా ఎలా చూసుకున్నా వ్యాపారానికి నౌకాయానం ఎంతోమేలు.

సింధూ ప్రజలు పెద్ద పెద్ద నౌకల్ని నిర్మించుకున్నారు. రెండు మూడు డెక్‌లున్న (అంతస్తులున్న) నౌకలు కూడా నిర్మించారు.

వీరు క్రీ.పూ. 3000 సం॥ నాడే విదేశాలతో నౌకావ్యాపారం సాగించారు. లోథాల్ వారి ముఖ్యరేవు పట్టణం. అలాగే ద్వారక, ప్రభాస తీరాలు కూడా వీరి నౌకావ్యాపార కేంద్రాలే. వీరు భారతదేశంలోని ఇతర తీరాలతో (బొంబాయి, కొంకణ తీరాలతో)పాటు అరేబియాసముద్రం మీదుగా ఎర్రసముద్రం మీదుగా ఈజిప్టు, ఇరాక్‌ల వరకూ వ్యాపారాలు సాగించారు. ఇటు సౌదీ అరేబియా తీరప్రాంతాల్లోనూ తమ వ్యాపారకేంద్రాల్ని స్థాపించుకున్నారు.

మొత్తంమీద ఆనాటికి సింధూప్రజలు గొప్ప విదేశీ నౌకా వ్యాపారంలో ఆరితేరినవారనేది చారిత్రక సత్యం.

ఆర్యులు సింధూ తీరాలకి వచ్చాక, ఆర్య-సింధూ యుద్ధాల్లో సింధూ ప్రజలు ఓడిపోయాక.. నెమ్మదిగా సింధూప్రజల విదేశీ వ్యాపారం తగ్గిపోయింది.

నిన్న మొన్నటి ఇంగ్లాండ్ ను చూద్దాం. అది

అతిచిన్నదేశం అయినప్పటికీ 16వ శతాబ్దం నుండి 19వ శతాబ్దం వరకూ ప్రపంచంలో దాని శక్తికి తిరుగులేకుండా పోయిందంటే కారణం ఆంగ్లేయుల నౌకాబలమే! వారి నావలే వారిని ప్రపంచ విజేతల్ని చేశాయి-

నౌకాబలం కంటే వైమానికబలం మరింత బలమైంది కాబట్టి ఈ రోజున ఆ బలం ఉన్న దేశాలే అగ్రరాజ్యాలుగా మనగలుగుతున్నాయి.

గుర్రం, రథాలు ఆర్యుల బలాలు. నౌకలు, పడవలు సింధూ ప్రజల బలాలు. సింధూ ప్రజల నదీవలయ జీవనం, అరేబియా సముద్రతీరం- వారి నైపుణ్యాల్ని సముద్రం మీదికి మళ్ళించాయి.

అయితే, ఒకవిషయం. సింధూ ప్రజలు వ్యాపార శ్రేష్టులే గాని, యుద్ధ పిపాసులు కారు. ఆక్రమణదారులు అంతకంటే కారు.

కానీ, ఆర్యుల పశుపాలకులు. వారికి సముద్రంతో అంతగా పనిలేదు. అంత అవసరమూ లేదు.

నేలమీద వాహన నైపుణ్యం లేని (గుర్రాలు, రథాలు లేని) సింధూ ప్రజలు ఆర్యుల చేతుల్లో ఓడిపోగలిగారు.

## గెలుపు, ఓటమి - లాభం, నష్టం

అయితే-

గెలుపూ, ఓటములు నాగరకతకు చెందని అంశాలు. సముద్ర వ్యాపారం "లాభదాయకం అనేది సూత్రం" ఆర్యులకా? సింధూ ప్రజలకా? అని గిరిగీసుకుని ఉండదు. ఎవ్వరికైనా లాభదాయకమే. కాబట్టి ఆర్యవ్యాపార వర్గాలకు కూడా కాలక్రమంలో నౌకావ్యాపారం తప్పనిసరే అవుతుంది. అయ్యింది కూడా. సింధూ తీరంలో స్థిరపడ్డాక ఆర్యులు పశు వ్యాపారనుండి, వస్తువుల వ్యాపారినికి మారక తప్పలేదు. వ్యవసాయం, ఇతర వృత్తులు అవృద్ధి చెందాక వ్యాపారదృక్పదం గిరిగీసుకుని కూర్చోలేదు. సింధూప్రజలు చూపిన విదేశీ నౌకా వ్యాపారం కనిపిస్తూనే ఉంది. నెమ్మదిగా అటుకేసి మళ్ళాక, లాభాల రుచి మరిగాక మడికట్టుకు కూర్చోగలరా!

నౌకా వ్యాపారంపై, నౌకా నిర్మాణాలపై మనసు పెట్టకుండా ఉంటారా? సింధూ వ్యాపారులతో పోటీపడకుండా ఉంటారా?

ఈ పోటీలో భాగంగా ఇరుపక్షాలూ సముద్రంలో తలపడక మానతారా?

ఈ వ్యాసంలో మనం మొదటిచూసిన ఋగ్వేద రుక్కులోని ఆంతర్యం ఇదే-

"మంచిమంచి లాభాలు, అధికధనం కావాలనుకుంటే వ్యాపారులు సముద్రయానాన్నే ఆశ్రయిస్తారు" అనేది-

ఇదే విషయం మరోచోట కూడా ఉంది.

**ఉవాసోషా ఉచ్ఛాచ్చ ను దేవీ జీరా రథానాం**
**యే అస్యా ఆచరణేషు దధ్రిరే సముద్రే న శ్రవస్యవః**

(ఋ: 1-48-3)

"ధనంకోసం వ్యాపారులు సముద్రంలో నావలు నడుపు తున్నట్లు, ఉదయాకాశాన ఉషోదేవి రథము నడుపుతూ వచ్చింది" అని దీనర్థం. ఇక్కడ- నావల్ని 'సముద్ర రథాలు'గా చెప్పారు.

## దురాక్రమణ - దుర్బుద్ధి

ఆర్థిక వనరుల్ని ఆక్రమించడమే యుద్ధం. ఆదిమ మానవునికైనా, ఆధునిక మానవునికైనా యుద్ధం అనేది కేవలం దురాశవల్ల కలిగే పరిణామమే. ఒక ఆదిమగణం మరో ఆదిమగణం మీదపడి గణం మొత్తాన్ని చంపి పారేసేది. కారణం ఆ గణప్రాంతంలోని ఆహారాన్ని పొందడం కోసమే.

ఆర్యులు, సింధూ ప్రజలపై యుద్ధం చేసిందీ పచ్చికబయళ్ళకోసమే.

ఇప్పుడు అమెరికా లాంటి దేశాలు యుద్ధాలు చేస్తుంది ఇప్పటి ఆర్థిక వనరైనా అయిల్ నిక్షేపాల కోసమే.

ఆహారం లేకుండా మనిషి గాలిని భోంచేసినా, ఆర్యుల ఆవులమందలకు పచ్చికతో పనిలేకపోయినా, నేటి యంత్రాలూ, ప్రయాణ సాధనాలు, ఇతర పరిశ్రమలు ఆయిల్‌తో కాకుండా ఉప్పునీటితో నడిచినా-

యుద్ధాలతో పనేలేదు.

స్థానికంగా ఎప్పటినుండో అక్కడే జీవిస్తున్నా వారిని, ఆ వనరులు కొల్లగొట్టడం కోసం అక్కడి నుండి వారిని తొలగించే పనిలో భాగమే యుద్ధం.

ఇది దేశాల మధ్య అయినా, జాతుల మధ్య అయినా, వంశాల మధ్య అయినా, కుటుంబ సభ్యుల మధ్య అయినా-

'దురాక్రమణ అనే దుర్బుద్ధి లేకుంటే' యుద్ధం పుట్టదు.

## బరుకచ్చం- బానిసత్వం

తొలిగా, సింధూ ప్రజల పచ్చికబయళ్ళు ఆక్రమణకి ఆర్యులకు గుర్రాలు, రథాలూ, విల్లులూ ఉపయోగపడ్డాయి. కాలక్రమంలో వారూ వ్యాపారాల్ని నేర్చాక- మెల్లగా వారికీ నౌకా కౌశలం అవసరం అయ్యింది. ఈ బలంతో అటు వ్యాపారాన్నే కాకుండా, కొన్ని సింధూ నగరాల్ని, లంక ప్రాంతాల్ని ఆక్రమించుకున్నారు.ఆ విషయం 1వ మండలం 116వ సూక్తంలో ఉంది-


**"తుగ్రో హ భుజ్యుమశ్వినోదమే ఘే రయిం న**
**కశ్చిన్మమృవాగేం అవాహాః**

**తమూ హథు ర్నైభిరాత్మన్వతీభిరన్తరిక్ష ప్రుద్భిర పోదకాభిః"**
(ఋ: 1-116-3)

దీనర్థం ఇది-

తుగ్రుడు అనేవాని కొడుకు భుజ్యుడు. సముద్ర మధ్యలో జరిగిన యుద్ధంలో భుజ్యుడు దెబ్బతిన్నాడు. అశ్వనులు తమనావలతో వెళ్ళి, భుజ్యుణ్ణి నీటిలో మునిగిపోకుండా కాపాడారు. తిరిగి అతని తండ్రి దగ్గరకు చేర్చారు".

ఇక్కడ "వేరొక దీవికి పంపగా" అని ఉంది. బహుశా ఇది సింధూ నౌకాతీరాలై ఉండొచ్చు. ఇప్పటి గుజరాత్‌లోని అరేబియా, పాకిస్థాన్‌లోని సింధూతీరాలలో సముద్రపునీటిలో మునిగిపోయిన భూభాగం ఉంది. దీన్ని "రాణ్ ఆఫ్ కచ్' అంటారు. ఇక్కడి నేల దీవులు దీవులుగా ఉంటుంది. దీన్ని పూర్వం 'బరుకచ్ఛం' అనేవారు. బరు రాజ్యంలోనిది ఈ ప్రాంతం. పై ఋక్కుకి నేమాని వేంకట నరసింహశాస్త్రిగారు చక్కటి పద్యం రాశారు-



**"వేరొక దీవియందుగల వీరుల**
**వైరుల చంప "దగ్రు" దను**
**వీరనృపుండు "భుజ్యు"డను వీరకుమారుని బంపుచుండ నా**
**వీరుని నౌక సంద్రమున వేగిరపాటున మన్గుచుండగా**
**మీ రది చూచి మీ పడవ మీదకు వానిని జేర్చలేదటే!"**

*(తి.తి.దే.వారి శ్రీమదాంధ్ర ఋగ్వేదసంహిత-331 పేజి)*

ఈ యుద్ధం వ్యాపారం కోసమా? రాజ్యం కోసమా? అనేది సందిగ్ధమే అయినా, నౌకాయుద్ధం జరగడం, ఆర్యుడైన భుజ్యుడు ఓడిపోవడం, అశ్వినులు అతణ్ణి కాపాడ్డం అనే విషయంలో సందేహం లేదు.

ఇక్కడే మరో విషయం ఉంది-

భుజ్యుడు వెళ్ళడానికీ, ఓడిపోవడానికీ, తిరిగి అశ్వనులు అతణ్ణి తండ్రి దగ్గరకు చేర్చడానికి మూడురోజులు పట్టింది-

**"తిస్రః క్షపస్త్రిరహాతివ్రజద్భిర్నా సత్యా భుజ్యుమూహథుః పతంగైః**
**సముద్రస్య ధన్వన్నార్ద్రస్య పారే త్రిభీ రథైః శతపద్భిః షళశ్వైః**
(ఋగ్వేదం: 1-116-4)

"ఓ! అశ్వనులారా! ఆరు గుర్రాలు పూన్చిన నూరుచక్రాల రథంపై, భుజ్యుని మూడురోజుల్లో సముద్రం నుండి, సముద్రతీరం నుండి, ఎడారి నుండి రక్షించారు"- అని దీనర్థం.

ఇక్కడ 'ఎడారి నుండి' అనేది చాలా కీలకమైన విషయం . మనం పైన చెప్పుకున్న బరుకచ్ఛం ఎడారి ప్రాంతమే. థార్ ఎడారిలో ఒక భాగం. థార్ ఎడారిలో ప్రవహించే నది సింధూనది. సింధూనది వల్ల ఆ ఎడారిలో కొంతభాగం సస్యశ్యామలమైంది. ఇలాంటి భూభాగాలు చాలా అరుదు. ఆఫ్రికాలో నైలునది, ఇరాక్‌లోని యూఫ్రటీస్, టైగ్రిస్ నదులు, భారత్‌లో (నేటి పాకిస్తాన్)లో సింధూనది - ఇవి ఎడారి నదులు. వీటిని ఎక్సోటిక్ రివర్స్ అంటారు. ప్రపంచ అద్భుత నాగరకతలన్నీ ఇలాంటి నదీతీరాలలోనే వెలిశాయి.

పై ఋక్కు సింధూరేవు తీరాల భౌగోళిక స్వరూపాల్ని చక్కగా వివరించి చెప్పింది-

ఇక ఈ ఋక్కు చూడండి.

**"అనారమ్భణే తరవీరయేమనాథాస్థానే**
**అగ్రభణే సముద్రే**
**యదశ్వినా ఊహాథుర్భుజ్యుమస్తం**
**శతారిత్రాం నవామాతస్థి వాంసం"**
*(ఋ:1-116-5)*

అంటే...

"ఎలాంటి నేల లేని, నేలపట్టు దొరకని, ఏలాంటి ఆధారమూలేని సముద్రంలో నూరు తెడ్లనావమీద పడివున్న భుజ్యుని రక్షించి, ఇంటికి చేర్చారు" అని అశ్వనుల్ని కీర్తించాడు కక్షీవంతుడు. దీనికి నేమాని వారి పద్యం చూడండి-

**"నూరు తెడ్డులతో నొప్పి వారి లోన**
**మునుగ కుండెడు నోడపై మునిగియున్న**
**భుజ్యురాజును ఎక్కించి పూజ్యుడైన**
**తండ్రి గృహమున జేర్చిరి ధర్మపరులు"**

*(శ్రీమదాంధ్ర ఋగ్వేద సంహిత: 331 పేజీ)*

ఈ పద్యంలో "నూరు తెడ్ల నావ" అని ఉంది అంటే పెద్ద నౌకే. వందమంది కూర్చొని తెడ్లు వేయడానికి తగినంత పెద్ద నావ.

ఇంత నావను నడపాలంటే భుజబలం కలిగిన పనివాళ్ళు కావాలి. ఈజిప్టు, మెసపుటోమియా ప్రాంతంలో ఇలాంటి నావల్ని నడపడానికి బానిసలు ఉండేవారు. సింధూ నాగరకతలోకూడా బానిసవిధానం ఉంది. వారి నావల్ని బానిస కూలీలే నడిపేవారు.

ఆర్యులు సింధూప్రాంతంలో స్థిరపడ్డాక, వారూ బానిసవ్యవస్థని పాటించారు. ఆర్యులు స్వభావ సిద్ధంగా ఆటవికులు. హింసావాదులు. క్రూరులు. బానిసలపట్ల కూడా అతిక్రూరంగా వ్యవహరించేవారు. ముఖ్యంగా దశ్యుల్ని (సింధూప్రజల్ని, మూలభారతీయుల్ని) బానిసలుగా చేసుకుని, వారితో చాకిరీ చేయించుకునేవారు.


**"న మా గరన్ నద్యో మాతృతమా దాసా యదీం సుసముబ్ధమవాధుః**
**శిరో యదస్య త్రైతనో వితక్షత్ స్వయం దాస ఉరో అంసావపిగ్ధ'** (ఋ: 1-158-5)

ఈ ఋక్కులో దీర్ఘతముడు ఇలా అంటున్నాడు-

"తల్లిలా అందర్నీ పోషించే నదీజలాలు నన్ను ముంచకుండా ఉండుగాక! నా దాసులు (నా సేవకులు) నన్ను బంధించారు. తన్ని బోర్లాపడేశారు. త్రైతుడు అనే దాసుడు నా తలకి గాట్లు పెట్టాడు. నా రొమ్ము భాగాలకీ, భుజాలకీ గాయాలు చేశాడు"-

దాసులు యజమానిని అలా చేశారంటే.. వారిని ఎంత క్రూరంగా హింసించి ఉంటాడో అర్ధంచేసుకోవచ్చు.

ఋగ్వేదం చారిత్రక గ్రంథం కాదు. కావ్యలక్షణాలు, అద్భుత వర్ణనలు గల గ్రంథం. వర్ణనల్లో ఉత్ప్రేక్షలు ఉంటాయి. అతిగా చెప్పడం ఉంటుంది. వందచక్రాల రథాల, వెయ్యిగుర్రాల రథాల వర్ణనలు అలాంటివే. ఈ నూరు తెడ్ల పడవకూడా అలాంటాదే కావొచ్చు. కాకపోనూ పోవచ్చు. ఎందుకంటే.. అప్పటికే సింధూ ప్రజలు రెండంతస్తుల నావల్ని వాడారు. ఏమైనా.. దాసుల వల్లే పెద్దపెద్ద నౌకలు నడవడం సాధ్యపడుతుంది.



## రెక్కల నౌక - విమానం తోక

ఇక ఈ ఋక్కు కూడా చూద్దాం-

**"యుక్తో హ యద్ వాం తౌగ్ర్యాతు పేరుర్వి మధ్యే అర్ణసో ధాయిప్రజః"**

'సముద్రం మధ్యలో మునిగిపోయిన తాగ్రుని పుత్రడు 'త్రౌగ్రుని' రక్షించి ఒడ్డుకు చేర్చారు' అని ఉంది.

దీన్నే నేమానివారు-

**'యానము మీద నెక్కి చని యబ్దిని మున్గిన 'తుగ్ర' సూనునిం బూనిక గట్టు చేర్చితిరి పూజ్యులు మీరలు దస్యులారా!..."**
అంటారు.

అలాగే.. రుగ్వేద రుషి అగస్త్యుడు కూడా.. ఇదే విషయాన్ని ఇంకొక విధంగా చెప్పాడు-

**"యువమేతం చక్రథుః సింధుషు ప్లవమాత్మన్వన్తం పక్షిణం తౌగ్రాయకం**
**యేన దేవత్రా మనసా నిరూహథు సుపప్తనీ పేతథుః క్షదసో మహాః** (ఋ:1-182-5)

'అశ్వనులారా! మీరు తుగ్రుని పుత్రుని కోసం, బలమైన, వేగమైన, పక్షిలా రెక్కలుగల నౌకను పంపి, దేవతల దయవల్ల అతణ్ణి ఒడ్డుకు చేర్చారు"-

ఇందులో "పక్షిలా రెక్కలుగల నౌక" అని ఉంది. అంటే 'తెరచాప నౌక' అయి ఉంటుంది-

దీన్ని నేమానివారు ఇలా చెప్పారు

**"మీరలు తుగ్రపుత్రుని నిమిత్తము వారధియందు బక్షిసం చారముబోలు వేగమున సాగెడు నావను గల్గజేసి యే తీరునొ వాని జేర్చితిరి తీరపు భూమికి నశ్వులారా! మీ బీరము నెన్నగా వశమె! పెద్దలు గారటె? మీర లెంతయున్"**
మరి ఈ ఋక్కు చూడండి...

**"అవవిద్ధం తౌగ్రమప్స్వ అక్తనరామ్భణే తమసి ప్రవిద్ధం చతస్రో నావో జఠలస్య జుషా ఉదశ్విభ్యామిషితాః పారయతి"**
(ఋ: 1-182-6)

తుగ్రపుత్రుడు సముద్రంలో ఏలాంటి ఆధారం లేకుండా, బోర్లాపడిపోయాడు. అశ్వినులు నాలుగు నావల్ని అతనికి అందించారు"

అలాగే...

**'స్విద్ వృక్షో నిష్ఠితో మధ్యే అర్ణసో యం తౌగ్ర్యో నాధితః పర్యషస్వజత్ పర్ణా మృగస్య పతరోరి వాంఛా ఉదశ్వినా ఊహథుః శ్రోమతాయకం"** (1-182-7)

'ఓ! అశ్వినులారా! మీరు తుగ్రపుత్రుని రక్షించడానికి నీటి మధ్యన చెట్టులాగా నావను నిలిపారు..."

దీన్ని నేమానివారు ఎలా చెప్పారో చూడండి..

**'మిమ్ముల గ్రోలు తుగ్రసుతు మేలునకై నడిసంద్రమందు వృక్షమ్ము జనించునా యనెడు చందము యానము నిల్పినారు.."**

ఇవే కాక 6-63-9 లో కూడా వేగంగా వెళ్ళే రెండు పడవల ప్రస్థావన ఉంది.

మొత్తంమీద ఋగ్వేద ఆర్యులు కూడా నౌకల్ని, తెరచేప ఓడల్ని, పడవల్ని, ఉపయోగించారు. ఈ విషయంలో ఈజిప్టు వారికంటే, మెసపుటోమియన్ల కంటే, సింధూప్రజలకంటే వెనుకబడే వున్నారు. అయినా- ఆర్యుల నౌకా ప్రయాణాలు, పరిజ్ఞానం కాస్త మెరుగైనదే!

**గుర్రాలున్నాయి, రథాలున్నాయి, నావలున్నాయి గానీ, వ్యోమనౌకల గురించి, వ్యోమయానాల గురించి, విమానాల గురించి ఋగ్వేదంలో ఎక్కడా లేదు.**

## రామాయణ-భారతాల్లో నౌకలు

వైదిక ఇతిహాసాలైన రామాయణ, భారతాల్లో కూడా 'నౌక'ల ప్రస్తావనల్ని చూద్దాం. భారతంలో నౌకల ప్రస్తావనలుగానీ, మహాభారతయుద్ధంలో జలాశయాలపై జరిపిన యుద్ధసన్నివేశాలుగానీ లేవు. అది కురుపాంచాలలో భూమిమీద జరిగిన యుద్ధమే. పైగా యుద్ధాలకోసం "గోగ్రహణాలు" ఉన్నాయి కాబట్టి ఆనాటి సంపదకూడా పశువులే. పశుసంపద విషయంలో విదేశీ వ్యాపారాలకీ, నౌకా వ్యాపారాలకీ అంత అవకాశం ఉండదు.

మరి, రామాయణంలో నౌకాయుద్ధాలకి బోలెడు అవకాశం ఉంది. రాముడు, అతని కిష్కిందసైన్య (వానరసైన్యం) సముద్రం దాటి లంక మీద మెరుపుదాడి చేయాలి. లంకకు చేరాలంటే సముద్రం దాటాలి. సముద్రం దాటాలంటే నౌకాబలం కావల్సిందే!

నిజానికి, రామాయణకావ్యం ఇలియడ్ అనే గ్రీకు పురాణానికి అనుసరణ అంటారు. అందులో ట్రాయ్ నగరం ముట్టడి ఉంది. సముద్రం మీద అర్థరాత్రి ఎన్నో నౌకలు, పడవల మీదవచ్చి, ట్రాయ్ నగరాన్ని చుట్టుముట్టి, నగరాన్ని తగులబెట్టి, నాయకుడిని చంపి, తన రాణిని తిరిగి తీసుకుపోతాడు.



ఈ కథలో కూడా నౌకాయుద్ధాలున్నాయి. మరి, రామాయణంలో సముద్రం దాటడానికి రాముని సైన్యం నౌకలు ఉపయోగించలేదు. సముద్రం మీద వంతెనగా తేలే నాళ (కొబ్బరి), తాళ (తాటి), తమాళ (మోదుగ) చెట్లను వాడారు. అవి నీటిమీద తేలతాయి కాబట్టి 'తారుడు' అనే వానర ఇంజనీర్ వాటితో బ్రిడ్జి నిర్మించాడు. దానిమీదే వానరసైన్యం లంకకు చేరుకుంటుంది.

అంటే... వేదకాలం నుండి రామాయణకాలం వరకూ వైదిక సంస్కృతిలో నౌకలకు పెద్ద ప్రాధాన్యత లేదనీ, వారికి నౌకానిర్మాణకుశలతలు లేవని చెప్పడానికి, వైదికుల ప్రసిద్ధ ఇతిహాసాలు రెండూ తేటతెల్లం చేస్తున్నాయి.

## ఎలా పుట్టాయి? ఎప్పుడు పుట్టాయి?

'ఋగ్వేదంలో విమానాల గురించి ఉంది' అనే మాటలు ఎలా పుట్టాయో, ఎప్పుడు పుట్టాయో కాస్త చూడాల్సిందే!

వేదంలోని భాష పురాతన భాష. ప్రాథమిక సమాజాలు ఉపయోగించే భాష. ఈ భాషల్లో ఒకేపదానికి ఎక్కువ అర్థాలుంటాయి. అందుకే వేదాన్ని ఏ ఇద్దరూ ఒకేరకంగా వ్యాఖ్యానించరు, వ్యాఖ్యానించలేరు.

'**వందే పార్వతీపరమేశ్వరౌ**' అంటే ఒకర్థం, '**వందే పార్వతీప రమేశ్వరౌ**' అంటే వేరే అర్థం వచ్చినట్లు- సంస్కృతంలో ఒక్కొక్క అక్షరానికి ఒక్కొక్క అర్థంతీసి రకరకాల భాష్యాలు రాసుకోవచ్చు.

## నిరుక్తం- దయానందం

సంస్కృతం అంటే సంస్కరించిన భాషకాదు- సంస్కరించాల్సిన భాష అనుకోవాలి.

అసలు భాషతోనే ఇలాంటి తంటా ఉంటే- కొందరు భాష్యకారులు ఆధ్యాత్మిక అర్థాలు అంటూ లేనిపోని విశ్లేషణలు సాగదీసి మరెంతో గందరగోళం చేస్తారు-

వేదకాలం క్రీ.పూ. 2000 నుండి క్రీ.పూ. 800 వరకు అని చరిత్రకారులు నిర్ధారించారు.

ఈ కాలంలోనే వేదంలోని పదాలకి అర్థాల్ని చెప్తూ యాస్కుడు 'నిరుక్తం' రచించారు. ఇప్పటి వరకూ ఈ నిరుక్తవే వేదాలకి ప్రామాణికం. ఇది క్రీ.పూ. 600 సంవత్సరాల నాడు జరిగింది.

ఆ తర్వాత క్రీ.శకాల్లో తెలుగువాడైన స్కంధస్వామి, ఉద్గీతుడు, వేంకటమాధవుడు తమ తమ వేదభాష్యాలు రచించారు.

మరో ప్రామాణిక భాష్యం సాయనుడి భాష్యం. ఈయనకాలం క్రీ.శ. 1315. ఈయన విజయనగర సామ్రాజ్య స్థాపకులైన హరిహరరాయలు, బుక్కరాయల ఆస్థానంలో మహామంత్రి, తెలుగువాడు.

వీరందరి భాష్యాల్లో ఎక్కడా మనం ఈ వ్యాసంలో చదువుకున్న ఋక్కుల్లోకానీ, మరీ ముఖ్యంగా చివరిగా చెప్పుకున్న అగస్త్యుడు చెప్పిన 182వ సూక్తంలోని 5,6,7 ఋక్కుల్లోగానీ 'విమాన' ప్రస్థావనలు లేవు. కానీ మొదటిసారిగా స్వామి దయానంద సరస్వతి వ్యాఖ్యానంలోనే 'విమాన' ప్రస్థావనలు వచ్చాయి.

రెక్కలున్న పడవలు (తెరచాప పడవలు) అని ఉంటే, రెక్కలున్నారు కాబట్టి అది 'విమానమే', 'వేగంగా వెళ్తుంది' కాబట్టి 'విమానమే' అనే అర్థాన్ని తీసి దయానందులు తన **వేదతత్వ ప్రకాశం** అనే **ఋగ్వేదాది భాష్యభూమికలో** రాశారు. ఇదే కాదు చాలా విషయలు అలాగే రాశారు. గతంలో ఎవ్వరూ చూడని కొత్త వేదార్థాల్ని కుప్పించి పారేశారు.

వేదాల చారిత్రక ప్రాధాన్యతని పాతిపెట్టారు. దయానందులవారే 'విమానాలు' అని ఎందుకు అనుకున్నారు?

మిగిలిన వారంతా ఎందుకు అనుకోలేదు?

ఎందుకంటే.... వారి కాలాల్లో విమానాలు లేవు. అందుకే వారు నావల్ని నావలుగానే అనుకున్నారు.

దయానందుని కాలానికి (1824-83) విమానాలు వినియోగం లోకి వచ్చాయి. గొప్ప ప్రయాణ సాధనాలుగా పేరుపొందాయి. కాబట్టి 'ఇవి వేదాల్లో లేకపోతే ఎలా?', 'అన్ని వేదాల్లో ఉండాలి గదా?' అని విచిత్ర వ్యాఖ్యానం చేశారు.

ఆయన తన 'ఋగ్వేదాది భాష్యభూమిక'లో-

**'అథ నౌవిమానాది విద్యావిషయ స్సంఏపతః'** అనే ఒక అధ్యాయం రాశారు-

అది అట్లా ఉంచండి.

ఇక ఈ విపరీతార్థం చూడండి.

మనం ఈ క్రింది రెండు రుక్కుల్ని ఇదే వ్యాసపరంపరలోని 'ఋగ్వేద ఋతురాగం' అనే విభాగంలో చూశాం కూడా..



**''కృష్ణం నియానం హరయః....''** (ఋ:1-164-47)

దీనర్థం ఇది: 'సూర్యకిరణాలు జలాల్ని గ్రహిస్తాయి. నల్లని మేఘాలు ఏర్పడతాయి. ఈ జలం నిండిన నల్లని మేఘాలు ద్యులోకం (ఆకాశం) చేరతాయి. తిరిగి భూమిమీద వర్షిస్తాయి. భూమిని తడుపుతాయి. ఈ విషయం ఎవరికి తెలుసు? తెలిసిన వాడే ప్రాజ్ఞుడు''

దీనికి నేమానివారి అనువాదం చూద్దాం-

**రవిఘృష్ణలుదకమునుగొని**
**వివిధములగు ఘనములందు వెలయించుచునా**
**రవి నుండి మరల వచ్చును**
**భువనంబును దడుపుచుండు, బొలుపారంగన్!**

ఇక ఇప్పుడు దీనికి దయానందుల వారి వ్యాఖ్యానం చూడండి-

''**(కృష్ణం)** కాష్ఠలోహాది పార్థివ పదార్థాలతో నిర్మించబడి ఆకర్షణయుక్తమగు, **(నియానం)** విమానమును, **(హరయః)** వేగాది గుణయుక్తములగు, **(సువర్ణా)** బాగుగా గమనం చేయించగల పూర్వోక్తములైన అగ్నిజలాదృశ్యములు **(అపోవసానః)** జలసేచనయుక్త బాష్పమును పొంది యాంత్రికగతితో, **(దివముత్పతంతి)** ప్రకాశయుక్తమగు ఆకాశమునందు పైకెగసి పోవునట్లు చేయును....'' ఇలా వుంది ఆయన వ్యాఖ్యానం.

వింతైన విషయం ఏమంటే- దయానందునికి విమానాలు తెలుకసనుగానీ, అవి ఎట్లా ఎగురుతాయో తెలియదు. ఆ రోజుల్లో రైళ్ళు, నౌకలు ఆవిరిశక్తితో నడుస్తూ ఉండేవి. అదేవిధంగా విమానం కూడా ఆవిరిశక్తితో నడుస్తుంది అనుకొని పై వ్యాఖ్యానం రాశాడు. విమానం ఆకాశంలో ఎగరడానికి 'పీడన వ్యత్యాసాలు' కారణం అనే విషయం ఆయనకు తెలియదు-

నేను ఈ వ్యాసంలో చాలాచోట్ల నేమాని వారి పద్యాలు ఉటంకించాను. ఎందుకంటే.. వారు యాస్కుని వ్యాఖ్యానానికి అనుకూలంగా వ్యాఖ్యానించారు కాబట్టి- యాస్కుడు 'విమానం' అని వ్యాఖ్యానిస్తే నేమాని వారు 'విమానం' అనే రాసేవారు గదా!

అందుకే కాస్త నిడివి పెరుగుతుందని తెలిసినా ఈ వ్యాసంలో చాలాచోట్ల నేమాని వారి పద్యాలు ఉటంకించడం జరిగింది-

## రాశిచక్రం - పళ్ళ చక్రం

ఇక ఇప్పుడు మరోచిత్రవిచిత్రాన్ని చూద్దాం-

**'ద్వాదశ ప్రధయశ్చక్రమేకం త్రీణినభ్యానిక ఉతచ్చికేత**
**తస్మిన్త్సాహం త్రిశతానశంకవోఅర్పితాః షష్టిర్ చలాచలాసః'** (ఋ: 1-164-48)

దీన్నీ 'ఋగ్వేద ఋతురాగం' అనే విభాగంలో చదివాం-

దీనర్థం ఇది-

*''ఆకాశంలో పన్నెండు ఆకుల రాశిచక్ర పరిధిలున్నాయి. ఒక చంద్రుడు (ఒక సంవత్సరం), మూడుపలకలుగల ఋతుచక్రం ఇది. ఈ చంద్రునికి మూడువందల అరవై రోజులు-''*


ఇది ఒక సంవత్సరం కాలచక్రాన్ని తెలిపే విషయం. పన్నెండు రాశులు, మూడుకాలాలు, ఆరు ఋతువులు, 360 రోజులు. దీన్ని ఇలా గీయవచ్చు.

ఇప్పుడు దీనికి దయానందుని వ్యాఖ్యానం చూడండి. ''**(ద్వాదశ ప్రధయః)** ఆ యానములో పన్నెండు ప్రథలుండును. **(చక్రమేకం)** వాని మధ్య సర్వయంత్రాల్ని తిప్పడానికి ఒక చక్రం ఉంటుంది. **(తాణినభ్యాని)** మధ్యలో ఉన్న అవయవాల్ని పట్టి ఉంచడానికి 3 చక్రాలుంటాయి **(సాకంత్రిశతా)** వాటితో మూడువందలు **(శంకవోఅర్పితా)** యంత్రపు మరలకూర్పు ఉంటుంది. అవి, **(చలాచలాసః)** యానాన్ని నడపడానికీ, ఆపడానికీ వీలుగా ఉంటాయి. **(షష్టిః)** 60 యంత్రపు మరల్ని దానిలో ఏర్పాటు చేయాలి. ఈ కార్యమంతటినీ ఎవరు ఎరుగును? **(న)** అందరూ ఎరుగురు. ఈ విద్యలో నైపుణ్యం

ఉన్నవారే ఎరుగుతారు–

ఈ వ్యాఖ్యానం చూసి నవ్వుకోనవసరం లేదు. దయానందుల వారికి గేర్‌బాక్సుల పరిజ్ఞానం బాగానే ఉందనుకోవాలి. విమానానికి ఈ భూమ్మీద తిరిగే యంత్రాల గేర్‌బాక్స్‌లు పనిచేయవు. 60 పళ్ళచక్రాలు, 300 మరలు విమానాన్ని పైకెత్తవు. ప్రొపెల్లర్స్ ద్వారా విమానం బాడీకింద గాలిని వేగంగా ప్రక్కకి తోసెయ్యాలి. అప్పుడు అక్కడ అల్పపీడనం ఏర్పడుతుంది. క్రింద ఉన్నగాలి వేగంగా ఆ అల్పపడీనంలోకి వచ్చిపడి, విమానాన్ని పైకి ఎత్తుతుంది. ప్రొపెల్లర్స్ ఆగిపోతే విమానం పడిపోతుంది.

చాలామంది పక్షిని చూసి విమానాన్ని నిర్మించారనుకుంటారు. నిజానికి అలా చేసిన ప్రయోగాలన్నీ విఫలం అయ్యాయి. చివరికి గాలిపటం ఎగిరే విధానంలోని పీడన వ్యత్యాసాలు ఏర్పరచి విమానాన్ని ఎగిరించారు. విమానానికి 'గాలిపటం' ఆధారం. పక్షులు కాదు.



అందుకే **తనకు తెలిసిన ఆవిరయంత్రాల్ని, గేరుబాక్సుల్ని కలిపి– విపరీతార్థం తీసి విమానాలు వాటి నిర్మాణాలు ఋగ్వేద ఆర్యులకి తెలుసు– అని దయానందుడు రాశారు.**

**ఇక, అక్కడ నుండి 'వేదాల్లో విమానాలు' అనే రోగం పట్టుకుంది.**

విమానానికి బదులు ''పళ్ళ చక్రాలతోతిరిగే గోడగడియారం ఆర్యులకు తెలుసు" అని వ్యాఖ్యానం చేసినా కొంతలో కొంత బాగుండేది.

## విలువ పెరిగిందా? తగ్గిందా?

అయితే– మనం ముందే చెప్పుకున్నట్లు యాస్కుల వారి నుండి సాయనుని వరకు ఎవరికీ ఈ దుగ్ధలేదు. వేదాలకి లేనిపోని విజ్ఞానాన్ని అంటించాలనే దురదాలేదు. వారు వేదాల్ని వేదాలుగానే చూశారు, గౌరవించారు. విపరీత వ్యాఖ్యానాలు చేయడం దోషంగానూ భావించారు. మారిపోతున్న నాగరకతలకి అనుకూలంగా వాటితో 'దొంగసాక్ష్యం' చెప్పించే పని చేయలేదు.

రేపు మరొక భాష్యకారుడు వచ్చి కంప్యూటర్లు, టీవీలు, రాకెట్‌లు అన్నీ వేదాల్లో ఉన్నాయని వ్యాఖ్యానాలు రాయొచ్చు.

అలా రాసేవారు ఒకచిన్న లాజిక్ మరచేపోతున్నారు. వేదంకంటే విజ్ఞాన ఆవిష్కరణలే గొప్పవని ఒప్పకనే ఒప్పేసుకుంటున్నారు. అలాంటి ఘనాపాటీలకు ఒకటే విన్నపం–

కనీసం తాళపత్రాలకు కూడా చేరని వేదంలో, కనీసం లిపికి కూడా నోచుకోని వేదంలో– విమానాలు, రాకెట్లూ ఉంటాయని చెప్పుకోడం సబబేనా?

ఎవరైనా వేదాల్ని చదివితే– (పూర్వం చదివే అవకాశం లేదు. కానీ ఇప్పుడు చదవకుండా ఆపే అవకాశం లేదుగదా!) నిజాలు తెలిస్తే అది 'వేదాలకే చిన్నతనం' అనే ఆలోచన ఉండదా?

ఆ తప్పు చేస్తున్నాం అనే ఆలోచన కలగదా?

ఈ వ్యాసావళి ముగిస్తూ మరోసారి చెప్పేది ఒకటే.. బుద్ధుడు చెప్పినట్లు

"అతిలౌల్యం వల్ల, అతిద్వేషం వల్ల ఉన్నదాన్ని ఉన్నట్టు చూడలేం"– ఆ రాగద్వేషాల్ని వీడండి– అప్పుడే సమ్యక్ దృష్టి కలుగుతుంది. సంస్కారమూ కలుగుతుంది!

పశుపాలకులైన ఆర్యులు, సింధూ ప్రజల్ని భుజబలంతో ఓడించారు.

వైజ్ఞానిక నాగరకతను ఆర్యులనుండే నేర్చుకున్నారు. నౌకా పరిజ్ఞానంకూడా వారికి అలా కలిగిందే!

అందుకే....

నాగరకత విషయంలో ఆర్యులు విజేతలైన పరాజితులు.

***(ఋగ్వేదం పరిశీలన ఇంతటితో సమాప్తం. రెండునెలల విరామం తర్వాత మిగిలిన వేదాలు చూద్దాం)***

## ఉత్తమ బహుమతి

ఎన్నో వందల ఏళ్ళ నుండి జనం ఆలోచనలను జడత్వంలో వుంచిన కుల, మత, మౌఢ్యాల నుంచి స్వేచ్ఛ కల్పించటానికి అంకితమై పనిచేస్తున్న పత్రిక 'స్వేచ్ఛాలోచన'. దీనిని తెలుగునేల నాలుగు చెరగులా వ్యాప్తి చేయటానికి మీవంతు సహకరించమని విజ్ఞప్తి. స్నేహితులకీ, బంధువులకీ దీనిని పరిచయం చేయండి. విద్యార్థులకు, మేధావులకు, గ్రంథాలయాలకు చేరువ చేయండి. ఉత్సవాల్లో కానుకగా పత్రిక చందాలను యివ్వండి. బుద్ధిలో జడత్వాన్ని తుంచి, హేతుత్వాన్ని పెంచటమే మీ సన్నిహితులకు మీరిచ్చే ఉత్తమ బహుమతి.

**– మేనేజర్**

## 'ఋగ్వేదం నుంచి యజుర్వేదానికి'... అంటే

# సమష్టి నుండి వ్యష్టికి...

(వేదాలను అధ్యయనం చేసి చారిత్రక, సామాజిక పరిణామ దృష్టితో విశ్లేషిస్తూ ఆ కాలపు అజ్ఞానాన్ని, విజ్ఞానాన్ని స్పష్టంగా చెప్పడం కత్తిమీద సామువంటిది. అటువంటి మేధోమథనానికి కొంత ఎక్కువ సమయమే పడుతుంది. వేదాలలోని వివరాలను వాస్తవాలను నేటి తరానికి అందించాలన్నా లక్ష్యంతో "స్వేచ్ఛాలోచన, 2016, సెప్టెంబర్ సంచికలో "వేదాలు - విజ్ఞానం" అనే శీర్షికను ప్రారంభించాలనుకుంది. ఆ లక్ష్యాన్ని ఒక ఛాలెంజ్ గా తీసుకుని ప్రముఖ బౌద్ధ, సైన్సు రచయిత బొర్రా గోవర్ధన్ గారు తమ పరిశోధనా దృష్టికి పదును పెట్టారు. 2017, జూన్ సంచిక వరకు తొలి వేదమైన రుగ్వేదాన్ని పలు కోణాలనుంచి విశ్లేషించి 10 నెలలు ధారావాహికగా పాఠకులకు అందించారు. ఆ తర్వాత యజుర్వేద పరిశీలనకు రెండు నెలల రచనా విరామాన్ని ప్రకటించారు. లోతైన పరిశీలన లేకుండా, ఏదో ఉచ్చిపచ్చిగా రాయటం గోవర్ధన్ గారికి అలవాటు లేని విద్య. అందుకే ఆరు నెలలు శ్రమించి ఈ నెలనుంచి తన యజుర్వేద పరిశీలనా విశేషాలను వరుసగా అందిస్తున్నారు. వాస్తవిక దృష్టితో నీరక్షీరన్యాయాన్ని అనుసరిస్తూ మన ముందుకు వస్తున్న ఈవ్యాస పరంపరను అవలోకిద్దాం.. పదండి. - ఎడిటర్)

"వాజశ్చమే ప్రసవశ్చమే ప్రయతిశ్చమే ప్రసితిశ్చమే
ధీతిశ్చమే క్రతుశ్చమే స్వరశ్చమే శ్లోకశ్చమే
శ్రుతిశ్చమే జ్యోతిశ్చమే స్వశ్చమే యజ్ఞేన కల్పంతాం"

*నాకు అన్నం, విజ్ఞానం, ఐశ్వర్యం, సాధన, రక్షణ, ధారణ, ఏకాగ్రత, ఉత్సాహం, స్వతంత్రత, తేజం, వాణి, అన్ని విద్యలూ, సుఖం, ఇవ్వన్నీ యజ్ఞం వల్ల కలుగుగాక!* (యజుర్వేదం: 18-1)

### అసలు - నకిలీ

ఋగ్వేదకాలం క్రీ.పూ. 1700 నుండి క్రీ.పూ.1000 సంవత్సరాలు. ఆ తర్వాతికాలం యజుర్వేద కాలం. ఇది క్రీ.పూ. 1100 నుండి క్రీ.పూ. 800 సంవత్సరాలు. అంటే దాదాపుగా రెండు లేదా మూడు వందల సంవత్సరాల కాలమే.

ఋగ్వేదకాలం దాదాపు 20 నుండి 25 తరాల ఆర్యుల జీవనవిధానాన్ని మన ముందుంచుతుంది. కాని, యజుర్వేద కాలం పది తరాలలోపు ఆర్యుల జీవనవిధానాన్ని మనకు తెల్పుతుంది. అందుకే వారి జీవన వైవిధ్యం ఋగ్వేదంలో కనిపించినంతగా యజుర్వేదంలో కన్పించదు.



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

నిజానికి ఋగ్వేదం చివరి దశకే ఆర్యులు సింధూ మైదానంలో స్థిరపడ్డారు.

సింధూ ప్రజలతో ఘర్షణలు పడటం, వారి స్థావరాల్ని ఆక్రమించడమే కాదు, వారిలో వారిమధ్య కూడా అంతర్గత యుద్ధాలు జరిగాయి. దాన్ని దాశరాజ్ఞయుద్ధం అంటారు. ఆ యుద్ధంలో పురుగణానికి చెందిన ఒక శాఖవారైన "భరతులు" విజయం సాధించారు. మిగిలిన పురులు, యాదులు, తుర్వశులు, ద్రహ్యులు, అనులు, ఫక్తులు, భలానులు, నిషాణులు, అలకులు, శివులు- ఈ పది ఆర్యగణాలపై భరతగణం విజయం సాధించింది. భరతులకు వశిష్ఠుడు యుద్ధరచన చేశాడు. మన దేశానికి భరతఖండం, భరతవర్షం అనేపేర్లు ఈ భరతగణం వల్ల వచ్చినవే అనేది రాహుల్జీ, మరికొందరి చరిత్రకారుల అభిప్రాయం. ఈనాటికీ, ఫక్తుగణం పేరుతో ఫక్తూనిస్థాన్, భలాను గణం పేరుతో బోలాను కనుమల పేర్లు చారిత్రక సాక్ష్యంగా నిలిచే ఉన్నాయి.

అలా.. ఋగ్వేద అనంతరకాలం నాటికి ఆర్యులు సింధూతీరాన్ని దాటి పంచనదుల (పంజాబ్) ప్రదేశానికి వచ్చి స్థిరపడ్డారు. కడపటికి యమునాతీరాలకి చేరారు.

ఆర్యులకు యజ్ఞయాగాది క్రతువులు నిత్యకృత్యాలు. తాము తినే మాంసాన్ని 'దేవతలకు' అర్పణ చేయకుండా తినరు. ఇది ఋగ్వేదకాలం నాటి నుండి వారు మధ్య ఆసియా ప్రాంతంలో ఉన్నప్పటి నుండీ పాటించే ఆచారమే.

మధ్య ఆశియా ప్రాంతం నుండి ఆర్యులు మొత్తంగా సింధూ మైదానం వైపుకు కదలిరాలేదు. వారిలో కొందరు మాత్రమే ఇటుకేసి వచ్చారు. కొందరు అక్కడే ఉండిపోయారు.

మనం ఇప్పుడు "ఆర్యీకరించబడ్డాం" అని ఎంత చెప్పుకున్నా– ఈ 'దైవసమర్పణ' విధానాన్ని పాటించం. ఉత్తర, దక్షిణ భారతదేశాల్లోని ఆర్యుల్లోగానీ, ఆర్యులుగా చెప్పుకునే హిందూ తెగల్లోగానీ ఈ 'దైవసమర్పణ' ఆచారం అంతగా లేదు. కేవలం పండుగలు, పబ్బాల సమయంలోనే ఈ సమర్పణ కనిపిస్తుంది.

కానీ, ఆహారాన్ని ముఖ్యంగా మాంసాహారాన్ని 'దైవసమర్పణ' చేయకుండా ముక్క ముట్టని ఆర్య అనువంశీకులు ఇంకా ఇప్పటికీ ఎందరో ఉన్నారు. వారే ముస్లింలు. ముస్లిం ప్రజలు ఈనాటికీ దైవసంతర్పణ చేయని మాంసాన్ని తినరు. దీన్ని 'బిస్మిల్లా' అంటారు. నిజానికి ఈనాటి ఇరాన్ , 'ఆర్యన్' అనే పదానికి మారు రూపమే. ఋగ్వేదకాలం నాటి లేదా యజుర్వేద కాలం నాటి గోమాంస భక్షణ, దైవసంతర్పణలు వారిలో అలా ఈనాటికీ మిగిలే ఉన్నాయి.

ఆర్యులు ఆనాడు ఆవు, ఎద్దు మొదలైన పశువుల మాంసాన్ని యజ్ఞంలో సమర్పణల అనంతరమే తినేవారు.

కానీ.. **సింధూతీరానికి వచ్చాక, సింధూప్రజల, స్థానిక భారతీయ మూలనివాసుల సంస్కృతిలో కలసిపోయిన ఆర్యులు ఆ తర్వాత ఇక్కడ వచ్చిన జైన, బౌద్ధ, చార్వాక తాత్విక దృక్పథాలతో ప్రభావితులై తమ సంతర్పణల్ని, గోమాంస భక్షణాల్ని క్రమేపీ మానుకున్నారు.**

వేదకాలం నాటి ఆచారాలు కొన్ని ఇంకా ముస్లింతెగల్లో (ఇరాన్–పారశీక) నిలచి ఉన్నాయి. ఆర్యరక్తం, ఆర్య ఆచారాలు నిలచివున్న 'పవిత్ర' తెగలు ఇప్పటికీ అవే!

ఇక్కడ...వింత,విచిత్రం, తెలివిహీనం, తెంపరితనం, తలతిక్కవాదం ఏమిటంటే...

ఆర్య సంప్రదాయాన్నీ, వైదిక నివేదననీ పాటించే వారిని, తామే ఆర్యులకు వారసులం అని భ్రమించే వారు నిలదీయడం. గోమాంసభక్షకులను నిందించడం.

'అసలుకంటే...నకిలీకి నాజూకు మెండు' అంటే ఇదేమరి!!!

## అందరం - అహం

ఋగ్వేదంలో 'నేను', 'నాకు' అనే పదాలు కన్పించవు. 'మేము', 'మాకు' అనే పదాలే ఉంటాయి.

"ఓ! అగ్నిదేవా! మేము సమర్పించే ఈ తెల్లని ఆవుని స్వీకరించు. మాకు శుభం కలిగించు. మాకు, మా పిల్లలకూ ఆరోగ్యాన్ని ప్రసాదించు...ఇలాంటి 'మేము', 'మాకు' అనే సంబోధనలే రుగ్వేదంలో కనిపిస్తాయి.

**మా తే రాధాంసి మా త ఊతయో వసో అస్మాన్ కదాచన దభన్**
**విశ్వా చ న ఉపమిమీహి మానుష చర్షణిభ్య ఆ**

**(ఋగ్వేదం 1–24–20)**

(ఓ ఇంద్రా! మా జీవనానికి కారణం నీవే! నీవు మాకు ఇచ్చిన అన్నం, రక్షణలే మమ్మల్ని బాధలనుండి కాపాడుతున్నాయి. మేము మంత్ర ద్రష్టలం. మాకు అఖండ ధనాన్ని ఇమ్ము)

'ఉమ్మడిగా' ఒక పనిని చేయడం, ఆ పని ఫలితాన్ని ఉమ్మడిగా అనుభవించడం అనేది సంచార జాతుల సహజ జీవనవిధానం. గణతంత్ర జాతుల జీవన విధానం కూడా ఇలాంటిదే.

సమాజ నిర్మాణానికి కుటుంబమే ఒక యూనిట్ అయినా, సంచార తెగల్లోగానీ, గణతంత్ర తెగల్లోగానీ సమూహ ప్రయోజనమే ప్రధానంగా ఉంటుంది.

గణతంత్ర సమాజాలు సంచార సమాజాలు కావు. స్థిరనివాస సమాజాలే. అయినా ఆ వ్యవస్థలకు కూడా సమాజమే ప్రమాణమైన కొలబద్ద. ఉమ్మడి కుటుంబాలతో నిర్మించబడ్డ వ్యవస్థ అది–

అలాంటి సమాజాల్లో 'కర్మలు' గానీ, 'కర్మ ఫలాలు' గానీ వ్యక్తిగతంగా ఉండవు. ఉమ్మడిగానే ఉంటాయి. ఈ ఉమ్మడి తత్వం మనకు రుగ్వేదంలో కనిపిస్తుంది.

కానీ, ఈ ఉమ్మడి తత్వంపోయి 'వ్యక్తిగత' వ్యవహారం, వ్యక్తిగత లాభం, కర్మఫలం వ్యక్తికి చెందాలనే సంకుచిత సామాజిక ధోరణి యజుర్వేదకాలం నాటి ఆర్యుల్లో కన్పిస్తుంది.

దానికి రుజువే.. యజుర్వేదంలోని పద్దెనిమిదో అధ్యాయం. ఈ అధ్యాయంలో యజ్ఞఫలం 'నాకు దక్కాలి' అనే నివేదనల్ని చూస్తాం.

**"ఊర్కచ మే సూనృతాచ మే పశ్చమే రసశ్చమే**
**ఘృతం చ మే మధుచమే సగ్ధిశ్చమే**
**కృషిశ్చమే వృష్టిశ్చమే జైత్రం చ మే ఔద్భిద్యంచమే**
**యజ్ఞేన కల్పంతాం !"**

**(యజుర్వేదం: 18–9)**

అంటే.. *"యజ్ఞం వల్ల.. నాకు అన్నము కలుగు గాక. నాకు సత్యవాణి కలుగుగాక. నాకు పాలు లభించుగాక. నాకు దధి కలుగుగాక. నాకు మధువు కలుగుగాక. నాకు సహభోజనం, సహపానం కలుగుగాక. నాకు పరిపూర్ణత కలుగుగాక. నాకు ధాన్యవృద్ధి కలుగుగాక. నాకు అక్షయత కలుగుగాక. అన్నం లేని బాధ కలుగకుండును గాక!"*

ఇలాంటి 'వ్యక్తిగత' వ్యవహారాలు ముదిరాయంటే.. గణస్వభావం పోయి 'నియంతృత్వ స్వభావానికి ఆ సమాజం మరలి ఉండాలి. అంటే గణతంత్ర వ్యవస్థల స్థానంలో కేంద్రీకృత (ఏకకేంద్ర)రాజ్యాలుగా ఆర్యగణాలు మారుతూ ఉండాలి.

నిజానికి ఈ 'ఏకీకృతం' వైపు ఆర్యగణవ్యవస్థ ఋగ్వేదకాలం నాటి దాశరాజ్ఞయుద్ధం తోనే మొదలైంది. సర్వగణాధిపత్యం వహించడమే ఏకీకృతం. రాచరికం. గణసమాజాల్లోని వికేంద్రీకరణశక్తి, క్రమేపి ఏకకేంద్రక శక్తిగా రూపుమార్చుకుంది. అది ఋగ్వేదం చివరిదశలోనే మొదలై, యజుర్వేద కాలానికి ముదిరిపోయింది.

ఈ మార్పులు యజ్ఞనిర్వహణలో కూడా కనిపిస్తాయి. గణం మొత్తం యజ్ఞాధిపత్యాన్నివహించే స్థితి మారి, ధనవంతులు, రాజులు, వ్యాపారులు కూడా వ్యక్తిగతంగా యజ్ఞయాగాల్ని చేయించే విధానం యజుర్వేదంలో కనిపిస్తుంది. (ఇది ఇప్పటికీ ఉంది. గ్రామదేవతల కొలుపులు రెండు రకాలుగా జరుగుతాయి. ఊరుమ్మడిగానూ, వ్యక్తులుగానూ ఈ జాతర్లు చేస్తారు. అలాగే యజ్ఞాలు కూడా. సామూహిక యజ్ఞాలు, గృహయజ్ఞాలు.)

అంటే.. ఒకప్పుడు సింధూ ప్రజల్లో ఉన్న ధనిక పేద వ్యత్యాసాలు యజుర్వేదకాలానికి ఆర్యుల్లో కూడా కనిపిస్తాయి. ఋగ్వేద ఆర్యుల్లో ధనిక పేద వ్యత్యాసాలు కనిపించవు. వీరిలో ఈ సామాజిక మార్పుకూ స్థిరజీవనమే ప్రధానకారణం.

## భావజాల విజయం

ఆర్యులు భారతదేశాన్నంతా ఒకేసారి జయించలేదు. వారు సింధూప్రాంతాన్ని ఆక్రమించడానికే వెయ్యేళ్ళు పట్టింది. ఏదో హాలివుడ్ సినిమాలో కంప్యూటర్ గ్రాఫిక్ యుద్ధంలా ఒకేసారి దండెత్తి వచ్చి సింధూనగరాల్ని ధ్వంసం చేయలేదు. వారూ ఇక్కడికి వచ్చి వ్యవసాయంలోకి మళ్ళాకే ఈ ఆక్రమణలు జరిగాయి. కేవలం పశువుల మందల 'మేత' కోసం సింధూ పంటభూముల్ని, నగరాల్ని ధ్వంసం చేసారనుకోవడం అంత నిజం కాదు. వ్యవసాయం, వ్యాపారం, స్థిరనివాసాల వల్ల పోగుపడుతున్న సంపదల రుచి చూసాకే వారు దురాక్రమణలు పెంచారు. ఇలా వ్యవసాయ ఉత్పత్తిని పెంచుకోవటం కోసం, వ్యవసాయక్షేత్రాల్ని ఆక్రమించేందుకే సింధూప్రాంతాన్ని ఆక్రమించారు. అందుకోసమే యమునాతీరంవైపు కదిలారు– గంగాతీరాన్ని హస్తగతం చేసుకున్నారు.

వారు ఉత్తరభారతదేశాన్ని వదిలి దక్షిణాపథం వైపుకు రాలేదు. వేదకాలం అనంతరం పురాణకాలం నాటికి అడపాదడపా ఇటుకేసి తొంగిచూశారు. అంతే! వారు దక్షిణాపథాన్ని జయించింది వారి భావజాలంతోనే!

**రాజకీయంగా ఏకకేంద్ర రాచరికంతో, కర్మకాండలుగా వైదిక కర్మకాండలతో, తాత్త్వికంగా ఉపనిషత్తుల తత్త్వంతో, సాంఘికంగా మనువాదంతో ఇలా... భావజాలపరంగా మొత్తం భారతదేశాన్ని జయించారు. వారి భావజాలమే మొత్తం దేశాన్ని బందీ చేసింది తప్ప కత్తిపట్టి జయించింది కాదు.**

ఆ తర్వాత ఆర్యుల భావజాలానికి భిన్నమైన భావజాలంగా దానికి ప్రత్యామ్నాయ భావజాలంగా, మూలవాసుల భావజాలంగా వచ్చింది బౌద్ధం మాత్రమే!–

ఆర్యుల భావజాలంలో అతిప్రధానమైన బలహీనత– 'నైతికత'. వేదాల్లో 'నైతిక' నిబంధనలు, నియమావళి కనిపించవు. **ఋగ్వేద, యజుర్వేదాలలో మానవీయత, నైతికత అనేవి మైక్రోస్కోప్ వేసి వెదికినా కన్పించవు. అందుకే ఆర్య సంస్కృతిని 'ఆటవిక సంస్కృతిగా' చెప్పుకునేది.**

అయితే మారిన ఆర్యజీవన విధానంతో ఏకకేంద్ర రాజ్యాలు, రాజులూ, చక్రవర్తుల ప్రాధాన్యత పెరిగింది. అందుకే ఆ తర్వాతి ఆర్య సాహిత్యం పురాణాల రూపు తీసుకుంది. వీటికి ఆరణ్యకాలు దారి చూపించాయి. ఆ సాహిత్యం నుండి పురాణ పురుషులు పుట్టుకొచ్చారు. ఏకకేంద్ర నియంత్రత్వరాజ్యాల్ని పటిష్టం చేయడంకోసమే ఆర్యసాహిత్యం నిలబడింది. అది స్మృతులుగా రూపమెత్తి, మనుధర్మశాస్త్రంగా శాసనం అయ్యింది.

ఇదంతా చారిత్రక పరిణామం. వేదాలు చారిత్రక పరిణామంలో ఎలా మారాయి, వైదిక సంస్కృతి ఎలా మారింది అనేది ఇక్కడ చర్చనీయాంశం కాదు. కానీ, పాఠకునికి ఒక చారిత్రక భూమిక అవసరం అనుకొని ఈ కొద్దిపాటి చర్చ కొనసాగింది.

ఇక అసలు విషయానికొస్తే...

ఋగ్వేదంలో దేవతల ఆరాధన ఉంటుంది. యజుర్వేదంలో యజ్ఞనిర్వహణ, దాని విధివిధానాలు ఉంటాయి. పశువధ చాలా భారీ ఎత్తున కన్పిస్తుంది.

యజుర్వేదం రెండుశాఖలుగా ఉంది.

ఒకటి: కృష్ణ యజుర్వేదం,

రెండు: శుక్ల యజుర్వేదం

ఋగ్వేదంలోని శ్లోకాల్ని 'రుక్కులు' అన్నట్లే యజుర్వేదంలోని మంత్రాల్ని 'యజుస్సులు' అంటారు. 'యజ్'

అంటే 'దైవపూజ' అని అర్థం. దేవతలకి 'హవిస్సులు' సమర్పించేప్పుడు చెప్పే మాటలే మంత్రాలు. హెూత, ఉద్గాత, అధ్వర్యుడు... ఇలాంటి యజ్ఞకర్తల్లో ఒకరైన అధ్వర్యుడు పలికేవి మంత్రాలు కాబట్టి యజుర్వేదాన్ని 'అధ్వర్యం' అని కూడా అంటారు. వేదభాష్యకారులైన యాస్కుడు (క్రీ.పూ 800), సాయనుడు(క్రీ.శ.1500)కూడా యజుర్వేదాన్ని అధ్వర్యం అనే అన్నారు.

శుక్ల యజుర్వేదం ఉత్తరాది వారు పాటిస్తారు. వారు తెల్లగా ఉంటారు కాబట్టి అలా పిలిచి ఉంటారు. కృష్ణయజుర్వేదాన్ని దక్షిణాది వారు పాటిస్తారు. దక్షిణాది వారు నల్లనివారు కాబట్టి అలా పిలిచి ఉండొచ్చు.

ఆర్య 'వర్ణ వివక్షతకి' యజుర్వేదవిభజన ఒక చారిత్రక ఆధారం.

ఋగ్వేదం ఒక స్తుతి గ్రంథం. యజుర్వేదం యజ్ఞనిర్వహణ విధివిధానం. అంటే ఒక కార్యాచరణ. కార్యరూపందాల్చే ఏ విధానమైనా ప్రాంతాలు,ప్రజలస్థితిగతుల్ని బట్టి ఉంటుంది. మారుతుంది. అందుకే యజ్ఞం నిర్వహించే విధివిధానాల్లో మార్పులు పొడచూపాయి. ఆ మార్పుల ఫలితమే యజుర్వేదం రెండుగా చీలడం.

నిజానికి శుక్లయజుర్వేదం లోని 700 మంత్రాలు ఋగ్వేదంలోనివే. దానిలోని విషయం కృష్ణ యజుర్వేదంలోనిదే! అయితే, శుక్లయజుర్వేదం విద్య సాంస్కృతిక వికాసానికి ప్రాధాన్యత నిచ్చింది. ఈ ప్రాధాన్యత ఆ తర్వాతి ఉపనిషత్తుల మార్గానికి దారి చూపించింది.

మనం చారిత్రకంగా చెప్పుకోవాలంటే.. **ఆర్యుల సాంస్కృతిక భావజాలదాడి దక్షిణాదిమీద కృష్ణయజుర్వేదంతో మొదలైంది. ఆర్యుల 'ఎంగిలిని దక్షిణాది వారు ఇలా స్వీకరించారు' అని చెప్పడానికి ఆధారం వేదసంప్రదాయంలోనే ఉంది.**

2012, ఏప్రిల్ లో భద్రాచలం దగ్గరి ఎటపాకలో నిర్వహించిన అతిరాత్రయాగం కృష్ణయజుర్వేదీయ శాఖకు చెందింది. అసలు ఈ రోజుల్లో యాగాలనిర్వహణ సరైనదికాదని నాస్తిక, హేతువాదులు నిరసిస్తే, నిలదీస్తే....అసలు ఇది సరైనయాగం కాదని ఉత్తరాది శుక్లయజుర్వేదీయులు నిందించారు.

బ్రహ్మ నాలుగు వేదాల్ని వేదవ్యాసుడికి చెప్పాడట! ఋగ్వేదాన్ని పైలునికి, యజుర్వేదాన్ని వైశంపాయునికి, సామవేదాన్ని జైమినికి, అధర్వణ వేదాన్ని సుమంతునికి చెప్పాడు!

వైశంపాయనుడు తనకు తెలిసిన యజుర్వేదాన్ని తన దగ్గరున్న శిష్యులందరికీ కాకుండా యాజ్ఞవల్క్యుడు ఒక్కనికే చెప్పాడు. ఆ తర్వాత గురు, శిష్యులకు 'ఎవరు గొప్ప?' అనే విషయంలో స్పర్థరేగింది. నా దగ్గర నేర్చింది 'కక్కేయి' అన్నాడు. అంటే 'నాది నాకు కక్కు' అన్నాడు. యాజ్ఞవల్క్యుడు కక్కేశాడు. అప్పుడు వైశంపాయనుడు మిగిలిన శిష్యులతో– తిత్తిరి (టిట్టిభ) పక్షులుగా మారి ఆ కక్కింది తినమన్నాడు. వారు తిన్నారు. మకిలిని (నల్లని దాన్ని) తిన్నారు కాబట్టి అవి కృష్ణయజుస్సులు (నల్లని మంత్రాలు) అయ్యాయి. దాన్నే కృష్ణయజుర్వేదం అంటారు. తిత్తిరి పక్షులు తిన్నాయి కాబట్టి ఈ మంత్రాలని 'కృష్ణయజుర్వేద తైత్తిరీయ సంహిత' అని అంటారు.

మరలా యాజ్ఞవల్క్యుడు విష్ణువు నుండి బ్రహ్మకు, బ్రహ్మ నుండి ఆదిత్యునికి పరంపరగా అందిన యజుస్సులను (మంత్రాలను) ఆదిత్యుని నుండి గ్రహించాడు. అదే శుక్లయజుర్వేదం. తెల్లని, శుద్ధి అయిన యజుస్సులున్న వేదం. యాజ్ఞవల్క్యుడు వాజసుడు అనేవాని కొడుకు, కాబట్టి శుక్లయజుర్వేదాన్ని 'వాజసనేయం' అంటారు. ఆ తర్వాత ఇది మాధ్యందిన అనే రుషికి అందింది. కాబట్టి దీన్ని 'వాజసనేయ మాధ్యందిన శుక్లయజుర్వేద సంహిత' అంటారు.

శుక్లయజుర్వేదం గద్య, పద్యాల సంకలనం. ఎందుకంటే... ఇది ఋగ్వేదం, కృష్ణయజుర్వేదం నుండి గ్రహించబడినది కాబట్టి.

**కృష్ణ యజుర్వేదం గద్య సంకలనం. తొలి గద్యరచన.**

వేదవ్యాసుని వంశావళి వశిష్ఠునితో మొదలవుతుంది. వశిష్ఠుని కొడుకు శక్తి, శక్తి కొడుకు పరాశరుడు, పరాశరుని కొడుకు వ్యాసుడు–ఈ వరుసక్రమాన్ని బట్టి చూస్తే వశిష్ఠుడు మూలపురుషుడు. ఆనాడు ఋగ్వేదకాలంలో దాశరాజ్ఞ యుద్ధాన్ని గెలిపించిన వ్యూహకర్త, ఆనాటి మంత్రవేత్త వశిష్ఠుడే. భరతగణ రాజ పురోహితుడు, గురువు. అందుకే వశిష్ఠునికి ఈ గౌరవం ఆర్య సాహిత్యం అంతటా కనిపిస్తుంది.

యజ్ఞాల నిర్వహణలో పశువధతో పాటు ఎంతో కలప నాశనం అయ్యేది. ముఖ్యంగా యజ్ఞంలో వాడాల్సిన కలప 'రావి' కలప. ఆ తర్వాత మోదుగు. యజ్ఞాల కోసం భారీఎత్తున రావిచెట్ల విధ్వంసం జరిగింది. అందుకే బుద్ధుడు వైదిక క్రతువులకు ప్రత్యామ్నాయంగా రావిచెట్టును బోధివృక్షంగా ప్రకటించి, రావి చెట్లను యజ్ఞాలకు ఆహుతి కాకుండా కాపాడాడు.

అటు జంతుకోటి మెడలు, ఇటు వృక్షజాతి మొదళ్ళు నరికి, నేలరాల్చి,నేలకూల్చి పర్యావరణానికి పెనుముప్పు కలిగించే యాగాల విధివిధానాలకు ఆలవాలమైన యజుర్వేదంలో వైజ్ఞానిక అంశాలు ఏమైనా ఉంటాయా? ఉన్నాయా?... చూద్దాం!

**(ఇంకావుంది)**

# ఋతువులకు రక్తతర్పణ

**ధూమ్రాన్ వసంతాయాలభతే శ్వేతాన్ గ్రీష్మాయ కృష్ణాన్ వర్షాభ్యో**
**అరుణాంచరదే పృషతో హేమంతాయ పిశంగాంచి శిరాయ**

ధూమ్ర వర్ణంగల 3 మేకల్ని వసంత రుతువుకి, 3 తెల్లని మేకల్ని గ్రీష్మరుతువుకి, నలుపు మేకలు మూడింటిని వర్షరుతువుకి, ఎరుపు మేకలు మూడింటిని శరదృతువుకి, మచ్చలున్న మూడు మేకల్ని హేమంతానికి, 3 పసుపు రంగు మేకల్ని శిశిరానికీబలిస్తాను' -(శుక్ల యజుర్వేదం: 24-11)

**యజుర్వేదకాల ప్రజలు ఋగ్వేదం కన్నా కాలగణనలో పురోగతి సాధించారు. ఆ కాలగణను నిశితంగా పరిశీలిస్తే వారు ఏ ప్రాంతం నుండి ఏ ప్రాంతానికి వలస వెళ్ళారో, ఎక్కడ స్థిరపడ్డారో తేల్చవచ్చు. అలాగే సంచారజీవనం నుండి స్థిరజీవనానికి ఎలా మారారో అంచనా వేయవచ్చు. కానీ వారి జ్ఞానాన్నంతా యజ్ఞయాగాలకి ముడివేయడం వలన విపరీత వ్యాఖ్యానాలకు గురికాబడ్డారు.**

పశుపాలకులైన సంచార జాతులకు కాలగణనంలో ఖచ్చితత్వం అంతగా అవసరం ఉండదు. వారి ఉత్పత్తులు ప్రధానంగా పశువులే. పశువుల వృద్ధికి మేత, నీటి వసతి అతిముఖ్యం. ఇక వాటి పునరుత్పత్తికి ఆయా జంతువులు 'ఎదకొచ్చే' కాలాలు ఆయా జంతువులవే! బాహ్యప్రకృతి, వాతావరణంలో అంతగా పనిలేదు.

కానీ వ్యవసాయం వేరు. వ్యవసాయానికి వాతావరణ పరిజ్ఞానం చాలా అవసరం. కాబట్టి కాలాలూ, రుతువులు, మాసాల లెక్కలు తెలియాలి. అంతేకాదు స్థిర నివాసులైన వ్యవసాయదారుల నాగరకతా వేగం కూడా ఎక్కువే. దానితో వృత్తులు, ఉత్పత్తులు వేగంగా పెరగాలి. మనిషి జీవితంలో చేయాల్సిన పనులూ పెరగాలి. వీటన్నింటినీ సమన్వయం చేసుకోవాలంటే.. కాలగణన (కేలండర్) చాలా ముఖ్యం.


బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

తిథి (తేది), నక్షత్రం, మాసం, రుతువులు, సంవత్సరాల పరిజ్ఞానం పెంపొందితేనే నాగరకతా వికాసం సాధ్యం. యజుర్వేదకాలం నాటికి కేలండర్ పరిజ్ఞానం ఆర్యులకి బాగా అబ్బింది. దానికి కారణం.. వారు ఋగ్వేదానంతరకాలంలో స్థానిక ప్రజలతో బాగానే సంకరం చెందారు. సింధూప్రజల 'కాల'పరిజ్ఞానాన్ని వారూ తెలుసుకుని, నేర్చుకున్నారు. అవును ఎందుకంటే... ఆర్యులకంటే ముందే ఇక్కడ మూలవాసులు వ్యవసాయజీవనం సాగిస్తున్నారు. కాబట్టి ఆర్యులకు కేలండర్ పరిజ్ఞానం స్థానిక ప్రజల్నుండి లభించిందే! అయితే, తమ వ్యవసాయక అభివృద్ధితోపాటు వారు కేలండర్‌నూ అభివృద్ధి పరిచారు. అది యజుర్వేదంలో స్పష్టంగా కనిపిస్తుంది.

మన జీవనానికీ ప్రకృతికీ విడదీయలేని బంధం ఉంది. అసలు "పగలు రాత్రి" తోనే మన మనుగడ నడుస్తూ ఉంటుంది. చీకటి పడగానే విశ్రమించడం అనేది కేవలం మానవుల ప్రత్యేకతేం కాదు. ఎన్నో జీవరాశులు రాత్రికాగానే దైనందిన జీవనయానానికి విశ్రాంతినిచ్చి, నిద్రలోకి జారి, సేద తీర్చుకుంటాయి. అలాగే... చీకటి పడగానే నిద్రలేచి జీవనక్రియల్ని ప్రారంభించే జీవులూ కొన్ని ఉన్నాయి. అవి రాత్రంతా ఆహారసంపాదన కోసం శ్రమించి, సూర్యోదయం కాగానే విశ్రాంతిలోకి వెళ్ళిపోతాయి. అలాగే.. పగలూ, రాత్రీ వ్యత్యాసం లేకుండా అవిశ్రాంతంగా ఆహారాన్వేషణ జరిపే జీవులూ వున్నాయి-

అయితే, మనం పగలు శ్రమించి, రాత్రికి విశ్రమించే జీవజాతికి చెందిన జీవులం. దివాచరులం.

నిజానికి ఈ పగలు, రాత్రి భాగాల్ని విభాగించుకొని జీవించడం కూడా అభివృద్ధికర జీవపరిణామంలో భాగమే!- పరిణామక్రమంలో నిశాచరుల తర్వాతే దివాచరులు ఉద్భవించాయి. ఈ దివాచర జీవులకి వెలుగునిచ్చే సూర్యుడే మొదటిదిక్కు. దిక్కు అంటే ఆధారం.

కాబట్టి మానవజాతి తొలి పరిశోధన, పరిశీలన ఈ సూర్యుణ్ణి గురించి తెలుసుకోవడంతోనే మొదలైంది. వారు సూర్యునిమీద దృష్టి మళ్ళించాక సూర్యుడి వెలుగులో కూడా కనిపించీ కనిపించనంతగా మార్పులు ఉన్నాయని గమనించారు. ఉదయ, సాయంకాలాలు చల్లదనం, మధ్యాహ్నం మండే ఎండ ఇది రోజూ చూసేదే. కానీ.. ఏడాదిలో కొన్నిరోజులు ఎండవేడి అధికం. కొన్నిరోజులు అధిక శీతలం. కొంతకాలం పగటికాలం ఎక్కువ, కొంతకాలం పగటికాలం తక్కువ. పగటికాలం ఎక్కువగా ఉన్నప్పుడు సూర్యుడు భూమికి ఉత్తరభాగంలో ఉదయిస్తున్నాడు. రాత్రిభాగం

ఎక్కువైనప్పుడు దక్షిణభాగంలో ఉదయిస్తున్నాడు. ఇవే ఉత్తరాయణం, దక్షిణాయనం. ఈ మధ్యరోజుల్లో రెండురోజులు పగలూ రాత్రిళ్ళు సమానంగా ఉంటున్నాయి. ఇవి విషవత్తులు- ఇలా మారేప్పుడు సూర్యునితోపాటు చెట్లూ మారిపోతాయి. కొన్ని పూలు పూస్తాయి. కొన్ని ఆకులు రాలుస్తాయి. కొన్ని పండ్లతో నిండుగా ఉంటాయి. కొన్ని చిగురులు తొడుగుతాయి. కొంతకాలం వానలు, కొంతకాలం గాడ్పులు, కొంతకాలం మంచుదుప్పటి... ఈ మార్పులన్నీ సూర్యున్ని గమనిస్తూ భూమిమీద వారు గమనించిన మార్పులు.

ఈ మార్పులకి దేవుళ్ళు, దయ్యాలు కారణమని కొందరు ఎంచినా, 'సూర్యుడే' కారణమని ఎంచినవారు ప్రపంచంలో అన్నిచోట్లా ఉన్నారు. మనకూ ఉన్నారు. వారిలో చరిత్రకు అందినంత వరకూ, మొదటివారు సింధూప్రజలు. తర్వాత ఋగ్వేద ఆర్యులు. ఆ తర్వాత యజుర్వేదకాలం నాటి ప్రజలు.

ఋగ్వేద ఆర్యులు తిథుల్ని, నెలల్ని, ఋతువుల్ని, కాలాల్ని, ఆయనాల్ని, సంవత్సరాన్ని గుర్తించినట్లు గతంలో తెలుసుకున్నాం. అయితే వారి కాలంలో నివసించిన ఈజిప్టు, జర్మనీ, పెరూ దేశప్రజలు వారికంటే కాలగణనంలో మరింత మెరుగైన స్థితిలో ఉన్నారని కూడా తెలుసుకున్నాం.

అయితే, ఋగ్వేదంలో 12 నెలల పేర్లు, 30 తిథుల పేర్లు లేవు. ఋగ్వేదం (10-85-13)లో మఖ, పుబ్బ, ఉత్తర అనే మూడు నక్షత్రాల పేర్లే ఉన్నాయి.

అయితే, కాలగణన యజుర్వేద కాలం నాటికి బాగా మెరుగుపడింది. వాటి వివరాలు చూద్దాం!

## తిథులు - నక్షత్రాలు

తిథి అంటే తేదీ. ప్రతిరోజునూ ఏదో ఒక పేరుతో గుర్తించడం. ప్రతిరోజునూ సూర్యునిలో వచ్చే మార్పుని బట్టి గుర్తించడం చాలాకష్టం. ఈ మార్పుని రాత్రిరాజైన చంద్రునితో గుర్తించడం తేలిక. ఎందుకంటే చంద్రుడు రోజూ ఒకే ఆకారంలో ఉండడు. ఒకే ప్రాంతంలో కనిపించడు. తన ఆకారాన్ని మార్చుకుంటూ, తను రోజూ కనిపించే ప్రదేశాన్ని మార్చుకుంటూ ఉంటాడు. కాబట్టి చంద్రుని స్థితిగతుల్ని బట్టి కాలాన్ని కొలవడం తేలిక అయ్యింది.

చంద్రుని పెరిగే తరిగే ఆకారాన్ని తీసుకుని గమనిస్తే 30 రోజుల క్రమం తెలుస్తుంది. ఈ మార్పుల్నే చంద్రకళలు అంటారు.

చంద్రునిలోని ఈ మార్పులు ఇలా తిరిగితిరిగి జరుగుతూనే ఉంటాయి. కాబట్టి ఈ 30 రోజుల్ని పెరిగి తరిగే విషయాన్ని తీసుకుని రెండుభాగాలు(పక్షాలు)గా చేసి పెరిగే దశకు శుక్లపక్షం అనీ, తరిగేదశకు కృష్ణపక్షం అని పేరుపెట్టారు.

శుక్ల అంటే తెలుపు, కృష్ణ అంటే నలుపు. ఆ మార్పుల్ని గమనిస్తున్నప్పుడు చంద్రునితో కలసి ఆకాశంలో కన్పించే వివిధ నక్షత్రాల్ని గమనిస్తే... ఈ మార్పులు ఎప్పుడూ.. 27 నక్షత్రాల సమీపంలోనే జరుగుతూ ఉంటాయి. ఎప్పుడు చూసినా చంద్రుడు ఈ 27 నక్షత్రాల సమీపంలోనే ఉంటాడు. ఇంకా ఇంకా పరిశీలిస్తే ఈ 27లో కూడా పున్నమిరోజుల్లో కేవలం 12 నక్షత్రాల సమీపంలోనే ఉంటాడు. మరలా 12 పున్నముల తర్వాత తిరిగి ఈ క్రమం అలాగే నడుస్తుంది.

కాబట్టి... ఈ చంద్రకళలకీ, నక్షత్రాలకీ కలిపి అసలు చంద్రుని ఈ కళలకు కారణం ఏమిటో చెప్పిన రెండు కథలు యజుర్వేదంలో ఉన్నాయి.

## తిథుల కథలు

**ప్రజాపతే స్త్రయస్త్రిగ్ంశర్దుహితర ఆసన్హా సోమాయ రాజ్ఞే2దదాత్తసాగ్ం రోహిణి ముపైత్తా ఈర్ష్యన్తీ**

**... (కృ.యజు: 2-3-5)**

"ప్రజాపతికి ముప్పైముగ్గురు కూతుళ్ళు. ఆయన వారందరినీ రాజు అయిన సోమునికి ఇచ్చాడు. సోముడు రోహిణి దగ్గరే ఉంటున్నాడు. మిగిలినవారు ప్రజాపతి దగ్గరకు తిరిగి వెళ్ళారు. అతను సోముని దగ్గరకు వెళ్ళి 'అందర్నీ సమానంగా చూస్తాను' అని శపథం చేయమన్నాడు. సోముడు అలాగే చేశాడు. కానీ తన శపథం తప్పి, మరలా రోహిణితోనే గడప సాగాడు. శపథం తప్పాడు కాబట్టి సోమునికి 'యక్ష్మ'రోగం పట్టుకుంది."

యక్ష్మ అంటే క్షయరోగం. ఆ తర్వాత వారిని పిలిచి 'సమానంగా చూస్తాను' అని చెప్పాడు. అప్పుడు వారు సోముని కోసం ఆదిత్య దేవతాకమగు 'చరు'ని నిర్వపం చేశారు. అతని రోగం తగ్గింది.

ప్రజాపతి పుత్రికలే నక్షత్రాలు. ఈ కథలో 33 నక్షత్రాలని ఉంది. వేదకాలానికి 11, 33 అనే సంఖ్యలకు ఒక ప్రాధాన్యత ఉంది. ఆ అలవాటుగా ప్రజాపతికి 33 మంది కుమార్తెలు అని చెప్పారు. ఆ తర్వాత ఈ సంఖ్య 27కు సవరించబడింది.

పురాణకాలానికి ప్రజాపతి 'దక్షుడు'గా మారాడు. ఆయనకు 28మంది కుమార్తెలు. పెద్దామె శివుణ్ణి పెండ్లాడి పుట్టింటి నుండి వెళ్ళిపోయింది. మిగిలిన 27 గురిని దక్షుడు చంద్రునికిచ్చి పెళ్ళి చేస్తాడు. చంద్రుడు రోహిణితోనే కాలం గడుపుతూ మిగిలినవారిని నిర్లక్ష్యం చేస్తాడు. కూతుళ్ళు పోయి తండ్రితో మొరపెట్టుకుంటే దక్షుడు వచ్చి చంద్రుణ్ణి 'క్షయగ్రస్తునివి' కమ్మని శపిస్తాడు. భర్త క్షీణత చూసి, భరించలేని కూతుళ్ళు మరలా తండ్రికి శాపవిమోచన కలిగించమని

వేడుకుంటారు. తన శాపతీక్షణతని సగానికి తగ్గిస్తాడు. అలా 15 రోజులు క్షీణిస్తూ, 15 రోజులు వృద్ధి అగుతూ కాలం వెళ్ళదీస్తాడు చంద్రుడు. ఈ కథ వేదంలోని కథకు మార్పులతో కూర్చిందే! ఐతే–

కృష్ణయజుర్వేదంలోనే 2–5–6 లో వేరేవిధంగా ఉంది.

"చంద్రుడు రాజు. కృష్ణపక్షంలోని, శుక్లపక్షంలోని రాత్రులన్నీ భార్యలు. చంద్రుడు పూర్ణిమ, అమావాస్య అనే భార్యల్ని కూడలేదు. వారు తమని కూడమని వత్తిడి చేయగా తన శపథాన్ని మరచి వారితో కూడాడు. దానితో శపథం విస్మరించడం వల్ల క్షయరోగం కలిగింది"

చంద్రుడు అమావాస్య, పూర్ణిమల దగ్గరకు వెళ్ళి వాళ్ళకు నమస్కరించగా, వారు–

"మేము ఇద్దరం మాత్రమే దేవతల హవిస్సులు వహిస్తాం. మమ్మల్ని ఆశ్రయించే దేవతాయాగాలు జరగాలి. అలా జరుగునని మాకు వరం ఇమ్ము" అని అడిగాయి. చంద్రుడు వరం ఇచ్చాడు. రోగం వదలించుకున్నాడు. అప్పటి నుండి యాగాలు అమావాస్య, పూర్ణిమ రోజుల్లోనే జరిగే ఆచారం వచ్చింది.




ఇదీ ఆ కథ. ఈ కథలో పుత్రికలైన నక్షత్రాలు లేవు. రెండూ తిథులే ఉన్నాయి–

అమావాస్య, పున్నమి రోజులనేవి చంద్రకళల్లో విశేషమైనవి. ఎందుకంటే మిగిలిన తిథులైన పాడ్యమి, విదియ, తదియ, చతుర్దశి, పంచమి, షష్ఠి, సప్తమి, అష్టమి, నవమి, దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి– ఈ 14 తిథులు ఉభయపక్షాల్లో ఉంటాయి. శుక్ల పాఢ్యమినాటి నెలవంక సైజులోనే కృష్ణచతుర్థశి నాటి నెలవంక ఉంటుంది. పరిమాణం ఒకటే.. ప్రదేశం, సమయాలే వేరువేరు. అలాగే మిగిలినవీ. కానీ... అమావాస్య, పున్నములు రెండూ, రెండు వేర్వేరు రూపాలు. అందుకే ఆ రెండూ వేర్వేరు ప్రత్యేక తిథులుగా గుర్తింపు పొందాయి.

ఇక్కడ మరో విషయం ఉంది. దీనిమీద విశేష వివరణ లేదుగానీ–

**నవోనవోభవతి జాయమానో2హ్నాం కేతురుష సామేత్యగ్రే భాగం దేవేభ్యో విదధాత్యాయన్ప్ర చన్ద్రమాస్థిరతి దీర్ఘమాయ్ణు యం ఆదిత్యా ఆగేంశు మాప్యాయన్తి యమక్షిత మక్షితయ్ణు పిచన్తి!**

**(కృ.యజు: 2–4–14)**

(ఆదిత్యుడు చంద్రుని వృద్ధిక్షయలకు (పక్షాలకు) కారకుడు" . "ఆదిత్యుడు చంద్రునికి రోజుకు ఒక కళను వృద్ధి చేస్తున్నాడు. రోజుకు ఒక కళను క్షీణింప చేస్తున్నాడు)

చంద్రుని కాంతికి ఆదిత్యుడు (సూర్యుడు) కారణం అని చెప్పడం లేదు గానీ, యాగంవల్ల వృద్ధిక్షయలకు ఆదిత్యుడు కారకుడు అని చెప్పడం కూడా తీసేయాల్సిందికాదు. తోసేయాల్సింది కూడా కాదు.

ఇక, ఈ కళలలో కొన్నిటికి ప్రత్యేక పేర్లు ఉన్నాయి–

**ద్రుక్కామశ్ఛందాగ్ంసి ............ సినీవాల్యనుష్టుప్కుహూర్ధాతా వషట్కార్ణ పూర్వపక్షో రాకా అపరపక్ష కుహూరమావాస్యా సినీవాలీ పౌర్ణమాస్యను మతిశ్చంద్రమా ధాత్మాష్టా!**

**(కృ.యజు: 3–4–9)**

పున్నమినాటి చంద్రుని పేరు– రాకాదేవి.

అమావాస్య నాటి చంద్రునిపేరు – కుహూదేవి

కృష్ణచతుర్దశి పేరు సినీవాలీ అంటే కృష్ణచతుర్దశి, అమావాస్య రెండు తిథులూ కలిసి వచ్చేరోజు.

శుక్ల చతుర్దశిని – అనుమతి దేవి అంటారు. అంటే శుక్ల చతుర్దశి, పున్నమి కలిపి ఒకేరోజున వచ్చే తిథులు.

అలాగే.. మాఘమాసంలో వచ్చే కృష్ణ అష్టమిని 'ఏకాష్టకా' అంటారు – **(కృ.యజుర్వేదం: 4–3–11–6)**

ఈ కళలు లేదా తిథుల గుర్తింపులో ఖచ్చితమైన ఎంపిక యజుర్వేదకాలంలో ఉంది.

## ఉభయ మానాల ఒప్పులకుప్ప

కానీ... తిథుల్నే నమ్ముకుంటే వచ్చే ఒక తిప్ప వుంది. ఈ తిథుల కాలపరిమాణం ఖచ్చితం కాదు. ఎందుకంటే ఆకాశంలో ఈ 27 నక్షత్రాలూ ఖచ్చితమైన సమాన దూరాలలో లేవు. కాబట్టి కొన్ని పొడవుతిథులు, కొన్ని పొట్టితిథులు వుంటాయి.

కానీ, సూర్యోదయం నుండి తిరిగి సూర్యోదయం వరకూ సమయంలో పెద్ద వ్యత్యాసం ఉండదు.

వచ్చిన చిక్కు ఎక్కడంటే...

సూర్యుణ్ణి బట్టి రోజు కొలత దాదాపు నిక్కచ్చిగా ఉంటుంది. కానీ, సూర్యునిలోని మార్పుల్ని బట్టి రోజుల్ని లెక్కించడం చాలా చాలా కష్టం. చంద్రునిలో కళల సమయాలు అంత ఖచ్చితత్వంగా ఉండవు. కానీ, చంద్రకళల్ని బట్టి రోజుని గుర్తించడం చాలా చాలా తేలిక.

అందుకే... ఈ రెండు కాలగణనల్ని (సౌర, చాంద్ర మానాల్ని) కలిపి లెక్కించుకోవాల్సి వచ్చింది. అంటే..తేలికగా లెక్కించ గలిగే నిర్దిష్టత లేని చాంద్రమానంతో, తేలికగా గమనించలేని నిర్దిష్టత గల సౌరమానంతో కలిపి యజుర్వేద ఆర్యులు ఒప్పులకుప్ప ఆడించవలసి వచ్చింది. దానివల్ల చంద్రమానాల్లో సవరణలు వచ్చాయి.

ఈ సవరణలు యజుర్వేదంలో చాలా స్పష్టంగానే ఉన్నాయి. ఇది చూడండి–

**మధుశ్చ మాధవశ్చ శుక్రశ్చ నభశ్చ నభస్యశ్చేషశ్చోరజశ్చ సహశ్చ సహస్యశ్చ తపశ్చ తపస్యశ్చో పయామగృహీతో2సి సగ్ం సర్పో2స్యగ్ం హస్పత్యాలకు త్వా –(కృష్ణయజుర్వేదం: 1-4-14)**

"సోమమా! నీవు చైత్రానివి, వైశాఖానివి, జ్యేష్ఠానివి, ఆషాఢానివి, శ్రావణానివి, భాద్రపదానివి, ఆశ్వయిజానివి, కార్తీకానివి, మార్గశీర్షానివి, పుష్యానివి, మాఘానివి, ఫాల్గుణానివి, అధిక మాసానివి, లుప్తమాసానివి"

ఇందులో 12 నెలలపేర్లు ఉన్నాయి. అది ఒక విశేషం. అది అటుంచితే, ఇందులో ఉన్న అధిక, లుప్తమాసాల విషయమే ఇక్కడ ప్రధానం. అంటే యజుర్వేద కాలానికి సౌర, చాంద్రమానాల సమ్మేళనం కేలండర్ అమలులోకి వచ్చిందన్న మాట.

ఉభయ కాలగణనల్ని సరిచేయడానికి గట్టి ప్రయత్నం చేశారనేది వాస్తవం. లేకుంటే 'అధిక', 'లుప్త' మాసాల విషయం ఇక్కడ ప్రత్యేకంగా రాదు.

## అధిక మాసాలు – లుప్తమాసాలు

నిజానికి:

భూమి సూర్యుని చుట్టూ తిరిగే ఒక పరిభ్రమణానికి 365 రోజుల 6 గంటలు సమయం పడుతుంది. చంద్రుడు భూమిచుట్టూ తిరిగి రాడానికి 27.3 రోజులు పడుతుంది. కానీ పున్నమి నుండి పున్నమి 29.5 రోజులు పడుతుంది. 12 పున్నములకు (12 నెలలకు: 12×29.5=) 354 రోజులుఅంటే సౌరమానానికీ, చంద్రమానానికీ సంవత్సరానికి 365–354=11 రోజులు తేడా. (10.8 రోజులు) ఇలా మూడేళ్ళకి 3×11=33 (32.6 రోజులు) రోజుల్లో 30 రోజులు కలిపి ఒక నెలను పెంచుతారు. దాన్నే 'అధికమాసం' అంటారు. అంటే ప్రతి మూడో సంవత్సరంలో ఒకనెల అధికంగా వస్తుంది. ఇలా పెంచుకుంటూ తగ్గించుకుంటూపోతే కొన్ని సంవత్సరాలలో ఒక నెల తగ్గించాల్సి వస్తుంది. తగ్గించే నెలను లుప్తమాసం అంటారు. ఈ లుప్తమాసాలు ప్రతి 19 ఏళ్ళకి, ఆ తర్వాత 120 ఏళ్ళకి, ఆ తర్వాత 141 ఏళ్ళకి ఒకసారి వస్తుంటాయి.

యజుర్వేదంలో ఈ అధిక, లుప్త మాసాల్ని 'మలమాసాలు' అంటే అపరిశుద్ధ మాసాలు అన్నారు.

ఈ మలమాసాల గుర్తింపు కాలగణనలో వారి ఖచ్చితత్వాన్ని తెలుపుతుంది.

2015లో అధిక అషాఢం వచ్చింది. 2018లో అధిక జ్యేష్ఠ, 2020లో అధిక ఆశ్వయుజం, 2023లో అధిక శ్రావణం, 2026లో అధిక జ్యేష్ఠాలు వస్తాయి. కానీ బౌద్ధులు ఎప్పుడు అధికమాసం వచ్చినా దాన్ని నిజ ఆషాఢం తర్వాతే లెక్కిస్తారు. అంటే వారి కేలండర్‌లో ఎప్పుడూ మూడేళ్ళకోసారి అధిక ఆషాఢం ఉంటుంది. దీనికి బౌద్ధుల 'వర్షావాసం' కారణం.

ఇది మాసాల విషయం. అంతే ఖచ్చితత్వం తిథులలో కూడా ఉంది.

## తప్పు లెక్కిస్తే తప్పదు శిక్ష

మనం ఈనాటికి ఫలానా పండుగ ఈ రోజా, రేపా అని తర్జనభర్జనలు పడతాం. ఒక కేలండర్‌లో ఒకరోజు వుంటే, ఇంకో కేలండర్‌లో మరుసటిరోజు అని ఉంటుంది. ఈ తలనొప్పి తిథుల ఎంపికలో ఖచ్చితత్వం లేకే! ఇలా ఖచ్చితత్వం తెలుసుకోలేకపోవడం పెద్దనేరంగా యజుర్వేదం ప్రకటించింది.

**నా2 సోమయాజీ సం............... సాన్నాయం పయసైవ పయ ఆత్మన్దత్త్ వి వా ఏతం**

**ప్రజయా పశుభిరర్ధయతి వర్ధయత్యగ్య భ్రోతృవ్యం యస్య హవిర్నిరుప్తం పురస్తా చంద్రమా ! (కృ.యజు: 2-5-5)**

ఇది దర్శపూర్ణమాసయాగం ప్రారంభం గురించి చెప్పిన మంత్రం. దీనర్థం..

''ఈ యాగం అమావాస్య నాడే చేయాలి. అమావాస్యగా భావించి కృష్ణచతుర్దశి రోజున చేస్తే ఆ రాత్రి తెల్లవారు ఝామున తూర్పు ఆకాశంలో చంద్రుడు (నెలపొడుపు లాంటి ఆకారం) కనిపిస్తే ఆ యాగం చేసిన వానికి పశునష్టం సంభవిస్తుంది–''అని. దీనికి విరుగుడు కూడా ఉంది అనుకోండి. అది వేరే విషయం. దానికి తిరిగి చాలా ఖర్చు అవుతుంది.

ఇక్కడ చూడాల్సింది తిథుల ఎంపికలో ఖచ్చితత్వం.

దర్శపూర్ణమాసయాగం చేయించే వానిని 'సోమయాజి' అంటారు. అంటే కాలగణన ఖచ్చితత్వం తెలిసినవాడన్నమాట. శాస్త్రం తెలియనివాళ్ళు 'శాస్త్రి' అని ఎలా పేర్లు పెట్టుకుంటున్నారో, చివరికి సోమయాజి అనేపేరు కూడా ఆతర్వాత అలాగే– కులనామంగా మారిపోయింది. అందుకే వేమన: "తొలుత సోమయాజి, తుద కామయాజిరా–" అన్నాడు.

ఇక్కడ మనం ఒకవిషయాన్ని తెలుసుకోవాలి. మనం వ్యవహారంలో చెప్పుకునే చైత్ర, వైశాఖ మాసాల పేర్లు వేదంలో ఇలా ఉంటాయి–


దేవశ్రవా ఋషి చెప్పిన ఈ మంత్రం చూడండి–

**"ఉపయామ గృహీతో2సి మధవే త్వోపయము గృహలో2సి మాధవాయ**

**త్వోపయామగృహీతో2సి శుక్రాయ త్వోపయా గృహీతో2సి శచయే" –(శుక్ల.యజు: 7-30)**

ఇందులో మాసాల పేర్లు మధు (చైత్రం), మాధవాయ (వైశాఖం), శుక్ర(జ్యేష్ఠ), శుచ (ఆషాఢం), నభాస (శ్రావణం), నభాస్యాయ (భాద్రపదం), అశ్విన (ఆశ్వయుజం), ఊర్జ (కార్తీకం), సహస (మార్గశిరం), సహస్యాయ (పుష్యం), తపస (మాఘం), తమస్యాంకు (ఫాల్గుణం)– అని ఉంది. అంతేకాదు. **"త్యోపయామ గృహీతోऽస్య అంహసస్పత యేత్వా"** అని కూడా ఉంది. అంటే 13వ నెల 'అంహసస్పత' అంటే అది అధికమాసం అన్నమాట.

## నక్షత్రాలు–ఋతువులు



మనం ముందే చెప్పుకొన్నట్లు చంద్రుడు భూమిచుట్టూ తిరగడానికి 27 రోజులు పడుతుంది కాబట్టి రోజుకు ఒక నక్షత్ర సమీపంలో కనిపిస్తాడు. అందుకే ఆ 27 నక్షత్రాలకి 27 పేర్లు పెట్టారు. ఆ పేర్లు మొత్తం కృష్ణ యజుర్వేదం: 4–4–10లోని మంత్రాల్లో ఉన్నాయి. వాటిపేర్లు, వాటికి చెందిన దేవతల లిస్టుకూడా ఉంది. ఈ దేవతల పేర్లు చూస్తే అవి రాశిచక్రానికి సంబంధించినవి. రాశిచక్రాల విభజన ఋగ్వేద కాలానికే ఉంది. ఐతే, ఆ రాశులపేర్లుగానీ, నక్షత్రాల వివరాలుగానీ అక్కడ లేవు. ఇక్కడ ఉన్నాయి. అవిచూద్దాం.. నక్షత్రాల లెక్కింపు కృత్తికతో ప్రారంభించడం గమనించాలి.

**కృత్తికా నక్షత్రమగ్నిర్దేవతా.... రోహిణీ నక్షత్రం ప్రజాపతిర్దేవతా మృగశీర్షం నక్షత్రగ్ం సోమో దేవతా... ఆర్ద్రా నక్షత్రగ్ం రుద్రో దేవతా ........................ భరణీ నక్షత్రం యమో దేవతా పూర్ణా పశ్చార్యత్తే దేవా అదదుః (కృ.యజు: 4–4–10)**

1.కృత్తిక (దేవత: అగ్ని), 2. రోహిణి (దేవత: ప్రజాపతి), 3.మృగశీర్ష(సోముడు) 4. ఆర్ద్రా (రుద్రుడు: కాలపురుషమండలం), 5. పునర్వసు (అదితి), 6. పుష్యమి (బృహస్పతి), 7. ఆశ్రేషా (సర్ప వాసుకీ మండలం), 8. మఘ (పితృ), 9.ఫల్గురే (ఆర్యమా), 10.ఉత్తర ఫల్గుణీ (భగ), 11. హస్త (సవితా), 12. చిత్ర (ఇంద్ర) 13. స్వాతి (వాయు), 14. విశాఖ (ఇంద్రాగ్ని), 15. అనురాధ (మిత్ర), 16. రోహిణి 9ఇంద్ర), 17. విచృత లేక మూల (పితృ), 18. ఆషాఢ (ఆపో), 19. ఉత్తరాషాఢ (విశ్వేదేవతా), 20. శ్రోణ లేక శ్రవణం (విష్ణు), 21. శ్రవిష్టా లేక ధనిష్టా (వసవ), 22. శతభిషం (ఇంద్ర), 23. పోష్ఠపదా లేక పూర్వాభాద్ర (అజ), 24. పోష్ఠపదా లేక ఉత్తరభాద్ర (అహిర్బుధ్నియో), 25. రేవతీ (పూషా), 26. ఆశ్వయుజౌ లేక అశ్విని (అశ్వినీ దేవత), 27. భరణీ (యమ)

ఇక ఋతువుల వివరాలు చూస్తే అన్నిచోట్లా ఆరు రుతువుల ప్రస్తావనే ఉంది. రెండేసి నెలలు ఒక్కో రుతువు చొప్పున చేసిన విభజన అనేక చోట్ల ఉంది.

ఋగ్వేదంలో రుతువులు ఐదు అని కొన్ని చోట్ల 'ఆరు' అని కొన్నిచోట్ల ఉంది. అలా ఎందుకు ఉందో 'ఋగ్వేద కూనిరాగం' *(స్వేచ్ఛాలోచన జనవరి 2017 సంచికలో గతంలో చర్చించాం).* కానీ– యజుర్వేదంలో ఋతువులు 'ఆరు' అనే అన్నిచోట్లా ఉంది.

కృ.యజు: 4–4–11లోని మంత్రాల్లో–

చైత్ర, వైశాఖాలు (వసంత రుతువు), జ్యేష్ఠ ఆషాఢాలు (గ్రీష్మ ఋతువు), శ్రవణ, బాద్రపదాలు (వర్ష రుతువు). మార్గశిర, పుష్యాలు (హేమంత రుతువు), మాఘ, ఫాల్గుణాలు (శిశిర రుతువు)– అని ఉంది.

ఋగ్వేదంలో హేమంతంతో రుతువుల ఆరంభం ఉంటే.... యజుర్వేదంలో వసంతంలో రుతుగమన ప్రారంభం ఉంది. అంటే.. హిమాలయ దిగువభాగాన గల యమునా, గంగా మైదానంలో ఆర్యులు స్థిరపడ్డారని ఈ రుతువిభజన తెల్పుతుంది.

**"ఋతూనాం వసంతం ప్రేణామి– సమాప్రీత్తా ప్రీణాతు**
**వర్షా జీతోణాం ప్రీణామి – తామాప్రీత్తా ప్రీణస్తు**
**శరదం ఋతూణాం ప్రీణామి – సామాప్రీతా ప్రీణాత**
**హేమంత, శిశిరా ఋతూనాం ప్రీణామి – తామా ప్రీతౌప్రీణాత**

**( కృ.యజు: 1–6–2)**

ఇక– ఆరు రుతువుల లక్షణాల్ని ఏమని చెప్పారో చూద్దాం–

పితృదేవతల్ని అగ్ని రుతువుల్లో నమస్కరిస్తాను అని చెప్తూ–

**"నమో వ పితరో రసాయ, నమోవః పితరః శోషాయ**
**నమో వః పితరో జీవాయ, నమో నః పితరః స్వధాయై**
**నమో వః పితరో ఘోరాయ, నమోవః పితరో మన్యవే...**

**(శుక్ల యజుర్వేదం: 2–32)**

(అంటే– రసభూతమైన వసంత రుతువున, శోషింపజేసే గ్రీష్మాన, జీవమే తానైన వర్షరుతువున, అన్నాన్ని ఇచ్చే శరత్ రుతువున, కఠినమైన హేమంతాన, క్రోధాల్ని ఉత్పత్తి చేసే దాహకారక శిశిరమున పితృదేవా! నీకు నమస్కరించెదను)

ఇంకా–

యాగకర్త అయిన యజమానిని "అన్ని దిక్కులకు సంచరించు" అని చెప్తూ– ఆయా దిక్కులలో ఉన్న ఒక్కో రుతువు నిన్ను రక్షించును' అని చెప్పే సందర్భం ఇది. ఈ మంత్రంలో శుక్లయజుర్వేదం 10వ అధ్యాయంలో 10 నుండి 14 వరకూ ఉన్న మంత్రాల్లో–

'తూర్పుదిక్కున ఉన్న వసంతరుతువు, దక్షిణ దిక్కున ఉన్న గ్రీష్మం, పశ్చిమాన ఉండే వర్షరుతువు, ఉత్తరాన ఉండే శరత్ రుతువు, పై దిక్కున ఉండే హేమంత, శిశిరాలు నిన్ను

రక్షించు గాక!' అని ఉంది.

## ఋతువు'లే'దిక్కు !

ఇది చాలా సాధారణంగా అనిపించ వచ్చు. కానీ, ఇది యజుర్వేద ప్రజల నివాస ప్రదేశాన్ని, ఉనికిని తెలియజేస్తుంది.

భూగోళం మీద పశ్చిమ దేశాలకంటే ముందుగా తూర్పుదేశాల వారికే 'వసంతం' వస్తుంది. అంటే వసంత ఆగమనం తూర్పు నుండి వస్తుందన్నమాట. చైనావారు మనకంటే తూర్పున ఉంటారు. వారికి వసంతం జనవరి-ఫిబ్రవరి నెలల్లో వస్తుంది. మనకి మార్చి-ఏప్రిల్ నెలల్లో వస్తుంది. చైనాకూ మనకూ 35-40 డిగ్రీల రేఖాంశాల దూరం ఉంది. ఈ దూరాన్ని సూర్యుడు రెండున్నర గంటల్లో దాటగలడు. అలాగే రుతువులు రెండున్నర నెలల్లో దాటగలవు. అలాగే మనకంటే ఈశాన్య రాష్ట్రాల్లో ముందుగా వసంతం వస్తుంది. అందుకే తూర్పుదిక్కున ఉన్న 'వసంతం' అన్నారు.

ఇక ఆర్యుల స్థావరాలు కర్కటరేఖకు ఎగువప్రాంతం. సమశీతోష్ణమండలం. దానికి దక్షిణంగా ఉండేది ఉష్ణమండలం. అంటే.. గ్రీష్మరుతువు దక్షిణాన్నుండి ఉత్తరానికి వస్తూ ఉంటుంది. మనకు ఉభయ తెలుగురాష్ట్రాలకి ఏప్రిల్-మే నెలల్లో స్కూళ్ళకి వేసవి సెలవులుంటే... ఢిల్లీ, పంజాబ్, ఉత్తరప్రదేశ్, బీహార్ వాళ్ళకి మే, జూన్ నెలలు వేసవి సెలవులు-

అందుకే వారు 'దక్షిణ దిక్కున ఉన్న గ్రీష్మం' అన్నారు.

ఇక వర్షరుతువు. నైరుతి రుతుపవనాలు వల్ల వచ్చే వర్షాలు ఆ రుతుపవనాలు వింధ్యపర్వతాలు దాటాక యమున-గంగాప్రాంతానికి పశ్చిమం నుండే ప్రయాణిస్తాయి- అందుకే ఆ దిశను- వర్షదిశగా గణించారు.

తెల్లని వెన్నెలకూ, స్వచ్ఛ వాతావరణానికీ ప్రతీక అయిన ఉత్తరాన ఉన్న హిమగిరి భూమి శరత్‌కాలానికి దిక్కుగా భావించారు-

పర్వత దిగువ భాగం కంటే ఎగువభాగంలో శీతలం ఎక్కువ. మంచుపేరుకుపోయి ఉంటుంది. కాబట్టి శిశిర, హేమంతాలు ఊర్ధ్వదిశగా నమ్మారు-

ఈ నాల్గు దిక్కులూ వారి ఉనికిని తెలియజేస్తూ యజుర్వేద కాలానికి గంగా-యమునా మైదానంలో స్థిరపడ్డారని ఋజువు చేస్తాయి.

## రక్త తర్పణలు

ఈ విషయాలే కాదు- అసలు యజుర్వేదంలో ఉన్నవే యజ్ఞయాగాలూ, పశుబలులూ- ఏయే రోగానికి ఏఏ ఆవుల్ని, ఏయే జంతువుల్ని బలివ్వాలో ఏయే కార్యాలకి దేనికి బలులు ఇవ్వాలో ఈ వేదాల్లో కోకొల్లలు-

అలాగే రుతువులకి కూడా... నెత్తురు తర్పణలే... **ధూమ్రాన్ వసంతాయా....**అనే ప్రజాపతి రుషి విరచిత మంత్రాన్ని ఈ వ్యాసం మొదట్లోనే చూశాం.


అలాంటిదే ఇది:

**వసంతాయ కపింజలానా లభతే గ్రీష్మాయ కలవింకాన్ వర్షాభ్యస్తిత్తిరీంచరదే వర్తికా హేమంతాయ కకరాంచి శిరాయ వికకరాన్ - (శుక్ల యజు: 24-20)**

అంటే... వసంతానికి కౌజు పిట్టను, గ్రీష్మానికి ఊరపిచ్చుకను, వర్షరుతువుకి తిత్తిరిపిట్టను, శరత్తుకు వర్తక పక్షిని, హేమంతానికి కకరమును, శిశిరానికి వికికిరము అనే పక్షిని బలిస్తాను"-అని.

ఇలా రుతువులకు రక్తతర్పణలు చేసి 'కాలాని'కి నెత్తుటి గీతం పాడింది యజుర్వేదం. *(ఇంకావుంది)*

## మృత్యువ్యాపారం నుండి మానవత్వం వైపు



ఆల్ఫ్రెడ్ బి. నోబెల్ 1833, అక్టోబర్ 21న స్వీడన్‌లోని స్టాక్‌హోంలో జన్మించారు. పేలుడు పదార్థమైన 'నైట్రోగ్లిజరిన్'ను భద్రపరిచి తరలించే విధానాన్ని కనుగొని తద్వారా 'డైనమైట్'ను ఆవిష్కరించాడు. అలాగే శక్తివంతమైన 'డిటోనేటర్'లను కనుగొన్నాడు. అనేక ఫ్యాక్టరీలు నెలకొల్పి బాగా డబ్బు సంపాదించాడు.

ఆ పేలుళ్ళు ప్రజల మరణానికి కారణమవుతుండడంతో విమర్శకులు ఆయనను 'మృత్యు వ్యాపారి' అని పిలిచారు. దాదాపు 350 వస్తువులపై పేటెంట్లు పొందాడు. జీవిత చరమాంకంలో తన పరిశోధనల వలన జరిగిన విధ్వంసానికి చలించిపోయి పశ్చాత్తాపం చెందాడు. తన యావదాస్తిని ప్రపంచంలో గొప్ప పరిశోధనలు చేసినవారికి అవార్డులు ఇవ్వడం కోసం వీలునామా రాశాడు. అలా నోబెల్ బహుమతులకు రూపకల్పన జరిగింది. డిసెంబర్ 10, 1896 ఇటలీలోని శాన్‌రెమోలో ఆయన తుదిశ్వాస విడిచారు. ప్రతియేటా ఆయన చనిపోయిన తేదీ డిసెంబర్ 10న నోబెల్ బహుమతుల ప్రదానం జరుగుతుంది. ఎన్ని అవార్డులున్నా నోబెల్ అన్నిటి కన్నా మిన్నగా నిలిచింది. ప్రతి శాస్త్రవేత్తకు నోబెల్ బహుమతి అందుకోవడమనేది అత్యున్నత స్వప్నం.

# చతికిలపడ్డ సాంకేతిక ప్రగతి

"ఇతియోౖ పగురాత్తై శత్యే యాతయాద్యో నిహనత్సహస్రేణ
యాత యాద్యో లోహితం కరవద్యావత్ణ ప్రస్కద్య పాగ్ం
సూస్థ్ంగృహ్ణోత్తావత్ణ సంవత్సరాన్పిత్రులోకం న ప్రజ్యాదితి
తస్మాద్ బ్రాహ్మణాయ నాౖప గురేత న నిహన్యాన్న..."

**బ్రాహ్మణుణ్ణి కొట్టడానికి సిద్ధమైన వానికి వందనాణేలు, కొట్టిన వానికి వెయ్యి నాణేల దండం విధించాలి. రక్తం వచ్చేట్టు కొట్టిన వాడి జీవుడు ఈ భూమ్మీద ఎన్ని పరమాణువులున్నాయో అన్ని ఏళ్ళు ఇక్కడే ఉంటాడు. వాడు ఎన్నటికీ పిత్రులోకానికి చేరలేడు.కాబట్టి బ్రాహ్మణుణ్ణి ఎదిరించకూడదు. తిట్టకూడదు. కొట్టకూడదు. బ్రాహ్మణరక్తం కళ్ళ చూడకూడదు.**

**(కృష్ణ యజుర్వేదం 2-6-10)**

## క్షత్రియాధీనం

ఋగ్వేదంలో వర్ణవ్యవస్థ ఛాయలు దశమ మండలంలో కనిపించాయి. అసలు ఆ మండలమే తర్వాత చొప్పించింది అని చాలామంది అభిప్రాయం. ఋగ్వేదంలో ఆర్యజాతుల మధ్య, ప్రజల మధ్య వర్ణ, వర్గ భేదాలు స్పష్టంగా కనిపించవు. దస్యులపట్ల హేయభావం, ద్వేషం మాత్రం ఉంది. ఇది ఆర్య, అనార్య జాతులమధ్య కనిపించే జాతిభేదం. కానీ, యజుర్వేదకాలానికి, ఆర్యసామాజిక చిత్రపటంలో చాతుర్వర్ణవ్యవస్థ స్పష్టంగా కనిపిస్తుంది.

ఈనాడు మనం చెప్పుకునే 'కులం' పునాదులు ఆనాటి వర్ణసమాజంలో దాపరికం లేకుండానే కనిపిస్తాయి. తొండముదిరి ఊసరవెల్లి అయినట్లు వర్ణం ముదిరి కులంగా మారిందనే చారిత్రక సత్యం కూడా సుస్పష్టమే!

**ఈ వేదకాల వర్ణ వ్యవస్థలో బానిసత్వం ఉంది. బ్రాహ్మణాధిపత్యం ఉంది. కానీ, అంటరానితనం లేదు. అది కులవ్యవస్థ సృష్టించిన జాఢ్యమే. అమానుషమే.**

ఈ 'కుల' అమానుషం ఉపనిషత్తుల కాలంలో వేళ్ళూనుకొంది. తొలిదశలోనే బౌద్ధం ఈ అమానుషాన్ని అడ్డుకుంది. కానీ.. వైదిక ఉపనిషత్తులు, దర్శనాలు, ఇతిహాసాలూ కుమ్మరించిన ఈ కులభావజాలాన్నుండి ఈ దేశాన్ని కాపాడ్డానికి బౌద్ధం బలం చాలలేదు. అందుకే ఆ కులవ్యవస్థ ఇన్నేళ్ళుగా పాతుకుపోయింది.

అయినా, ఇన్నేళ్ళలో కులాన్ని కూల్చే కొత్తభావజాలం ఏదీ పుట్టలేదు. అందుకే ఆధునిక కాలానికి కూడా అంబేద్కర్‌కి బౌద్ధమే ప్రత్యామ్నాయమార్గంగా కనిపించింది. అయితే, కులవ్యవస్థ పునాదులు వేదాల్లోని వర్ణవ్యవస్థలో చూడగలం. యజుర్వేదంలో క్షత్రియాధిపత్యం ఉంది. గణరాజ్యవ్యవస్థ ధ్వంసమవుతూ, ఏకకేంద్ర రాజ్యాలు నిర్మించిన రాజులు, వారి ఆధిపత్యం కనిపిస్తుంది. రాజే రక్షకుడు, రాజే సర్వశక్తివంతుడు అని యజుర్వేదంలో చాలాచోట్ల ఉంది.

**"....... మధుమతీ ర్మధుమతీభిః పృచ్యంతామ్మహి
క్షత్రం క్షత్రియాయ వన్వానాౖ అనాధృష్టాః సీదత
సహౌజసో మహి క్షత్రం క్షత్రియాయ దధతీః" (శు.యజు:10-4)**

(నదుల జలాల్ని పాత్రల్లో కలుపుతూ..)

*''ఈ మధురజలం, ఈ మధురజలంతో కలిసిపోయింది. ఈ మహారాజ్యం (ఈ నదులు ప్రవహించే ప్రాంతమంతా) ఈ క్షత్రియుని వరించాలి. ఓ! జలములారా! ఈ రాజుకి శత్రువులెవరూ గెలవలేని బలాన్ని కలిగించండి. అతనికి ఈ రాజ్యాన్ని అప్పగించండి. మీరు స్థిరపడండి"-*

అంటే గణరాజ్యాలు మహారాజ్యాలుగా రూపొందుతున్నాయన్నమాట. రాజ్యాల పరిధితోపాటు పాలకుని అధికార పరిధులు కూడా పెరిగిపోతున్నాయని అర్థం. ధనం, విశేష అధికారాలు క్షత్రియుల ముంగిళ్లలో ప్రోగుపడుతున్నాయనేది ఈ యజస్సుల అంతరార్థం.

అందుకే ఋగ్వేదంలో దేవాధిపతి, యజ్ఞాధిపతి, దిక్పాలకులకు అధిపతి అయిన ఇంద్రుణ్ణి-

**ఇంద్రం వో విశ్వతస్పరి .....
క్షత్రమను సహౌ జయతేన్ద్ర దేవేభిరనుతే సృషషే .....**

**-(కృ.యజు:1-6-12)**

*'ఓ ఇంద్రా! నీవు క్షత్రియజాత్యాభిమానం కలవాడవు"* అంటూ కీర్తించారు.

రాజులకూ, పురోహితులకూ మధ్య అధికారపోరు ప్రపంచంలో అన్ని చోట్లా కన్పిస్తుంది. పురోహితుడే, రాజ్యాధికారం నెరపే విధానం తొలినాట చాలా సమాజాల్లో

ఉంది. అది ఋగ్వేద సమాజంలోనూ ఉంది. పురోహితులు తమ మతవ్యవస్థను సంరక్షించుకోడానికి, దాని ద్వారా తాము లబ్ధిపొందడానికి క్షత్రియుల్ని రక్షకులుగా ఉపయోగించుకున్నారా? లేక, క్షత్రియవర్గం తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకు మతభావజాలాన్ని ప్రచారం చేయడానికి పురోహితుల్ని ఉపయోగించుకున్నదా?

## జోడు దొంగలు

ఇది అంతుతేలని ప్రశ్నే. చెట్టుముందా? విత్తుముందా? లాంటిదే! అయితే- అశేష ప్రజానీకంపై పెత్తనాన్ని సాగించడానికి రెండువర్గాలూ తోడుదొంగల్లా కలివిడిగా నడిచాయనేది చారిత్రక సత్యం. అక్కడకూడా, అప్పుడప్పుడూ 'ఎవరుగొప్ప' అనే విషయంపై వాగ్వివాదాలు జరిగినా, కొద్దిపాటి తిరుగుబాట్లు కలిగినా, మొత్తంమీద ఈ దొంగల జోడీ జోరుగా కొనసాగిందనేది చరిత్ర మనముందుంచిన కటిక నిజం.ఈ నిజాన్ని మనకు తుడిచిన అద్దంలా చూపిస్తుంది యజుర్వేదం.

**"సింహ్యాసి స్వాహ సింహ్యాస్యాదిత్యమవనిః స్వాహా సింహ్యాసి బ్రహ్మవనిః క్షత్రవనిః" (శు.యజు:5-12)**

*"ఓ యజ్ఞవేదికా! నీవు సింహినివి! నీకు స్వాహ! నీవు బ్రాహ్మణులను, క్షత్రియులను ప్రసన్నులను చేయుము"*

**"బ్రహ్మవనిత్వా క్షత్రవని రాయస్పోషవని పర్యూహామి బ్రహ్మోదృంహ క్షత్రం దృంహో యుర్ద్రంహ ప్రజాన్ద్రుంహ !**

**(శు.యజు:5-27)**

*"ఓ! ఔదుంబర వృక్ష కొమ్మా! నీవు బ్రాహ్మణుని సంతోషపెట్టు. క్షత్రియుని సంతోషపెట్టు. ఓ కొమ్మా! బ్రాహ్మణ, క్షత్రియులను దృఢపరచు. వారి ఆయుష్షనూ, సంతతిని దృఢపరచు."*-

అలాగే.. శుక్ల, కృష్ణ యజుర్వేదాలలో అనేక చోట్ల వీరిద్దరి విషయం కలిసే ఉంది. శుక్ల యజుర్వేదం 18వ అధ్యాయంలో 38 నుండి 44 యజుస్సులలో-

*'అగ్ని బ్రాహ్మణ, క్షత్రియుల్ని పాలించును గాక'*

*'సూర్యుడు, బ్రాహ్మణ, క్షత్రియుల్ని పాలించును గాక'*

*అలాగే.. చంద్రుడు, వాయువు, యజ్ఞం, మనస్సు, ప్రజాపాలకుడు.. బ్రాహ్మణక్షత్రియుల్ని పాలించునుగాక!'* అని ఉంది.

**బ్రహ్మక్షత్రం పవతే తేజ ఇంద్రియం సురయా సోమః**

**(శు.యజు:19-5)**

*'ఓ! సోమమా! బ్రాహ్మణుల యందు, క్షత్రియుల యందు, ఇంద్రియములయందు తేజస్సును కలిగించు'* అంటూ...

**'కువదింగ యవమన్తోయవం చిద్యథా దాన్త్యనుపూర్వం...'**

**(శు.యజు.19-6)**

యవలు మొదలైన ధాన్యాన్ని గడ్డి, పొల్లుల నుండి రైతు ఎలా వేరుచేయునో, ఓ మిత్రమా అగ్నీ! అలాగే నిన్ను సేవించు వారిని (బ్రాహ్మణ, క్షత్రియుల్ని) గడ్డి, పొల్లుల నుండి (వైశ్య, శూద్రుల నుండి) వేరు పరుచుము. వారికి అన్నపానాలు వృద్ధిపరచుము' అని తేల్చి చెప్పేశారు.

**'ఇషేసిన్వస్వోర్జే పిన్వస్వ బ్రాహ్మణే పిన్వస్వ క్షత్రాయ...**
**... బ్రహ్మధారయ క్షత్రం ధారయ విశం ధారయ**

**(శు.యజు: 38-14)**

'ఓ! ధర్మమా! బ్రాహ్మణ, క్షత్రియులకోసం వృద్ధిపొందువారికి ధనం మొదలైన సంపదలు ధారపోయుము' ఇంకా వారిద్దరి ఐక్యత గురించి-

**'యత్ర బ్రహ్మ చ క్షత్రించ సమ్యుంచౌ చరతః సహ'**

**(శు.యజు:20-25)**

ఓ అగ్నీ! ఎక్కడ బ్రాహ్మణులు, క్షత్రియులు చక్కగా కలిసి వ్యవహరిస్తారో అలాంటి పుణ్యలోకాలు తెలియుగాక!' ఇక ఇది చూడండి.

**'ఇదం మే బ్రహ్మచ క్షత్రం చోభే శ్రియ మశ్నుతాం'**

**(శు.యజు:32-16)**

*'ఈ సంపదలు బ్రాహ్మణులు, క్షత్రియులు అనుభవించుటకే'*-

యజుర్వేదం ప్రకారం బ్రాహ్మణ, క్షత్రియత్వాలు ఎంతటి ఉన్నతమైనవో, ఉత్తమమైనవో చూడండి. యజ్ఞంలో మేడికొమ్మను అర్థిస్తూ-

**''బ్రహ్మవనిం త్వా క్షత్రవనింగ్ సుప్రజావనింగ్ రాయస్పోషవనిం**
**పర్యూహామి బ్రహ్మదృగ్ంహ, క్షత్రం దృగ్ంహ రాయస్పోషం దృగ్ంహ.." (కృ.యజు:1-3-1)**

*''ఓ మేడికొమ్మా! బ్రాహ్మణత్వాన్ని ఇవ్వు. క్షత్రియత్వాన్ని ఇవ్వు. ధనాన్ని ఇవ్వు. మంచి సంతతిని ఇవ్వు. బ్రహ్మణత్వాన్ని, క్షత్రియత్వాన్ని, ధనాన్ని, సంతానాన్ని దృఢపరచు"*

ఇలా బ్రాహ్మణ, క్షత్రియుల సంక్షేమం కోసం , వృద్ధి కోసమే యజ్ఞం అని యజుర్వేదం తేటతెల్లపరచింది.

మతం యజ్ఞయాగాది క్రతువులతోనే ఆగిపోతే, పూజాపునస్కారాల దగ్గరే నిలచిపోతే దైవ విషయంలో తప్ప సామాజిక అంశాల్లో పెద్దగా అది వేసేముద్ర అంతగా ఉండదు.

కానీ, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మతం ఇక్కడ మానవజాతిని అనేక సామాజిక విభాగాలుగా చీల్చి వేసింది.

## రుబ్బుడు వృత్తులు

సమాజంలోని ప్రజలు చీలికలతో ఉండడం రాజ్యానికి, రాజుకీ మేలు. సమాజంలోని ఆ చీలికలు ఎప్పుడూ కలవకుండా చేయడం రాచరికానికి చాలా అవసరం. ఆ అవసరాన్ని పాలకవర్గాలకి ప్రపంచంలో అన్నిచోట్లా 'పూజార్లు' తీర్చారు. మతం, పరలోకం అనే మత్తులో జనాన్ని ముంచారు. కానీ, భారతదేశంలో ఆ మత్తుతోపాటు 'ఎప్పుడూ కలవలేని' ఒక అంతరాన్ని స్థిరీకరించారు.

వర్గం, వర్ణాల్లోని తేడా ఇదే! వర్గసమాజంలో తాను ఏ వర్గంలోకి మారాలన్నా మనిషి మారొచ్చు. ఆర్థిక అంతరాలు తప్పితే, అక్కడ సామాజిక అంతరాలు లేవు. అక్కడ విద్యావిజ్ఞానాలకి సామాజిక ఎంపిక కొలబద్దకాదు.

చెక్కపని వాడైనా, చర్మకారుడైనా శాస్త్రవేత్త కావొచ్చు. అక్కడి సమాజ విజ్ఞానపరిధి విశాలమైంది. బహుముఖీయం.

కానీ, ఆర్య సామాజిక రచనలో ఆ అర్హత మొదట్లో ఇద్దరికే ఉంది. జ్ఞానం, శౌర్యం కలిసి నడిచాయి. మిగిలిన సమాజాన్ని అజ్ఞానులుగా, పిరికివాళ్ళుగా మలచాయి. అంతేకాదు, ఆ ఇతర సమాజంలోని వారిలో ఎవరైనా జ్ఞానంవైపుకు చూసి, శౌర్యంవైపుకు నడచి తమకు పోటీ రాకుండా కట్టుదిట్టం చేశాయి. ఈ కట్టుదిట్టం చేయడంలో బ్రాహ్మణులు తమకు తామే కాకుండా క్షత్రియులకే లాభం చేకూర్చారు.

ఆ కట్టుదిట్టం చేసిన సాధనమే 'కులం'. జ్ఞానాన్ని, శౌర్యాన్ని, వ్యాపారాన్ని, గొడ్డుచాకిరినీ వంశపారంపర్యం హక్కుగా చట్రం బిగించారు. ఎవరి వృత్తి వారిదే! వృత్తి మారకుండా తరతరాలుగా అదేవృత్తిలో పడి కొట్టుమిట్టాడడమే కులం.

కులం వల్ల వృత్తుల్లో నైపుణ్యత పెరగలేదు. పాడిందే పాటరా.. అన్నట్టు చేసిందే చేయడం.. ఒక అలవాటుగా మారిందే తప్ప మానసిక వికాసానికి కులం దోహదం చేయలేదు. ఎందుకంటే.. నైపుణ్యం అనేది చేసే వ్యక్తి ఇష్టతను బట్టి ఉంటుంది. ఒక చెప్పులు కుట్టేవ్యక్తికి బట్టలు నేయడం మీద ఆసక్తి ఉన్నప్పటికీ ఆ వృత్తి చేయడానికి కులం ఒప్పుకోదు కాబట్టి–

పిల్లలకు ఇష్టమైనది కాకుండా తమకి ఇష్టమైన కోర్సును తల్లిదండ్రులు ఇప్పుడు ఎలా బలవంతంగా చదివిస్తూ రుబ్బుడికి అలవాటు చేశారో... ఈ దేశంలో కులం కూడా వృత్తి రుబ్బుడుల్ని అలాగే అలవాటు చేసింది. ఇష్టమైన వృత్తిని ఎంచుకొనే హక్కులేక, బ్రతకడం కోసం బలవంతంగా అదే పనిని చేస్తూ వేలాది సంవత్సరాలు ఈ దేశం కాలం వెళ్ళదీసింది. కోట్లాది మంది నైపుణ్యం, విజ్ఞానం వికసించకుండా, వెలుగులు ప్రసరించకుండా మతం మబ్బులు కప్పేసింది. అందుకే ప్రపంచం గర్వించతగ్గ సాంకేతిక నైపుణ్యానికి నూతన వైజ్ఞానిక దృక్పథాన్ని ప్రపంచంలో సంబంధంలేని ఎదుగూబొదుగూలేని 'దీవిలా' భారత ద్వీపకల్పం మారింది.

## జ్ఞానానికి గ్రహణం

అందుకే... **ఈ సమాజం గ్రీకుల స్పర్శ సోకనంత వరకూ శిల్పనైపుణ్యం వైపు చూడలేక పోయింది. పారశీకుల స్పర్శ తాకనంతవరకూ అందమైన భవన నిర్మాణ నైపుణ్యం, సంగీతగాన కళావిభవాల్ని అందుకోలేక పోయింది. ఆంగ్లేయుల స్పర్శసోకనంత వరకూ వైజ్ఞానిక వికాసం చెందలేకపోయింది.** ఎందుకంటే... ఈ మూడు స్పర్శలూ ఈ దేశంలో పాతుకుపోయిన కులపునాదుల్ని కుదిపాయి. ఆ కుదుపుల్లోంచే ఇక్కడ వైజ్ఞానిక, సాంకేతిక, శిల్పకళారంగాలు ప్రాణం పోసుకున్నాయి. ఈ మూడింటితో పాటు క్రీ.పూర్వం నుండే బౌద్ధుల వైజ్ఞానిక దృక్పథం కూడా తోడయ్యింది.

వింత.. విచిత్రం ఏమిటంటే.. ఈనాడు దేశభక్తిపూని 'ప్రాచీన భారతీయుల వైజ్ఞానిక విభవం' అంటూ వెర్రికేకలు వేస్తున్నవారంతా గొప్పగా చెప్పుకునేది బౌద్ధుల విజ్ఞానం గురించే. ఏమాత్రం సిగ్గూశరం లేకుండా " వీరంతా భారతీయ రుషులే. హైందవులే" అని చెప్పుకుంటూ, వారికి ఒక గోష్పాద పిలకలు తగిలించి, నుదుటిమీద నామాలు దిద్ది , వళ్ళంతా విభూతిరేఖలు పులిమి చూపిస్తారు. ఆత్మానంద పడతారు.

నిజానికి బౌద్ధులు తప్ప మిగిలిన భారతీయ వైదిక వైజ్ఞానికులంతా విజ్ఞానశాస్త్రానికి కొన్ని మూఢనమ్మకాల్ని జోడించి, దానిమీద వ్యాపారం చేసుకుని బ్రతికినవారే. వారిలో వరాహమిహిరుడు ఒకడు. బౌద్ధగురువు, నలందా విశ్వవిద్యాలయ కులపతి అయిన ఆర్యభట్ట ఖగోళ విజ్ఞానాన్ని ఆవిష్కరిస్తే... ఆ తర్వాత వచ్చిన వరాహమిహురుడు భారతీయఖగోళ విజ్ఞానాన్ని 'జ్యోతిషం'గా మార్చి, గ్రహణం పట్టించాడు–

అంటే... కులచట్రంలో ఉన్నవారంతా ఈ దేశాన్ని వైజ్ఞానికంగా కునారిల్లేలా చేశారు అనేది చారిత్రక వాస్తవం–

భవిష్యత్తులో కునారిల్లే భారత సామాజిక వ్యవస్థ ఆనవాళ్లు యజుర్వేదంలో కనిపిస్తాయి. అంటే.. యజుర్వేద

ఆర్యుల చాతుర్వర్ణవ్యవస్థ లో అంటరానితనం లేకపోయినా...అది ఇతర ప్రపంచంలోని వర్గవ్యవస్థ లాంటిది మాత్రం కాదు. అంటరానితనం దాని గర్భంలోని మాయలో ప్రాణం పోసుకునే ఉంది.

అందుకే... వర్ణవ్యవస్థలోని శూద్రుల్ని కట్టుబానిసలుగానే చూసింది. వారివి సేవక వృత్తులుగానే, వారిని శ్రామికజనంగానే పరిగణించింది. భౌతికశ్రమ మొత్తం వారి భుజాలమీదికెత్తి నడ్డివిరిచింది. బౌద్ధిక (వైజ్ఞానిక) పరిశ్రమకు వారిని దూరం చేసింది. ఈ క్రమంలో 'బౌద్ధికం' కేవలం బ్రాహ్మణులసొత్తుగా, హక్కుగా ప్రకటించింది. చివరికి ఈ పరిధిలోకి క్షత్రియులు కూడా జొరబడనంతగా కట్టుదిట్టం చేసింది.

## బ్రాహ్మణాధిపత్యం

భావజాలబలంతో ఈ సమాజాన్ని ఎక్కడికక్కడ బంధించి పడేసింది. శుక్లయజుర్వేదంలో 'జోడుగా సాగిన' బ్రాహ్మణక్షత్రియల చెలిమిలో తేడా కృష్ణయజుర్వేదంలో కనిపిస్తుంది. బ్రాహ్మణుడే గొప్ప అనేది ఈ కృష్ణ యజుర్వేదంలో చూస్తాం–

**బ్రహ్మేస్త్వంగ్ రాజన్ బ్రహ్మాఽసి సమితాసి సత్యసవో**

**బ్రహ్మేస్త్వంగ్ రాజన్ బ్రహ్మాఽసీన్ద్రోఽసి సత్యౌజా..'**

**– (కృ.యజు:1-8-16)**

*'ఓ రాజా! నీవు బ్రాహ్మణ ధర్మాల్నే పాలిస్తున్నావు"* అని ఉంది.

అలాగే..

**'... యద్ బ్రాహ్మణశ్చా అబ్రాహ్మణశ్చ ప్రశ్నమే యాతాం బ్రాహ్మణాయఽధి**

**బ్రూయాద్యద్బ్రాహ్మణాయాఽధ్యాహాఽత్మనేఽ ధ్యాహ యద్ బ్రాహ్మణం**

**పరాహాఽత్మానం పరాఽహ తస్మాద్ బ్రాహ్మణో న పరోచ్యః**

**– (కృ.యజుం2-5-11)**

*( బ్రాహ్మణుడు, బ్రాహ్మణేతరుడు అనే చర్చ జరిగితే విజ్ఞుడు బ్రాహ్మణుడే అధికుడు అని చెప్పాలి. అలా చెప్పటం వల్ల తన ఆధిక్యతను తను పెంచుకొనును. బ్రాహ్మణుడు తక్కువ అని చెప్పుకుంటే తన ఆధిక్యతను తాను తగ్గించుకొనును. కాబట్టి బ్రాహ్మణుణ్ణి పరాభవించ రాదు')* –

మనం ఈ వ్యాసం మొదట్లో చూపిన కృష్ణయజుర్వేదం 2-6-10 లోని యజస్సులు ఒక్కసారి చూడండి. బ్రాహ్మణ్ణి తిట్టడం, కొట్టడం మహాపాపంగా, నేరంగా ప్రకటించిన సందర్భం అది. ఇక, ఈ బ్రాహ్మణాధిపత్యం ఎంతవరకూ వెళ్ళిందంటే... ఈ యజుస్సు చూడండి.

**"యదగ్నేయాని కాని... సగ్ంశితం మే బ్రహ్మ సగ్ంశితం వీర్యం బలం!**

**సగ్ం శితం క్షత్రం జిష్ణయస్యాఽహమస్మి పురోహితం !"**

**– (కృ.యజు:14-1-10)**

అంటే...

*"ఓ అగ్నీ! నా బ్రాహ్మణ్యం సన్మార్గం అగునుకాక! నా మేధాశక్తి, సర్వకార్యాల్ని నడిపించును గాక! నేను ఏ క్షత్రియునికైతే పురోహితునిగా ఉంటానో, ఆ క్షత్రియుడే జయంపొందుగాక"*

అందరూ చెప్పుకునేట్టు వేదాల్లో వర్ణవ్యవస్తే ఉన్నప్పటికీ.. రాబోయేకాలంలో ఆ వ్యవస్థ నిచ్చెనమెట్ల కులవ్యవస్థగా మారడానికి కావలసిన బీజం యజుర్వేదంలోని వర్ణవ్యవస్థలోనే ఉంది. ఆ బీజం ఈ బ్రాహ్మణ అహంకారంలోంచి, ఈ బ్రాహ్మణ ఆధిపత్యధోరణిలోంచి పుట్టుకొచ్చిందే!

ఈ అధికారాన్ని సుస్థిరంగా నిలబెట్టుకోవాలంటే భౌతిక ప్రపంచంతో కుదరదు. కాబట్టి సమాజాన్ని అలా కట్టిపడేయాలంటే మనిషికి బలమైన సాధనం మెదడు, బుద్ధి, ఆలోచన. కాబట్టి ఆ బుద్ధిమీదే, ఆ ఆలోచన మీదే దెబ్బకొట్టాలి. అంటే భావజాల జాలాన్ని పన్నాలి. బ్రాహ్మణవర్గం అదే చేసింది–

'ఈ వర్ణవ్యవస్థను ఇలా సృష్టించిందే భగవంతుడు. ఇది ఆ దేవుని నిర్ణయం. దైవ నిర్ణయాన్ని కాదనే శక్తీ, హక్కూ ఎవరికీ లేదు. దైవనిర్ణయాన్ని ధిక్కరించడం మహానేరం. పాపం.' అంటూ మనసుల్ని కట్టడిచేసింది. అందులో భాగమే ఇది.....

**'బ్రాహ్మణోఽస్యముఖమాసీత్ బాహూ రాజన్యః కృతః**

**ఊరూతదస్య యద్వైశ్యః, పద్భ్యాం శూద్రో అజాయత'**

**– (శు.యజు:31-11)**

వేలతలలు, వేలకన్నులు, వేలపాదాలున్న విరాట్ పురుషుడు ఈ సృష్టికి మూలం అని చెప్పి–

*(అతని ముఖం నుండి (మేధస్సు) బ్రాహ్మణులు, భుజాల నుండి క్షత్రియులు, తొడల నుండి (వైశ్యులు), పాదాల నుండి శూద్రులు పుట్టారు')*– అని తీర్మానించింది యజుర్వేదం.

కాబట్టి ఎవరి స్థానం వారిదే! ఎవరి గౌరవం వారిదే! ఎవరి వృత్తి వారిదే! ఒకరి అర్హతలు ఒకరికి రావు. – ఇదే రాబోయేకాలంలో కులంగా మారబోయే భారత సామాజికచిత్రానికి పడిన తొలిబీజం. కాబట్టి ఇక్కడి

వర్ణవ్యవస్థలోనే కులం అంతర్లీనంగా కలిసిపోయి ఉంది.

అందుకే...క్రమంగా క్షత్రియుల్ని సైతం బ్రాహ్మణ భావజాలం తమకంటే దిగువకు నెట్టేసింది-

భుజబలం మీద బ్రతికే ఏనుగులాంటి క్షత్రియత్వాన్ని భావజాల బలం అనే ఇనుపగొలుసుతో కట్టిపడేసింది.

**'.. ఏషవోఽ మీ రాజా సోమోఽస్మాకం బ్రాహ్మణానాం రాజా'** **- (శు.యజు:9-40)**

*(ఏ మహారాజ్యానికి ఎవరు రాజైనప్పటికీ.... ఎవరికి ఎవరు రాజైనప్పటికీ... బ్రాహ్మణులకు కాదు. బ్రాహ్మణులకు సోముడు మాత్రమే రాజు!')*-

అంటే.. మా మీద రాజు అధికారం కూడా చెల్లదు అనే దీనర్థం.

ఈ భావజాలంలోని విశేషం ఏమిటంటే ఒకరు మరొకరికంటే శ్రేష్ఠులు, పవిత్రులు. ఈ ఆధిపత్యాన్ని విరాట్ పురుషునిరూపంలో చెప్పడం ఒక అంశం అయితే, ఈ హెచ్చుతగ్గుల్ని అన్నివిషయాల్లో ఇరికించి ఒకటి శ్రేష్ఠం, ఒకటి అధమం అని చెప్పడం మరో అంశం.

అందుకే.. శిల్పం, గృహనిర్మాణం, నగరనిర్మాణం, ఛందస్సు, కవిత్వం, ఆహారపదార్థాలు, వేషధారణలు... ఇలా అన్ని విషయాల్లో కులం తాలూకు కట్టుదిట్టం కనిపిస్తుంది. ఒక ఆహారం సాత్వికం (బ్రాహ్మణం) అని, మరో ఆహారం తామసం(చండాలం) అనే భావజాలం ఇందులో భాగమే. అన్ని వ్యవస్థల్నీ ఈ నిచ్చెనమెట్ల వ్యవస్థతో ముడిపెట్టడమే వైదిక భావజాలం. అందులో భాగంగానే-

రుగ్వేద రుక్కులు గాయత్రి, త్రిష్టుప్, అనుష్టుప్, జగతి ఛందస్సుల్లో ఉంటాయి. వీటిల్లో గాయత్రి ఛందస్సు గొప్పదట! అందుకే..

**'గాయత్రీ పురోఽను వాక్యా భవతి త్రిష్టుగ్యాజ్యా బ్రహ్మస్నేవ క్షత్రమన్వారం భయతి తస్మాద్ బ్రాహ్మణో ముఖ్యోముఖ్యో భవతి..''** **-(కృ.యజు: 2-6-2)**

*( 'గాయత్రి బ్రాహ్మణులతో పుట్టింది. త్రిష్టుప్ ఛందస్సు క్షత్రియులతో పుట్టింది')* అన్నారు.

వర్ణాల్లో బ్రాహ్మణ్యం ఎంత పవిత్రమో, ఉన్నతమో ఛందస్సుల్లో గాయత్రి అంత పవిత్రం, ఉన్నతం- అని.

ఈ జబ్బు ఆ తర్వాత అన్నింటికీ పాకింది.

ఉదా॥ జ్యోతిష్యంలోని గ్రహాల్లో కొన్ని బ్రాహ్మణ గ్రహాలు. కొన్ని క్షత్రియ గ్రహాలు. కొన్ని వైశ్యగ్రహాలు.కొన్ని శూద్ర గ్రహాలు.

ఇలా.. అన్నిరకాలుగా దైహిక, సాంస్కృతిక, సామాజిక రంగాల్ని విభజించి పారేసి..ఆ భావజాలాన్ని నింపేశారు.

దీనితో.. మేధస్సును కొందరికే హక్కు భుక్తం చేశారు. ఇలా మేధో పరిధి కుంచించుకు పోవడం వల్ల వైదిక సమాజ విజ్ఞానం వికసించలేక పోయింది.

ఇలా.. భారతీయ విజ్ఞానానికి యజుర్వేదంతో ఆదిలోనే హంసపాదు పడింది.

## నాలుగు వర్ణాలూ సమానమా?

యజుర్వేద కాలానికి సమాజంలో చాలా వృత్తులు వచ్చేశాయి. అవ్వన్నీ దాదాపుగా ఆ తదనంతరం కులాలుగా సంతరించుకున్నాయి.

వేదాల్లో కుమ్మరి (మట్టిపాత్రలు), కమ్మరి (లోహపాత్రలు), వడ్రంగి (చెక్క సామాన్లు)- ఈ ముగ్గురి ప్రస్తావనలు ప్రధానంగా కనిపిస్తాయి. ముఖ్యంగా శుక్లయజుర్వేదంలో 30వ అధ్యాయం పురుషమేధం. ఈ అధ్యాయంలో యజ్ఞశాలలో 11 వరుసలలో పాతిన యూపాలకు (బలిస్థంభాలకు) కట్టిన మనుషుల వివరాలున్నాయి. ఈ యాగంలో మొదటి వరుసకు 48 మందిని, మిగిలిన పది వరసలకు ఒక్కొక్క వరుసకు 11 మంది చొప్పున 10 మందిని, మొత్తం 48+110=158 మందిని కట్టాలి. వీరందరూ ఒక్కొక్క వృత్తికి చెందినవారు. వీరిలో వృత్తులవారున్నారు. ఉద్యోగులూ ఉన్నారు. నపుంసకులు, వ్యభిచారులు ఉన్నారు.

ఒకటి రెండు తప్ప దాదాపు 100కి పైగా వృత్తుల ప్రస్తావన ఉంది.

ఇందులోని (10-15)లో 7వ యూపానికి ఒక దాసుని, ఒక మత్స్యకారుని, ఒక శ్వేతకుష్ఠుని కట్టి , వారి సరసన ఒక చర్మకారుని, మరో చెప్పులు కుట్టేవానినీ కట్టినట్లుంది. అలాగే.. 10-18లో వాయువు అనే స్థంభానికి ఛండాలుని కట్టినట్లుంది. వీరు అంటరాని వారు అనే ప్రస్థావన లేదు.

ఇక్కడ...ఈ విషయం- అనంతరకాలంలో అంటరానివారిగా మార్చబడ్డ చర్మకారులు, ఛండాలుర ప్రస్తావన రావడం ... శూద్రజాతిలోని వారైన వీరిని ఆ తదనంతరం ఛండాలురుగా, అంటరానివారిగా (పంచమునిగా) విభాగించి ఉంటారనడానికి సాక్ష్యంగా కనిపిస్తుంది.

ఇన్ని వృత్తులతో బహు సంక్లిష్టంగా ఉన్న ఆనాటి సమాజంలో ఈ అశేష వృత్తులన్నీ శూద్రులుగా ముద్రవేయడంతోనే భారతీయ విజ్ఞానం తనకు తాను ఉరితీసుకుంది.

ఇక, వైశ్యులకి బ్రాహ్మణ, క్షత్రియులతో సమాన హోదా ఇవ్వలేదు. వేదంలో కొన్నిచోట్ల 'ఆర్య' అనే పదాన్ని వైశ్యులకు ఉపయోగించారు. వీరిని మొదట్లో శూద్రుల సరసనే చేర్చినా, నెమ్మదిగా బ్రాహ్మణ, క్షత్రియుల సరసకు తీసుకు వచ్చారు–

*'మరుత్తులు వైశ్యరూపులు. అన్నం మారుతం. పలావృక్షం బ్రహ్మ. (ఈ యజ్ఞక్రియవల్ల) వైశ్యులను బ్రాహ్మణులందు చేర్చినట్లగును..''–*

ఇలా.. మరికొన్నిచోట్ల యజ్ఞవిధుల్లో వైశ్యులకూ అవకాశం కల్పించారు.

అయితే.. యజ్ఞఫలం అందరికీ (నాలుగు వర్ణాలవారికి) దక్కాలనే విషయం కూడా రెండుచోట్ల ఉంది. అందులో శుక్లయజుర్వేదంలో 18వ అధ్యాయం 40వ యజస్సులో...

**'రుచం నో ధేహి బ్రాహ్మణేషు రుచం రాజసు నస్కృధి**
**రుచం విశ్యేషు శూద్రషు మయి ధేహి రుచా రుచం''**

**–(శు.యజు: 18-40)**

అలాగే..

**యథేమాం వాచం కల్యాణీమావదాని జనేభ్యః**
**బ్రహ్మ రాజ్యాభ్యాం, శూద్రాయచ, ఆర్యాయచ...'**

**(శు.యజు: 26-2)**

పై రెండు యజస్సుల అర్థం ఏమంటే..

*'ఓ అగ్నిదేవా! నేను శుభవాక్కులు పలుకుతున్నాను. అవి బ్రాహ్మణులకు, క్షత్రియులకు, శూద్రులకు, వైశ్యులకు శుభం కూర్చునుగాక''–*

ఇలా...రాజ్యంలోని నాలుగు వర్ణాలవారి శుభం కోరడం ఉంది కాబట్టి శూద్రులకు యజ్ఞార్హత ఉంది. వేదకాల సమాజంలో వర్ణభేదం లేదని చెప్పాలని కొందరి ఉబలాటం. అవును నిజమే! కాదనలేం...

అందరూ క్షేమంగా ఉండాల్సిందే! అశేష శ్రామికవృత్తులవారు (శూద్రులు) క్షేమంగా ఉండాల్సిందే! వారు అలా ఉంటేనే గదా పై వర్గాల ఆధిపత్యం, వినోద విలాసాలు సాగేది!

ఇక్కడ 'శుభం అందరికీ' అనేది ముఖ్యంకాదు. శూద్రులకు యజ్ఞాధికారం గానీ, యజ్ఞనిర్వహణలో ప్రత్యక్షపాత్రగానీ ఉందా! ఉంటుందా? అలాంటి ఆధారం ఎక్కడైనా ఉందా? అనేదే ప్రధానం.

బానిస బ్రతికుంటేనే బానిస యజమానికి లాభం. గొర్రెల్ని, పందుల్ని, పశువుల్ని మేపేది – కోసుకు తినడానికే! యజుర్వేదంలో శూద్రులకు కలగాలని చెప్పిన 'మేలు' కూడా అలాంటిదే!

## వైశ్యులకు వెసులుబాటు

అయితే, వ్యాపారవర్గం పట్ల యజుర్వేదం ఒకచోట చాలా కటువుగానే చెప్పింది–

**'యస్మాయం విశ్వఽ ఆర్యో దాసః శేధిపాఽ అరిః**
**తిరశ్చిత్ ఆర్యే రుశమే పవీరది తభ్యేత్సోఽ అజ్యతే రయిః**

**–(శు.యజు: 33-82)**

*('ఆదిత్యా! నీవు ఆర్యజగత్తుచే సేవించబడే వాడివి! వైశ్యుడు హింసకుడు. శత్రువు. వజ్రం కన్నా కఠిన హృదయుడు. ధనం దాస్తాడు. ఓ ! ఆదిత్యా! అతను దాచిన ధనాన్ని అతనికి చెందకుండా చేయుము. నీవే గ్రహించుము!'')*

ఈ వ్యాపారవర్గం ఆర్యజాతి నుండే అవతరించిందా, సింధూనాగరిక వ్యాపార సమాజం నుండి వచ్చిపడిందా! అనేది చర్చనీయాంశమే!

వైశ్యునికి యజుర్వేద కాలం తొలినాళ్ళలో లేని యజ్ఞక్రతువులో అభిషేకం చేసే అర్హత యజుర్వేద తుదికాలానికి వచ్చింది. బహుశ అతనికి వ్యాపారం ద్వారా వచ్చిపడిన విశేష ధనరాశుల వల్ల ఆ అర్హత వచ్చి ఉండొచ్చు.

శుక్లయజుర్వేదం పదో అధ్యాయంలో 17వ యజస్సులో ఇలా ఉంది.

*'రాజుని బంగారుపాత్రలోని జలంతో అభిషేకించాలి. రాజు సోదరుని ఔదంబర పాత్రజలంతో, రాజుమిత్రుని న్యగ్రోధపాత్ర జలంతో, వైశ్యుని రాగిపాత్రజలంతో అభిషేకించాలి*–అని. అంటే చివరికి అశేష శూద్రప్రజలైన సమస్త శ్రామిక వృత్తులవారు కేవలం భౌతికశ్రమకూ, గొడ్డుచాకిరికే మిగిలిపోయారన్నమాట.

దీనితో సమాజంలోని తొంభైశాతం మంది జనం బౌద్ధిక (విజ్ఞాన) పరిధి నుండి వేరుచేయబడ్డారు. ఆర్యభారతానికి ఖగోళపరిజ్ఞానం అబ్బినా, గణిత పరిజ్ఞానం నత్తనడకన సాగినా, సాంకేతిక పరిజ్ఞానం మాత్రం చతికిలపడింది. కనీసం కుంటినడకతో కూడా సాగలేక దేకవలసి వచ్చింది. వర్ణ,కుల వ్యవస్థవల్ల ఇక్కడ.. మానవమేధ అంతా..

యజ్ఞంలో పోసే నూనెలకూ.....

ఆ నూనెలు పోసే గరిటెలకూ....

యజ్ఞవేదిక పేర్చే రాళ్ళకూ....

యజ్ఞంలో బలిచ్చిన పశువుల మాంసాల వంటావార్పూ కార్యక్రమాలకే పరిమితమైపోయింది. ఋగ్వేదకాలం తర్వాత యజుర్వేదకాలానికి సాంకేతికశాస్త్రంలో వైదికభారత సమాజం సాధించిన ప్రగతి చాలా చాలా చాలా తక్కువే !

ప్రపంచంలో మనతోపాటు వైజ్ఞానికమార్గంలోకి మళ్ళిన గ్రీకు, చైనా, ఈజిప్టు దేశాల్లో మనకంటే ఖగోళ, గణితశాస్త్రం బాగా అభివృద్ధి చెందింది. కొద్దోగొప్పో సాంకేతిక పురోగతి కనిపిస్తుంది. మనకంటే బాగా వెనుకే వైజ్ఞానిక వర్గంలోకి మళ్ళిన ఐరోపాదేశాల్లో సాంకేతిక వైజ్ఞానిక ప్రగతి పరుగులు తీసింది–

నిజానికి మనం బాధపడవలసిన విషయం ఏమంటే–

ఈ దేశంలోని అశేషజనం కులచట్రంలో పడి కునారిల్లకుండా ఉండి ఉంటే...

ఐరోపాదేశాలకంటే ముందే ఇక్కడ యాంత్రిక (సాంకేతిక) నాగరికత పుట్టి ఉండేది. వైజ్ఞానికశాస్త్ర జన్మభూమిగా నిలిచేది.

ఈనాడు పాశ్చాత్య శాస్త్రవేత్తలు కనిపెట్టిన ప్రతి విషయాన్ని 'మా వేదాల్లో ఉన్నాయి' అని చెప్పుకునే దీనస్థితి పట్టేది కాదు. ఋగ్వేదకాలంలో కనిపించిన వైజ్ఞానిక ప్రగతికి, యజుర్వేదకాలానికే 'వర్ణం' అనే వైరస్ సోకింది. బ్రిటీషువారు వచ్చి ఆధునిక విద్యావిధానాన్ని అందించకపోతే– ఇక్కడ అంబేద్కర్, అబ్దుల్‌కలాంలు పుట్టేవారే కాదు.

**(ఇంకావుంది)**

---

**భావతరంగాలు-2**

# రాహుకాలం, యమగండం – ఎంతనిజం?



జె.ఎన్. దామోదరన్
8008045231

నేను తమిళనాట నివసిస్తున్నంతకాలం, మా తాతయ్య అమ్మమ్మలు, రాహుకాలం, యమగండం వున్న సమయాల్లో ఎక్కడికి వెళ్లటానికైనా నన్ను అనుమతించలేదు. అది చెడుకాలమని వారనుకుంటారు. ఆ వేళల్లో ఏ పనిచేసినా, అది ఫలప్రదం కాదట!

నా పనికోసం, 1972లో నేను హైదరాబాద్ వచ్చాను. అప్పటికే, చాలారోజులక్రితం, మా తాతయ్య చనిపోయాడు. మా అమ్మ 2013 వరకు జీవించే వుంది. ఆమె దగ్గరున్నంత కాలం, ఆమె మనసును గాయపర్చగూడదని, రాహుకాలం యమగండాలను పాటించేవాణ్ణి. కానీ, ఈ రెండు చెడు సమయాలవల్ల నేను ఏ యిబ్బందీ పడలేదు. సోమవారం నుండి ఆదివారం వరకు రాహుకాలం గంటన్నర సేపు ఉంటుంది. అలాగే యమగండం కూడా. ఉదయం 6 గం॥ వరకు ఉండే పగటివేళలో ఈ మూడుగంటల సమయంలో మనం ఏమీ చేయకూడదట! ఒక రోజులో ఇంత సమయాన్ని వదిలేయటం ఎంతవరకు సాధ్యం?

ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవించిన కాలంలో అది సాధ్యమై ఉండవచ్చు. కానీ ఇప్పుడలా కాదు. మనం ఇపుడు వివిధ వృత్తులు, కార్యకలాపాల్లో వుంటున్నాం. ఎన్నో ప్రయాణాలు చేస్తున్నాం. రాహుకాలం, యమగండం అని చెప్పబడే సమయాల్లో కూడా తమతమ వాహనాలను నిలువరించనందకు విమాన చోదకులను, రైల్వేవారిని, బస్సు, టాక్సీ, ఆటో, రిక్షాలాంటి వాహనదారుల్ని అభినందించాలి.

పాతరోజుల్లో మనవాళ్లు ఎడ్లబండ్లమీదనే ప్రయాణించారు. ఇపుడు, మనం కార్లను, ద్విచక్రవాహనాలను కూడా వాడుతున్నాం. సాంప్రదాయిక ఎద్దుల బండి నుంచి మనం ప్రక్కకు తొలగలేదా? సమయానికి గమ్యం చేరుకోలేం గనుక, ఎద్దులబండి ప్రయాణాలను ఆపేశాం. అలాగే, మగవాళ్లు, తమ కార్యస్థలాల్లోని ప్రయాణాల్లోనూ ప్యాంట్, షర్ట్‌లు ధరిస్తున్నారు. పూర్వపు రోజుల్లో వ్యవసాయమే ప్రధానం గనుక, పంచెకట్టు మాత్రమే వుండేది. అలాగే, ప్రతిరోజు గడ్డం గీచుకోవటం లాంటివి లేవు. ఎప్పుడో పండక్కో పున్నానికో అలా జరిగేది. ఇప్పుడు పైన చెప్పినవన్నీ చేస్తున్నాం. సొగసుగా, శుభ్రంగా కనిపించేందుకు ఇష్టపడుతున్నాం. ఇది, మన సంప్రదాయం నుంచి ప్రక్కకు మళ్లటం కాదా?

అదే మాదిరిగా, నేటి జీవనశైలి ప్రకారం, రాహుకాలం యమగండాలను పాటించటం అసాధ్యం. 1972 నుండి వీటిని అనుసరించటం నేను మానివేసాను.

శబ్దం కంటే వేగంగా ప్రయాణించగల వాయు వాహనాలను పాశ్చాత్యులు అభివృద్ధి చేస్తున్నారు. మన ఆలోచనరీతిని మార్చుకోవాల్సిన సమయమిది. ఇండియా కంటే చిన్నదేశాలు కూడా ఎంతో అభివృద్ధిని సాధిస్తున్నాయి. నేపాల్‌లో ఒక చిన్న గుడిసె కూడా కన్పించదు. వాళ్లకు మన మాదిరిగా పరిశ్రమల్లేవు. కానీ, ఇండియాలోని అత్యధిక ప్రజల జీవనప్రమాణాలు చాలా పేదగా వున్నాయి. ప్రపంచంతోపాటు మనమూ కదలాలి.

వేదాలు - విజ్ఞానం : 14

# మందు వెనక్కి – మంత్రం ముందుకి

**యదిమా వాజయన్న హ మోషధీర్హస్త ఉ ఆదేధ్**
**ఆత్మా యక్ష్మస్య నశ్యతి పురా జీవగృభో యధా**

*(శుక్ల యజుర్వేదం: 12–85)*

మంత్రంతో ఔషధాల్ని మంత్రించి అరచేతిలో పెట్టుకుంటే చాలు. మరణశిక్ష పడ్డవాడు చంపకముందే (భయంతో) చచ్చిన విధంగా రోగాలన్నీ నశిస్తాయి.




బొర్రా గోవర్ధన్
సెల్:9390600157


ఋగ్వేదానికీ యజుర్వేదానికీ గట్టిగా మూడు నాలుగువందల సంవత్సరాల కాలాంతరం ఉంది. సాధారణంగా ప్రపంచంలో మానవ నాగరకతా వికాసం వేగంగానో, నెమ్మదిగానో, అతి నెమ్మదిగానో.. చివరికి దేకుకుంటూ అయినా ముందుకే నడిచింది. అంటే పురోగమించింది. కొంతకాలం పురోగమించి, ఆ తర్వాత తిరోగమించిన నాగరకతలూ ఉన్నాయి. అవి నెమ్మదిగా కాలగర్భంలో కలిసిపోయాయి. కానీ, ఆర్యవైదిక నాగరకత మాత్రం వెనకడుగులేసుకుంటూనే ఉన్నా ఇప్పటిదాకా మనగలిగింది! ఇదే వింత! విచిత్రం!

సింధూ ప్రజల వైద్యవిధానం, ఋగ్వేద ఆర్యుల వైద్యవిధానం అదే సమయంలో ప్రపంచంలో వివిధ జాతుల వైద్యవైజ్ఞానిక ప్రగతి గురించి మనం గతంలో 'ఋగ్వేదంలో వైద్యం' అనే వ్యాసంలో చర్చించుకున్నాం.

ఋగ్వేదంలో ఉటంకించిన రోగాలూ, ఔషధాల గురించి చెప్పుకున్నాం.

ఋగ్వేదంలో మందులతోనే రోగాలు నయమవుతాయని ఉంది. ఔషధాల్ని ఉపయోగించిన వైద్యుల వివరాలూ వారిని కీర్తించడాలూ ఉన్నాయి–

కానీ, యజుర్వేదకాలంలో మందులతోపాటు రోగాల్ని నిర్మూలించే శక్తి "మంత్రాలకూ" ఉందని ఆర్యులు నమ్మారు. మంత్రాలతో తీసుకునే మందులు మరింత మరింత మేలు చేస్తాయనే ప్రస్తావనలు అనేక చోట్ల ఉన్నాయి. అంతేకాదు మందులకు బదులు యజ్ఞంలో జంతువుల్ని బలి ఇస్తే రోగాలు నశిస్తాయనే వివరణలు చాలానే ఉన్నాయి.

ఇప్పుడు శుక్ల, కృష్ణయజుర్వేదాల్లోని వైద్యం గురించి చూద్దాం!

## పాలూ – నీరూ

''శ్వాత్రాః పీతా భవత యూయమాపా ఉ
**అస్మాకమన్తరుదరే సుశేవాః**
**తా ఉ అక్మభ్య మయాక్ష్మా ఉ అనమీవా ఉ అనాగసః**
**స్వదస్తు దేవీరమృతా ఉ ఋతావృధః**

***(శు. యజు: 4–12)***

*"ఓ! జలమా! మీరు త్వరగా జీర్ణం కాగలరు. మా ఉదరానికి చేరి సుఖాలనిస్తారు. మమ్మల్ని రోగాల నుండి, పాపాల్నుండి కాపాడతారు. మీరు అమృత స్వరూపులు. అలాంటి జలము మాకు దక్కుగాక!"*

ఇది ఆ మంత్రం అర్థం.

శీతల ప్రాంతాల్లోని వారికి, ఆవుపాలు అతిగా తాగేవారికి, అతి మాంసాహారులకి మలబద్ధకం సహజం. మధ్య ఆసియా ప్రాంతాల నుండి వచ్చిన వారిలో ఈ దోషం బాగా ఉంటుంది. బార్లీ, యవలు, వరి,జొన్నల్లాంటివి ఆహారంగా ఎక్కువగా తీసుకోకపోయినా, పీచుపదార్థాలు తక్కువ తీసుకున్నా, నీరు తక్కువ తీసుకున్నా, కూరగాయల వాడకం తక్కువగా ఉన్నా, చేపలు తినకపోయినా మలబద్ధకం వస్తుంది. (వేదాల్లో చేపల ప్రస్థావనలు కనిపించవు)

చాలా రోగాలకి ఆవాసం పొట్టే. మలబద్ధకం కూడా అనేక రోగాలకి కారకం. ఇక్కడ నీటిని 'జీర్ణం'తో పోల్చడం, 'ఉదరానికి సుఖానివ్వడం అనేది' మలబద్ధకాన్ని వదిలించుకోవడమే! ఆర్యులకు ఆహారంతోపాటు అతిగా తాగే సారాయి (సుర) కూడా ఈ రోగానికి మరో కారణం! కాబట్టి 'జలాన్ని' ఔషధంగా భావించి, సేవించడం అనేది ఇక్కడ ప్రత్యేకంగా గమనించాల్సిన విషయం.

ఇక, పాలసేవనం చూద్దాం. ఆర్యులు త్రాగేపాలు ఎక్కువగా ఆవుపాలే! ఆవుపాలలో కొవ్వు తక్కువగా ఉన్నా అవి అతివేడి చేస్తాయి.

గేదెపాలు, మాంసాలు చల్లదనాన్ని, ఆవుపాలు, మాంసాలు వేడిని కలిగిస్తాయని వాగ్భటీయం లాంటి వైద్యగ్రంథాల్లో ఉంది.

అయితే, పాలు అన్నిరకాల పోషకవిలువలుండే

సంపూర్ణ ఆహారం. ముఖ్యంగా పాలలో ఉండే డి1, డి3 అనే ప్రోటీన్లు నాడీకణాల్ని బలపరుస్తాయి. కాబట్టి 'బుద్ధి వికాసానికి' పాలు ఉపకరిస్తాయి.

పాలు మాంసాహారం, శాకాహారం కాదు. ప్రపంచంలోని అతిశాకాహారులు (వేగన్స్) పాలను, పాల ఉత్పత్తులైన వెన్న, నెయ్యి, పెరుగు, మజ్జిగలాంటి ఉత్పత్తులేవీ ముట్టుకోరు.

నిజానికి మాంసాహారంలో ప్రత్యేకంగా ఉండే డి1, డి3 విటమిన్‌లు తినకపోతే నాడీకణాలు బలహీనపడతాయి. బుద్ధి మందగిస్తుంది.

కానీ ఆర్యులు అన్ని మాంసాలతోపాటు, పాలూ, వెన్నా, నెయ్యా పుష్కలంగా తీసుకున్నారు. ఆ విషయం చెపుతూ– కృష్ణయజుర్వేదంలో...

**ఇమౌ దేవౌ జాయమానౌ జుషన్త్మౌ**
**తమాగ్ంసి గుహతా మజుష్టా !**
**అభ్యామింద్రః పక్వమామాస్వన్తః**
**సోమాపుషభ్యాం జనదు ప్రియాసుః!**

**(కృ.యజు: 1–8–22)**

అని ఉంది. అంటే...

"సోమ, పూష దేవతలిద్దర్నీ సమస్త దేవతలూ సేవిస్తారు. వారు బుద్ధిమాంద్యాన్ని తగ్గిస్తారు. ఇంద్రుడు వాళ్ళిద్దరిచేతే ఆవుల్లో పాలను పెంపొందిస్తున్నాడు"–

## కంటిచూపు – కత్రజిత్తు

అలాగే...మంచి 'చూపుకోసం' కూడా నెయ్యి అవసరం అని కృష్ణయజుర్వేదంలో ఉంది.

**" పనమేదగ్నిః సర్వాదేవతా విష్ణుర్యజ్ఞోఽ గ్నిం...**
**.... మదునాదేకా అస్మై చక్షుః ప్రజనయతి**
**ఘృతే భవతి తేజో వైఘృతం........"**

**(కృ.యజు:2–2–9)**

*"మంచి చూపు కావాలనుకునేవారు అగ్ని, విష్ణు దేవతాకమగు చరుని, నేతితో నిర్వాపం చేయాలి. నెయ్యి ఆవు బీజం. చరులోని ధాన్యం (బియ్యం) ఎద్దు బీజం. ఈ రెండింటి కలయికే దృష్టివృద్ధికి కారణం. నెయ్యి తేజస్సు అవుతుంది. నేత్రం కూడా తేజస్సే అవుతుంది. తేజోరూపమైన నెయ్యి, తేజోరూపమైన నేత్రాన్ని ఇస్తుంది"* ఇదీ పై మంత్రం అర్థం.

ఇందులో 'చరు' అంటే యజ్ఞంలో సమర్పించే పాల అన్నం. నైవేద్యం లేదా సాంబువ్వ. బియ్యాన్ని సన్నగా విసరి, పాలతో ఉడికించి చేసే పాలతాలికల లాంటిది ఇది. ఈ పాలపాయసంలో నెయ్యి గుత్తంగా వేసుకుతినే అలవాటు ఇప్పటికీ ఉంది. ఈ రెండూ తినడం వల్ల దృష్టివృద్ధి కలుగుతుందని ఉంది యజుర్వేదంలో. నిజానికి నేత్రపాటవానికి ఒమేగా–3 లాంటి ఫ్యాటీ ఆసిడ్లు (చేపల్లో ఉంటాయి), జింకు ధాతువు, విటమిన్‌లు, ఆకుపచ్చ కూరగాయలు, ఆకుకూరల్లోని లూటిన్‌లు అవసరం.

ఇక్కడ చెప్పిన చరులోగానీ, నెయ్యిలోగానీ ఈ ధాతుపోషకాలు చాలా తక్కువ. నేతిలో అయితే అసలు లేనే లేవుకూడా. ముఖ్యంగా ఆవుపాలలో విటమిన్–సి, విటమిన్–ఎ, విటమిన్–డి లు అస్సలు ఉండవు. ఆవుపాలలో కంటే గొర్రెపాలలో ఎ, సి విటమిన్లు ఉంటాయి. ఆర్యులు ఆవులతోపాటు గుర్రాల్ని, గొర్రెల్ని కూడా బాగా మేపేవారు. అయితే, యజ్ఞసంభారాలుగా ఆవుపాలకి మాత్రమే పవిత్ర అర్హత కలిగించారు.

మంచిచూపుకి నెయ్యి అనే ప్రక్రియ బహుశా ఇలా పుట్టి ఉండొచ్చు. కాంతివల్లే వస్తువుల్ని చూస్తాం. కాబట్టి నేత్రం అగ్ని నుండి పుట్టింది అనేది వేదరుషుల అభిప్రాయం. ఈ విషయం ఋగ్వేదంలో, యజుర్వేదంలో ఉంది. యజ్ఞగుండంలో అగ్నిని పుట్టించేది నేయి కాబట్టి నేతివల్ల కంటిచూపు తేజోవంతం అవుతుందని ఆర్యులు నమ్మి ఉంటారు.

ఈ నమ్మకం యజ్ఞ సంబంధమే గాని, ధాతు సంబంధం కాదు. అయితే, కృష్ణయజుర్వేదం రెండవకాండలోని ఎనిమిదో అనువాకం మొత్తం నేత్రవైద్యం గురించే. దాన్లో కత్రుజిత్తు అనే నేత్రవైద్యుని (ఐ స్పెషలిస్ట్) ప్రస్తావన ఉంది. మణి కొడుకైన రజనుడు తన దృష్టిదోషాన్ని నివారించుకోడానికి కత్రుజిత్తు దగ్గరికి వస్తాడు. కత్రుజిత్తు మూడురకాల చరుల్ని ముగ్గురు దేవతలకు అర్పిస్తాడు. ఈ అనువాకంలో దేవతల దృష్టికి సూర్యుడు కారణం, మానవుల 'దృష్టి'కి అగ్ని కారణం అని ఉంది. కనురెప్పలు వాల్చడం, తెరవడం అనేది 'దృష్టి' అనిత్యం అని తెల్పుతుంది అంటారు. ఈ మనుషులకు ఈ అనిత్యదృష్టి అగ్ని స్వభావమే. ఎందుకంటే అగ్ని కూడా శిఖలుగా ప్రతిక్షణం రేగి, ఆ శిఖలు అదృశ్యమవుతాయి. మరలా కొత్తశిఖలు పుడతాయి. కాబట్టి అగ్నిశిఖలు అనిత్యాలు. కాబట్టి మానవులదృష్టి కూడా అనిత్యమే అంటుంది ఈ అనువాకం.

**నిజానికి రెప్పలార్పడం అనేది క్షణకాలంపాటు మెదడు తీసుకునే విశ్రాంతి. మెదడులోని జ్ఞానశక్తిపుంజాలు ఆగి ఆగి ప్రసరిస్తాయి. కంప్యూటర్‌లో కూడా ఇలాంటి తరంగాల ప్రయాణమే ఉంటుంది. కంప్యూటర్‌లో లైట్ బ్లింక్ అవుతూ ఉంటుంది మన రెప్పల్లా!**

అయితే, అగ్నిశిఖతో పోల్చడం వాస్తవం కాకపోయినా

అద్భుత వర్ణనే!

ఈ నేత్రవైద్య విషయంలో తీసుకునే 'చరు' ముక్కుకు బలాన్ని ఇస్తుంది. రెండు నేత్రాల్ని నిలబెట్టేది ముక్కు కాబట్టి నేత్రబలం వృద్ధి అవుతుంది! అనేది ఈ అనువాకంలోని అంశం.

## ఔషధాల వర్గీకరణ

ఔషధాల వర్గీకరణ చాలా ప్రాథమికంగా కృష్ణయజుర్వేదంలో కనిపిస్తుంది. ఇలాంటి వివరణ ఇంతకుముందు ఋగ్వేదంలో లేదు.

కృష్ణయజుర్వేదం 4-2-6లో..

"ఓ! ఔషధులారా! మీరు మాకు తల్లులు. నేలతీరుని బట్టి మీరు వంద రకాలు. వేరు తీరుని బట్టి వేయిరకాలు. కాబట్టి మీరు వందక్రతువులతో సమానులు" అంటూ వాటిని ఇలా విభాగించారు-

**"........... శతంవో అంబధామాని సహస్రముత వో రుహః**

**అథా శతక్రత్వో యూయమియం మే అగదం కృత**

**పుష్పావతీః ప్రసూవతీః ఫలినారఫలా ఉత!...."**

***(కృ.యజు:4-2-6)***

*"ఔషధుల్లో కొన్ని పూలు, కొన్ని పండ్లు. కొన్ని పూమొగ్గలు. కొన్ని ఫలపుష్పాలు కానివి (వేర్లు). కొన్ని తీగలు. కొన్ని ఏళ్ళపాటు పూతపూయని, కాయని మొక్కలు"* అని దీనర్థం

ఇందులో ఆరు రకాల విభజన ఉంది:

1. పూలు (ఫ్లవర్ మెడిసిన్స్): ఈ విధానం ఇప్పుడు హిమాలయప్రాంతాల్లో, టిబెట్, చైనా దేశాల్లో ఉంది. ముఖ్యంగా కలువ, తామరపూలను పూర్వకాలంలో మంచి ఔషధాలుగా వాడేవారు. ఇప్పటికీ వారు పూలను ఎండబెట్టుకుని, తేనెలాంటి వాటిలో నానబెట్టుకుని ఔషధాలుగా ఉపయోగిస్తారు)
2. పండ్లు: కరక్కాయ, జాజికాయ, త్రిఫలచూర్ణంలో వాడే తానికాయ, ఉసిరికాయ. వాటిని వైద్యంలో ఫలాలు అంటారు.
3. పూమొగ్గలు: (లవంగం, మిరియం వంటివి)
4. వేర్లు (పసుపు, సొంఠి, ఇతరవేర్లు)
5. తీగలు (తిప్పతీగె, నల్లేరు లాంటి తీగలు)
6. ఫలించని మొక్కలు: (క్రోటన్‌లు, దీర్ఘకాలానికి పుష్పించే ముళ్ళజాతులు, సాగనార, కలబంద లాంటివి)

*(ఇక్కడ బ్రాకెట్లలోని వివరాలు నేను రాసినివి. వేదంలోనివి కావు)*

**అశ్వావతీంగ్ సోమవతీ మూర్జయన్తీ ముదోజసం**

**ఆ విథ్సి సర్వా ఓషధీరస్మా అరిష్టతాతయే**

**యాః ఫలినీర్యా అఫలా అపుష్పా యాశ్చ పుష్పిణీః**

**(కృ.యజు:4-2-6)**

*'అశ్వ ఔషధి, సోమ ఔషధి, బల ఔషధి, ఓజో ఔషధి, ఇలా ఔషధుల్ని తెచ్చిపెట్టుకున్నాము. ఈ ఓషధులు రోగాల్నుండి యజమానిని రక్షించును"*

ఇలా ఔషధాల వర్గీకరణ చాలా ప్రాథమికంగా కన్పిస్తుంది. అలాగే... శుక్లయజుర్వేదంలో 12వ అధ్యాయంలో 76 నుండి 101వ మంత్రాలన్నీ ఔషధాలకు సంబంధించిన మంత్రాలే. వీటిలో ఋగ్వేదంలో చెప్పిన విషయాలు చాలా ఎక్కువగానే ఉన్నాయి.

'ఔషధులారా! నా శరీరాన్ని రోగ రహితం చేయండి"

*(శు. యజు: 2-76)*

**'యత్రౌషధీః సమగ్మత రాజానః సమితావివ**

**విప్రః స ఉచ్యతే భిషగ్రక్షహామీవ చాతనః"**

***(శు. యజు:2-80)***

అంటే..

"రాజులు విజయం పొందడానికి యుద్ధం చేస్తారు. విప్రులు రోగాల్ని జయించడానికి ఔషధాలు ప్రయోగిస్తారు. అందుకే వారిని "భిషక్కులు" (వైద్యులు) అంటారు".

అలాగే.. శుక్ల యజుర్వేదం 2-83లో

**"ఇష్కృతిర్నామ వో మాతాథో యూయంస్థ నిష్కృతి.."**అని ఉంది. అంటే.. "ఔషధులారా! నిష్కృతి మీకు తల్లి కాబట్టి మీరు 'నిష్కృతులు' అవుతారు. అంటే తీసిపారేసేవారు" అని అర్థం.

**"బృహస్పతి ప్రసూతాస్తా నో ముంచివ్వం హసః**

***(శు. యజు:12-89)***

"ఔషధులారా! మీరు బృహస్పతి వల్ల సృష్టించబడ్డారు".

ఇంకా- ఇలా ఉంది.

**"ముంచిన్తు మా శపథ్యాదథో వరుణ్యాదుత**

**అథో యమస్య పడ్వీశాత్సర్వస్మాద్ దేవకిల్బిషాత్**

***(శు. యజు:12-90)***

"ఆడినమాట తప్పడం వల్ల కలిగిన పాపఫలం వల్ల వచ్చే వ్యాధుల్నుండి, వరుణుని వల్ల కలిగే వ్యాధులనుండి, యముని సంబంధమైన క్షయరోగం నుండి, ఓ! ఔషధులారా! నన్ను రక్షించండి!"

ఇక, ఇది చూడండి- ఆకాశం నుండి జలం ద్వారా భూలోకానికి వచ్చిన ఔషధులు ఇలా అనుకుంటున్నాయి-

**"అవపతన్తీరవదనేదివ ఉ ఓషధయస్పరి**

**యం జీవమశ్నవామహై న స రిష్యాతి పురుషః**

***(శు. యజు:12-91)***

"ఏ జీవి వంట్లో మనం ఉంటామో, ఆ జీవికి చావులేదు"-

రోగం గురించి ఒక మంచి వివరణ ఇదే అనువాకంలో ఉంది. "ఆకలి ఒక రోగం. దానికి మందు ఆహారం. అలాగే రోగానికి

ఆహారం ఔషధం". అని ఉంది.

## మందు - మంత్రం

ఇక, మొత్తం ఋగ్వేద వైద్యవిజ్ఞానానికి ముందడుగు పడకుండా మోకాళ్ళ వరకు నరికిన విధానం, 'మంత్ర' తంత్రాల మాయాజాలంలోకి వైద్యాన్ని పడనెట్టేసిన విధానం యజుర్వేదంలో ఎలా మొదలైందో చూద్దాం!

శుక్లయజుర్వేదంలోని ఇలాంటి ఒక మంత్రంతోనే ఈ వ్యాసం ప్రారంభించాం. ఇక కృష్ణయజుర్వేదంలోని మంత్రాలు కొన్ని చూద్దాం!

**"న్వాచం దధాతి ప్రవదితా వాచో భవత్యపన్నదతీ భవతి తస్మాన్మనుష్యాః సార్వాం వాచం వదంత్యాగ్నేయం కృష్ణగ్రీవమా లభేత సౌమ్యంబభ్రుం జ్యోగామయావ్యగ్నిం....."** **(కృ.యజు:2-1-2)**

*"దీర్ఘరోగం కలవాడు అగ్ని సంబంధి అయిన నల్లని మెడగల మేకను, సోమసంబంధి అయిన గోధుమరంగు ఉన్న మేకను యజ్ఞంలో వధించాలి. అలాచేస్తే ఆ రోగి దేహం అగ్ని నుండి తేజాన్ని, సోముని నుండి రసాన్ని పొందుతుంది. ప్రాణాలు పోయేదశలో ఉన్నవాడు కూడా బ్రతికి లేస్తాడు"*

అలాగే...

సంతానంకోసం కూడా పైవిధంగా అలాంటి పశువుల్నే బలి ఇవ్వాలి. అలా చేస్తే సోముడు యజ్ఞయజమానికి రేతస్సు (వీర్యం)ను నిలుపుతాడు. అగ్ని సంతానాన్ని కలిగిస్తాడు-

యజ్ఞప్రక్రియల వల్ల ఫలం దక్కుతుందో, లేదో గానీ, మేకమాంసం, మేకపాలు మాత్రం అన్నింటికంటే మేలు.

ఇక్కడ యజ్ఞ బలిగా వధించబడిన జంతువుల మాంసాల్ని వారే తింటారు. కాబట్టి ఏమైనా మేలు జరిగితే మాంసంవల్లే మేలు జరుగుతుందిగానీ, యజ్ఞంవల్లా కాదు. మంత్రం వల్లా కాదు. ఐతే **మందుతో పాటు మంత్రాన్ని జతచేయడం వల్ల ఇక్కడ విశాలంగా విస్తరించాల్సిన వైద్య విజ్ఞానం మతం పరిధిలోకి వెళ్ళిపోయింది. మరుగుజ్జుగానే మిగిలి పోయింది.**

పై మంత్రం విషయాన్నే చూద్దాం!

"మేకమాంసమంత మేలు-కోడిమాంసమంత కీడు" లేదంటారు. నిజమే....!

ఒక ఆయుర్వేద డాక్టర్ నాతో ఇలా చెప్పాడు...

నా శరీరం మీద అక్కడక్కడ నాలుగైదు చోట్ల బఠానీ గింజంత తెల్లమచ్చలు వచ్చాయి. అవి బొల్లి (శ్వేతకుష్ఠు) మచ్చలు. డా॥ శ్రీనివాస్ అనే బాపట్ల ఆయుర్వేద డాక్టర్ హేతువాది, నాస్తికుడు, మానవవాది. ఆయన నాతో రెండు నెలలపాటు మేకమాంసం (గొర్రెమాంసం కాదు) తినమన్నాడు. నిమ్మరసం ఎప్పుడూ వాడొద్దన్నాడు. నేను నానాతంటాలు పడి తిన్నాను. పదేళ్ళుగా ఉన్న మచ్చలు పోయాయి. ఇప్పటికి పదిహేనేళ్ళయ్యింది. ఇంతవరకు కన్పించలేదు.

జీవితకాలంలో జిల్లేడు ఆకు తినకుండా పెంచగలిగిన మేకపాలు ఒక యంబిబియస్ డాక్టర్‌తో సమానం అని చెప్తాడు-డా.శ్రీనివాస్ గారు.

## దీర్ఘ వ్యాధులు

యక్ష్మ (క్షయ), రాజయక్ష, కుష్ఠ, శ్వేతకుష్ఠులు ఆర్యుల్లో సర్వసాధారణంగా కనిపించే వ్యాధులు. ఇవన్నీ దీర్ఘరోగాలు-

అలాగే.. ఇదే కాండలో ఇదే ప్రపాఠకంలో కుష్ఠువ్యాధికి సంబంధించిన విషయం ఉంది. 'నల్లని పశువు (మేక లేక పంది) ను బలివ్వడం వల్ల చర్మరోగం తగ్గింది' అని ఉంది.

బౌద్ధంలోని వినయపిటకంలో కూడా ఒక సంఘటన ఉంది. ఒక భిక్షువుకి చర్మం చెడిపోయే (కుష్ఠు)రోగం వస్తే అతను పంది పచ్చిమాంసం, పచ్చిరక్తం త్రాగుతాడు. రోగం నయమవుతుంది.

అంటే... కుష్ఠువ్యాధికి మేక, పందిమాంసాలు ఆర్యులు ఔషధాలుగా ఉపయోగించి ఉంటారు.

అలాగే.. మరో ఉదంతం..

'కొందరికి రోగలక్షణాలు పైకి కన్పించవు. కానీ రోగపీడితుల్లా క్షీణించిపోతుంటారు. ఇలాంటి లక్షణాలు వైద్యునికి తెలియకపోయినా 'ప్రజాపతికి' తెలుసు. కాబట్టి యజ్ఞంలో "కొమ్ములు లేని కోడెదూడను" బలివ్వాలి' అంటుంది కృష్ణయజుర్వేదం.

అలాగే యజ్ఞంలో చరును (నేతి పాయసాన్నం) నిర్వాపం చేస్తే చర్మరోగాలూ పోతాయి, సంతానమూ కలుగుతుంది అని కృష్ణయజుర్వేదం 2-2-10లో ఉంది.

**"భేషజమే వా ఉ స్మి కరోతి యది బిభీయాద్దుశ్చర్మా భవిష్యామీతి**

**సోమాపౌష్టం చరుం నిర్వపేథ్సౌమ్యో ..... వై దేవతయా పురుషః**

**పౌష్ణః....పశుభిస్త్వంచం కరోతి న దుశ్చర్మా భవతి"**

***(కృ.యజు:2-2-10)***

## చలిజ్వరం

జ్వర లక్షణం వేడి. కానీ, జ్వరం ఉన్నప్పటికీ శరీరం చలితో గజగజవణికి పోతుంది. దీన్ని చలిజ్వరం అంటాం. మలేరియా జ్వరం. ఇది ఉష్ణమండలప్రాంతంలో వచ్చే జ్వరం. యజుర్వేదకాలానికి ఆర్యులు గంగామైదానంలో స్థిరపడ్డారు.

కాబట్టి ఋగ్వేదంలో కనిపించని కొత్తజ్వరం (చలిజ్వరం) యజుర్వేదంలో కనిపిస్తుంది. అది వృత్రుని కథలో కనిపిస్తుంది.

వృత్రుని కథ ఋగ్వేదంలో ఉంది. అదే కథ ఇక్కడా ఉంది.

**"............... స ఇంద్ర ఆత్మనః శీతరూరావజనయత్త చ్ఛీతరూరయోర్జన్మ య యేవంగ్ శీతరూరయోర్జన్మ వేద......"** (కృ.యజు:2-5-2)

*"ఓ ఇంద్రా! మేము వృత్రుని నోటిలో ఉన్నాం.అతని దంతాల క్రింద నలుగుతున్నాం" అంటూ పిలుస్తారు ఇంద్రుణ్ణి అగ్నీ, సోములు.*

*అప్పుడు ఇంద్రుడు ముందు చలిని, తర్వాత వేడిని పుట్టించాడు. ఈ రెంటినీ కలిపి వృత్రుని పైకి సంధించాడు. వృత్రునిలో శీతతాపం (చలిజ్వరం) పుట్టింది. వృత్రుడు వణికాడు. ఆ వణుకువల్ల వృత్రుని దవడలు వణికాయి. అప్పుడు అగ్నిసోములు బైటపడ్డారు. తర్వాత వృత్రుడు మరణించాడు-"* అని ఈ మంత్రార్ధం.

చలిజ్వరం ఉష్ణ మండల వ్యాధి. ముఖ్యంగా భారత దేశ వ్యాధి. అందునా దక్షిణ భారత దేశ వ్యాధి. ఈ వ్యాధిని ఆర్యులు ముందుగా దస్యుల్లో చూశారు. అందుకే వృత్రునికి ఈ వ్యాధిని సోకించారు. ఈ వ్యాధికి తమ ఇంద్రుడే కారణమని చెప్పుకున్నారు. యజుర్వేదాన్ని బట్టి వృత్ర హంతకి మలేరియా జ్వరమే. ప్రపంచాన్ని జయించిన అలెగ్జాండర్ చివరికి భారతదేశానికి వచ్చాక ఇక్కడ మలేరియాసోకి, మార్గమధ్యంలోనే మరణించాడంటారు.

"ఆవువ్యాసం లాగా... తిరిగి తిరిగి ఏది చెప్పినా ఆవు" దగ్గరకే వచ్చినట్లు-

యజుర్వేద ఆర్యులు ఏలక్షణాన్నైనా యజ్ఞక్రతువుల్లోంచే చూశారు. వారికి మందులు కంటే మంత్రాలే ప్రధానం అయ్యాయి.

అంటే... వైద్యం కూడా యజుర్వేద కాలానికి మంత్రోచ్చారణ చేస్తూ యజ్ఞవేదిక చుట్టూ తిరిగింది. యాగమంత్రాలనే యూపానికి కట్టి వేయబడింది. బలికాబడింది.

**ఋగ్వేదవైద్యానికి మంత్రాల ముసుగు తగిలించింది యజుర్వేదం.**

అనంతర కాలంలో వచ్చిన చేతబడులు, మంత్రించిన తాయెత్తులు, మంత్ర జల ఔషధాలూ.. మరీముఖ్యంగా మానసిక రోగులకి చేసే భూతవైద్యానికి పునాదులు యజుర్వేదంలోనే పడ్డాయని అర్ధమవుతోంది !

## బౌద్ధం - వైద్యం

అయితే- వైదిక సంప్రదాయం కేవలం మంత్రాలకే పరిమితం కాక, ఔషధాలతోపాటు మంత్రం కలగలిపి అటు తిరోగమన, పురోగమన మార్గాల్ని ఏకకాలంలో సాగించింది. అందుకే వైదికయుగం అనంతరం స్థబ్దంగా ఉండిపోయిన వైద్యవిధానం తిరిగి బౌద్ధులతోనే పురోగమనదిశ పట్టింది.

తొలిసారి వైద్యాన్ని, వైద్యవిధానాన్ని, ఔషధాల తయారీని వ్యవస్థాగతం చేసింది బౌద్ధమే. బౌద్ధంలోని **వినయపిటకంలోని ఏడోదైన భైషజ్యస్కంధం, ఎనిమిదోదైన చీవరస్కంధాలు రెండూ వైద్యశాస్త్ర తొలిగ్రంథాలు. జబ్బులూ, వాటి విభజనలూ, వాటికి వాడవలసిన 18 రకాల చికిత్సా విధానాలూ ఆ స్కంధాలలో ఉన్నాయి.**

ఈ 18 రకాల పద్ధతుల్లో 'మంత్రం' మాత్రం లేదు. మంత్రాల కుతంత్రాల్ని ఛేదించింది బౌద్ధం.

బుద్ధుని తర్వాత 400 సంవత్సరాలకి అధర్వణవేదం వచ్చింది. అధర్వణవేదంలో గానీ, ఆ తర్వాత వచ్చిన చరకుని చరకసంహితలోగానీ, సుశ్రుతుని సుశ్రుతసంహితలోగానీ ఉన్న చికిత్సా విధాలన్నింటికీ మూలం బౌద్ధుల భైషజ్య స్కంధమే. బుద్ధునికి తాత్త్వికదృక్పథంతోపాటు మంచి వైద్యపరిజ్ఞానం ఉంది. అందుకే ఆయన్ని "భైషజ్య గురువు" అంటారు.

ఇక, ఆయుర్వేదంగా మారిన వైదిక వైద్యం గుప్తులకాలంలో కులపరిజ్ఞానంగా మారింది. భైషజ్యులు అంటే (వైద్యులు) పురోహితులు, బ్రాహ్మణులు మాత్రమే అనే కులీకరణ జరిగింది. బౌద్ధుల్లో అగ్రగణ్య వైద్యుడైన జీవకుడు ప్రవేశపెట్టిన శస్త్రచికిత్సలు.. బ్రాహ్మణులు అందిపుచ్చుకోలేదు. అవిమాత్రం మంగలి, మాల, మాదిగ కులాల వారికే పరిమితమైపోయాయి- అంటరానితనం ముదిరిపోయాక వారి దగ్గర కూడా అవి పురోగతి చెందలేక పోయాయి.

బౌద్ధ సంప్రదాయి అయిన సుశ్రుతుడు మాత్రమే తిరిగి జీవకుని శస్త్రచికిత్స విధానాల్ని అంది పుచ్చుకున్నా, ఆ తర్వాత వాటిని అభివృద్ధి పరచినవారు లేకపోయారు. చివరికి భారతీయ వైద్యుడు అంటే వైదిక పురోహితుడే అయ్యాడు. యజుర్వేదం ప్రసాదించిన 'మంత్రానికీ, మందులకూ... రెండింటికీ వారసుడయ్యాడు.

ఆధునిక కాలం వరకూ 'ఎక్కడ వేసిన గొంగలి అక్కడే' ఉండిపోయింది.

తాతల మూతులు వాసనలు చూస్తూ, గప్పాలుకొట్టుకుంటూ బతికే మానసికరోగం కొందరిలో ఇంకా నయంకాని రోగంగానే మిగిలిపోయింది. ***(ఇంకావుంది)***

# ఆదిలోనే హంసపాదు

**కోదదర్శ ప్రథమం జాయమానమస్థన్వన్తం యదనస్థా బిభర్తి**
**భూమ్యా అసురసృగాత్మా క్వ స్విన్ కో విద్వాంసముపగాత్ ప్రష్టుమేతత్ !**

"మొట్టమొదటిగా జన్మించినవానిని ఎవడు చూశారు? ఎముకలు లేనివి, ఎముకలు కలిగినవి ఎప్పుడు పుట్టాయి? ఎప్పుడు భూమి నుండి రక్తం, ప్రాణం పుట్టాయి? ఆత్మలు ఎక్కడి నుండి ఉద్భవిస్తున్నాయి?'

**(ఋ: 1-164-4)**

## అతిపెద్ద ప్రశ్న

తాను పుట్టడం, తన చుట్టూ ఉన్న జీవజాతులన్నింటికీ సంతానం కలగడం, మొక్కల విత్తనాల నుండి మొలకలు రావడం- మానవుడు నిత్యం చూసే సంఘటనలే!



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

సంతానం కలగనివారినీ, ప్రసవిస్తూ ప్రాణం వదిలే వాటినీ చూస్తూనే ఉంటాడు.

1. తల్లిగర్భంలో ఊపిరందని మాయసంచిలో పిండం ఎలా బ్రతుకుతుంది? ఆ పిండాన్ని అలా బ్రతికించేది ఎవరు?-
2. విత్తనంలో మొక్క ఎక్కడ దాగి ఉంది? ఆ మొక్కను కన్పించకుండా అక్కడ దాచిందెవరు?

ఈ రెండు ప్రశ్నలూ ఈనాడు చాలామందికి చాలా చాలా తేలిక ప్రశ్నలుగా కన్పించవచ్చు. కానీ, ఆదిమానవుని పరిజ్ఞానానికి అంతుచిక్కని ప్రశ్నలే? అవి ఎంత కఠినమైన ప్రశ్నలంటే.. ఈనాటికీ ప్రపంచ మానవాళిలో మూడొంతుల మందికి ఇంకా 'అంతు దొరకని' ప్రశ్నలుగానే మిగిలి ఉన్నాయి-

ఈ రెండింటి సమాధానం కోసం మానవ మస్తిష్కం వెదికే క్రమంలో వీటికి సరైన సమాధానం దొరక్కపోగా, వీటికి మించిన ప్రశ్న మరొకటి ఎదురైంది. అదేమిటంటే..

మనం పుడతాం, బ్రతుకుతాం, పెరుగుతాం, ముసలివాళ్ళమవుతాం, చనిపోతాం గదా. ఈ దశలన్నీ భౌతిక ప్రపంచానికి చెందినవే. ప్రత్యక్షంగా చూడగలిగినవే! మరి... చనిపోయాక ఏమవుతాం? అనేదే ఎదురైన అతిపెద్ద ప్రశ్న.

ఈ ప్రశ్నే కనుక మనిషిలో ఉదయించకపోతే... ఇప్పటి వరకూ వచ్చిన సమస్త విజ్ఞానం, సర్వ తాత్త్విక దృక్పథాల్లో ఏ ఒక్కటీ మొలకెత్తేదే కాదు.

"లేచామా? తిన్నామా? తొంగున్నామా?"- ఈ పరిధిలోనే మానవసమాజం పడి తిరుగుతూ ఉండేది?

'చనిపోయాక ఏమవుతాం?' అనే ప్రశ్నలోనే 'మనం ఎక్కడి నుండి తల్లిగర్భంలోకి వస్తున్నాం?' అనే ప్రశ్నకూడా అంతర్లీనంగా ఉంది.

ఆదిమ సమాజాల్లో స్త్రీపురుషుల కలయిక సర్వసాధారణం. నిత్యకృత్యం. అదేదో ఒక ప్రత్యేక నైతిక విషయం కాదు. ఆహారం,నిద్రల్లాగా అతి సాధారణ అంశంగానే ఉండేది. స్త్రీ పురుషుల కలయిక వల్లే సంతానం కలుగుతుంది అనే విషయాన్ని వారు గుర్తించేలోపే....ఆదిమ మానవుల ఆలోచనలు ఎక్కడెక్కడికో వెళ్ళిపోయాయి. ప్రకృతి నుండి, ప్రకృతిశక్తులలోకి, అక్కడి నుండి అతీత లోకాలను చుట్టి వచ్చేశాయి. ఇప్పటికీ ఈ లోకాల చుట్టూ తిరుగు తున్న వారు ఎందరెందరో?

మనిషికి నాగరకత పెరిగినకొద్దీ... వస్తు ఉత్పత్తులూ పెరిగిపోయాయి. మనిషి ముడిసరుకులనుండి కొత్తకొత్త వస్తువులు తయారు చేవయడం నేర్చాక ..... కుర్చీని తయారు చేసినవాడు ఒకడు ఉన్నట్టే.. 'ఈ సృష్టిని తయారు చేసేవాడు' ఒకడు ఉండాలి గదా!' అనే ఆలోచన బయలుదేరింది. బలపడింది.

కార్యం జరగాలంటే 'కర్త' ఉండాలి అనే భావనే ఈ సృష్టికార్యానికి ఒక 'సృష్టికర్త ఉన్నాడు' అనే భావాన్ని పెంపొందించింది. 'సృష్టికర్త' అనే వాడు కూడా నాగరిక సమాజ ఆవిష్కరణల్లో ఒక ఆవిష్కరణే. అయితే అది భౌతిక ఆవిష్కరణ కాదు. 'భావ' ఆవిష్కరణ.

అందుకే ఈ వ్యాసం మొదట్లో ఉన్న ఋగ్వేద ఋక్కులో ఋగ్వేద ఆర్యుల ప్రశ్నల పరంపర...

'ఎవరు చూశారు మొదట పుట్టినవానిని?' అని.

ఈ ప్రశ్నకు సమాధానం నిన్న మొన్నటి పోతనకూ చిక్కలేదు...అందుకే..

"ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపల నుండు ...... ఆదిమధ్యలయుడెవ్వడు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

ఋగ్వేద ఋక్కులోని ఈ ప్రశ్న సృష్టికర్త గురించే అయినా, అతను 'మానవేతరుడు కాదు' అనే విషయం కూడా అందులో ఉంది. అలాగే, ఎముకలు, రక్తం, ప్రాణం అనేవి భూమినుండి జనించిన భూసారాలే అనే భావన కూడా ఆ ఋక్కులో ధ్వనిస్తోంది. అంతేకాదు... శరీరాన్ని నడిపించే 'ఆత్మ' ఎక్కడి నుండి పుట్టుకొస్తుందనే ప్రశ్నకూడా ప్రస్ఫుటంగా కన్పిస్తోంది.

మనం, గుర్తుపెట్టుకోవాల్సిన విషయం ఏమంటే... ఋగ్వేద ఆర్యులకి ఆత్మభావన ఉంది. మరణానంతరం అది స్వర్గానికి పోతుంది. కానీ, తిరిగిరాదు.అంటే..తిరిగి పుట్టదు. మరి ఈ ఆత్మ ఎలా పుడుతుంది? అనేదానికి వారికి తట్టిన కారణం ఇది: వర్షం నుండి, వనస్పతుల్నుండి, పంటధాన్యాన్నుండి, ఔషధాల నుండి ఆహారంగా శరీరంలోకి ప్రవేశిస్తుంది' అనేది ఋగ్వేద ఆర్యుల ఆత్మభావన?

మొత్తంమీద ఋగ్వేదంలో కనిపించిన సృష్టికి సంబంధించిన మొట్టమొదటి అంశం ఇది.

## కొత్త సినిమా

అనేక కారణాల వల్ల కార్యం జరుగుతుందనే విషయాన్ని కాకుండా కార్యానికి మూలం 'కర్తే' అనే నిర్ణయానికి ఋగ్వేద ఆర్యులు వచ్చారు. ఈ భావనే ఆ తర్వాత 'సృష్టికర్త', 'భగవంతుడు', 'దేవుడు' అనే అభౌతికశక్తి పుట్టుకకు కారణమైంది.

ఆదిలో మానవులు వేసుకున్న ప్రశ్న మంచిదే, సమాధానం కోసం జరిపిన ప్రయత్నమూ మంచిదే, కానీ 'కర్త సృష్టికి కారణం' అనే తప్పుడు సమాధానమే దారి తప్పించింది.

ఋగ్వేదం నిండా కనిపించే ఇంద్రుడు, అగ్ని, వరుణుడు, అశ్వినీ దేవతలు మొదలైన ప్రకృతిశక్తుల స్థానాన్ని ఈ 'సృష్టికర్త' నెమ్మదిగా తొలగించి, ఆ స్థానాంలో తన చోటు పదిలం చేసుకున్నాడు. ఈ స్థానంలో కూడా మొదటిలో విశ్వకర్మ, ప్రజాపతి, ఈశ్వరుడు లాంటివాళ్ళు ఉన్నప్పటికీ, తర్వాత...తర్వాత ఆ స్థానాన్ని విష్ణువు స్వాధీనం చేసుకున్నాడు.

'విష్ణువు' అంటే విశ్వమంతా వ్యాపించి ఉన్నవాడు అని. ఋగ్వేదంలో ఇంద్రుని ఆధీనంలో ఉండే విష్ణువు యజుర్వేదకాలానికి కాస్త స్వతంత్రించాడు. వేదకాలానంతరం ఇంద్రునికే ప్రభువయ్యాడు. విష్ణువుని గొప్పగా చిత్రించడం కోసం ఇంద్రుణ్ణి వెధవను చేశారు. అలా 'విష్ణువే సర్వం', 'విష్ణువే నారాయణుడు', 'విష్ణువే సృష్టికర్త'– అతనే విరాట్ పురుషుడు, అతని నుండే సర్వం పుట్టుకొచ్చింది అనే భావన బలపడి పోయింది.

ఇలా...

ఋగ్వేద ఆర్యుల తెలిసీతెలియక చేసిన 'తప్పుని', తెలిసి తెలిసి ఒప్పుగా ఒప్పించడానికి గట్టి ప్రయత్నం చేశారు యజుర్వేద ఆర్యులు. సృష్టికర్తను విరాట్‌రూపంగా తొలుత భావించినవారు యజుర్వేద ఆర్యులే. కానీ ఈ విరాట్ రూపం విష్ణువే అని యజుర్వేదంలో లేదు. విష్ణువుకి ఈ హోదా కల్పించడానికి ఆ తర్వాత వెయ్యేళ్ళు పట్టింది. ఈ పనిని భగవద్గీత చేసింది. " విష్ణువే విరాట్" అనే సినిమా ఇటీవలదే.

## పేదల లోకం – పెద్దల లోకం

నిజానికి ఋగ్వేద దశమ మండలంలో ఉన్న పురుషసూక్తం, ప్రక్షిప్తం అనేది చాలామంది అభిప్రాయం. ఆ తర్వాత చేర్చారనేది నిర్వివాదాంశం. ఆ సూక్తంలోని భావాలు యజుర్వేద ఆర్యుల భావాలకు చక్కగా సరిపోతాయి–

యజుర్వేదంలో కూడా 'ఈ సృష్టికి ప్రారంభం ఏది?' అనే విషయం మీద ఖచ్చితమైన అభిప్రాయం లేదు. రెండుమూడు రకాలుగా ఉంది. సృష్టిలో 'భూలోకం' ఒక్కటే కాదని, భూమితోపాటు ద్యులోకం, అంతరిక్షం అనే మరో రెండులోకాలు ఉన్నాయనేది వేదరుషుల భావన.

లోకాల పరిమాణాల గురించి కృష్ణ యజుర్వేదంలో ఇలా ఉంది:

> **"........ త్రయః పురోడాశా భవన్తి త్రయ ఇమేలోకా ఏషాం లోకానామాప్త్యా ఉత్తర ఉత్తరో జ్యాయాన్**
>
> **భవత్యేవమివ హీమే లోకాః సమృద్ధ్యై...."**

(కృ.యజు: 2–3–6)

"భూలోకం కంటే అంతరిక్షం పెద్దది. అంతరిక్షం కంటే ద్యులోకం పెద్దది' అని. ఇది అంత గొప్ప ఆవిష్కరణేం కాదు. మనం నేలమీద నుండి చూస్తుంటే ఆకాశం విశాలంగా కన్పిస్తుంది. దీన్ని కోణీయదూరం అంటాం. దూరం పెరిగిన కొద్దీ రెండుకోణాల మధ్యదూరం పెరిగిపోతూ ఉంటుంది. ఇది ఒక ప్రత్యక్ష అనుభవం. ఈ అనుభవంలోంచే

భూలోకం కంటే స్వర్గం (ద్యులోకం) పెద్దదని వేదం చెప్పింది. నిజమే! ఎందుకు నిజమో! ఈ పిట్ట కథ కూడా చూద్దాం...!

అక్బర్ ఒకరోజు బీర్బల్‌ని అడిగాడు– "బీర్బల్! నరకం పెద్దదా? స్వర్గం పెద్దదా?" అని

"స్వర్గమే పెద్దది" అన్నాడు బీర్బల్.
"ఎలా చెప్పగలవు?" అడిగాడు అక్బర్.

"ఈ ప్రపంచంలో ధనికుల కంటే పేదలే ఎక్కువ కాబట్టి" అన్నాడు బీర్బల్. అక్బర్ అవాక్కయి నోరు తెరిచాడు. శ్రమదోపిడి చేసిన మోసగాళ్ళే ధనవంతులవుతారని. వారే పాపులని చెప్పడం ఇక్కడ బీర్బల్ ఉద్దేశం.

పిట్టకథ నుండి అసలు కథకొద్దాం!

బ్రాహ్మణ క్షత్రియుల కంటే శూద్రులే ఎక్కువ కాబట్టి స్వర్గం పెద్దది అనే ఉద్దేశ్యంతో యజుర్వేదం ఈ విషయాన్ని చెప్పలేదు.. అది దేవలోకం కాబట్టి విశాలమైంది అని చెప్పింది. యజుర్వేద ఆర్యులు ఈ సృష్టికర్త భూమితోపాటు, భూమ్మీద జీవరాశితోపాటు, ఈ లోకాల్ని, గ్రహ, నక్షత్రాల్ని, సూర్యచంద్రుల్ని సృష్టించాడని నమ్మారు.

## కలప తో విశ్వకర్మ

మరి, ఒక కర్త ఈ మూడులోకాల్ని సృష్టిస్తే ఆ సృష్టికర్త ఈ మూడులోకాలకి 'వేరు'గా ఉండాలి గదా! అంటే వేరేచోట ఉండి వీటిని సృష్టించాలి గదా! ఈ అనుమానమే యజుర్వేదంలో కన్పిస్తుంది– అంతేకాదు, ఆనాటి నాగరకతలో– రాతి పరికరాల స్థానంలో 'చెక్క' పరికరాలు ఆక్రమించాయి. నైపుణ్యం గల వస్తువుల్ని చెక్కద్వారానే తయారు చేసుకోవచ్చు. గృహాలు, గృహోపకరణాలు, విల్లు లాంటి ఆయుధాలు, రథాలు, రథచక్రాలు అన్నీ చెక్కను ఉపయోగించడం వల్లే వేగవంతం అయ్యాయి. వస్తు ఉత్పత్తికి 'కలప' ప్రధాన వనరుగా నిలిచింది. నాగరికతా వికాసానికి కలప మలి గడపగా నిలిచింది.

కలప లభించే స్థానం అరణ్యం. కాబట్టి ఈ లోకాల్ని ఏ కలపతో నిర్మించాడు అంటూ–

**క్విం స్విద్వనం౨ ఉ స వృక్ష ౨ ఆస యతో ద్వావా ప్రథివీ నిష్టతక్షుః**

**మనీషిణో మనసాపృచ్ఛతేదు తద్యదధ్యతిష్ఠద్ భువనాని ధారయన్ (యజు:17-20)**

అంటే...

*"విశ్వకర్మ భూమినీ, ద్యులోకాన్ని నిర్మించడానికి ఉపయోగపడ్డ అడవి ఏది? ఉపయోగించిన వృక్షం ఏది? ఈ లోకాల్ని సృష్టించిన వాడు (విశ్వకర్మ) ఎక్కడ నిలబడి ఈ కార్యం చేశాడు?"–*

ఈ మంత్రం ఈ విశ్వనిర్మాత 'విశ్వకర్మ' అని చెప్తుంది? అతను ఈ సృష్టిచేసే సమయంలో ఎక్కడ నిలబడ్డాడు? అని కూడా ప్రశ్నిస్తుంది.

విశ్వకర్మను గురించి మరలా ఇలా చెప్తుంది–

**"విశ్వకర్మా హ్యజనిష్ట దేవ౨ అదిద్ గంధర్వో౨ అభవద్ ద్వితీయః**

**తృతీయః పితా జనితౌషధీనామపాం గర్భం వ్యదధాత్పురుత్రా"**

**– (శుక్ల యజు:17-32)**

అంటే...

'ఈ విశ్వంలో మొట్టమొదటిగా విశ్వకర్మ ఆవిర్భవించాడు. ఆ తర్వాత రెండవవారుగా గంధర్వులు మూడోవారిగా ఔషధాల పోషకుడైన పర్జన్యుడు పుట్టాడు. అనేక జలాల్ని ఆ పర్జన్యుడు తన గర్భంలో దాచుకున్నాడు" అని.

దాన్ని బట్టి సృష్టిక్రమం ఇది:

మొదటిగా పుట్టింది: విశ్వకర్మ
ఆ తర్వాత పుట్టింది: గంధర్వులు
ఆ తర్వాత పుట్టింది: పర్జన్యుడు (వరుణుడు)

తొలుత విశ్వకర్మ పుట్టినా, 'జలం' ముఖ్యం అని చెప్తుంది ఈ మంత్రం.

## ఆదిత్యుడే ఆదికర్త

ఇదే విషయాన్ని మరో మంత్రం కూడా చెప్తుంది.

**"ఆపో హ యద్బృహతీర్విశ్వమాయన్ గర్భం దధానా జనయంతీరగ్నిం**

**తతోదేవానం సమవర్తతా సురేకః కస్మై దేవాయ హవిషా విధేమ"**

**–(యజు:27-25)**

"జలమే లోకాలన్నింటినీ తన గర్భంలో దాల్చింది. ఆ గర్భం దాల్చిన జలంలో నుండి ఉష్ణం ఉద్భవించింది. అప్పుడు దేవతలకు (గంధర్వులకు) ఒకే ఒక్క ప్రాణుడైన సూర్యుడు (హిరణ్యరేతుడు) పుట్టాడు. అలాంటి సూర్యునికి హవిస్సులు అర్పించుతాం" అని దీనర్థం.

అంటే..

జలం నుండే అగ్ని పుట్టింది. ఆ అగ్నివల్లే సూర్యుడు ప్రభవించాడు అనేది ఇక్కడి సృష్టి క్రమం.

మరోచోట మరోలా ఉంది–

**"బ్రహ్మజంజ్ఞానం ప్రథమం పురిస్తాద్వి..."**

**(శు.యజు:13–3)**

**"హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతిరేకఽ ఆసీత్**

**స దాధార పృథవీం ద్యాముతేమాం కస్మై దేవాయ హవిషా విధేమ (శు.యజు:13–4)**

పై మంత్రాల్లో బ్రహ్మజంజ్ఞానుడు, హిరణ్యగర్భుడు అంటే ఆదిత్యుడు. సూర్యుడు అని. ఈ మంత్రాలు ఆదిత్యుడు అనే దేవత గురించి చెప్పినవి.

వీటి అర్థం ఇది:

"సూర్యుడే అందరి కంటే ముందు అవతరించాడు. సృష్టిలో అందరికంటే ముందే పుట్టాడు. ఈ సృష్టి జరిగాక జీవజాతులన్నింటికీ అధిపతి అయ్యాడు. భూలోకాన్ని, ద్యులోకాన్ని అతడే ధరించాడు. అలాంటి ఆదిత్యునికి హవిస్సులు అర్పిస్తున్నాము"–

అంటే.. ఇక్కడ సృష్టిలో ప్రథముడు సూర్యుడు అని ఉంది. అలాగే...

**హిరణ్యగర్భః సమవర్తతాఽగ్రే భుతస్య జాతః**

**పతిరేక ఆసీత్ ....** (కృ.యజు: 4–1–8)

**"హిరణ్యగర్భుడైన (ఆదిత్యుడు) ప్రాణిజాలం ఏదీ దేహాన్ని ధరించకముందే, అన్నింటికంటే ముందే– దేహం ధరించాడు. అతను ఒక్కటే తొలుత పుట్టాడు."**

యజుర్వేదం పదమూడో అధ్యాయంలోని 55, 56 మంత్రాలు చూస్తే.. సృష్టిక్రమం ఇలా ఉంది.

**55లో:** తొలుత పుట్టింది విశ్వకర్మ. విశ్వకర్మ నుండి మనస్సు, మనస్సు నుండి గ్రీష్మరుతువు. గ్రీష్మరుతువు నుండి త్రిష్టుప్ ఛందస్సు... ఇలా....పుట్టాయి అని ఉంది.

**56లో:** ఉదయించినప్పటి నుండి ఈ జగత్‌లోని వస్తువులన్నింటినీ కనిపించేట్టు చేసే సూర్యుడే మొదట పుట్టాడు. సూర్యుని నుండి నేత్రం పుట్టింది. నేత్రం నుండి వర్షం, వర్షం నుండి జగతీ చందస్సు.. ఇలా...పుట్టాయి అని ఉంది.

## ప్రథముడు ప్రజాపతే...!

సృష్టిలో భూమ్మీద జీవులన్నీ ఒకేసారి సృష్టించబడలేదని, మనుషులకంటే ముందే కొన్ని జీవుల సృష్టి జరిగిందనే విషయం కృష్ణయజుర్వేదంలో కనిపిస్తుంది. ఇక్కడ సృష్టి ప్రారంభకుడు ప్రజాపతి అని ఉంది.

**"ప్రజాపతిరకామయత ప్రజాః సృజేయేతి స తపోఽ తప్యత**
**స సర్పాన సృజత.. సోఽ కామయత ప్రజాః సృజేయేతి స**
**ద్వితీయమ తప్యత స వయాగ్ స్య సృజత...**
**సోఽ కామయత ప్రజాః సృజయేతి స**
**తృతీయమతప్యత స ఏతం..... స ప్రజా**
**ఏవ తద్యజమానః"** (కృ.యజుం 3–1–1)

అంటే...

"ప్రజాపతి మనుషుల్ని సృష్టించాలని అనుకున్నాడు. తపస్సు చేశాడు. సృష్టికార్యం చేశాడు. సర్పాల్ని సృష్టించాడు. మరలా మనుషుల్ని సృష్టించాలనుకున్నాడు. మరలా తపస్సు చేశాడు. ఈ సారి పక్షుల్ని సృష్టించాడు. మరలా మనుషుల్ని సృష్టించాలను కున్నాడు. మరలా తపస్సు చేశాడు. ఈసారి మనుషుల్ని సృష్టించాడు!'–

ఈ మంత్రంలో పాములు (సరీసృపాలు), పక్షులు, మనుషుల సృష్టి క్రమం పరిణామక్రమాన్ని ఏదో ఒకమూల మిణుకు మిణుకు మంటూ కన్పించేలా చేస్తుంది.

## పురిట్లోనే సంధి

ఈ మిణుకు మిణుకు మనే ఆశకు పురిట్లోనే సంధి కొట్టింది పురుషసూక్తం. ఈ సూక్తంతో గతితప్పిన విజ్ఞానం తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది.

ఋగ్వేదంలో కన్పించే ప్రకృతిశక్తులకూ, దిక్పాలకులకూ, చరమగీతం పాడింది. సృష్టికార్యానికి 'కారణాల్ని' కాకుండా 'కర్త' నే మూలం చేస్తూ ఖాయపరచింది.

ఈ సూక్తం శుక్లయజుర్వేదంలో 31వ అధ్యాయం. దీనికర్త నారాయణ రుషి .అందులోని మొత్తం 22 మంత్రాలూ ఈ కోవకి చెందినవే .

**"సహస్ర శీర్షాః పురుషః సహస్రాక్షః సహస్రపాత్**

**సభూమిం సర్వతః స్పృత్వాత్యతిష్ఠద్దశాంగులం"**

-(శు.యజు:31-1)

''వేల తలలున్నవాడు, వేల కన్నులున్నవాడు, వేలపాదాలవాడు, అతడే ఈ భూమంతా ఆవరించి ఉన్నాడు. అతడు దేనికన్నా అయినా పది అంగుళాలు పెద్దవాడు"-

ఇలాంటి మహాపురుషుని-

**"పాదోஉస్య విశ్వా భూతాని త్రిపాదస్యామృతం దివి"**

(శు.యజు:31-3)

"నాల్గు అంశాలలో (భాగాలలో) ఒక భాగం ఈ సమస్త విశ్వం. మూడు భాగాలూ అమృతమయమైన ద్యులోకం"-

**"పాదోஉస్యేహా భవత్ పునః"** (31-4)

అంటే.. ఆ పాతికభాగవే ఈ విశ్వంలో బీజరూపం. (జీవరూపం).

ఆ మహాపురుషుని నుండి 'విరాట్' పుట్టింది. దాన్నుండి పురుషుడు ఉద్భవించాడు. (ఇలాంటి గ్రంథాల్లో పురుషుడు అంటే పురుషుడు స్త్రీ అనే అర్థంలో చూడకూడదు. ప్రకృతి, పురుషుడు అనే అర్థంలో చూడాలి. కాబట్టి పురుషుడంటే జీవుడు అని)

ఆ జీవులకోసం ఆ మహాపురుషుడు భూమినీ, ఇతర లోకాల్ని సృష్టించాడు. వాటిలో అడవుల్నీ, అడవుల్లో, గ్రామాల్లో బ్రతికే పశువుల్నీ సృష్టించాడు.

**"తస్మాదశ్వా-అజాయంత యేకే చో భాయాదతః**

**గావో హ జంజ్ఞిరే తస్మాత్తస్మాజ్జాతా-అజీవయః** (31-8)

"ఆ మహాపురుషుని నుండే.. అశ్వాలు పుట్టాయి. రెండువైపులా దంతాలుండే పశువులు పుట్టాయి. ఆవులు పుట్టాయి. మేకలు ఉద్భవించాయి".

''.... పురుషం జాగమగ్రతః''- అందుకే ఆ పురుషుడే అందరికంటే ముందు పుట్టినవాడు' అంటుంది ఈ సూక్తం-

అంటే.. మనం ఇంతకు ముందు చెప్పుకున్నట్లు విశ్వకర్మ, సూర్యుడు, జలం మొదట్లో పుట్టలేదు. మొదట పుట్టింది ఈ 'మహాపురుషుడే..' అనేది ఇక్కడ ఖరాఖండిగా చెప్పిన అంశం-

సూర్యుడు, జలం- ఇవేవీ వ్యక్తిరూప అంశాలు కావు. విశ్వకర్మ కూడా ఇలాంటి విరాట్ రూపం తీసుకున్నవాడు కాదు. అయితే, ఈ విశ్వకర్మ భావనే ముదిరి...ముదిరి విరాట్ పురుషుని రూపం తీసుకుంది అనేది సత్యం.

ఇంకా ఈ సూక్తం ఇలా చెప్తుంది.....

సృష్టికి మూలమని చెప్పుకున్న సూర్యుడు కూడా ఈ విరాట్ పురుషునికి నేత్రాల నుండి పుట్టాడు. చెవుల నుండి వాయువు, ప్రాణం పుట్టాయి. ముఖం నుండి అగ్ని, మనస్సు నుండి చంద్రుడు ఉద్భవించాడు. నాభి నుండి అంతరిక్షం, శిరస్సు నుండి ద్యులోకం, పాదాల నుండి భూమి, చెవుల నుండి దిశలు, సమస్తలోకాలూ పుట్టాయి-

ఇదీ ...సృష్టికి సంబంధించిన 'సృష్టికర్త ' వాదం.

విశ్వకర్మా? సూర్యుడా? జలమా? విరాట్ పురుషుడా?- ఎవరు వీరిలో మొదటివారు?- అని తర్జనభర్జనలు, తలపట్టుకోవాల్సిన పని ఈనాడు లేదు-

కానీ, 'ఎవరితోనో ఒకరితో, ఎక్కడో ఒకచోట, ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒకటి కేంద్రంగా సృష్టికార్యం జరిగింది అనే ఆలోచనే ఆర్యులది' అని సరిపెట్టుకోడానికీ లేదు. ఇక్కడ గమనించాల్సిన అతిముఖ్యవిషయం ఒకటుంది.

క్రీ.పూ. 1000-700 సంవత్సరాల మధ్య నాటి యజుర్వేదకాలానికి ఆర్యసామాజిక చిత్రపటం నాలుగు విభాగాలుగా చీలిపోయి, బలపడిపోయింది. ఆ విభాగాలే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు. ఈ చీలికను సామాజిక, శ్రమైక విషయంగా కాకుండా, దీన్ని కూడా విరాట్ పురుషుని సృష్టికార్యంలో భాగంగా చేయడం ఇక్కడ ప్రత్యేకంగా గమనించాల్సిన విషయం.

మనం గతంలో చెప్పుకున్న విశ్వకర్మ, సూర్యుడు లేదా ప్రజాపతులు చేసిన సృష్టికార్యాల్లో మనుషుల్ని కూడా ఇతర లోకాతో పాటు సృష్టించిన కార్యమే ఉంది. మనుషుల్ని సృష్టించాలనుకొని వేరే జీవుల్ని సృష్టించినట్లు కూడా ఉంది. (గ్రాహంబెల్ తన భార్యకు చెవిటి మిషన్ కనిపెట్టాలని ప్రయత్నించి, టెలిఫోన్ కనిపెట్టినట్లు) అవన్నీ ప్రయత్నాలు.

అయితే, ఈ విరాట్ పురుషుని సృష్టి కార్యంలో మనుషుల్ని 'వేరు వేరు వర్ణాలుగా' పుట్టించే కార్యం ఉంది.

ఇక్కడే.. వేదం మతంగా మారింది. మానవీయ వ్యతిరేకమైంది.

**"బ్రాహ్మణోఽస్య ముఖమాసీద్బాహూ రాజన్యః కృతః**

**ఊరూ తదస్యయద్వైశ్యః పద్భ్యాం శూద్రో అజాయత**

- (శు.యజు:31-11)

దీనర్థం ఇది:

"ఆ విరాట్ పురుషుని ముఖం నుండి బ్రాహ్మణులు, భుజాలనుండి క్షత్రియులు, తొడలనుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు ఉద్భవించారు"

వేదం శాసించడం వల్ల సమాజం ఇలా నాల్గు వర్ణాలుగా వేరుపడిపోదు. అంతరాలతో అస్తవ్యస్తంగా ఉన్న సామాజిక విభజనను వేదం దైవకృతంగా మార్చి, వ్యవస్థీకృతం చేసింది. ఈ అమానవీయ పాపభారం వేదం ఎప్పటికైనా మోయాల్సిందే!

ఇలా.. బుడిబుడి నడకల సమయంలోనే సృష్టివాదం యజుర్వేదంలో పూర్తిగా దారితప్పింది. ఎంతగా తప్పిందంటే...అందుకు శుక్లయజుర్వేదంలో 32వ అధ్యాయంలోని 16వ మంత్రమే సాక్ష్యం-

**"ఇదం మే బ్రహ్మ చ క్షత్రం చ ఉభే శ్రియ మశ్నుతాం"**

అంటే.. '(సమాజంలోని) ఈ సంపదనంతా బ్రాహ్మణులు, క్షత్రియులే అనుభవింతురు గాక!'- అని శాసించేదాకా పోయింది.

వేదాలనంతరం 'కర్త' కాస్త వెనక్కిపోయి- 'కారణాలు' ముందుకొచ్చాయి.

పంచభూతాలతో సృష్టి ఏర్పడిందని చెప్పాయి ఉపనిషత్తులు, చార్వాకాది దర్శనాలు. ఐతే, ఉపనిషత్తులు పదార్థవాదం ముసుగులో ఆత్మవాదాన్ని బలంగా బతికించాయి. తమ వాదంతో వేదాలు చెప్పిన వర్ణవ్యవస్థను కులవ్యవస్థగా మార్చాయి.(ఈ విషయాన్ని మనం గత సంచికల్లో చూశాం). ఆత్మవాదంలో వ్యక్తి( దేవుడు) ఉండదు. పరమాత్మ ఉంటుంది.(పరమాత్ముడు కాదు) .

## అరంగుళం ముందుకి ఆరడుగులు వెనక్కి

ఇదే చారిత్రక క్రమంలో చార్వాక దర్శనం దేవుణ్ణి వ్యతిరేకించింది. బౌద్ధం మరింత ముందుకెళ్ళి పరిణామవాదాన్ని , పదార్థవాదాల్ని లేవనెత్తింది. వేదాలు చెప్పిన దేవుణ్ణి, ఉపనిషత్తులు చెప్పిన ఆత్మనీ వ్యతిరేకించింది.ఇలా పదార్థవాదం నిటారుగా నిలబడే సమయానికి.... ఉపనిషత్తుల పదార్థవాదాన్ని (ఆత్మవాదాన్ని) , వేదాల 'వ్యక్తిసృష్టి'వాదాన్ని (విరాట్‌పురుషుణ్ణి)...ఈ రెంటినీ కలగలిపి పరమాత్ముణ్ణి (పరమాత్మ + దేవుడు) సృష్టించింది భగవద్గీత. భారతీయ సృష్టివాదానికి గొడ్డలిపెట్టుగా మారింది. ఈ తెంపరితనం ఎందాక వెళ్ళిందంటే 'ఆ విరాట్ పురుషుణ్ణి నేనే' అని విష్ణువు అవతారంగా చెప్పబడిన కృష్ణుడు అనేదాకా వెళ్లింది.

ఇలా...యజుర్వేద విరాట్ పురుష సృష్టివాదాన్ని తిరిగి భగవద్గీత బ్రతికించి, భారతీయ వైజ్ఞానిక దృక్పథాన్ని పీకల్లోతు బురదలో తొక్కేసింది.తన అజ్ఞాన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. భగవద్గీత కొట్టిన ఒక్క దెబ్బతో వేదాల్లో మినుకు మినుకు మంటూ అరంగుళం ముందుకు పాకిన భౌతికవాదం, ఆరడుగులు వెనక్కు దూకింది.ఇక అక్కడినుండి, అప్పటినుండి కనీసం వీసమంతకూడా ముందుకు దేకలేక పోయింది.


## ఈ పుస్తకాలు చదివారా?

**'స్వేచ్ఛాలోచన' ప్రచురణలు అందిస్తున్న ఈ క్రింది పుస్తకాలు అతికొద్ది కాపీలే వున్నాయి.**

**1. మతం లేని మాన్యులు - బి. సాంబశివరావు వెల : రూ. 80/-**

**2. సైన్సు - దేవుడు - డా. పి.యం.భార్గవ వెల : రూ. 70/-**

పై పుస్తకాలను స్వేచ్ఛాలోచన కార్యాలయానికి మనియార్డరు పంపి తెప్పించుకునే వారికి పోస్టేజ్ ఉచితం. 'హ్యూమనిస్ట్ బుక్‌క్లబ్'లో సభ్యులయినవారికి 50% తగ్గింపు లభిస్తాయి.

**1. మతకౌగిలి - నెమలి చంద్రశేఖర్ వెల : రూ. 60/-**

**2. చెర్నాకోల - ఇసనాక మురళీధర్ వెల : రూ. 100/-**

పై రెండింటిని స్వేచ్ఛాలోచన కార్యాలయానికి "మనియార్డర్"పంపి తెప్పించుకోవచ్చు. 40% తగ్గింపు ధర వుంటుంది. రెండింటిని ఒకేసారి తెప్పించుకునే వారికి (రూ. 100/- పంపిన వారికి) హేతువాద రచయిత **తుమ్మాభాస్కర్ రచన "మానవవాది మల్లాది రామమూర్తి"** ఉచితంగా పంపబడుతుంది. **వివరాలకు : మేనేజర్, స్వేచ్ఛాలోచన, ఫోన్ : 9490419044**

# వేదంలో ప్రసవ వేదనలు

**అయం పంథా అనువిత్తః పురాణో యతోదేవా ఉదజాయంత విశ్వే**
**అతశ్చిదా జనిషీష్ట ప్రవృద్ధో మా మాతరమముయా పత్తవే కః**

తల్లి యోని నుండి బైటకు వచ్చేమార్గం పురాతనమైంది. ఈ మార్గం నుండే మానవులు, సమస్త దేవతలు పుట్టుకొచ్చారు. నీవుకూడ తల్లిగర్భంలో పెరిగి ఈ మార్గం ద్వారానే నేలమీదకు వచ్చిపడు! తల్లి చావుకి కారణం కాబోకు!

**(ఋగ్వేదం: 6-18-1)**

## మర్మస్థానం - జన్మస్థానం

మానవశరీరం గొప్ప సంక్లిష్టమైన మహాయంత్రం. ఈ యంత్రంలో ప్రతి అవయవం ఎన్నోపనులు చేస్తుంది. నాలుక పని కేవలం రుచిచూడడమే కాదు మాట్లాడడానికి, మెత్తగా నూరడం కోసం ఆహారాన్ని దంతాల మధ్యకు నెట్టడానికి, నీరు తాగడానికి, ఎక్కిరించడం లాంటి భావసంకేతాలకీ, ఈలవేసే సంగీత పరికరంగా, శరీర సమతాస్థితిని కాపాడే అవయవంగా... ఇలా చాలారకాల పనులు నాలుక చేస్తుంది. దాదాపుగా ప్రతి అవయవం ఇలాంటిదే..!



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

అయితే..

పుట్టుకకు కారణమైన అవయవం యోని. అది కేవలం మూత్రవిసర్జన అవయవమే కాదు.. కామకేంద్రం కూడా. కేవలం కామకేంద్రమే కాదు.. పుట్టుకను ప్రసాదించే మార్గం కూడా..! అందుకే మర్మాంగాలలో పురుషాంగానికి లేని ప్రాధాన్యత స్త్రీ గుహ్యాంగానికి ఉంది. 'అమ్మ'తనానికి అది మూలమైంది.

మర్మస్థానం కాదది...నీ జన్మస్థానం

ఎందరెందరో మహనీయులు నడిసొచ్చిన పుణ్యక్షేత్రం.... అన్నాడు వేటూరు సుందరరామ్మూర్తి.

మనిషి కేవలం తన పుట్టుకనే కాదు తనచుట్టూ ఉన్న సమస్త జీవకోటి పుట్టుకనూ చూస్తున్నాడు. పాలిచ్చే జంతువులకు తప్ప ఇతర జీవులకి మూత్రద్వారం లేకపోవడం గమనించాడు. పక్షులు, పాకే జంతువులు మలద్వారం ద్వారానే గుడ్లు పెడతాయి. మలద్వారం ద్వారానే మూత్ర విసర్జన చేస్తాయి. దాన్నే సంభోగానికీ వాడుకుంటాయి.

కేవలం కడుపులో బిడ్డల్ని పెంచి ప్రసవించే జంతువులకే మూత్రద్వారం ఉంటుంది. అది జీవుల జన్మక్షేత్రంగా, కామకేంద్రంగా ఉపయోగపడుతుంది.

## పుట్టుక ఒక పజిల్

ఈ విషయాలు మానవులకి పరిశీలన ద్వారా తెలిసే విషయాలే! ఈ విషయం వల్ల మానవునికి కలిగిన మొట్టమొదటి పజిల్- అతని పుట్టుకే-

తాను తల్లిగర్భంలోకి ఎప్పుడు? ఎలా? ఏ రూపంలో? ప్రవేశించాడు. ఆ గర్భంలోని పిండం గాలీ, వెలుతురు, ఆహారం లేకుండా మాయమూటలో ఎలా జీవిస్తుంది?- బైటకు రాగానే మొదటిసారి గాలిపీల్చి, కెవ్వున ఎందుకు ఏడుస్తుంది?- ఇదిగో... ఇలాంటివన్నీ చిక్కువీడని పజిల్స్. తన పుట్టుక పజిల్ చిక్కుముడిని విప్పే భాగంలో మానవసమాజాలు రకరకాల ఊహాగానాలు చేశాయి. వాటిల్లో కొన్ని సరైనవి ఉన్నాయి. కొన్ని కేవలం ఊహలుగానే మిగిలిపోయాయి. కొన్ని మానవాతీత విషయాలతో ముడిపెట్టుకున్నాయి.

ఈ మూడురకాల కలగాపులగం అంతా వేదంలో కన్పిస్తుంది.

గర్భం ఎలా ఏర్పడుతుంది? తల్లి ఎలా ప్రసవిస్తుంది? ప్రసవించే సమయాల్లో కొందరు తల్లులు ప్రాణాలు పోగొట్టుకుంటారు ఎందుకు?- ఇలాంటివన్నీ ప్రశ్నలే? వీటి సమాధానాలకోసం వెదుకులాడే సమాజాల ఆలోచనలు ఎలా ఉంటాయో వేదంలో కన్పిస్తుంది.

పశుపాలకులైన ఆర్యులకి ఆవుల, గొర్రెల ప్రసవాలను చూడ్డం నిత్యకృత్యం. చూడి ఆవుల్ని యజ్ఞాల్లో బలివ్వడం కూడా ఎక్కువగా చూసే విషయమే.

10 నెలలు నిండిన చూడి ఆవుని యజ్ఞంలో బలివ్వాలి

అని, దాని గర్భసంచిని వేరుచేసి మాయమూటలో ఉన్న దూడను యజ్ఞజ్వాలల్లో కాల్చాలనే విషయం యజుర్వేదంలో ఉంది.

ఆవులు ఈనలేనప్పుడు (ప్రసవించలేనప్పుడు) దాని గర్భాన్ని కోసి దూడల్ని తీసేవిధానం వారికి బాగా తెలిసిన అంశమే! అనుభవమే! బహుశా తమ స్త్రీలు ప్రసవించలేక, ప్రాణంమీదికి వచ్చే సమయంలో, తల్లిపొట్టను కోసి, బిడ్డను బైటకు తీసేవిధానం ఆర్యుల్లో ఉందో లేదో ఖచ్చితంగా తేల్చలేం కానీ... ఆ ఛాయలు చాలా అస్పష్టంగా ఋగ్వేదంలో ఒక చోట కన్పిస్తాయి.

తల్లి అదితి. ఈమె గర్భంలో ఉన్న వాడు వామదేవుడు. ఆ వామదేవునికి, ఇంద్రునికీ జరిగిన సంభాషణ ఇది:

మనం ఈ వ్యాసాన్ని ప్రారంభిస్తూ చెప్పిన మొదటి రుక్కు మరోసారి చూడండి...

ఇంద్రుడు వామదేవునితో... " యోనిమార్గం ద్వారానే జన్మించు... సుఖంగా జన్మించు. తల్లిని చంపకు.." అంటాడు.

దీనికి నేమాని వేంకట నరసింహశాస్త్రిగారి పద్యరూప అనువాదం చూడండి-

**"ఈ పథము బహుపురాతనము, ఎల్లసురలు**
**పుట్టగల్గిరి, యీ మార్గముననె నీవు**
**కడు ప్రవృద్ధడవైతిగాన, మాతృ**
**పతన కారకుడవు కాక పడుము, నేల!"**

అప్పుడు వామదేవుడు ఇలా అన్నాడు-

**"నాహమతో నిరయా దుర్గహైతత్ తిరశ్చతాపార్శ్వాన్నిర్గమాణి"**

**(ఋగ్వేదం:4-18-2)**

"ఈ యోనిమార్గం ద్వారా నేను బైటకు రాను. ఇది ఎంతో ఇరుకైనది. నేను పొట్టప్రక్కభాగాన్ని ఛేదించుకుని బైటకువస్తాను" అంటాడు.

అప్పుడు ఇంద్రుడు..

**"పరాయతీం మాతర మన్వచష్ట ననాను గాన్యను నూ గమాని..."**

**(ఋగ్వేదం:4-18-3)**

"అలా అయితే, తల్లి మరణిస్తుంది. ఇలా అయితే పురాతనమార్గం చెదరదు. ఈ దారిలోనే బైటకురా. త్వరగా..." అంటాడు.

పొట్టను చీల్చుకువస్తే తల్లి మరణిస్తుందనే విషయం ఇక్కడ ఉంది కాబట్టి, పొట్టకోసి బిడ్డను తీసే సురక్షిత వైద్యవిధానం అప్పటికి లేదనే విషయం అర్థమవుతోంది.

కానీ...

అంతకు పూర్వం.. క్రీ.పూ. 3వేల సంవత్సరాలకు ముందే ఈజిప్టులో శస్త్రచికిత్సలు చేసే విధానం ఉంది. ఇందుకు ప్రత్యేకంగా స్త్రీ వైద్యులు కూడా ఉన్నారు. ఈజిప్షియన్ల శస్త్రచికిత్స విధానాన్ని ఆ తర్వాతి వారైన సింధూనాగరిక సమాజానికి తెలుసో, తెలియదో మనకు తెలియదు. అయితే, ఆ విధానాన్ని ఆర్యులు మాత్రం అందిపుచ్చుకోలేదు. వేదకాలానంతరం, బుద్ధునికాలంలో ఉన్న జీవకునితోనే శస్త్రచికిత్సలు ఇక్కడికి వచ్చాయి. ఆ తర్వాత మరో బౌద్ధవైద్యుడు సుశ్రుతుడు ఆ విధానాల్ని మరింత మెరుగు పరచాడు.

## ఆ కదిలే సముద్ర గర్భం

ఆత్రేయ సప్తవధ్రి రుషి ప్రోక్తమైన ఋగ్వేదం 5వ మండలం 78వ సూక్తంలో ఉన్నవి మొత్తం ప్రసవానికి సంబంధించిన రుక్కులే- ఇందులో ప్రసవ సమయాన వాడే మందులపెట్టె గురించిన విషయం ఉంది. ఆ పెట్టె అశ్వనులది.

**"వి జిహీష్వ వనస్పతే యోనిః సూష్యన్త్యా ఇవ"-**

**(ఋగ్వేదం:5-78-5)**

దీనర్థం "ఓ.. మందులపెట్టా! నేను సప్తవధ్రి రుషిని. మీరు ప్రసవించుచున్న స్త్రీయోనిలాగా విచ్చుకొనండి'-అని.

సప్తవధ్రి రుషికి సంతానం లేదు. భార్యతో సంయోగం సరిగా కలగలేదు. ఆయన వైద్యులైన అశ్వినుల్ని ప్రార్థించాడు. వారు ఆయన సమస్య తీర్చారు. దానివలన అతని భార్య గర్భందాల్చి, ప్రసవించింది- ఆ విషయం ఇలా...

**"యధావాతాః పుష్కరిణీం సమింగయతి సర్వతః**
**ఏవా తే గర్భ ఏ జతు నిరైతు దశమాస్యః"**

**(ఋగ్వేదం: 5-78-7)**

"గాలి తాకిడికి సరస్సులో నీరు కదలినట్లు గర్భం చలించాలి. పదినెలల తర్వాత జీవుడు బైటకు రావాలి"

**"యధావాతో యధావనం యధాసముద్ర ఏజతి**
**ఏవా త్వం దశమాస్య సహావేహి జరాయణా!**

**(ఋగ్వేదం: 5-78-5)**

"ఎలా గాలీ, అడవీ, సముద్రం కంపిస్తాయో అలా కంపిస్తూ పదినెలలు నిండిన జీవి బైటపడుతుంది."

**'దశమాసాఞ్ఛశ యానః కుమారో అధి మాతరి**
**నిరై తు జీవో అక్షతో జీవో జీవన్త్యా అధి'**

**(ఋగ్వేదం: 5-78-9)**

"పదినెలలు తల్లిగర్భంలో సురక్షితంగా ఉన్న బిడ్డ సజీవంగా, అక్షతంగా జనించవలె"

ప్రసవంతో పాటు గర్భంలో శిశువు పెరిగేకాలం పదినెలలుగా గుర్తించినట్లు పై రుక్కులవల్ల తెలుస్తుంది.

మనం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం, గర్భం దాల్చడానికి కావలసిన పరిస్థితుల గురించిన వివరాలు ఋగ్వేదంలో లేవు. పురుషుల వీర్యం, స్త్రీ అండం, స్త్రీ రుతుమతి (రజస్వల) కావడం, మైధునం- ఇలాంటి విషయాల గురించిన వివరణలు యజుర్వేదంలో కనిపిస్తాయి.

పుట్టుకను, పుట్టే విధానాన్ని తెలుసుకోవడం ఏమంత పరిశోధన కాదు. నిత్యజీవిత పరిశీలన ద్వారా సాధ్యమే! కానీ పుట్టుకకు కారణమైన మైధున విధాన ప్రక్రియ గురించి ఆలోచించడం దానికంటే కాస్తలోతైన పరిశీలన. అందుకే ఋగ్వేదం కంటే ఆ పరిశీలనలు యజుర్వేదంలో కన్పిస్తాయి.

## త్వష్ట - గంధబ్బం

మనం ఈ వ్యాసం మొదట్లో చెప్పుకున్నట్లు పురుషుల శిశ్నం మూత్రవిసర్జనకు, వీర్య విసర్జనకు రెండురకాలుగా ఉపయోగపడుతుంది. ఆ రెండు వ్యవస్థలు ఒకే అంగం ద్వారా క్రియారూపం దాల్చినా వేరు వేరు అనే విషయం మనకు తెలుసు. లింగం ద్వారా వెలువడే మూత్రానికి సంతానం కలగదు కదా! ఇదే విషయాన్ని యజుర్వేదం చెప్తుంది.

కేవలం లింగం ద్వారా విడుదలైన వీర్యం వల్ల మాత్రమే సంతానం కలుగుతుంది అని ప్రకటించింది యజుర్వేదం.

స్త్రీయోనిలో స్రవించిన వీర్యంవల్లే సంతానం కలుగుతుంది. ఈ క్రియ జరిగినా అప్పుడప్పుడు సంతానం కలగకపోవచ్చు- ఈ విషయం ఇలా ఉంది.

**త్వష్టా రూపాణి వికరోతి తావచ్ఛే వైతత్ ప్రజాయత**
**ఏషవై దైవ్యస్ త్వష్టా యో యజతే బహ్వీభిరూప తిష్టతే**
**రేతస ఏవ సిక్తస్య బహుశో రూపాణి వికరోతి స స్త్రైవ**
**జాయతే శ్వశ్వో భూయాన్భవతి...."**

**(కృ.యజు: 1-5-9)**

"సాయంత్రం చేసే హెూమం వీర్యం (రేతస్సు) ఉంచడంతో సమానం. తెల్లవారు ఝామున చేసే హెూమం సంతానోత్పత్తి లాంటిది. యోనిలోకి వీర్యం చేరుతుంది. కానీ, త్వష్ట ఆ వీర్యాన్నంతా సంతానంగా పుట్టించడం లేదు. ఏ వీర్యాన్ని ఏ రూపంగా సృష్టించాలో త్వష్ట నిర్ణయిస్తాడు. సంతానాన్ని కలిగిస్తాడు."-

దీనివల్ల మనకి సంభోగం కలిగినంతనే సంతానం అన్నివేళలా కలగదనేది అర్థమవుతుంది. వీర్యం అంతా సంతానంగా మారితే పిల్లలు లేనివారు ఎవరుంటారు? ఎందుకుంటారు?

అయితే, ఇక్కడ రెండు విషయాలు ఉన్నాయి-

ఒకటి: వేదంలో వీర్యాన్ని 'జీవిగా' మార్చే త్వష్ట ఉన్నట్లే.. బౌద్ధుల పునర్భవ ప్రక్రియలో 'గంధబ్బం' (గంధర్వం) ఉంటుంది. స్త్రీ అండం, పురుషవీర్యం కలిసి ప్రాణిగా రూపం తీసుకోవాలంటే 'గంధబ్బం'' ఉండాలంటారు బౌద్ధులు. గంధబ్బం లేకపోతే శుక్రశోణితాలు పిండంగా మారవు అంటారు.

రెండు: కృష్ణయజుర్వేదంలోని పైమంత్రంలోని విషయం వల్ల తెలిసే విషయం ఏమంటే... 'సంతానం కలగడం, కలగకపోవడం అనేది వీర్యం వలనే. ప్రాణిగా మారేది వీర్యమే. ఇందులో స్త్రీ అండకణాలకి సంబంధం లేదు. బహుశా వారికి విషయం తెలియకపోవచ్చు. కేవలం జీవరూపం పొందిన పురుష వీర్యాన్ని మోసి, పెంచి, కనేందుకే స్త్రీ యోని అనేది వారి భావన. సంతానానికి పూర్తి కారణం వీర్యమే!

బౌద్ధులు 'గంధబ్బం' విషయం చెప్పినా, సంతానానికి స్త్రీ అండం, పురుషవీర్యం రెండూ కారణం అని చెప్పారు. యజుర్వేద కాలానికి సంతానోత్పత్తి ప్రక్రియకు మూలం పురుషుడే! వీర్యమే!

**ఖచ్చితంగా ఇక్కడే వైదిక సాహిత్యంలో పురుషాధిక్యతకు బీజం పడింది. పురుషుని వీర్యమే సంతానానికి కారణమని వారు పొరపాటు నిర్ధారణకు వచ్చారు. స్త్రీ కేవలం ఆ బీజాన్ని పెంచిపోషించే క్షేత్రమని అపోహ పడ్డారు.**

వారు చూసిన వ్యవసాయంలో విత్తనం ప్రధానమయి, నేల తోడ్పాటును మాత్రమే అందించేదిగా ఉండటాన్ని అలా బేరీజు వేసుకున్నారు. తద్వారా క్షేత్రం ప్రధానమా? బీజం ప్రధానమా? వంటి చర్చలు వచ్చినపుడు బీజమే ప్రధానమనే విషయాన్ని వైదికసాహిత్యం బలంగా చాటింది. దాంతో వంశావళి, అధికారాలు వంటివన్ని విషయాల్లో స్త్రీ పురుషునికంటే హీనమైంది. ఈ పునాదులపైనే మనుధర్మశాస్త్రం, గౌతమధర్మశాస్త్రాలలో బీజం ప్రధానం కాబట్టి పురుషునికే ఆధిక్యత ఇవ్వబడింది. ఛాందోగ్యోపనిషత్తులో దాసి జబాలకు పుట్టిన వానికి బీజాన్ని బట్టి బ్రాహ్మణుడని ధ్రువీకరించింది. ఆ ధర్మప్రచారంకోసం పుట్టిన పురాణాలన్నీ వాటినే ఆధారం చేసుకొన్నాయి.

'అండం' విషయం వేదకాల ఆర్యులు చెప్పకపోయినా అందులో ఒక నిజం దాగుంది–

నిజానికి.. సంతానలేమికి 99% స్త్రీ బాధ్యురాలు కాదు. పురుషుడే బాధ్యుడు. అలాగే ఆడపిల్ల, మగపిల్లల పుట్టుకకూ వీర్యకణాలే కారణం. వంధ్యత్వంగల పురుషులే అధికం. వంధ్యత్వం గల స్త్రీలు చాలా చాలా అరుదు.

## డా. సమరం గారి ప్రశ్న

గర్భం దాల్చిన స్త్రీతో సంపర్కం చేయవచ్చా? చేయకూడదా?– అనేది డా॥ సమరంగార్ని అడిగే ప్రశ్న. ఈ ప్రశ్న ఆనాడు ఆర్యులకు వచ్చింది–

ఎందుకంటే...

వారు పశుపాలకులు.. పశువులకు రజస్వలత్వం లేదు. 'పశువులు పెద్దమనిషి' కావు. 'పెద్దమనిషి' అనే పదంలోనే ఉంది. అది 'మనుషులకు' మాత్రమే సంబంధించింది అని.

మనిషికి 'టీనేజ్' వచ్చిందగ్గర నుండి, కామకోర్కెలు ఉంటాయి. వయసు వచ్చాక మగవారికీ, ఆడవారికీ 'సెక్స్ సీజన్' అనేది లేదు. కానీ జంతువులకు 'సీజన్'లు ఉంటాయి. 6 నెలలకో, 3 నెలలకో, సంవత్సరానికో, రెండేళ్ళకో ఒక్కసారి మాత్రమే ఆడ జంతువులకు అండాలు విడుదలవుతాయి. అప్పుడు మాత్రమే అవి 'ఎద'కొస్తాయి. సంపర్కం కోరుకుంటాయి. మగజంతువుల్లో కూడా నిరంతరం సెక్స్‌కోర్కెలు ఉండవు. కొన్ని కొన్ని సీజన్లలోనే వాటికి ఆ కోర్కెలు రేగుతాయి. ఉదాహరణకి కుక్కలకి చిత్తకార్తె సీజన్–

ఈ సీజనల్ కామోద్రేకాల గురించి ఒక విషయం ఇలా ఉంది.

**త్వం తురీయా వశినీ వశ్యాసి సకృద్యత్వా మనసా**
**గర్భ ఆ–శయత్! వశా త్వం వశినీ గచ్ఛ**
**దేవాన్థ్సత్యాః సన్తుయజమానస్య కామాః**

**(కృ.యజు: 3–4–2)**

ఓ పశువా! ఒకసారి నీకు పురుషవాంఛ కలిగింది. అంతట నీవు గర్భం దాల్చావు. ఇక, ఆ తరువాత నీవు 'ఇంద్రియ నిగ్రహవి' అయ్యావు!" అని.

ఎంతబాగుంది! ఇంద్రియ నిగ్రహంకోసం తపస్సు చేసే తాపసుల కంటే.. పశువులే సహజ ఇంద్రియ నిగ్రహులన్నమాట! కాముకుల్ని 'పశువులతో' పోలుస్తాం! ఎంత తప్పు! దేరాబాబాలకంటే...దున్నపోతులే జితేంద్రియాలన్న మాట. ఇంద్రునికంటే...పశువులకే ఇంద్రియనిగ్రహం మెండన్నమాట!!

మరి ఈ రుతు సీజన్లు అనేవి మనుషులకు వర్తించవు. ఎందుకు?

దీనికి కారణం 'అండోత్పత్తి' అని మనకు ఈనాడు తెలుసు.. స్త్రీల అండోత్పత్తి గురించి అవగాహనలేని ఆర్యులకు ఈ నిరంతర కామసంపర్కాల కోర్కె ఎందుకు కలుగుతుంది? గర్భం దాల్చినపశువుకి ఆ కోర్కెలుండవు. పొదిగే పక్షికీ వుండవు.

కానీ.. గర్భం దాల్చిన స్త్రీలకు ఎందుకుంటాయి?

దానికి ఆర్యులు అల్లిన అందమైన కథచూడండి–

## ఇంద్రుని పాపం ఇంతుల పాలు

త్వష్ట కొడుకు విశ్వరూపుడు. దేవతల పురోహితుడు. అతనికి మూడు తలలు. ఒక తలతో సోమం తాగాడు. రెండో తలతో కల్లు తాగాడు. మూడో తలతో అన్నం తిన్నాడు. అతను అసురులకు మేనల్లుడు. ఇంద్రుడు అతణ్ణి చంపాడు. బ్రహ్మహత్యాపాతకం పట్టుకుంది.

ఇంద్రుడు భూమి దగ్గరకు పోయి తనపాపంలో మూడోవంతు తీసుకోమని కోరాడు. భూమి అంగీకరించింది. ఆ భాగమే "ఎడారి" అయ్యింది. ఆ తర్వాత చెట్ల దగ్గరకు వెళ్ళాడు. మరోభాగం తీసుకోమని అడిగాడు. చెట్లు అంగీకరించాయి. ఆ పాపమే చెట్లలో గడ్డకట్టే జిగుర్లు అయ్యాయి. తర్వాత స్త్రీల దగ్గరకు వెళ్ళి ఇంకోభాగం తీసుకోమని కోరాడు. వారు–

"మేము వీర్యం వల్ల సంతానం పొందుతున్నాం. గర్భం దాల్చింది మొదలు, ప్రసవించే వరకూ పురుషునితో సంభోగం చెందే వరం ఇవ్వు" అని అడిగారు. ఇంద్రుడు సరే అన్నాడు. వారు స్వీకరించిన ఆ మూడోభాగపు ఫలమే స్త్రీలకు రజస్వల–

'రజస్వల (నెలసరి) అయిన సమయంలో స్త్రీలతో కలవకూడదు. మాట్లాడకూడదు. అంటుకోకూడదు. కలిసి భోజనం చేయకూడదు. స్నానం చేయకూడదు' అని నిబంధనలు పెట్టింది వేదం.

కానీ.. ఒకవేళ ఆ సమయంలో సంభోగం చెందితే... ? ఏమవుతుంది?

వారికి ఎలాంటి సంతానం కలుగుతుందో కృష్ణయజుర్వేదం రెండవకాండ, అయిదో ప్రపాఠం, మొదటి అనువాకంలో ఉంది. ఇందులో ఆరోమంత్రంలో 14 రకాల 'హీనపురుషులు' పుడతారని ఉంది. వీరిలో దొంగ, లజ్జగలవాడు, అకాల మరణం పొందేవాడు, కుష్ఠురోగి, వెంట్రుకలు లేనివాడు, గుడ్డివాడు, పిచ్చిగోళ్ళు కలవాడు,

పాచిపళ్ళవాడు, నపుంసకుడు, పిచ్చివాడు, మరగుజ్జు- ఇలాంటివారు పుడతారని ఉంది.

నిజం ఏమిటంటే..

స్త్రీలు రజస్వల సమయంలో సంభోగంలో పాల్గొంటే గర్భం ధరించరు. రెండు నెలసరి తేదీల మధ్యన ఉండే తేదీల్లో రెండు రోజులు అటూ ఇటూగా ఉండే తేదీల్లో సంభోగం చెందితేనే గర్భం దాలుస్తారు-

పైన చెప్పిన 14 రకాలవాళ్ళు పుట్టడానికీ సంభోగానికీ సంబంధం లేదు-

కానీ, రజస్వలకీ సంతానానికీ ఏదో కారణం ఉందని గ్రహించడం ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం.

### అబ్బాయా ? అమ్మాయా?

అయితే, గర్భాశయానికి చేరిన వీర్యం స్త్రీ, పురుషులుగా ఎలా మారుతుంది? అనే విషయాన్ని కృష్ణయజుర్వేదం ఇలా చెప్తుంది.

**న విష్వఙ్చం వియుయాద్యద్విష్వఙ్చం వియుయాధ్ర్య జాయేతోర్ధ్వ ముద్యౌత్యూర్ధ్వమివ పుగ్ంసః పుమాసేవాస్య జాయతే... (కృ.యజు: 2-6-5)**

"అధ్వర్యుడు (యాగంలో) దర్భల కట్టను విప్పి, చిందర వందరగా అగ్నిలో ఆహుతి చేస్తే, స్త్రీ సంతానం కలుగు తుంది. దర్భల్ని కట్టగా కట్టి ఆహుతి చేస్తే పురుష సంతానం కలుగుతుంది"- అని ఉంది. ఇది కేవలం ఒక నమ్మకం. కనీసం కారణం కూడా కన్పించని నమ్మకం. ఐతే, చిందర వందరగా వేసిన దర్భలు చంచలత్వం గల స్త్రీలకూ (స్త్రీలు చంచలస్వభావాలనేది వైదిక సంస్కృతి), కట్టకట్టిన దర్భలు పురుష 'లింగానికి' ప్రతీకలుగా కొందరు చెప్పుకుంటారు అంతే..

ఐతే.. ఇదే విషయం బౌద్ధంలో మరోలా ఉంది. బౌద్ధంలో 'గంధబ్బం' వల్ల ఏర్పడ్డ పిండానికి తొలిగా పురుషస్పర్శ కావాలనే కోరిక పుడితే స్త్రీగా, స్త్రీ స్పర్శ కావాలనే కోరిక పుడితే పురుషునిగా రూపొందుతుందని ఉంది.

వేదం కంటే బౌద్ధం ఈ విషయంలో కాస్తమెరుగే గానీ, అదీ నిజంకాదు.

నిజానికి వీర్యకణంలోని ఎక్స్, వై క్రోమోసోములే ఇందుకు కారణం అని నేడు మనకు తెలుసు.

సంతానోత్పత్తిని జననవ్యాపారం అంటాం. ఇది సంరోహ, నిరోహాల వల్ల జరుగుతుంది. సంరోహం అంటే మైధునం. వీర్య అండాల కలయిక. విరోహం అంటే రతిక్రీడ. విరోహానికి దేహం కారణం. సంరోహానికి వీర్యం కారణం. జననక్రియలో తొలి అంశాన్ని ఇలా విశ్లేషణత్మకంగా చెప్పడం మనం కృష్ణయజుర్వేదం 3-5-2లో చూస్తాం.

### సింహం జూలు - శిరోజాలు

ఇక... తల్లి గర్భంలో పిండం శిశువుగా మారే క్రమంలో ఏర్పడే శరీర అవయవాల గురించిన సమాచారం శుక్లయజుర్వేదంలో ఉంది- 19వ అధ్యాయంలో 76వ మంత్రం నుండి 95వ మంత్రం వరకూ ఈ సమాచారం ఉంది.

**"రేతో మూత్రం విజహాతి యోనిం ప్రవిశదింద్రియం గర్భో జరాయుణావృతఉల్వంజహాతి జన్మనాఋతేన సత్యమింద్రియం విపానం శుక్రమన్ధస్క ఇంద్రిస్యేంద్రియమిదం పయోఽమృతం మధు (శు.యజు: 19-76)**

"పురుషాంగము యోనిలో వీర్యాన్ని వదులును. అది మూత్రాన్ని కూడా వదులును. ఈ రెండూ వేరు వేరు. వీర్యం గర్భంలో పడినప్పుడు దాన్ని మాయకప్పి ఉంచును. (జరాయువు) వీర్యంలోనే జీవి శరీరాంగాలు దాగి ఉండును. కాబట్టి వీర్యాన్ని బట్టే శరీరాంగాలుఉత్పన్నమవుతాయి-ఇదే నిజం!"

ఈ విషయంలో ఇంద్రుని శరీర నిర్మాణాన్ని గురించి చెప్తూ- అశ్వనులు ఇద్దరూ, సరస్వతి కలిసి ఈ శరీర నిర్మాణం ఎలా చేశారో వివరిస్తుంది ఈ సూక్తం:

- ధాన్యం మొలకలతో వెంట్రుకలు, యవమొలకలతో చర్మం, ఉడికించిన అన్నంతో మాంసం (19-81)
- గరిక పొడిని, కర్రకు కట్టి ఎముకలు, ఆవుతిత్తిలో తేనెను నింపి మూలుగును (19-82)
- చిలికిన సురారసముతో రక్తాన్ని (19-83)
- పాలతో తెల్లని వీర్యం (పయసా శుక్రమమృతం), సురతో మూత్రాన్ని (19-84)
- హృదయంతో గుండెను, పురోడాశంతో క్లోమాన్ని, కాలేయాన్ని, యాగపాత్రతో పిత్తాన్ని (19-85)
- మధువు చిలికే స్థాళులతో ఆంత్రాన్ని, పాలుపితుకు పాత్రతో గుదాన్ని, పక్షిరెక్కతో ప్లీహాన్ని, ఆసంది నుండి నాభిని, ఉదరాన్ని (19-86)
- సురాభాండంతో గర్భాన్ని, చిల్లు కల్లుకుండతో శిశ్నాన్ని (19-87)
- సతము అనే పాత్రతో ముఖాన్ని, తలనూ, నాలుకనూ (19-88)

- అశ్వి అనే పాత్రలతో నేత్రాల్ని, మేకపోతుతో నేత్ర తేజాన్ని, గోధుమలతో కంటిపాపను, రేగుపళ్ళతో స్వరపేటికను, కోకిలతో కంటిలోని నల్లగుడ్డు, తెల్లగుడ్డును (19-89)
- మేకతో ముక్కును, కుశగడ్డితో ముక్కులో వెంట్రుకల్ని, యవమొలకలతో ఊపిరిని (19-90)
- ఇంద్రగ్రహంతో చెవుల్ని, కుశలగడ్డితో కనుబొమ్మలు, ఎద్దుతో బలాన్ని (19-91)
- తోడేలు రోమాలతో గుహ్యాంగాలమీద వెంట్రుకల్ని, పులి వెంట్రుకలతో గడ్డంమీసాల్ని, సింహం జూలుతో శిరోజాల్ని (19-92)
- చంద్రుని తేజస్సుతో మనస్సునిరూపొందించారు (19-93)

చివరికి...

- అశ్వనులు నూరేళ్ళ ఆయుష్షుని, సరస్వతి ఆత్మను చేర్చారు (19-94)-

సరస్వతి, అశ్వినులకు భార్యగా మారి, ఇలా నిర్మించిన ఇంద్రుణ్ణి గర్భంలో ధరించింది-

ఇలా... శరీర అంగాలూ, వాటి రూపురేఖలు, పనితీరుని బట్టి భౌతిక అంశాల్ని పోల్చుకుని పిండానికి ఎలా అవయవాలు కలుగుతున్నాయో ఒక ఊహామాత్ర ప్రయత్నం ఇక్కడ కన్పిస్తుంది.

మనిషి ఆయుఃప్రమాణం నూరేళ్ళని వేదంలో అనేకచోట్ల ఉంది: ఈ నూరేళ్ళ ప్రమాణం ఎలా అంటే...

**ఇన్ద్రానాస్వా శతగ్ం హిమాః ఇత్యాహ శతాయుః**
**పురుషశ్శతేంద్రియ ఆయుష్యేవేంద్రియే ప్రతి తిష్ఠత్యేషా...**
(కృ.యజు:1-5-7)

"మనిషికి జ్ఞానేంద్రియాలు (కన్ను, చెవి, ముక్కు, నాలుక, చర్మం) ఇవి 5, కర్మేంద్రియాలు (కాలు, చేయి, నోరు, గుదము, శిశ్నం లేదా యోని) ఇవి ఐదు. ఈ మొత్తం 10. ఒక్కొక్క దానికి 10 నాడులు చొప్పున మొత్తం పది ఇంద్రియాలకు (10 x 10) 100 నాడులు. కాబట్టి మనిషి జీవితకాలం వందేళ్ళు-

ఇలా... వీర్యం, గర్భం, పిండం, శిశువుకి అవయవాలు, ప్రసవం- ఈ విషయాలన్నీ ఋగ్, యజుర్వేదాల్లో కనిపిస్తాయి.

విచిత్రం ఏమంటే...

## కొండెక్కిన గుడ్డిదీపం

స్త్రీయోనిలో స్కలించిన వీర్యం వల్లే సంతానం కలుగుతుందని వేదం చెప్తుంటే... ఈ సంభోగక్రియను ఒక యజ్ఞక్రియగా భావిస్తే.. ఆ తర్వాత వచ్చిన పురాణ ఇతిహాసాల్లో- పూర్తిగా దీనికి విరుద్ధమైన విధానం వచ్చిపడింది.

యోనిలో కాకుండా వీర్యాన్ని యజ్ఞగుండంలోపడేసి భస్మం చేస్తే సంతానం కలుగుతుందనే చాదస్తం వచ్చి పడింది. రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు ఇలాగే పుట్టారని రామాయణం చెప్తుంది.

గర్భంలో కాకుండా ముక్కుల్లో, కళ్ళల్లో, చెవుల్లో, స్కలించిన వీర్యానికి సంతానం కలిగినట్లుగా కొన్నిచోట్ల ఉంటే, నోట్లో స్కలించిన వీర్యానికి (అగ్నినోట్లో శివుని వీర్యం), నీటిలో స్కలించిన వీర్యానికి సంతానం కలిగినట్లు (కుమారస్వామి) ఇంకొన్నిచోట్ల ఉంది. చివరికి వీర్యంకూడా పోయి, చెమటకి, కన్నీటికి, రక్తానికి, మూత్రానికీ, మలానికీ, వంటికి పూసుకున్న నలుగుపిండికీ సంతానం కలిగినట్లుగా కాకమ్మకథల అల్లికతో- వేదాల్లో మిణుకుమిణుకుమంటూ కన్పించిన గుడ్డిదీపం కాస్తా పురాణకాలానికి కొండెక్కింది!

ప్రసవవేదనలతో పనిలేని వింత 'పుట్టుకలు', రోత 'అవతారాలు' పుట్టుకొచ్చాయి. విజ్ఞానాన్ని వెక్కిరించాయి.

తల్లిగర్భం చీల్చుకుని వామదేవుడు వచ్చి, తల్లిని చంపాడో లేదో కాని, వేదాల కడుపు చీల్చుకు వచ్చిన పురాణాలు మాత్రం ఆ పని చేశాయి. (ఇంకావుంది)

## "జ్ఞాన దీప్తి" కోసం యాకోబ్ గారి విరాళం

**తెలంగాణలోని సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నివాసి అయిన ఆర్. యాకోబ్ గారు గత 35 ఏళ్ల నుంచీ భావ విప్లవోద్యమంతో మమేకమై వుంటున్నారు. మానవ వికాస వేదికలో వారు క్రియా శీలక సభ్యులు. హేతువాద ప్రచారం కోసం పలు బహిరంగ సభలను, అధ్యయన తరగతులను ఆయన నిర్వహించారు. తన పిల్లలను చార్వాక విద్యా పీఠంలో (నిడమర్రు) చదివించారు. "స్వేచ్ఛాలోచన"పై వున్న అభిమానంతో, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గ్రంథాలయ పాఠకులకు "జ్ఞాన దీప్తి" నందించే వుద్దేశంతో నాలుగేళ్లనుంచీ రూ. 12000/-లను విరాళంగా అందిస్తున్నారు. వారి ఉద్యమాసక్తి, ఆదర్శానికి అభినందనలు, ధన్యవాదాలు తెలుపుతున్నాం.**

**- మేనేజర్.**

# తాటిమట్టల వైపుకా? తారా పథానికా?

"నమస్తక్షభ్యో రథకారేభ్యశ్చ వో నమో నమః కులాలేభ్యః కర్మారేభ్యశ్చ వో నమో నమో
నిషాదేభ్యః పుంజిష్ఠేభ్యశ్చ వో నమో నమః శ్వనిభ్యో మృగయుభ్యశ్చ వో నమః"

"నమస్సులు. రథకారులైన వడ్రంగులకు నమస్సులు.కుండలు చేసే కుమ్మరలకు నమస్సులు. కర్మాగారాల్లో పనిచేసే కర్మకారులకు నమస్సులు.నిషాదులకు, వేటగాళ్ళకు, వేటకుక్కలకు, వేట కుక్కల శిక్షకులైన బోయవాళ్ళకు నమస్సులు –"

(శుక్ల యజుర్వేదం : 16-27)

## నైవేద్యానికి తెడ్డు

నా చిన్నతనంలో నాకీ విషయం చాలా విచిత్రంగా తోచేది. గ్రామాల్లో దేవుళ్ళకు, దేవతలకు పండుగ రోజుల్లో నైవేద్యాలు సమర్పించేవారు. శుభ్రమైన ఇత్తడి బిందెలో నైవేద్యం వండేవారు. మామూలుగా అన్నం, కూరలు వండేప్పుడు పాత్రల్లోని పదార్థాల్ని గరిటెలతో కలియబెడతారు. కానీ, ఈ నైవేద్యాన్ని మాత్రం లోహ గరిటెలతో తిప్పేవారుకాదు. పచ్చి తాటిమట్ట కోసుకొచ్చి, దానినే తెడ్డుగా వాడేవారు. నైవేద్యాన్ని కలయ తిప్పేవారు. ఆ మట్టతోనే వడ్డించేవారు.



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

"ఎందుకు గరిటెలు వాడరు?" అని ప్రశ్నిస్తే!

"నైవేద్యం స్వామికి పెట్టే బువ్వ. దానికి పచ్చి తెడ్డునే వాడాలి. ఎంగిలి పడ్డ గరిటెలు వాడకూడదు" అనేవారు.

"వండే గిన్నె ఎంగిలి పడిందేగా?" అని అనుమానం వ్యక్తం చేస్తే –

"నీ బొంద. ప్రతిదాన్నీ అలా ప్రశ్నించకూడదు. కళ్ళుపోతాయి. గిన్నె ఏదైనాసరే, కలిపే తెడ్డు మాత్రం తాటిమట్టే ఉండాలి" అనేవాళ్ళు. వాళ్ళు చెప్పిన సమాధానం రుచించక పోయినా, తెడ్డుకంటిన నైవేద్యం మాత్రం యమారుచిగా ఉండేది. ఎంత రుచి అంటే తెడ్డుని పోటీపడి నాకేసే వాళ్ళం.

ఇలాంటిదే మరోటి ఉంది.

దీపావళినాడు ఇళ్ళని కరెంటు లైట్లతో అలంకరించినా, కొవ్వొత్తులు ఎన్ని వెలిగించినా, దేవుని ముందు మాత్రం నూనెపోసిన ప్రమిదల్నే పెట్టడం –

ఈ రెండూ నా చిన్నతనంలో నన్ను ఆలోచింప చేసిన ప్రశ్నలు. వాటికి ఆ తర్వాత ఎప్పుడో సమాధానం దొరికింది. మనిషి నాగరికతలో ఎన్నెన్ని కొత్తకొత్త ఆవిష్కరణలు వచ్చినా, మానవసమాజం పాత అలవాట్లను పవిత్రంగా భావిస్తుందని తెలిసింది. ఇలాంటివే సంస్కృతిగా కొనసాగుతాయనీ అర్థమైంది. దీనికి కారణం మార్పునేరం' అని భావించే మతమే అనీ అవగతమైంది.

ఇలాంటి సంస్కృతి, మతం పట్టు ఉన్న ప్రతి మానవజాతిలో ఉంటుంది. వారు ఆర్యులైనా, అనార్యులైనా. అందుకే...

"పాత ఒక మహా గొప్ప. కొత్త ఒక పరమ చెత్త" అనుకునే సంప్రదాయవాదులూ, " పాత ఒక పరమ రోత, కొత్త ఒక మెరుగుపూత" అనుకునే అత్యాధునికులూ, నవనాగరకులూ మనకు చరిత్రపొడవునా తారసపడుతూనే ఉంటారు. ఈ రెండింటిలో నిజానికి ఒకటి గతం, రెండోది భవిష్యత్తు. కానీ, ఈ పాత కొత్తల మేలు కలయికతోనే సమాజం నడిచిపోతూ ఉంటుంది. అదే వర్తమానం. పాత భావాల్ని పట్టుకు వ్రేళ్ళాడేవాళ్ళని "ఛాందసులు" అనీ, క్రొంగొత్త వైపు ఉరకలు తీసేవారిని "విశృంఖలవాదులు" అని ఒకరి కొకరు నిందించుకుంటూ ఉంటారు.

ఇలా.. వర్తమానంలో పాత విధానాల్ని వదలి పెట్టకుండా, ధార్మిక కర్మకాండల్ని పాటించే అలవాటు అందరికీ ఉన్నట్లే ఆర్యులకూ ఉంది.

మనం పదేపదే ఒక్క విషయాన్ని గుర్తుచేసుకుంటూ ఉండాలి. చరిత్రల్ని మననం చేసుకునే సమయంలో "కాలాన్ని" ఎప్పుడూ దృష్టిలో ఉంచుకోవాలి. మనం చర్చించుకుంటున్న విషయం 'ఎప్పటిది? ఎక్కడిది?" అనే అంశాల్ని దాటవేసి మాట్లాడుకోకూడదు.

మనం ఇప్పుడు యజుర్వేదకాలాన్ని గురించి మాట్లాడుకుంటున్నాం. కాబట్టి మనం క్రీ.పూ.1200 నుండి

క్రీ.పూ. 800 మధ్య కాలంలో ఉన్న ఆర్య సమాజాల జీవనాన్ని గురించి చర్చించుకుంటున్నాం అన్నమాట.

## ఆయుధాలే తొలి పరికరాలు

మానవజాతి నాగరికతా వికాసంలో ఆయా సమాజాలు నిత్యజీవితంలో ఉపయోగించిన పాత్రలు, సామాన్లు, ఇతర పరికరాలు కూడా ఎన్నదగినవే. అవి, ఆయా సమాజాల వైజ్ఞానిక ప్రగతిని అద్దాల్లా ప్రతిబింబిస్తాయి.

మానవ సమూహాలు మొదట ఉపయోగించినవి ప్రకృతిలో దొరికిన సహజసిద్ధమైన కర్ర పరికరాలే. ఆ కర్రల ఒక చివరను చీల్చి సన్నని ముక్కును రూపొందించుకునే నేర్పు మానవజాతి పూర్వీకులైన చింపాంజీలకు 40 లక్షల సంవత్సరాల నాడే తెలుసు. పరిజ్ఞానంతో మలచిన తొలి పరికరం అది. ఆ తర్వాత రాతి పరికరాల్ని ఆయుధాలుగా వాడిన వారు 20 లక్షల సంవత్సరాలనాటి హోమోహెబిలిస్ మానవులు.

పొడవైన కర్రల చివర, సన్నని పదునైన ముక్కు ఉన్న రాతి పరికరాన్ని కట్టి ఉపయోగించినవారు 5 లక్షల సంవత్సరాలనాటి హోమో ఎర్గాస్టర్ మానవుడు.

వీళ్ళు రెండు పరికరాల్ని అనుసంధానం చేశారు. ఒకటి :కర్ర పరికరం. రెండు: రాతిపరికరం. రెండు నాగరికతల సమ్మేళనం. అంతేకాదు, రాతిని చెక్కి పదునైన పరికరాలుగా మలచుకునే నైపుణ్యం కూడా వీరికి ఉంది. ఇలా మలచే రాతి కార్ఖానాల ఆనవాళ్ళు కూడా మనకు దొరికాయి. వీరిది తొలి రాతియుగంగా పురా పరిశోధకులు నిర్ణయించాయి.

ఆ తర్వాత లక్ష సంవత్సరాల నాటి హోమోసేపియన్స్ మానవులు మధ్యరాతి యుగంవారు. ఆ మధ్యరాతియుగం మలిదశలో (30 వేల సంవత్సరాల నాడు) రాతితో శిల్పాలు చెక్కేనైపుణ్యం కూడా సంపాదించారు నియాండర్తల్ మానవులు.

కొయ్య, రాతి పరికరాలే కాకుండా ఈ నియాండర్తల్ మానవుల్లో కొత్త పరికరాలు మొదటిగా కన్పించాయి. అవే, తోలు పరికరాలు. సహజంగా ప్రకృతి సిద్ధంగా శిథిలమైపోయే జంతుచర్మాల్ని "శిథిలం కాకుండా చేసి, వాటితో తోలు తిత్తులు, గుడారాల పైకప్పులు నిర్మించుకునే నైపుణ్యం నియాండర్తల్ మానవులకు తెలుసు.

పాతిక వేల సంవత్సరాల క్రితంనాడు క్రొత్త రాతియుగం ప్రారంభమైంది. క్రోమాగ్నాన్ మానవులతో ఈ యుగం నడక మొదలెట్టింది.తొలి నాళ్ళలో మానవులు ఉపయోగించిన పరికరాలన్నీ వేటకు సంబంధించినవే. ఎందుకంటే వారి జీవనమే వేట కాబట్టి.

## వ్యవసాయ పరికరాలు

ఆ తర్వాత పశుపాలన, వ్యవసాయం తెలిశాక పరికరాల రూపురేఖలు, వాటి ప్రయోజనాలూ మారాయి. పంటలు కోయడానికి, "ఈటె" పనికి రాదు. "కొడవలే" కావాలి. విల్లు విల్లంబులు నేలను దున్నలేవు. అందుకు నాగళ్ళు కావాలి. కాబట్టి, మారిన నాగరికతకు అనుకూలంగా పరికరాలూ మారాయి. ఆ మారిన పరికరాల్లోకూడా కొయ్య, రాయి, తోలు ఇవే తొలుత ఉపయోగపడ్డాయి. ఆ తర్వాత ఆవిష్కరించిన రాగి, ఇనుములాంటి ఖనిజాలు పాత పరికరాల్ని ఓ మూలన నెట్టేశాయి. ఏదేశ నాగరికత చరిత్రయినా ఇదే!

ఆర్యులు కూడా అందుకు భిన్నమేంకాదు!

ఆర్యులు ఇక్కడికి వలస వచ్చారనేదే ఇప్పటి వరకూ ఆవిష్కృతమైన అంశం. వారు ఇక్కడికి వచ్చే నాటికి (క్రీ.పూ. 2000) ఇక్కడ సింధూ నాగరికత (క్రీ.పూ. 3000–క్రీ.పూ. 1700) మహోన్నత దశలో ఉంది. సింధూ ప్రజలకు ఖనిజాలు తెలుసు. వారిది రాగి యుగం. సింధు ప్రజల రాగి యుగ జీవనం క్రీ.పూ. 1200తో దాదాపు ముగిసిపోయింది.

ఆర్యుల రాకతో ఇక్కడ ఇనుప యుగం ప్రారంభమైంది.

ఋగ్వేద కాలం క్రీ.పూ. 2000 – 1700ల మధ్య. వీరు ఇక్కడికి వచ్చేనాటికి వారికి కర్ర, రాతి, ఇనుప, తోలు పరికరాలూ తెలుసు. రాగి లోహం తెలియదు.

ఋగ్వేదంలో గృహోపకరణాలుగా వాడే రోలు, రోకలి, తిరగలి (తొలి యంత్రం) గురించిన వివరం ఉంది. ఇందులో రోలు, రోకలి రెండూ కర్ర పరికరాలే. అంటే కర్ర రోలు, కర్రరోకలి.

ఋగ్వేదం మొదటి మండలంలోని 28వ సూక్తం మొత్తం ఈ రోలు, రోకలి, తిరగలి గురించిన సూక్తమే – ఇందులో –

**"తా నో అద్యవనస్పతీ ఋష్వావృష్వేభిః**
**సోతృభిః ఇంద్రాయ మధుమత్ సుతం"**

– (ఋగ్వే: 1–28–8)

"రోలూ, రోకలి రూపంలో ఉన్న వృక్షములారా! మీరు సోమరసాన్ని పిండుతారు" – అని ఈ రుక్కు అర్థం.

దీన్నే నేమాని వారు–

**"ముసలోలూఖలతీవిని**
**అసమానముగా వెలుంగు నగములున్!"** అన్నారు.

ఇక్కడ ముసలం అంటే రోకలి. ఉలూఖం అంటే రోలు. నగములు అంటే చెట్లు.

ఋగ్వేద కాలంలో రోలూ, రోకళ్ళు కర్రవే. ఎందుకంటే వారికి వీటి అవసరం ఆకుల్ని దంచి వాటి నుండి సోమరసాన్ని పిండడమే కాబట్టి. వారికి అప్పటికి వ్యవసాయం ఇంకా బాగా తెలియదు. వారు ఆ తర్వాత వ్యవసాయాన్ని నేర్చుకున్నారు. మాంసంతోపాటు ధాన్యాల పిండిని ఆహారంగా ఉపయోగించడం నేర్చారు. కాబట్టి చెక్క రోలూ, రోకళ్ళు ధాన్యాన్ని దంచి పిండి చేయలేవు. అందుకే యజుర్వేద కాలానికి ఆర్యులు రాతి రోలును ఉపయోగించారు. రోకలికి ఇనుప పిడిని తగిలించారు.

**"............. అద్రిరసి వాసస్పత్యో గ్రావాసి**
**పృథుబుధ్నఃప్రతి త్వాదిత్యాస్త్వగ్వేత్తు"**

(శుక్ల.యజు: 1-14)

*"ఓ రోలూ! నీవు రాతితో చేయబడ్డావు. నీక్రింది భాగం వెడల్పుది. కర్రతో చేసిన రోకలితో నీకు స్నేహం"* అని దీనర్థం. ఇక ... ఇది చూడండి ....

**"అగ్నేస్తనూరసి వాచో విసర్జనందేవ వీతయే త్వా**
**గృహ్ణామి బృహద్గ్రావాసి వానస్పత్యః స ఉ ఇదం దేవేభ్యో**
**హవిః శమీష్య సుశమి శమీష్య**
**హవిష్కృదేహి హవిష్కృదేహి!**

(శు.యజు: 1-15)

*"ఓ బియ్యపు పిండీ! నీవు అగ్ని శరీరానివి. ఓ! రోకలీ! నీవు కర్రతో చేయబడ్డ పొడవైన దానవు. నీ అడుగు భాగం రాతికంటే గట్టిది. కఠినమైంది. నీవు దేవతల కోసం ఈ ధాన్యాన్ని పిండి పిండిగా చేయుము"* -

ఇవీ ఋగ్వేద కాలం నుండి యజుర్వేద కాలానికి అంటే దాదాపు వెయ్యి సంవత్సరాల కాలంలో రోలూ, రోకలిలో వచ్చిన మార్పులు. రాతి రోలు, ఇనుప పన్నుతో గట్టి అడుగు భాగం ఉన్న రోకలి - ఆర్యుల వ్యావసాయిక జీవనాన్ని తెలియజేస్తుంది.

విశేషం ఏమిటంటే యజుర్వేదకాలానికి రాతి పరికరాలు వచ్చినా, యజ్ఞయాగాది క్రతువుల్లో సోమరసాన్ని తీయడానికి ఋగ్వేద కాలంనాటి చెక్క రోలు, రోకళ్ళనే వాడడం. అంటే పాత పరికరాల్ని పవిత్ర సంస్కృతిగా చూడ్డం.నిజానికి ఋగ్వేదకాలంలోనే రాతి తిరగలి ఉంది. దీనితో కూడా సోమరసాన్ని పిండేవారు. ఆ పిప్పిని గుడ్డలో వేసి గట్టిగా పిండి, వడకట్టేవారు.

తిరగలి మానవ నాగరికతలో తొలి యంత్రం. తిరగలితో క్రింది భాగాన ఉన్న రాయి తిరగదు. పైనున్న రాయి తిరుగుతుంది. ఈ రెండూ రాచుకొని తిరగడాన్ని ఎలా పోల్చారో చూడండి -

**"యత్ర ద్వావివ జఘ నాధిషవణ్యా కృతా**
**ఉలూఖలసు తానామవే ద్వింద్ర జల్గుల్ల**

(ఋగ్వేదం 1-28-2)

దీనికి నేమానివారి పద్య అనువాదం చూడండి.

**"పిరుదులువలె విస్తృతి గొని**
**కరము ప్రకాశించు రాళ్ళ ఘర్షణవల్లన్**
**విరివిగ వచ్చిన సోమము**
**సరవిగ జవిజూచి చూచి జరుగవె ఇంద్రా!**

*"ఓ ఇంద్రా! విశాలమైన రెండు పిరుదులవంటి రాతి పలకలతో (తిరుగలితో) విసిరి సోమరసం తీశాము. రా! వచ్చి సేవించు!"* అని దీనర్థం.

## పిండిని దంచడానికే కాదు

రాతి రోలు మీద, ఇనుప పన్ను ఉన్న రోకలితో దంచేప్పుడు, గురితప్పి, రోలు అంచుకు తగిలితే వాటి ఘర్షణకి నిప్పురవ్వలు లేస్తాయి. ఇది నిత్యజీవితంలో మనకు అనుభవమే! ఇద్దరు ముగ్గురు ఒకే రోలుతో దంచేప్పుడు కూడా రోకళ్ళు కొట్టుకున్నా నిప్పురవ్వలు లేస్తాయి.(రోలులో మెత్తటి దూదిని ఉంచి రోకలితో రోలు అంచులకుకొట్టి దూదిని మండించిన అనుభవం నాకు ఉంది. నాకే కాదు. ఈ అనుభవం చాలా మందికి ఉండే ఉంటుంది.)
ఇదే విషయం -

**"ధ్రువాసి ధరుణేతో జంజే ప్రథమమేభ్యో**
**యోనిభ్యోఉ అధి జాత వేదాః!**

(శుక్ల.యజు:13-34)

*"ఓ రోలా! నీవు జగాల్ని ధరించిన దానవు. స్థిరమైన దానవు. అగ్ని మొదటిగా రోలు, రోకలి నుండే పుట్టింది. ఆ తర్వాతే ఆరణుల నుండి ఆవిర్భవించింది."*

రాతి రోలు మీద, ఇనుప పన్ను ఉన్న రోకలి వల్లే అగ్ని పుడుతుంది. మానవులకు మొదటిగా తెలిసిన అగ్ని ఇదే! అని చెప్పడంవల్ల రోకలికి ఇనుప పన్ను ఉంది అనే విషయం తెలుస్తుంది. చెక్క రోలు మీద చెక్క రోకలితో కొట్టినా, రాతి రోలు మీద చెక్కరోకలితో కొట్టినా నిప్పు రవ్వలు రావు. ఆఘర్షణ సరిపోదు. చెక్కలో చెక్కను గుచ్చి, రాపాడించడం (డ్రిల్లింగ్

చేయడం) లేదా చిలకడం వల్ల మాత్రమే అగ్ని పుడుతుంది. దీన్నే ఆరణి అంటాం.

## ఇనుప కొలిమి

ఆర్యులకు ఇనుము తెలుసు. దీనితో పలుగులు, నాగళ్ళు, గొడ్డళ్ళు, కవచాలు తయారు చేసుకున్నారు. సహజ సిద్ధంగా దొరికే ముడి ఇనుము మెత్తగా ఉంటుంది. బలహీనంగానూ ఉంటుంది. దానితో ప్రకృతి సిద్ధంగా కలసి ఉన్న ఆక్సిజన్‌ని తొలగించి కర్బనాన్ని చేర్చితే గట్టిపడుతుంది. 2.1% కర్బనాన్ని చేర్చితే ఉక్కులా మారుతుంది. వెయ్యి రెట్లు బలం పుంజుకుంటుంది.

ఇనుమును అధిక వేడి చేసి కరగించడం వల్ల ఇలా మార్చగలం. ఇనుప ఖనిజం ద్రవీభవనం చెందాలంటే (కరగాలంటే) $1538^0$C ఉష్ణోగ్రత కావాలి. మరగాలంటే $2867^0$C ఉష్ణోగ్రత అవసరం. ఇంత ఉష్ణోగ్రతల్ని కలిగించే కొలుములు ఉంటేనే అది సాధ్యం.

ఈ విద్య ఆర్యులకు వెన్నతో పెట్టిన విద్యే. ఈవిద్యను వారు తమ మూల నివాసాల నుండే నేర్చుకు వచ్చారు. అందుకే భారత దేశంలో ఋగ్వేద ఆర్యులతోనే, సింధూ నాగరికత అనంతరమే ఇనుప యుగం ప్రారంభమైంది. నిజానికి ఋగ్వేదం చివరి దశలో, యజుర్వేదం ప్రారంభ దశలో ఈ పరిశ్రమ ఘనంగా వర్ధిల్లింది. అది మనకు యజుర్వేదంలో సుస్పష్టంగా కనిపిస్తుంది.

రాతి గొడ్డలితో చెట్టును నరకాలంటే అంత తేలిక కాదు. చెట్టును తేలిగ్గా తెగనరకాలంటే ఇనుప గొడ్డలే కావాలి. అందుకే ... యజ్ఞవేదిక ముందు యూపాలుగా పాతిన చెట్ల శాఖలను గురించి చెప్తూ ...

"............ఓషధే త్రాయస్వ స్వధితే మైన ఏనం హింసీ" - (శు.యజు: 6-42)

స్వధితి అంటే గొడ్డలి. *"ఓ గొడ్డలీ! నీవు చెట్టుకు బాధ కలిగించకుము"* అంటే *"తేలిగ్గా నరుకుము"* అని అర్థం.

రాతి గొడ్డలితో నరికితే చెట్టు ఎక్కువ బాధపడుతుంది. ఇనుప గొడ్డలితో నరికితే బాధ పడకుండా నేలకూలుతుంది అని దీనర్థం. ఇక ...

"ఆయంహి త్వా స్వధితిస్తేతి జానః ప్రణినాయ మహతే సౌభగాయ" -(శు.యజు. 5-43)

*"ఓ పదునైన ఇనుప గొడ్డలీ! నీవు ఈ చెట్టుకు బాధకలిగించక పోవడమే కాదు. దీన్ని దేవతార్చనకు వినియోగపడేలా చేశావు. ఈ చెట్టుకు పరమ సౌభాగ్యాన్ని కలిగించావు".*

అలాగే కృష్ణయజుర్వేదంలో 1-3-5 లో కూడా గొడ్డలి ప్రస్తావనలు ఉన్నాయి.

యజుర్వేదంలో ఇనుప లోహపు శక్తిని, ఒక తాత్త్విక దృక్పథానికి జోడించి చెప్పడం కూడా ఉంది.

**"నమః సు తే నిర్‌ఋతి తిగ్మతేజోఽయస్మయం విచృతా బంధమేతం" - (శు.యజు: 12-63)**

*"ఓ! నైరుతీ! నీకు నమస్కారం! జనన మరణ బంధం ఇనుం కంటే బలమైంది. దాన్నుండి విడిపించు".*

## కవచాలు శిరస్త్రాణాలూ

సింధూ ప్రజలపై ఆర్యుల విజయానికి ఇనుప ఖనిజం, గుర్రాలు, విల్లులాంటి సాంకేతిక ఆయుధాలు ప్రధాన కారణం అని గతంలో చెప్పుకున్నాం. కత్తులు, గదలు మాత్రమే కాదు, రథ చక్రాలు, ఇరుసులేకాదు, వారి విజయానికి వారు ధరించిన ఇనుప శిరస్త్రాణాలు( హెల్మెట్లు), శరీరానికి ధరించిన ఇనుప కవచాలు కూడా ప్రధాన కారణమే.

యుద్ధంలో శత్రువుల్ని ఛేదించడం ఎంత ముఖ్యమో తనని తాను రక్షించుకోవడం అంతే ముఖ్యం. ఇనుము ఈ రెండు పనులూ చేసింది. ఆర్య విజయానికి కారణమైంది.

**"నమో బిల్మినే చ కవచినే చ**
**నమో వర్మిణే చ వరూథినే చ**
**నమః శ్రుతాయ చ శ్రుతసేనాయ చ**
**నమో దుందుభ్యాయం చ అహనన్యాయ చ"**

- (శుక్ల.యజు : 16 - 35)

*"శిరస్త్రాణాలున్నవారికి, కవచధారులకు నమస్కారాలు. ఇనుప కచ్చడాల వారికి, ఏనుగుపై ఇనుప కవచం ఏర్పరచే వారికి నమస్కారం. వీరులకు, సేనానులకూ, దుందుభిరావానికీ నమస్కారం"* అని దీనర్థం. తలకూ, ఏనుగులకీ ఇనుప కవచాలున్నాయన్నది మనం ఇక్కడ గమనించాలి. ఇంకా చూడండి ...

"మర్మాణి తే వర్మణా ఛాదయామి సోమస్త్వా రాజామృతేనాను వస్తాం

ఉరోర్వరీయో వరుణస్తే కృణోతు జయంతం త్వాను దేవా మదన్తు" - (శుక్ల.యజు: 17-49)

*"ఓ వీరుడా! నీ మర్మస్థానాన్ని కవచంతో కప్పుతున్నాను. సోముడు నీలో అమృతాన్ని నింపుతాడు. వరుణుడు నీ ఉరముల్ని రాతికన్నా గట్టిగా చేస్తాడు. దేవతలు జయం*

కలిగిస్తారు"

ఇక్కడ తలకీ, రొమ్ముకే కాదు, మర్మాంగాల ప్రాంతంలో, తొడలకి కూడా గట్టి కవచాలు ఉన్నట్లు తెలుస్తుంది.

## బలమైన నాగళ్ళు

మనం గతంలో ఋగ్వేదంలో ఆర్యుల వ్యవసాయం గురించి చెప్పుకున్నప్పుడు, వారు వ్యవసాయాన్ని సింధూ ప్రజల దగ్గర నుండే నేర్చుకున్నా, వారికి తెలిసిన ఇనుప ఖనిజం వల్ల వ్యవసాయాన్ని శీఘ్రంగా అభివృద్ధి చేశారని చర్చించాం. ఋగ్వేద కాలం కంటే ఆ శీఘ్రత యజుర్వేద కాలానికి మరింత వేగవంతం అయ్యిందనడానికి ఈ క్రింది యజస్సులే సాక్ష్యం.

చెక్కనాగలి పశుబలానికి పనికిరాదు. రాగి నాగలి మెరుగైనదే కానీ, అదీ ఎక్కువ పశువులు లాగడానికి పనికిరాదు. ఒక నాగలిని ఒక పశువు, లేదా రెండు పశు వులు లాగడం పరిపాటి. కానీ, ఒకే నాగలిని 3 జతలు, ఐదు జతలు, పన్నెండు జతల ఎద్లు లాగాలంటే అది "ఏకనాగలి" కాదు. అనేక నాగళ్ళు కలసిన "గొర్రు" అయి ఉంటుంది. ఇప్పుడు ట్రాక్టర్‌కు ఉండే నాగళ్ళలాగా అనేక ఇనుప నాగళ్ళు కలసిన నాగలై ఉంటుంది. అలాంటి నాగళ్ళను వాడి వ్యవసాయం చేశారు యజుర్వేద కాలం నాటి ఆర్యులు.

**"సీరా యుంజింతి కవయో యుగా వితన్వతే పృథక్"** – (శు.యజు : 12–67)

**".... సౌర్యమేకకపాలా ద్వాదశాగవగ్ం సీరం దక్షిణాఽ ఽగ్నేయ..."** –(కృ.యజు: 1–8–7)

"ఈ మంత్రాలకి మహీధరుని వ్యాఖ్యానంలో షడ్భిర్వా దశభిశ్చతుర్వింశత్యా" అని ఉంది. అంటే ... యజ్ఞం చేసే అధ్వర్యుడు యజ్ఞగుండానికి దక్షిణ కోణంలో పడమర వైపు తిరిగి, 6, 10, లేదా 24 ఎద్దులు కట్టే నాగలిని ఉపస్థానం చేయాలి అని.

## రాతి కత్తి – గసిక కర్ర

ఆర్యులు ఇనుమును అనేక రకాలుగా వాడుకున్నారు. దానితో రకరకాల కత్తులు తయారు చేసుకున్నారు. కానీ, మనం ఈ వ్యాసం మొదట్లో చెప్పుకున్నట్లు యజ్ఞకార్యంలో నెత్తి గొరిగించుకోడానికి మాత్రం రాతి కత్తినే వాడారు. రాతి కత్తిని "శివము" అంటారు. సనాతన వైదిక ఆచారాలు పోకుండా ఎలా కాపాడారో రుజువు పరచుకునే అంశాల్లో ఈ "శివం" ఒకటి.

**"శివో నామాసి స్వధితిస్తే పితా నమస్తేఽస్తు మా మా హింసీ ..."** – (శుక్ల. యజు : 3–63)

*"కత్తీ! నీవు 'శివం' అనే పేరుగల దానవు. నీ తండ్రి గట్టి రాయి. మమ్ము బాధించకు. హింసించకు. నీకు నమస్సులు"*

ఇంకా ..

**"ఇమాఽ ఆపః శము మే సంతు దేవీః**

**ఓషధే త్రాయస్వ స్వధితే మైనం హింసీ"**

(శు.యజు : 4–1)

తలను నీటితో తడిపి, ఇలా మంత్రం చదువుతాడు.

*"ఓ! దర్భగడ్డీ! ఇతనిని రక్షించు. ఓ రాతి కత్తీ! గొరిగే సమయంలో హింసించకు"* అని దీని అర్థం. అంటే ... లోహపు గరిటెలు ఉన్నా నైవేద్యానికి తాటిమట్ట తెడ్డుని వాడినట్లు, ఇనుపకత్తి ఉన్నా వైదిక కర్మకాండలో గుండుగొరగడానికి రాతి కత్తినే వాడారన్నమాట!

అలాగే ... కర్ర పలుగు (గసిక కర్ర) గురించి కూడా.

ఇనుముతో చేసిన బలమైన పలుగులు ఉన్నప్పటికీ యజ్ఞవేది ప్రాంతంలో చేసే గుంటలకు కొయ్య పలుగునే ఉపయోగించారు. కొయ్య పలుగుల్ని టేకు, మద్ది, తాటిచేవ, వెదురు కర్రలతో తయారు చేస్తారు. వీటిని "గసిక కర్రలు" అంటారు. ముప్పై ఏళ్ళ క్రితం వరకూ "యానాదులు" ఈ కర్రల్ని ఉపయోగించి పుట్టల్ని తవ్వి పాముల్ని పట్టేవారు. చేలగట్ల అంచున ఉండే పీత కలుగుల్లో పొడిచి, పీతల్ని పట్టేవారు. పదునైన ముక్కు ఉన్న పటిష్ఠమైన కర్రలు ఇవి.

యజ్ఞ క్రియలో ఉపయోగించే ఈ కర్రలకు 'స్ఫ్యన' , 'అభ్రి', 'స్ఫ్య' అనే పేర్లు యజుర్వేదంలో ఉన్నాయి. శుక్ల యజుర్వేదం 1–24, 1–25 మంత్రాల్లో దీని విషయం ఉంది. ఈ కర్ర ఆయుధం **"ఇంద్రస్య బాహురసి దక్షిణం"** అంటే ఇంద్రుని కుడి చేతి వంటిది. బలమైనది అని. ఇంకా ... కృష్ణయజుర్వేదంలో –

**"ఆ దద ఇంద్రస్య బాహురసి దక్షిణః సహస్ర భృష్టః శతతేజా వాయురసి తిగ్మతేజా.."**

(కృ.యజు: 1–1–9)

*"ఓ! కర్ర పలుగా! ఇంద్రుని కుడిచేతిలో వంద ఆయుధాలున్నాయి. నీవు ఇంద్రుని కుడి చేతివి".*

**"అభ్రిరసి నార్యసి త్వయా వయమగ్నిం శకేమ**

**ఖనితుం సధస్థ ఆ జాగతేన ఛందసాంగిరస్వత్"**

– (శు.యజు:11–10)

"ఓ! అభ్రీ! నీవు వెదురు కర్రతో నిర్మించిన దానవు. స్త్రీలింగానివి. అంగీరసుల్లా మాక్కూడా నేల క్రిందనున్న అన్నిటినీ తవ్వితీసుకునే అవకాశం కల్పించు".

మానవుడు కర్ర పరికరాల్ని త్రవ్వకోలులుగా వాడక ముందే పశువుల కొమ్ముల్ని అందుకు ఉపయోగించేవాడు. ముఖ్యంగా సన్నగా పదునుగా ఉండే జింక కొమ్ములు మంచి పలుగుల్లాంటి సాధనాలు. యజ్ఞ వేది నిర్మాణంలో కర్ర పలుగుతో పాటు, జింక కొమ్ముల్ని కూడా ఉపయోగించిన సందర్భం కృష్ణ యజుర్వేదంలో 1-2-2లో 1-2-5లో కనిపిస్తుంది. అదే విషయం శుక్ల యజుర్వేదం (4-10)లో కూడా ఉంది.

## ఖనిజాలకు అధిపతులు

యజుర్వేద కాలానికి బంగారం (శు.యజు : 12-1) వెండి (కృ.యజు:1-5-1) సీసం (శు.యజు : 19-80) మొదలైన ఖనిజాల గురించిన ప్రస్థావనలున్నాయి. వీరి ఉద్దేశ్యంలో ఖనిజాలకు అధిపతి రుద్రులు.

**"రుద్రాః సంసృజ్య పృథివీం బృహజ్యోతిః సమీధిరే**
**తేషా భాను రజస్రఉ ఇచ్ఛుక్రో దేవేషు రోచతే"**

(శుక్ల : 11-54)

*"ఈ భూమి యందు శిలలను (ఖనిజాల్ని) రుద్రులు సృష్టించారు. వారే అగ్నికి గొప్ప జ్యోతిని కలిగించారు".*

## చర్మ పరికరాలు

యజుర్వేదంలో ముఖ్యంగా కృష్ణ యజు ర్వేదంలో చర్మపరికరాలను గురించి ఉంది. చర్మాన్ని శుద్ధిచేసి, రక్షించి, వస్తువులుగా వాడుకోవడం ఎప్పటి నుండో..... 30 వేల సంవత్సరాల నుండే ఉంది.

నియాండర్తల్ మానవులకు చెందిన ఒక గుహలో తోలు సంచి లభించింది. వారు దానిలో ద్రాక్షపళ్ళను నిలువ చేసేవారు. అలా నిలువ ఉన్న ఆ పళ్ళరసం సారాయిగా మారేది. దాన్ని తాగేవారు.

ప్రపంచంలో అతిపురాతన చర్మ శుద్ధి కేంద్రం మెహర్‌గర్. ఒకప్పటి సింధూ ప్రాంతం. ఇది నేటి పాకిస్తాన్‌లో బోలాన్ కనుమల్లో ఉంది. ఆర్యులు భారత దేశానికి వచ్చిన దారి అదే. దాదాపు క్రీ.పూ. 7 వేల సంవత్సరాల నుండి మెహర్‌గర్ వాసులకు చర్మాన్ని శుద్ధిచేయడం తెలుసు. వీళ్ళు మూత్రాన్ని, కొన్ని చెట్ల బెరళ్ళను నానేసిన నీటిని (తుమ్మ చెక్క), ఉప్పు నీటిని ఉపయోగించి చర్మాన్ని రక్షించేవారు. బహుశ ఆర్యులకి ఈ విద్య ఈ దారిలోనే అంది ఉండవచ్చు. వారు పశుపోషకులు కాబట్టి వారికే తెలిసి ఉండొచ్చు. చర్మంతో ''చెప్పులు'' తయారు చేసి ఉపయోగించినట్లు కృష్ణ యజుర్వేదంలో ఉంది.

**"సమహం ఇంద్రయేణ వీర్యేణ పశూనాం మన్యురసి తమేవ మే మన్యుర్**

**భూయాన్నమో మాత్రే పృథివ్యై మాఉహం మాతరం పృథివీగ్ం హిగ్ం సిషం మా......"**

(కృ.యజు.1ాశా15)

*''ఓ చెప్పులారా! మీరు చర్మంతో తయారు చేయబడ్డారు. ఈ చర్మం పశువుకి కోపస్వభావానికి కారణం. నేను కూడా మీలాగే శత్రువులపై కోపంతో ఉన్నాను"* అని ఈ మంత్రం అర్థం.

ఇక ... సోమరసాన్ని తయారు చేయడంలో ఆర్యులు తోలు తిత్తుల్ని కూడా ఉపయోగించుకున్నారు.

**"ఆ దదే గ్రావాసిఉ స్యధ్వరకృద్దేవేభ్యో గంభీరమిమ మధ్వరంకృధ్యుత్తమేన పవిసేంద్రాయ సోమం సుషుతం....."**

(కృ.యజు : 1-4-1)

*"ఓ! తోలు తిత్తుల్లారా! మీలో సోమాన్ని ఉంచి రాతితో దంచుతున్నాను. మీరు పగలకండి. గట్టిగా ఉండండి. సోమరసం కారి పోకుండా కాపాడండి. మాకు సోమరసాన్ని అందించండి. మిమ్మ బాధించము. మమ్మ బాధించకండి".*

## వేదంలో తిరోగమనం

ఇలా కర్ర పరికరాలు, రాతి పరికరాలు, కర్రా - రాయి కలిపిన పరికరాలు, ఇనుప పరికరాలు, తోలు పరికరాలు - అన్నీ ఆర్యులు ఉపయోగించారు. ఒక వైపున నూతన లోహాలు ఉన్నా, యజ్ఞ యాగాల నిర్వహణలో మాత్రం పురాతన కర్ర,రాతి పరికరాల్నే ఉపయోగించడం ఆనాడే మొదలైంది. ఈనాటికూడా యజ్ఞాల్లో మంట రాజేయడానికి అగ్గిపెట్టెలు, లైటర్లు ఎన్ని వచ్చినా, చెక్కలో చెక్క సీలను దించి, రాపాడించగా పుట్టిన అగ్ని తోనే మంటను రగిలిస్తారు.

ఇది, మతానికి ఉండే తిరోగమనంలో భాగమే. వేదం వైదిక మత పునాది కాబట్టి ఈ తిరోగమన భావాలకు కూడా అదే పునాది. ఆ పునాదుల్నే మనం ఇప్పటిదాకా చూశాం. మతానుయాయులు నూతనత్వాన్ని కాదని బ్రతకలేరు.కానీ, పాత మత విధానాల్ని పోనీయరు.ఆ పాత విధానాలే ''పవిత్రమైనవిగా'' ప్రచారం చేస్తారు. క్రతువుల్లో వాటినే పాటింపచేస్తారు.

ఋగ్వేదకాలం కన్నా యజుర్వేదకాలానికి ఎన్నోరెట్లు పరికరాల వాడకం పెరిగింది. వందలాది పరికరాలు వాళ్ళ జీవనంలో వెలుగుచూశాయి. లోహ వినియోగం వారి నాగరకతను వేగవంతంగా, సౌకర్యవంతంగా చేసింది. అయినప్పటికీ పూజాదికాల విషయంలో యజుర్వేదకాల ప్రజలు ఋగ్వేదకాలంనాటి పరికరాలను మాత్రమే వాడారన్నది సుస్పష్టం.

ఆచరణలో సౌఖ్యానికి మాత్రం ఆధునిక పరికరాలు వాడుతూ, ఆచారానికి, గౌరవానికి పాతపరికరాలను వినియోగించడం వైదికధర్మంలో భాగమైంది. నేటికీ అది అంతే స్పష్టంగా కనిపిస్తుంది. సైన్సు అందించిన అన్ని సౌకర్యాలను వాడుకుంటూ సైన్సును తిట్టే వైదికపండితులు మనకు రోజూ టీవీల్లో ప్రత్యక్షమౌతూనే ఉంటారు.

ప్రపంచ నాగరకతలలో ఆధునికానికి గౌరవాన్ని ఇచ్చింది బౌద్ధం. అందుకే భారతదేశ చరిత్రలో వైదికధర్మం వర్ధిల్లిన కాలంకన్నా బౌద్ధం వర్ధిల్లిన కాలంలోనే వైజ్ఞానిక అభివృద్ధి వేగంగా పరుగులు తీసింది. బౌద్ధం గతానికి కాకుండా వర్తమానానికి, సమకాలీనతకు ప్రాధాన్యమివ్వడమే అందుకు కారణం.

అందుకే ...సమకాలీనతకన్నా గత ఘనకీర్తులను మోసే దేశాలు అన్నీ శిధిలకోటలవుతున్నాయి.

అంటే ...

సమాజ ప్రగతికి వైజ్ఞానిక ప్రగతే కారణం. ఆ వైజ్ఞానిక ప్రగతికి దాని వెనుక దాగిన తాత్వికతే కారణం.

తిరోగామి తాత్వికనేపథ్యం ఉంటే ప్రగతి మంద గిస్తుంది.

పురోగామి తాత్విక నేపథ్యం ఉంటే ప్రగతి ముందుకెళుంది.

మన వైజ్ఞానిక పయనం తాటిమట్టల వైపుకా? తారాపథం వైపుకా?

"మంచి గతమున కొంచెమేనోయ్" అని గురజాడ చెప్పింది.. "అన్నీ వేదాల్లో ఉన్నాయి"అని చెప్పుకునే వారికి తాటిమట్టతో చెప్పిన తిరుగులేని సమాధానమే!

**(ఇంకావుంది)**

## బాబు గోగినేనిపై తప్పుడు కేసులు



గత 10 సంవత్సరాలనుంచీ తెలుగు నేలపై మానవ హక్కుల కార్యకర్తగా, హేతువాదిగా, మానవ వాద ప్రచారకునిగా మీడియాలో సుప్రసిద్ధులయిన బాబుగోగినేని వాదాన్ని ఎదుర్కోలేక, తప్పుడు ఆరోపణలతో కేసులు బనాయిస్తున్న హైందవ మత ప్రచారకుల దుర్నీతిని మానవ వికాస వేదిక, స్వేచ్ఛాలోచన పత్రికలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. జూన్ 26వ తేదీన ఈ అంశంపై ఒక టీవీ ఛానెల్ నిర్వహించిన చర్చలో, కేసుల్ని బనాయించిన వ్యక్తి వీర నారాయణ స్వయంగా పాల్గొని వెల్లడించిన వివరాల ఆధారంగా చూసినపుడు, బాబు గోగినేనిపై పేర్కొన్న ఆరోపణలేవీ వాస్తవపునాదిని కల్గిలేవని తేలిపోయింది. 28వ తేదీ సాయంత్రం జన విజ్ఞాన వేదిక, బి.జి. ఫేస్ బుక్ ఫ్రెండ్స్ సంయుక్తంగా హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న ప్రముఖులు సైతం కేసుల పూర్వాపరాలను తడిమి, అవన్నీ తప్పుడు ఆరోపణలేనని ప్రకటించారు. జ.వి.వే. నాయకుడు మాదివాడ రామబ్రహ్మం నిర్వహణలో జరిగిన ఆ ప్రెస్‌మీట్‌లో హైకోర్టు న్యాయవాదులు సి.యల్.యన్. గాంధీ, సుధీర్‌లతో పాటు, కత్తిమహేస్. వి. లక్ష్మణరెడ్డి, మా.వి.వే, అధ్యక్షుడు సాంబశివరావు, తదితరులు మాట్లాడారు. ఆధార్‌కార్డ్ నంబర్లను పౌరుల నుంచి సేకరించి పలుచోట్ల సమావేశాలు జరిపి "ఆధార్ చట్ట" ఉల్లంఘనకు పాల్పడ్డారని, మత విమర్శకు పాల్పడుతున్నారని, తప్పుడు సమాచారమిస్తున్నాడని, శాంతిని రేకెత్తిస్తున్నాడని సెక్షన్లకింద బాబును అరెస్ట్ చేయాలని మాదాపూర్‌కి చెందిన వీరనారాయణ కూకట్‌పల్లి కోర్టునాశ్రయించగా, ప్రధమ సమాచార నివేదికను రూపొందించమని కోర్టు మాదాపూర్ పోలీసుల్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో, బాబు గోగినేనిపై వేసిన కేసుల్ని రద్దు చేయాలని కోరుతూ అతని తరపు న్యాయవాదులు హైకోర్టునాశ్రయించనున్నట్లు తెలిసింది.

# తిరోగమనానికి తిరుగులేని సాక్ష్యం

(పురుష శిర ఉద్గృహ్ణాతి - మానవ శిరస్సును యజ్ఞకుండంలో ఉంచాలి)

"ఆదిత్యం గర్భం పయసా సమంగ్ధి సహస్రస్య ప్రతిమా విశ్వరూపం
పరివృంగ్ధి హరసా మాభి మంసాః శతాయుషం కృణుహి చీయమానః"

– శుక్ల. యజు : 13 – 14

"అగ్నిగుండం నందున్న ఓ మానవ శిరసా! ఈ అగ్ని గ్రహించేశక్తికలది. దీన్ని నీటితో తడుపు. ఓ! అగ్నీ! నీ తేజంతో ఈ యజమానిని రక్షించు.అగ్ని కుండంలోని శిరసా! ఈ యజమానికి వందేళ్ళు ఆయుస్సు కలిగించు"

## మూఢత్వానికి మూలం

ఇది క్రీస్తుశకం ఇరవై ఒకటో శతాబ్ధమా? లేక క్రీస్తుపూర్వం అరవై ఒకటో శతాబ్ధమా?అని ఒక్కోసారి అనుమానం వస్తుంది. ఎందుకంటే మనం చూసే కొన్ని సంఘటనలు అంతకంటే పూర్వమే ఉన్నామేమో అనే అనుమానం కలిగిస్తాయి. ఇటీవల మన మహానగరంలోనే గ్రహణ సమయంలో నరబలి గురించి తెలిసి ఉలిక్కిపడ్డాం. తెలిసింది ఇదే! ఇక తెలియనివి ఎన్నో?



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

అలాగే... వాస్తు పిచ్చి. ఇది వ్యక్తి గతంగా ఉండటం ఒక అంశం. కానీ పాలకులే ప్రభుత్వ ఖజానానుండి వందలకోట్ల రూపాయలు వెచ్చించి, అసెంబ్లీ భవనాల్ని, ఇతర ఆఫీసుల్ని పగలగొట్టించి రూపురేఖలు మారుస్తున్నారు. ఇక మరో మూర్ఖత్వం. తామే శాశ్వత పాలకులుగా ఉండాలనీ, ఎన్నికల్లో గెలవాలనీ, ప్రత్యర్థులు ఓడిపోవాలనే పేరాశతో ప్రజలసొమ్ము ధారపోసి యజ్ఞాలు నిర్వహిస్తున్నారు.

ఏమైపోతున్నాం మనం? ఎటుకేసి పోతున్నాం? మానవ నాగరకతది మత్స్యగమనం. నీటికి ఎదురీది ముందుకు సాగే చేపల్లా నాగరకత కూడా కాల ప్రవాహంలో పురోగమిస్తుంది. కానీ మనం ఇంకా వెనక్కిపోతున్నాం. ఈ నమ్మకాలు ఇంత మూఢంగా ఎందుకు పాతుకుపోయాయి? వీటికి మూలం ఎక్కడ పడింది? ఎలా పాకి పోయాయి? అనేది తెలుసు కోవడమే కాదు తేల్చుకోవాల్చిన విషయంకూడా.

జాతి జీవనాడికి సోకిన ఈ రోగం మనకి వేదకాలంలోనే పడింది. వేదకాలం అంటే రుగ్వేద కాలం నాడు కాదు. రుగ్వేదానికి ఈ మకిలిని పూయలేం. మూఢ నమ్మకాల మకిలి అంటించింది యజుర్వేదమే. యజుర్వేదంలోని యజ్ఞయాగాది ప్రక్రియలు ఎన్ని నమ్మకాల్ని మనకు అంటుకునేలా పులిమాయో, వాటిని భావజాలంగా మార్చి, సంస్కృతిగా స్థిరీకరించాయో కొద్దిగా చూద్దాం

## వర్షం కోసం యజ్ఞమా?

భగవద్గీతలో ఇలా ఉంది....

**"అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్న సంభవంః
యజ్ఞార్భవతి పర్జన్యో యజ్ఞఃకర్మ సముద్భవః"**

"సర్వజీవులకూ అన్నమే ఉత్పత్తి స్థానం. ఆ అన్నం మేఘంవల్ల, ఆ మేఘం యజ్ఞం వల్ల, ఆ యజ్ఞం కర్మ వల్లే ఉద్భవిస్తున్నాయి" అని దీనర్థం. రుగ్వేదంలో అనేక చోట్ల వర్షం పడడానికి రకరకాల కారణాలు కన్పిస్తాయి. కానీ, యజ్ఞం వల్ల వర్షం పడుతుంది అని ఎక్కడా లేదు. నిజానికి రుగ్వేదంలోనే కాదు యజుర్వేదంలో కూడా.

అనావృష్టి సమయాల్లో యజ్ఞాలు చేయడం వల్ల వర్షం కురుస్తుందనే నమ్మకం రుగ్వేద ఆర్యులకిగానీ, యజుర్వేద కాలం నాటి ఆర్యులకి గానీ ఉన్నట్టులేదు. ఇది ఆ తర్వాత వచ్చిన నమ్మకమే! నయ వంచనే!!

దయానంద సరస్వతి వేద భాష్యం రాశాక ఈ ఆలోచన బలపడినట్లు కన్పిస్తుంది.

నిజంగా యజ్ఞంవల్ల వర్షం పడితే, ఈ భూమ్మీద ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి నదులపై ఆనకట్టలు కట్టడం ఉత్త దండగ మారి పని. భూగోళం అంతటా సస్యశ్యామలమై పచ్చదనం పరచుకు పోయేది.

కలేకూరి ప్రసాద్ రాసినట్టు

''భూమికి పచ్చాని రంగేసినట్టు'గా భూగోళం పచ్చదనంతో నిండిపోయేది.

"కొండలు, గుట్టలు, ఎడారులా? మనకడ్డంకి" అని శ్రీశ్రీ రాసేవాడేకాదు. సహారా, అటకామా, థార్, గోబీ ఎడారులు గోధుమ పంటలతో కళకళ లాడేయి. వరి కంకుల వయ్యారపు నాట్యాలతో సుందర నందన వనాలుగా సోకుచేసుకునేయి.

800 సంవత్సరాలుగా ఒక్క వాన చుక్క ముఖం చూడని అమెరికాలోని డెత్‌వ్యాలీ (మృత్యు లోయ) తన రూపురేఖలు మార్చుకుని 'బర్త్ వ్యాలీ'గా బహుళ కీర్తిగాంచేది. బతుకులు పండించేది.

అంతదాకా ఎందుకు? రాయలసీమ రాళ్ళసీమగా కాకుండా పంట రాశుల సీమగా పసిడినవ్వులు నవ్వేది.

కాబట్టి 'యజ్ఞం వల్ల వర్షం' అనేది నిజం కాదు. ఒక నమ్మకం మాత్రమే!

## ఆశలు - దురాశలు

నమ్మకం అనేది నేరం కాదు. మనిషిలోని ఒక 'ఆశే'. ఆశ కొంతవరకు మనిషిని ధైర్యంగా నడిపించే సాధనం. అది నిజం కాకపోయినా కొంత నిలబెడుతుంది కూడా. ఈ ఆశ అనేక రకాలు.

**ఒకటి :** తనకు కూడా మేలు జరగాలనేది.

**రెండు :**తనకు మాత్రమే మేలు జరగాలి అనేది.

**మూడు :** తనకు మేలు జరగడం కోసం ఎదుటివారు నాశనం కావాలి అనేది.

**నాలుగు :**తనకు మేలు జరక్క పోయినా, ఫర్వాలేదు. ఎదుటి వారికి మాత్రం మేలు జరక్కూడదు అనేది.

ఇందులో మొదటిది ఆశ. రెండోది అత్యాశ. మూడోది దురాశ. నాలుగోది వినాశనకరమైన పచ్చిదురాశ.

మానవ జాతుల్లో, అనాగరిక ఆటవికుల్లో కూడా చివరి రెండు "దురాశలు" కనిపించవు. ఆదిమ సమాజాల్లోని మనిషి తన కోర్కెలు తీరడం కోసం, తాను స్వయంగా ప్రయత్నించడం ప్రధానంగా ఉండేది. వేటాడే సమయాల్లో జంతువులు పారిపోతూ, కాలుజారి పడిపోవడమో, ఊబిలో దిగబడడమో, ముళ్ళ తీగ మొక్కల్లో చిక్కుకు పోవడమో జరిగేది. అప్పుడు వారి వేట మరింత సులువు అయ్యేది. ఇలా తమ వేట సులభం కాడానికి సహకరించిన ఆ పరిస్థితులు, అనుకోకుండా కలిగిన లాభాలుగా మనిషి భావించాడు. అలాంటి పరిస్థితులు మరలా మరలా వచ్చి, తనకు సహకరిస్తే మంచిదిగదా! అనుకొనేవాడు. ఈ ఆలోచనే ఆశగా మారింది. అలా రెండు మూడుసార్లు జరిగే సరికి నమ్మకంగా మారింది.

మానవ సమాజాల్లో "దేవుళ్ళు" వచ్చాక "హే! భగవాన్! నాకు ఇలాంటి పరిస్థితులు కలిగించు" అని వేడుకోవడం సహజంగా మారిపోయింది.

తొలినాళ్ళలో, వేటకోసం, నీటికోసం, నిప్పుకోసం మనిషిలో పుట్టిన ఈ నమ్మకాల్ని, చివరికి తనతోటి మానవుల మీదకూడా ఆపాదించడం నేర్చుకున్నారు. అప్పుడే....ఈ నమ్మకాలు ముదిరి మూఢనమ్మకాలుగా మారాయి. అత్యాశలు ముదిరి దురాశాలుగా దాపురించాయి.

" పచ్చిదురాశే దోపిడికి కారణం" అంటాడు కార్ల్ మార్క్స్.

ఇలాంటి దురాశలు చరిత్రకందిన ఆధారాల్ని బట్టి చూస్తే... సింధూ ప్రజలకు "ఎలా ఉన్నాయో? ఎంతగా ఉన్నాయో?" మనకి తెలియదు. తెలిసిన దాన్ని బట్టి చూస్తే - రుగ్వేద ఆర్యుల్లో ఆశలు, అత్యాశలు కనిపిస్తాయి. యజుర్వేద ఆర్యుల్లో మాత్రం పచ్చి దురాశలు పొటమరించుకుని, పొట్టవిచ్చుకుని కన్పిస్తాయి.

## ఋగ్వేదంలో - ఆశలు

రుగ్వేదంలో వచ్చిన రోగాల్ని తగ్గించమని అశ్వనీలాంటి దేవతల్ని వేడుకోవడం ఉంది. వారిచ్చిన ఔషధాలు సేవించి జబ్బులు నయం చేసుకున్న ఉదంతాలూ ఉన్నాయి. అలాగే ... అగ్ని, వాయు, వరుణ దేవతల్ని కీర్తించడం, తమకు మేలు చేయమని ప్రార్థించడం కూడా ఉంది. అంతేకాదు, తమ శతృవులకు వినాశనం చేయమని దేవతల్ని వేడుకున్న వేడికోళ్ళు కూడా రుగ్వేదంలో కన్పిస్తాయి. ఈ వేడికోళ్ళు వ్యక్తిగతంగా కావు. సమాజం మొత్తానికి మేలు కలిగించమనే వేడుకోళ్ళే -

మనం గత అధ్యాయాల్లో చెప్పుకున్నాం. యజుర్వేద కాలానికి సమాజంలో 'మేము' 'మనము' అనేది పోయి - "నేను" "నాకు" అనే వ్యక్తిగతం వచ్చిపడిందని.

ఈ 'వ్యక్తిగతం' రాడానికి బానిసవ్యవస్థ స్థానంలో ఫ్యూడల్ వ్యవస్థ (రాచరికం) రావడం ప్రధాన కారణం.
ఫ్యూడల్ భావజాలంలోని "నేను" "నాది" "నాకు" "నేనే" అనే భావజాలమంతా యజుర్వేదంలో దర్శన మిస్తుంది.

వ్యక్తి 'వ్యక్తిగతానికి' మళ్ళాక ఆశలు పచ్చి దురాశ'ల్లా మారడం అనేది సహజ పరిణామమే!!

ఆ దురాశలకి యజ్ఞ వాటికలు కేంద్రాల్లో మారాయి. దేవుడైనా, దేవతైనా, యజ్ఞమైనా, అగ్ని అయినా ... ఎవరైనా సరే ... తన దురాశల్ని తీర్చే సాధనంగా యజుర్వేద ఆర్యులు మార్చేసుకున్నారు. దానికోసం వారికి రకరకాల 'సమర్పణలు'

సమకూర్చుకున్నారు.

ఈ దురాశల్నుండి చివరికి నమ్మకాలు బలపడి, అవి మూఢనమ్మకాలుగా మారాయి.

మంత్రం, నమ్మకం బలం పుంజుకున్నాక, ఋగ్వేద ఆర్యుల కాలంనాటి "కొద్దోగొప్పో" ప్రకృతి ఆరాధనలు, ప్రాకృతిక శక్తుల్ని గుర్తించిన విధానాలు, బుడిబుడి నడకల భౌతికవాద ఆలోచనలు – అన్నీ మట్టికొట్టుకు పోయాయి.

ఆర్య జాతుల్లో మానవీయత అనేదానికి తావులేకుండా చేశాయి. వారిలోని ఆటవిక హింసా ప్రవృత్తికి ఈర్ష్య, అసూయ, ద్వేషం, క్రోధం అనే అజ్యం పోశాయి.

## చేతబడి

ముగ్గులేయడం, దాన్లో పసుపు కుంకుమ చల్లడం, నిమ్మకాయలు ఉంచడం – ఇవ్వన్నీ చేతబడి చేసే విధానాలు. చేతబడి అంటే ఎదుటి వారిని తన్నకుండా, చంపకుండా, ఏదో దైవశక్తిపేరుతో, క్షుద్రశక్తిపేరుతో నాశనం చేయడం. కాలం గడిచాక "క్షుద్రశక్తులు" అనే కొత్త శక్తులు వచ్చిపడ్డాయికానీ, యజుర్వేదంలో దైవశక్తులే చేతబడికి ఉపయోగపడ్డాయి. చేతబడి అనే క్షుద్రపూజా విధానానికి పునాది యజుర్వేదకాలం నాటి యజ్ఞాల్లోనే ఉంది.

**"... భాగధేయేన విముంచితి ప్రతిష్ఠి త్యై యయా రజ్జ్వోత్తమాం గామాజేత్తాం**

**భ్రాతృవ్యాయ ప్రహిణుయాన్నిర్ ఋతిమేవా–స్మై ప్రహిణోతి!"**

–(కృ.యజు : 2–2–6)

"దాతలు దానం చేసిన ఆవుల్లో చివరి ఆవుని ఏ తాడుతో కట్టి ఉంచుతారో, ఆ తాడును శత్రువుల ఆవుల కొట్టంలో పడవేయాలి. అలా చేయడం శత్రువుకు పాపదేవతను పంపినట్లే ..." అని ఈ మంత్రం అర్థం.

ఈ తాడు సంప్రదాయమే ... చేతబడిలో 'దారాలు', 'గుడ్డపీలికలు' గా మారింది.

ఇక చూడండి ... చేతబడిలో బొమ్మవేసి ఆ బొమ్మ అవయవాల మీద ముళ్ళుగుచ్చి, శత్రువు అవయవాల్ని, ప్రాణాల్ని హరించవచ్చు అనే నమ్మకం ఎలా పుట్టిందో చూడండి.

"ప్రజాపతిర్యజః ప్రజాపతిస్తమేవ తర్పయతి స ఏనం తృప్తః ప్రాణాపానాభ్యాం

**వాచో దక్షక్రతుభ్యాం చక్షుర్భ్యాగ్ శ్రోత్రాభ్యామాత్మనో – అంగేభ్య ఆయుషో – న్తరేతి తాజక్రృధన్వతి"**

–(కృ.యజు : 3–2–3)

దీని అర్థం ఇది:

"శత్రువుని హింసించాలనుకునే వాడు యజ్ఞంలో సోమాన్ని నింపిన పాత్రలోకి చూడాలి. సోమమే ప్రజాపతి. ప్రజాపతే యజ్ఞం. అతను తృప్తి చెందితే చాలు. ఆ ప్రజాపతి యజమాని శత్రువు యొక్క ప్రాణ, అపానముల నుండి, వాక్కునుండి, కన్నులనుండి, చెవులనుండి, ఆత్మనుండి, ఇతర శరీర అంగాలనుండి ఆయువును విడదీయును. చివరికి శత్రువు మరణించును".

శత్రునాశనానికి యుద్ధాలు పోయాయి. వీరత్వం పోయింది. ఒక ప్రక్క చేతగాని తనం, మరోప్రక్క క్రౌర్యం, ద్వేషం. పతనాన్ని కళ్ళ చూడాలనుకునే కుటిలత్వం. చేతగాని తనానికి చిరునామాగా యజ్ఞం చేతబడి రూపంలోకి మారింది. ఇలా మారడం కేవలం యజ్ఞయజమానుల చేతగాని తనం ఒక్కటే కారణం కాదు. యజ్ఞాన్ని నిర్వర్తించే పురోహితుల 'చేయితిరిగిన' తనం కూడా.

రోజులకు రోజులు తరబడి, నెలల తరబడి యజ్ఞాల్ని నిర్వహిస్తే హెూత, అధ్వర్యుడు, ఉద్గాతల్లాంటి పురోహితులకు కావలసినంత కాసుల పంట. వారికి తమ లాభసాటి వ్యాపారానికి యజ్ఞనిర్వాహకుల బేలతనం, బెంబేలుతనం రెండూ బాగా ఉపయోగపడ్డాయి. చివరికి అగ్ని, వరుణు, ఇంద్రాది దేవతల కోసం ఋగ్వేద కాలంలో నిర్వహించిన యజ్ఞాల్ని, యజుర్వేద కాలంలో రాజుల జయాపజయాల్ని నిర్ణయించే 'సాధనాలు'గా మార్చేశారు పురోహితులు. అదెలాగో చూడండి:

**"...ప్రమీయతే ఉ భి వా ఏష ఏతస్య గృహానుచ్యతి యస్య గృహాన్దహత్యగ్నయే క్షామవతే పురోడాశమష్టకపాలం నిర్వపేద్భాగధేయే నైవైనగ్ం శమయతి నాస్యాపరం గృహాన్దహతి!"**

(కృ.యజు : 2–2–2)

అంటే...

"శత్రువుని సంహరించాలి అనుకునే వాడు రుద్రదేవత అగ్నికి ఎనిమిది పాత్రల్లో పురోడాశాన్ని అర్పించాలి. అలా చేస్తే ఆ రాజు(యజ్ఞకర్త) తన సేన నడుమ ఉన్నప్పుడు శత్రువుల బాణం తగిలినా మరణించడు. యుద్ధంలో విజయం పొందుతాడు. యుద్ధంలో తనకంటే పెద్దవారు, చిన్నవారు మరణిస్తారు. కానీ, యుద్ధంలో ఇలా బంధువినాశనం జరగకుండా ఉండాలంటే అగ్నికి ఎనిమిది పాత్రల పురోడాశాన్ని సమర్పించాలి".

ఇక, ఇది చూడండి. యజ్ఞతంతును ఎలా నెలలతరబడి కొనసాగేలా పెంచేశారో...!

**"...విశ్వామిత్ర జమదగ్ని వసిష్ఠే**
**-స్పర్ధేతాగ్ం స ఏతజ్జమదగ్నిర్ విహవ్య మపశ్యత్తేన ...**
**... స దేవతా వృంక్తు ఇతి యత్ అగ్నిష్టోమః**
**సోమఃపరస్తాథ్స్యాత్ తత్ ఉక్థ్యం కుర్వీత**
**యద్యుక్థ్యః స్యాద్ అతిరాత్రం కుర్వీత**
**యజ్ఞక్రతుభిరేవా ఉ స్య దేవతా వృంక్తే వసీయాన్భవతి"**

– (కృ.యజు : 3-2-7)

కృష్ణ యజుర్వేదంలోని ఈ పోటీ యజ్ఞాల పరంపరలు చూడండి.

" విశ్వామిత్రుడు, జమదగ్ని అనే ఇద్దరు రుషులు వశిష్ఠునితో తగాదాపడ్డారు. విహవ్య స్తోత్ర బలంతో జమదగ్ని వశిష్ఠుని బలాన్ని నశింపచేశాడు. కాబట్టి యజ్ఞం చేయించే యజమాని "విహవ్య" సూక్తంతో సోమయాగాన్ని చేయిస్తే శత్రువు బలాన్ని హరింపగలడు. ఏ యజమాని ఎక్కువ యజ్ఞాలు చేయిస్తే అతనికే జయం కలుగుతుంది. ఆ యజ్ఞ బలంతో ప్రత్యర్థికి ఆసరాగా నిలబడే దేవతను పడగొట్టవచ్చు. ఒకవేళ యజమాని కంటే ప్రత్యర్థి పన్నెండు స్తోత్రాల "అగ్నిష్టోమ" యాగాన్ని చేస్తే, అప్పుడు యజమాని పదిహేను స్తోత్రాల "ఉక్థ్యనామ" యాగాన్ని చేయాలి. ఒకవేళ ప్రత్యర్థి కూడా ఉక్థ్యనామ యాగాన్ని చేస్తే, 31 స్తోత్రాల "అతిరాత్ర" యాగాన్ని నిర్వహించాలి. అలా చేస్తేనే ప్రత్యర్థి దేవతలను నశింప చేయగలడు. విజయం పొందగలడు. గొప్ప ధనవంతుడు కాగలడు".

ఇదీ వరుస !

ఇక్కడ యుద్ధం చేసే ప్రతివారి పక్షాన ఒక విజయదేవత ఉంటుంది అని మొదట్లో నమ్మేవారు. ఆ దేవత కోసం యజ్ఞాలు చేసేవారు. కానీ ఇక్కడ చూడండి. యజ్ఞంలో ఉన్న స్తోత్ర బలం (మంత్రబలం) ఆ దేవతను కూడా నిర్వీర్యం చేస్తుంది. నాశనం చేస్తుంది. అంటే ... దేవత కంటే మంత్రమే గొప్పది అని చెప్పడం. అలా చెప్పడం అంటే..ఆ మత్రం కంటే మంత్ర కర్తలైన రుత్వికులే గొప్పవారని చెప్పకనే చెప్పడం.

ప్రత్యర్థులైన రాజుల్నేకాదు, వారిని కాచి కాపాడుతారు అనుకునే దేవతల్ని కూడా పట్టి నాశనం చేసే శక్తి మంత్రానికుందని చెప్పడం ఇక్కడ ప్రధానమైన అంశం.

''మంత్ర'' శక్తిని ఇలా 'అజేయంగా' మలచారు యజుర్వేద పురోహితులు.

స్వభావరీత్యా పిరికి పందలైన రాజులు, ఈ మంత్రాల్ని, యాగాల్ని గొప్పగా భావించి, అనుసరించేవారు. సాక్షాత్తు రాజులు, చక్రవర్తులే "మంత్ర" బలాన్ని నమ్ముతుంటే ఇక సాధారణ ప్రజలు నమ్మక ఏం చేస్తారు?

సంస్కృతి, భావజాలం, వ్యాపారం.. ఎప్పుడూ పై వర్గాల నుండి క్రింది వర్గాలకి ప్రాకుతుంది.

(అమితాబ్‌బచ్చన్, చిరంజీవి, మహేష్‌బాబు, టెండూల్కర్, ధోనీలు కూల్ డ్రింకులు తాగుతుంటే చూసి చూసి సాధారణ ప్రజలు ఊరుకుంటారా? అప్పటి నుండి ఇప్పటికీ ఇదే వ్యాపారుల టెక్నిక్.)

ఇలా ... మంత్రబలాన్ని చాలా బలంగా చొప్పించారు యజుర్వేద పురోహితులు.

అందుకే ... ఈ నానుడి వచ్చింది.

**"మంత్రాధీనం జగత్‌సర్వం (జగత్తు మొత్తం మంత్రాధీనమే)**
**మంత్రాధీనం తు దైవతం (దైవం కూడా మంత్రాధీనమే)**
**తన్మంత్రం బ్రాహ్మణాధీనం (ఆ మంత్రం బ్రాహ్మణాధీనం)**
**బ్రాహ్మణో మమ దేవతా! (కాబట్టి బ్రాహ్మణుడే మాకు దేవత)**

ఇలా....యజుర్వేద కాలంలోనే బ్రాహ్మణాధిపత్యానికి బీజం పడింది. వ్యవస్థను శాసించే వాళ్ళు క్షత్రియులే అయినా, వారు కూడా రానురాను భావజాల బంధీలై పోయారు. పురోహిత వర్గాన్ని శాసించే బలాన్ని కోల్పోయారు.

సమాజంలోని మనుషుల్లో కేవలం క్రోధం, కక్షలు మాత్రమే ఉండవు. మానవీయ లక్షణాలు కూడా ఉంటాయి. కానీ, తొలి నుండీ హింసాపూరితులైన ఆర్య సామాజిక వర్గంలోని పురోహిత వర్గం తాము కత్తికి దూరమైనప్పటికీ, కత్తిని తమకు దాసోహం చేసుకున్నారు. మనుషుల్లో ఉన్న క్రోధాగ్నిని రేపారు. యజ్ఞ రూపంలో "కక్షలు" తీర్చుకునేలా చేసి, తాము రేపిన క్రోధాగ్నిని తామే చల్లబరచారు.

మొత్తం మీద మనుషుల మనస్సుల్ని తమ భావజాలంతో కట్టిపడేశారు. పురోహిత వర్గం తమ కుయుక్తులతో భుక్తికి భుక్తి, శక్తికి శక్తి సాధించారు. మంత్రం కంటే మహాశక్తి లేదనే భావాన్ని ఇన్ని వేల సంవత్సరాలుగా బ్రతికిస్తూనే ఉన్నారు. బ్రతుకుతూనే ఉన్నారు. అశేష జనం మాత్రం బ్రతుకీడుస్తూనే ఉన్నారు.

ఎప్పుడైతే ... మంత్రానికి మహిమలంటగట్టారో ... ఇక, పాండిత్యంతో పనిలేదు. యాజకులు విద్వాంసులు కానవసరంలేదు. పురోహిత కులంలో పుట్టిన ఎవరైనా చాలు. నాలుగు మంత్రాలు చదివి నాలుగు రాళ్ళు వెనకేసుకోడానికి.

ఇప్పుడు కాదు, యజుర్వేద కాలానికే 'యజ్ఞవ్యాపారం' మొదలైంది.

కృష్ణ యజుర్వేదం, 2వ ప్రపాఠకం, 11వ అనువాకంలో యజ్ఞోపవీతం (జంధ్యం) గురించి ఉంది. యజ్ఞం చేసే హోత జంధ్యాన్ని ఎడమ భుజం మీదుగా ఉంచుకోవాలి. ఎందుకంటే అది దేవకార్యం కనుక. మానవ కార్యం చేసేప్పుడు మెడలో దండలా వేసుకోవాలి. పితృకార్యం చేసేప్పుడు కుడి భుజం మీదుగా వేసుకోవాలి అని చెప్తూ-

## ఈ 11వ అనువాకంలో ఇలా ఉంది:

**"...మానుషం తద్యదన్తరా తథ్సదేవమన్తరా ఉ నూచ్ఛగ్ం సదేవత్వాయ విద్వాంగ్ సో వై పురా హోతారో ...... పాదో భవతి బహిర్వేద్యన్యో ఉథా ఉ న్యాహా ఉధ్వనాం ... అథో భూతం చైన భవిష్యచ్చా ఉవ రున్ధే ఉథో పరిమితం ..."**

-(కృ.యజు : 2-5-11)

అంటే...

"పూర్వం విద్వాంసులే హోతలుగా ఉండేవారు. వారు కుడి పాదాన్ని వేది బైట, ఎడమ పాదాన్ని వేదిలోపల ఉంచలేదు. కాబట్టి ఇప్పటి హోతలు కూడా అదే విధానం పాటించాలి. ఇలా కుడి పాదం వేదిలో ఉంచడం వల్ల భూతకాల ఫలం, ఎడమ పాదం వేది బయట ఉంచడం వల్ల భవిష్యత్ కాల ఫలం లభిస్తుంది. మొదటిది పరిమిత ఫలం. రెండోది అపరిమిత ఫలం" అని.

ఈ మంత్రం రెండు విషయాల్ని మన ముందు ఉంచుతుంది.

ఒకటి : వేదిలో నిలబడే విధానాన్ని బట్టి కూడా ఫలితాలుంటాయనే నమ్మకం.

రెండు : యజుర్వేద కాలం నాటి పురోహితులు కంటే అంతకు పూర్వం ఉన్నవారే పండితులు, విద్వాంసులు అనే విషయం. ఈ రెండో విషయమే కీలకం. ఎందుకంటే పండితులు కానప్పటికీ, తమ పూర్వీకుల్ని అనుకరిస్తే చాలు. అంటే జ్ఞానం పొంది, విద్వాంసులు కానవసరం లేదు. పురోహిత పుటుక పుడితే చాలు? చిలుక పలుకుల్లా నాలుగు మంత్రాలు వల్లిస్తేచాలు! అదే గౌరవం. అదే హోదా. అదే ఆదాయం.

**ఇలా, పాండిత్యాన్ని బట్టికాక జన్మను బట్టి బ్రాహ్మణత్వాన్ని కుటుంబ, కుల వారసత్వంగా అంది పుచ్చుకోవడం యజుర్వేద కాలం నుండే మొదలైంది.**

కులానికి కుదురు చేసింది ఈ మంత్ర 'వారసత్వమే'!

ముచ్చటగా మూడుసార్లు

మన భావజాలంతో ఇప్పటికీ "మూడుసార్లు" అనే విధానం పాతుకుపోయింది.

"నేను మూడుసార్లు చెప్తున్నా" నేను మూడు సార్లే చెప్తా" అంటూ ఉంటాం. ఒక విషయానికి కౌంట్‌డౌన్ - మన భారతీయులకి ''మూడు''. కొన్ని దేశాల్లో పదితో మొదలవుతుంది. 10 ... 9 ... 8 ... 7 ... ఇలా ...

యజుర్వేద కాలానికి వేదాలు మూడు. రుగ్వేదం, సామవేదం, యజుర్వేదం, రుగ్వేద మంత్రాల్ని రుక్కులు అంటారు. సామవేద మంత్రాల్ని "సామాలు" అనీ, యజుర్వేద మంత్రాన్ని "యజస్సులు" అంటారు.

దేవతలకి వినగా వినగా ... రుక్కులుగానీ, యజస్సులుగానీ రుచించలేదట. సాగదీసి సాగదీసి రాగాలుగా పాడే సామాలంటేనే ఇష్టపడ్డారట. ఇక, అప్పుడు యజ్ఞంచేసే వారు ఏం చేయాలి? వారు బాగా ఆలోచించి, ప్రతి యజస్సునీ, రుక్కునీ మూడేసి సార్లు ఉచ్చరించడం మొదలు పెట్టారట.

**కాబట్టి హోత ... "హిం ... హిం ... హిం ..." అంటూ మూడుసార్లు ఉచ్చరించాలి.**

**మొదటి "హిం" శబ్దం సామగానం చేసినట్లు.**

**రెండో "హిం" శబ్దం దేవతలకు సంతోషం కలిగించినట్లు.**

**మూడో "హిం" శబ్దం యజమానికి ఫలితాన్ని ఇచ్చినట్లు.**

**"దేవా వై నర్చి న యజష్యశ్రయన్త తే సామన్నేవా -శ్రయన్త హిం కరోతి**

**సామైవా -కర్ హిం కరోతి యత్రైవ దేవా ఆశ్రయన్త తత ఏవైనాన్ప్ర యుంక్తే హిం కరోతి**

**వా చ ఏవైష హిం కరోతి ప్రజా ఏవ తద్యజమానః సృజత్త్రిః"**

-(కృ.యజు : 2-5-7)

మొదటి సామిధేని రుక్కును మూడుసార్లు ఉచ్చరిస్తే - యజమానికి సంతానం కలుగుతుంది.

మొదటి రథంతరి రుక్కును మూడుసార్లు ఉచ్చరిస్తే - లోకాన్నంతా జయించవచ్చు.

రెండో సామిధేని రుక్కును 3 సార్లు ఉచ్చరిస్తే - శత్రు వినాశనం.

మూడో సామిధేని రుక్కును 3 సార్లు ఉచ్చరిస్తే - మూడు లోకాల్నీ జయించవచ్చు.

ఇలా ... కృష్ణ యజుర్వేదం 2వ కాండ, ఐదో ప్రపాఠం, ఏడో అనువాకం నుండి 12వ అనువాకం వరకూ ఎన్నో విషయాలున్నాయి.

ఇవ్వన్నీ మంత్ర ప్రభావం వల్ల సిద్ధిస్తాయి అని నమ్మబలికిన నమ్మకాలే!

## దక్షిణం ఎత్తుగా

ఈనాడు వాస్తు శాస్త్రంలో నేలకు సంబంధించిన విషయంలో దక్షిణం మెరకగా ఉండాలి. తూర్పు, ఉత్తరాలు పల్లంగా ఉండాలి అనేది ఒక వాస్తు నమ్మకం ఉంది. ఈ నమ్మకానికి కూడా మూలం యజుర్వేదంలోనే కన్పిస్తుంది.

యజ్ఞవేది నిర్మాణం కోసం నేలను త్రవ్వాలి. ఈపని యజ్ఞకర్తల్లో ఒకడైన అధ్వర్యుడు చేయాలి. నేల శుభ్రం చేసి గడ్డిని తీసేయాలి. మట్టి తీసిన చోట ఏవైనా చెట్ల వ్రేళ్ళు ఉంటే వాటిని పూర్తిగా తొలగించాలి. వేది కొలతల ప్రకారమే మట్టిని తవ్వాలి. ఎక్కువ త్రవ్వ కూడదు. నేల గట్టిగా తగిలే వరకూ తవ్వాలి.

భూమిని తవ్వేప్పుడు దక్షిణాన ఎత్తుగా మిగిలినది పల్లంగా ఉండేట్టు తవ్వాలి. అలా ఉండడం వల్ల ఆ స్థలం దేవతల నివాసమగుతుంది. యజ్ఞ భూమి మెత్తగా ఉండేట్టు చూడాలి. అలా చేయడం వల్ల యజమాని సంతానవంతుడు అవుతాడు. పశుసంపద కలుగుతుంది.

ఈనాడు వాస్తులో కనిపించే కొన్ని విషయాలు ఇలా యజ్ఞవేది నిర్మాణం నుండి పుట్టినవే!

## పశుబలి - ఫలితాలు

యజుర్వేదంలో మంత్రాలతోపాటు, యజ్ఞంలో ఏయే జంతువుల్ని బలిస్తే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో పెద్ద లిస్టే ఉంది. నమ్మకాలుగా మారిన యజ్ఞబలుల జాబితా తయారుచేస్తే వంద పేజీల పుస్తకం అవుతుంది.

ఈ జాబితా వల్ల తేటతెల్లం అయ్యే విషయం ఏమంటే..

యజ్ఞాన్ని పురోహితులు విస్తృత పరచారు అనేది. ప్రకృతి శక్తుల గురించి తొలుత నిర్వహించిన యజ్ఞాలు, ఆ తర్వాత రాజుల యుద్ధ విజయాలుగా మారాయి. ఇక, ఆ తర్వాత అవి మరింతగా విస్తరణ పొంది, వ్యక్తిగత ఇబ్బందుల్ని తొలిగించుకోడానికీ, రోగాలకీ రోష్టులకీ, పిల్లికీ బిచ్చానికీ ... ప్రతిదానికీ "మంత్రమే" ముందు కొచ్చేసింది. యాగ తంత్రమై ముంచుకొచ్చింది. చివరికి యజ్ఞాల్లో "నరబలి" వరకూ పోయింది. ఇది ఎందాకా పోయిందంటే...ఒక్కరుకాదు, ఇద్దరు కాదు - **వందలాది మందిని యజ్ఞబలి స్థంభాలైన యూప స్థంభాలకి కట్టి, తలల్ని నరికి, అగ్ని గుండంలో కాల్చే అమానుష కార్యం వరకూ మనకు శుక్లయజుర్వేదంలో కన్పిస్తుంది. ఇందులో 30వ అధ్యాయం మొత్తంలో వర్ణ, కుల, జాతి, లింగ, ప్రాంతీయ, వృత్తి, ఉద్యోగ తదితర విభాగాలకు చెందిన వారు 158 మందిని యూపాలకు కట్టినట్లు ఉంది. ఈ ఘోరకలికి సాక్ష్యం గా నిలచిన మంత్రాల్లో ఇది ఒకటి:**

**"బ్రాహ్మణే బ్రాహ్మణం క్షత్రాయరాజన్యం మరుద్భ్యో వైశ్యం తపసే**

**శూద్రం తమసే తస్కరం నారకాయ వీరహణం పాప్మనే క్లీబమాక్రయా**

**య -అయోగూం కామాయ పుంశ్చలూమతి క్రుష్టాయ మాగధం!"**

-(శు.యజు.30-5)

"బ్రాహ్మణుని కొరకు బ్రాహ్మణుని, క్షత్రియుని కోసం క్షత్రియుని, మరుత్తుల కొరకు వైశ్యుని, తాపసుల కోసం శూద్రుని, చీకటికి దొంగను, నరకానికి అగ్నిని కోల్పోయిన వానికి, పాపానికి నపుంసకుని, యోగ్యతలేని వారికి అయోగ్యులను, కామానికి వ్యభిచారిని, కృష్ణులకు మాగధుల్ని - కట్టు చున్నాను" అని ఈ మంత్రార్థం.

ఇలా మొత్తం 158 మంది జాబితా ఉంది. ఇదంతా నరబలే.

కృష్ణయజుర్వేదం 2-1-1లో యజ్ఞంలో బలి ఇవ్వాల్సిన ఐదు "గ్రామ పశువుల" గురించి ఉంది. ఆ ఐదూ **- మగవాడు, గుర్రం, ఆవు, గొర్రె, మేక. వీటిని యజమాని యాగం కోసం సిద్ధం చేయాలి అని ఉంది.**

అలాగే .....అజీగర్త కుమారుడు శునశ్శేపుని కథ కూడా నరబలికి నిలువెత్తు సాక్ష్యం.

మనదేశంలో 1846లోనే విలియం బెంటిక్ నరబలి నిషేధ చట్టం తెచ్చాడు. వేదసంస్కృతే ఘనం అనుకునే మతమూర్ఖులు వేదంచెప్పిందే పవిత్రంగా భావించి ఈ చట్టాన్ని వ్యతిరేకించి, నరబలిని సమర్థించినా ఆశ్చర్య పడాల్సిందిలేదు. ఎందుకంటే ..మతంకంటే మత్తుమందు ఏముంది?

నేను ఇంతకు ముందే చెప్పినట్లు యజుర్వేదంలో జంతుబలి మొత్తం వివరించడం ఇక్కడ అనవసరం.

కృష్ణయజుర్వేదంలో రెండవ ప్రపాఠకంలోని 4 నుండి 9 అనువాకాలలో ఉన్న కొన్నింటికి ఒక పట్టికలా ఇస్తాను.

| మంత్రాల సంఖ్య | దేనికోసం | దేనిని బలి ఇవ్వాలి | |
|---|---|---|---|
| **4వ.అనువాకంలో :** | | | |
| 1-7: | బ్రహ్మవర్చస్సు కోసం: | వసంత కాలం ఉదయాన-నొసట నామం ఉన్న ఎద్దులు | =3 |
| | | వేసవి కాలం మధ్యాహ్నం తెల్లని వెనుక భాగం ఉన్న ఎద్దులు | =3 |
| | | శరత్కాలం సాయంత్రాన తెల్లని తోక ఉన్న ఎద్దులు | =3 |
| | | సంవత్సరం చివరన, పింగళి వర్ణం ఉన్న ఎద్దు | =1 |
| | | మొత్తం : | 10 |
| 8 | చర్మ రోగం పోడానికి | :నల్లని ఎద్దును | |
| 9, 10 | వివాదాలు ఉన్నవారు | : గొడ్డుమోతు ఆవుని, ఒక ఎద్దుని | |
| 11,12 | పాపాల నుండి రక్షణకోసం | :నల్లని మెడ ఉన్న ఎద్దుని | |
| 13,14 | రాజ్యం కోల్పోయిన వాడు | : పాలిచ్చు ఆవుని వధించాలి | |
| 15 | చిరకాలం రాజ్యం కోల్పోయినవాడు: | ఆవు దూడని వధించాలి | |
| **4వ.అనువాకంలో** | : | | |
| 1,2,3,4 | పశు సంపద కోసం | : మంచి ఆవుని | |
| 5 | :వేయి పశువుల కోసం | : పొట్టి ఆవుని | |
| 6 | సంతానం కోరువారు | : చూడి ఆవుకి గర్భస్రావం కోసం మందు ఇవ్వాలి. దానికి గర్భస్రావం కాగానే దాన్ని బలివ్వాలి | |
| 7,8 | ఐశ్వర్యం కోసం | : ఒకసారి ఈని, ఆ తర్వాత గొడ్డుమోతుదైన ఆవుని బలివ్వాలి | |
| 9,10,11 | తాత, తండ్రి, తాను వంశం మొత్తం తాగుబోతులైతే : కొంత కాలం పొలం దున్ని మానిన ఎద్దుని బలివ్వాలి | | |
| 12 | శత్రువుకి హాని తలపెట్టువాడు: కొమ్ములు రాని కోడెను | | |
| 6వ.అనువాకంలో | : | | |
| 1,2,3 | - బ్రహ్మ వర్చస్సు కోసం - తెల్లని గొడ్డుమోతు ఆవు | | |
| 4 | -వర్షం కోసం - రెండు రంగుల్లో ఉన్న (నల్లని, తెల్లని) ఆవుని | | |
| 5 | -సంతానం కోసం - రెండు రంగుల ఆవు | | |
| 6 | -అన్నం కోసం - రంగు రంగుల ఆవు | | |
| 7 | -గ్రామాధికారం కోసం - బహు వర్ణములు గల ఆవు | | |
| 8,9 | -బ్రహ్మ వర్చస్సు కోసం - ఆవుల వెంట తిరుగు ఆబోతుని | | |
| 10 | -శత్రు సంహారం కోసం - ఎర్రని ఎద్దు | | |
| 7వ.అనువాకంలో | : | | |
| 1,2,3 | -బ్రహ్మవర్చస్సు కోసం - తెల్లని గొడ్డుమోతు ఆవుని | | |
| 4,5,6,7 | -శత్రు వధ కోసం - పింగళ వర్ణం చెవులున్న ఆవుని | | |
| 8 | -యజ్ఞం చేసేవారు - పొట్టి ఆవుని | | |
| 9,10 | -పశు సంపద కోసం - 'వడబ' అనే ఆవుని బలివ్వాలి. (మగది అయ్యి, ఆడ లక్షణాలు కల్గినది 'వడబ') | | |
| 11 | -సంధి కోరు వారు - తెల్లని ఆవుని | | |
| 13,14 | -వర్షం కోసం - నల్లని ఆవు | | |
| | మెరుపులతో కూడిన వర్షం కోసం - పశువు రంగు కలిగిన నల్లని ఆవు | | |
| | వర్షం ఆపడానికి - ముఖం వైపు వంపు తిరిగిన కొమ్ములున్న ఆవు | | |
| **8వ.అనువాకంలో** | : | | |
| 1,2,3,4 | -ఆహారం కోసం - నల్లని గొడ్డుమోతు ఆవుని, తెల్లని ఆవుని | | |

| | |
|---|---|
| 5,6 | –దీర్ఘ రోగం పోడానికి – తెల్లని, నల్లని ఆవుల్ని బలివ్వాలి |
| 7,8 | –మిధున పుష్టి కోసం – ఆడ గొడ్డుమోతు ఆవు |
| **9వ.అనువాకంలో** | : |
| 1 | –బ్రాహ్మణుడు కానివాడు సోమరసాన్ని కావాలని కోరుకుంటే – నొసట తెల్లని మచ్చ, బూడిద వర్ణం కలిగిన ఆవు |
| 1,2 | –ఇల్లూ, పొలం గొడవలున్నవారు – పొట్టి ఆబోతును వధించాలి |
| 3,4 | –యుద్ధంలో విజయం కోసం – నొసట తెల్లని నామము, ముఖం వైపుకు తిరిగిన కొమ్ములున్న ఎద్దు |
| 5,6,7 | – గ్రామాధికారం కోసం – తెల్లని తొడలున్న ఎద్దును |
| 8,9 | – ఆహారం కోసం – పింగళ వర్ణం గల ఎద్దును (ఇత్తడి, బంగారం రంగు) |
| 10 | – సమర్ధుడై, రాజ్యంలేని వాడు – పింగళి వర్ణం ఎద్దును |
| 11 | – సంపద కోల్పోయి, కోల్పోయిన దాన్ని తిరిగి పొందాలి అనుకునేవాడు – నొసట నామం, ముఖం వైపుకు తిరిగిన కొమ్ములున్న ఎద్దు |
| 12 | –చేసిన పాపం నుండి (నరకం) బైట పడడానికి – నొసటన నామం, ముఖం వైపుకు తిరిగిన కొమ్ములున్న ఎద్దు |
| 13 | –సమర్ధుడై, రాజ్యంలేని వాడు – నొసటన నామం, ముఖం వైపుకు తిరిగి కొమ్ములున్న ఎద్దు |

ఇవి కొన్ని మాత్రమే! కాదనే వారు, ఇంకా కావాలనుకునేవారు యజుర్వేదం చదవాల్సిందే!

మానవీయతను మట్టిచేసి, హింసా, ద్వేషాలకి తెరలు తీసి, మంత్రాలకు మహిమల్ని చేర్చి, విజ్ఞానానికి పాతర వేసి, లేని నమ్మకాల్ని పుట్టించి, వాటిని మూఢనమ్మకాలుగా మార్చి, జీవజాతుల రక్తంతో కళ్ళాపి చల్లి, మూఢనమ్మకాల ముగ్గులు వేసి, అంధకార భారతానికి ఆహ్వానం పలికింది యజుర్వేదం.

**భారత చరిత్రలో తిరోగమనానికి తిరుగులేని సాక్ష్యంగా నిలబడింది!!!**

*(ఇంకావుంది)*

# ఎన్నికల గోదాలోకి సాములోర్లు!

"మంత్రి పదవిలో వున్న మజా, అనుభవించితే తెలియునులే రాజా!" అని పాడుకుంటున్నారు సర్వసంగ పరిత్యాగులమని కాషాయ వస్త్రధారణతో, తమను తాము వ్యక్తీకరించు కునే స్వాములోర్లు. తమ కళ్లముందే తమ సహచరులయిన అయిదుగురు సాధువులు కేబినెట్ మంత్రుల హోదాలో అనుభవిస్తున్న భోగ భాగ్యాలు మిగిలిన వారినీ ఊరింపచేస్తున్నాయి. 2018 ఏప్రిల్‌లో మధ్య ప్రదేశ్ ప్రభుత్వం అయిదుగురు హిందూ సాధువులకు కేబినెట్ మంత్రి హోదా కట్టబెట్టింది. వీళ్లెవరూ ఎన్నికల్లో నిలిచి గెలిచిన వారు కాదు. నర్మదానంద మహరాజ్, హరిహరానంద మహరాజ్, స్వామీ నామ్‌దేవ్ త్యాగి, భయ్యూ మహరాజ్, పండిత్ యోగేంద్ర మహంత్ – అనే అయిదుగురికి మంత్రి హోదా యివ్వటాన్ని ప్రతి పక్షాలు గట్టిగానే విమర్శించాయి. అయినా, ముఖ్య మంత్రి శివరాజ్ చౌహాన్ ఖాతరు చేయలేదు. ఆ "సాధువు"ల నోరుమూయించకపోతే, తన కొచ్చే యిబ్బందులాయనకు తెలుసు. పై వారిలో నామ్‌దేవ్ త్యాగి అనే వ్యక్తి ఏప్రిల్‌లో "నర్మదఘటోలా (కుంభకోణాల) రథయాత్ర" కు శ్రీకారం చుట్టాడు. నర్మదా నది ఒడ్డున మొక్కలు నాటడంలో జరిగిన కుంభకోణం, చట్ట వ్యతిరేకంగా ఆ నదీ తీరంలో జరుగుతున్న ఇసుక వ్యాపారంలో గుట్టును బయట పెట్టటానికి ఆ యాత్రను చేపడుతున్నానని త్యాగి ప్రకటించగానే, సాధువులంతా ఉద్యమిస్తే కలిగే ఉపద్రవాన్ని గుర్తించి వెంటనే త్యాగితో సహా అయిదుగురికి మంత్రి హోదాలిచ్చేసాడు ముఖ్యమంత్రి. "మరి మాసంగతేమిటి?" అని ఇపుడు మరి కొందరు సాధువులు ఉరిమి చూస్తున్నారు. రాబోతున్న ఎన్నికల్లో ఎం.ఎల్.ఎ. టికెట్‌లిమ్మని డిమాండ్ చేస్తున్నారు. బాబా అవధేష్‌పురి (ఉజ్జయిని), మహరాజ్ మదన్ మోహన్ ఖాదేశ్వరి (కియోలరి), యోగి రవినాథ్ (రైసన్), మహంత ప్రతాప్ గిరి (సిల్లాని)లు తమకు బిజెపి టికెట్లివ్వాలని, యివ్వకపోతే ఇండిపెండెంట్‌గానో, లేదా, కాంగ్రెస్ తరపునో పోటీ చేస్తామని బహిరంగంగా బెదిరిస్తున్నట్టే చెప్తున్నారు. ఇప్పటికే కొందరు ప్రచారమూ మొదలుపెట్టారు. కాషాయాంబర ధారణే రాజకీయ పదవులకు అర్హత అయితే, ప్రజలకు దక్కేది విబూదేనని ఆ రాష్ట్ర ప్రజలు లోలోపల గొణుక్కుంటున్నారు.

# ఈ సంతాన సాఫల్యత ఒక రోత

## (నీకు మాయరోగం రాను..!)

"గణానాం త్వా గణపతిం హవామహే ప్రియాణాం త్వా ప్రియపతిం హవామహే

నిధీనాం త్వా నిధిపతిం హవామహే వసో మమ ఆహమజాని గర్భధమా త్వమ జాసి గర్భధం"

(పత్నులు ముగ్గురూ గుర్రం చుట్టూ తొమ్మిదిసార్లు తిరిగి) *"ఓ అశ్వమా! గణాల్లో శ్రేష్టుడవగు, గణపతి వగు నిన్ను యాచించు చున్నాము. ప్రియులందు ప్రియపతివగు నిన్ను యాచించు చున్నాము. సుఖ నిధులందు శ్రేష్ఠంగా సుఖించేవారికి అధిపతివగు నిన్ను యాచించు చున్నాము"* అంటూ..(గుర్రం ప్రక్కలో పడుకొని) *"ఓ! వసువుల రూపమైన గుర్రమా! నీవే మా భర్తవి. గర్భాన్ని కలిగించు నీ తేజాన్ని గుంజి యోనియందు ఉంచు కొంటున్నాను. నాకు గర్భాన్ని కలిగించు"*

**-(శుక్ల. యజు : 23 - 19)**

### అనుభవం ఓడితే...!

గత సంచికలో వచ్చిన మంత్ర తంత్రాలు, చేతబడుల విషయంలో మరి కొంత సమాచారం కావాలని కొందరు మిత్రులు ప్రత్యేకంగా అడిగారు. నిజానికి ఆ సంచికలో నిడివి రీత్యా కొంత సమాచారాన్ని తగ్గించి ఇవ్వవలసి వచ్చింది. ఈ సంచికలో ... స్త్రీల గర్భధారణ విషయంలో యజుర్వేదంలో ఎంత జుగుప్సాకర సంఘటనలు ఉన్నాయో, అవి ఎలా అశాస్త్రీయమో చెప్పుకునే ముందు, కొద్దిగా చేతబడుల విషయాల్ని కూడా చూద్దాం -

మానవ సమాజం అనేక నాగరిక దశల్ని దాటుకుని ఈ దశకు వచ్చింది. ప్రపంచంలో మానవ సమాజాలన్నీ ఒకే విధమైన సంస్కృతిని ఎలా కలిగి లేవో, ఒకే రకమైన విజ్ఞానాన్నీ అలాగే కలిగిలేవు. ఆయా ప్రాంతాల్ని బట్టి వారి వారి జీవన వైరుధ్యాల్ని బట్టి ఒక్కో సమాజ విజ్ఞానం ఒక్కో స్థాయిలో ఉంది.



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

ప్రతి సమాజం అనుభవాల్ని గ్రహిస్తుంది. కానీ, తాను గ్రహించిన అనుభవాల్ని శాస్త్రంగా, శాస్త్రీయంగా మలచుకోవడంలోనే దాని పురోగతి ఉంటుంది. ఈ మలుపే చరిత్రలో చాలా కీలకమైన అంశం. ఇక్కడ ఈ మలుపు దగ్గరే సనాతన భావజాలం, ఆధునిక అనుభవం రెండూ తీవ్రంగా సంఘర్షించుకుంటాయి. ఈ సంఘర్షణలో 'అనుభవం నెగ్గితే' అది వైజ్ఞానిక ఆవిష్కరణగా నిలబడుతుంది. శాస్త్రంగా సమాజాన్ని ముందుకు నడిపిస్తుంది.

ఒకవేళ, అనుభవం ఓడిపోతే ... సనాతన భావమే మూఢనమ్మకంగా నిలబడి సమాజాన్ని మూర్ఖంగా, మూఢంగా మార్చేస్తుంది. సమాజం వెనక్కు నడుస్తుంది. లేదా 'ఎక్కడ వేసిన గొంగలి అక్కడే' అన్నట్లు అక్కడే చతికిలబడి పోతుంది.

ఇది ఆర్య సమాజంలో చాలా స్పష్టంగా కనిపిస్తుంది. రుగ్వేద కాలంనాటి ఆర్యుల్లో ఏదోకొంత వెతుకులాట కనిపిస్తుంది. అనుభవాల్ని పంచుకోవడం, అనుభవ జ్ఞానాన్ని బట్టి సామాజిక రంగాన్ని నిర్మించుకోవడం అనేక సందర్భాల్లో చూస్తాం. కానీ -

యజుర్వేద కాలంలో ఈ వెతుకులాట "అనుభవాల క్షేత్రం నుండి'', అసంబద్ధాల క్షేత్రానికి మారి పోయింది. దీనికి తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలనుకున్న క్షత్రియులతోపాటు, భావజాల పరంగా అగ్రస్థానాన్ని ఆక్రమించాలనుకున్న పురోహిత వర్గం మరోకారణం. నిజం చెప్పాలంటే సంఖ్యాపరంగా బలహీనమైన పురోహిత వర్గం బలమైన భావజాల వర్గంగా రూపొందే క్రమంలో "సామాజిక అనుభవాల్ని" తుంగలో తొక్కేసి మొత్తం సమాజాన్ని తన కనుసన్నల్లోకి తెచ్చేసుకుంది.

అది మంత్రంతో, యజ్ఞంతో వారికి సాధ్యం అయ్యింది. వైదిక పురోహిత భావజాలానికి అఖండ భారతం

బంధీగా మారిపోయింది.

యజుర్వేద కాలంలో భారత దేశం మూఢనమ్మకాలవైపు మళ్ళింది. అశాస్త్రీయత వైపుకు అడుగులు సాచింది.

## హింస బలి నుండి బానిసత్వానికి

మానవ సమాజం మొత్తం హింస నుండి అహింసకు మళ్ళిందనేది చారిత్రక వాస్తవం. ఆటవిక సమాజాల్లో బలమైన సమాజం, బలహీనమైన సమాజంపై దాడి చేసినప్పుడు ఆ సమాజం మొత్తాన్ని నిర్ధాక్షిణ్యంగా చంపిపారేసేవారు. దయ, జాలి అనేవి ఏ మూలనా కనిపించేవి కాదు. ఆహారంగా పశువుల్ని వధించడం, తినడం మాత్రమే వారికి తెలుసు.

సమాజంలో వచ్చిన మార్పువల్ల జంతువుల్ని చంపి తినడం కంటే ... వాటిని పెంచుకుని పాలు త్రాగడం వల్ల కూడా ఆరోగ్యంగా, బలంగా బ్రతకొచ్చు అని తెలుసుకున్నాడు. చంపి తినడం మాని పెంచుకుని ఫలితం పొందగలిగాడు. ఆ విధంగా అడవుల్లో స్వేచ్ఛగా తిరిగే జంతువులు మనిషికి ''బానిసలయ్యాయి''.

ఇలా ''బలి'' సమాజం ''బానిస'' సమాజంగా మారింది.

"బలి" సమాజంలో ఉత్పత్తి ఉండదు. ఉత్పత్తి శక్తులు ఉండవు. మానవ శ్రమగానీ, జంతువుల శ్రమగానీ ఉత్పత్తిగా మారదు. నిజంగా, ఖచ్చితంగా చెప్పుకోవాలంటే ... ఉత్పత్తి తెలిశాకే 'బలి సమాజం' బానిస సమాజంగా మారింది. ఆ సమాజం జంతువుల బలాన్ని ఉత్పత్తిగా మార్చుకుంది.

కాలాంతరంలో.... చివరికి ఇదే విధానంలో జంతువుల్లా మనుషులూ బానిసలయ్యారు.

మనిషిని చంపడం కంటే ... చాకిరి పేరుతో చంపుకుతినడం సమాజానికి మేలు చేసింది. దీనివల్ల పరాజితులకు ఊపిరి నిలచింది. విజేతలకు ఉత్పత్తి పెరిగింది. ఈ మార్పు నూతన ఆర్థిక సంపన్న వర్గాల్ని సృష్టించింది.

నిర్ధాక్షిణ్యంగా చంపడం అనేది అమానవీయ విషయమే. మనిషిలోని కోపానికీ, ప్రకోపానికీ, రక్తదాహానికీ అది ప్రతీక. ఈ ప్రకోపాలు తొలగి సమాజాలు మారినంత తేలిగ్గా మనిషి ఆలోచనలు పూర్తిగా మారిపోవు. అలాంటివారు 'ఎదుటివారిని చంపడం" ఒక అవసరం అని చెప్పుకోవడం పరిపాటి. వారు చెప్పుకునే అవసరం ఆహారం కావొచ్చు, అధికారం కావొచ్చు, అహంకారం కావొచ్చు. విద్వేషం, వ్యామోహం ఏదైనా కావొచ్చు.

ఈలాంటి మనోస్థితులు నిజంగా అమానవీయమే. ఇలాంటి ఆలోచనల్ని రేకెత్తకుండా అణచుకుంటే , క్రమేపీ ఆ ఆలోచనలకి దూరంగా ఉంటూ ఉంటే, దాన్ని ఒక అలవాటుగా చేసుకుంటే, మనిషి ఆలోచనల్లో 'హింస' క్రమేపీ సమసిపోతుంది. అప్పుడు మానవ వాదమో, మానవీయవాదమో చిగురిస్తుంది.

చార్వాకులు, బుద్ధుడు, ఉపనిషత్‌కారులు ఈ హింసా ప్రవృత్తిని చాలా వరకూ మార్చాలని చూశారు. చివరికి ఉపనిషత్తుల సారం గీతలో శ్రీకృష్ణుని నోట్లో పడ్డాక అవీ 'హింసా'వాదాన్నే నెత్తికెత్తుకున్నాయి.

అటు జంతువుల విషయంలో గానీ, ఇటు మనుషుల విషయంలోగానీ, మానవీయతా దృక్పదం అన్నది వేదాల్లో జల్లెడ వేసి వెదికినా దొరకదు. ఈ కారణంగానే వేదకాలం( క్రీ.పూ.1700 నుండి క్రీ.పూ.800 వరకు) యజ్ఞయాగాల రూపంలో జంతుహింస అతి భీభత్సంగా కొనసాగింది. అలాగే మానవహింస కూడా. ఎంతగా సాగిందంటే ... తాము భౌతికంగా ఎదిరించలేక పోయిన వారిని కూడా ఏదో ఒక విధంగా ... కనీసం తమ ఆలోచనల్లోనైనా సరే మట్టుబెట్టాల్సిందే ...! అన్నంతగా సాగింది.

మనిషిలోని ఈ అమానవీయ హింసా ప్రవృత్తిని, క్రూరమైన కాంక్షని, మంత్రాల ద్వారా, తంత్రాల ద్వారా తీరేట్టు చేసి, లేదా తీరుతుందని నమ్మించి, హింసాకారుల మనస్సును శాంతింప చేసే ప్రక్రియలు యజుర్వేద కాలంలో బాగా ఊపందుకున్నాయి. ఆ కార్యక్రమాలే, ఆ తరువాత అనంతర కాలంలో "చేతబడుల" రూపంలో వికృత వేద అవశేషాలుగా మిగిలిపోయాయి.

మనుషుల్లోని ఆటవిక ప్రవృత్తికీ, జీవహింసకీ జీవంపోసే యజుర్వేదంలోని తంతుల్ని కొన్ని చూద్దాం.

## చేతబడి ఒక వికృత వేద అవశేషం

ఎదుటివారు నశించాలి. నాశనం కావాలి. ఏ విధంగానైనా సరే వారు నాశనమైతే చాలు

**"యస్తే సహస్రం హేతయో అన్యమస్మిన్ని వసస్తు తాః!"**

(శు.యజు : 16-52)

దీనర్థం ఇది :

"భగవాన్! నీ దగ్గర వేల వేల వ్యాధులున్నాయి. వాటిని మా శత్రువు మీదికి ప్రయోగించు" అని.

**"సహస్రాణి సహస్రశో బాహ్వోస్తవ హేతయః**
**తాసా మీశానో భాగవం పరాచీనా ముఖా కృధి"**

(శు.యజు : 16 53)

"హే రుద్రా! నీ చేతిలో వేలాది రోగాలున్నాయి. వాటికి నీవే అధిపతివి. వాటిని మా వైపు రానీకు. అటే మళ్ళించు" – అంటే శత్రువుల వైపుకే పంపించు" అని. అంటే రుద్రునికి యజ్ఞంలో జంతుబలి చేసి, జంతువుని అర్పించినందుకు గాను ఆయన తమ శత్రువులకు రోగాలు రప్పించాలని వేడుకుంటున్నారు ఆర్యులు.

ఇదే ... ఈ భావనే ఇప్పటికీ కొందరిలో బలంగా కొనసాగుతూనే ఉంది.

''చేతబడి చేసి, శతృవుకి కోలుకోలేని రోగాలు తెప్పించవచ్చు అని నమ్మేవారు, నమ్మబలికేవాళ్ళు ఇప్పటికీ ఉన్నారు.

గ్రామాల్లో సాధారణ తిట్లలో ఈ అసాధారణ 'వేద విధానాన్ని చూడగలం ..."

"నీకు రోగం రాను", "నీకు పుండు పుట్ట", "నిన్ను కలరా ముట్ట'', "నీకు మాయ రోగం పుట్ట" – అంటూ శాపనార్ధాలు పెడ్తారు – ఇవన్నీ 'పవిత్ర' వేద వాక్కులే!

మనది వేద సంస్కృతి అంటారు గదా! అంటే ఇదేనేమో!

ఇంకా ఇది చూడండి

**"సుమిత్రయా న–ఆప –ఓషధయ్ణ సంతు దుర్మిత్రియాస్తస్మై సన్తు యోఽస్మాన్ ద్వేష్టియం చ వయం ద్విష్మః"**

(శు.యజు : 20–19)

"మాకు ఔషధాలు మంచి మిత్రులు కావాలి. కానీ, మేము ద్వేషించేవారికి, మమ్ము ద్వేషించేవారికి దుష్టమిత్రులు కావాలి" – అని పై మంత్రం అర్థం. అంటే ... వారికి వినాశనం కలిగించాలి అని.

నిజానికి ఇలాంటి దుష్ట ఆలోచనలు రుగ్వేదంలో కనిపించవు. అశ్వనీ దేవతలుగానీ, మిగిలిన రుషులుగానీ రకరకాల ఔషధాలు ఉపయోగించి జబ్బుల్ని నయం చేసినట్లు ఉంది. అలా జబ్బుల్ని తగ్గించినందుకుగాను వారిని కీర్తించినట్లు ఉన్న రుక్కుల్ని రుగ్వేదంలో చూస్తాం. కానీ, ఔషధాల్ని శతృవినాశనానికి వాడాలి అనే ఒక దుర్మార్గమైన ఆలోచన యజుర్వేద ఆర్యుల్లో చాలా స్పష్టంగా కన్పిస్తుంది. అంటే ఒక వైజ్ఞానిక విధానాన్ని మరింత మానవీయంగా మార్చకుండా, ఆ విధంగా పెంపొందించకుండా ప్రాణాలుపోసే వైద్యాన్ని కూడా ప్రాణాలు తీయడానికి ఉపయోగించాలనే అతి జుగుప్సాకరమైన ఆలోచనల్ని యజుర్వేదంలో చూస్తాం!

ఇది తిరోగమనం కూడా కాదు. పతనం చెందడమే!

ఇక, చేతబడి రూపాన్ని చూడండి :

**".....రక్షోహణో వలగహణో వైష్ణవాన్ ఖనామీదమహం తం వలగముద్వపామి య నః**
**సమానో మయసమానో నిచఖానేదమేనమధురం**
**కరోమి యో నః......"** –(కృ.యజు : 1–3–2)

అంటే...

"ఉపరవాలు అనేవి విష్ణుదేవతాకములు . వలగములు అనేవి వినాశకాలు. నేను వాటిని తవ్వు చున్నాను. ఇవి శతృవుల్ని నాశనం చేయునుగాక!. మాతో సమానుడైనా, సమానుడు కాకపోయినా సరే వాడు పాతిపెట్టిన వలగములను తవ్వితీస్తున్నాను." అని.

ఉపరవాలు అంటే గుంటలు.

వలగములు అంటే శతృవుల నాశనం కోసం ఎముకల్ని, వెంట్రుకల్ని, వారి కాల దుమ్ముని పాత బట్టలో కట్టి గుంటలో పాతిన మూటలు – ఇప్పటికీ చేతబడి రూపాల్లో ఇదొకటి. వేద కాలంలోని ఎముకలు, కాలి దుమ్ము, వెంట్రుకలు ఇప్పటికీ ఉన్నాయి కానీ, ఇప్పుడు వీటికి అదనంగా పసుపు, కుంకుమ, నిమ్మకాయలు చేరాయి!

ఇక, కృష్ణ యజుర్వేదంలోని ఈ మంత్రం చూడండి:

**".... వేదేన వై దేవా అసురాణాం విత్తం వేద్యమవిందంత తద్వేదస్య వేదత్వం**
**యద్వ్యద్భాతృవ్యస్యా–భిధ్యాయేత్తస్య నామ గృహ్ణీయత్తదేవా–స్య సర్వం వృంజ్తే ......"** –(కృ.యజు : 1–7–4)

"తన శత్రువు ఏది కావాలని కోరుచున్నాడో దాన్ని తన మంత్రాల మధ్యలో చేర్చి చెప్పాలి యజమాని . అలా చెప్పడం వల్ల ఆ శతృవు ఏది తాను కోరుచున్నాడో దాన్ని పోగొట్టుకుంటాడు" .

అంటే –

శతృవుకి కీడు కలగాలని కోరుకోవడం గత మంత్రాల్లో చూశాం. ఇప్పుడు ఈ మంత్రంలో చూడండి శత్రువుకి మేలు జరగకూడదని కోరుకోవడం.

తనకి మేలు, శత్రువుకి కీడు కలగాలని కోరుకోవడం గత మంత్రాల్లో ఉంటే – పై మంత్రంలో తనకు మేలు జరగక పోయినా శతృవుకు మాత్రం జరక్కూడదని కోరుకోవడం ఉంది. దీన్నే మనం సినిమాల్లో చూస్తాం.

హీరో ప్రేమించిన హీరోయిన్‌ని విలన్ చంపేస్తూ.....

"నాకు దక్క కూడనిది, నీకూ దక్కకూడదు. దక్కనివ్వను"

అంటూ వికృత వికటాట్టహాసం చేస్తాడు.

దీన్నే "శాడిజం" అంటారని వేదాలకు వచన రూపం ఇచ్చిన దాశరధి రంగాచార్యులవారే వ్యాఖ్యానించారు.

ఇలా..మనుషుల్లో ఉన్న మృగత్వాన్ని శక్తి వంచన లేకుండా యజుర్వేదం పెంచి పెద్దచేసింది.

అందుకే ... అంటరాని తనం అనే అతిదారుణ అమానవీయం, అమానుషం ఈ దేశంలో "వేద ధర్మంగా" వర్ధిల్లగలిగింది. మనిషిని మనిషిగా చూడలేకపోతున్నందుకు కాస్తకూడా పశ్చాత్తాపాన్నిగానీ, "సిగ్గు"ను గాని కలిగించలేక పోయింది. పైగా ఆ అమానుషం ఒక పవిత్ర కార్యంగా చెప్పుకునే సిగ్గుమాలిన తనానికి చిరునామాగా మారింది.

ఇలాంటి వికృత తలపులున్న క్రతువులు కృష్ణ యజుర్వేదంలో 1-7-1లో, 2-1-5లో, 2-5-8లో, 4-3-12లో శుక్ల యజుర్వేదం 17-7లో ఇంకా ఇంకొన్ని చోట్ల కనిపిస్తాయి.

## సంతాన సాఫల్యత ఒక పరమ రోత

ఇక - విచిత్రమైన, వికృతమైన సంతాన సాఫల్యతా ప్రక్రియను చూద్దాం.

రుగ్వేదంలో అశ్వనులు ఔషధాలిచ్చి సంతానాన్ని కలిగించినట్లు ఉంది.

రుగ్వేదం 1-112-4లో శమనుడు అనేవాని గొడ్డువోతు ఆవుకి సంతానం కలిగిందని, అది ఈని పాలిచ్చిందని, దీనికి అశ్వనుల వైద్యమే కారణమని ఉంది.

అలాగే ... 1-112-19లో విమదుడు అనే ప్రభువుకి అతని భార్యతో (ఆమె రోగాల్ని తొలగించి) సఖ్యత కూర్చారని ఉంది. ఇంకా, 1-116-10లో చ్యవనుని ముసలి తనాన్ని తొలగించి, తిరిగి యౌవ్వన వంతుణ్ణి చేశారని, అశ్వనీ దేవతల గురించి ఉంది.

అంటే ...

సంతాన లేమికి, వీర్యవృద్ధికి, స్త్రీ జనన దోషాలకి వారు ఔషధాల్ని వాడే సంతానవంతుల్ని చేశారు. అంటే ఒక వైద్య ప్రక్రియ ద్వారానే సంతాన సాఫల్యత కలిగించారు - ఇది రుగ్వేదంలోని విషయం.

మరి యజుర్వేదంలో ఈ పని "మంత్రం చేస్తుంది" అని చెప్పినా.. దాన్నీ ఒక మూఢనమ్మకంగానే సరిపుచ్చుకోవచ్చు. కానీ, స్త్రీలకూ, జంతువులకూ సంభోగం చేయిస్తే సంతానం కలుగుతుందనే ఒక జుగుప్సాకరమైన విషయం యజుర్వేదంలో ఉంది.

నిజానికి సైన్సు ప్రకారం ఏయే స్త్రీపురుష జీవుల మధ్య సంయోగం జరిగితే సంతానం కలుగుతుందో - వారిని ఒక "జాతిగా" పరిగణిస్తారు.

ఒక తెలుగు అమ్మాయికీ, ఒక అమెరికా అబ్బాయికీ సంతానం కలుగుతుంది. ఒక బ్రాహ్మణ స్త్రీకి, ఒక అంటరాని పురుషునికీ సంతానం కలుగుతుంది. ఒక ఆఫ్రికన్ అమ్మాయికీ, ఒక చైనా వానికీ సంతానం కలుగుతుంది. ప్రపంచంలో ఉన్న మానవులందరికీ ... కుల, మత, ప్రాంత భేదాలతో సంబంధం లేకుండా సంతానం కలుగుతుంది. అంటే వీరందరిదీ ఒక జాతి అన్నమాట.

అలాగే ... మానవులు కోతుల నుండి వచ్చారనేది నిజమే అయినా, మనిషికీ కోతికీ, మనిషికీ చింపాంజీకీ, చింపాంజీకి కోతికీ, మనిషికీ ఒరాంగ్ ఉటాంగ్‌లకూ సంభోగం జరిగినా సంతానం కలగదు.

కోతికీ మనిషికీ సంతానం కలగదు. ఏక జాతి జీవులకే సంతానం. ఎందుకంటే ... ఏక జాతి అంటే ఒకే రకం ,ఒకే సంఖ్యలో క్రోమోజోములు కలిగిన జీవులు .

మనిషిలో క్రోమోజోముల సంఖ్య = 46 (23 జతలు)
గుర్రంలో క్రోమోజోముల సంఖ్య = 64 (32 జతలు)
కుక్కలో క్రోమోజోముల సంఖ్య = 78 (39 జతలు)
కోతిలో క్రోమోజోముల సంఖ్య = 42 (21 జతలు)

కాబట్టి మనిషికీ, కోతికీ సంతానం కలగదు. మనిషికీ, గుర్రానికీ సంతానం కలగదు. అలాగే రెండు వేర్వేరు జాతులకు సంతానం కలగదు.

ఎందుకంటే మనిషిలో ఉన్న 46 క్రోమోజోములు 23 జతలుగా ఉంటాయి. మనిషి శరీరంలోని మిగిలిన శరీరంలో ఏ భాగంలో అయినా ప్రతి కణంలో క్రోమోజోములు 23 జతలే ఉంటాయి. కానీ పునరుత్పత్తికి కారణమైన స్త్రీలలోని అండకణాల్లో 23, పురుషుల వీర్యకణాల్లో 23 చొప్పునే ఉంటాయి. దీన్ని క్షయకరణం అంటారు. ఇలా సగం సగం క్రోమోజోములున్న రెండు మానవ కణాలు సంయోగం చెంది, ఆ రెండూ కలసి ఒక పూర్తి స్థాయి మానవ కణంగా రూపొందుతుంది.

స్త్రీ అండం + పురుషవీర్యం = సంతానం కలుగుతుంది.
23 + 23 = 23 జతలు

మరి మనిషీ + కోతి సంయోగం చెందితే ...23 + 21 = సరైన కణం ఏర్పడదు.

అలాగే

మనిషీ + గుఱ్రం సంయోగం చెందితే ......23 + 32 = సరైన జీవకణం ఏర్పడదు.

కాబట్టి సంతానం అనేది సమ సంఖ్యలో క్రోమోజో ములున్న 'ఏకజాతి' జీవుల వల్లే కలుగుతుంది. ఐతే... ఒకే జాతి వారైనప్పటికీ కొందరికి సంతానం కలగదు. ఎందుకు? దీన్ని వంధ్యత్వం (సంతానలేమి) అంటాం. ఇది క్రోమోజోముల వల్ల కాదు. ఈ సంతాన లేమికి కొన్ని కారణాలున్నాయి.

వీర్యకణాల సంఖ్య తక్కువగా ఉండడం వల్ల, వీర్యకణాలు బ్రతికే కాల వ్యవది తక్కువగా ఉండడంవల్ల, గర్భాశయంలో లోపాలవల్ల, అండం విడుదల అయ్యే కాలం, ఇతర అవరోధాలు (స్త్రీలలో ఫాలోఫెయిన్ నాళం) వల్ల సంతానానికి కొన్ని అవరోధాలు, అడ్డంకులు కలుగుతాయి తప్ప, జన్యువుల వల్లకాదు. ఈ అవరోధాల్లో 90 శాతం ' x, y క్రోమోజోము ఉన్న మగవారి వల్లే కానీ, x,x క్రోమోజోములున్న ఆడవారి వల్ల కాదు. అయినా, ఈ అవరోధాల్ని సవరించుకోడానికి ఔషధాలు, కొన్ని వైద్య పద్ధతులు పాటిస్తే అవరోధాలు తొలగి సంతానం కలుగుతుంది.

కొన్ని మూలికలు, ఆకులు, మాంసాలు, సుగంధ ద్రవ్యాలు తీసుకోవడం వల్ల వీర్యవృద్ధి జరుగుతుందని ప్రపంచంలో ఆర్యులకీ, అశ్వనీ దేవతలకే కాదు – ఆదిమ సమాజాల దగ్గర నుండి ఆధునిక సమాజాల వరకూ అందరికీ తెలుసు. అందరి లాగానే ... ఆర్యులకీ తెలుసు.

ఆ విషయాన్నే మనం రుగ్వేదంలో చూశాం. వృంధ్య గోవు వంధ్యత్వాన్ని పోగొట్టడం, స్త్రీలకి సంతానం కలిగేలా ఔషధాలు వాడడం మనం రుగ్వేదంలో చూశాం.

అంతవరకూ బాగానే ఉంది !

ఈ కథ ఇక్కడితో ఆపి

ఇప్పుడు మనం యజుర్వేదంలోని వద్దాం.

## అతి జుగుప్స

మనం ఒక్కసారి ఈ వ్యాసం మొదట్లో శీర్షభాగంలో ఉన్న మంత్రాన్నీ, మంత్రార్థాన్నీ ఒక్కసారి చూసి వద్దాం! వచ్చి,

శుక్ల యజుర్వేదంలో ఇరవై మూడో అధ్యాయాన్ని చూద్దాం. నిజానికి 22, 23, 24, 25 – ఈ నాల్గూ అశ్వమేధ అధ్యాయాలు. ఇందులో 23వ అధ్యాయం కీలకం. ఇది ప్రశ్నోత్తరాల పద్ధతిలో సాగుతుంది.

19వ మంత్రంలో గుర్రం ప్రక్కలో పడుకున్న స్త్రీలు (అంబ, అంబిక, అంబాలిక)

**" తా –ఉభౌ చతురః పదః సమ్ప్రసారయావ స్వర్గేలోకే ప్రోర్ణువాథాం వృషా వాజీరేతో ధారేతో దధాతు"**

–(శు.యజు : 23–20)

అంటే ...

"అశ్వమా! రా! మనం ఉభయులం మన నాలుగు కాళ్ళను కలుపుకుందాం"అని. అప్పుడు అధ్వర్యుడు (ఒక యజ్ఞకర్త)

"అశ్వ మహిషీ! ఇది స్వర్గంతో సమానమైన యజ్ఞభూమి. నీవు దుప్పటి కప్పుకో!" అంటాడు.(చేసే పని కన్పించకుండా)

అప్పుడు "అశ్వశిశ్న ముపస్తే కురుతే ..." (అశ్వ శిశ్నాన్ని యోనిలో పెట్టుకుని ...)ఆ స్త్రీ ఇలా అంటుంది :

"వాజీ రేతో ధారేతో దధాతు ..."

" ఓ! అశ్వమా! నేను నీ రేతస్సును (ఇంద్రియాన్ని) ధరిస్తాను. నీవు నాలోకి నీ రేతస్సును చేర్చు"

అప్పుడు ఆ యజ్ఞం నిర్వహించే యజమాని, (ఆ స్త్రీ భర్త) గుఱ్రంతో ఇలా అంటాడు:

**"ఉత్సక్థ్యా –అవ గుదం ధేహి సమఞ్జి చారయా వృషన్ య స్త్రీణాం జీవభోజనం"**

(శు.యజు : 23–21)

"ఓ అశ్వమా! నీవు కాళ్ళులేపి, ఈ అశ్వమహిషి ('పట్ట మహిషి'లా 'అశ్వమహిషి') యోనిలో... నీ ... అంగమును ఉంచి, కదిలించి, న్కలించుము. అదే ఈ స్త్రీలకు జీవభోజనం".అని.

వీర్యాన్ని "జీవభోజనం" అని వర్ణించారు ఇక్కడ. అంటే ... సంతానానికి కారణం అని.

ఇంకా మిగిలిన మంత్రాల్లో ...

గుఱ్రంతో కలిసి, దాని శిశ్నాన్ని పట్టుకొని ఆ స్త్రీలు ఎలా సంభోగం చెందాలో – అన్ని విపులంగా ఈ అధ్యాయంలో ఉన్నాయి.

ఇది రాయడానికే సిగ్గు విడిచా. మిగిలిన తంతు, తతంగం రాయలేను........

ఇది కామకేళిలో ఒక బహిరంగ విశృంఖలత్వం. మనుషుల్లో ఉన్న పశు వాంఛలకి పరాకాష్ఠ. ఇలాంటి పశు వాంఛల్ని అణచడం చేయకుండా యాగ బద్ధంగా ప్రేరేపించడం, యజ్ఞ కర్తలైన బ్రహ్మ, హోత, ఉద్గాత, అధ్వర్యులు , యజమానితో సహా స్త్రీలు ఆ జంతువులతో ఎలా కామక్రీడ సాగించాలో చెప్తూ , ఆ పని చేయించడం,

దానికి ఆ స్త్రీల భర్త కూడా అశ్వాన్ని వేడుకోవడం ... ఎంత రోత. ఇదంతా ఎందుకు?

సంతానం కోసం!

సంతానం కోసం తల్లిదండ్రులు తల్లడిల్లడం తప్పుకాదు. జీవుల జీవన చర్యల్లో సంతానం కూడా ఒకటి. కానీ, ఇలాంటి అవాంఛనీయ, అసాంఘిక, అనైతిక, అశాస్త్రీయ విధానాలతో సంతానం కలుగుతుంది అని నమ్మించడమే పెద్ద నయవంచన.

ఇక్కడ మందులూ, మాకులూ లేవు. వాటి ప్రస్థావనే లేదు. అశ్వసంభోగమే ఉంది.

అందుకే " యజ్ఞమెల్ల కామ యజ్ఞమాయె" అని ఈ జుగుప్సని నిందించాడు వేమన.

ఇతర జంతువుల కంటే అశ్వం కామ సామర్థ్యం గలది. పిచ్చుకలు కూడా. అందుకే ఆయుర్వేదంలో అశ్వలేపనాలు, పిచ్చుక లేహ్యాలూ కామ సామర్థ్యం కోసం, వీర్యవృద్ధికి వాడతారు. అవి ఔషధాలుగా ఉపయోగిస్తే...ఉంటే గింటే ... ఏమైనా ఉపయోగం ఉండొచ్చు. కానీ, పురుష అశ్వంతో స్త్రీలు సంపర్కం చెందితే ... సంతానం ఎలా కలుగుతుంది?

## తిరుగులేని తిరోగమనం

మొత్తం మీద అనేక విషయాల్లో రుగ్వేదకాలం నాటి అనుభవాలు, ప్రయోగాలూ, ఔషధాలూ, అంతో ఇంతో శాస్త్రీయ విధానాలుగా తోస్తాయి. కానీ, ఆ కొద్దిపాటి ప్రయత్నాలు కూడా ఈ యజుర్వేద కాలానికి పూర్తిగా వెనక్కి మళ్ళాయి. యజుర్వేద కాల ఆర్య జాతుల అజ్ఞానాంధకార యజ్ఞయాగాలు భారత దేశాన్ని తిరుగులేని తిరోగామిగా తీర్చిదిద్దాయి!

రాజులు, రాజ్యాధిపతులు, మంత్రులు, సామంతులు, ధనవంతులు వ్యాపారులు అందరూ ఈ యాగాల మాయాజాలంలో చిక్కుకుని ఒకరిపై ఒకరు పోటీగా, ధీటుగా ఒకరిపై ఒకరి జయం కోసం, విజయం కోసం కదిలితే యజ్ఞం, మెదిలితే యజ్ఞంలా యజ్ఞక్రతువులు మూడు మంత్రాలు ఆరు తంత్రాలుగా సాగాయి.

అజ్ఞానం అజరామరంగా వర్ధిల్లింది!

ఈ అజ్ఞానాంధకార దేశానికి, చారిత్రక అవసరంగా కాలానికి ఒక వెలుగు దివిటీ అవసరం అయ్యింది.

అది చార్వాకంగా, లోకాయతగా, చివరికి బుద్ధుని రూపంలో మహా తేజస్సుగా అవతరించింది. వేద సంస్కృతికి, వైదిక నాగరికతకి ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించింది. చివరికి,వారు వైదిక యజ్ఞ సంస్కృతిని, వైజ్ఞానిక యజ్ఞగుండంలో ఆహుతి చేయడానికి తీవ్రంగా కృషిచేశారు.

యజ్ఞం పేరుతోసాగే జంతుబలులు ఆపగలిగారు. అశ్వమేధాలూ, పుత్రకామేష్టులు నిలిచిపోయాయి.

యజ్ఞం పోయింది, కానీ, యజుర్వేదం పెంపొందించిన తిరోగమన భావజాలం ఇంకా బ్రతికే ఉంది!

దాన్ని బలివ్వకుండా వైజ్ఞానిక భారతం అవతరించ లేదు. అవతరించదు. *(ఇంకావుంది)*

# ఓహ్ ! ఏం చెప్పావ్ గురూ!



**ప్రకాష్ రాజ్ :** ఆడవాళ్లని, పసిపిల్లల్ని, ముసలి వాళ్లని చంపటం మహాపాపమని ఆ ఖురాన్‌లో, హదీజ్‌లలో చెప్పారు గదరా, ఏంటిరా ఇది?

**ఒక ముస్లిం :** గుజరాత్‌లో మనవాళ్లను మేకల్ని నరికినట్టు నరికారు.

**ప్రకాష్ రాజ్ :** రే. చుప్, చుప్ ! వీళ్లా అక్కడ... గుజరాత్‌లో.. పాగల్ హైసబ్‌లోగ్! అహ్మదాబాద్‌లో వాళ్లు చంపారని మనం, గోద్రా ట్రైన్ తగలెట్టారని వాళ్లు, బాబ్రీ మసీదని మనం అయోధ్య రామదని వాళ్లు ఇలా చంపుకుంటూ వెళితే ఎవ్వరూ మిగలరు. మొత్తం శ్మశానమై పోద్ది! అరే... మనిషే లేనపుడు... సమాధుల మీద మతమేం చేస్తుంద్రా! అరే... సోచ్‌రే... ఇస్ తరఫ్ సోచ్.

**(ఈ సంభాషణలు 2002 నవంబర్‌లో విడుదలైన "ఖడ్గం" చిత్రంలోనివి)**

# యజుర్వేద గణితం!

**"సప్త తే అగ్నే సమిధ సప్త జిహ్వా స్సప్త ఋషయస్సప్త ధామ ప్రియాణి**
**సప్త హొత్రాస్సప్త ధా త్వా యజంతి సప్త యోనీరా పృణస్వా ఘృతేన ...."**

*"ఓ అగ్నీ! నీ సమిధలు ఏడు. నీకు నాలుకలు ఏడు. మంత్రాలు ఏడు. నీ స్థానాలు ఏడు. నీ యాగాలు ఏడు. కాబట్టి అగ్నీ! ఏడు స్థానాల్లో నేతిని నింపు" అని.*

***-(కృ. యజు,1-5-3 )***

## వ్యాపారం లేదు - వ్యవసాయం రాదు

మనం రుగ్వేదంలో చెప్పుకున్నట్లు ఆర్యుల గణిత పరిజ్ఞానం కేవలం సంఖ్యా పరిజ్ఞానం మాత్రమే. ఇతర గణిత ప్రక్రియల్లో ఆర్యులు ఎంతో వెనకబడి పోయారని మనం గతంలోనే "వేలెడంతలేని వేద గణితం" అనే వ్యాసంలో చెప్పుకున్నాం. రుగ్వేదకాలం తర్వాత ఐదు వందల ఏళ్ళకు కూడా ఆర్యులకు గణిత పరిజ్ఞానం అంతగా అబ్బినట్లు కన్పించదు. ఇందుకు ప్రధాన కారణాలు రెండు.

ఒకటి: వారు తమ పాత జీవన విధానమైన పశు పాలనను వదిలి పెట్టకపోవడం.

రెండు : ఆర్యులు వ్యవసాయానికి మళ్ళినా, వ్యవసాయ క్షేత్రాల్ని విస్తరింప చేసుకున్నా వ్యాపారం మీద అంతగా శ్రద్ధపెట్టలేక పోవడం.

ఎందుకంటే ... ఇతర వస్తువుల ఉత్పత్తి, నౌకాయానాల మీద పట్టులేనిదే విస్తృతమైన వ్యాపారం కుదరదు. విదేశీ వ్యాపారాభివృద్ధి జరిగితే ఇతర శాస్త్రాలకంటే ముందుగా గణితశాస్త్రం దానంతట అదే అభివృద్ధి చెందుతుంది. సమృద్ధిగా లభించే పాలూ, పెరుగూ, వెన్న, జున్నులతోపాటు కావలసినంత పశు మాంసం కడుపునింపుతుంటే ధనాన్ని పశురూపంలో కాకుండా, ధాన్యం రూపంలో కాకుండా బంగారం వెండిగా మార్చుకుని నిల్వలు చేసుకోవలసిన 'తప్పనిసరి' పరిస్థితిని వారి జీవన విధానం వారికి కల్పించలేదు.



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

ఆర్యులకంటే ముందరి వారైన సింధూ ప్రజలు ప్రధానంగా వ్యవసాయం మీదే కాకుండా వ్యాపారం మీద జీవించారు. వ్యాపారం బాగా సాగింది అంటే 'ఉత్పత్తి' బాగా పెరిగింది అనే అర్థం. ఇంట్లో తిండిగింజలు లేనప్పుడు, వాటిని దాచి, అమ్ముకునే 'పిసినిగొట్లు' దాదాపుగా ఉండరు. తమ అవసరాలకు మించిన ఉత్పత్తి జరిగినప్పుడు మాత్రమే - వారు వ్యాపారం చేసినా, దాచినా, దానం చేసినా. సింధూ ప్రజలు మెసపుటోమియాతో (ఇరాక్) వర్తక సంబంధాలు కొనసాగించారు. సింధూ వ్యాపారులు ధాన్యాలు, ఖనిజాలు, టేకు, దేవదారు ల్లాంటి విలువైన కలపలు, భూర్జపత్రాలు ఎగుమతులు చేసిన సాక్ష్యాలు మెసపుటోమియాలో లభించాయి. అంటే సింధు ప్రజల ఉత్పత్తి వారి అవసరాలకు మించిన అధిక ఉత్పత్తే అనేది తేటతెల్లం అవుతుంది. ఆ కాలంలో అధిక ఉత్పత్తి జరిగిందంటే తప్పక భయంకరమైన బానిసత్వం ఉండి తీరాలి. అధికోత్పత్తి చేసే యాంత్రిక, సాంకేతిక నైపుణ్యాలు సింధూ ప్రజలకు తెలియవు. వ్యాపారం అందునా విదేశీ వ్యాపారం జోరుగా సాగిందంటే ఆ సమాజంలో మహా ధనవంతులు ఉండి తీరాలి. అందుకే ధనవంతుల విశాల, విలాస భవనాలు ఒకవైపు, దరిద్రుల మురికి వాడలు మరోవైపు సింధూ తవ్వకాల్లో బైటపడ్డాయి. సింధూ ప్రజలది నగర నాగరికత. నగర నాగరికతలో ఇతర సామాజిక వ్యత్యాసాలు అంతగా ఉండవుగానీ, శ్రమ దోపిడి మాత్రం భారీ ఎత్తున ఉంటుంది. ధనికులైన వ్యాపారుల విలాస నగర నిర్మాణం కోసం క్షేత్ర గణితం, రేఖా గణితం, సాంకేతిక గణితం తప్పనిసరి. కాబట్టి సింధూ నాగరికత నగర నిర్మాణాల్లో అద్భుతమైన ప్రయుక్త గణితం కన్పిస్తుంది. అబ్బుర పరుస్తుంది.

కానీ -

ఆర్యులు సాంస్కృతిక వికాసంలో సింధూ ప్రజలకు దరిదాపుల్లోకి కూడా రాలేని వారు. వారు పశుపాలన జీవనంలోనే మునిగి తేలారు. వీరు వ్యవసాయాన్నే సింధూ ప్రజల్నుండి నేర్చుకున్నవారు. కాబట్టి వారు వ్యాపారంలో రాణించడానికి ఆర్థికంగా " ధనాన్ని" పోగుజేసుకోడానికి తగిన జీవనం

తెలియనివారు. కాబట్టి వారు నగరాల్ని ధ్వంసం చేశారే తప్ప నిర్మించలేక పోయారు. వారి నాయకులు, దేవతలు కూడా 'పురందరు'లే – అంటే పురాల్ని ధ్వంసం చేసినవారే. వారి బిరుదులే "నగర నాశకాలు" అని. వారు నగర జీవనం కంటే గ్రామీణ జీవనానికే ఇష్టపడ్డారు. కాబట్టి వారి వ్యావసాయక, గ్రామీణ, పశుపాలన జీవనంలో ప్రయుక్త, సాంకేతిక గణితంతో పెద్దగా అవసరం లేదు. కాబట్టి వారి గణిత మేధ 'సంఖ్యల్ని' దాటి ముందుకు సాగలేక పోయింది. పొలాల లెక్కలు, పశువుల లెక్కలకే పరిమితమై పోయింది. వారికి తెలిసిన అతి గొప్ప సాంకేతిక నిర్మాణం "యజ్ఞవేదిక". దాన్ని నిర్మించే విధానం, దాని నిర్మాణానికి కావలసిన ఇటుకల సంఖ్యలు – అంతకు మించిన సాంకేతిక ప్రజ్ఞ, పరిజ్ఞానం వేదంలో మనకి కనిపించదు.

ఆర్యుల్లో వ్యాపారం, పట్టణ నాగరికతలు ఎరుగని ఆర్యుల జీవన విధానమే చాలా ఏళ్ళు కొనసాగింది. యజుర్వేద కాలానంతరం పరిఢవిల్లిన బౌద్ధ యుగంలో కూడా సంఖ్యా శాస్త్ర విస్తృతినే చూస్తాం. బుద్ధుని అనంతరం రెండు వందల ఏళ్ళకు వచ్చిన బౌద్ధపురాణం "లలిత విస్తరం"లో కూడా సంఖ్యాశాస్త్ర పురోభివృద్ధినే చూడగలం. మిగిలిన సాంకేతిక, గణిత శాస్త్రాల ఉనికీ, వ్యాప్తుల్ని వెదుక్కోవాల్సిందే!

సింధూ నాగరకత తర్వాత, గ్రీకులు వచ్చే వరకూ మన గణిత సాంకేతిక ప్రగతి చతికిలపడే ఉంది. గ్రీకుల రాకతో మరలా మహాద్భుత నగరాలు, మహా మహా కట్టడాలు ఇక్కడ వెలిశాయి. స్థూపాలూ, ఆరామాలూ, బుద్ధుని విగ్రహాలు, మహా మహా కట్టడాల నిర్మాణాల్ని చేపట్టారు. ఆ వైజ్ఞానిక భావధార ఫలితంగా బౌద్ధ భిక్షువు అయిన ఆర్యభట్ట అనే గణిత, ఖగోళ మహా శాస్త్రవేత్త అవతరించాడు.

అంటే... బుద్ధుడు జీవించిన కాలంలో కూడా సంఖ్యాశాస్త్రమే ఉంది.

లలిత విస్తరంలో అద్భుతమైన మహా మహా సంఖ్యల్ని చూడగలం. మరి రుగ్వేదంలో వేయి, పదివేలకు మించిన సంఖ్యలు కనిపించవు. ఈ మధ్య కాలంలో.... అటు రుగ్వేదానికీ, ఇటు బౌద్ధ యుగానికీ మధ్య నున్న కాలంలో – ఆ సంఖ్యా శాస్త్ర విస్తృతిని ప్రస్ఫుటంగానే చూడొచ్చు.

## కూడికలూ– గుణకారాలూ

**"యే దేవాసో దివ్యైకాదశ స్థ పృథివ్యామధ్యేకాదశ స్థ**
**అప్సుక్షితో మహినైకాదశ స్థ తే దేవాసో యజ్ఞ మిమం జుషధ్వం"**
**(శు. యజు.7–19)**

"తమ తమ దివ్య మహిమలతో ద్యులోకంలో 11 మంది, భూలోకంలో 11 మంది, అంతరిక్షంలో 11 మంది నిలచి యున్నారు. వీరంతా మా యజ్ఞాన్ని ప్రేమతో స్వీకరింతురు గాక!" అని ఇలా (3 × 11 = 33) దేవతలు 33 మంది అని ఉంది.

అలాగే ...

**"శతం వో–అంబ ధామాని సహస్రముత వో రుహః**
**అధా శతక్రత్వో యూయమిమం మే –అగదం కృత"**
***–(శు. యజు. 12–76)***

అంటే –

*'ఓ... ఓషధులారా! మీ శత శత తేజస్సులు, సహస్ర సహస్ర జన్మస్థానాలూ మాకు బాగా తెలుసు" – అని.*

ఇక్కడ శత శతం అంటే వంద వందలు = 100 × 100 = 10,000 పదివేలు.

సహస్ర సహస్రం అంటే వేయి వేలు = 1000 × 1000 = 10,00,000 పదిలక్షలు. అలాగే ... శుక్ల యజుర్వేదం 14వ అధ్యాయం 23వ మంత్రంలో ... దాదాపుగా ఒకటి నుండి 48 సంఖ్యల గురించి ఉంది. ఇవ్వన్నీ ఇటుక సంఖ్యలను సూచించే సంఖ్యలే.

**"ఆశుస్ త్రివృద్ భాంతః పంచదశో వ్యోమా సప్తదశో ... ఏకవింశః ... అష్టాదశ ... నవదశో ... సవింశో ... ద్వావింశో ... త్రయోవింశో ..."**

ఇలా 15, 17, 19, 18, 20, 22, 23, 24, 25, 27, 31, 33, 34, 36, 38 సంఖ్యల గురించి ఉంది. ఈ సంఖ్యలో 27 గురించి ఇలా ఉంది: "త్రిణవః" అని.

సప్తదశ అంటే 17 అని. సప్త (7) + దశ (10). చతుర్వింశ అంటే 24 అని. చతుర్ (4) + వింశ (20). త్రాయత్రింశ అంటే 33. త్రయ (3) + త్రిశ (30). 27ని సప్తత్రింశ అనాలి. కానీ "త్రిణవ" అని అన్నారు. అంటే 27ని 7 + 20 అనే కూడిక రూపంలో కాకుండా 3 × 9 అనే గుణకార రూపంలో చెప్పడం.

నిజానికి గుణకారం అనే ప్రక్రియ గణితంలోని కూడిక రూపమే. ఒకే సంఖ్యను పదే పదే కూడడమే గుణకారం. గుణకారం అనేది ప్రత్యేక గణిత ప్రక్రియ కాదు. అది కూడిక ప్రక్రియలో ఒక రూపమే. అయినా కూడిక ప్రక్రియను తేలిగ్గా చెప్పే రూపం గుణకారం. ఈ గుణకార ప్రక్రియ ప్రకారమే త్రిణవ (3×9 = 27) అని, 27 సంఖ్యను సూచించారు.

ఇలా గుణకార రూపాన్ని యజుర్వేదంలో చూడగలం.

## పది నుండి పరార్ధం వరకు

ప్రపంచంలో అనేక సంఖ్యా మానాలు ఉన్నాయి. వాటిలో దశాంశ సంఖ్యామానం ఒకటి. ఇప్పుడు మనం వాడే సంఖ్యా విధానం అదే. దశాంశం విధానం. అంటే... సంఖ్యల స్థానాలు పది పది రెట్లు పెరిగే విధానం. ఒకట్లు, పదులు, వందలు, వేలు ... ఇలా.

ద్విసంఖ్యామానం అనే ఒక విధానం ఉంది. ప్రతి స్థానం రెండు రెండు రెట్లు పెరిగే విధానం ఇది. ఒకట్లు, రెండ్లు, నాలుగులు, ఎనిమిదులు, పదహార్లు ఇలా ... ఈ విధానం ఇప్పుడు కంప్యూటర్స్‌లో ఉపయోగిస్తున్నారు. అందుకే 1జిబి, 2జిబి, 4జిబి, 8జిబి, 16జిబి, .... సామర్థ్యంగల మెమొరీ కార్డులు, హార్డ్ డిస్క్‌లు ఉంటాయి. 3జిబి, 5జిబిలు ఉండవు.

ఇక, షష్ట్యంశమానం ఒకటుంది. ఇది ప్రపంచంలోని అతిపురాతన సంఖ్యామానం. ఈజిప్టు, మెసపుటోమియాల్లో క్రీ.పూ. 3000 సంవత్సరాలకు పూర్వమే వాడుకలో ఉంది. దీనిలో ఒకట్లు, అరవైలు, నూట ఇరవైలు ... ఇలా ఉంటాయి స్థాన విలువలు.

60 సెకన్లు, 60 నిమిషాలు, సంవత్సరానికి 360 రోజులు (6 × 60), వృత్తానికి $360^\circ$ కోణం – ఇవ్వన్నీ ఈ విధానంలోంచి వచ్చిన పద్ధతులే. మనం ఇప్పటికీ ఈ విధానంలోనే కాలాన్ని, కోణాల్నీ కొలుస్తూనే ఉన్నాం.

8 రెట్లు, 5 రెట్లు పెరిగే సంఖ్యా విధానాలు కూడా ఉన్నాయి.

అయితే – పది పది రెట్లు పెరిగే పద్ధతి యజుర్వేదంలో కన్పిస్తుంది. దీన్ని
ఇది వారు సింధూ ప్రజల్నుండి నేర్చుకున్నారో లేదో తెలియదు. అసలు సింధూ ప్రజలది దశాంశ విధానమో కాదో కూడా తెలియదు. సింధూ ప్రజలకి ఈజిప్టు, గ్రీకు దేశాలలో వర్తక సంబంధాలున్నాయి. కాబట్టి వారిది షష్ట్యంశ విధానమేనా?

అయితే, దశాంశ విధానాన్నిబహుళ ప్రచారం కావించింది, 'సున్న'ను ఆవిష్కరించింది బౌద్ధుడైన ఆర్యభట్టే! అయినా దశాంశ విధానంలో సంఖ్యల్ని పెంచడం యజుర్వేదంలో చూస్తాం! ఈ మంత్రాన్ని చూడండి.

**"ఇమా మే – అగ్న – ఇష్టకా ధేనవః సంత్వేకా చ దశ చ దశ చ శతం చ శతం చ సహస్రం చ సహస్రం చాయుతం చాయుతం చ నియుతం చ నియుతం చ ప్రయుతం చార్బుదం చ న్యర్బుదం చ సముద్రశ్చ మధ్యమం చాన్తశ్చ పరార్ధశ్చై తామే–అగ్న – ఇష్టకా ధేనవః సన్త్వముత్రా ముష్మిన్‌ల్లోకే!**

*–(శు. యజు. 17–2)*

ఇందులో స్థాన విలువలు చూద్దాం:

ఏకా = 1

దశ = $10^1$ = 10 (పది)

శత = $10^2$= 100 (వంద)

సహస్ర = $10^3$= 1000 (వేయి)

ఆయుతం = $10^4$ = 10,000 (పది వేలు)

నియుతం = $10^5$ = 1,00,000 (లక్ష)

ప్రయుతం = $10^6$= 10,00,000 (పది లక్షలు)

అర్బుదం = $10^7$ = 1,00,00,000 (కోటి)

సముద్రం = $10^8$= 10,00,00,000 (పది కోట్లు)

మధ్యమం = $10^9$= 100,00,00,000 (వంద కోట్లు)

అంతమం = $10^{10}$ = 1000,00,00,000 (వెయ్యి కోట్లు)

పరార్ధం = $10^{11}$= 10000,00,00,000 (పది వేల కోట్లు)

*ఓ! ఇటుకల్లారా! మీరు నాకు ఆవులు అగుదురుగాక! నాకు ఇహ పరలోకాల్లో ఇన్నిన్ని ఆవులై వర్ధిల్లుదురుగాక!*

అంటే... పది వేల కోట్ల ఆవులు కల్గుతాయి. యజ్ఞ కుండాన్ని నిర్మించే ఇటుకలు ఇన్ని ఆవులను కల్గిస్తాయి! అని చెప్పే మంత్రం ఇది. ఈ యజ్ఞం వల్ల ఇంత ఫలం వస్తుందని చెప్పిన మంత్రం ఇది. ఇందులో ఈ యజ్ఞంవల్ల ఇన్ని బంగారు ఆభరణాలో, వజ్రాలో, రత్నాలో లభిస్తాయని చెప్పలేదు. "ఆవులు" మాత్రమే లభిస్తాయని చెప్పారు.

'ధన కనక వస్తు వాహనాలు సిద్ధిస్తాయ'నేది ఇప్పటి దీవెన – కానీ, ఆవులు మాత్రమే సిద్ధిస్తాయనేది వేదకాల దీవెన.

ఈ దీవెన ఫలిస్తుందా? లేదా?, ఈ పొగడ్త తృప్తి నిస్తుందా? లేదా? అనేది ప్రక్కన పెడితే –

దశాంశ సంఖ్యా విధానం, పన్నెండు అంకెల సంఖ్యల వరకూ ఉన్న ప్రస్థావనలు మాత్రం కనిపిస్తాయి.

బౌద్ధుల లలిత విస్తరంలో $10^{108}$ వరకూ సంఖ్యల పేర్లు ఉన్నాయి. ఆ తర్వాత సంఖ్యల్ని మరింత పెంచుకుంటూ పోయి – గంగానదిలో ఇసుక రేణువులంత" అని ఆఖరి సంఖ్యను చెప్పారు.

అంత సంఖ్యలు, సంఖ్యా విన్యాసాల కోసమే గానీ, ప్రస్తుతానికి, వాడుకలో మనకి అవసరం లేదు.

బహుశా, ఆవుల అమ్మకం, మారకం అనేవి గుంపు

గుంపుగా జరిగి ఉంటుంది. పదేసి ఆవుల్ని ఒక్కొక్క గుంపుగా చేర్చి బేరసారాలు జరిగేవి అనడానికి ఈ సంఖ్యలు చక్కటి ఉదాహరణలుగా కన్పిస్తున్నాయి.

ఇతర సంఖ్యల కంటే పదిరెట్లు పెరగడం పది రెట్లు తగ్గడం అనేది సులభంగా గుణించు కోడానికి వీలవుతుంది. కాబట్టి ఈ విధానం అందరికీ ఆమోదయోగ్యం అయ్యుంటుంది. ఇప్పటికీ పండ్లను పది పది ఒక గుట్టగా పెట్టి అమ్మడం, వరి చేలో నారు పిడుల్ని పది పది పిడులు కలసి ఒక గుట్టగా పేర్చడం ఇప్పటికీ చూస్తూనే ఉంటాం.

ఆ తర్వాత భారతం, ఇతర ఇతిహాస, పురాణాల్లో ఈ సంఖ్యలు రకరకాలుగా ఉన్నాయి. "అక్షౌహిణి" అంటే ఎన్ని అనే లెక్క భారతంలో ఉంది. దాన్లో ఖర్వం, పద్మం, శంఖు, మహా శంఖు, అనంతం ... అనే మరికొన్ని సంఖ్యలు ఉన్నాయి.

దయానందుల వారు "ఇమా మే - అగ్న - ఇష్టకా ధేనవః" అనే పై ఈ మంత్రానికి వ్యాఖ్యరాస్తూ భారతంలోని స్థానాల్ని కూడా కలిపేసి ఈ స్థానాల్ని మరిన్ని పెంచేసి ... $10^{19}$ వరకూ సాగదీసి సాగదీసి "అబ్బో ఇంతే కాదు ... మధ్య మధ్యలో అనేక 'చ'కారాలుండటం వల్ల ఒక్క సంఖ్యా శాస్త్రమేకాదు అంకగణితం, బీజగణితం, రేఖాగణితాలు కూడా అంతర్లీనంగా ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు.

ఇంత హాస్యాస్పదమైన వ్యాఖ్యానం బహుశ వేదాలకి లేదేమో!రాదేమో!!

నాకు తెలిసినంత వరకు -మనకు తెలిసింది అంతా మూలానికి పులమడం వ్యాఖ్యకాదు. మూలాన్ని మూలంగా ఉంచి, దాన్ని సమూలంగా వివరించడం. దానిలో అంతర్లీనంగా దాగి ఉన్న అంతరార్థాన్ని విడమరచి చెప్పడం.

## సరి - బేసి సంఖ్యలు

ఇద్దరు సమానంగా పంచుకోగల సంఖ్యలు 'సరి సంఖ్యలు. ఇద్దరు సమానంగా పంచుకోలేని సంఖ్యలు బేసి సంఖ్యలు.

ధాన్యాన్నీ, కూరగాయల్నీ, ఇటుకల్నీ, కలపనీ, పాలనీ, వెన్ననీ, మాంసాన్నీ ... ఇలా కొన్ని వస్తువుల్ని ఎంత ఉన్నా, ఎలా ఉన్నా ఇద్దరు వ్యక్తులు చెరి సమానంగా పంచుకోగలరు. కానీ, పశువుల్ని పంచుకోలేరు. చెరకు గడను ముక్కలు చేసి పంచుకోవచ్చు. ధాన్యాన్ని కుప్పలు చేసి పంచుకోవచ్చు. కానీ, పశువుల్ని "బేసి" సంఖ్యలో ఉంటే ఇద్దరు పంచుకోవడం చాలా కష్టం. ఎందుకంటే రెండు భాగాలు చేస్తే పశువు ఎవ్వరికీ కాకుండా పోతుంది. కాబట్టి సరి సంఖ్యల ప్రాముఖ్యత ఆర్య సమాజానికి చాలా అవసరం. అటు దశాంశ విధానం, ఇటు సరి సంఖ్యల విధానం రెండూ "పశు పంప కాలకి" నష్టంలేని విధానం. కాబట్టి సరి సంఖ్యలు, సరి సంఖ్యలు కాని "బేసి" సంఖ్యల విభజన యజుర్వేదంలో చూస్తాం.

అంటే ... రుగ్వేదంలో కంటే ... యజుర్వేదకాల ఆర్యులకు పంపకాల్లో కొంత నిర్దుష్టత వచ్చిందన్న మాట. "సరే! ఆ మిగిలింది నీవు తీసుకో" అని సాచేతగా వదిలేసే విధానం లేదన్నమాట. పంపకాలు ఖచ్చితంగా జరిగి తీరాల్సిందే అనే ధోరణి పెరిగింది. అలా పెరగడం వల్లే సరి, బేసి సంఖ్యల విభజన జరిగింది సరి సంఖ్యలు (Even Numbers ), బేసి సంఖ్యలు (Odd Numbers ) అనే పదాన్ని అయుగ్మ, యుగ్మ అని అంటారు.

యుగ్మ అంటే యుగళ. అంటే 'రెండు కలసి' ఉండడం అని. రెంటితోపాటు మరొకటి కలసి ఉంటే అయుగ్మం. అంటే రెండుగా వేరు చేయగలిగినవి యుగ్మ (సరి), వేరు చేయలేనివి అయుగ్మ (బేసి) అన్నమాట.

శుక్ల యజుర్వేదంలో, కృష్ణ యజుర్వేదంలో రెండు చోట్లా ఈ మంత్రాలున్నాయి. వాటిని "అయుగ్మ స్తోమ హెూమార్థ మంత్రాలు" అంటారు దాశరధి రంగాచార్యులు గారు.

**"ఏకా చ మే తిస్రశ్చ మే త్రిస్రశ్చ మే పంచ చ మే పంచ చ మే సప్త చ మే సప్త చ మే నవ చ నవ చ మే ఏకాదశ చ ......"** (శు. యజు. 18-24)

"ఒకటి, మూడు, ఐదు, ఏడు, తొమ్మిది, పదకొండు, పదమూడు, పదిహేను, పదిహేడు, పంతొమ్మిది, ఇరవై ఒకటి ... ఇలా ముప్పై ఒకటి, ముప్పై మూడు ..."

ఇది ఎలాంటి దంటే ... యజ్ఞం చేస్తే ... ఒకటికి మూడు, మూటికి ఐదు, ఐదుకి ఏడు, ఏడుకి తొమ్మిది, ... ఇలా ఫలితాలు కలుగుతాయి అని చెప్పడం.

అలాగే .. యుగ్మ(సరి) లేదా సమాంకాల గురించి కూడా ఇలా ఉంది:

**"చతుస్రశ్చ మే - ష్టౌ చ మే - ష్టౌ చ మే ద్వా దశ చ మే ద్వాదశ చ మే షోడశ చ మే షోడశ చ మే షోడశ చ మే వింశతిశ్చ మే వింశతిశ్చ మే ........చతు శ్చత్వారింశచ్చ మే - ష్టౌ చత్వారింశచ్చ మే యజ్ఞేన కల్పన్తామ్!**

***-(శు. యజు - 18-25)***

*"నాలుగు, నాలుక్కి ఎనిమిది, ఎనిమిదికి పన్నెండు, పన్నెండుకు పదహారు, పదహారుకి ఇరవై ... ఇలా ఇలా చివరికి నలభై నాలుగుకి, నలభై ఎనిమిదిగా ఈ యజ్ఞం ఫలం దక్కుతుంది"– అని*

ఇది కాయ్ రాజా కాయ్! లాంటిది. ఒకటికి రెండు, రెండుకి నాలుగు, మూడికి ఐదు – 'కాయ్ రాజా కాయ్' లాంటిది.

"యజ్ఞం చెయ్ రాజా! చెయ్! చేస్తే ఒకటికి మూడు, మూడుకి ఐదు ... నాలుగుకి ఎనిమిది ... రెట్లు ఫలితం వస్తుంది అని చెప్పడం.

ఫలితం వస్తుందో చస్తుందో కానీ, వారి సంఖ్యా విధానం మాత్రం మనకి తెలుస్తుంది.

## అంకెల ప్రాముఖ్యత

యజుర్వేదానికి ఒక లక్ష్యం ఉంది. ఏ విజ్ఞానాన్నైనా దాన్ని ఒక "నమ్మకంగా" మలచడం. రుగ్వేదంలో కనిపించని మాయ ఇది. దేన్నైనా మంత్రానికో, తంత్రానికో ముడి వేసే కుతంత్రం యజ్ఞంతోనే, యజుర్వేదంతోనే పుట్టింది. మూడు సంఖ్య ప్రాధాన్యత ఇటు వేదంలోనూ, బౌద్ధంలోనూ ఉంది. "ముమ్మారు చెప్పడం" ఒకటోసారి, రెండోసారి, మూడోసారి ..." అని ముగించడం – ఇవ్వన్నీ ఏవో కొన్ని అంకెల మీద ఉన్న నమ్మకాలే! దీనికి బౌద్ధం ఒక మనో విశ్లేషణ చేసింది. అది ఇక్కడ అప్రస్తుతం. వేదంలో 7కి, 5కి ప్రాధాన్యత నిచ్చే మంత్రాలు ఉన్నాయి.

**"సప్త తే అగ్నే సమిధ సప్త జిహ్వా స్సప్త ఋషయస్సప్త ధామ ప్రియాణి సప్త హెూత్రాస్సప్త ధా త్వా యజంతి సప్త యోనీరా పృణస్వా ఘృతేన ...."**

***–(కృ. యజు,1–5–3 (8)***

*అంటే....*

*"ఓ అగ్నీ! నీ సమిధలు ఏడు. నీకునాలుకలు ఏడు. మంత్రాలు ఏడు. నీ స్థానాలు ఏడు. నీ యాగాలు ఏడు. కాబట్టి అగ్నీ! ఏడు స్థానాల్లో నేతిని నింపు" అని.*

**పంచానాం త్వా వాతానాం.....పంచానాం త్వార్తూనాం... పంచానాం త్వా దిశాం .... పంచానాం త్వా పంచ జనానాం....పంచానాం త్వా పంచ బిలస్య....**

***–(కృ. యజు. 1–6–1)***

*ఆజ్యమా! (యజ్ఞంలో పోసే నెయ్యి) ఐదు ప్రాణాలు నియంత్రించడానికి, ఐదు ఋతువుల్ని నియంత్రించడానికి, ఐదు దిశల్ని నియంత్రించడానికి, పంచ జనుల్ని నియంత్రించడానికి, ఐదు రంధ్రాల్ని నియంత్రించడానికి – జగాల్ని ధరించడానికి నిన్ను పట్టుచున్నాను". అని.*

ఈ మంత్రంలో "ఐదు"కి ప్రాముఖ్యత – ఇలా కొన్ని సంఖ్యలకి ప్రత్యేక ప్రాముఖ్యతను ఇవ్వడం వల్ల 'సంఖ్యలకి' కూడా "కర్మబలం" ఉంది అనే సందేశాన్ని యజుర్వేదం కల్పించింది. ఈ రోగమే ముదిరి – కొన్ని మంచి సంఖ్యలు, కొన్ని చెడ్డ సంఖ్యలు అయ్యాయి.

మూడు అనే సంఖ్యకు ఎంతటి విశేష ప్రాధాన్యత ఉన్నా తెలుగులో దాన్ని 'మంచిగా' భావించరు. ఎందుకంటే దాన్ని పలకడంలో "మూడు" అంటే "మూడుతుంది" అనే చెడ్డ పలుకు వినిపిస్తుంది. అలాగే "ఏడు" అనే దానిలో "ఏడ్పు" కనిపిస్తుంది. అష్టమితో 'నష్టం' తొంగి చూస్తుంది. ఇలా కొన్ని కొన్ని అంకెలు చేదైపోయాయి.

"ఆరు ... ఆరున్నొక్కటి, ఎనిమిది" అంటారు చాటా చోట్ల. "ఏడు" అని అనరు.'సప్త' మంచిదే కానీ "ఏడు" మంచిది కాదు. ఈ రోగం ఇలా ముదిరి ముదిరి "అంకెల్లో జాతకం" దాకా పోయింది. తెలుగు పేర్లని ఇంగ్లీషు అక్షరాల్లోకి మార్చి కూడికలూ, గుణింతాలు చేసి, మంచీచెడుల్ని చెప్పే తిక్కల లెక్కల సన్నాసులు తయారయ్యారు.

"నవ" లో నవనవలాడడం (కళకళలాడడం) ఉంటుందనే '9' మీద మోజు చాలా మందికి.

## దూరం – భారం

దూరాన్ని కొలవడానికి, పంపకాల కోసం స్థలాన్ని కొలవడానికి కొలతలు చాలా అవసరం. భూపంపకాలు, వ్యవసాయ క్షేత్రాల పంపకాలు వ్యక్తులకు కాకుండా గణానికో, కుటుంబాల సమూహాలకో చెంది ఉండాలి. అందుకే ఆర్యుల్లో అటు రుగ్వేద ఆర్యుల్లో గానీ, యజుర్వేద ఆర్యుల్లోగానీ నిశితమైన కొలతలు కనిపించవు. వారికి రేఖా గణితంతో అంత అవసరం లేదు. పైగా వారికి స్థిర నివాసాల ఆవశ్యకతా లేదు. స్థిర నివాసులకు దూరాన్ని ఖచ్చితంగా కొలవాల్సిన అవసరం ఉంటుంది. వారు ఎటు తిరిగినా తిరిగి అక్కడికే రావాలి కాబట్టి. సంచారం చేస్తూ వెళ్ళే వాళ్ళకి దూరాల్ని ఖచ్చితంగా కొలవాల్సిన అవకాశం అంతగా ఉండదు. వారు అలా వెళ్ళి పోతూనే ఉంటారు. ఆగి ఆగి సాగిపోతూనే ఉంటారు. వారివి రాజకీయ పాదయాత్రలు కావు. చెక్కెర రోగుల వాకింగులూకావు ప్రతిరోజూ కొలిచి చూసుకోడానికి, ప్రచారం చేసుకోడానికీ. ఆర్యులది పశువుల మేతకోసం సాగే జీవన యాత్ర. నిత్య సంఘర్షణల యాత్ర.

అంటే ... యజుర్వేద కాలానికి కూడా ఆర్యులు సుస్థిరమైన నివాసాలు ఏర్పాటు చేసుకోలేదన్న మాట. అందుకే బుద్ధుని కాలానికి కూడా భారత దేశం గణతంత్ర రాజ్యాలుగానే ఉండిపోయింది. అప్పటి కొలతల్లో "యోజనం" వచ్చింది. కోసు, ఆమడలు ఆ తర్వాత వచ్చి చేరాయి. బౌద్ధ సాహిత్యంలో కూడా "యోజనం" అనే కొలత ఉంది.

యజుర్వేదంలో ఉన్న కొలత "ధనువు". వాజపేయ యజ్ఞంలో రథం మీది నుండి 17 ధనువుల దూరానికి ఔదంబర శిఖను విసరాలని ఉంది. ఈ ధనువు అనేది ఆనాటి కొలబద్ద అయ్యుండొచ్చు. లేదా ధనస్సు పొడవు అయ్యుండొచ్చు. ధనుస్సులు అనేక కొలతలతో ఉంటాయి. ఏ కొలత 'ధనువో' తెలియదు.

**"బుధ్నాదగ్రేణ వి మిమాయ మనైర్వజ్రేణ ఖాన్యతృణన్ నదీనాం వృథా -సృజత్పథిభిర్దీర్ఘయాథైః సోమస్య తా మద ఇంద్రశ్చకార** -(కృ. యజు. 2-3-14)

దీనర్థం :

*"నదులన్నింటినీ మొదలు నుండి చివరి వరకూ ఇంద్రుడే కొలిచాడు. నదుల ప్రవాహానికి అడ్డం వచ్చిన పర్వతాల్ని ఆయనే వజ్రాయుధంతో బ్రద్ధలు కొట్టాడు. సోమపానం వల్ల మదించి ఆ పనిని చాలా సునాయాసంగా చేయగలిగాడు".* అని.

కొలతలకు సంబంధించి పెద్ద సమాచారం ఏదీ యజుర్వేదంలో కనిపించదు.

అలాగే ... బరువుని కొలిచే విధానం. గురివింద గింజల్నే ప్రమాణంగా తీసుకొని బరువుని కొలిచే విధానం కన్పిస్తుంది.

**"దేవా వై మృత్యోరబిభయుస్తే ప్రజాపతిముపా - ధావస్తేభ్య ఏతం ప్రాజాపత్యాగ్ం శతకృష్ణలాం నిరవపత్తయై వైష్వమృతమదధాద్యో మృత్యోర్బిభీయాత్తస్మా.....**

***-(కృ. యజు. 2-3-2)***

*"చావుకి భయపడ్డ దేవతలు ప్రజాపతిని వేడుకున్నారు. ఆయన "శతకృష్ణల ఇష్టి" గురించి చెప్పాడు. ఆ ఇష్టులతో నిర్వాపం చేశాడు. దానితో వారికి అమృతత్వం మృతిలేని జీవితం కలిగింది"* అని. అంటే...

వంద గురివిందలంత ఇటుక - వంద గురి విందలంత బరువుగల బంగారంతో చేసిన ఇటుక అని అర్థం. అంటే బంగారం బరువుని గురివిందలతో కొలవడం ఇక్కడ కన్పిస్తుంది. బహుశా ఇదే కొలమానం ఇటీవల దాకా కొనసాగింది.

"చిన్నం" అనేది ఒక బంగారపు కొలత. చిన్నం అంటే 4 గురివింద గింజల బరువు. దీన్ని బట్టి 25 చిన్నాలు ఒక శతకృష్ణ. అంటే బరువుకి ప్రమాణం "గురివింద" అనేది మనం యజుర్వేదం నుండే తీసుకున్నట్లు తెలుస్తుంది. నిజానికి బంగారు, వెండి, రాగి లోహాలు ఆర్యుల కంటే సింధూ ప్రజలకే బాగా తెలుసు. బహుశా ఆర్యులు "గురివింద గింజను" వారి నుంచైనా గ్రహించి ఉండొచ్చు.

మొత్తం మీద రుగ్వేద ఆర్యుల కంటే యజుర్వేద ఆర్యులు సంఖ్యల విషయంలో కాస్త మెరుగే! గానీ, ఇతర ప్రపంచంతో పోల్చుకుంటే దిగదుడుపే! గ్రీకు సంపర్కం కలిగే వరకూ మన గణిత విజ్ఞానం గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునే కాలక్షేపం చేసింది! ఆర్యభట్టకోసం వేచి చూసింది.

ఆర్యుల జీవనంలో మార్పులు అతినెమ్మదిగా వచ్చాయి. వేలసంవత్సరాలు ఒకే జీవన విధానాన్ని వారు పాటించారు. అందువల్ల వారి నాగరికతలో వేగంలేదు. అందుకే అనేక నూతన ఆవిష్కరణలకు దూరంగా ఉండిపోయారు. అన్ని శాస్త్రాల్లా గణితశాస్త్రం కూడా అంకెల దగ్గరే ఆగిపోయింది. ఒక 'అవసరం' అనేక 'ఆవిష్కరణ'లకు తల్లి. ఆర్యుల సమాజానికి ఆ అవసరం లేదు. రాలేదు. కాబట్టి గణనీయంగా గణితం ముందుకు పోలేదు.

**ఈ నాడు మనం ఎవరైనా ఒక గణిత వేత్తను " ఈయన వేదగణిత కోవిదుడు" అని అంటే...అంకెలు, సంఖ్యలు తప్ప ఇతర గణిత సాంకేతిక పరిజ్ఞాన శూన్యుడు అనే అర్థం. అదే వేదగణిత పరమార్థం.**

***(ఇంకావుంది)***

**కేరళ వరద బాధితులకు**

**మా.వి.వే. "చేయూత"**

కేరళీయుల జీవితాలను అతలాకుతలం జేసిన వరదల వల్ల ఆ రాష్ట్రానికి జరిగిన నష్టం పూడ్చలేనిది. చేతనైనంత "చేయూత"నివ్వటమే ఎవరైనా చేయగలిగిన పని. మానవ వికాస వేదిక ద్వారా రూ. 10,000/- లను కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి 19-9-2018న ఆన్‌లైన్ ద్వారా పంపటం జరిగింది. అందుకు గాను, కృతజ్ఞతలు తెలుపుతూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి (ఫైనాన్స్) వారి నుంచి ఒక లేఖ, రసీదు అందాయి.

**రసీదు నెం . 933615373314077 తేది : 19-9-2018**

# ఆర్యుల రాకకు దిక్కుల సాక్ష్యం

ప్రాచ్యం దిశి త్వమింద్రాసి రాజోతోదీచ్యాం
వృత్రహన్వృత్ర హ ఉ యత్ర యన్తి స్రోత్యాస:

*"ఓ! ఇంద్రా! నీవు తూర్పు దిక్కుకు అధిపతివి. ఉత్తరదిక్కున ఉన్న శత్రువులను సంహరించు వాడివి. నదులు ప్రవహించే ప్రదేశాలన్నింటినీ జయించిన వాడవు...*

**-(కృ. యజు,2-4-14 )**

## 'దిక్కులు' ఎరగని సమాజం నుండి...

మనిషి జీవనంలోని పలు కోణాలు మానవ సమాజంలోని అనేక అంశాల్ని తెలియజేస్తాయి. ఆయా సమాజాల సాంస్కృతిక నేపథ్యంతోపాటు వారి వైజ్ఞానిక ప్రగతిని కూడా ప్రతిబింబిస్తాయి. వేదకాల సమాజాన్ని అర్థం చేసుకోడానికీ, వారి వైజ్ఞానిక స్థితి పట్ల ఒక అవగాహన రావడానికి మనకి ఉపకరించే అంశాల్లో 'దిక్కులు' కూడా ఒకటి.

దిక్కులు అంటే ఎల్లలు. తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణాలు. 'దిక్కు' అంటే ఆధారం అనే అర్థం కూడా ఉంది. 'నీ దిక్కున్న చోట చెప్పుకో..' అంటారు చూడండి. అంటే నీకు ఎవరు ఆధారమో, ఆసరానో వారితో చెప్పుకో అని. నిజానికి ఎల్లలు కూడా మనకి ఆధారమే.

జీవుల్లో చాలా జీవులు దిక్కులు లేనివే. తెలియనివే. స్థిరనివాసాలు ఉన్న జీవులకు మాత్రమే 'దిక్కులు' ఉంటాయి. తెలుస్తాయి. అవి ఆహారం కోసమో, మరో జీవితో కలయిక కోసమో ఎటు ఎటు తిరిగినా చివరికి తన నివాసానికి చేరాలి. కొన్ని జంతువులు, పక్షులు అలా స్థిరనివాసాలలో జీవిస్తాయి. అయితే ఆ నివాసాలు శాశ్వత స్థిరనివాసాలు కావు. తాత్కాలిక స్థిరనివాసాలే! -

ఏ జీవులైతే 'స్థిర' నివాసాలలో జీవిస్తాయో, వాటికి వాటి నివాసాలకు చేరడం కోసం కొన్ని 'ఆనవాళ్ళు' అవసరం. కొన్ని 'కొండగుర్తులు' అవసరం. ఈ ఆనవాళ్ళే తదనంతరం కాలంలో 'దిక్కుల' జ్ఞానానికి దారి చూపాయి.

ఆది మానవులు కూడా నిరంతర సంచారులు మాత్రం కాదు. వారూ తాత్కాలిక స్థిరనివాసులే. ఒక్కో ప్రాంతంలో కొంత కొంత కాలం నివసిస్తూ, తర్వాత తమ స్థావరాల్ని మార్చుకుంటూ ఉండేవారు.

ఆయా ప్రాంతాల్లో దొరికే కందమూలాలో, కాయా కమ్మలో, చేపలు మాంసాలో తింటూ గడిపేవారు. ఆహార కొరత రాగానే మరోప్రాంతానికి వెళ్ళిపోయేవారు. ఆహారం నిల్వ చేసుకోవడం తెలిశాక, తమ నివాసాల్ని మాటి మాటికి మార్చుకోవడం కంటే.. తామే దూరప్రాంతాలకు పోయి ఆహారాన్నే తమ దగ్గరకు తెచ్చుకోవడం నేర్చుకున్నారు. ఇదిగో ఈ అవసరమే వారికి దిక్కుల్ని గుర్తించడానికి కారణం అయ్యింది.

ఒక సమాజం 'దిక్కుల్ని' గుర్తించిందంటే దాని ఆహార సేకరణ పరిధి విస్తృతం అయ్యిందని అర్థం.

ఇలా చూస్తే.. వీటికంటే పశుపోషణ స్థిర ఆవాసాలకి అనుకూలం. తమ పశువుల మందలు మేయడంకోసం కావలసిన ప్రదేశం కూడా చాలా విస్తృతమై ఉండాలి. అడవిలో కాయకమ్మలు ఏరుకుని (సేకరించి) తినే సమూహాలకంటే, వ్యవసాయ సమాజం (తొలి పోడువ్యవసాయ సమాజం) మరింత స్థిరమైంది. ఇలా పశుపోషణ, వ్యవసాయం వల్ల మానవులకు జీవనభద్రత ఏర్పడింది. వాతావరణం, వేడి, వర్షపాతం, చలి, గాలులు, రోజులు, రుతువులు.. వీటికి సంబంధించిన పరిజ్ఞానం ఆ అవసరాలతోపాటు పుట్టి పెరిగింది. వీటన్నింటినీ కొలవడానికి ఆకాశంలోని సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు అవసరం అయ్యాయి. నదుల గురించిన జ్ఞానం తప్పనిసరి అయ్యింది. ఉత్పాదక పరికరాలు పెరిగాయి. ఉత్పత్తి పెరిగింది. నిత్యజీవితంలో రకరకాల ఆహార పదార్థాల్ని తినడం, ఉపయోగించుకోవడం తెలిశాక, మెల్లగా వ్యాపారం పుట్టింది. దేశదేశాలు తిరుగుతూ వ్యాపారం సాగించే వర్గం పుట్టుకొచ్చింది. నేలమీద, నౌకల మీద ప్రయాణాలు పెరిగాక, దిక్కుల్ని గురించిన పరిజ్ఞానం తప్పనిసరి అయ్యింది. వ్యాపార సమాజానికి దిక్కులే దిక్కయ్యాయి.



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

అంటే.. ఏ సమాజానికి దిక్కుల అవసరం ఎక్కువ ఉందో ఆ సమాజం స్థిరమైనది, వ్యావసాయిక, వ్యాపారరంగాలకు నెలవైనది అన్నమాట.

అందుకే.. రుగ్వేదంలో కనిపించని దిక్కుల వివరాలు యజుర్వేదంలో అనేక చోట్ల కన్పిస్తాయి.

## మొదట లెక్క మూడు 'దిక్కులే'

రుగ్వేదంలో ఒకేచోట మూడు దిక్కుల పేర్లు కన్పిస్తాయి–

**"ఆ పశ్చాతాన్నా సత్యా పురస్తాదాశ్వినా యాతమధురాదుదక్తాత్ ఆ విశ్వతః పాంచజన్యేన రాయా యాయం పాత స్వస్తిభిః సదా నః – (ఋ: 7-72-5)**

"నాసత్యద్వయమా! పశ్చిమము నుండి రండి. మా ముందుకు రండి. దక్షిణ దిక్కునుండి, ఉత్తర దిక్కు నుండి రండి. పంచజనులకు హితాన్ని కలిగించే అన్ని దిక్కుల్నుండి రండి. సంపదలు తీసుకుని రండి'–

ఇది అశ్వాల గురించి చెప్పిన రుక్కు. గుఱ్ఱాలు భారతీయ స్థానిక జంతువులు కావు. అవి మధ్య ఆసియాప్రాంతం, స్టెప్ మైదానంలో నివసించే జంతువులు. ఆర్యులు ఆ ప్రాంతం నుండి వచ్చిన వారు కావడం వల్ల గుఱ్ఱాల వినియోగం వారికి బాగా తెలుసు. వారి విజయాలకి గుఱ్ఱాలు కూడా ప్రధాన కారణమే అని మనం ఋగ్వేద వ్యాసాల పరంపరలో అనేకచోట్ల చూశాం. ఇందులో 'అన్ని దిక్కులు' అనే విషయం ఉన్నా పశ్చిమ, ఉత్తర, దక్షిణ దిక్కుల ప్రస్థావనే ఉంది. తూర్పు దిక్కు లేదు. ఇది చాలా ముఖ్యమైన సంగతి. ఆర్యులు సింధూ ప్రాంతానికి వచ్చేనాటికి ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలకి గుఱ్ఱాలు తెలియవు. ఎద్దులు మాత్రమే తెలుసు. అవే వారి ప్రయాణ సాధనాలు. అంటే మధ్య ఆసియా నుండి సింధూ ప్రాంతానికి వచ్చే దారి పొడవునా ఉత్తర దక్షిణాలుగా ఉన్న భూభాగాల్లో.. ఉత్తరాన ఉండే స్టెప్ మైదానంలో (రష్యా), దక్షిణాన ఉండే అరబిక్ భూముల్లో గుఱ్ఱాలు ఉంటాయి. కానీ వారికి తూర్పున ఉండే భారతదేశంలో గుఱ్ఱాలు ఉండవు. అందుకే పై రుక్కులో "ఓ అశ్వద్వయమా! తూర్పు నుండి రండి!" అనే విషయం లేదు.

అంటే.. ఆర్యులు 'అభారతీయులే' అనే దానికి ఈ రుక్కు ఒక చక్కని తార్కాణం.

## సింధూ ప్రజల దిక్కుల పరిజ్ఞానం

ఇక

యజుర్వేదంలో అనేక చోట్ల దిక్కుల ప్రస్తావనలు వచ్చాయి. మొదట్లో 4 దిక్కులు, తర్వాత ఐదు దిక్కులు, మనం గతంలో అనేక చోట్ల యజుర్వేద కాలాన్ని గురించి చెప్పుకున్నట్లే ఈ దిక్కుల విషయంలో కూడా యజుర్వేద ముద్రలు స్పష్టంగా కన్పిస్తాయి. అదేమిటంటే దిక్కులతోపాటు 'దిక్పాలకులు' గురించిన సమాచారం.

అసలు భౌగోళికంగా దిక్కుల సమాచారం మన దగ్గర ఉంటే.. మనం నివసించే ప్రదేశం 'ఉనికి, విస్తరణలు' తేలిగ్గా తెలుస్తాయి. మన నివాసాలకి కొండ ఏ దిక్కున ఉంది, నది ఏ దిక్కున ఉంది, సరస్సు ఎటు ఉంది, లేదా సముద్రం ఎటు ఉంది? కురిసే వర్షం ఏ వైపునుండి వస్తుంది? గాలి ఎటు వీస్తుంది?– ఇలాంటి అనేక భౌగోళిక విజ్ఞానమంతా దిక్కుల ఆధారంగానే పరిశీలించగలం. ఋతువుల్ని, ఋతుపవనాల్ని అలానే గుర్తించగలం. ఇదంతా భౌగోళిక అంశమే. అలాగే.. తమ సమూహాల్లో వేర్వేరుగా సమూహాలు ఏ దిక్కున ఉన్నాయి? ఏయే రాజ్యాలు ఏ దిక్కుకేసిపోతే వస్తాయి? అనేది కూడా దిక్కుల ఆధారంగానే గుర్తిస్తాం. అది గట్టి భౌగోళిక విజ్ఞానం కూడా. దిక్కుల పరిజ్ఞానం ఉన్న సమాజానికి సుస్థిరమైన నివాసం, రాజ్యం కూడా ఉన్నట్టే.

అందుకే ఋగ్వేద ఆర్యులకంటే యజుర్వేద కాలం నాటి ఆర్యులు స్థిరనివాసులు. ఋగ్వేద సంచార ఆర్యజాతులు సింధూలోయలో సింధూనాగరకతను ఓడించి స్థిరపడ్డాక, వ్యవసాయం, వ్యాపారం నేర్చాక వారిలో 'దిక్కుల' పరిజ్ఞానం ఎక్కువగా కన్పిస్తుంది. ఇది వారు నాగరికతలో భాగంగానే నేర్చారా? సింధూ ప్రజల నుండి వంటబట్టించుకున్నారా? అనేది అంత తేలిగ్గా తేల్చేది కాదు. ఎందుకంటే.. సింధూ ప్రజలకు దిక్కుల పరిజ్ఞానం ఎంత ఉందో మనకి సరైన 'ఆధారం' ఏదీ లభించలేదు. నగర నిర్మాణాలు, రహదారుల నిర్మాణాలు చూశాక అంత నాగరకత ఉన్నవారికి దిక్కుల పరిజ్ఞానం లేకుండా ఉంటుందా? అంటే.. 'తప్పక ఉండే ఉంటుంది' అనేది నిర్వివాదాంశం. పైగా వారు వ్యాపారులు. విదేశాలతో వ్యాపారాలు సాగించినవారు. మెసపుటోమియాతో గట్టి వ్యాపార సంబంధాలు ఉన్నాయి.

ఈ విషయం మన సింధూ త్రవ్వకాల్లో దొరక్కపోయినా, మెసపుటోమియాలో దొరికాయి. మెసపుటోమియాలో దొరికిన ఒక ఆధారంలో దేవదారు కలప, సుగంధద్రవ్యాలు లాంటి సరుకులు తాము 'మెలూహ' ప్రాంతంనుండి తెస్తున్నట్లు చెప్పారు. వారు ఆ ఆధారంతో గీచిన పటం ఆధారంగా, ఆ పటంలో చూపిన మార్గం ఆధారంగా అది సింధూ మైదాన తీరప్రాంతంలోని ఒక ఓడరేవుగా తెలుస్తుంది. అలాంటి మ్యాప్‌లు ఏమీ సింధూ నాగరికత అవశేషాల్లో ఇంతవరకు బైటపడలేదు. కానీ మెసపుటోమియా(ఇరాక్)లో దొరికింది. దీన్నిబట్టి సింధూ వ్యాపారుల విదేశీ వ్యాపార సామర్థ్యం అర్థమవుతోంది. అంత

వ్యాపార సామర్థ్యం ఉన్నవారికి 'దిక్కుల' గురించిన పరిజ్ఞానం లేకుండా ఉంటుందా?

కాబట్టి ఆర్యులు సింధూ తీరాలకి చేరాకే దిక్కుల పరిజ్ఞానాన్ని నేర్చుకున్నారనేది తేలిపోతోంది. పైగా తాము ఋగ్వేదంలో స్తుతించిన- ఇంద్ర, అగ్ని, వరుణ, యమ, అశ్వనులు లాంటి దేవతల్ని ఒక్కొక్కర్ని ఒక్కోదిక్కుకు అధిపతిని కూడా చేశారు. ఈ దిక్పాలకత్వం యజుర్వేదం అంతటా ఒకేరకంగా కన్పించదు. వేర్వేరు మంత్రాల్లో వేర్వేరు దిక్పాలకత్వం కన్పిస్తుంది. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం...

## యజుర్వేదంలో నాలుగు దిక్కులు

ఋగ్వేదంలో మూడు దిక్కులపేర్లే చూశాం. శుక్లయజుర్వేదంలో ఒకచోట, కృష్ణయజుర్వేదంలో ఒకచోట 4 దిక్కుల వివరం ఉంది.

**"ఇంద్ర ఘోషస్త్వా వసుభిః పురస్తాత్పాదు ప్రచేతా స్త్వా రుద్రైః పశ్చాతృతం మనోజవా స్త్వా పితృభిర్ధక్షిణతః పాతు విశ్వకర్మా త్వాది త్యైరుత్తరతః పాత్విద మహస్తప్తం వార్భహిర్ధా యజ్ఞాన్ని సృజామిః" – (శు.యజు: 5-11)**

దీనర్థం సంక్షిప్తంగా ఇది: యజ్ఞవేదికను గురించి

*'ఓ! ఉత్తర వేదీ! ఇంద్రుడు తూర్పుదిక్కు నుంచి వచ్చే ఆపదల్ని, వరుణుడు పడమటి దిక్కు నుండి యముడు దక్షిణదిక్కు నుండి, విశ్వకర్మ ఉత్తరదిక్కు నుండి వచ్చే ఆపదల్ని, నివారిస్తారు"–*

ఇదే మంత్రం కృష్ణ యజుర్వేదంలో కొద్దిగా మార్పుతో ఉంది.

**"ఇంద్రఘోషం వసుభిః పురస్తాత్ పాతు**
**మనోజవా త్వాపితృభిః దక్షిణతః పాతు**
**ప్రచేతాః త్వా రుద్రై పశ్చాత్ పాతు**
**విశ్వకర్మాత్వా ఆదిత్యైః ఉత్తరతః పాతు"**(కృ.యజు: 1-2-12)

దీనర్థం *"ఇంద్రుడు తూర్పు నుండి, యముడు దక్షిణం నుండి, రుద్రుడు పడమర నుండి, విశ్వకర్మ ఉత్తరం దిక్కు నుండి ఆపదలు రాకుండా చూస్తారు"*

## దిక్కులు - దిక్పాలకులు

ఐదు దిక్కులను తెలిపే మంత్రాలు యజుర్వేదంలో చాలా చోట్ల ఉన్నాయి. ఐదు దిక్కుల్ని ప్రత్యేకంగా గుర్తించినట్లు కనిపిస్తుంది. దిక్కులు ఐదే అయినా, వివిధ మంత్రాల్లో వేర్వేరు దిక్పాలకుల ప్రస్తావనలు ఉన్నాయి.

ఇది రాజసూయ మంత్రరా

**"స్వాహా అగ్నినేత్రేభ్యో దేవేభ్యః పుర్ణ సద్భ్యః**
**స్వాహా యమ నేత్రేభ్యో దేవేభ్యోః దక్షిణా సద్భ్యః**
**స్వాహా విశ్వదేవ నేత్రేభ్యో దేవేభ్యః పశ్చాత్సద్ భ్యః**
**స్వాహా మిత్రావారుణేత్రేభ్యో వా మరున్నేత్రోభ్యోఽఉ త్తరాసద్భ్యః స్వాహా**
**సోమ నేత్యేభ్యో దేవేభ్యఽ ఉపరిసద్భ్యోదువస్వదేభ్యః స్వాహా!"**

**– (శు.యజు: 9-35)**

దాదాపుగా ఇదేమంత్రం 36వ మంత్రంగా వస్తుంది:– ఈ రెండు మంత్రాలకూ అర్థం ఇది–

"తూర్పు దిక్కున కూర్చొని ఉన్న అగ్నినేతృక దేవతకు స్వాహా! దక్షిణ దిక్కున ఉన్న యమనేతృక దేవతకు, పశ్చిమదిక్కున ఉన్న విశ్వదేవత నేతృక దేవతకు, ఉత్తర దిక్కున ఉన్న మిత్రావరుణ నేతృక దేవతకు, పై దిక్కున ఉన్న సోమనేతృక దేవతకు స్వాహా!–

అలాగే.. శుక్ల యజుర్వేదం 15వ అధ్యాయంలో ఈ మంత్రాలు చూద్దాం...

**"రాజ్ఞ్యసి ప్రాచీదిగ్వసవస్తే దేవాః..."** (10)
"ఇటుకా! నీవు తూర్పు దిక్కువు. నీ పాలకులు వసువులు."
**"విరాడసి దక్షిణా దిగ్రుద్రాస్తే దేవాః** (11)
"నీవు దక్షిణ దిక్కువు. నీ పాలకులు రుద్రగణాలు
**"సమ్రాడసి ప్రతీచీ దిగాదిత్యస్తే దేవాః...**(12)
"నీవు పశ్చిమ దిక్కువు. ఆదిత్య గణాలు నీ పాలకులు"
**"స్వరాడస్యుదీ చీ దిగ్ మరుతస్తే దేవాః** (13)
"నీవు ఉత్తర దిక్కువు. మరుత్తులు నీ పాలకులు"
**"అధిపత్న్యసి బృహతీదిగ్విశ్వేదేవాః...** (14)
"నీవు ఊర్ధ్వ దిక్కువి. నీ పాలకులు విశ్వదేవతలా

అలాగే శుక్ల యజుర్వేదం 17వ అధ్యాయం 15వ మంత్రంలో 'ఐదు దిక్కులు, ఐదు దేవతలు నన్ను రక్షించుగాక" అని ఉంది.

16వ అధ్యాయంలో 63, 64 మంత్రాల్లో కూడా– "రెండు చేతులు (దశాంగుళిలు) జోడించి ఐదు దిక్కులకు నమస్కరిస్తున్నాను" అని ఉంది.

ఆ విధంగానే శుక్లయజుర్వేదం 37-12లో ఇలా ఉంది.

*"ఓ భూమీ! నీవు తూర్పుదిక్కున అగ్ని ఆధిపత్యంలో ఉన్నావు. దక్షిణదిశయందు ఇంద్రుని, పశ్చిమదిశలో సవిత, ఉత్తర దిక్కున ధాత, ఊర్ధ్వదిక్కున బృహస్పతి ఆధిపత్యంలో ఉన్నావు".*

కృష్ణయజుర్వేదం 1-8-7లో ఇలా ఉంది.

తూర్పుకు అగ్ని, దక్షిణానికి యముడు, పడమరకు సవిత్ర, ఉత్తరానికి వరుణుడు, ఊర్ధ్వదిక్కుకి బృహస్పతి

రక్షకులు- అని

అలాగే... కృష్ణయజుర్వేదం 4-4-2లో, 4-4-3లో, 4-5-11లో ఐదు దిక్కుల విషయం ఉంది.

ఇక్కడ మనం ప్రత్యేకంగా గుర్తుంచుకోవాల్సిన విషయం యజుర్వేద కాలానికి ఐదు దిక్కుల గుర్తింపు విశేషంగా ఉంది. నాలుగు దిక్కులతోపాటు ఐదో దిక్కు వచ్చి చేరింది.

ఆ తర్వాత పురాణ కాలానికి ఎనిమిది దిక్కులు వచ్చాయి. తూర్పుదిక్కుకి ఇంద్రుడు, దక్షిణ దిక్కుకి యముడు, పశ్చిమదిక్కుకి వరుణుడు, ఉత్తర దిక్కుకి కుబేరుడు దిక్పాలకులయ్యారు. వేదంలో లేని 'కుబేరుడు' కొత్తగా వచ్చి చేరాడు. అంటే సమాజంలో 'ధనం' విలువ పెరిగి మానవ సంబంధాల్లో డబ్బు ప్రధానపాత్ర పోషించడం మొదలు పెట్టిందన్నమాట. బంగారం, వెండిలాంటి మూలకాలు, వజ్రాలు, రత్నాల వ్యాపారం బాగా పెరిగిందన్నమాట. దానితో ప్రకృతి దేవతలతోపాటు 'ధన' దేవత కూడా వచ్చి దిక్పాలకుల స్థానంలో కూర్చొన్నాడు. ప్రకృతి శక్తులైన అగ్ని, నైరుతి, వాయువు, ఈశానులు 'మూలల దిక్పాలకులు'గా మారిపోయారు.

ఋగ్వేదకాలంలో మూడు దిక్కులు, యజుర్వేదకాలంలో నాలుగు, ఐదు దిక్కులు విశేషంగా గుర్తించబడ్డాయి.

## ఆర్యుల రాకను తెలిపే దిక్కులు

ఈ దిక్కుల్లో మనం జాగ్రత్తగా వెదికితే సింధూ, గంగానదీ మధ్యప్రాంతంలోని వాతావరణం, రుతుగమనం కొంత కనిపిస్తుంది. అంటే యజుర్వేదకాలానికి ఆర్యులు సింధూ తీరం దాటి తూర్పున గంగా యమునల తీరందాకా విస్తరించినట్లు కనిపిస్తుంది. గంగా తీరానికి చేరాకే ఆర్యులు ధనవంతులయ్యారు. మంచి వ్యావసాయికులయ్యారు. పశు పోషణ విడచి, పొలం పనులకు మళ్ళారు. ధాన్యరాశులెత్తిన ఆర్యులు ఆర్యక్షత్రియులుగా అగ్రస్థానంలో ఉంటే, పశుపాలన వదలక, కొద్దో గొప్పో వ్యవసాయం మీద బ్రతికే ఆర్యులు కాస్త వెనుకబడి రాజ్యాధికారానికి అర్హులు కాలేకపోయారు. వారిలో యదులు ప్రధానమైనవారు-

చాలా మంత్రాల్లో తూర్పుదిక్కుకు ఇంద్రుణ్ణే అధిపతిగా ఉంచారు. కారణం ఇంద్రుడు ఆర్యుల యుద్ధదేవత. దస్యువినాశకుడు. యుద్ధంలో నాయకుడు ఎప్పుడూ ముందు ఉండాలి. మధ్య ఆసియా పశ్చిమ ప్రాంతం నుండి తూర్పువైపుకు ఆర్యులు తరలి వచ్చారని ఈ మంత్రం స్పష్టంగా చెప్తుంది. తూర్పు దేశాల్ని ఇంద్రుడు జయించాడు. అంటే సింధూ, గంగా తీరాల్ని జయించాడు. నదుల దేశమైన సింధూ, పంజాబ్ ప్రాంతాన్నంతా జయించాడు. దానితోపాటు ఉత్తరాన ఉన్న కాశ్మీర్, ఆఫ్ఘన్, టిబెట్, నేపాల్ ప్రాంతాల్లోని కిన్నెరలనూ, కింపురుషులనూ, కామరూపులనూ జయించాడు- అంటే సింధూగంగా మైదానం, హిమాలయాలు ఆర్యులు ఆక్రమించారని ఈ మంత్రం తెలియజేస్తుంది.

మనం మొదటి నుండి చెప్పుకున్నట్లే ఋగ్వేదంలోని విజ్ఞానాన్ని యజుర్వేదం క్రతువుల్లోకి మార్చేసింది. దిక్కులద్వారా భౌగోళిక ఆవిష్కరణలకు సాగాల్సిన విజ్ఞానం దిక్పాలకులకు బలులివ్వడానికే పరిమితమైపోయింది. గొప్పగా ఆవిష్క రించాల్సిన కొత్తకొత్త భౌగోళిక ఆవిష్కరణలు యజ్ఞవేదిక చుట్టూ దిక్కులు చూస్తూ, వెర్రిముఖం వేసుకుని నిలబడ్డాయి. యజ్ఞంలో యాగకర్తలు ఏదిక్కుకు నిలబడి మంత్రం చదవాలి, ఏదిక్కుకు తిరిగి జంతువుని బలివ్వాలి... ఇలా దిక్కుల ప్రాధాన్యతను యజుర్వేదం మార్చేసింది. చివరికి యజుర్వేదానంతర కాలంలో ఈ దిక్కుల పిచ్చి ఉంతగా ముదిరిందంటే... ప్రయాణం ఏదిక్కుగా మొదలు పెట్టాలి? పడుకునేప్పుడు తల ఏ దిక్కుకు పెట్టాలి? ఏదిక్కుకు పెట్టకూడదు? పూజాదికాల్లో ఎటుకూర్చోవాలి? రాజులు ఏ దిక్కుకు సాగి యుద్ధం మొదటు పెట్టాలి? చివరికి.. ఎటుముఖం పెట్టుకుని దొడ్డికి కూర్చోవాలి? ఉచ్చపోయాలి? చచ్చినప్పుడు తల ఎటుపెట్టి తగల పెట్టాలి? ఇదిగో ... ఇలాంటి మూఢనమ్మకాలన్నింటికీ మూలం యజుర్వేదమే! ఇదంతా అది భౌగోళిక దిక్కులకు దిక్పాలకుల్ని కల్పించిన పాపమే!

చివరికి దిక్కుల్ని పూజించడం నిత్యకృత్యమైపోయింది. సంధ్యావందనం అంటేనే దిక్పాలకుల పూజగా మారిపోయింది. బుద్ధుని కాలానికే ఈ జాఢ్యం ముదిరిపోయింది. దిక్కులవిషయంలో ఎన్ని మూఢనమ్మకాలున్నాయో బౌద్ధంలోని దీర్ఘనికాయంలో మహాజాల సుత్తంలో చూడవచ్చు.

## బౌద్ధం - దిక్కులు - దిక్పాలకులు

యజుర్వేదకాలం తర్వాత రెండు వందల సంవత్సరాలకు వచ్చిన బౌద్ధం 'దిక్పాలకుల' పూజకు ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేసింది. బౌద్ధం రాకతో రెండు ప్రధానమార్పులు జరిగాయి.

**1. దిక్పాలకుల మార్పు**

**2. నూతన ప్రదేశాల ఆవిష్కరణ**

ఒకరోజున బుద్ధుడు ఒక నదీతీరం వెంట వస్తూ ఉంటే 'సిగాలుడు' అనే యువకుడు నదిలో దిగి నీటిలో దిక్కులకు నమస్కరిస్తూ ఉంటాడు. అప్పుడు బుద్ధుడు

''సిగాలా! ఎవరికి నమస్కరిస్తున్నావు?'' అని

అడుగుతాడు. నేను ఇంద్ర, వరుణ, యమ, అగ్ని వాయువులనే దిక్పాలకులకు" అంటాడు.

"వారిని ఎప్పుడైనా చూశావా?"

"లేదు గౌతమా! నా తండ్రి ఇలా చేయమని చెప్పాడు"

"నీ తండ్రి ఎప్పుడైనా చూసినట్లు చెప్పాడా?"

"లేదు. ఆయనకి ఆయన తండ్రి చెప్పాడు" అంటాడు సిగాలుడు.

"సిగాలా! నేను దిక్కులకు నమస్కరించవద్దు అని చెప్పను. కానీ మనం తెలియని దేవతలకు కాదు, తెలిసిన పూజ్యులకు నమస్కరించవచ్చు గదా!" అంటాడు బుద్ధుడు.

"ఎవరా పూజ్యులు?" అని ప్రశ్నిస్తాడు సిగాలుడు.

"సిగాలా విను! **తూర్పు దిక్కుకు తల్లిదండ్రులు దిక్పాలకులు. ఉత్తరదిశకు విద్యాబుద్ధులు నేర్పే గురువులు దిక్పాలకులు. దక్షిణదిశకు భార్యాబిడ్డలు, పశ్చిమ దిశకు మిత్రులు. పై దిక్కుకు శ్రమణులు, జ్ఞానులు, క్రింది దిక్కుకు శ్రామికులు, దాసులు. నా దృష్టిలో వీరే దిక్పాలకులు. వీరిని గౌరవించు. పూజించు" అని చెప్తాడు బుద్ధుడు. సిగాలుడు అంగీకరిస్తాడు.**

మనం ముందే చెప్పుకున్నట్టు ''దిక్కు'' అంటే 'ఆధారం' అని. మన సమాజం నడవడానికి, మన మనుగడ సాగడానికి పైన బుద్ధుడు చెప్పినవారే సరైనదిక్కు. ఇలా దిక్కుల్ని, దిక్పాలకుల్నీ సామాజీకరించి, సామాజికచట్రంలోకి తెచ్చాడు బుద్ధుడు.

ఇక్కడ బుద్ధుడు ఆరు దిక్కుల గురించి చెప్పాడు అంటే యజుర్వేదకాలం నాటి ఐదు దిక్కుల జాబితా బుద్ధుని కాలానికి ఆరు దిక్కుల పట్టికగా మారిందన్నమాట. ఒక దిక్కు పెరిగింది.

ఇది దిక్కుల విషయంలో వేదకాల ఆధ్యాత్మిక భావాన్ని సామాజిక ధార్మిక భావంగా మలచడం. ఇది మొదటిపని.

ఇక రెండోపని, భిక్షువులు నిరంతరం తిరుగుతూ (చారిక చేస్తూ) ధర్మప్రచారం సాగించాలి కాబట్టి ఎందరో భిక్షువులు ప్రపంచం నలుమూలలకీ వెళ్ళారు. నదులు దాటారు, హిమాలయాలు దాటారు, సముద్రాలు దాటారు. కొత్త కొత్త ప్రపంచానికి చేరారు. కొత్తకొత్త ప్రపంచ దారులు చూపారు. అంతర్జాతీయ మార్గాలు వేశారు. బౌద్ధం ద్వారా మొదటిసారి భారతదేశం భూగోళానికి ధార్మికకేంద్రంగా మారింది. భారతదేశం నుండే ఎన్నో ప్రపంచమార్గాలు ఏర్పడ్డాయి. ప్రపంచ పటాలకి, వివిధ దేశాల ఉనికీ, విస్తరణలకీ బౌద్ధం బాటలు తీసింది. మధ్య ఆసియా నుండి చైనా తీరం వరకూ ఏర్పడ్డ సిల్క్‌రోడ్ ఇందులో భాగమే! చైనాకు బోధిధర్ముని ప్రయాణం, టిబెట్ మీదుగా కుమారకాశ్యపుని చైనాయానం, ఇలా బౌద్ధం తొలి "ప్రపంచీకరణ"కు కారణం అయ్యింది. భిన్న జాతులు, భిన్న సంస్కృతుల ఏకీకరణకి మూలం అయ్యింది.

ఇలా దిక్కుల పరిజ్ఞానాన్ని ప్రపంచయాత్రలకు దిక్సూచిగా మార్చింది బౌద్ధం. బౌద్ధ భిక్షువుల యాత్రా విశేషాల్లో నూతన ప్రదేశాలు, నూతన పర్వతమార్గాలూ, నూతన సముద్ర ఓడరేవులు ఎన్నెన్నో కన్పిస్తాయి.

## దిక్కులు - తొలి భౌగోళిక పటాలు

ఐతే...

దిక్కుల పరిజ్ఞానంతో ప్రపంచ పటాల రూపకల్పనకు బౌద్ధం కూడా నడుం కట్టిన దాఖలాలు కన్పించవు.

**క్రీ.పూ. 1200 శతాబ్దంలోనే చైనా చక్రవర్తి వోకో కాలంలో దేశపటాల రూపకల్పన జరిగింది. చైనా దేశాన్ని, దానిలోని నదుల్ని, పొరుగు దేశాల్ని గుర్తిస్తూ ఒక పటం రూపొందింపచేశాడు. ఇది క్రీ.పూ. 1137 నాటిది. ఇప్పటి వరకూ మనకు దొరికిన మొదటి దేశపటం ఇదే.** తమ దేశానికి ఏ దిక్కు ఏయే దేశాలు ఉన్నాయి. నదులు ఎటునుండి ఎటు ప్రవహిస్తాయి. ఎక్కడ అడవులు, కొండలు ఉన్నాయి- ఇలా ఎంతో సమాచారం ఆ పటంలో ఉంది.

దిక్కుల పరిజ్ఞానాన్ని భౌగోళిక విజ్ఞానంగా మార్చిన ఆవిష్కరణ ఇది.

దిక్కులు రెక్కలు తొడిగి నలుదిక్కులా ఎగిరి ప్రపంచాన్ని వీక్షించాల్సిన సమయంలో- దిక్కుల రెక్కలకు దిక్పాలకుల హుక్కులు తగిలించి యజ్ఞవేదిక చుట్టూ బంధించి బలి పెట్టేసింది యజుర్వేదం, వైదికం. ఆ మూఢత్వాన్ని కొద్దోగొప్పో బౌద్ధం సంస్కరించి, సామాజీకరించిందే కానీ, అదీ ప్రపంచ భౌగోళిక విజ్ఞానానికి బలమైన దారులు తీయలేకపోయింది-

ఆ విజ్ఞానాన్ని అందుకోలేకపోవడం వల్ల, సరైనరీతిలో మలచుకోకపోవడం వల్ల, బౌద్ధం పతనం చెందడం వల్ల, చివరికి వైదికం సముద్రయానాన్నే నిషేధించాక, దిక్కుల విజ్ఞానం రెక్కలు తెగిన పక్షిలా మిగిలిపోయింది. అదే దిక్కుల జ్ఞానాన్ని పెంచుకుంటూ నావికా యానంతో ప్రపంచాన్ని జయించింది యూరప్.

దేశ ఎల్లలు దాటిన సింధూపరిజ్ఞానం, బౌద్ధ విజ్ఞానం వైదిక దెబ్బకు కుదేలయ్యాయి. ప్రపంచాన్ని వెతుక్కుంటూ పోవాల్సిన భారతదేశ విజ్ఞానం దిక్కులేక, దిక్కుతెలియక యజ్ఞవేదికల కూడలిలో కుదేలై పడిపోతే - చివరికి విదేశీ భౌగోళిక పరిజ్ఞానమే వెతుక్కుంటూ వచ్చింది.

ఇలా వైదిక అజ్ఞానం వల్ల భారతీయ 'భౌగోళిక' పరిజ్ఞానం ప్రపంచ చౌరాస్తాలో దిక్కులు చూస్తూ నిలబడాల్సి వచ్చింది. ***(ఇంకావుంది)***

వేదాలు - విజ్ఞానం : 22

# మంత్రాలకు చింతకాయలే కాదు చినుకులూ రాలవు

> **"సధమాదో ద్యుమ్నినీరూర్జ ఏతా అనిభృష్టా అపస్యువో వసాన్న**
> **పస్త్యాసు చక్ర వరుణ్ణ సధస్థమపాగ్ం శిశుర్మాతృత మాస్వన్న"**
>
> *"జలాలు దీప్తిగలవి. బలాన్నిచ్చేవి. వస్త్రంలాగా వ్యాపించేవి. వరుణుడు జలాలకు బిడ్డలాంటి వాడు. జలాలు వరుణుణ్ణి తమలో ఉంచుకొని తల్లుల్లా లాలిస్తాయి"*
>
> **– కృష్ణ యజుర్వేదం : 1-8-12**

## కప్ప పెళ్ళి మంత్రం లొల్లి

వానలు కురవడానికీ వరిచేలు పండటానికీ విడదీయరాని సంబంధం ఉంది. కానీ, యజ్ఞాల్లో రక్తం పారించడానికీ, నేతిని కారించడానికీ పంటలకూ ఏం సంబంధం ఉంది? పంట పండాలంటే పైరులు పెరగాలి. పైరులు పెరగాలంటే వానలు కురవాలి. వానలు కురవాలంటే రుతువులు మారాలి. అంతేగానీ, యజ్ఞం చేస్తే వాన కురుస్తుందా? యజ్ఞం చేస్తే పంట పండుతుందా?

వాతావరణంలో పొగ (కార్బన్) లేకుండా వర్షం పడని మాట నిజం. ఆవిరైన నీటి అణువులకి అనుకూలమైన ఆసరా ఏదో ఒకటి కావాలి. అది కర్బనమే! అగ్నిపర్వత చర్యలు, అడవుల్లో రేగిన మంటలు, ఇంటింటా పొయ్యిల్లోంచి రేగిన పొగలు...వీటి నుండి ఆకాశంలోకి కార్బన్ చేరుతుంది. కార్బన్ కణాల మీదికి నీటిఆవిరి కణాలు వచ్చి చేరతాయి. దాదాపు 80 లక్షల నీటి ఆవిరి కణాలు చేరితేగాని నీటి చుక్క ఏర్పడదు. అప్పుడే ఆ చుక్కలు వాన చినుకుల్లా నేల రాలుతాయి. కార్బనే కాదు, ఉప్పు, ధూళి కణాలు ఉన్నా వర్షం పడుతుంది.

వర్షం పడడానికి నీటి ఆవిరి, మేఘాలు, ఎత్తైన పరిసరాలు ఇలా ఎన్నెన్నో కారణాలుంటాయి. ప్రధానమైన కారణం పొగకాదు. నీటి ఆవిరే! యజ్ఞం వల్ల వచ్చే పొగలో నీటి ఆవిరి ఉండదు. అది సూర్యుని వల్లే సాధ్యం. అది ఒక ప్రాకృతిక క్రియ. లేదా సహజ కర్మ. అలాగే..చెట్లు, అడవులు, కొండలు మేఘాలకి చల్లదనాన్నిచ్చి త్వరగా వర్షించేలా చేస్తాయి.ఇదీ వర్షం కథ.



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

అంతేగానీ... యజ్ఞం చేస్తే వర్షం పడదు. కప్పలకు పెళ్ళి చేసినా వాన రాదు. ఎందుకంటే... మంత్రాలకు చింతకాయలే రాలవు! చినుకు లెలా రాలతాయి!!

అయితే... యజ్ఞాన్ని వర్షానికీ, వ్యవసాయానికీ ముడిపెట్టడం మనం తొలిగా యజుర్వేదంలోనే చూస్తాం. ఈ ముడిని ఇంతటితోనే ముగించకుండా వర్ణవ్యవస్థతో ముడిపెట్టడం కూడా అక్కడే చూస్తాం. దీని వెనుక అర్థం, అంతరార్థం ఏదో ఉంది! ఆ బాదరాయణ సంబంధం అర్థం కావాలంటే చిటపట చినుకుల తొలకరి వానలకి, భగభగ మండే యజ్ఞాలే కారణం అనే (అ)జ్ఞానాన్ని చెప్పే కపటోపాయాన్ని తెలుసుకోవాల్సిందే!

అందుకోసం 'యజుర్ వేద' కాలానికి పోవాల్సిందే!

## మూడు పర్వత పంక్తుల నడుమ

ఒక ప్రాంతంలో జీవించే ప్రజల ఉన్నతి, వారి ఉత్పత్తుల మీద ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. ఆర్యులు తొలుత పశుపాలకులనీ, భారత భూభాగానికి వచ్చిన తర్వాతే స్థిరపడ్డారనీ, సింధూ ప్రజల నుండి వ్యవసాయ, వ్యాపారాల్ని అలవర్చుకున్నారని మనం ఋగ్వేద ఆర్యుల గురించి చర్చించుకున్నప్పుడే చెప్పుకున్నాం. వ్యవసాయం ఎక్కడైనా ఎప్పుడైనా వర్షపాతం మీదే ఆధారపడి ఉంటుంది. భారత దేశ భూభాగంలో రుతుపవన వర్షపాతం, పర్వతీయ వర్షపాతం, సంవహన వర్షపాతం – ఈ మూడు రకాల వర్షపాతాలూ ఉన్నాయి. అందుకే ఇది నదుల దేశం అయ్యింది. ప్రపంచంలో మరెక్కడా లేని రుతుపవన వర్షపాతం భారత భూభాగ స్వంతం.

రుతుపనవ వర్షం రుతువుల్ని బట్టి దీర్ఘకాలం సంభవిస్తుంది. అలాకాకుండా అడపాదడపా వచ్చే పర్వతీయ వర్షం, సంవహన వర్షం స్థానికంగా సంభవించే వర్షాలు. ఇవి భారత దేశంలో పలు ప్రాంతాల్లో పలురకాలుగా ఉన్నా ముఖ్యంగా అటు హిందూకుష్ పర్వతాలూ, ఇటు ఆరావళి పర్వతాలు, ఈ వైపునున్న వింధ్య, సాత్పుర పర్వతాలు మూడు

పర్వత పంక్తు మధ్య ప్రాంతంలో పర్వతీయ వర్షపాతం ఎక్కువ ఉంటుంది. పైగా ఆర్యులు కదలి వచ్చిన మధ్య ఆసియా నుండి సింధూ ప్రాంతం పొడవునా సంభవించేవి పర్వతీయ, సంవహన వర్షాలే! ఈ రెండు రకాల వర్షాలు కొద్ది ప్రాంతాలకే చెందిన స్థానిక వర్షాలు.

ఇప్పుడు, ఇక్కడ ఈ వర్షపాతాల విషయం ఎందుకంటే ... ఆర్యులు అద్భుతమైన కళాపిపాసులు. నృత్యం, గానం లాంటి కళల్లో ఆరితేరినవారు. ఆ కళా నైపుణ్యం వారి కవిత్వంలో కూడా కన్పిస్తుంది. వేదాల్లో వర్షాన్ని, గాలినీ, మెరుపుల్ని, మేఘాల్ని అనేక చోట్ల అద్భుతంగా వర్ణించారు. వారి వర్ణనల్ని చూస్తే అవి పర్వతీయ వర్షాలా? సంవహన వర్షాలా? రుతుపవన వర్షాలా? అనేవి తెలిసిపోతాయి. ఆ వర్షాల వివరాలు తెలిస్తే వారి జీవనం, వారు నివసించిన ప్రదేశాలు కూడా తెలుస్తాయి.

180 కి.మీ వేగంతో వీచే గాలీ వాన ( తుపాన్) తీవ్రత ఎలా ఉంటుందో తీరవాసులకే తెలుసు. పీఠభూమి వాసులకు అంతగా తెలియదు. నిముషాల వ్యవధిలో చెలరేగే సుడిగాలి వానలు పర్వత ప్రాంతాలవారికి తెలిసినట్టు తీర వాసులకు తెలియదు. శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తినప్పుడు కొట్టిన వాన పర్వతీయ వర్షం. రుతుపవన వర్షం కాదు. వాయుగుండ వర్షం కాదు. కాబట్టి ఆ వర్ష వర్ణనని బట్టి అది ఏ ప్రాంతమో చెప్పవచ్చు.

## తొలి అడుగే.....

వర్షం ఎలా వస్తుంది? ఎలా పుడుతుంది? అనే విషయాన్ని వారికున్న అనుభవంతో రుగ్వేద ఆర్యులే కొంత చెప్పారు. వారి కాలానికి దాదాపు ఏడెనిమిది వందల సంవత్సరాల తరువాతి వారైన యజుర్వేద ఆర్యులు కూడా వర్షాల గురించి, వ్యవసాయం గురించి తగినంతే చెప్పారు. కానీ, వాటిలో అంత గొప్ప నూతన వైజ్ఞానిక అంశాలేవీ లేవు.

మనం గతంలో చెప్పుకున్నట్లు యజుర్వేద కాలానికి యజ్ఞమే గొప్ప కార్యంగా ప్రచారం పొందింది. రుగ్వేదంలో కొద్దో గొప్పో సాగిన ప్రకృతి అన్వేషణని యజుర్వేదం లోని యజ్ఞ భూతం మింగేసింది. ఆ మింగడం ఈ "వర్షం" విషయంలో కూడా కన్పిస్తుంది.

**"ఇషే త్వోర్జే త్వావాయవ స్థాదేవో : సవితా**
**ప్రార్పయతు శ్రేష్ఠత మాయ కర్మణ ..."** (శు.యజు : 11)

దీని అర్థం....

*"ఓ పలాశ చెట్టు కొమ్మా ! వర్షం కోసం, అన్నం కోసం, బలం కోసం నిన్ను కొడుతున్నాను ..."*

"యజ్ఞం వల్ల వర్షం కలుగుతుంది" అనే భావనకి మూలం ఇది. ఈ నమ్మకం ఈనాటికీ ఒక మూఢ నమ్మకంగా ఇంకా కొందరిలో ఉండి పోయింది. నిజానికి యజ్ఞం వల్లకురిసే వర్షాలు కూడా కురవకుండా పోతాయి. ఎలాగంటే యజ్ఞం కోసం, సమిధలుగా ఎన్నో చెట్లు కొట్టాలి. చెట్లు తగ్గిపోవడం అనావృష్టికి ఒక ప్రధాన కారణం. యజ్ఞం పేరుతో వేలకు వేలు చెట్లు నరకడం వల్ల వర్షాలు క్రమేపీ తగ్గిపోయి, అనావృష్టి ఏర్పడి, దుర్భిక్షం కలుగుతుంది. ఒక దేశంలో వర్షపాతం సరిగ్గా ఉండాలంటే ఆదేశంలో అడవులు మొత్తం భూభాగంలో 27% తగ్గకుండా ఉండాలి. అంటే మూడొంతుల్లో ఒక వంతు. అన్ని చెట్లు ఉంటేనే సరైన వర్షపాతం ఉంటుందన్న మాట.

కానీ, ఇక్కడ ఈ మంత్రం ఏం చెపుతుంది? యజ్ఞం కోసం పలాశ (మోదుగ) చెట్టును కొడుతూూ

"ఓ పలాశ కొమ్మా! నీవు యజ్ఞంలో సవిధవుగా కాలిపోయి, వర్షాన్ని, అన్నాన్ని, బలాన్ని కలిగించు' అని. ఇది శాస్త్ర విరుద్ధం కదా! ప్రకృతిని కాక, యజ్ఞక్రియే శాస్త్ర సమ్మతంగా యజుర్వేదం చెప్పడమే కదా!.

కాబట్టి... యజుర్వేదం తొలి మంత్రంలోనే తప్పటడుగు వేసింది!

ఇంకా చూడండి ఎలా ఉందో ...

**"దేవాన్దివ మగన్యాజ్ఞస్తతో మా ద్రవిణవష్టు**
**మనుష్యానన్తరిక్ష మగజ్ఞస్తతో మా ద్రవిణవష్టు ..."**

అంటే ...

*"ఈ యజ్ఞం ద్యులోక దేవతలకు అందింది. వారి దయవల్ల మాకు ఎంతో ధనం చేకూరింది. ఈ యజ్ఞం అంతరిక్ష దేవతలకు అందింది. ఆ ఫలితం మానవులకు వర్షం రూపంలో అందింది ...."*

పై మంత్రంలో రెండో విషయమే ఇక్కడ కీలకం. అంతరిక్షానికి చేరిన యజ్ఞంవల్ల 'వర్షధనం' అందుతుంది అనేది. అంటే ... యజ్ఞంలేకపోతే 'వర్షం' లేదనేది దీని సారాంశం. కాబట్టి పంటలు, మనుషులు,పశువులు బ్రతకడానికి వర్షమే ఆధారం కాబట్టి, వర్షం పడాలంటే యజ్ఞం తప్పనిసరి అనేది దీని ముఖ్య ఉద్దేశం. దీనినే ... భగవద్గీత ... " అన్నాద్భవంతి భూతాని ..." అంటూ "యజ్ఞాద్భవతి పర్జన్యో ..." అంది.అంటే...సర్వ భూతాలకీ అన్నం మూలం. ఆ అన్నానికి వర్షం మూలం. వర్షానికి యజ్ఞం మూలం – అని తేల్చేసింది.

## చిరుధాన్యాలు – స్థిరనివాసాలు

యజుర్వేద కాలానికి ఆర్యులు సింధూ ప్రాంతాన్ని దాటి తూర్పు, దక్షిణాలుగా చాలా ప్రదేశాలకి వచ్చి స్థిరనివాసాలేర్పాటు చేసుకున్నారు. ముఖ్యంగా నేటి పంజాబ్, గుజరాత్, రాజస్థాన్, పశ్చిమ ఉత్తర ప్రదేశ్ ప్రాంతాలలో స్థిర నివాసాలేర్పాటు చేసుకున్నారు. మరీ ముఖ్యంగా సింధూ ప్రజల ఆవాస భూములైన గుజరాత్ ప్రాంతంలోకి ఎక్కువగానే వచ్చి చేరారు.

ఈ ప్రాంతంలో రుతుపవన వర్షపాతం ఆగస్టు –౦సెప్టెంబర్ నెలల్లో సంభవిస్తుంది. ఇది నైరుతి రుతుపవనాల వల్లే. కానీ, తిరిగి అక్టోబర్, నవంబర్ నెలల్లో దక్షిణ భారత దేశానికి, తూర్పు తీరానికి సంభవించే ఈశాన్య రుతుపవన వర్షాలు ఇక్కడ ఉండవు. ఇక నైరుతి రుతుపవనాల అనంతరం అక్కడ సంభవించేవి సంవహన వర్షాలూ, పర్వతీయ వర్షాలే. ముఖ్యంగా ఈ వర్షాలు అపరాల సాగుకి బాగా పనికి వస్తాయి. భారతదేశం మొత్తం ఉష్ణమండల గడ్డిభూమి. కానీ ఆర్యుల మూలస్థానం అయిన మధ్యఆశియా సమశీతోష్ణమండల గడ్డిభూమి. అదే స్టెప్ మైదానం. అక్కడి గడ్డిజాతులూ, పంటలూ, జంతువులు వేరు. ఇక్కడి గడ్డి జాతులూ,పంటలూ, జంతువులూ వేరు. ఇక్కడి గడ్డిజాతుల్లో ఆరుతడి పంటలైన అపరాలు అధికం. ఇది చూడండి.

**"అశ్మన్నూర్జం పర్వతే శిశ్రియాణా మద్భ్య ఓషధీభ్యో వనస్పతిభ్యో అధి సంభృతం పయః."**(యజు:17-1)

*"ఓ మరుత్తులారా! సారవంతమైన వర్షం పర్వతాల్ని ఆశ్రయించి ఉంటుంది. ఈ వర్షం వల్ల వనస్పతులు వర్ధిల్లుతాయి. ఓషధులు వర్ధిల్లుతాయి ..."*

దీన్నిబట్టి యజుర్వేద కాల ఆర్యులు ప్రధానంగా పర్వతీయ వర్షపాతం మీదే ఆధారపడ్డారనేది తెలుస్తుంది. అందుకే ... వారు అనేక అపరాల్ని సాగుచేశారు.

ఆ పంటల వివరాలివి:

**"వ్రీహయశ్చ మే యవాశ్చ మే మాషాశ్చ మే తిలాశ్చ మే ముద్గాశ్చ మే ఖల్వాశ్చ మే ప్రియంగవశ్చ మేஉణవశ్చ మే శ్యామాకాశ్చ మే నీవారాశ్చ మే గోధూమాశ్చ మే మసూరాశ్చ మే యజ్ఞేన కల్పన్తామ్!" (శుక్ల యజు: 18 -12)**

ఇందులో ...

వ్రీహి (ధాన్యం), యవ (యవలు, బార్లీ), తిల (నువ్వులు), మాష (మినుములు), ముద్గా (పెసలు), ఖల్వ (శనగలు), ప్రియంగవ (అరికెలు), అణవ: (సన్నబియ్యం), శ్యామాక (సామలు) నీవార (వరి ధాన్యం) గోధూమ (గోధుమలు), మసూరా (చిట్టి సెనగలు) –

వీటిలో వరి తప్ప మిగిలినవి అన్నీ అల్ప వర్షపాతానికి పండే పంటలే. ఆర్యుల ప్రధాన ఆహారం బార్లీ (యవలు).

వీరి పంటలు అరణ్యకాలు, గ్రామీణాలు అనే రెండు రకాలుగా ఉండేవి. వరి, వరిలో రకాలు ఇవ్వన్నీ అరణ్యకాలు. వీటిని "గర్ముత్" అన్నారు. ఇక వీరి ఇళ్ళ మీదికి కప్పుగా యవగడ్డినే ఉపయోగించారు. ఇంద్రియాభివృద్ధికి వరి ధాన్యం (అరణ్యక ధాన్యం) ఉపయోగపడుతుందని చెప్పారు. అడవుల్ని తగలబెట్టి విశాలమైన వ్యవసాయ క్షేత్రాల్ని వృద్ధి పరచారు.

## పప్పు ధాన్యాలూ – పిలక పంటలూ

వర్షపాతం అధికంగా ఉన్నప్పుడు ఒక పంటను కోసి, ఆ పంట మోళ్ళనుండి పుట్టిన పిలకల్ని పెంచి మరలా పంటను తీసేవారు. ఇలా గట్టి మొదళ్ళు ఉన్న పంటమొక్కల నుండి మూడుసార్లు పంటతీసే విధానం 30 ఏళ్ళ క్రితం వరకూ ఉంది. ఈ పిలకలనుండి వచ్చిన ధాన్యాన్ని పిండికి, పాలతాలికలకూ, నైవేద్యాలకూ ఉపయోగించేవారు. ఈ ధాన్యాన్ని యజుర్వేదం 'అనూషూకాలు' అంది.

**" ..... స్యాత్మాస్మా ఏతమైంద్రం అనుషూకం ఏకాదశ కపాలం నిర్వపేదింద్రమేవ....." – ( కృ.యజు: 2-3-4)**

*" పదకొండు కపాలాల ఆనూషూక పురోడాశాన్ని నిర్వాపం చేస్తున్నాను"* అని ఇంద్రుడంటాడు.

మరి, వర్షపాతం తగ్గినప్పుడు బావులు తవ్వి, నీటిపారుదల చేసి అపరాలు పండించేవారు.

**"సం వరత్రా దధాతన నిరాహారన్ కృణోతన సిఞ్చమహా అవట ముద్రిణం వయం విశ్వాஉ హాஉదస్తయక్షితంనిష్కృతాహావమవటగ్ం సువరత్రగ్ం సుషేచనం ఉద్రిణగ్ం సిఞ్చే అక్షితం."** ( కృ.యజు: 4-2-5)

*"ఓ కర్షకులారా! తోలు తాళ్ళను, బక్కెనలను సిద్ధం చేయండి. ఈ బావిని అన్ని కాలాల్లో కూడా ఎండిపోకుండా ఊట ఊరే దానిగా చేస్తాను (ఎల్లవేస్తాను). ఓ! కర్షకులారా! నాగలిని కట్టండి. కాడిని సిద్ధం చేయండి. ఇది సేద్యయోగ్యమైన నేల. దున్నండి. విత్తనాలు నాటండి. పంటపండాక కొడవలితో కోయండి. నాగలి వజ్రంలాంటి గట్టిది. రైతుకు శ్రమను తగ్గించేది. మట్టి పెళ్ళను చీల్చి పెకలించేది ..."*

ఇలా సాగుతుంది ఈ కృష్ణ యజుర్వేదంలో 4వ కాండలోని 2వ ప్రపాఠంలోని 5వ అనువాకం మొత్తం.

పై మంత్రంలో ఉన్న ఉన్న –బావి, తాళ్ళు, బక్కెనలు, చేదలు– ఈ పదాలన్నీ అన్నీ బావుల ద్వారా చేసే సేద్యానికి చిహ్నాలు. అంటే ... పర్వతీయ వర్షపాతం గల ప్రాంతంలో (నేటి ఆరావళి పర్వతాలకి పశ్చిమ ప్రాంతమైన గుజరాత్). ఆర్యులు చేసిన సాగుకు ఇవి నిదర్శనాలు.

అలాగే ...ఈ మంత్రాలూ చూడండి:

**"శ్యేనమాయినం మనోజవసం వృషణగ్ం సువృక్తిం యేన శర్ధ ఉగ్రమవ సృష్టమేతి తదశ్వినా పరిధత్తగ్గ్ స్వస్తి "**

(కృ.యజు: 2–4–7)

*"మరుత్తులారా! వర్షాన్ని కలిగించే తూర్పు గాలిని వెంట తీసుకుని రండి. డేగ వలే వేగంగా రండి! ..."* అని దీనర్థం.

ఇక్కడ మనం ఒక విషయాన్ని గుర్తించుకోవాలి. హిందూ మహాసముద్రం నుండి బయలుదేరిన రుతుపవనాలు మే నెలలో కేరళ తీరాన్ని తాకుతాయి. అవి అక్కడి నుండి పశ్చిమ కనుమల్ని దాటేప్పుడు మూడు శాఖలుగా విడిపోతాయి. వాటిలో ఒకటి: పాకిస్తాన్ వైపుకు, రెండోది ముంబాయి మీదుగా గుజరాత్ వైపుకు, ఇక, మూడోదైన అతిపెద్దశాఖ కర్నాటక, తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ, ఒరిస్సాల మీదుగా పశ్చిమ బెంగాల్ దాటి మేఘాలయకు చేరి హిమాలయాల్ని చిరపుంజి, మాసిన్‌రాంల వద్ద తాకుతుంది. అక్కడ అది మరో మూడు శాఖలుగా విడిపోయి ఒకటి తూర్పున ఉన్న బర్మా వైపుకు, మరొకటి అస్సాం వైపుకి, మరొకటి పశ్చిమాన ఉన్న డార్జిలింగ్, బీహార్, ఉత్తరప్రదేశ్‌ల మీదుగా ఆరావళి పర్వతాన్ని తాకుతుంది. అప్పటికి నవంబర్ వస్తుంది. తిరిగి వచ్చే ఈ రుతుపవనాల్ని ఈశాన్య రుతుపవనాలంటాం .

తూర్పు నుండి వచ్చే గాలితోపాటు ఈ వర్షమేఘాలు ఆరావళిని తాకుతాయి. అప్పుడు అవి ఆరావళి పర్వతాల మీదుగా పైకి ఎగసి, గుజరాత్‌లోకి ప్రవేశిస్తాయి. వర్షిస్తాయి. అంటే ఆ ప్రాంతానికి వర్షం తూర్పు నుండి వీచే వర్షగాలుల వల్ల సంభవిస్తుంది. ఈ విషయమే పై మంత్రంలో ఉంది.

ఈ మంత్రం చూడండి. దీనిలో ఈ పవనాల్ని ఈశాన్య పవనాలు అనే అంది:

**" ఉన్నం భయ పృథివీం భిన్దీదం దివ్యం సభ: ఉద్నో దివ్యశ్య నో దేహీశానో వి సృజా దృతిమ్ "** (కృ.యజు: 2–4–8)

దీనర్థం ఇది:

" ఓ! పునర్నవమా! నేలను పూర్తిగా తడుపు. ఆకాశం నుండి పుట్టిన ఆకాశమంతటి మేఘాన్ని భేదించు. ఈశానుడవై నీరునిండిన మేఘద్వారాలు తెరిపించు. వర్షాన్ని కలిగించు"

దీనికి బలాన్ని చేకూర్చే ఇదే మంత్రం లో ఒక భాగాన్ని చూడండి.

**".....వి పర్జన్య సృజన్తి రోదసీ అను ధన్వనా యంతి సృష్టయ: ఉదీరయదా మరుత: ..........."** (కృ.యజు: 2–4–8)

*'రుత్విక్కులు (యజ్ఞంలో) హవిస్సులు అర్పిస్తున్నారు. యజమాని (యజ్ఞం చేయించే వాడు) కొరకు మేఘాల్ని దివి నుండి భువికి దించుచున్నాను. అవి భువిని ముంచేసే వానల్ని కురిపిస్తున్నాయి. అవి చివరికి నీరు లేని మరుభూమి (ఎడారి) మీద సహితం కురుస్తున్నాయి ..."*

అంటే ... అవి, ఆరావళిని దాటి గుజరాత్ దాటి, రాజస్థాన్ ఎడారి (థార్ ఎడారి)దాకా కూడా వర్షిస్తున్నాయని అర్థం. ఇలా ... ఈ వర్షాధారాల్ని బట్టి యజుర్వేద కాలానికి ఆర్యులు ఉత్తర భారత దేశంలోని పశ్చిమ ప్రాంతాలన్నీ ఆక్రమించారని తెలుస్తుంది.

పై మంత్రం మరోసారి చూడండి. ఈ మంత్రం వల్ల వారి భౌగోళిక ప్రాంతం అర్థమైనప్పటికీ, ఇంకా ఇందులో అర్థం చేసుకోవాల్సిన విషయం మరొకటుంది. అదే ...

## మంత్రం మాటున దాగిన మర్మం

"రుత్విక్కులు యజ్ఞంలో హవిస్సులు అర్పించడం వల్ల" అనే విషయం. అంటే వారి ప్రాంతంలో కురిసే ఏ వర్షం అయినా, అది పర్వతీయమైనా, సంవహనమైనా, రుతుపవనమైనా– ఏదైనా సరే అసలు వర్షం అంటూ కలుగుతుందంటే అది "యజ్ఞం" వల్లే సంభవం అనేది. ఇదే ఇక్కడ ప్రధానంగా గుర్తించాల్సిన విషయం.

ఋగ్వేదంలో కూడా వివిధ రకాల వర్షాలు (ముఖ్యంగా సంవహన వర్షాలు) గురించి ఉంది. ఆ వర్షాలు మరుత్తుల వల్ల, ఇంద్రునివల్ల, అగ్నివల్ల కలుగుతాయనీ ఉంది. అంటే అవి ప్రకృతి దేవతల వల్ల కలుగుతాయని వారు నమ్మారు. కానీ, ఈ నమ్మకం యజుర్వేద కాలానికి మరింత మూఢంగా మారి 'వర్షాలు యజ్ఞం వల్లే కలుగుతాయనే' నమ్మకం బలపడింది. అంటే ... యజుర్వేదకాలానికి ఒక వర్గదృక్పదమో ... వర్ణ దృక్పదమో వచ్చేసింది. ఎలాగంటే ...

మరుత్తులు లాంటి దేవతలవల్లే వర్షం కలిగినా.... ఆ మరుత్తులు కూడా యజ్ఞం వల్లే అలా కురిపిస్తారు. కాబట్టి ఇక్కడ యజ్ఞమే మూలం. కాబట్టి ఆ యజ్ఞాన్ని చేయించేవాడు యజ్ఞం విధివిధానాలు తెలిసిన వారు ఎవరు? బ్రాహ్మణులు.

కాబట్టి వానలు పడాలన్నా, పంటలు పండాలన్నా బ్రాహ్మణులే మూలం. అందుకే వారు భూసురులు – 'భూలోక దేవతలు' అనే ప్రచారం జరిగింది. అలా "యజ్ఞం బ్రాహ్మణాధీనం" అయ్యింది. "బ్రాహణో మమ దేవత" అయ్యాడు. బ్రాహ్మణులే దేవత లయ్యారు.

అలా ... ఈ దేశంలో మొలకెత్తిన వర్ణ విభాగంలో అగ్రస్థానాన్ని "బ్రాహ్మణుడు" అలా పొందాడు.

మొత్తం మీద రుగ్వేదం చెప్పిన ప్రతి ప్రకృతి పరిశోధననూ, ముందుకు సాగనివ్వకుండా, తమ సామాజిక జీవనానికి ఉపయోగపడేలా మలచుకొంది వైదిక సంప్రదాయం. ప్రతి దాన్ని యజ్ఞంతో ముడిపెట్టి ముందుకు సాగాల్సిన రుగ్వేద ఆర్యుల విజ్ఞానాన్ని తిరోగమన పాలుచేసింది యజుర్వేదం.

వేదం ద్వారా ఒక శాసనంగా, దైవ వాక్కుగా ప్రచారం చేసిన ఈ అజ్ఞానాన్నే ''వైదికం'' అంటాం. ఈ వైదిక సంప్రదాయం భారతీయ సమాజాన్ని వర్ణవ్యవస్థగా, తదనంతరం కుల వ్యవస్థగా మార్చేసింది.

వేలాది సంవత్సరాలుగా 'అజ్ఞాన తిమిరంలో కునారిల్లేలా మార్చేసింది.

ఈ వైదిక చీకటిలోకాన్ని చీల్చుకుని వచ్చిన వెలుగుల్లో బౌద్ధం ఒకటి.

## ఈ వ్యాసాన్ని – ఇలా ముగిస్తాను.

"చెట్టుని కొట్టి, ఆ కొట్టిన చెట్టుని యజ్ఞంలో సమిధగా ఉపయోగిస్తే..... ఆ యజ్ఞం వల్ల వర్షం వస్తుందని నమ్మిన వారు యజుర్వేద ఆర్యులు" – అందుకే వారు...

''ఓ! మోదుగు చెట్టు కొమ్మా! నీవల్లే వర్షం కలుగుతుంది" అని చెప్పారు.

మరి ఈ విషయాన్నే బుద్ధుడు ఎలా చెప్పాడో చూద్దాం!

## బౌద్ధం చెప్పిన భరుకచ్ఛం కథ

భరుకచ్ఛం అంటే నేటి గుజరాత్‌లోని నీట మునిగిన ఎడారి ప్రాంతం. రన్ ఆఫ్ కచ్. అది అలా నిస్సారంగా నిరుపయోగంగా ఎందుకు అయ్యిందో బౌద్ధం చెప్పిన కథ ఒకటుంది. అది ఇది –

ఒక అడవిలో సింహాలు, పులులు జీవిస్తూ ఉన్నాయి. అడవిలో రావి, మోదుగ చెట్లు ఉన్నాయి. పులులు, సింహాలు జంతువుల్ని వేటాడి తెచ్చి ఆ చెట్లకిందకు చేరి, తింటూ ఉండేవి. తిన్నంత తిని మిగిలిన కళేబరాల్ని ఆ ప్రక్కనే వదిలేసేవి. దానితో దుర్గంధం పెరిగిపోయింది. ఒక రోజున మోదుగు చెట్టు రావి చెట్టుతో –

"చూశావా? ఈ రోత. ఈ దుర్వాసన. ఈ పులుల్ని, సింహాల్ని ఈ అడవి నుండి తరిమి వేయాలి" అంది.

"పొరపాటున కూడా ఆ పని చేయకు. అది మనకే కీడు" అంది రావి చెట్టు.

రావి చెట్టు మాట వినని మోదుగు చెట్టు భూతంలా మారి ఒక రోజున పులుల్ని, సింహాల్ని ఆ అడవి నుండి తరిమేసింది.

ఆ చెట్ల క్రింద శుభ్రంగా తయారైంది. దుర్వాసనలు పోయాయి.

"చూశావా! మిత్రమా! నీవు వద్దన్నావు కదా! ఇప్పుడు చూడు ఎంత పరిశుభ్రంగా ఉందో" అంది మోదుగు.

"దాని ప్రభావం నీకు ఇప్పుడే తెలియదులే" అని ఊరుకుంది రావిచెట్టు

అడవిలో పులులు, సింహాలు లేవని ఆ చుట్టుప్రక్కల మనుషులకు తెలిసింది. వారు నిర్భయంగా అడవిలోకి వచ్చి చెట్లు కొట్టడం మొదలు పెట్టారు. అడవిని కాల్చి నేలను చదను చేసి పంట పొలాలుగా మార్చుకున్నారు. కొంత కాలానికి ఆ రావి చెట్టునీ, ఆ మోదుగ చెట్టునీ కొట్టేశారు. చాన్నాళ్ళకు అక్కడ అడవి లేకుండా పోయింది. అడవితోపాటు వానలూ తగ్గిపోయాయి. చివరికి అనావృష్టి అలముకుంది. పంటపొలాలూ నాశనమయ్యాయి. ప్రజలు గ్రామాన్ని, పొలాల్నీ వదిలిపెట్టి వెళ్ళి పోయారు. చివరికి ఆ భూమి మరుభూమిగా మారి పోయింది" –

ఇది బౌద్ధంలోని కథ. అడవిని నరికేస్తే మనిషి మనుగడే పోతుందని బౌద్ధం చెప్పింది. వన సంరక్షణలగురించి, బాటలవెంట, చెరువు గట్లవెంట చెట్లునాటాల్సిన ఆవశ్యకత గురించి బౌద్ధం చెప్పిందే అశోకుడు అమలు పరచాడు.

యజ్ఞం కోసం కొట్టిన చెట్టు వర్షం కురిపిస్తుంది అనేది అశాస్త్రీయం. మూఢనమ్మకం. అది వైదికం.

నేల మీద పెరిగే చెట్టు వర్షాన్ని కురిపిస్తుందనేది శాస్త్రీయ దృక్పథం. ఇదే బౌద్ధం.

రాజ్యానికైనా, వ్యవసాయానికైనా యజ్ఞమే మూలం. ఆ యజ్ఞానికి పురోహితుడే మూలం.. కాబట్టి ప్రపంచం అంతా వారి అధీనమే' అనే భావజాల పుట్టుక, వ్యాప్తికీ యజుర్వేదమే మూలం'గా నిలచి భారతీయ సమాజాన్ని బానిసత్వంలోకి నెట్టింది యజుర్వేదం!

**(ఇంకావుంది)**

# యజుర్వేద ఎద లోతులు

**'సుషారథిరశ్వానివ యన్మనుష్యాన్నేనీయతే ఽ భీశుభిర్వాజిన ఽ ఇవ**

**హృత్ప్రతిష్ఠం యదజిరం జవిష్టం తన్మే మనః శివసంకల్పమస్తు"**

*నిపుణుడైన రథసారథి, కళ్ళేలుపట్టి, గుర్రాల్ని అదుపులో పెట్టి రథాన్ని గమ్యానికి చేరుస్తాడు. అలాగే ... మనుషుల మనస్సులు అనే గుర్రాలూ అటు ఇటూ ఉరుకులు పెడతాయి. (వీటిని అదుపులో పెట్టాలి). మనస్సు హృదయంలో ఉంటుంది. దీనికి ముసలి తనం లేదు. ఇది మహా వేగవంతమైంది.*

***–(శు. యజు: 34–6)***

## మన'సు'కవులు

మనకు మనస్సు అనగానే సినీకవి ఆత్రేయ గుర్తుకు వస్తాడు. ప్రేమలూ, విరహాలూ గుర్తుకొస్తాయి. మనస్సు గురించి రాసీ రాసీ మన'సు'కవిగా పేరు పొందాడు.

"మనసు గతి ఇంతే ... మనిషి బ్రతుకింతే ... అంటూ

"ఒకరి కిస్తే మరలిరాదు –
ఓడిపోతే మరచిపోదు

గాయమైతే మానిపోదు – పగిలిపోతే అతుకుపడదు ..." అని మనస్సు 'గతి'ని గురించి బోధించాడు. ఈ పాట చూడగానే మనకు వేమన కూడా గుర్తుకు వస్తాడు.

"ఇనుము విరిగినేని ఇరుమారు ముమ్మారు
కాచి అతక వచ్చు కమ్మరీడు
మనసు విరిగెనేని మరియంట నేర్చునా"

అని వేమన మనస్సు గురించి చెప్పాడు. ఇక్కడ వేమన మనకు ఆత్రేయకు మార్గదర్శిగా కనిపిస్తాడు.

ఇక మనంపైన చెప్పుకున్న ఆత్రేయగీతం ప్రేంనగర్ చిత్రంలోనిది. దీని తమిళ వెర్షన్‌లో ఇదే పాటను కణ్ణదాసన్ రాశాడు. ఆయన మరో అడుగు ముందుకేసి ... దేవున్ని ప్రశ్నిస్తూ –

"నాకు రెండుకళ్ళు ఇచ్చావు ...ఒకటి పోతే ఒకటుంటుంది.

రెండు కాళ్ళు ఇచ్చావు....
ఒకటి పోతే మరొకటి ఉంటుంది

అన్నీ రెండు రెండు ఇచ్చి...
మనస్సునే ఒక్కటిగా ఎందుకిచ్చావు?

ఆ ఒక్కటీ పోతే ...నా గతేంకావాలి? నేనేమై పోవాలి?"

వీళ్ళందరూ మనస్సుని ఒక బలమైన కేంద్రంగానే వర్ణించారు. ఇదంతా అంటానికీ , వింటానికీ బాగానే ఉంది. కానీ, ఇక్కడ – "ఆ మనస్సు అంటే ఏది?" అనేదే అసలైన ప్రశ్న. "మనస్సు ఒక శరీర అవయవమా?" అనేదీ ప్రశ్నే. కన్నూ, చెవి, ముక్కుల్లా ఇదీ ఒక జ్ఞానేంద్రియమేనా? అనే ప్రశ్న ఎందర్నో ఎంతో కాలంగా వేధించింది.


అసలు "మనస్సు" అనేది మనిషికే సొంతమా? అనేది కూడా పెద్ద చర్చగానే సాగింది.

మరలా మనం మరోసారి ఆత్రేయ దగ్గరకే పోదాం

మనిషికి మనసే తీరని శిక్ష

దేవుడిలా తీర్చుకున్నాడు కక్ష" అన్నాడు ఆత్రేయ. ఔను. ఇక్కడ దేవుడు అనేదాన్ని ప్రక్కన పెట్టేస్తే "మనిషికి మాత్రమే మనస్సు" ఉంది అనే భావం మనకు స్పష్టంగా తెలుస్తుంది. అంటే మనస్సు అనేది మనుషులకే సొంతం అన్నమాట.

మనసున్నవాడు మనిషి



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

మనం ఆత్రేయ, వేమన్న, కణ్ణదాసన్‌ల దగ్గర నుండి ఒక్క వందేళ్ళు వెనక్కి వెళ్దాం. అక్కడ సిగ్మండ్ ఫ్రాయిడ్ ఉంటాడు. మనస్సు మర్మాన్ని విప్పిచెప్పిన వివేకి ఆయన. ఆధునిక ప్రపంచ నలుమూలలకీ మనోవిజ్ఞానాన్ని చేర్చిన మేటి ఆయన. మరలా మరో రెండు శతాబ్దాలు వెనక్కి పోతే జాన్‌మిల్టన్ ఉంటాడు. తన మహాద్భుత రచన ప్యారడైజ్ లాస్ట్ లో లూసిఫర్ (సైతాను)తో మనస్సు గురించి మాట్లాడించిన మాటలూ, తన అధికార పీఠాన్ని కాపాడుకోడానికి యెహోవా పడిన పాట్లూ కనిపిస్తాయి. సుఖాల్ని

కష్టాలుగా, కష్టాల్ని సుఖాలుగా ఎలా మార్చుకోవాలో దానికి మనస్సును ఎలా సంసిద్ధం పరచుకోవాలో చెప్పిన అద్భుత ప్రసంగం మనస్సు లోతుల్లోకి తీసుకు పోతుంది.

ఇక అక్కడి నుండి ఒక్కసారిగి రెండు వేలా మూడువందల ఏళ్ళు వెనక్కి వెళ్దాం. ఎందుకంటే ... "మనస్సు మనిషికే సొంతం" అనే భావాన్ని తేటతెల్ల పరచిన ఒక మహా తాత్త్వికుడు అక్కడ ఉన్నాడు. ఆయనే బుద్ధుడు.

మనస్సు గురించి, మనో విశ్లేషణల్ని గురించి విపులంగా చర్చించిన తొలి మనోవైజ్ఞానిక వేత్త ఆయన.

'మనో పుబ్బంగమా ధమ్మా
మనో సేత్థా మనోమయా!"

అనేది ధమ్మపదంలోని మొట్టమొదటి గాథ (శ్లోకం). అంటే "అన్నిటికీ అగ్రగామి మనసే. అన్నింటికంటే శ్రేష్టమైంది అదే. అంతటా నిండిందీ అదే" అని దీనర్థం.

"మన పనులన్నింటికీ తానే ముందుండి, మార్గదర్శిలా మనల్ని నడిపిస్తుంది మనస్సు" అంటాడు బుద్ధుడు.

మనిషికి ఉంది కాబట్టే అది 'మనస్సు' అయ్యింది. మనస్సు ఉంది కాబట్టే మనం మనుషులం అయ్యాం.

**మనుషులు అంటే 'మనువుసంతానం కాదు, మనస్సు ఉన్న వారు' అని అంటుంది బౌద్ధం.**

మనస్సుకు ఎన్ని పర్యాయ పదాలు ఉన్నాయో చూస్తే – దాని విశాలత అర్ధమవుతుంది. ఎవరెవరు దాని గురించి ఏమేమి అనుకున్నారో కూడా తెలుస్తుంది.

"అంతరంగం, అంతర ఇంద్రియం, ఇచ్ఛ, ఉల్లము, ఎద, ఆత్మ, చిత్తం, చేతన, డెందం, తురంగము, మది, మానసం, సత్వం, హృదయం ..." ఇలా ఇవ్వన్నీ మనస్సుకు పర్యాయపదాలే.

వీటిని చూస్తే ...

మనస్సు కూడా ఒక ఇంద్రియమే అని భావించిన వారున్నారు. అది మనలోని ఆత్మగా ఎంచిన వారున్నారు. అసలు మనలోని చైతన్యానికి ప్రతీకగా చూసిన వారున్నారు. గుండెనే మనస్సుగా నిర్ధారించిన వారూ ఉన్నారు. మెదడు (మది)ని మనస్సుగా చెప్పిన వారూ ఉన్నారు. చివరికి దాన్ని గుర్రంలా అదుపుతప్పి పరుగుతీసే దానిగా ఎంచిన వారూ ఉన్నారు. అసలు "కోరికే" మనస్సు అని తేల్చేసిన వారూ ఉన్నారు.

ఈ వ్యాసం ఉద్దేశ్యం మనస్సుని సమగ్రంగా విశ్లేషించడం కాదు. అయినా మనం బుద్ధుని దగ్గర ఉన్నాం కాబట్టి – బుద్ధుడు మనస్సుని కూడా ఒక ఇంద్రియంగానే భావించాడని తెలుసుకోవాలి. దాన్ని ఆరో ఇంద్రియంగా పరిగణించాడు. పంచేంద్రియ జ్ఞానాల నుండి పుట్టిన ఇంద్రియంగా చెప్పాడు. కంటికి చూపుజ్ఞానం , చెవికి వినికిడి జ్ఞానం, ముక్కుకి నాసన గ్రహించే జ్ఞానం, నాలుకకు రుచిజ్ఞానం, చర్మానికి తాకుడు జ్ఞానం ఉన్నట్లే మనస్సుకి మనోవిజ్ఞానం ఉంటుంది అంటుంది బౌద్ధం.

పైన చెప్పిన ఈ చివరి మాటలు మరో మారు చదివి, దాన్ని మనస్సులో పెట్టుకోండి.

ఇక, ఇప్పుడు మనం బుద్ధుని నుండి ఐదారు వందల ఏళ్ళు వెనక్కి వెళ్దాం. అది మనం ఇప్పుడు చర్చించుకునే యజుర్వేద కాలం.

అప్పటి ఆర్యులకి 'మనస్సు'ను గురించిన భావనలు ఉన్నాయా? వారికి కేవలం పంచేంద్రియాలను గురించిన జ్ఞానం మాత్రమే ఉందా? అని ఆలోచిస్తే –

రుగ్వేదంలో కనిపించని 'మనస్సు' భావనలు మనకు యజుర్వేదంలో కనిపిస్తాయి. ఇక్కడే మనం 'కాలం' అనే కొలతను మరచి పోకూడదు. రుగ్వేద ఆర్యులు సింధూ ప్రాంతంలో స్థిరపడ్డాక దాదాపు ఐదు వందల ఏళ్ళకి యజుర్వేదం వచ్చింది. ఈ మధ్య కాలంలో – వారికి 'మనస్సు' గురించి భావనలు ఎలా వచ్చాయి? ఆ జ్ఞానం వారి స్వార్జితమా? లేక దిగుమతా? ఒకవేళ అది వారి స్వార్జితం అయితే ఆత్మభావనే 'మనో' భావనగా మలచుకున్నారా? లేక, అనేక విధానాల్ని సింధూ ప్రజల నుండి పొంది పుచ్చుకున్నట్లు, దీన్ని కూడా వారు సింధూ ప్రజల నుండే స్వీకరించారా? అనే ప్రశ్న తలెత్తుతుంది.

రుగ్వేదంలో మచ్చుకైనా కన్పించని 'మనస్సు' భావన యజుర్వేదంలో కన్పిస్తుంది. అదీ, చాలా ప్రాథమికంగానే.

## మనస్సు నుండే ఇంద్రియాలు

**"వ్రతం కృణుతాగ్ని ర్బ్రహ్మాగ్ని ర్యజ్ఞో వనస్పతి ర్యజ్ఞియః
దైవీం ధియం మనామహే సుమృడీకా మభష్టమే
వర్చోధాం యజ్ఞవాహసం సుతీర్థానో –అసద్వశే!
యే దేవా మనోజాతా మనోయూజో దక్షక్రతవస్తే
కో –వస్తు తే నః పాంతు తేభ్యః స్వాహా"**

**–(శు.యజు : 4–11)**

దీని అర్థం మొత్తం ఇక్కడ అనవసరం గానీ ... ఇందులో మనస్సు గురించి ఉన్న అంశాన్ని చూస్తే ...

"వాక్ రూప అగ్నియే వేదం. అగ్నియే యజ్ఞం.

వేదవాణి దేవసంబంధి. కన్ను మొదలైన దేవతలు (పంచేంద్రియాలు) మనస్సు నుండి పుట్టిన వారు. వారు మనస్సుతో సంబంధం గలవారు. వారు మమ్మల్ని రక్షించుగాక! వారికి స్వాహా!"

ఇక్కడ కన్ను, చెవి, ముక్కు, నాలుక, చర్మం అనేవి ఐదూ పంచేంద్రియాలు. చక్షురాది ఇంద్రియాలంటే ఇవే. ఈ ఐదు ఇంద్రియాల వల్లే మనకి జ్ఞానం కలుగుతుంది. కాబట్టి ఈ ఐదు జ్ఞానేంద్రియాలూ మనస్సు నుండే పుట్టాయి అంటుంది. ఈ మంత్రం. పరమాత్మ నుండి జీవాత్మలు పుట్టినట్లు, విరాట్ పురుషుని నుండి సకలం పుట్టుకొచ్చినట్లుగా చెప్పే వైదిక భావజాలానికి తగిన విధంగానే మనస్సు నుండే ఇంద్రియాలు పుట్టుకొచ్చాయంటుంది వేదం.

అందుకే ఇంద్రియాలకు ఆవాసం మనస్సే అంటుంది యజుర్వేదం. మనస్సుకీ, ఇంద్రియాలకీ, ఆత్మకీ గల సంబంధాల్ని వివరించే తాత్త్విక దృక్పథం ఉపనిషత్తులది. ఉపనిషత్తుల నిండా వీటి చర్చలే. వీటి మీమాంసలే. అంటే ఉపనిషత్తుల భావ బీజం ఈ యజుర్వేదంలో కనిపిస్తుంది.

ఇంకా కొన్ని విషయాలు చూద్దాం.

ఇంద్రియాలు మనస్సునుండి పుట్టాయి సరే, మరి మనస్సు ఎక్కడి నుండి పుట్టింది? ఈ మంత్రం చూడండి –

**"అయం దక్షిణా విశ్వకర్మ తస్య మనో వైశ్వకర్మణం**
**గ్రీష్మో మానస స్త్రిష్టుబ్ గ్రైష్మీ త్రిష్టుభః స్వారం**
**................ ప్రజాపతి గృహీతయా**
**త్వయా మనో గృహ్ణామి ప్రజాభ్యః "**

***–(శు.యజు : 13–55)***

"వాయువు దక్షిణ దిశలో అత్యంత వేగశాలి. ఓ! ఇటుకా! నీవు విశ్వకర్మవు. ఆ విశ్వకర్మ వాయువు నుండి మనస్సు పుట్టింది. మనస్సు నుండి గ్రీష్మ ఋతువు పుట్టింది" –

ఇదీ మనస్సు పుట్టుక. ఈ అధ్యాయంలో మరికొన్ని ఇంద్రియాల పుట్టుక గురించి ఉంది.

సూర్యుని నుండి నేత్రాలు నేత్రాల నుండి వర్షరుతువు (13–56)
స్వర్గం నుండి చెవులు, వాటి నుండి శరత్తు (13–57)
చంద్రుని నుండి మతి, మతి నుండి హేమంతం (13–58).

ఇలా కొన్ని ఇంద్రియాలు, అవయవాలు, రుతువులు, నెలలు ఎలా పుట్టాయో ఈ అధ్యాయంలో ఉంది.

## ఎటో వెళ్ళి పోతుందిమనస్సు !

ఇక్కడ మనస్సు వాయువు నుండి, అందులో అత్యంత వేగంగా వీచే వాయువు నుండి పుట్టింది అనడం విశేషం. మనస్సు కూడా అంతే. వేగంగా ప్రయాణం చేయగలదనే విషయం ఇందులో అంతర్లీనంగా ఉంది.

ఇక – శుక్ల యజుర్వేదంలోని 34వ అధ్యాయం దాదాపుగా మొత్తం మనస్సుకి సంబంధించిందే. ఇది చూడండి.

**"యజ్ఞాగ్రతో దూరముపైతి దైవం తదుస్తుప్తస్య తదైవేతి**
**దూరంగమం జ్యోతి షాం జ్యోతిరేకం తన్మేమనః**
**శివసంకల్పమస్తు"**

***–(శు.యజు : 34–1)***

దీని అర్థం ఇది– '

*మనస్సు దివ్యశక్తి గలది. అది జాగృదావస్థలోని మనిషి కన్నా దూరంగా వ్యక్తం అవుతుంది. నిద్రలో ఉన్నప్పుడు కూడా దూరంగా వ్యక్తం కాగలదు. నా మనస్సు ఎంతో దూరం ప్రయాణం చేయగలది. అది జ్యోతుల్లో జ్యోతి. నా మనస్సు మంచి సంకల్పాలు కలది అగుగాక!"*

నిజానికి మనం మెలకువలో ఉన్నప్పుడు మన జ్ఞానేంద్రియాల ద్వారా విషయాల్ని గ్రహిస్తాం. చూస్తాం. వింటాం. వాసన గ్రహిస్తాం. స్పర్శ తెలుసుకుంటాం. రుచి జ్ఞానం పొందుతాం.

ఈ జ్ఞానాల్ని పొందినప్పుడు మనకు కలిగే అనుభూతిని పొందేది ఎవరు? ఆత్మ అన్నారు కొందరు. మనస్సు అన్నారు కొందరు. వేదం మనస్సుని ఆత్మలో భాగంగానే చూపింది. అందుకే ... అనుభూతుల్ని గ్రహించేది మనస్సే అని చెప్పినా, అది మనిషికి అతీతంగా "దూరంగా" వ్యక్తమయ్యే అంశంగా చెప్పింది.

అలాగే ... నిద్రలో కూడా. ఇంద్రియాలు పనిచేయక పోయినా "కలలు" కంటాం. కలల్లో చూస్తాం. వింటాం. ఇతర అనుభూతుల్నీ పొందుతాం. కాబట్టి నిద్రలో కూడా మనస్సు చూస్తుంది. దూరతీరాలకు ప్రయాణం చేస్తుంది. అనే భావన ఏర్పడింది. కాబట్టి మనస్సు మనల్ని నియంత్రించేదే అయినా, అది మనలో ఉండదు. దూరంగా ఉంటుంది. దూరంగా ఉండే ఆ మనస్సు వాయువుతో ఉంటుంది. ఎక్కడెక్కడో తిరుగుతూ ఉంటుంది. ఆ మనస్సు నుండి పుట్టిన జ్ఞానేంద్రియాల ద్వారానే మనం జ్ఞానాల్ని గ్రహిస్తాం. అనుభూతులు పొందుతాం అనేది పైమంత్రం ఉద్దేశ్యం.

అనుభూతులు, స్వప్నాలు మనస్సు వల్లే కలుగుతాయని గుర్తించినా, మనస్సు మనిషిలో కాక మరెక్కడో ఉందనేది ఆర్యుల భావన.

అందుకే ఒక సినిమా భావకవి –

" ఎటో వెళ్ళి పోయింది మనస్సు - ఇలా ఒంటరయ్యింది వయస్సు" అని వెతుక్కుంటే.....

శ్రీశ్రీ మాత్రం " మనసున మనసై... బ్రతుకున బ్రతుకై " అని తేల్చి చెప్పారు.

అలాగే మనస్సు వేగం గురించి మరో మంత్రం:

**ఏషా తే శుక్ర తనూరే తద్వర్చస్త యా సంభావ**

**భ్రాజంగచ్ఛ జూరసి ధృతా మనసా జుష్టా విష్ణవే!"**

***(శు.యజు: 4-11)***

*"ఓ! వాక్కూ! నీవు మహా వేగవంతమైన దానవు. మనస్సు నుండి వెడలిన దానవు. యజ్ఞం కోసం నియమించడిన దానవు"*

## మనస్సు నుండే మంచీ చెడులు

ఇక, ఇది చూడండి:

**"యస్మిన్న ౄచం: సామయజూషి యస్మిన్ప్రతిష్ఠితా రథనాభావివారా:**

**యస్మింశ్చిత్త: సర్వమోతం ప్రజానాం తన్మే మన: శివసంకల్పమస్తు"**

***(శు.యజు : 34-5)***

*'రథ నాభిలోని పలకల్లా మనస్సునందు రుగ్, యజుర్, సామాలు ప్రవర్తిల్లుతున్నాయి. ఆ చిత్తమందే (మనస్సునందే) జనమందరి మంచి చెడులున్నాయి."* - అని ఈ మంత్రం అర్థం.

మనస్సును రథ నాభితో అంటే రథంలో చక్రాలు తగిలించే ఇరుసు మధ్య భాగంతో పోల్చడం చాలా చక్కగా ఉంది. అలాగే ఇక్కడ మనస్సుని చిత్తం అనే పదంతో సూచించడం, మన మంచీ, చెడు ఆలోచనలకూ అదే కేంద్రం అని చెప్పడం కూడా విశేషమే.

మనం ఈ వ్యాసంలో ఇంతకు ముందు ధమ్మపదం గురించి చెప్పిన గాథ -"మనో పుబ్బంగమా ధమ్మా" అనేది కూడా ఈ భావాన్నే తెలియజేస్తుంది.

మంచి మనస్సుతో చేసిన పనుల ఫలితాలు, నీడలా మనవెనుకే వస్తాయి,చిర సుఖాలనిస్తాయనీ - చెడ్డ మనస్సుతో చేసిన కర్మల ఫలితం ,ఎద్దుల గిట్టల వెంటే వచ్చే బండి చక్రాల్లా వస్తాయనీ, దు:ఖాన్ని కల్గిస్తాయనీ ఈ గాథ తెల్పుతుంది.

మనకి ప్రేరేపణ మనసే అనే విషయం ఈ యజుర్వేద మంత్రంలో ఉండడం విశేషమే.

## అదుపులో మనస్సు

ఇక -

మనస్సు, ఏకాగ్రత, ఇంద్రియాలు, అవి గ్రహించే జ్ఞానాలు, కొన్ని విషయాల పట్ల వాటి లోలత్వం... వీటి తాలూకు ప్రాథమిక భావన కూడా కృష్ణ యజుర్వేదంలో కనిపిస్తుంది.

**" ....... యుక్త్వాయ మనసా దేవాస్థ్స వర్యతో ధియా దివం బృహజ్జ్యోతి: కరిష్యతాం సవితా ప్రసువాతి తాన్ యుక్తేన మనసా వయం దేవస్య సవితు: సవే !**

*-(కృ.యజు : 4-1-1)*

దీని అర్థం ఇది:

*"ఇంద్రియాలు చలించేవి. సవిత ఇంద్రియాల్ని ఇతర విషయాల మీదికి పోకుండా నియంత్రించాడు. వాటికి ఆ ప్రేరణ కలిగించాడు. రుత్విక్కులు ముందుగా తమ మనసుల్ని విషయాల నుండి మళ్ళించు చున్నారు. మనసుని అదుపులోకి తెచ్చుకుంటున్నారు"* -

ఇవీ ... యజుర్వేదంలో మనకు కన్పించే 'మనస్సు'కి సంబంధించిన విషయాలు.

ఉపనిషత్తులకు కావలసిన తాత్త్విక అంశాల్ని యజుర్వేదం 'ఉప్పు' అందించినట్లు కనిపిస్తోంది.

మానవీయతే మనస్సు

ఇప్పుడు మనోవిజ్ఞాన శాస్త్రం చాలా బాగా అభివృద్ధి చెందింది. అది ఈనాడు ప్రత్యేక శాస్త్రంగా మనగలుగుతోంది. కానీ, తొలిలో -

దార్శనికుల దార్శనిక దృక్పథంలో, తాత్త్వికుల తాత్త్విక ప్రబోధాల్లో అంతర్లీనంగా అదే ఉండేది. అదే యజుర్వేదంలో కనిపిస్తుంది. ఆ తర్వాత తత్త్వశాస్త్రం (ఫిలాసఫీ) మానసిక తత్త్వం (మెంటల్ ఫిలాసఫీ)గా, నైతిక తత్త్వం (మోరల్ పిలాసఫీ) అనే రెండు శాఖలుగా ఏర్పడి, విస్తరించింది. ఈ రెండు తత్త్వాలూ బౌద్ధంలో కన్పిస్తాయి.

**మొత్తం మీద మనస్సు అనేది మేధస్సు, ఆలోచనలు, అనుభూతి ఈ మూడింటి మీద నిర్మించబడి ఉంటుంది.**

మనస్సుకి కేంద్రం మెదడుగా కొందరు, హృదయంగా కొందరు భావించారు. కానీ, దాని రంగూ, రుచీ, వాసనల్ని భౌతికంగా గుర్తించలేం. **చెట్ల ఆకుల కదలికల్ని బట్టి గాలిని గుర్తించినట్లే, మనిషి ప్రవర్తనని బట్టి అతని మనస్సుని అర్థం చేసుకోగలం. గుర్తించగలం.**

నిజానికి "మనస్సు" అనేది మనిషికి సొంతం అని

మొదట్లోనే చెప్పుకున్నాం. కాబట్టి, మనిషి అంటేనే 'మానవీయత గల జీవి' కాబట్టి మనస్సుకీ మానవీయతకూ లంకె ఉంది. మానవీయత అంటే తోటి జీవుల పట్ల దయ, జాలి, కరుణ, ప్రేమ కలిగి, ఆ అనుభూతుల్లో ఓలలాడే తనమే మానవీయత. కాబట్టే మానవీయతగల వారే మానవులు (మానవుల సహజనైజం మానవీయత అని తొలుత ఆవిష్కరించింది బుద్ధుడే). పిల్లల్ని కనడం, చాలా కాలం సాకడం, వారిపట్ల దయ కలిగి ఉండడం, ప్రేమ పెంపొందించుకోవడం – ఇవ్వన్నీ తల్లిజీవులకు తొలి లక్షణాలు. కాబట్టి 'మనస్సు' అనేది తొలుత వికసించేది మాతృమూర్తుల్లోనే –

## చెడ్డ కప్పలు – మంచి పాములు

నిజమేమిటంటే –

జీవు పరిణామ క్రమంలో – రెప్టీలియన్స్, ఆంఫీబియన్స్ వరకూ (బల్లులూ, కప్పలు) తల్లిజీవులు బిడ్డల పెంపకాన్ని పట్టించుకోవు. కాబట్టి వాటికి "దయ, జాలి, కరుణ" అనే గుణాలు ఉండవు. ఆ తర్వాత పశువులూ, పక్షుల్లో ప్రేమ, బిడ్డల పెంపకం కొద్దిగా కన్పిస్తుంది. ఒక్క మనుషులు మాత్రమే బిడ్డల పెంపకంతోపాటు, బిడ్డల శిక్షణలో పాలుపంచు కుంటారు. అంతేకాదు, సమాజంలో తోటి జీవుల బాధ్యతలు కూడా పంచుకుంటారు. కాబట్టి – వీరిలో

ప్రేమ ఉంది కాబట్టి పగ కూడా ఉంటుంది. దయ ఉంది కాబట్టి నిర్దయ కూడా ఉంటుంది. కరుణ ఉంది కాబట్టి కర్కశం కూడా ఉంటుంది. మైత్రి ఉంటుంది కాబట్టి శతృత్వం కూడా ఉంటుంది. మొత్తంగా – మంచి ఉంటుంది కాబట్టి చెడు కూడా ఉంటుంది.

మంచి మనిషి, చెడ్డ మనిషి అని ఉంటారు కానీ, మంచి పాము చెడ్డ పాము అని ఉండదు. మంచి తేలు చెడ్డ తేలు అని ఉండదు. మంచి కప్ప చెడ్డ కప్ప అని ఉండదు.

మనుషుల్లో 'భావాలు' మంచీ, చెడుగా ద్వంద్వంగా రూపొందాయి కాబట్టి మనస్సు ఉంటుంది. మనస్సుకి సంతోషాలు, దు:ఖాలూ ఉంటాయి. పగ ప్రతీకారాలూ ఉంటాయి. అంటే ...

**మన భావోద్వేగాలే 'మనస్సు'** అన్నమాట. మన ఇంద్రియం ఒక విషయాన్ని గ్రహించాలి. ఆ గ్రహించిన విషయాన్ని నిక్షిప్తం చేసుకోవాలి. అలా నిక్షిప్తం చేసుకున్నది గుర్తించుకోగలగాలి. అప్పుడే మనస్సు పుడుతుంది. సంఘర్షిస్తుంది. విషయాల్ని గ్రహించలేక పోయినా, వాటిని గుర్తుపెట్టుకోలేక పోయినా మనస్సు అనేది పుట్టదు. కాబట్టి –

ప్రజ్ఞ (ఇంటిలిజెన్స్), స్మృతి (మెమరీ), ప్రేరణ (మోటివేషన్), అభ్యాసన (లెర్నింగ్), ఉద్వేగం (ఎమోషన్) – ఇవ్వన్నీ కలగలిసిందే మనస్సు.

ప్రేమించిన వ్యక్తి మాత్రమే – అది అందకపోతే రోదించగలడు. లేదా ద్వేషించగలడు.

తమ తల్లిదండ్రులు పెంచి పోషించలేదని ఏడ్చే కప్పలు ఉండవు. అలాగే తమని వృద్ధాప్యంలో సాకలేదని ఏడ్చే కప్పలూ ఉండవు.

అందుకే సామాజిక, నైతిక, సూత్రాలనే "మనస్సు" ఉన్న జంతువులు మానవులే.

## రెండు రకాల నిల్వలు

మనిషి ప్రకృతి నుండి రెండు విషయాల్లో విజయం సాధించాడు. రెండు రకాల నిల్వలు చేసుకోవడం నేర్చుకున్నాడు. ఈ రెండు రకాల 'నిల్వలు' మనిషిని ఇతర జంతు ప్రపంచాన్నుండి వేరు చేశాయి. వాటిలో –

**ఒకటి:** ఆహారాన్ని నిల్వ చేసుకోవడం.

**రెండు :** ఆలోచనల్ని నిల్వ చేసుకోవడం.

మొదట దానివల్ల శరీరం, ఆరోగ్యం పెంపొందితే రెండో నిల్వల వల్ల జ్ఞానం, మనస్సూ రూపొందాయి. వర్ధిల్లాయి. ఆలోచనల్ని, అనుభవాల్ని నిల్వ చేసుకొనే భౌతిక రూపం మెదడు. నాడీ వ్యవస్థ. కాబట్టి మనస్సు అనేది మెదడులోని సమన్వయానికి సంబంధించిన అంశమే!

అందుకే మనస్సు అంటే ఇంద్రియాల అనుభవాల్ని కొలిచే సాధనం అనొచ్చు.

కాబట్టి – ఆర్యులు మనస్సు గురించి చేసిన ప్రస్తావనల్ని మంచి పరిజ్ఞానంగానే పరిగణించాలి.

అయితే ...!

## భావవాదం – భౌతికవాదం

ఆర్యుల 'మనస్సు' భావవాద మూలాలు కలది. యజుర్వేదం ఏమంది? – మనస్సు నుండే ఇంద్రియాలు వచ్చాయంది కదా! ఇప్పుడొక సారి ... నేను మొదట్లో "దీన్ని గట్టిగా గుర్తు పెట్టుకోండి" అని చెప్పిన విషయం ఇప్పుడు గుర్తుకు తెచ్చుకోండి! ఆర్యుల భావనలో..... మనసనేదే ముందుగా ఉంది. దానినుండే జ్ఞానేంద్రియాలూ..వాటినుండి జ్ఞానాలున్నాయి అని చెప్పారు గదా! కానీ, బుద్ధుడు –

'జ్ఞానేంద్రియాలు అందించిన విజ్ఞానమే మనస్సుగా రూపొందుతుంది. వీటన్నింటి జ్ఞానాల్ని అందిపుచ్చుకుని,

విశ్లేషించుకునే వ్యవస్థే మనస్సు' అన్నాడు.

వీటిలో –

ఆర్యులది – భావవాద దృక్పథం.( అంటే..చైతన్యం నుండే పదార్థాలు పుట్టాయి అనేది)

బౌద్ధానిది – భౌతికవాద దృక్పథం.( పదార్థాలు లేకుండా చైతన్యం లేదు అనేది)

అందుకే వేదం ప్రకారం: చిత్తాన్ని నిగ్రహించుకుంటే – ఇక మనకి ఎలాంటి జ్ఞానం రాదు. శూన్యంగా మిగిలిపోతాం.

కానీ, బౌద్ధం ప్రకారం ...

చిత్తాన్ని నిగ్రహించుకుంటే జ్ఞానం రాకుండా పోదు. జ్ఞానాలు వస్తూనే ఉంటాయి. ఇంద్రియాలు పని చేస్తూనే ఉంటాయి. కానీ, అవి అందించే విషయాలపట్ల సరైన సమన్యాయం చేసుకోగలం. బౌద్ధుల చిత్త ఏకాగ్రతతో మనోసమన్వయం ఉంది. మనస్సును అదుపు చేసుకోవడం ఉంది. మనో నిర్మాణం ఉంది. మనో వికాసం ఉంది. సుఖదు:ఖాల్ని సరిచేసుకునే వీలుంది.

బౌద్ధులు చెప్పిన విధానం వల్ల ఇంద్రియాలు మూతపడవు. మనస్సూ మూతపడదు. 'సరైన సమన్వయం' మాత్రమే ఉంటుంది.

కానీ, వేదం చెప్పిన దాని ప్రకారం మనస్సు మూతపడితే – ఇంద్రియాలన్నీ మూతపడ్డట్టే –

కాబట్టి, మనస్సు మీద ఆర్యులు మంచి ప్రయత్నం చేసినా అది భావవాద ఊబిలో దిగబడి పోయింది.

ఈ మనో ఏకాగ్రత – ఆత్మను పరమాత్మలో కలిపే పనిలో పడిపోయింది. 'యోగం' అనే రోగాన్ని అంటించింది.

అందుకే 'యోగం చిత్తవృత్తి నిరోధం' అన్నాడు పతంజలి . కానీ , దీన్నే బౌద్ధం విపశ్యన లేదా ధ్యానం అంది. అంటే మనలోకి మనం చూసుకోవడం. మనలోని మంచీచెడుల్ని మనమే దర్శించుకుని , సవరించుకోవడం.

వేదం భావవాదం. అది ఏవిషయాన్ని చెప్పినా దానితోనే ముడిపెడుతుంది . ముగింపునిస్తుంది. అది అజ్ఞానమైనా, విజ్ఞానమైనా. వేదంలో వైజ్ఞానిక విషయాలు ఉన్నాయి. ఉంటాయి కూడా. ఎందుకంటే దాన్నీ మనుషులే రూపొందించారు కాబట్టి. మనిషంటేనే వైజ్ఞానికజీవి కాబట్టి.

అయితే ....! తనకు తెలిసిన దాన్ని బానిస మనస్సు గలవారు 'భావవాదం'గా ఊహిస్తారు. అలా సరిపెట్టుకుంటారు. కాదంటే మాతాతల మూతులు వాసన చూడమంటారు . దానితో సంబరపడతారు.

కానీ, తమ అనుభవానికి వచ్చిన దాన్ని కొందరు భౌతిక వాస్తవం లోంచే చూస్తారు. ఆలోచిస్తారు. బేరీజు వేస్తారు. ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తారు. వారే స్వేచ్ఛాలోచనగల వారు.

నిజానికి విజ్ఞాన శాస్త్రానికి వ్యాఖ్యానాలుండవు. ప్రయోగాలూ ఫలితాలే ఉంటాయి.

కానీ, వేదాలకి వ్యాఖ్యానాలే ప్రాణం. ప్రతి వ్యాఖ్యానం వేదాల్ని కొంతకాలం బ్రతికించడానికి చేసిన తీవ్ర ప్రయత్నమే.

కాలం అంపశయ్యపై కట్టెలా పడివున్న వేద శరీరానికి వ్యాఖ్యాన సెలైన్లు ఎక్కిస్తూ ...నాగరికతను వెక్కిరిస్తూ ... ఆత్మానందం పొందుతూ ఉంటారు వ్యాఖ్యాతలు.

ఒకవైపు నిరంతరం వైజ్ఞానిక ఫలితాల్ని అనుభవిస్తూనే , మరోవైపు 'అన్నీ వేదాల్లోనే ఉన్నాయి అని' చావలేక బ్రతుకుతుంటారు కొందరు.

" వేదాలు తొలి జీవన నాదాలు " అనే వారితో కాదు, అవి "అపౌరుషేయాలు" అన్న వారితోనే పేచీ.

***( ఇంతటితో యజుర్వేదం ముగిద్దాం. మరలా కొన్నాళ్ళ తర్వాత సామ వేదంతో కలుద్దాం – రచయిత)***

## జ్ఞానదీప్తి



స్వేచ్ఛాలోచన పత్రికను ఎక్కువ మంది పాఠకులకు చేరువ చేయటానికి ఉద్దేశించిన జ్ఞానదీప్తి పథకానికి ప్రముఖ హేతువాది **గ్రంధి నాగేశ్వరరావు (ఫోన్ : 85200 12485)** స్పందించారు. కాకినాడ లో వున్న 10 గ్రంథాలయాలకు సంవత్సర కాలం పాటు తన పేరుతో పత్రికలను అందించటానికి ముందుకొచ్చారు. హేతువాద భావ వ్యాప్తి కోసం జ్ఞానదీప్తిని ప్రోత్సహిస్తున్నందుకు వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాము. వారి ఆదర్శం మరికొందరికి ప్రోత్సాహమివ్వగలదని ఆశిస్తున్నాం.

**– మేనేజర్**

# సామవేదం - సౌరమానం

**"ఉద్ ద్యామే షి రజః పృథ్వహామిమానో అక్తుభిః**
**పశ్యఞ్జన్మాని సూర్య"**

**"ఓ! సూర్యదేవా! నీవు రాత్రులనూ, పగళ్ళనూ కొలతలు వేస్తూ, సకల ప్రాణిజాలాన్ని వీక్షిస్తూ, ఈ అనంత విశాలమైన అంతరిక్షాన ఉదయిస్తున్నావు!"** *-(సామవేదం : 638)*


## సోమమా? సామమా?:

"సరసస్స్వరసురఝురీగమనమౌ

సామవేద సారమిది " అన్నాడు ఒక కవి తన గానాన్ని గురించి.

నిజమే...సంగీతవేదంగా,సుస్వరాల నాదంగా అందరూ చెప్పుకునే సామవేదంలో కేవలం సంగీతమే ఉందా? ఆ స్వర తరంగిణుల మధ్య పడిలేచే వైజ్ఞానిక అంశాలేమైనా ఉన్నాయా? చూద్దాం. మనం గత సంచికల్లో రుగ్వేదం, యజుర్వేదాల్లోని వైజ్ఞానిక అంశాల్ని చూశాం. మరలా ... ఇప్పుడు సామవేదంలోని విషయాల్ని కూడా చూద్దాం.

చారిత్రకుల పరిశోధనలు సామవేద కాలాన్ని క్రీ.పూ.800లుగా తేట తెల్లం చేస్తున్నాయి. ఒక వంద సంవత్సరాలు అటూ ఇటుగా దాదాపు చారిత్రక పరిశోధకులందరూ ఈ విషయాన్నే చెప్పారు. క్రీ.పూ.800 అంటే ... ఆర్యులు ప్రాబల్యం బలంగానే వేళ్ళూనుకున్న కాలం అది. ఆర్యుల ప్రాబల్యం పెరిగిందంటే సింధూ ప్రజల సాంస్కృతిక వారసత్వం సన్నగిల్లిందనే అర్థం. అది పూర్తిగా కాల గర్భంలో కలిసి పోకుండా ఆర్య సంస్కృతిలో అనేక మార్పులతో అంతర్లీనమై పోయింది.



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

ఆర్యులు సింధూ తీరాన్ని దాటి యమునా తీరం దాకా వచ్చి - "యమునా తీరమునా - సంధ్యా సమయమునా" అంటూ గీతాలాపనలు చేస్తూ ఉన్నారు.

కురుక్షేత్ర, నేటి పంజాబ్ స్వాత్‌లోయలోని శరణ్యావతీ నది, సరస్వతీ నదుల ప్రస్థావనలు సామవేదం ఉత్తరార్చికలోని 8వ అధ్యాయం, ఐదవ ఖండంలో 3వ తృచలోని జమదగ్ని రుషి మంత్రాల్లో (1163, 1164) ఉన్నాయి.

**'య ఆర్జీకేషు కృత్వసుయే మధ్యే పస్త్యానాం**
**యేవా జనేషు పంచిసు"** *-(సామవేదం : 1164)*

ఈ మంత్రంలో సోమాన్ని గురించి చెప్తూ -

*'రుజీక దేశంలో, కృత్స్నాన (కురుక్షేత్ర) దేశంలో, సరస్వతీ నదీ తీరంలో పంచ జనులతో ఏ సోమం అభిషేకింపబడిందో ఆ సోమం మాకు కోరిన ఫలాన్ని అందించు గాక!"* - అని పై మంత్రం అర్థం.

రుగ్వేదంలో చెప్పిన ఏడు నదులకు (1. పరుష్ణీ(రావి లేదా ఐరావతి), *2. ఆసిక్నీ (చినాబ్ లేదా చంద్రభాగ), 3. విపాట్ (బియాస్ లేదా విపాశీ లేదా వ్యాస ), 4. వితస్తా ( జీలం), 5. సింధూ, 6. శతుద్రి ( సట్లేజ్)* , 7. దృషద్వతీ (ఘర్ఘరా ? ) సోదరిగా సరస్వతిని ఈ వేదంలోని ఉత్తరార్చిక 13వ అధ్యాయంలో 4వ ఖండంలో భరద్వాజుడు ఇలా చెప్పాడు.

**'ఉత నః ప్రియా ప్రియాసు సప్తస్వసాసు జుష్టా సరస్వతీ స్తోమ్యా భూత్ ..."** *-(సామవేదం : 1161; రుగ్వేదం 6-61-10)*

అంటే ...

*"సరస్వతి మాకు ఎంతో ప్రియమైంది. సనాతనమైంది. కీర్తించయోగ్యమైంది. సప్తనదుల, సప్త ఛందస్సులకు సోదరి!"*

పై మంత్రాలను బట్టి చూస్తే ఆర్యులు సప్త సింధుని దాటి, సింధూ మైదానాన్ని దాటి గంగా, యమునా మైదానంలోకి వచ్చారని అర్థం అవుతుంది. వారి నివాసాలు తూర్పుకు బాగా జరిగాయి.

సామవేదంలో మొత్తం మంత్రాలు 1875. వీటిలో 1504 మంత్రాలు రుగ్వేదం లోనివే. కేవలం 99 మాత్రమే కొత్తవి. వీటిలో ఈ మొత్తంలో 272 మంత్రాలు మరలా మరలా వచ్చాయి.రుగ్వేదంలోని 10,580 మంత్రాల నుండి 1504 మంత్రాల్ని ఎంపిక చేసి, వాటిని రాగయుక్తంగా ఆలపించారు. సోమపానం చేసి సామగానం చేశారు. మనకు దొరికినంతలో సంగీత శాస్త్రానికి తొలి ఆనవాలు సామవేదం.

యజుర్వేదంలో లాగా యజ్ఞక్రతువులు, పశువధలు, ఎదుటి వారి వినాశనాన్ని కోరుకునే మంత్రాలు ఈ సామవేదంలో కనిపించవు. ఎందుకంటే...రుగ్వేద కాలంలో ఆర్యులు చొరబాటుదార్లు. స్థానిక ప్రజలతో వారికి నిరంతర

ఘర్షణలు. ఆ తర్వాత కొంత కాలం వారిది నిలదొక్కుకునే స్థితి. తమ యజ్ఞసంస్కృతిని నిలబెట్టుకునే పరిస్థితి. కాబట్టి క్రతువులు, పశువధలు, దశ్యజన వినాశనాన్ని కోరుకునే మంత్రాలు రుగ్,యజుర్వేదాల్లో కనిపిస్తాయి. కానీ, ఆ తర్వాత వారు స్థిరపడ్డారు. వ్యావసాయానికి మళ్ళారు. మూల వాసులతో దాదాపు యుద్ధాలు తగ్గిపోయాయి. ఘర్షణలు సమసిపోయాయి. విందులతో, చిందులతో నిర్భయంగా సాగిపోయే జీవితం. కాబట్టి అలాంటి జీవితాన్ని ప్రతిబింబించే మంత్రాలే ఈ సామంలో కనిపిస్తాయి. అందుకే...ఈ సామవేదంలో ఇంద్రుణ్ణి, అగ్నినీ, ముఖ్యంగా మిగిలిన దేవతల్ని కీర్తించే మంత్రాలే అప్పుడప్పుడూ కనిపిస్తాయి. ముఖ్యంగా సోమరసాన్ని, సోమపానాన్ని గురించి గానం చేసిన మంత్రాలు చాలా ఎక్కువగా ఉంటాయి. వాటిని చూస్తుంటే ఇది సామవేదమా? సోమవేదమా? అని కూడా అనిపిస్తుంది.

రుగ్వేదంలో విషయాలే వచ్చినా కొన్ని కొత్త విషయాలూ ఉన్నాయి.

## కొలమాన తొలి సాధనం

ఈ ప్రపంచంలో ఏమూలనున్నా మనుషులందరూ కాలాన్ని ఏదో ఒక విధంగా కొలిచారు. దాదాపు అందరూ ఉపయోగించిన మొదటి సాధనం సూర్యుడే. సూర్యునితో పగలూ, రాత్రుల్ని గుర్తించడం, లెక్కించడం, మారే వాతావరణాల్ని (ఋతువుల్ని) బట్టి సంవత్సరాల్ని గుర్తించడం దాదాపుగా అన్ని చోట్లా జరిగాయి.

కాబట్టి కాలమానంలో తొలి 'కొలమానం' సూర్యుడే. సూర్యుణ్ణి ప్రతి రోజూ చూస్తూ ఉంటే దాదాపుగా ఎలాంటి మార్పు కనిపించదు. ప్రతిరోజూ అదే ఉదయం, అదే ఉషోదయం, అదే సంధ్యా కాలం, అదే సూర్యాస్తమయం, అదే రాత్రి.

కానీ రాత్రి కాలంలో ఆకాశంలో కనిపించే చుక్కలు. ఆ చుక్కల నడుమ చందమామ. చుక్కల స్థానంలో నెమ్మదిగా కదులుతూ ఉంటాయి. చంద్రుడు మాత్రం రోజుకు ఒకరకంగా కనిపిస్తాడు. హెచ్చు తగ్గులు ఒక చక్రంలా తిరుగుతూ ఉంటాయి. ఈ హెచ్చు తగ్గుల్నిబట్టి రోజుల్ని, పక్షాల్ని, నెలని గుర్తించేందుకు అవకాశం ఉంది. కాబట్టి కాలాన్ని మరింత ఖచ్చితంగా గుర్తించే వీలు చంద్రునివల్ల, అతని కళల వల్ల సాధ్యమైంది.

సూర్యుణ్ణి బట్టి కాలాన్ని లెక్కించే విధానాన్ని "సౌరమానం" అంటాం. చంద్రుణ్ణి బట్టి కాలాన్ని లెక్కించే విధానాన్ని చంద్రమానం అంటాం.

సౌరమానం కంటే చంద్రమానమే మరింత ఖచ్చితమైన కాలగణన. పశుపోషక సమాజాలకి చాంద్రమానంతో అవసరం ఉండదు. వీరికి సౌరమానం చాలు. వారి జీవితం "పడుకున్నామా! లేచామా! తెల్లారిందా! పశువుల్ని మేపామా?" లన్నట్లుంటుంది. అంతే!

కానీ, వ్యవసాయక సమాజాలకి ప్రతి రోజూ లెక్క అవసరమే. పంటలు, వానలూ, నేల తీరు, పొలం సాగు ... ఇవ్వన్నీ మంచి అంచనాలు లేక పోతే ముందుకు సాగవు. కాబట్టి వ్యావసాయక సమాజాలకు చాంద్రమానం అవసరం. అందుకే ... పశుపోషక ఆర్యులు సౌరమానం పాటిస్తే, వ్యవసాయిక సింధూ ప్రజలు చంద్రమానాన్ని పాటించారు.

ఆర్యులు క్రీ.పూ.800 నాటికి మనం ముందుగా చెప్పుకున్నట్లు పంజాబు నుండి యమునా తీరం వరకూ వచ్చి స్థిరపడ్డా, వ్యవసాయం కూడా నేర్చారు. గణరాజ్యాలు స్థాపించారు. కాబట్టి వీరి కాలమానంలో సౌరమానం ప్రధానంగా ఉన్నా, చంద్రమానం కూడా కనిపిస్తుంది.

## చల్లని వెన్నెల సూర్యుని చలువే

ఐతే వీరు సూర్యునికి ఇచ్చిన ప్రాధాన్యత చంద్రునికి ఇవ్వలేదు. సూర్యుని సంబంధించిన మంత్రాల్ని చూస్తే ఈ సమస్త విశ్వంలోని గ్రహనక్షత్రాలకూ, ముఖ్యంగా చంద్రుడు ప్రకాశించడానికి కేడా మూల కారణం సూర్యుడే అనే భావన ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. చంద్రుని చల్లని వెన్నెల కాంతి కూడా సూర్యుని చలువే అని నమ్మి సూర్యుణ్ణి ఒక మహా కాంతి స్వరూపంగా ఆర్యులు భావించారు.

**"అత్రాహగోరమన్వత నామత్వష్టురపీ చ్యం ఇత్థా చంద్రమసో గృహే"** *(సామవేదం : (147) ఐంద్రకాండ : అ2, ఖం4, మం3)*

"ఆకాశంలో కదిలే చంద్రునిలో రాత్రులందు కూడా సూర్య కిరణాలే ప్రకాశిస్తున్నాయి"

ఇది చాలా ఆశ్చర్యం గొలిపే విషయం. చంద్రుడు స్వయం ప్రకాశి కాదని, చంద్ర కాంతి కూడా సూర్యునిదే అనే విషయం చెప్పడం చాలా గొప్ప విషయం. ఈ ఒక్క చోటే కాదు –

**"చంద్రమా అప్స్వా – న్తరా సుపర్ణో ధావతే దివి"**

– (సామవేదం : 147)

**"అత్రాహగోరమన్వత నామ త్వష్టురపీచ్యం**

**ఇత్థా చంద్రమసో గృహే"** – (సామవేదం : 915)

పై మంత్రాల్లాంటి మంత్రాలు ఇంకొన్ని చోట్ల ఉ

న్నాయి. వీటన్నింటి అర్థం ఒక్కటే ... చంద్రుడు ప్రకాశింపజేసే కాంతి చంద్రునిది కాదు. ఆ కాంతి సూర్యుని కాంతే అని. అంటే చంద్రుడు స్వయం ప్రకాశి కాదని.

ఈ మంత్రాలు చూసి "ఎంతటి విజ్ఞానం'' అని ఎవ్వరైనా నోరెళ్ల బెట్టాల్సిందే! అంతటి విజ్ఞానమా? అని. మరికొన్ని చోట్ల ఉన్న మంత్రాలుగానీ లేకపోతే మనం కూడా ఆపని చేయాల్సి వచ్చేది - ఇప్పుడు ఆ మంత్రాల్ని చూద్దాం.

**"ఉదుస్రియాఃసృజతే సూర్యః సచాఉద్యన్నక్షత్రమార్చివత్"** -*(సామవేదం : 752)*

*"సూర్యుడు తన కిరణాలతో ఒకేసారి ప్రకాశిస్తాడు. ఉదయిస్తాడు. ఆకాశంలోని నక్షత్రాలకు కాంతిని ప్రసాదిస్తాడు"* అని. అలా

**'తరణిర్విశ్వ దర్శతో జ్యోతిష్కృదసి సూర్య విశ్వమా భాసి రోచనం"** -*(సామవేదం : 635)*

*"సూర్యుడు ఆకాశంలో చంద్రునితోపాటు అన్ని జ్యోతులకూ (గ్రహాది నక్షత్రాలకూ) కాంతిని ప్రసాదిస్తాడు"* అని.

అంటే - చంద్రునికి ఒక్కనికే కాదు. ఆకాశంలో కన్పించే నక్షత్రాలన్నింటికీ ప్రకాశకత్వాన్ని కలిగించేది సూర్యుడే అని.కాబట్టి ఆర్యుల భావన ఈనాటికి సగమే సరైనదిగా నిలబడింది. అయినా ఇది అభినందనీయమే!

మొత్తం మీద సూర్యుడు స్వయం ప్రకాశి అనే విషయాన్ని గట్టిగానే ప్రకటించారు. అతని తేజస్సు వినాశనం లేనిది అని కూడా చెప్పారు. (సా. 2243)

సూర్యుడు లేకపోతే చూడలేం

**'కేతుం కృణ్వన్న కేతవే పేశో మర్యా అపేశసే సముషద్భిరజాయథాః"** -*(సామవేదం : 1470)*

అంటే ...

"ఇదెంత విచిత్రం! చూడండి! సూర్యుడు ఉదయించి చీకటి రాత్రికి వెలుగును ఇస్తున్నాడు. రాత్రి వేళల్లో రూపం కనిపించని వారికి రూపాన్ని ప్రసాదిస్తున్నాడు". రాత్రి చీకటిలో ఎవ్వరి రూపాలూ కన్పించవు. అందరూ చీకటి ముద్దల్లానే కన్పిస్తారు. ఏ వస్తు రూపం అయినా అంతే! వస్తువు కన్పించాలంటే దాని మీద వెలుతురు పడాలి. ఆ వెలుతురు తిరిగి ప్రతిఫలించాలి. అలా ప్రతిఫలించిన కాంతి మన కంటికి చేరాలి. అప్పుడే వస్తువు కన్పిస్తుంది. అంటే కాంతి వల్లే వస్తువు కన్పిస్తుంది. మరి ఆ కాంతి ఎవరి వల్ల వస్తుంది? సూర్యుని వల్లే. సూర్యుని వల్లే మనం చూడగలుగుతున్నాం అనే విషయాన్ని ఎంత కవితాత్మకంగా చెప్పారో!

సూర్యుడు ఉదయించక ముందు తూర్పు ఆకాశంలో ప్రకాశించే కాంతిని ఉషస్సు అంటారు. దీన్నే "ఉష" అంటాం. "రాత్రి" కూడా సూర్యుని వల్లే కలుగుతుంది. కాబట్టి ఉషా, రాత్రి ఇద్దరూ అక్కచెల్లెళ్ళు అంటారు ఆర్యులు. గ్రహ, నక్షత్రాల కాంతికంటే ఉషస్సే కాంతివంతమైంది అని కూడా అంటారు.

**"ఇదం శ్రేష్ఠం జ్యోతిషాం జ్యోతిరాగాచ్చిత్రః ప్రకేతో ...."**

- *(సామవేదం : 1749)*

అంటారు. ఎందుకంటే ఉషః కాంతి రాగానే ఆకాశంలోంచి నక్షత్రాలు, గ్రహాలు కనిపించవు కదా!

సామవేదంలో పగలూ,రాత్రుళ్ళకు కారణమైన సూర్యుణ్ణి ఎవరు సృష్టించారు? ఆకాశంలో ఎవరు ప్రతిష్ఠించారు? అనే విషయం ఉంది.

**"యజ్ఞాయథా అపూర్వ్య మఘవన్ వృత్తహత్యాయ తత్పృథివీమ ప్రథమస్తదస్తభ్నా ఉతో దివం"** - *(సామవేదం : 1429)*

*'ఓ! ఇంద్రా! వృత్తుణ్ణి చంపడానికి వెళ్ళేప్పుడే ఈ భూమిని స్థిరపరచావు. ద్యులోకాన్ని (ఆకాశాన్ని) స్థిరపరచావు.*

అంటే.... ఇంద్రుడు మొదటిగా భూమినీ,ఆకాశాన్నీ తమతమ స్థానాల్లో ఉంచాడని అర్థం.

**'తత్తే యజ్ఞో అజాయత తదర్క ఉత హస్కృతిః తద్విశ్వమభి భూరసి యజ్ఞాతం యచ్చ జన్త్వం"** -*(సామవేదం : 1430)*

"అప్పుడే యజ్ఞమూ పుట్టింది. పగటిని కలిగించే సూర్యుడూ అవతరించాడు."

అంటే.... ఇంద్రుడు భూమీ,ఆకాశాల్ని నిలిపాక ఆ చీకటిని వెలుగుగా మార్చడానికి అంటే పగటిని కలిగించడానికి యజ్ఞం నుండి సూర్యుణ్ణి ఉద్భవింప చేశాడు అని.

**'అమాసు పక్వమైరయ ఆ సూర్యం రోహయో దివి"**

- (సామవేదం : 1431)

*"అప్పుడు ఆకాశంలో సూర్యుణ్ణి స్థిరపరచావు"*

అంటే.... అలా ఉద్భవించిన సూర్యుణ్ణి ఇంద్రుడు ఆకాశంలో నిలిపాడు అని ప్రియమేధ రుషి ప్రోక్తాలైన పై మంత్రాల అర్థం . అంటే ... ఈ వేదం ప్రకారం ఇంద్రుడే సూర్య ఉద్భవానికీ, ఆకాశంలో స్థిరంగా ఉండటానికీ కారణం అన్నమాట.

ఈ మంత్రాలన్నింటిలో ఏదో అనుభవం, ఏదో పరిశీలన ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. సూర్యుని గురించి చెప్పాలనే తహతహ కనిపిస్తుంది.ఇది నేటి విజ్ఞానానికి సరిగ్గా అందక పోయినా ఒక ప్రయత్నం సాగిందనేది మాత్రం తెలుస్తుంది.

## 30 ఘడియలు?

రుగ్వేదంలో తిథులు, రాశులు, మాసాలు వాటి పేర్లు గతంలో చూశాం. సంవత్సరాన్ని వసంత రుతువుతో కాకుండా శిశిరంతో కొన్ని చోట్ల, హేమంతంతో కొన్నిచోట్ల మొదలుపెట్టి లెక్కించడాన్నీ గత వ్యాసాల్లో చూశాం. సామవేదంలో కూడా హేమంతాన్ని తొలి రుతువుగా చెప్పే మంత్రాలున్నాయి.

అయితే, పగటి కాలాన్ని 30 భాగాలుగా విభజించిన విధానం తొలిసారి సామవేదంలోనే కనిపిస్తుంది.

**"త్రింశద్ధామ వి రాజతి వాక్పతఙ్గాయ ధీయతే**
**ప్రతి వస్తోరహ ద్యుభిః"** – *(సామవేదం : 632)*

ఇది సర్పరాజ్ఞిరుషి మంత్రం.

అలాగే... ఉత్తరార్చిక, అధ్యాయం 11లోని 3వ ఖండంలో కూడా సర్పరాజ్ఞి రుషి ఇదే మంత్రం పునరుక్తి అయ్యింది.

దీని అర్థం ఏమంటే ...

"సూర్యుడు పగటి పూట ముప్పై గడియలు ఎంతో తేజస్సుతో ప్రకాశించును" అనేది.

''గడియ'' అనేది ఒక కాలమానం, ఘడియలు, విఘడియలు అనే కాల విభాగం వేద కాలానికి ఉందా? అనేది ప్రశ్న. దాశరథి రంగాచార్యులు గారు – పై మంత్రంలోని "త్రిశద్ధామి" అనే దానికి 30 గడియలు అని రాశారు. వేదానంద సరస్వతీ గారు అహోరాత్రులతో కూడిన 30 రోజులు అని అనువదించారు.

రోజుని (అహోరాత్రాల్ని) 60 భాగాలు చేసే విధానం ఉంది. పై మంత్రంలోని "ఎంతో తేజస్సుతో ప్రకాశించును" అనేది నెలకి కాకుండా రోజుకి అయితే సరిపోతుంది.

ఏదైనా కాల విభజనకు, గణనకు సూర్యుణ్ణి తీసుకోవడం ఇక్కడి విశేషం.

## పెద్ద పగళ్ళు – చిన్న రాత్రులు

ఆర్యులు కర్కటకరేఖ సమీప ప్రాంతాల్లో నివసించినవారు. వారికి దక్షిణాయనాంతం, ఉత్తరాయన ప్రారంభం స్పష్టంగా తెలుసు. అలాగే విషువత్తులు – అంటే భూమ్మీద పగలూ రాత్రులూ సమానంగా ఉండే రోజులు కూడా తెలుసు. సంవత్సరం పొడవునా ఈ భూమ్మీద రెండు రోజులు మినహా మిగిలిన రోజుల్లో పగలూ రాత్రీ సమానం కాదు.

దక్షిణాన్నుండి ఉత్తరానికి వస్తూ సూర్యుడు మార్చి 22న భూమధ్య రేఖ మీద ఉంటాడు. ఆ రోజున ఈ భూమ్మీద ఎక్కడున్నా, ఎవ్వరికైనా పగలూ–రాత్రి సమానాలు. అంటే పగలు 12 గం॥. అలాగే రాత్రి 12 గం॥లు. ఇక అక్కడి నుండి ఉత్తరానికి నడుస్తున్నప్పుడు ఉత్తరార్ధగోళంలో పగటి పొద్దు పెరుగుతూ రాత్రి పొద్దు తగ్గిపోతూ ఉంటుంది. అదే సమయంలో దక్షిణార్ధ గోళంలో రాత్రి పొద్దు పెరుగుతూ పగటి పొద్దు తగ్గిపోతుంది. అలా సూర్యుడు జూన్ 21 నాటికి $23^1/_2$° ల ఉత్తర అక్షాంశమైన కర్కటరేఖ మీదికి చేరుతాడు. దానితో సూర్యుని ఉత్తరాయన ప్రయాణం పూర్తవుతుంది. దీన్ని *ఉత్తరాయనాంతం* అంతం అంటారు. ఆ తర్వాతి రోజు జూన్ 22న తిరిగి వెనక్కి తిరుగుతాడు. దీన్ని *దక్షిణాయన ప్రారంభం* అంటారు. అలా దక్షిణ దిశగా కదిలి వస్తుంటే ఉత్తరార్ధగోళంలో పగలు పొద్దు తగ్గి, రాత్రి పొద్దు పెరగడం ప్రారంభిస్తుంది. అదే విధంగా దక్షిణార్ధగోళంలో పగలు పొద్దు పెరగడం, రాత్రి పొద్దు తగ్గడం మొదలు పెడుతుంది.

అలా సూర్యుడు సెప్టెంబర్ 23 నాటికి మరలా భూమధ్య రేఖ మీదికి వస్తాడు. ఆ రోజు పగలూ రాత్రీ సమానం. అలా సూర్యుడు భూమధ్య రేఖను దాటి దక్షిణార్ధం గోళంలోని $23^1/_2$° ల దక్షిణ అక్షాంశమైన మకర రేఖ మీదికి డిసెంబర్ 21న చేరుకుంటాడు. ఆరోజు *దక్షిణాయనాంతం.* ఆ మరుసటి రోజు డిసెంబర్ 22న తిరిగి ఉత్తరాభి ముఖంగా నడక ప్రారంభిస్తాడు. అది *ఉత్తరాయణ ప్రారంభం.* ఇక ఆనాటి నుండి దక్షిణార్ధ గోళంలో పగటి కాలం తగ్గి, రాత్రి కాలం పెరుగుతూ ఉంటుంది. అలా సూర్యుడు మార్చి 22 నాటికి భూమధ్య రేఖ మీదికి వస్తాడు. ఆ రోజు పగటి పొద్దు, రాత్రి పొద్దులు రెండూ సమానం

అంటే ... మార్చి 22, సెప్టెంబర్ 23 తేదీల్లోనే పగటి పొద్దూ – రాత్రి పొద్దూ సమానం అన్నమాట. ఈ రెండు రోజుల్నే *విషువత్తులు* అంటారు. ఈ రెండు రోజులు తప్ప మిగిలిన 363 రోజుల్లో ఈ అహోరాత్రులు సమానంగా ఉండవు. ఉత్తరార్ధగోళంలో సూర్యుడు ఉండే 6 నెలలు మార్చి 22 నుండి సెప్టెంబర్ 23 వరకూ ఉత్తర ధృవ ప్రాంతంలో 6 నెలలూ పగలే. ఆ 6 నెలలూ దక్షిణ ధృవ ప్రాంతంలో రాత్రే. అలాగే దక్షిణార్ధ గోళంలో సూర్యుడు ఉండే 6 నెలలు (సెప్టెంబర్ 23 నుండి మార్చి 22 వరకూ) దక్షిణ ధృవ ప్రాంతంలో పగలే. ఉత్తర ధృవ ప్రాంతంలో రాత్రే.

ఈ అహోరాత్రుల వ్యత్యాసాల్ని మనం అక్షాంశాల ద్వారా తేలిగ్గా తెలుసుకోడానికి వీలుంది. ఈ వ్యత్యాసాలు ఎందుకంటే, భూమి సూర్యుని అక్షానికి $23^1/_2$° వంగి ఉంది. అల వంగి, సూర్యుని చుట్టూ తిరుగుతూ ఉంటుంది. దానివల్ల ఒక 6 నెలలు ఉత్తర ధృవం సూర్యుని వైపుకు, ఒక 6 నెలలు దక్షిణ ధృవం సూర్యుని వైపుకు వస్తుంది.

నిజానికి సూర్యుడు అక్కడే ఉంటాడు. ఉత్తరానికీ దక్షిణానికీ కదలడు. కదిలేది భూమే. వంగి ఉండడం వల్ల ఉత్తరాయణ, దక్షిణాయనాలు ఏర్పడ్డాయి.

భూమి అలా వంగి ఉండక పోతే ఎప్పుడూ పగలూ రాత్రీ సమానంగా ఉండేవి. రుతువులు ఏర్పడేవి కావు. ఈ

మార్పులన్నీ భూమి అక్షం వంగి ఉండడం వల్లే. అందుకే..

" వంగి నందుకు భూమి నీకు వందనాలమ్మా!"

## పొద్దుల తేడాల పద్దు

ఈ అహోరాత్రుల్లో మార్పులు ఇలా ఉంటాయి. ప్రతి పది డిగ్రీలకూ ఈ సమయ వ్యత్యాసాలు చూద్దాం.

| | పగటి పొద్దు | రాత్రి పొద్దు | తేడా (సుమారుగా) |
|---|---|---|---|
| 0° ల దగ్గర | 12 గంll | 12.00 గంll | తేడా లేదు |
| 10° ల దగ్గర | 11.25 గంll | 12.35 గంll | 1గం. |
| 20° ల దగ్గర | 10.48 గంll | 13.12 గంll | $2\,^1/_2$గం.లు |
| 30° ల దగ్గర | 10.04 గంll | 13.56 గంll | 4గం.లు |
| 40° ల దగ్గర | 9.08 గంll | 14.52 గంll | 6గం.లు |
| 50° ల దగ్గర | 7.42 గంll | 16.18 గంll | $8^1/_2$గం.లు |
| 60° ల దగ్గర | 5.33 గంll | 18.27 గంll | 13 గంllలు |
| $66^1/_2$° ల దగ్గర | 0 గంll | 24.00 గంll | 1 రోజు |
| 70° ల దగ్గర | 10 నెలలు | 2 నెలలు రాత్రి | |
| 80° ల దగ్గర | 8 నెలలు | 4 నెలలు రాత్రి | |
| 90° ల దగ్గర | 6 నెలలు | 6 నెలలు | |

పై పట్టికలో 30° ల ఉత్తర అక్షాంశ ప్రాంతంలో పగటి పొద్దు సుమారుగు 10 గంll ఉంటే రాత్రి పొద్దు 14 గంllలు ఉంటుంది. అహోరాత్రుల తేడా సుమారు నాలుగు గంటలు. ఈ తేడా అలా పెరిగి పెరిగి $66^1/_2$° ల దగ్గర 24 గంటలకు సమానం అవుతుంది.

అలాగే ... ఉత్తరాన 30° ల దగ్గర పగటి పొద్దు 10 గంటలు, రాత్రి పొద్దు 14 గంటలు ఉంటే అదే సమయంలో దక్షిణాన 30° ల దగ్గర పగటి పొద్దు 14 గంటలు, రాత్రి పొద్దు 10 గంటలు ఉంటాయి. ఉత్తరార్థ గోళంలో పగటి కాలం పెరిగితే, దక్షిణార్థ గోళంలో పగటి కాలం తగ్గుతుంది. అంతే ...! అంటే $30^0$ అక్షాంశం దగ్గర ఉన్నవారు పగటి,రాత్రి కాలంలో 4 గంటల తేడాని చూడగలరు.

ఇదంతా ఎందుకంటే ... ఆహోరాత్రులు ఎప్పుడూ సమానంగా ఉండవు అనేది అందరికీ తెలిసిన విషయమే. దీని కోసం కొద్దిపాటి పరిశీలన చాలు. ఆర్యులు ప్రకృతిశక్తుల ఆరాధకులు కాబట్టి వారికి తెలియకుండా ఎలా ఉంటుంది?

ఈ మంత్రం చూడండి:

**"అరణ్యం పర్వం ఆరో అధ్యాయం"**

– (సామవేదం 5ఖం.12 మం)

**"ఉద్ ద్యామే షి రజః పృథ్వహామిమానో అక్తుభిః పశ్యఞ్జన్మాని సూర్య"** – *(సామవేదం : 638)*

"ఓ! సూర్యదేవా! నీవు రాత్రులనూ, పగళ్ళనూ కొలతలు వేస్తూ, సకల ప్రాణిజాలాన్ని వీక్షిస్తూ, ఈ అనంత విశాలమైన అంతరిక్షాన ఉదయిస్తున్నావు!"

ఇక్కడ "పగళ్ళనూ, రాత్రులనూ కొలతలు వేస్తూ" అనేది ముఖ్యమైన విషయం. ఈ ఉభయ పొద్దుల్లో తేడా రాడానికి సూర్యుడే కారణమైనట్లు రాత్రి ఇంత ఉండాలి, పగలు ఇంత ఉండాలనే "కొలత" సూర్యుడే వేస్తున్నట్లు ఈ మంత్రం చెప్పింది.

ఈ పగలూ రాత్రుళ్ళలో వ్యత్యాసాన్ని 16° ల దగ్గరున్న తెలుగు ప్రజలం సుమారు గంటన్నర వ్యత్యాసాన్నే చూడగలం. మనకి ఎప్పుడూ అంతే వ్యత్యాసం ఉంటుంది. ఆర్యస్థావరాలు 25° ల పైన, 40° ల మధ్యన ఉన్నాయి. వారికి ఈ వ్యత్యాసం దాదాపు 4 గంటల దాకా ఉంటుంది. ఇంత వ్యత్యాసానికి కారణం వారి దృష్టిలో సూర్యుడే. ఎందుకంటే లోకాలన్నింటికీ రాత్రికీ, గ్రహాలకీ, నక్షత్రాలకీ, చంద్రునికీ ఇలా అందరికీ వెలుగు ఇచ్చేది సూర్యుడే కదా!

ఇలా... సూర్యుడే ప్రధానంగా ఆర్యుల కాలగణనం సాగింది. కానీ, రానురాను ఆర్యులు వ్యవసాయ నాగరికతకు మళ్ళిన కొద్దీ... చంద్రమానం అవసరం అయ్యింది.

గడియారంలో గంటల ముల్లు కంటే నిమిషాల ముల్లు వల్లే కాలాన్ని ఖచ్చితంగా గుర్తించగలం.

అందుకే... గంటల ముల్లులాంటి సౌరమానాన్ని వదిలి తదనంతర కాలంలో నిమిషాలు ముల్లులాంటి చాంద్రమానం వైపుకు ఆర్యులు రావలసి వచ్చింది. సింధూ ప్రజల కాలమానాన్ని బట్టి నడచుకోవలసి వచ్చింది.

అందుకే ఆర్యులు ... విజేతలైన పరాజితులు!

*(ఇంకావుంది)*


# ఆయుధాలు - ఆర్థిక సంబంధాలు

> ""త్వామగ్నే అంగిరసో గుహాహిత మన్వవిందంచి
> శ్రియాణం వనే వనే స జాయసే మథ్యమానం :
> సహో మహత్వామాహు : సహసస్పుత్ర మంగిర : "
> "అగ్ని గుహల్లో ఉంటుంది. చెట్టు చెట్టులో ఉంటుంది. అంగిరసుడు అనే రుషి ఆ అగ్నిని సాధించాడు. గట్టిగా మథిస్తే అగ్ని పుట్టేట్లు చేశాడు"
> *-(సామవేదం : 908)*

## అంగిరసుడు - అంగారం

మానవ నాగరికత చరిత్రలో అద్భుత ఆవిష్కరణల్లో 'అగ్నిని పుట్టించడం' ఒకటి. అడవుల్లో రేగిన అగ్నిని ఆరిపోకుండా కాపాడుకోవడం తొలి తరం మానవులు చేశారు. కొమ్మ మీద కొమ్మతో రాపాడించి, రాయితో రాయిని కొట్టి నిప్పును పుట్టించారు ఆ తరువాతి తరం మానవులు.

మతపరమైన నమ్మకాలు ఎన్ని ఉన్నా, ఎలా ఉన్నా యజ్ఞక్రతువులో యజ్ఞగుండాన్ని మాత్రం కొమ్మపై కొమ్మను రాపాడించడం వల్ల పుట్టిన అగ్నితోనే మండించాలి. మానవ నాగరికతా ప్రవాహంలో పాత తరపు అలవాట్లు, కొత్త తరానికి ఆచారాలుగా మారతాయి. ఇదీ అలాంటిదే!



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

యజ్ఞంలో అగ్నిని పుట్టించే కొయ్య సాధనాన్ని "ఆరణి" అంటారు. ఒక చెక్క రంధ్రంలో సూదిలాంటి గుండ్రని వుల్లను ఉంచి, దాన్ని కవ్వంలా చిలుకుతారు. అప్పుడు పుట్టిన ఘర్షణ వల్ల వేడి, అగ్ని చెలరేగుతాయి. ఆ రేగిన అగ్నినలుసులే రగిలి రగిలి జ్వలిస్తాయి. ఆ రేగిన అగ్ని ఆరిపోకుండా దానిలో సమిథలు వేస్తూ, దానికి తోడుగా నెయ్యి (కొవ్వు) పోస్తూ యజ్ఞగుండాన్ని మండిస్తూనే ఉంటారు.

జంతువుల కొవ్వు మండటం, ఎండిన చెట్టు పుల్లలు మండడం... ఇవి మనిషికి నిత్య అనుభవం. కానీ, కొమ్మపై కొమ్మతో రాపాడించి అగ్నిని పుట్టించడం ఒక ఆవిష్కరణ. అనుభవాన్ని ఆవిష్కరణగా మార్చుకున్న నైపుణ్యం. రేడియో కనిపెట్టింది, టెలిఫోన్ కనిపెట్టింది, సైకిల్ కనిపెట్టింది, విమానం కనిపెట్టింది ఎవరు? అంటే ఫలాన ఫలానా అని చెప్పేస్తాం. కానీ, మానవ జాతిచరిత్రలో అద్భుత ఆవిష్కరణలైన "అగ్ని, చక్రం"ల ఆవిష్కర్తలు ఎవరు? అంటే చెప్పలేం.అయితే, నిప్పును పుట్టించే ''ఆరణి'' ప్రక్రియకు పితామహుడు "అంగిరసుడు" అంటుంది సామవేదం. అంగిరసుని పేరు మీదిగానే అగ్నికి "అంగారం" "అంగారకం'' అనే పేర్లు వచ్చాయి.

పై మంత్రంలో "శ్రియాణం వనే వనే సజాయసే ..." అనేది చాలా విశేషమైన అంశం. 'ప్రతి చెట్టులోనూ అగ్ని ఉంది' అని గదా దీనర్థం. నిజానికి వృక్షాలు కిరణజన్య సంయోగక్రియ (ఫొటో సింథసిస్) లో సూర్యుని నుండి శక్తిని గ్రహిస్తాయి. ఆ శక్తి ద్వారా ఆక్సిజన్, హైడ్రోజన్, కర్బనాలతో ఒక బంధం ఏర్పాటు చేసుకుంటాయి. మరలా ఆ బంధాన్ని తెంచుకుంటే అవి విడిపోతాయి. అప్పుడు శక్తి బహిర్గతం అవుతుంది. అదే అగ్ని.

అగ్ని చెట్టులో ఉన్నప్పుడుగానీ, ఎండు కట్టెలో ఉన్నప్పుడుగానీ అది కాలదు. ఉష్ణాన్ని వెదజల్లదు. కానీ వాటి అణువుల మధ్య ఘర్షణ పుట్టినప్పుడు మానుల్లో నిద్రపోతున్న శక్తి మేల్కొంటుంది. మంటలా మారిపోతుంది. అలా నిద్రాణమైన శక్తిని మేల్కొల్పే సాధనం 'ఆరణి'. దీన్ని అంగీరస రుషి ఆవిష్కరించాడని ఈ వ్యాసం మొదట చెప్పుకున్న మంత్రం వల్ల తెలుస్తుంది.

చెక్కలో చిలకబడే ఆరుణుల గురించి ఎంత అందమైన వర్ణనో ఇది:

> **"అరణ్యోర్నిహితో జాతవేదాగర్భ
> ఇవేత్సుభృతో గర్భిణీ భిః"**
> ***-(సామ వేదం. అధ్యా:1, ఖం:8)***

విశ్వామిత్రుడు పలికిన ఈ సామానికి అర్థం ఇది:

*"గర్భవతులు గర్భాన్ని దాల్చినట్లు, ఆరణులు తమ గర్భంలో అగ్నిని దాల్చాయి".*

గర్భంలోపలి శిశువు ఎలా కన్పించదో, అడవుల్లో (వృక్షాల్లో) ఉన్న అగ్ని కూడా అలాగే కన్పించదు కదా!

వృక్షాలు తమ గర్భాల్లో అగ్నిని దాచాయి లేదా పొదిగాయి" అని పై మంత్రానికి అర్థం.

## అడవుల దహనం ఒక ముందడుగు

అడవులు తగలబడడం పెద్ద ప్రళయం. ఇప్పటికంటే అప్పుడు అడవులు అధికం. దట్టం. కాబట్టి ఆ రోజుల్లో అడవి

అంటుకుంటే జీవజాతులకు ఎంతటి విపత్తో ఊహించవచ్చు. అగ్నిని చూసి ప్రపంచంలో జంతువులన్నీ భయంతో పారిపోతాయి. తొలుత మనిషి కూడా పారిపోయేవాడే. కానీ, ఆ అగ్నిని పట్టుకుని, వెంట పెట్టుకుని అడవిని జయించాడు మానవుడు.

ఇప్పుడు అది వినాశనానికి సంకేతమే అయినా, ఆనాడు అది నిస్సంశయంగా మానవుని విజయమే! ఒక అవసరమే! ఆటవిక జీవనం కంటే పశుపాలన ఒక ముందడుగు. పశు పాలన కంటే వ్యవసాయం మరింత పురోగమనం. వ్యవసాయంకంటే పారిశ్రామిక రంగం మరింత ప్రగతి శీలం. మానవ సమాజాలు క్రమంగా వైజ్ఞానికంగా అనుభవాల నుండి మలచుకుంటూ కొత్త కొత్త ఆలోచనలు చేస్తూ, కొత్త కొత్త ఆవిష్కరణలు చేస్తూ ఇప్పుడున్న దశకు వచ్చాయి. ప్రపంచంలో మానవులందరూ ఒకే కాలంలో ఒకే నాగరిక స్థాయిల్లో లేరు. బహుశ ఆటవిక జీవనదశలో తప్ప. కొత్తరాతి యుగం నుండి సమాజాల్లో ఈ స్థాయీ భేదాలు కనపడుతూనే ఉంటాయి.

రుగ్వేద కాలం నాటికి ఆర్యులు ఆదిమ సంచార తెగలే. ఇనుము వారికి తెలిసినప్పటికీ కర్ర పరికరాలూ, రాతి పరికరాలు ఎక్కువగా ఉపయోగించేవారు. వారు ప్రధానంగా పశుపోషకులు. పచ్చిక బయళ్ళే తప్ప పంటపొలాలతో వారికి అంత అవసరం లేదు. కానీ, వారు భారతదేశం వచ్చేనాటికి సింధూ ప్రజలు వ్యవసాయదార్లు. వ్యాపారవేత్తలు. నదీ నీటి వినియోగం బాగా తెలిసిన వాళ్ళు. కాల్చిన ఇటుకలతో పెద్ద పెద్ద విలాస భవనాలు నిర్మించుకున్న ధనిక స్వాములు. బానిస సమాజం బలంగా ఉన్న వారు.

సహజంగా మనం ఆర్యులు, సింధూ ప్రజలకంటే తక్కువ స్థాయి వారు అని పదే పదే చెప్పుకుంటాం. కానీ, సామాజిక కోణంలోంచి చూస్తే ... సింధూ ప్రజలకంటే ఆర్య తెగల్లో మానవ సంబంధాలు బలీయంగా ఉంటాయి. ఐక్యత ఎక్కువగా ఉంటుంది.
దీన్ని అర్థం చేసుకోవాలంటే సామాజిక వికాసంలో మనం "ధనం" దగ్గరకు వెళ్ళాలి.

## కుటుంబం పునాదులు

సమాజాలు ప్రధానంగా రెండు రకాలు.

1. పునరుత్పత్తి సమాజాలు.
2. ఉత్పాదక సమాజాలు.

పునరుత్పత్తి సమాజాలంటే... సంతానోత్పత్తిని పొంది, సంతానాన్ని సంరక్షించే సమాజాలు.

జంతువుల్లో మగ జంతువుల పాత్ర నామమాత్రం. ఆడ జంతువులతో కలసి సంతానోత్పత్తి క్రియలో పాల్గొనే వరకే వాటి పాత్ర ఉంటుంది. జంతువుల్లో ఏ కొద్దిపాటి బిడ్డల పెంపకమైనా అది కేవలం తల్లి బాధ్యతే! అలాంటి సమాజాలలో ఆహారాన్ని నిల్వ చేసుకునే ఆలోచనే ఉండదు. ఆహార ఉత్పత్తి అనేది అసలు తెలియనే తెలియదు.

కానీ....చీమలు, చెదలు, కొన్ని పక్షులు ... వీటిలో సంతాన బాధ్యతని మగ జీవులు లేదా మొత్తం సమాజం తీసుకుంటుంది. ఇలాంటి సమాజాల్లో ఆహార సేకరణ, ఆహారాన్ని నిల్వ చేసుకునే ప్రక్రియలు ఉంటాయి. అంటే ... బిడ్డల పెంపకాన్ని తల్లి మాత్రమే కాకుండా ఇతరులు బాధ్యతగా తీసుకున్న సమాజాల్లో "ఆహార భద్రత" ఒక ప్రధానమైన అంశం అన్నమాట.

"ఆహార భద్రత" ఉన్న సమాజాల్లో ఆహార నిల్వలు ఉంటాయి కాబట్టి, ఆహారం కోసం దాడులు, యుద్ధాలూ జరుగుతాయి.

మరి, మానవ సమాజం ఆహార సేకరణ దశను దాటి ఆహారాన్ని ఉత్పత్తి చేసుకునే దశకు చేరింది. కాబట్టి పై సమాజాలకంటే మానవ సమాజంలో బిడ్డలకు రక్షణ అధికం. కాబట్టి సమాజాలు, సంఘాలుగా, సంఘాలు తెగలుగా, తెగలు కుటుంబాలుగా ఐక్యం చెందాయి.

అంటే ''ఉత్పత్తి రంగం పురుడు పోసుకోగానే సమాజంలో కుటుంబ వ్యవస్థ కళ్ళు తెరిచింది.

సమాజానికి తగినంత నిల్వలు ఉన్నంత కాలం మానవ సంబంధాల్లో కుటుంబ సంబంధాల్లో (మానవీయ సంబంధాలు) బలీయంగా ఉండేవి. ఉత్పత్తి పెరిగిన కొద్దీ, ధనం ప్రోగు పడిన కొద్దీ మానవ సంబంధాలు "ఆర్థిక సంబంధాలుగా" మారడం మొదలు పెట్టాయి. అంటే ... ఉత్పత్తి సంబంధాలు, కుటుంబ సంబంధాలు "విలోమాలు"గా మారిపోయాయి.

ఈ ఆర్థిక ఉత్పత్తి కోణంలోంచి చూస్తే తొలినాటి ఆర్య సమాజాల్లో మానవ సంబంధాలు "కుటుంబ సంబంధాలు" గానే ఉండేవి. కానీ, ఆర్యులు వచ్చే నాటికే సింధూ ప్రజల సంబంధాలు 'ఆర్థిక సంబంధాలుగా' బలపడ్డాయి. సింధూ ప్రజల ఓటమికి అవీ ప్రధాన కారణాలయ్యాయి.

వేదాల్లో ఆర్య సమాజాల మధ్య నున్న సామాజిక సంబంధాల్లో విపరీతమైన అంతరం ఎక్కడా కన్పించదు. యజ్ఞంలోగానీ, పశుపోషణలోగానీ "వీరే అర్హులు, వీరు అందుకు అనర్హులు" అనే పోకడలూ కనిపించవు. అందరూ కలసి క్రతువుల్లో పాల్గొనడం, తాగడం, తందనాలాడడం, దేవతల్ని కీర్తించడం, గానం చేయడం లాంటి మూకుమ్మడి కార్యక్రమాలే కనిపిస్తాయి. అయితే....

## 'అన్నరికాలు'

ఆర్యుల్లో పురుషాధిపత్య కుటుంబ వ్యవస్థ బలీయంగా ఉంది. కుటుంబానికి పెద్ద తండ్రి. ఆ తర్వాత అతని కుమారులే ఆ కుటుంబ వారసులు. తండ్రి సంపదలకు వారసుడు కొడుకే.

**"తముత్వా నూనమసుర ప్రచేతసం రాధో భాగమివే మహే**

**మహీవ కృత్తిః శరణాత ఇంద్ర ప్ర తే సుమ్నానో అశ్నవన్"**

***–(సామవేదం : 12 అధ్యా. 4వ ఖం.)***

దీని అర్థం ఇది:

*"మహాబలశాలి ఇంద్రా! తండ్రి నుండి తనయుడు ధన భాగాన్ని (దాయభాగాన్ని) కోరునట్లు, మేము నిన్ను అర్థిస్తున్నాము. మాకు సుఖాల నిమ్ము"*

ఆర్యులు, తమ కుటుంబానికీ, కుటుంబ వారసత్వానికీ ఒక పద్ధతిని ఎంచుకున్నారు. తండ్రి ఆస్థికి పుత్రులే వారసులు. వారిలో పెద్ద కొడుకే తండ్రి తర్వాత ఇంటి పెద్ద. తండ్రి తర్వాత ఉత్తరాధికారం, బరువు బాధ్యతలు అతనివే!

గట్టిగా మథిస్తే అగ్ని పుట్టేట్లు చేశాడు"

ఆర్యులు ఈ నియమాన్ని గట్టిగా పాటించారు. కుటుంబ ఐక్యత చెడిపోకుండా ఈ భావజాలాన్ని కట్టుదిట్టం చేశారు.

ఇది మనకు రామాయణంలో కన్పిస్తుంది. కైక కోరిక మేరకు రాముడు అరణ్యాలకి వెళ్ళినా ఆ అన్నదమ్ముల మధ్య అధికారం కోసం అంతర్గత గొడవలు రాలేదు. భరతునికి అవకాశం వచ్చినా అందిపుచ్చుకోలేదు. చివరికి రాముడే సింహాసనం ఎక్కాడు. ఒక విధంగా ఇది గౌరవం చాటున దాగి ఉన్న నియంతృత్వమే. ఏక కేంద్ర రాజ్య సంరక్షణ కోసం ఏర్పడ్డ ఏక కేంద్రక కుటుంబ వ్యవస్థ. అయితే.... కొన్నాళ్లకు ఈ కట్టుబాటు సడలింది. దీని పునాదులూ కదిలాయి. ఈ స్థితిని మనం మహాభారతంలో చూస్తాం. ఈ కుటుంబ కట్టుబాటుని పాండవులు అతిక్రమించడం వల్లే మహాభారత యుద్ధం జరిగింది. ఒకే చోట పోగుబడే అధికారంలో, సంపదలో భాగస్వామ్యం కోరారు పాండవులు. అది రాచరిక ప్రజాస్వామం. మారుతున్న పరిస్థితుల్ని అర్థం చేసుకున్న భీష్మునిలాంటి పెద్దలూ, విదురుని లాంటి రాజనీతిజ్ఞులూ..ఎటూ తేల్చుకోలేక పోయారు.

చిత్రం ఏమిటంటే...

ధృతరాష్ట్రుని 'అన్నరికాన్ని' తమ్ముడైన పాండురాజూ కాదనలేదు.

బలరాముని 'అన్నరికాన్ని' తమ్ముడైన శ్రీకృషణడూ ఎదిరించలేదు. పాండు పుత్రులైన పాండవులే ప్రశ్నించారు. ఎదిరించారు. అందుకోసం యుద్ధం చేశారు.

## పితృస్వామ్య కుటుంబాలు

అది సరే, ఇక అసలు విషయాని కొద్దాం. ఆర్యుల కుటుంబ వ్యవస్థ ఎలాంటిదో చూడండి:

**"త్వే క్రతుమపి వృంజంతి విశ్వే ద్విర్యదేతే త్రిర్భ**

**వన్త్యూమాః స్వాదోః స్వాదీయః స్వాదునా సృజా**

**సమదః సు మధు మధునాభి యోధీః"**

***–(సామవేదం : అధ్యా:13, ఖం: 6)***

దీని అర్థం ఇది:

*"ఓ! ఇంద్రా! నిన్ను అర్చించేవారు మొదటిగా ఒక్కరు. ఆ తర్వాత అతను భార్యతో కూడి ఇద్దరవుతారు. ఆపై పుత్రునితో కూడి ముగ్గురవుతున్నారు. ఇంటికన్నా, ధనంకన్నా ప్రియమైనది సంతానం. ఆ సంతానాన్ని ఎంతగానో ప్రేమించే తల్లిదండ్రులతో చేర్చు. ఈ మధుర సంతానాన్ని వారి మనుమళ్ళతో ఆడుకునేలా చూడు".*

అంటే... కూతుర్లతో, మనుమరాళ్ళతో అని చెప్పలేదు. కానీ, కుటుంబ వ్యవస్థను బలోపేతంగా చెప్పడం జరిగింది.

ఇలాంటి బలమైన కుటుంబ సంబంధాలు గలవి ఆర్థిక సంబంధాలు బలంగా వేళ్ళూనుకోని సమాజాలు మాత్రమే!

ఆర్యుల పితృస్వామ్య సమాజంలో తండ్రికి ఎంత ప్రాధాన్యత ఉందంటే ...

**' ... పుత్రాసోన పితరం వాజసాతయే మంహిష్ఠం వాజసాతయే!"**

***–(సామవేదం : 5 అధ్యా: 10 ఖం)***

ఈ మంత్రం అర్థం ఇది:

*"అన్నం పెట్టమని బిడ్డ తండ్రిని కేక వేసినట్లు ఇంద్రా! యుద్ధంలో విజయాన్ని కలిగించమని నిన్ను పిలుస్తున్నాము"*

సహజంగా అన్నం పెట్టమని బిడ్డ తల్లిని కేక వేస్తాడు. కానీ, ఇక్కడ తండ్రిని కేక వేశాడు.

ఇక మరొకటి చూద్దాం:

**"సఖాయ ఆనిషీద త పునానాయ ప్రగా యత**

**శిశుం న యజ్ఞైః పరి భూషతి శ్రియే"**

***–(సామవేదం : అధ్యా.5; ఖం.10)***

ఇక, దీని అర్థం ఇది:

*"మిత్రులారా! సోమాన్ని గురించి పాడండి. సామగానం చేయండి. తండ్రి తన బిడ్డను అలంకరించినట్లు, సోమాన్ని యజ్ఞాలతో అలంకరించండి".*

అంటే... బిడ్డల అలంకరణ బాధ్యత కూడా తండ్రిదే అన్నమాట. దీన్ని బట్టి ఆర్యులది బలమైన పురుషాధిపత్య

సమాజం అని తెలుస్తూనే ఉంది. స్త్రీల ప్రాధాన్యత దాదాపుగా లేనట్లే. వేదాల్లో అదెక్కడా మచ్చుకైనా కనిపించదు.

ఇక, అసలు విషయాని కొద్దాం!

## అడవుల్ని కొట్టి – అరకల్ని పట్టి

ఆర్యులు పశుపాలకులు, సంచారులు కాబట్టి వారి కుటుంబంలో పురుషాధిపత్యం సహజం. పశుసంపద వృద్ధిలో బీజ ప్రాధాన్యతే ఉంటుంది. కాబట్టి వారి జీవన విధానం కూడా వారి కుటుంబ సంబంధాల్లో ప్రతిబింబిస్తుంది.

వారు సింధూ ప్రాంతానికి వచ్చాక క్రమేపీ వ్యవసాయానికి మళ్లారు. వారు వచ్చే నాటికే సింధూ ప్రజలూ, స్థానిక భారతీయ మూలవాసులూ వ్యావసాయిక సమాజాలుగా జీవనం సాగిస్తున్నారు.

సామవేద కాలానికి అంటే క్రీ.పూ. 800 సంవత్సరాల నాటికి ఆర్యులు గంగా తీర ప్రాంతం వరకూ వచ్చారు. వస్తూ వస్తూ ఆ ప్రాంతాల్లోని అరణ్యాల్ని తగలబెట్టి వ్యావసాయక క్షేత్రాలుగా మార్చారు.

అదే మనకు ... ఈ వ్యాసం మొదట ఉటంకించిన మంత్రంలో కన్పిస్తుంది. ఇంకా భారద్వాజుని ఈ సామ మంత్రాన్ని చూడండి.

**"తమీడిష్వ యో అర్చిషావనా విశ్వా పరిష్వజత్**

**కృష్ణాకృణోతి జిహ్వయా" –*(సామ: అధ్యా. 8, ఖం. 3.1)***

దీని అర్థం ఇది:

*"ఏ అగ్ని తన జ్వాలలతో అరణ్యాలన్నింటినీ కాల్చి నల్లని మసి మసి చేయునో అలాంటి అగ్నిని స్తుతించండి".*

అంటే ... అడవుల్ని దగ్ధం చేసే అగ్నిని స్తుతించ మంటున్నారు. ఎందుకంటే ...

**"యిద్ధ ఆ నివాసతి సుమ్నమింద్రస్య మర్త్యః**

**ద్యుమ్నాయ సుతరా అపః" –*(సామవేదం : 8–3.2)***

అంటే ...

*"యజ్ఞం చేయించే వారి కోసం (ఆర్యుల కోసం) ఇంద్రుడు అడవిని దగ్ధం చేసినందుకుగాను, వారికి వర్షాన్ని కురిపిస్తాడు"!*

ఇంకా ... భరద్వాజుడు ఇలా అంటాడు.

**"తానో వాజవతీరిష ఆశూన్ పిపృత మర్వతః**

**ఏంద్రమగ్నిం చ వోఢవే" –*(సామవేదం : 8–3.3)***

*"ఓ ఇంద్రాగ్నులారా! మాకు బలాన్ని కలిగించే అన్నాన్ని, వేగవంతమైన గుర్రాల్ని ప్రసాదించండి".*

అడవుల్ని తగలబెట్టి వాటిని వ్యవసాయ క్షేత్రాలుగా మార్చడం ఇప్పుడు పర్యావరణ విఘాతమే! కానీ, అప్పుడు వ్యావసాయిక ప్రగతిలో అదీ ఒక ప్రధానాంశమే!

ఇప్పుడు బ్రెజిల్ వారు ఇలాగే అడవుల్ని కాల్చేస్తున్నారు. అది ప్రపంచానికి ఇబ్బంది కరమే అయినా, వారికి అవసరమే!

ఆర్యులు వ్యవసాయానికి మళ్ళారనడానికి మరోగట్టి దృష్టాంతం వృత్రుని వధ.

## తొలి నీటి యుద్ధం

వృత్రుడు హిమాలయ పాద పీఠంలోని రాజ్యపాలకుడు. బహుశ నేపాల్, కాశ్మీర్ మధ్య ప్రాంతం వాడై ఉండాలి. అతను మూలవాసి. వారిది పరిపూర్ణ వ్యావసాయిక రాజ్యం. నీటికి అడ్డంగా ఆనకట్టలు కట్టి, ఆ నీటిని వ్యావసాయిక క్షేత్రాలకు మళ్ళించేంత నైపుణ్యం గల రాజ్యం వారిది.

ఐతే ... నదులకు ఎగువ భాగంలో నీటిని నిలిపి వేస్తే దిగువ ప్రాంతాలకు నీటి ఎద్దడి వస్తుంది. పంట పొలాలు దెబ్బతింటాయి. గడ్డి మైదానాలు ఎండిపోతాయి. కాబట్టి ఆ ఆనకట్టను తొలగించాల్సిన అవసరం దిగువ భూముల్లో ఉండేవారికి ఉంటుంది. ఇక్కడ ఆర్యులు అదే పని చేశారు.

**"ప్రేహ్యభీహి ధృష్ణుహి న తే వజ్రో ని యంసతే**

**ఇంద్రనృమ్ణం హి తే శవో హనో వృత్రం జయా**

**అపో–ర్చన్నను స్వరాజ్యం" –*(సామ : అధ్యా. 4, ఖం:7)***

దీని అర్థం చూడండి:

*"ఓ ఇంద్రా! శత్రువులు ఎవరూ నీ వజ్రాయుధం ముందు నిలవలేరు. మానవులెవరైనా దాని ముందు తలవంచాల్సిందే! ఇది నీ రాజ్యం. దీని స్వరాజ్యం కోసం నీ అధికారాన్ని వినియోగించు. వృత్రుని సంహరించు. అతను అడ్డుకట్ట వేసి కట్టిపెట్టిన నీటిని విడిపించు".*

ఇది నీటి కోసం ఆర్యులు చేసిన నీటి యుద్ధం. అంటే ... పంట భూముల కోసం చేసిన యుద్ధం అన్నమాట. అంటే ... వారు బలమైన వ్యవసాయదారులుగా మారారన్న మాట. ఐతే ... ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే... ఆర్యులకు ఇనుము తెలుసు. వారి ఆయుధాలు ఇనుపవే! వారి విజయాలకి ఇనుము కూడా ఒక కారణం. బహుశ వజ్రాయుధం వెన్నెముక ఆకారంలో ఉండే నాణ్యమైన ఇనుప ఆయుధం అయ్యుంటుంది.

ఐతే, వారు తమ రథాలకి ఇరుసుగా ఇనుముని వాడిన జాడలులేవు. రథచక్రాలకి ఇనుప 'గానులను' తగిలించినట్లు ఉన్నా.... రథపు ఇరుసుల్ని మాత్రం కర్రతోనే మలచేవారు.

"... గిరా నే మిం తష్టేవ సుద్రవం"

*-(సామ వేదం. అధ్యా: 3, ఖం:1)*

*"మంచి కర్రతో వడ్రంగి ఇరుసును అందంగా రూపొందించినట్లు ..."* అని దీనర్థం.

ఇప్పటికీ నాటు బండ్లకీ, టైరు బండ్లకీ నిలువు పోలును చెక్కతో చేసినా, ఇనుప ఇరుసునే ఉపయోగిస్తారు. ఇనుప ఇరుసువల్ల దానికి తగిలించిన చక్రాలు వేగంగా కదులుతాయి. ఇరుసు బలంగానూ ఉంటుంది.

## రైతులైన రాజులు

ఆర్యులు వ్యావసాయానికి మళ్ళి, దాన్ని విస్తరింప చేయడంతో ఆర్య గణాలూ, ఆ తర్వాత బుద్ధుని కాలం నాటి పదహారు గణ తంత్ర రాజ్యాలూ వ్యవసాయాన్ని ప్రధాన ఆర్థిక వనరుగా మలచాయి. బుద్ధుని కాలంలో కూడా నీటి కోసం యుద్ధాలు జరిగాయి. ఆ యుద్దాల్ని బుద్దుడు జరగకుండా చూశాడు. వారి మధ్య సయోధ్య కుదిర్చాడు. నీటి తీరువా పద్ధతుల్ని వివరించి చెప్పాడు. నీటిని నిలువ చేయడం కోసం ఆనకట్టలు కట్టుకున్నాడు. చెరువులు త్రవ్వమన్నాడు. బావుల్ని ఉపయోగించమన్నాడు.

బలరాముడు, దశరధుడు రాజులే అయినా రైతులే! వీరు భూమిని దున్నిన కథలు ఇతిహాసాల్లో కనిపిస్తాయి. ఐతే, బుద్ధుని తండ్రి శుద్ధోధనుడు స్వయానా వ్యవసాయదారుడు. వేయి నాగళ్ళతో ఏరువాక పున్నమి రోజున ఉత్సవం చేయడం, ఉమ్మడిగా నాగళ్ళతో చేలను దున్నే దృష్టాంతం బౌద్ధ సాహిత్యంలో కనిపిస్తుంది.

ఇటు యజ్ఞయాగాల వల్లా, అటు ఆర్యసమాజం వ్యవసాయానికి మళ్ళడం వల్ల పశు సంపద తగ్గిపోయింది. ఒక ప్రక్కన పశు సంపద ఇలా తగ్గి పోతూ ఉంటే, మరో ప్రక్క యజ్ఞయాగాలు ఆగకుండా సాగిపోతూనే ఉన్నాయి.

దానివల్ల వేలాది పశువులు యజ్ఞాలకి బలైపోతుంటే వేగంగా విస్తరిస్తున్న వ్యవసాయంలో వెనకడుగు పడింది. కాబట్టి, వ్యావసాయిక అభివృద్ధికి ఆటంకంగా మారిన యజ్ఞాల్ని బుద్ధుడు తీవ్రంగా వ్యతిరేకించాడు. యజ్ఞాల్లో జీవహింస అనేది ఒక భాగమే అయినా, ఆయన యజ్ఞవిరోధి కావడానికి ప్రధాన కారణం వ్యవసాయానికి యజ్ఞాలు గుదిబండలుగా మారాయి అనే.

పాము తన పిల్లల్ని తానే తిన్నట్టు ఆర్యుల వ్యావసాయిక సమాజాన్ని ఆర్యులే పెంచి పోషించిన యజ్ఞాలు ఆరగించాయి.

తమ బలహీనమైన సమాజాన్ని తిరిగి ఆర్థికంగా బ్రతికించుకోడానికి, మూలవాసులైన రాజులపైకి దండ యాత్రలు చేసి వారి ధన ధాన్యాల్ని హరించే పనిని చేపట్టారు ఆర్యులు.

(శ్రీరాముడు లంక పై చేసిన దండయాత్ర అలాంటిదే. అధిక ధనవంతమైన రాజ్యాన్ని ఓడించడానికీ, కొల్లగొట్టడానికీ. సీత, శూర్పణఖలు కేవలం వారి చేతుల్లో పావులు మాత్రమే!)

అందుకే ... సామవేదంలో అనేక చోట్ల "ఇంద్రా! దశ్యులను సంహరించు. వారి ధనాన్ని, సంపదల్ని మాకు చేర్చు" అనే మంత్రాలు కోకొల్లలుగా కన్పిస్తాయి.

అంటే ..

రుగ్వేద కాలంనాడు 'పురనుత్పత్తి'కే ప్రాధాన్యత నిచ్చిన ఆర్య సమాజం, సామవేద కాలం నాటికి "ఆర్థిక ఉత్పత్తులకు" ప్రాధాన్యత నిచ్చే సమాజంగా మారిందన్నమాట. అంటే ... మానవ సంబంధాలు వ్యుగ్యమై, ఆర్యుల సామాజిక సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారాయన్నమాట!

అన్నమాటేం కాదు. ఉన్నమాటే ...!

అందుకే వేద కాలంలో తమ విజయాలకు ప్రధాన కారణమైన ఇంద్రుడు - వేదానంతరం కాలంలో పచ్చి మోసగానిగా, వ్యభిచారిగా, అధికార పిపాసిగా ముద్రపడ్డాడు!

## కుటుంబాలు - మారిన మానవ సంబంధాలు

మానవ సంబంధాలన్నీ ఉత్పత్తులు పెరిగాక వ్యాపార సంబంధాలుగా మారతాయి. ఇక అప్పుడు మనుషుల మధ్య ప్రతి విషయం వ్యాపారంగా మారిపోతుంది. దానితో మోసం, ద్వేషం, దోపిడీలు అనేవి సామాజిక సహజ లక్షణాలుగా మారతాయి. పచ్చిదురాశ పడగెత్తుతుంది. అప్పుడు -

" ధనమూలమిదం జగత్" అనే భావజాలం బహుళ ప్రచారం పొందుతుంది. ఆర్థిక సంబంధాల్ని నిలుపు కోవడం కోసం యుద్ధం ప్రధాన సాధనం అవుతుంది. ఆయుధం పరమ పూజనీయంగా మారుతుంది. అందుకే...ఆర్య దేవుళ్ళందరూ ఆయుధాలు ధరించే దర్శనమిస్తారు. ఒక్కో దేవుడు ఒక్కో ఆయుదానికి "స్పెషలిష్టు" అవుతాడు. చివరికి ఆయుధ శక్తే దైవ శక్తిగా మారిపోతుంది. సమాజం హింసోన్మాదంలో పడిపోతుంది.

మధ్యయుగాల్లో రాబోయే ఈ మార్పు మనకు సామ వేదంలో ఛాయా మాత్రంగా సాక్షాత్కరిస్తుంది.!

*(ఇంకావుంది)*


# పునర్జన్మకు పునాదులు

> "విధుం దద్రాణం సమనే బహూనాం యువానం సన్తం పలితో జగార!
> దేవస్య పస్య కావ్యం మహి త్వాద్యా మమార సహ్య: సమాన"
> "కార్యాలన్నింటికీ కర్త ఇంద్రుడే! ఎందరో శత్రువుల గుండెల్ని బ్రద్ధలు చేయగలడు. ఆయన ఆదేశించడం వల్లే యువకుల్ని ముసలి తనం మింగేస్తుంది. ఆయన ఆదేశించడం వల్లే ఇప్పుడు చనిపోయిన వాడు రేపు మరలా వ్యక్తం కాబడుతున్నాడు"
> – *(సామవేదం : ఉత్తరార్చిక: 22 అధ్యా. 2 ఖండం)*

## చావు ఒక ముగింపా?

"జననం ఎలా కలుగుతుంది? మరణం తర్వాత ఏమవుతుంది?" ఈ రెండు ప్రశ్నలు వేసుకోగల జీవి మనిషి మాత్రమే! తన పుట్టుకకు మూలం ఏమిటి? అనే విషయాన్ని, "తన జీవన యానం తన చావుతో ముగిసిపోతుందా?" అనే అంశాన్నీ తొలినాటి నుండే మానవ సమాజం రకరకాలుగా తర్కించుకుంటూనే ఉంది.

రాతి పనిముట్ల స్థాయి నుండి రాకెట్లు ప్రయోగించే స్థాయికి వచ్చినా, కర్ర ముక్కల నుండి కంప్యూటర్స్‌ని ఉపయోగించే ఉన్నతికి చేరినా, "మరో లోకంలో"ని దృశ్యాల్ని అగ్గిపెట్టెంతగా ఉన్నా టచ్ స్క్రీన్‌పై చూడగలిగినా – ఈనాటికి కూడా "తన చావు గురించి తగినంత పరిజ్ఞానం" మానవ జాతి అందిపుచ్చుకో లేదు. అందుకే ఆ విషయంలో ఎక్కువ ప్రపంచం ఇంకా ఆత్మల చుట్టూ పడి అలమటిస్తూనే ఉంది. పునర్జన్మల చుట్టూ పరిభ్రమిస్తూనే ఉంది.



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

మనిషికి తొలుత కలిగిన అనుమానం "తానెలా పుట్టాను? ఎలా పుడుతున్నాను?" అనేదే! పుట్టుకలు అంటేనే పునరుత్పత్తి. ఒక జీవి తనలాంటి జీవుల్ని ఉత్పత్తి చేసుకోవడం. ఇది జీవుల మనుగడలో చాలా ముఖ్యమైన అంశం. పెరగడం, తిరగడం, స్పందించడం, పునరుత్పత్తి చేసుకోవడం జీవుల ప్రాథమిక లక్షణాలు.

ఈ జీవ పునరుత్పత్తినే ప్రత్యుత్పత్తి అంటాం. ఈ ప్రత్యుత్పత్తి జీవుల్లో లైంగికంగా, అలైంగికంగా జరుగుతుంది. లైంగిక జీవుల్లో స్త్రీ, పురుష జీవులు వేరు వేరుగా ఉంటాయి. అండకణాలు, శుక్రకణాలు ఉంటాయి. వాటి కలయికతో ప్రత్యుత్పత్తి జరిగి కొత్త జీవులు పుట్టుకొస్తాయి.

స్త్రీ, పురుష జీవుల కలయిక వల్లే తమ జాతి అభివృద్ధి చెందుతుంది అనే ప్రత్యక్ష జ్ఞానం జంతువులకు లేకపోయినా, అదొక ప్రాకృతిక ధర్మంగానే ఆ క్రియ జరిగిపోతుంది. అయితే, స్త్రీ, పురుషుల కలయిక వల్లే 'సంతానం' కలుగుతుందనే విషయాన్ని మానవులు గ్రహించారు.

లైంగిక ఆకారాలు, అంగాలు వేరు వేరుగా ఉండడం, శరీరంలోపల వేర్వేరు గ్రంథులు ఉండడం, వాటి ప్రేరణ వల్లే లైంగిక కార్యకలాపాలు జరగడం అనేది అన్ని జంతువుల్లా మానవులకూ ఒక్కటే!

కానీ, ఆ అవయవాల్ని ఉత్తేజ పరిచే 'మనస్సు' మాత్రం మానవులకే సొంతం. ఆ మనస్సు పరిపక్వత వల్లే జంతువుల్లో వలే కాకుండా, యుక్తవయస్సురాగానే సెక్స్ కోరికలు రేకెత్తడం మొదలై, వాటికి ఒక సమయం సందర్భం లేకుండా పోయింది.

## కలలు కల్లలా?

ఇది మనస్సు మాయాజాలం. అందుకే "మనస్సు" ఉన్న వాళ్ళం కాబట్టే మనం మానవులం. మనిషికి స్త్రీ పురుషుల కలయిక వల్ల సంతానం కలుగుతుందని తెలుసు. ఆ సంతానం తనదేనని తెలుసు. కాబట్టే "సంసారం" మొదలయ్యింది. మనస్సు పెరగడంతో మెదడూ పెరిగింది. ఆలోచనలూ పెరిగాయి. గుర్తించుకోవడం పెరిగింది. దానితో ఆలోచన ఒక ప్రవాహంగా మారింది. ఆ ప్రవాహం నిద్రలో కూడా కొనసాగింది.

దాని పర్యవసానమే ''కలలు''. మనిషి తాను నిద్రపోతున్నప్పుడు కూడా కలల ద్వారా జ్ఞానేంద్రియాల అనుభూతి పొందుతున్నాడు. తాను నిద్రించే సమయంలో "ఈ అనుభూతుల్ని పొందుతున్న దెవరు? ఎవరు? ఎవరు?"

ఈ తర్జన భర్జన ఫలితంగా –

''తనలో ఇంకెవరో ఉన్నారు'' అని సమాధాన పరచుకున్నాడు. దాన్నే "ఆత్మ"గా భావించాడు.

ఎప్పుడైతే ఆ భావన వచ్చిందో మనిషి తనను తాను రెండుగా విభజించుకున్నాడు. ఒకటి శరీరం. రెండు ఆత్మ.

నిద్రించే శరీరానికి స్పర్శ తెలియదు. శబ్దం వినపడదు.

వాసన తగలదు. దృశ్యం అందదు. కానీ, లోపలున్న ఆత్మ శరీరం నిద్రిస్తున్నప్పటాకీ తాను మాత్రం చూడగలదు. వినగలదు. తినగలదు. స్పర్శానుభూతి పొందగలదు. సంతోష పడగలదు. భయం చెందగలదు. ఏడ్వగలదు. వీటన్నింటికీ మించి – ఎప్పుడో చనిపోయి భౌతిక ప్రపంచంలో లేకుండా పోయిన మనిషిని కూడా చూడగలదు.

దానితో శరీరంకంటే ఆత్మే గొప్పది అని నమ్మాడు మనిషి. గొప్పదే కాదు శాశ్వతమైనదీ, మనం చచ్చినా అది చావదు అని తీర్మానించుకున్నాడు. చివరికి "మనం" అంటే మన శరీరం కాదు "ఆత్మే మనం" అని గట్టిగా విశ్వసించాడు. ఈ విశ్వాసం మొదట ఎక్కడ పుట్టిందో, ఏ మానవ సమాజంలో మొలకెత్తిందో ఖచ్చితంగా తేల్చి చెప్పలేం. కానీ, ఈ విశ్వాసం నుండే "పునర్జన్మ" వాదం పుట్టిందని మాత్రం తేలిగ్గానే తెలుసుకోగలం. తేల్చుకోగలం.

ఆత్మవాదం అనగానే అదేదో మూర్ఖ, మూఢ భావనగా, పరమ చెత్త అజ్ఞానంగా తోసి పారేయకూడదు. మనిషి తనను తాను తెలుసుకోవడంలో పడిన తొలి అడుగుగానే భావించాలి. అది తప్పటడుగే అయినా. . . . ఏ నడకైనా, ఏ పరుగైనా ఆ తప్పటడుగుల నుండే మొదలవుతుంది. కాబట్టి ఇది కూడా మానవ వైజ్ఞానిక వికాసంలో ఒక భాగమే!

## వేదంలో ఆత్మ వాదం

రుగ్వేదంలో ఆత్మ భావన ఉంది. అది ద్యులోకం నుండి వర్షం ద్వారా వనస్పతుల్లోకి(వృక్షాల్లోకి) ప్రవేశిస్తుంది. వాటివల్ల (తినే ఆహారం వల్ల)ఆత్మ మనలో రూపొందుతుంది. చనిపోయాక ఈ ఆత్మ ద్యులోకానికి చేరుకుంటుంది. ఇక తిరిగిరాదు. పైనున్న ఆ ద్యులోకంలో అక్కడే శాశ్వతంగా ఉండిపోతుంది. లోకాలన్నీ ఇంద్రుని ఆధీనంలో ఉంటాయి కాబట్టి, యజ్ఞం ద్వారా, యజ్ఞంలో అనేక జంతువుల్ని బలివ్వడం ద్వారా, ఆ యజ్ఞం ఆహూతుల్ని ఇంద్రునికి సమర్పించడం ద్వారా ఆయన సంతృప్తి పడతాడు. ఆ లోకంలో మనం చనిపోయాక మన ఆత్మకు మంచి సౌకర్యాలు కల్గిస్తాడు. ఆ నమ్మకమే యజ్ఞయాగాల్ని బ్రతికించింది.

అంటే. . . . ఆత్మ ద్యులోకానికి చేరి అక్కడే ఉండి పోతుంది తప్ప తిరిగిరాదు. ఆత్మ ఉంది. కానీ పునర్జన్మ లేదు. ఇదీ రుగ్వేద ఆర్యుల ఆత్మభావన.

మరి అంతకంటే ముందే ఇక్కడ పరిఢవిల్లిన సింధూ ప్రజల 'ఆత్మ' భావన ఏమిటో మనకి ఇంకా తెలియలేదు.

ఐతే. . . రుగ్వేద ఆర్యుల కంటే వెయ్యి సంవత్సరాలకి పూర్వమే ఈజిప్టు వారికి ఆత్మ భావనతో పాటు పునర్జన్మ భావనా ఉంది.

అసలు ఈజిప్టు వారి ఆత్మ, పునర్జన్మ భావనలే రకరకాల రూపాలలో ప్రపంచంలో నలుమూలలకే వ్యాపించాయనే వారూ ఉన్నారు.

మనం ఈ వ్యాసం మొదటిలో చెప్పుకున్న సామవేద మంత్రం పునర్జన్మకు సంబంధించిందే! రుగ్వేదంలో, యజుర్వేదంలో కన్పించని పునర్జన్మ భావనని సామ వేదంలో చూడగలం.

**అంటే క్రీ. పూ. 800 నాటికి మన గడ్డ మీదికి "పునర్జన్మ" పక్షి ఈజిప్టు నుండి వలస వచ్చి జంబూ వృక్షం మీద వాలిందన్న మాట!**

అవును. అది నిజం. ఈజిప్టు వ్యాపారులు గ్రీకు, మెసపుటోమియా లతోపాటు సింధూ తీరానికి కూడా వచ్చి ఉండాలి. ఇక్కడ కొందరు స్థిరపడి కూడా ఉండాలి. ఆర్యులు అప్పటికే పశుపాలన వదిలి వ్యవసాయ దారులుగా గణనీయంగా మారారు. చిన్న చిన్నగా నగరాల్ని నిర్మించు కుంటూ ఉన్నారు. కాబట్టి, వ్యాపారాభివృద్ధి ఒక సామాజిక అవసరంగా ముందుకు వచ్చి పడింది. దాంతో వ్యాపార వర్గాలతో ఘర్షణలు మాని, సఖ్యత పెంచుకుని తీరాల్సిన అవసరం తప్పని సరి అయ్యింది. విదేశీ వ్యాపారానికి మంచి గిరాకీ పెరగడంతో ఆ వ్యాపారులు కూడా ఇక్కడ ఎక్కువ కాలం ఉండడం, వారితో పాటు ఈజిప్టు పురోహితులూ రావడం, దానితో ఆర్య సంప్రదాయాల్లోకి గ్రీకు, ఈజిప్టు నమ్మకాలూ, కథలూ, గాథలూ వచ్చి చేరాయి. వాటి ప్రభావం ఆర్యసాహిత్యం పై పడింది. మన నమ్మకాల్లో, మన పురాణాల్లో (ముఖ్యంగా రామాయణంలో) ఈజిప్టు, గ్రీకు ఛాయలు కనిపించేది అందుకే.

ఆ ప్రభావం మనకు పునర్జన్మలోనూ కనిపిస్తుంది. మనం మొదట చెప్పు కున్న. . . .

**"విధుం దద్రాణం సమనే బహూనాం"**

అనే మంత్రమే సామవేద ఐంద్ర పర్వంలో 3వ అధ్యాయం, 10వ ఖండంలో కూడా తిరిగి వచ్చింది.

ఇదే మంత్రం సామవేదం ఉత్తరార్చికలో ఇరవయ్యో అధ్యాయం రెండో ఖండంలోని రెండవ తృచలో కూడా మరలా తిరిగి వచ్చింది. ఈ మంత్ర కర్త బృహదుక్థుడు.

ఈ మంత్రాల్లో విశేషం ఏమంటే ఇంద్రుణ్ణి గరుడ పక్షిగా పోల్చి చెప్పడం. పక్షి రూప ఇంద్రుణ్ణి స్తుతించడం.

ఈజిప్టు చక్రవర్తుల అధికార చిహ్నం గరుడపక్షి. వారి నమ్మకాల్లో మనిషి చనిపోయాక అతని "మంచీ చెడుల్ని" పక్షి ఈకతో తూకం వేస్తారు. "దొంగ" తన తాలూకు ఏదో ఒక ఆనమాలు వదిలి వెళ్ళినట్లు, మన సామవేదంలో కూడా పునర్జన్మ

గురించి చెప్పేటప్పుడు ఇంద్రుణ్ణి పక్షితో పోల్చి చెప్పడం గమనించాల్సిన విషయం.

## కృష్ణాసుర వధ

కృష్ణుడు అనే వాడు ఒక అసురుడు. చాలా వేగంగా వెళ్ళగలవాడు. అతను ఆర్యులపై దండెత్తాడు. ఓడించుకుంటూ అంశుమతీ నదీ తీరానికి చేరాడు. లోకాలన్నీ భయపడేలా పెద్ద ధ్వని చేశాడు. ఇంద్రుడు మరుత్తు (గాలి)లతో కలిసి వెళ్ళి కృష్ణాసురుణ్ణి సంహరించాడు.

**"ప్ర మందినే పితుమదర్చ తా వచో**
**య: కృష్ణగర్భాని ర హన్నృజిశ్వనా!**
**అవస్యవో వృషణం వజ్ర దక్షిణం**
**మరు త్వం తం సఖ్యాయ హువేవహే"**

*(సామవేదం : పూర్వార్చిక : 4-3-11)*

ఈ సామం అర్థం ఇది

"ఋత్విజులారా! ఇంద్రుణ్ణి స్తుతులతో కీర్తించండి. అర్చించండి. ఇంద్రుడు ఋజిశ్వుని వెంటబెట్టుకుని వచ్చి, కృష్ణాసురుణ్ణి సంహరించాడు. అతని గర్భవతులైన భార్యల్నీ హతమార్చాడు. అలాంటి వజ్రహస్తుడైన ఇంద్రుణ్ణి ఆహ్వానించండి".

(ఈ విజయంలో ఆర్యులకి ఇంద్రుని వీరత్వం కన్పిస్తే. . . మనకి అతని క్రూరత్వం కనిపిస్తుంది కదా!)

ఓశిజ పుత్రుడే ఋజిశ్వుడు. విప్రుడు, కృష్ణుడు అనే రాక్షసుల్ని చంపే యుద్ధంలో ఇంద్రునికి సాయం చేశాడు ఋజిశ్వుడు. ఈ యుద్ధంలో ఇంద్రుడు గరుడపక్షి రూపంలో వచ్చి, కృష్ణాసురుణ్ణి సంహరించాడు.

అలాంటి శక్తి పరుడైన ఇంద్రుణ్ణి -
"ఇంద్రుని వల్లే వృద్ధాప్యం కలుగుతుంది. మనిషి మరణిస్తున్నాడు. ఆ మరణించిన వాడు కూడా ఇంద్రుని వల్లే తిరిగి మరలా పుడుతున్నాడు" అంటూ కీర్తించాడు బృహదుక్థుడు.

సృష్టి, స్థితి, లయ కారుడు ఇంద్రుడే.

సామవేద సారం ఏమిటంటే. . . సృష్టి, స్థితి, లయకారుడు ఇంద్రుడేనని!

యవ్వనాన్ని మింగేయమని వృద్ధాప్యాన్ని పంచి చంపేదీ ఇంద్రుడే! ఆ చచ్చిన వారి ఆత్మల్ని తిరిగి పుట్టించేది ఇంద్రుడే!

వేదకాలంలో 'సృష్టికర్త' వ్యక్తిగానే ఉన్నాడు. కానీ, ఆ తర్వాతి ఉపనిషత్తుల కాలంలో సృష్టికి కర్తలేడు. కొన్ని "కార్యాలే" సృష్టికి కారణం అయ్యాయి. అని పంచభూతాలా? ప్రకృతీ పురుషులా? వాటిలో ఏది ప్రధానం? అనే విషయం తేడాలున్నాయిగాని, ఉపనిషత్తులు సృష్టి "కర్త" కంటే "కార్యాలకే" ప్రాధాన్యత నిచ్చాయి. ఈ కార్యాలన్నీ కూడిందే "ఆత్మ". ఈ ఆత్మ తిరిగి పుడుతూ ఉంటుంది. పునర్జన్మ పొందుతూ ఉంటుంది.

వేదకాలం నాటి సృష్టికర్తనూ, ఉపనిషత్తుల కాలంనాటి ఆత్మ, పరమాత్మలనూ కలిపి కొట్టి, గిలకొట్టి త్రిమూర్తుల్ని సృష్టించాయి పురాణాలు. ఇంద్రుని సర్వోన్నత అధికారాన్ని ఈ ముగ్గురికీ పంచాయి. అంటే అధికార వికేంద్రీకరణ జరిగిందన్న మాట. సృష్టి కర్తగా బ్రహ్మను, స్థితి కారునిగా విష్ణువుని, లయకారునిగా శివుణ్ణి ప్రవేశపెట్టాయి. ఇంద్రుని అధికారాలు వారికి పంచాయి. పదవీ విరమణ చేయించి ఇంద్రుణ్ణి ప్రక్కన పెట్టాయి.

ఇలా ఉంది:

**యజ్ఞా యథా అపూర్వ్య మఘవన్వృత్ర హత్యాయ**
**తత్పృథి వీ మప్రథయస్తదస్తభ్నా ఉదోదివం**

(సామవేదం : అరణ్యం పర్వం : 6-2)

అంటే. . .

"ఓ ఇంద్రా! నీవు అనాదివి. నీకంటే ముందు ఏమీలేదు. నీవు వృత్రుణ్ణి సంహరించావు. ఆ సమయంలోనే భూమిని సృష్టించావు. దాన్ని స్థిరపరచావు. ద్యులోకాన్నీ, అంతరిక్షాన్నీ నీవే సృష్టించావు"

అలాగే. . . మరో చోట :

**యద్ద్యావ ఇంద్రతే శతం శతం భూమీరుత స్యు:**
**న త్వా వజ్రింత్సహస్రం సూర్యా అను న జాతమష్ట రోదసీ"**

*(సామవేదం : ఐంద్ర పర్వం : 3-5-6)*

"ఇంద్రా! పుట్టిన ఏ పదార్థం నీకంటే గొప్పది కాదు. వంద భూగోళాలైనా, వంద స్వర్గాలైనా, వంద సూర్యులైనా, వంద ద్యులోకాలైనా నీకు సరిరావు" అంటూ ఇంద్రుని శక్తిని సామవేదం చాలా గొప్పగా కీర్తించింది.

పునర్జన్మ క్రియను కూడా ఇంద్రునికే కట్టబెట్టింది.

## సాగే యాత్రలు - ఆగే యాత్రలు

నిజానికి పునర్జన్మ వాదానికి పుట్టిళ్ళు ఉపనిషత్తులు. ఛాందోగ్యోపనిషత్తులో చాలా బలీయంగా దీన్ని చూస్తాం. ఛాందోగ్య ఉపనిషత్తు బుద్ధుని కాలానికే ఉంది. అంటే అది క్రీ. పూ. 800-600 మధ్య కాలం నాటిది అయి ఉండాలి.

ఛాందోగ్యంలో "మరణించిన వారి ఆత్మ ఏఏ దారుల్లో ఎలా ఎలా దేవలోకానికి చేరుతుంది, తిరిగి మరలా అక్కడి నుండి

ఏ మార్గంలో ఎలా ఎలా తిరిగి వస్తుంది" అనే దాని వివరణ విపులంగా ఉంది.

అంటే ఆత్మ రావడాలూ, పోవడాల గురించిన సమాచారం తొలిసారి ఈ ఉపనిషత్తులోనే కన్పిస్తుంది.

ఛాందోగ్యం (5–10–7)లో ఆత్మ ఎలా పునర్జన్మ పొందుతుందో ఉంది.

రమణీయమైన ఆత్మలు అంటే మంచి ఆచరణ గల ఆత్మలు రమణీయమైన యోనిలో – (బ్రాహ్మణ, క్షత్రియ) యోనుల్లో, నీచ ఆత్మలు అంటే చెడు ఆచరణ గల ఆత్మలు నీచ యోనుల్లో (వైశ్య, శూద్ర, ఛండాల, పంది, కుక్క) పునర్జన్మ పొందుతాయి అని ఉంది.

అంటే ఈ ఉపనిషత్తు ఆత్మ వాదాన్ని "కుల వాదంగా" మార్చింది. కుల వాదానికి బలమైన పునాది ఇక్కడే పడింది.

అలాగే. . .

ఆత్మ ప్రయాణం చేసే మార్గాలు కూడా రెండు అని ఈ ఉపనిషత్ చెప్పింది.

1. పితృయానం. 2. దేవయానం.

పితృయానంలో జీవుడు చనిపోయాక ఆత్మ మొదటిగా పొగలోకి వెళ్తుంది. అక్కడి నుండి రాత్రికి, అక్కడి నుండి కృష్ణపక్షానికి, అక్కడి నుండి దక్షిణాయనానికి, అటు నుండి ఆరు మాసాలు ప్రయాణం చేసి పితృలోకం చేరుతుంది. అక్కడి నుండి ఆకాశం, అక్కడి నుండి చంద్రలోకం చేరుతుంది. అక్కడ తన గడువు తీరేదాకా ఉండి, తిరిగి అదే దారికి బయలుదేరి – చంద్రలోకం నుండి ఆకాశానికి, అక్కడి నుండి వాయువుకి, వాయువు నుండి పొగకి, పొగ నుండి మేఘానికి, మేఘం నుండి వర్షంతో కూడి భూమి మీదికి, భూమి నుండి ధాన్యంలోకి, వనస్పతులలోకి చేరి ఆహారంగా మారుతుంది. అది శరీరాలకి చేరి శుక్రం ద్వారా జీవునిలో ప్రవేశించి పునర్జన్మ పొందుతుంది". ఇవి అనంతంగా సాగే యాత్రలు.

ఇలా తిరిగి పుట్టేవి కొన్ని ఆత్మలైతే అసలు తిరిగి పుట్టని ఆత్మలు కొన్ని. వాటి యానం దేవయానం.

దేవయానంలో మొదట చనిపోయిన వారి ఆత్మ కిరణాలకి చేరి, అక్కడి నుండి పగలు, అక్కడి నుండి శుక్ల పక్షం, అక్కడి నుండి ఉత్తరాయణం, అక్కడి నుండి 6 నెలలు ప్రయాణం చేసి సూర్య లోకం, అక్కడి నుండి విద్యుత్తుకు, అక్కడి నుండి బ్రహ్మలోకం పోతుంది. మానవ గుణాలు పోగొట్టుకుని "అ–మానవుని'గా మారుతుంది. అ–మానవునిగా మారింది కాబట్టి ఇక తిరిగి పుట్టదు". ఇవి ఆగే యాత్రలు.

ఈ రెండు యానాల్లో ప్రపంచంలో పునర్జన్మ వాదం ఉన్న అన్ని చోట్లా తిరిగి పుట్టడమే ఉంది. "ఆత్మ తిరిగిపుట్టని విధానం" ఒక్క భారత దేశ తత్వంలోనే ఉంది. దీన్ని ముక్తి, కైవల్యం, నిర్వాణం. . . ఇలా ఒక్కో మత సంప్రదాయం ఒక్కో పేరు పెట్టుకుంది.

**మానవునిగా తిరిగి పుట్టని స్థితిని మహోన్నత స్థితిగా చెప్పడం ఒక్క భారతీయ తాత్విక సిద్ధాంతంలోనే ఉంది.**

జైనం, బౌద్ధం, ఉపనిషత్తులన్నీ ఈ "తిరిగి పుట్టని స్థితిని" పొందే మార్గాల్నే, తమ అంతిమ మార్గాలుగా ప్రబోధించాయి.

ఇక, ఇప్పుడు మనం – ఈజిప్టు వారి పునర్జన్మ వాదాన్ని చూద్దాం. అప్పుడు ఈజిప్టు వారి పునర్జన్మవాదం మనకు ఎలా దిగుమతి అయ్యిందో అర్థం అవుతుంది.

అసలు ఈ పునర్జన్మ వాదాన్నే మనం వారి నుండి అరువు తెచ్చుకున్నాం అనుకున్నాం గదా! మన ఛాందోగ్యం చెప్పిన పితృయానం దాదాపుగా ఈజిప్టు వారి ఆత్మయానమే!

## ఈజిప్టువారి ఆత్మ ప్రయాణం

వీరు, చనిపోయిన ప్రతివారూ తప్పక పునర్జన్మ పొందాల్సిందే అని నమ్మారు. వీరికి 3 రకాల నమ్మకాలున్నాయి.

మొదటిది : మరణాంతర జీవిని గరుడ పక్షి ముఖం కల్గిన హోరస్ అనే దూత తన వెంట పాతాళానికి తీసుకు పోతాడు. వారు శవపేటికలో ఉండి ప్రయాణం చేస్తారు. హోరస్ వారిని 'మాట్' అనే అధికారి విశాలమైన భవనానికి తీసుకుపోతాడు. అక్కడ 42 మంది న్యాయమూర్తులుంటారు. ఈ జీవుడు తాను చేసిన సత్కర్మల్ని (అంటే మతం, రాజు నిర్దేశించిన నిర్ణయాల్ని పాటించడం) గురించి చెప్తాడు. ఆ న్యాయమూర్తులు విని, అతను "పాప రహితుడు" అని ఎంచి ముందుకు పోడానికి అనుమతి నిస్తారు. అప్పుడు అనుభిక్ అనే వ్యక్తి (యముడు) తన దగ్గరున్న పక్షి ఈక తో వారి పాపరహిత హృదయాన్ని తూస్తాడు. ఈ పరీక్షల ఫలితాల్ని థోత్ అనే లేఖరి(చిత్రగుప్తుడు) నమోదు చేస్తాడు.

ఈక కంటే వారి హృదయం బరువైనదైతే అది పాప రహిత హృదయం కాదు. దానికి పరిహారంగా అమ్మిట్ అనే దేవత వారి హృదయాల్ని తినేస్తుంది. దానితో వారు రెండో సారి మరణిస్తారు. ఇక వారు శాశ్వతంగా నాశనం అవుతారు. వారి కథ అంతటితో ఖతం.

హృదయం తేలికైన వారిని తీసుకుని, వారి వివరాలతో మాట్ వారిని ఒసిరిస్‌కు అందజేస్తాడు. ఒసిరిస్ వారిని నగ్నదేవత గర్భంలో ప్రవేశపెడతాడు. అలాంటి వారు తిరిగి భూమ్మీద

పుడతారు. ఇది ఒక నమ్మకం.

రెండోది : రాజులు, ఫారోలు చనిపోతే ఆ కులీనులు అందమైన పడవ మీద పాతాళం చేరతారు. వారు ఎకాఎకిని ఒసిరిస్ దగ్గరకు వెళ్తారు. ఈ ఒసిరిస్ ఆకు పచ్చశరీరం కల్గిన మృత్యుదేవుడు. ఫలదీకరణకు, జన్మకు, మద్యపానానికీ, వ్యవసాయానికి మరణాంతర జీవులకూ ఈయన అధి దేవత. ఆయన తన దగ్గర వారిని ఉన్నన్ని రోజులు ఉంచుకుని, వారు కోరిక మీదికి తిరిగి జన్మించడానికి పంపుతాడు.

మూడోది : చనిపోయిన కులీన వర్గానికి చెందిన రాజుల, ఫారోల (పురోహితులు) ఆత్మలు కొన్ని రోజుల్లోనే ఒసిరిస్ లోకాన్నుండి గానీ, మార్గ మధ్యం నుండిగానీ తిరిగి వస్తాయి. వాటికి వేరే జన్మ లెత్తడం, వేరేవారి గర్భాన పుట్టడం ఇష్టం ఉ ండదు. తిరిగి వారి శరీరంలోకే వస్తారు. ఇలాంటి వారి కోసమే చనిపోయిన వారి దేహాల్ని మమ్మీలుగా మార్చే విధానం వచ్చింది.

ఈ నమ్మకానికి సంబంధించి ఈజిప్టులో క్రీ. పూ. 2400 సంవత్సరాల క్రితంనాటి ఆధారాలు లభించాయి. ఈజిప్టు వారి ఐదో రాజ వంశీయుల పాలన కాలంనాటి ఆధారాలివి. ఈ వంశీకులు క్రీ. పూ. 2494 నుండి 2345 వరకు అంటే 150 ఏళ్ళు పాలించారు.

అంటే. . . . సింధూ కాలం నాటికే. . . . . పునర్జన్మ, ఆత్మ ప్రయాణాలు, మంచీ చెడుల్ని విచారణ చేసి నిర్ణయించడం, యముడు, చిత్రగుప్తుడులాంటి పాత్రలన్నీ ఈ ఆధారాల్లో లభించాయి. వీరు ఈ ఆధారాల్ని బుక్ ఆఫ్ నట్, బుక్ ఆఫ్ డే, బుక్ ఆఫ్ నైట్ అనే మూడు పుస్తకాలు కలిసిన బుక్ ఆఫ్ స్కై అనే గ్రంథంగా లిఖించారు. ఆ లిఖించిన రాతి పలకలతో సమాధుల్ని నిర్మించారు.

"బుక్ ఆఫ్ గేట్స్" అనేది సూర్యునికి సంబంధించిన ఆత్మ ప్రయాణ గ్రంథం మరొకటి ఉంది. ఈ గ్రంథాల్ని మనం మమ్మీ సినిమాలో చూడొచ్చు. ఇప్పుడు ఒక్కసారి ఛాందోగ్యంలోని ఆత్మయానాల్ని, ఈజిప్టు వారి ఆత్మయానాల్ని పోల్చి చూద్దాం.

ఛాందోగ్యోపనిషత్తులోని ఆత్మ ప్రయాణం, ఈజిప్టు వారి ఆత్మ ప్రయాణం దాదాపు ఒక లాంటివే!

ఉపనిషత్తులలో పంచభూతాల నిర్మితమే జీవం, ఆత్మ అని ఉంటుంది. నిజానికి ఈ ఆలోచన కూడా మొదట సామ వేదంలోనే కన్పిస్తుంది.

**'ఇదం త ఏకం పర ఊత ఏకం**
**తృతీయేన జ్యోతిషా సం విశస్వ**
**సంవేశనస్తన్వేం చారు రేథి ప్రియో**
**దేవానాం పరమే జనిత్రే"**

*(సామ: ఆగ్నేయ పర్వం: 1-7-3)*

"ఓ! మృతజీవీ! నీలో ఒక భాగం అగ్ని. దానిని బాహిర్ అగ్నిలో విలీనం చేయి. నీలో ఒక భాగం వాయువు. దానిలో బయటి వాయువులో విలీనం చేయి. మరో భాగం సూర్యుడు. దాన్ని సూర్యునితో విలీనం చేయి. నీవు మరలా శరీరాన్ని దాల్చు (తిరిగి జన్మించు) మరలా సూర్యుని యందు ప్రవేశించు"

మొత్తం మీద ఉపనిషత్తులు ఉద్ఘోషించిన పునర్జన్మనీ, పంచభూతాల భౌతిక వాదాలకి ఈ సామవేదంలో బీజం పడింది. ఇది ఎంతగా మనలో నాటుకు పోయింది అంటే. . . .

" చచ్చి నీ కడుపున పుడతా" అన్నంతగా నాటుకు పోయింది. ఈజిప్టు పిరమిడ్‌లా పాతుకు పోయింది.

ఈ నిజం. . . . వేదం పరమ పవిత్రం, అది అపౌరుషేయం అనే వాళ్ళ నోళ్ళు మూసుకు పోయేలా తెరుసుకు పోయింది! *(ఇంకావుంది)*

## కన్నె మేరీ కన్నీరు పెడుతోంది!



చికాగోలోని "హోలీ ట్రినిటీ గ్రీస్ ఆర్థోడాక్స్ చర్చ్" లో గోడకు వేలాడుతున్న చిత్రపటంలోఉన్న కన్య మేరీ కళ్లనుంచి కన్నీళ్ళు కారుతున్నాయి అన్న ప్రచారం సెప్టెంబర్ తొలివారంలో జరిగింది. "మేరీమాత మనకేదో చెప్పాలనుకుంటున్నది. కనుక మనం వెళ్లి మన పెదాలను గట్టిగా బిగించి, ఆమె చెప్పేదాన్ని విందాం" అని ఆ చర్చికి పాస్టర్ గా ఉన్న నిక్ జోనస్ ప్రకటించాడు. "మనుషులు రెండు కారణాలతో కన్నీరు పెడతారు. సంతోషానికి, దుఃఖానికి. మేరీ మాత ఎందుకు పెడుతుందో మరి!" అని కూడా అన్నాడు. విగ్రహాల నుంచి, పటాల నుంచి తేనె లాంటి ద్రవాలు, కన్నీళ్లు, బూడిద వంటివి రావటం, వాటిని చూసి పూజలు, కానుకలు సమర్పించడానికి భక్తజనం పోటెత్తటం అమెరికాలో చాలా పాత విషయాలు. అలాంటి వాటి వెనుక వ్యక్తుల స్వార్థం, మోసం ఉంటాయని అక్కడి మానవవాదులు, సైన్స్ ప్రచారకులు అనేకసార్లు బయటపెట్టడంతో భక్తులు కూడా వాటిని నమ్మడం తగ్గిపోయింది.అయినా అదే చౌకబారు ప్రచారాన్ని చర్చి నిర్వాహకులు మొదలు పెట్టడానికి కారణం ఆ చర్చికి ఆదరణను పునరుద్ధరించుకోవాలి అనుకోవడం. ఆర్థిక ఇబ్బందుల కారణంగా, అది మూతపడే స్థితికి చేరింది. ఎవరో ఇచ్చిన విరాళంతో గత ఏడాది నుంచి లాక్కొచ్చారు. ఇప్పుడు మళ్లీ జనం నుంచి విరాళాలను పొందటానికే ఇలా చేస్తున్నారని చికాగో వాసులు గుర్తించారు. మేరీ కన్నీటి వెనుక దాగిన అసలు నిజం ఇది!


# పిబరే....సోమరసం..!

**"త్రిస్రోవాచ ఈరయతి ప్రవహ్నిర్ ఋతస్య ధీతిం బ్రాహ్మణో మనీషాం**
**గావోయంతి గోపతిం పృచ్ఛమానా: సోమం యంతి మతయో వావశానా:"**

"హవిస్సులు ఇచ్చేవారు రుగ్యజుర్ సామ స్తుతుల్ని పలుకుతారు. సోమాన్ని కీర్తిస్తారు. ఆవు దగ్గరకు ఆబోతు పోయినట్లు, స్తోతలు సోమం దగ్గరకు గుమికూడుతారు" *(సామ : 5-6-3)*

## ఆ దిశ నుండి - ఈ 'దిశ' కు

నిన్న కాక మొన్న హైద్రాబాద్‌లో దిశ పై అత్యాచారం జరిగింది. ఇది ఈ దేశంలో మొదటిదీ కాదు. చివరిదీ కాబోదు. అత్యాచారాలకి వావివరుసలతో, వయస్సులతో పని కూడా లేదు. ఇలాంటి అత్యాచారాల్లో 98 శాతం మంది తాగిన మైకంలో ఉన్నప్పుడు చేసినవే. ఇది ఒక దేశ సమస్యా కాదు. ప్రపంచ సమస్యగా ఉంది. పురాణ కాలం నుండీ, పురాతన కాలం నుండీ ఆగకుండా సాగుతున్న అకృత్యాలు ఇవి. వీటికి బీజం ఎక్కడ పడింది ? ఎలా పడింది? అనే విషయాన్ని చర్చించు కోవాలంటే మనం మనకు తెలిసినంతలో వేదకాలానికి పోవాల్సిందే. పోదాం రండి.



బొర్రా గోవర్ధన్
సెల్:9390600157

సామవేదాన్ని సోమవేదం అనవచ్చు అని మనం గతంలోనే చెప్పుకున్నాం. రుగ్వేదంలో 9వ మండలం మొత్తం సోమపానానికి చెందిందే. సోమాన్ని కీర్తించేదే. సోమాన్ని 'పవమానం' అంటారు. కాబట్టి దీన్ని పవమాన మండలం అని కూడా పిలుస్తారు.

సోమాన్ని ఔషధం అంటుంది వేదం. "సూతే అమృతం ఇతి సోమా" అంటారు. అంటే 'అమృతాన్ని పుట్టించేది' అని. యాస్కముని రాసిన నిరుక్తంలో "సునోతే:" అన్నారు. అంటే దంచి గట్టిగా పిండి తీసిన రసం అని అర్థం. దీని రంగూ, రూపు, రుచిల గురించి రుగ్వేదం ఇలా వర్ణించింది:

**" స్వాదిష్ఠయా మదిష్టయా పవస్య సోమ ధారయా**
**ఇంద్రాయ పాతవే సుత:" - (ప. 9-1-1)**

"ఎంతో తియ్యనిది, మదాన్ని కలిగించేది, ధారలా కారేది, గట్టిగా పిండి తీసినది, ఇంద్రునికి ఎంతో ఇష్టమైనది ఈ సోమం" అని దీనర్థం. దేవతలకు, ముఖ్యంగా ఇంద్రునికి చాలా చాలా ఇష్టమైన పానీయం ఇది. దీన్ని దైవ పానీయంగా భావించినా ఇది ఒక రకమైన మత్తుని కలిగించే ద్రవమే. అంటే మైరేయం, సారాయి లాంటి మాదకమే. దీన్ని తాగడం వల్ల ఉత్సాహం వస్తుందనీ, మదం కలుగుతుందని, మాత్సర్యం చెలరేగుతుందని వేదమే చెప్పింది.

ఆర్యుల విజయంలో సోమం కూడా ప్రధాన ఉపకరణమే. యుద్ధ సమయాల్లో సోమపానం చేసేవారు. ఆ మత్తులో, ఆ మదంతో శత్రువుల మీద విరుచుకు పడేవారు. అలాగే, తమకు తగిలిన దెబ్బల్ని, గాయాల్ని ఈ మత్తువల్ల పట్టించుకునే వారు కాదు. నొప్పి తెలిసేది కాదు. కాబట్టి యుద్ధాల్లో మహాక్రూరంగా వ్యవహరించేవారు ఆర్యులు. ఇక సోమాన్ని సుష్టుగా పట్టించిన ఇంద్రుడైతే యుద్ధాల్లో చెలరేగి పోయేవాడు. ఇంద్రుడు అలాంటి సోమపాన మత్తులో ఉన్నప్పుడే వృత్రుణ్ణి చంపినట్లు వేదం చెప్తుంది.

సామవేదంలో అమహీయ రుషి చెప్పిన సామం ఇది.

**"స పవస్వయ ఆవిథేన్ద్వం వృత్రాయహంతవే**
**వవ్రిహనే సం మహీరప:" -(సామ : 5-3-8)**

"ఓ! సోమమా! మహాజలాల్ని బంధించిన వృత్రుణ్ణి సంహరించిన ఇంద్రుణ్ణి రక్షించావు. రా! నీవు వచ్చి ఈ పాత్రలో నిండు".

***'అయావీతీ పరి స్రవ యస్త ఇన్దోమదేష్వా***
***అ వాహ న్నవతీర్నవ" -(సామ : 5-3-9)***

"ఓ! సోమమా! నిన్ను సేవించే ఇంద్రుడు శంబరుని 99 పట్టణాల్ని నాశనం చేశాడు. ఆ ఇంద్రుని కోసం ఈ పాత్రలో నిండు" -

ఇంద్రుడే కాదు దివోదాసు విజయంలో కూడా సోమమే ప్రధానమని వేదం చెప్పింది. దివోదాసు విషయంలో -

***'పుర: సద్య ఇత్థాధియే దివోదాసాయ శంబరం***
**అధ త్యం తుర్వశం యదుమ్" - (సామ: 9-5-2)**

"ఇంద్రుడు ఎలా సోమపానం చేసి 99 పురాల్ని ధ్వంసం చేశాడో, అలాగే దివోదాసు శత్రువులైన శంబరుడు, తుర్వసుడు, యదువుఅనే వాళ్ళను నాశనం చేశాడు".

ఆర్యులు అందరూ సైనికులే. ఆర్యులది గణ వ్యవస్థ. గణ వ్యవస్థలోని సభ్యులందరూ సైనికులే. కాబట్టి ఆర్యులందరూ సోమాన్ని చాలా ప్రీతిగా స్వీకరించేవారు. ఆర్యులు ఆ మత్తులో మదించిన పనులు చేసేవారు. అందుకే... వారు తమని అనేక చోట్ల మదించిన ఆబోతులతో పోల్చుకుంటారు.

## మత్తుపానీయం పుట్టుక

ఆర్యులు సింధూ తీరానికి రాకముందే సోమం వారికి తెలుసు. అసలు...ఈ మత్తు పదార్థాలను ఉత్పత్తి చేయడం ప్రపంచానికి 30 వేల సంవత్సరాల నాడే తెలుసు. జర్మనీ ప్రాంతంలో నివసించిన నియాండర్తల్ మానవులు తోలు తిత్తుల్లో ద్రాక్షల్ని నిలువచేసుకుని, ఆ రసాన్ని తాగేవారు. ఆ రసం ఎంత ఎక్కువ కాలం నిలువ ఉంటే అంత ఎక్కువ ఉత్తేజాన్ని, ఉన్మాదాన్ని కలిగిస్తుందని అనుభవపూర్వకంగా నియాండర్తల్ మానవులు గ్రహించారు.

కొన్ని ఆకులు, తీగలు, పండ్లు ఇలాంటి మత్తుని కలిగిస్తాయని ప్రపంచంలో అన్ని మానవ జాతులకూ అనుభవమే!

పండ్లను తోలుతిత్తుల్లో గాలి తగలకుండా బిగించి కట్టి, ద్రాక్షరసాన్ని పులియబెట్టి దాన్ని మత్తుపానీయంగా వాడిన వారు నియాండర్తల్ మానవులు. మత్తు పదార్థాల ఉత్పత్తిలో ఇది ప్రాథమిక దశ. ఐతే, దాదాపుగా ఈ ప్రాంతానికి దగ్గరగా ఉన్న ప్రాంతం ఆర్యుల మూలనివాసం అయిన నేటి టర్కీ ప్రాంతం. కాబట్టి ఈ మత్తు పదార్థాల ఉత్పత్తినందుకున్న వారిలో ఆర్యులు ముందే ఉంటారు. ఐతే ఆర్యులు ద్రాక్షల నుండి కాకుండా తమ నివాస ప్రాంతాల్లో కొండల మీద దొరికే ఒక రకం తీగల నుండి మధురమైన మత్తుపానీయాన్ని తయారు చేశారు. అదే సోమం. కాబట్టి ఆ తీగ మొక్కల్ని "సోమలతలు" అని పిలిచారు. హిమాలయాల్లో పెరిగే "సోమలతలు" అని మన వారు అనేక రకాలుగా చెప్పినా, అది శుద్ధ అబద్ధం అని తేలిపోతుంది. హిమాలయాలకి ప్రాధాన్యత నివ్వడం కోసం "అన్నీ వేదాల్లో ఉన్నాయి" అన్నట్లే "అన్నింటికీ హిమాలయాలే మూలం" అనడం ఒక అలవాటు మాత్రమే!

జమదగ్ని ముని ఏమంటున్నాడో చూడండి:

**"ఆసావ్యంశుర్ మదాయాప్సు దక్షో గిరిష్ఠా**

**శ్యేనోన యోనిమాసదత్' -(సా: 5-1-7)**

"సోమము పర్వతాలపై పుట్టింది. మదకారిణి కాబట్టి తేబడింది. వచ్చాక అది నీటిలో పెరిగింది. కుండలో చేరింది" ఇదీ పై సామానికి అర్థం.

## సోమలత - సోమరసం

అంటే సోమలతలు పెరిగే నేల... కొండ ప్రదేశం. కొండలంటే హిమాలయాలు కాదు. ఈ మొక్కలు ఊసర క్షేత్రాల్లో నీరు తక్కువ ఉన్న ప్రాంతాల్లో, ఇసుక నేలల్లో, వర్షపాతం తక్కువ ఉన్న ప్రాంతాల్లో సమృద్ధిగా పెరుగుతాయి.

ఒక రకంగా ఇది ఎడారి మొక్క. ఎడారి మొక్కలకూ, తీగలకూ ఆకులు ఉండవు. ఆకువల్ల కిరణ జన్య సంయోగక్రియ ఎక్కువగా జరిగి, బాష్పోత్సేకం (నీరు ఆవిరి అగుట) వేగంగా జరుగుతుంది. దానివల్ల మొక్క త్వరగా నీటిని కోల్పోయి చనిపోతుంది. అందుకే ఎడారి మొక్కలకు ఆకులు తక్కువ గా ఉంటాయి. లేదా ఆకులు చుట్టచుట్టుకుని ముళ్ళుగా మారిపోతాయి. లేదా ఆకులు అస్సలు ఉండవు. ఉన్నా కొద్ది కాలం ఉండి రాలిపోతాయి. అలాగే వాటి కాండాలు వెడల్పుగా మారిపోతాయి. వాటి మధ్య మెత్తటి గుజ్జు (జల్లీ వంటి జిగురు పదార్థం) ఉంటుంది. నీరు ఆవిధంగా మారి నిలువ ఉంటుంది. బ్రహ్మజెముడు, నాగజెముడు, కలబంద మొక్కల్లో ఉండే జిగురు పదార్థం అలాంటిదే. సోమలత కూడా ఇలాంటి లక్షణాలే ఉంటాయి.

వేద పదాలకు నిర్వచనాల నిచ్చే ' నిరుక్తం' లో సోమలతల గురించి ఇలా ఉంది:

"వాటి కాడలు గుండ్రంగా ఉంటాయి. మధ్యలో జల్లీవంటి జిగురు పదార్థం ఉంటుంది. 15 కణుపులుగా ఈ తీగ ఉంటుంది. పున్నమి రోజుల్లో ఈ తీగలు అందమైన వర్ణాలు సంతరించుకుంటాయి. రోజుకొక్క కణుపు చొప్పున రంగులు కన్పిస్తాయి. పున్నమి నాటికి కణుపులన్నీ వర్ణశోభితంగా ఉంటాయి. ఇక ఆ తర్వాత ఒక్కొక్క కణుపు రంగును కోల్పోతుంది. పున్నమి రోజున ఈ లతల్ని తెచ్చి సోమాన్ని తయారు చేస్తే అది మంచి మధుర సోమం అవుతుంది. ఈ తీగ వాసన నెయ్యి వాసనలో ఉంటుంది. దీనికి కాడలు పదిహేనే ఉంటాయి. ఇవి ఉల్లిబొందుల్లా (స్తూపాకార ఊచల్లా) ఉంటాయి" అని నిరుక్తం ఈ తీగల్ని వర్ణించింది.

ఈ వర్ణనంతా ఇది కొండ ప్రాంతాల్లో లేదా ఎడారి ప్రాంతాల్లో పెరిగే మొక్కల్నే సూచిస్తోంది తప్ప హిమాలయాల్లో పెరిగే మొక్కల్ని కాదు. రుగ్వేదంలో ఇలా ఉంది:

**"శీర్యంతే పత్రమేకైకం దివసే దివసే పున:**

**కృష్ణపక్ష క్షయే చాపి లతా భవతి కేవలా"**

అంటే ... "దీనివాసన నేతి వాసన. మూలం (దుంప) అరటి దుంపలాగా ఉంటుంది. ఆకులు ఉల్లి బొందుల్లా ఉంటాయి. సోమం రంగు బంగారు రంగు. నీటితో కలిసి ఉంటుంది. ఈ తీగలు చెట్లపై నుండి క్రిందికి పాము కుబుసాల్లా వ్రేలాడు ఉంటాయి. ఈ మొక్కకి పదిహేను ఆకులు ఉంటాయి".

ఈ మొక్క హిమాలయాల్లో ఎక్కడుందో కనుక్కోమని 1890వ దశకంలో బ్రిటీష్ ప్రభుత్వం డా॥ రౌక్సబరో అనే పరిశోధకుణ్ణి నియమించింది. ఆయన ఏమి తేల్చాడో తెలియదు. కానీ, "ఆయన దీనిని గుర్తించాడుట" అని ఈ నిరుక్త వాఖ్యాన కర్త చెప్పాడు. "గుర్తించాడుట" అన్నాడే గానీ, ఈయనా గట్టిగా తేల్చలేదు.

ఎందుకంటే ఇది ఎడారి గిరిలో పుట్టి పెరిగే మొక్కే గానీ, హిమగిరి శిగలో పుట్టిన లత మాత్రం కాదు.

మధ్య ఆసియా, ఇరాన్, ఇరాక్, టర్కీ ప్రాంతాలన్నీ ఇసుక నేలలే. కాబట్టి ఆర్యులు ఆ ప్రాంతం వారే కాబట్టి వీరికి సోమలతలు, సోమపాన తయారీ బాగా తెలిసి ఉంటుంది. వారు, ఈ లతల్ని తమ వెంట సింధూ ప్రాంతానికి కూడా తెచ్చి ఉండొచ్చు. హిమాలయ, గంగా తీరాల్లోనూ పెంచి ఉండొచ్చు. కానీ, వాటికి ఇక్కడ నేలలు, వాతావరణం సహజ ప్రకృతి కాదు కాబట్టి క్రమేపీ అంతరించి ఉండొచ్చు.

ఏతావాతా తేలేదేమంటే .... ఆర్యులకు ఇష్టమైన సోమపానం, సోమలతల ఆధారాలు కూడా వారు మధ్య ఆసియా వాసులే అని తేల్చి చెప్తున్నాయి.

## సారా సురులు - మాంస ప్రియులు

సోమం కూడా ఒక రకం సారాయే. సారాయిని "సుర" అంటారు. "సురులు" (దేవతలు, బ్రాహ్మణులు) సేవించేది కాబట్టి సుర అని అంటారు . ఐతే...."సుర" అనే వ్యక్తి తొలిగా గుర్తించింది కాబట్టి ఇది సుర అయ్యింది' అంటుంది బౌద్ధ సాహిత్యం.

'సుర' అనేవాడు ఒక వేటగాడు. ఒక రోజున ఒక అడవిలోకి పోతాడు. వేట దొరకదు. అలసి పోయి ఒక నీటి కయ్యి దగ్గరకు వెళ్తాడు. అక్కడి నీరు ఎర్రగా ఉంటుంది. దాని రంగూ, వాసన నచ్చక తాగడానికి భయపడతాడు. ఆ నీటి కయ్యగట్టున పెరిగిన ద్రాక్షపండ్లు, ఆకులు, విప్పపూలు, ఆకులు, కరక్కాయలు రాలి ఆ నీట్లో పడి మురిగి , ఏదు కంపు కొడుతున్నాయి. వాడు ఒక ప్రక్కన అలసి పోయి కూర్చున్నాడు. కొంత సేపటికి ఒక జింక వచ్చి ఆ నీటిని కడుపునిండా తాగింది. ఒడ్డుకు వచ్చి తూలి పడిపోయింది. "అవి విషపునీరు" అనుకున్నాడు సురుడు. ఆ పడిపోయిన జింక, చనిపోయిందనుకుని దాన్ని కాల్చుకుని తినడానికి కట్టెలు ప్రోగుజేసి, కొమ్మ మీద కొమ్మ వేసి రుద్ది నిప్పురాజేస్తూ ఉన్నాడు.

కొంత సేపటికి జింక లేచింది. హుషారుతో ఉరకలు వేస్తూ వెళ్ళి పోయింది. దాని ఉత్తేజాన్ని చూసి సురుడు ఆశ్చర్యపోయాడు. ధైర్యం చేసి ఆ నీటిని త్రాగాడు. హాయిగా నిద్రపోయాడు. లేచాడు. ఎంతో ఉత్తేజితుడయ్యాడు.

ఇక ఆ నీటిని రోజూ కొద్ది కొద్దిగా తీసుకుపోయి మాంసంతోపాటు అమ్మడం మొదలు పెట్టాడు. ఎర్రగా ఉంటే ఆ నీటికి వాడిపేరు మీదిగా "సుర" అనే పేరు వచ్చింది.

ఇది బౌద్ధ సాహిత్యంలోని ఒక కథ. ఈ మత్తులన్నీ మనస్సు మీద పనిచేస్తాయి కాబట్టి, ఉన్మాదాన్ని, మదాన్ని పెంచుతాయి కాబట్టి బౌద్ధం వీటిని నిషేధించింది. బౌద్ధానికి ముందు మత్తుపానీయాల్ని నిషేధించినసిద్ధాంత ఏదీ ప్రపంచంలో లేదు. జైనుల పంచశీలలో కూడా మద్య నిషేధం లేదు.

ఐతే, ఆర్యులు యుద్ధప్రియులు. మాంసప్రియులు. మోహ ప్రియులు. కాబట్టి మద్యాన్ని పవిత్ర పానీయంగా భావించారు.

వేదం ప్రకారం మద్యం అందులోని సోమం ఒక దైవపానీయమే! ఆర్యులకు మద్యం, మాంసం, మైధునం అనే మూడు 'మ' కారాలూ ఉండాల్సిందే!

## సోమరసం - రసాయనం

1. సోమలతల్ని పున్నమి రోజున సేకరిస్తారు.
2. రెండు రాళ్ళ మధ్యన ఉంచి చితకగొడతారు.
3. ఆ నలిగిన పదార్ధాన్ని ఉన్ని వస్త్రంలో వేసి గట్టిగా పిండి వడపోస్తారు.
4. దానికి నీటిని కలుపుతారు.
5. చెక్కపాత్రలో నిల్వ చేస్తారు.

ఇదీ.. సోమం తయారీ వరుస. ఆర్యులకి లోహాలు తెలుసు. ఇనుం తెలుసు. అయినా రాతి పలకల మధ్య పెట్టి మాత్రమే దంచారు. అంటే కొత్త రాతియుగం నాటి విధానమే వారూ పాటించారు. పాతతరం విధానాల్ని అలా పాటించడమే సంస్కృతి. ఆర్యులకు నూలు వస్త్రాలు తెలుసు. అయినా గొర్రె బొచ్చుతో నేసిన వస్త్రంతోనే వడగట్టాలి అని వేదం చెప్పింది. ఆర్యులు సింధూ ప్రాంతంలోనికి వచ్చాక మట్టి పాత్రలు తెలుసు. అయినా రాతి యుగం నాటి చెక్క పాత్రల్లోనే నిలువ చేయాలి అని చెప్పడంతో ప్రతి విషయంలో వారు పురాతన సోమపాన తయారీ విధానాన్నే పాటించారు.

సోమం తీసే రాళ్ళను "అభిషవ ఫలకాలు" అనీ, సోమాన్ని వడకట్టే ఉన్ని వస్త్రాన్ని "దశాపవిత్రం" అనీ అంటారు.

**"అథ ధారయా మధ్వా పృచానస్తిరో రోమ పవతే**
**అద్రి దుగ్ధ :! ఇందురింద్రస్య సఖ్యం జుషాణో**
**దేవో దేవస్య మత్సరో మదాయ!" -(సామ: 6-6-5.2)**

"సోమం రాళ్ళతో దంచబడును. పిండబడును. ఉన్ని

పాత్రల్లో వడకట్టబడును. ఇది దేవతల్ని తృప్తిపరచును. ఇంద్రునికి ఎంతో ఇష్టమైనది. ఈ సోమం! దేవతలకు మదాన్ని, మత్సరాన్ని కలిగించును" అంటాడు వాసిష్ఠ ముని.

సోమం ఒక రసాయన ద్రవం. మానవ శరీరం అనేక రసాయన ప్రక్రియల వేదిక. ఆనందం, సంతోషం, దు:ఖం, నవ్వు, కోపం, ప్రేమ, దయ, కరుణ ఇవ్వన్నీ రసాయన చర్యల ఫలితాలే. ప్రకోపాల్ని ఉద్రేకపరచే పానీయాల్లో సోమం ఒకటి. ఆర్యులు తమ జీవితంలో సోమరసానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చారో, వేదంలో అడుగడుగునా కన్పిస్తుంది.

మత్తుపానీయాలు సేవించడం 'అనైతిక చర్యగా' రాతి యుగ సమాజం గుర్తించలేదు. తాగుడిని తప్పుగానూ భావించలేదు. అలాంటి అనాగరిక సమాజాన్నుండి ఆర్యులు వచ్చారు. సింధూ తీరానికి వచ్చి నాగరక సమాజంలో పడ్డారు. అంటే.. వారు భారత దేశానికి వచ్చాకే 'నాగరికు' లయ్యారు. కాబట్టే సోమపానాన్ని దైవ కార్యంగానే భావించారు. పురాతన భారతీయుల సమాజాల్లోని గ్రామ దేవతలకు కూడా "కల్లు, సారాయిల్ని" నివేదించే సంప్రదాయం ఉంది.

కల్లు, సారాయిలు నాటు రకమైనవి అయితే, సోమం కాస్త మధురమైన రకం. నాణ్యతగల రకం.

## సోమం అయినా – హోమం అయినా...

సారాయి గానీ, ముఖ్యంగా కల్లు నుండి తీసిన బరాణిని గానీ నీళ్ళతో కలుపుకుని త్రాగాలి. అలాగే సోమాన్ని కూడా నీటిలో కలుపునే త్రాగాలి. అందుకే "సోమానికి జలమే నివాసం" అంటుంది వేదం.

మధ్య ఆసియాలో ఆర్యులు ఉన్నప్పుడే వారికి సోమపానం అలవాటు బాగా ఉండేది. వేదాలకు ముందున్న జురాష్ట్రియన్ మత గ్రంథం అవెస్తాలో కూడా "సోమం" అనే పదం ఉంది. వారు 'స'కారాన్ని 'హ' కారంగా పలుకుతారు. మన "సింధూ" దేశం హిందూ దేశం అయినట్లే... అవెస్తాలో సోమరసం 'హోమరసం' అయ్యింది. సోమలతని, హోమలత అయ్యింది.

అవెస్తాలో హోమం కూడా దేవతల పానీయమే. దాన్ని కూడా నీటిలో కలుపుకునే త్రాగాలి.

నీటిని ఎందుకు కలపాలి?దీన్ని శాస్త్రీయంగా తెలుసుకుందాం.

ఈ మత్తుపానీయాల్ని 'ఆల్కహాల్' అంటారు. దీని సాంకేతిక నామం ఇథనాల్. సంకేతం $C_2H_5OH$. ఇది కోవెలెంట్ బంధం. OH హైడ్రాక్సిన్ అంటారు. ఈ బంధంలో హైడ్రోజన్ పరమాణువు, అటు ఆక్సిజన్ పరమాణువుతో, ఇటు కార్బన్ పరమాణువుతో జతకట్టి ఉంటుంది. ఇలాంటి బంధాలున్న పదార్థాలు అటు ఆమ్లాలూ కాదు, ఇటు క్షారాలూ కాదు. దాదాపుగా తటస్థాలు. ఎప్పుడైనా వీటిలో సోడియం, పొటాషియం ఉంటే తాత్కాలిక క్షారలక్షణం వస్తుంది. తటస్థంగా ఉన్న అల్కహాల్‌ని తీసుకుంటే అది శరీరంలో ఉన్న నీటిని పీల్చుకుంటుంది. అప్పుడు మనిషి డీహైడ్రేషన్‌కి లోనవుతాడు. మరణం కలుగుతుంది. కాబట్టి ముందుగానే దాన్ని బలమైన క్షార జలంతో (నీటితో) కలిపితే, అది ఊపిరి వెంటనే తీయదు. పైగా ఉత్తేజాన్ని కల్గిస్తుంది. మత్తు నిస్తుంది.

సోమం కూడా మత్తు పానీయమే. దానిలో కూడా సైకోయాక్టివ్ పదార్థాలున్నాయి. కొకైన్, ఎపెడ్రిన్, కొడ్రిన్, పుగాకు, పుట్టకొక్కుల్లో ఉండే పదార్థాలున్నాయి.

కాబట్టి ఏ మత్తుపదార్థాలనైనా, నీటితోనో, ఇతర ద్రావకాలతోనో కలిపి తీసుకుంటారు. అలాగే సోమాన్ని కూడా నీటితో కలిపే తీసుకుంటారు. పాలతో, పెరుగుతో, బార్లీ, యవపిండి కలిపిన ద్రవంతో కలిపి ఆర్యులు సోమాన్ని తీసుకునేవారు.

**" తంతే యవం యథాగోభి: స్వాదుమ కర్మ శ్రణన్త:**
**ఇంద్ర త్వాస్మింన్పధ మాదే" –(సామ: 2–2–3)**

మేధాతిథి ముని చెప్పిన ఈ సామానికి అర్థం ఇది:

"యవల పిండిని పెరుగుతో కలిపినట్లు ఈ సోమ రసాన్ని ఆవు పాలతో కలిపాము. ఓ! ఇంద్రా దీన్ని సేవించడానికి నిన్ను ఆహ్వానిస్తున్నాం".

ఆర్యుల పూర్వ నివాసాలైన అరకోసియా (సింధూ), ఆరియా (పశ్చిమ ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, తుర్క్‌మెనిస్తాన్), బాక్ట్రియా (మధ్య ఆసియా), మార్గియానా (మధ్య పర్షియా, ఆఫ్ఘన్, ఉజ్బెకిస్తాన్) – ఈ ప్రాంతాలన్నింటిలో సోమపానం అలవాటుంది. వారి వారి పురాణాల్లో కూడా ఇది దేవతల పానీయమే. సోమలతని వారు మౌంటెన్‌ప్లాంట్ అంటారు. సోమపానం లాంటిదే గ్రీకుల దైవ పానీయం–అంబ్రోసియా. ఇది ఒక కొండ తీగ మొక్క. కుష్ఠునివారణో ఈ పానీయం ఔషధంగా ఆర్యులు ఉపయోగించారు. కృష్ణయజుర్వేద సంప్రదాయానికి చెందిన దక్షిణ భారత వైదికులు ఇప్పుడు యజ్ఞాల్లో "పాక్రోస్టెమ్మా అసిడం" అనే మొక్క రసాన్ని వాడుతున్నారు. దీని రసం వైరల్ జబ్బులకు, హైడ్రోఫోబియా, కొన్ని మానసిక రోగాలకు ఉపయోగిస్తారు.

## విజేతలైన పరాజితులు

ఆర్యులు విజయం సాధించడంలో సోమపానం ఉపయోగపడింది. కానీ, కాలక్రమంలో ఆర్యులు ఆటవి, పశు పాలన వదలి వ్యావసాయక జీవితంలోకి వచ్చారు. కుటుంబ వ్యవస్థ బలపడింది. స్త్రీలను కూడా కొద్దో గొప్పో మనుషులుగా

గుర్తించక తప్పలేదు. ఈ మార్పులన్నీ ఆర్యుల సామాజిక జీవనంలో కనిపించాయి. బలమైన సింధూ ప్రజల సంస్కృతి సాంస్కృతిక బలహీనులైన ఆర్యులపై బలంగానే పడింది. అలా ఆర్యుల జీవన సరళి మారాక దేవపానీయమైన సోమపానం క్రమంగా మదాన్ని కలిగించే మత్తుపానీయంగా చూడబడింది.

సోమపాన మత్తులో జోగితేలిన ఇంద్రుడు, మద మత్సరాలతో ఆబోతులా ప్రవర్తించిన ఇంద్రుడు – చివరికి ఉన్మాదిగా, అనైతికకు మారుపేరుగా మారాడు. స్త్రీలను బలాత్కరించే ఉన్మాదిగా ఆనాటి సమాజం చూపింది. తాగుబోతులకు అదే ఉన్మాదం ఉంటుందని నేటి అత్యాచార కేసులూ నిరూ పిస్తున్నాయి. ఈ విషయంలో సారాయిని అమ్ముకునే ప్రభుత్వాలు కూడా దోషులే. కొన్ని ప్రభుత్వాలు సారానిషేధాన్ని విధిస్తున్నాయి. వాటిని స్వాగతించాలి. సారా నిషేధాన్ని వేద పవిత్రతపై నిషేధంగా భావించి గగ్గోలు పెట్టకూడదు. ఎందుకంటే...సామవేద కాలం తర్వాత ఐదు వందల ఏళ్ళకే ఈ మార్పు కన్పించింది. దీనికి ప్రధాన కారణం బౌద్ధం. బుద్ధుడు చెప్పిన పంచశీల.

మానవీయత సమాజాల్లో మేల్కొంటున్న కొద్దీ ఆర్యుల ఆటవిక జీవనం అస్తమిస్తూ వచ్చింది.

అందుకు వేల సంవత్సరాలు నీరాజనాలు అందుకున్న ఇంద్రుడు – చివరికి తాగుబోతుగా, వ్యభిచారిగా, స్త్రీలను అపహరించే వాడిగా, రేపిస్టుగా మిగిలిపోవాల్సి వచ్చింది. ఇది కేవలం ఇంద్రుని ఓటమి కాదు. అమానవీయ భావజాల ఓటమి.

ఇంద్రుని ఓటమి అంటే ...

ఇది వేద భావజాల ఓటమే! ఆర్యుల విజయానికి సోమం ఎలా కారణ మయ్యిందో, వారి సాంస్కృతిక పతనానికీ అలాగే సోమమే కారణ మయ్యింది!

అందుకే ... వైదిక సమాజం...

తమ మతాన్ని బ్రతికించుకోడానికీ,

బౌద్ధాన్ని ఎదిరించి నిలబడడానికి కొత్తదారులు తొక్కింది.

కొత్త కొత్త దేవుళ్ళ కోసం వెతుక్కోవలసి వచ్చింది.

*(ఇంకావుంది)*

# భక్తి పేరుతో మూకుమ్మడి జంతుహననం



భారత్ – నేపాల్ సరిహద్దులో, ఖాట్మండ్‌కి 160కి.మీ దూరంలో బరియార్ పూర్ జిల్లాలో వుంది 'గధీమాయి'గుడి. ఆగుళ్లో వుండే దేవత 'గధీమాయి', శక్తిస్వరూపిణి అని, తమ బాధల్ని, పీడల్ని తొలగించి శుభాలు ప్రసాదిస్తుందని నేపాల్, భారతీయ హిందూ భక్తుల విశ్వాసం. 5ఏళ్లకొకసారి జరిగే ఈ ఉత్సవం 2014, నవంబర్ 28,29 తేదీల్లో జరిగినపుడు 10-15లక్షల మంది భక్తులు వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. ఏమిటా మొక్కు అంటారా? మూగ జీవాలబలి. ఆనాడు, 2,50,000 జంతువులు ఆ దేవతకు బలిచ్చారు. వాటిలో 20,000 దున్నలు, బర్రెలు వుండగా, మిగిలిన 2,30,000గొర్రెలు, మేకలు, బాతులు, కోళ్లువంటివి వున్నాయి. 250ఏళ్లనుంచీ ఈ హింసాయజ్ఞంజరుగుతోందట! అప్పట్లో భగవాన్ చౌధురి అనే ఒక దొంగ తనను కేసునుంచి తప్పిస్తే 'గధీమాయి'కి గుడి కట్టిస్తానని మొక్కుతాడు. ఎలాగో కేసునుంచి బయటపడతాడు. అప్పట్నుంచీ ఆ 'మహిమ' గలదేవతకి నేపాల్‌లోని మధేషి గిరిజనులు, బిహారీలు, కొందరు ఉత్తరప్రదేశ్‌భక్తులు వెళ్లి జంతుబలిని ముడుపుగా చెల్లిస్తారు. 2009 సంవత్సరంలో అయితే, 5,00,000 జంతువులు బలయ్యాయి. జంతుప్రేమికులు ఆందోళన చేయటంతో నేపాల్ సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని క్రమంగా జంతుబలిని తగ్గించమని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

5 ఏళ్ల తర్వాత, డిశంబర్ 3, 2019న కూడా గధీమాయి ఉత్సవం జరిగింది. ఒక పూజారి ముందుగా, ఒక గొర్రెను, ఒక ఎలుకను, ఒక కోడిని, ఒక పందిని, ఒక పావురాన్ని బలిచ్చాడు. ఆ తర్వాత, జనం బర్రెల్ని దున్నల్ని తెచ్చి చంపారు. ఈ ఏడాది 30,000 జంతువులు బలయ్యాయని స్వయంగా వెళ్లి చూచిన "హ్యూమేన్ సొసైటీ ఇంటర్నేషనల్" అనే సంస్థవారు ప్రకటించారు. మనుషులకీ జంతువులకీ మధ్య అన్యోన్య అనురాగ ముండాలని ఈ సంఘం ప్రచారం చేస్తుంది. అంత క్రూరహింస జరుగుతున్నా నేపాల్ ప్రభుత్వాలు ఆపే ప్రయత్నాలుచేయనందుకు, ఆ సంఘంవారు కోర్టులో కేసులుదాఖలు చేయబోతున్నారు. ఇదేం మతం, ఇదేం భక్తి?